ఎమ్బీయస్ - గ్రేట్ ఆంధ్ర ఆర్కయివ్స్ ప్రాజెక్టు

# 2014 Q2 ఏప్రిల్ - జూన్ ఆర్టికల్స్
## (పిడిఎఫ్ రూపంలో)
## విషయసూచిక


క్రిమియాకోసం రష్యా పట్టుదల ఎందుకు?
వహీదా రహమాన్ - కాస్ట్యూమ్స్
చలో పాలిటిక్స్
బెంగాల్ సిపిఎంలో నిరసన గళానికి ఉద్వాసన
మహారాష్ట్రలో టోల్ గేట్ల వ్యవహారం
సమైక్యపార్టీ అవసరం వుందా?
తేజ్‌పాల్ కేసు నేర్పే పాఠం
బంగారం స్మగ్లింగ్
మరో మహాకూటమి ప్రయోగమా?
కోస్తా వాళ్లకు సెంటిమెంట్లు వుండవా?
ఫ్రాన్సు స్కూళ్లలో పందిమాంసం తప్పనిసరి
జశ్వంత్ సింగ్ బహిష్కరణకు కారణం...
పాకిస్తాన్ పోలీసులూ యింతేనా?
ట్రైవ్యాలీ నిందితురాలి ఆదాయంలో 90% భారతీయుల నుండే!
ఎన్నికల బరిలో కళాకారులు
హాలీవుడ్ నటుడు మిక్కీ రూనీ మరణం
వికె మూర్తి కెమెరా విన్యాసం
తెలుగుల పాలిటి శివసేన - తెరాస
పొత్తుల వెనుక ఎత్తుపైయెత్తులు
ఔషధ రంగంలో రాబోయేది సంకటకాలమే
దక్షిణభారతంపై బిజెపి కన్ను
కోర్టు దృష్టికి వచ్చిన సరితా నాయర్ చీరలు
ఒడిశాలో నవీన్ అవకాశాలు
1962 ఇండో చైనా యుద్ధం
తెలుగుజాతికి అవమానమా..?
టిడిపి గ్రాఫ్ పెరుగుతోందా?
మధ్యప్రదేశ్‌లో బిజెపి పరిస్థితి
యుపిలో అమిత్ షా కృషి
బిహార్‌లో అందరి నోటా బిసి మంత్రమే
అళగిరి బలమెంత?
తెలంగాణలో బలాబలాలు
రాజకీయాల్లో పౌండ్రక వాసుదేవులు
గోవా రాజకీయాల్లో చర్చి పాత్ర
సొంత యింట్లో ఆజాద్ ఏం చేస్తున్నట్లు?
నితిన్ గడ్కరీ సాహసం

జయప్రద పార్టీ సంగతేమిటి?
శివసేన గెలిచేవెన్ని?
ఎన్నికల బొమ్మల లాంతరు
ఎమ్బీయస్ : తూర్పు తిరిగి దణ్ణం పెట్టమన్న మోదీ
ఆంధ్రలో బలాబలాలు
నిజాంకు మహర్దశ
విభజన ఎవరికి లాభించింది?
మోదీ - ముస్లిములు
సర్వేలూ, ఒపీనియన్ పోల్సూ
మోదీ ప్రభంజనం
మన్మోహన్ వైఫల్యం
పాకిస్తాన్-తాలిబన్ లింకు
ఏ మేరే వతన్‌కే లోగోంఉ - నెహ్రూ స్పందన
ఎన్నికల ఫలితాలు
ఆంధ్ర రాజధాని
ఫిరాయింపుల చేదుమాత్ర
సత్తా చాలని దత్తాత్రేయ
తెలంగాణ చిహ్నంలో చార్మినార్
ఋణమాఫీ జరిగేనా?
డ్యామ్ గురించి రెండు రాష్ట్రాల రచ్చ
బెంగాల్‌లో మొద్దు శీను లాటి కథ
భగత్ సింగ్‌పై మరో పుస్తకం
పద్మనాభుని గుడి నుంచి రాజవంశానికి ఉద్వాసన
ఎన్నికల ఫలితాలు 2
అవశేష ఆంధ్రప్రదేశ్ అవతరించిందా?
జాతీయ భద్రతా సలహాదారుగా ఒక ఉద్దండుడు
ఐటీ ఉద్యోగులు - కార్మిక చట్టాలు
ఈ కామర్స్‌లో అగ్రస్థానం బన్సాల్ అగ్రవాల్స్‌దే
రాహుల్ జోకరా?
పంచపాండవులంటే మంచంకోళ్లలా..
మోదీకి మద్దతుగా నిలిచిన స్వచ్ఛంద సంస్థలు
'మనిషిలా చూస్తే చాలు..'
సారీ, గుజరాతీ..
ఆ మాట - జైరాం నోట!!?!!
డి-కంపెనీకి డి-డే?
శారదా చిట్‌ఫండ్ బాధితుల గోడు
అక్కడ రాహుల్ - ఇక్కడ స్టాలిన్
మోదీ టీము
భార్యాభర్తలా? అన్నదమ్ములా?
ప్రతిదానికీ ఆంధ్ర రంగు పూయాలా?
తల్లి సెంటిమెంటు
మోదీ ప్రమోల మనిషి - మనీష్

**మావోయిస్టు మేధావి**
**ప్రాణాలు తిరిగి వస్తాయా?**
**సల్మాన్ కేసులో ప్రత్యక్షసాక్షులు**
**గోపీనాథ్ ముండే**
**కొత్తవాళ్లంటేనే మోజు**
**ప్రీతి జింటాకు మాజీ ప్రియుడితో తంటా**

**2014 ఏప్రిల్ 01-02 వీక్లీకై** **ఎమ్బీయస్ : క్రిమియాకోసం రష్యా పట్టుదల ఎందుకు?**

క్రిమియా కథ యివాళ్టిది కాదు. ఉక్రెయిన్ రాష్ట్రం రష్యన్ సామ్రాజ్యంలో కలిసి 300 ఏళ్లు అయిన సందర్భంగా 1954లో అప్పటి సోవియట్ నేత కృశ్చేవ్ క్రిమియాను ఉక్రెయిన్‌కు బహుమతిగా యిచ్చాడు. అది పేరుకు మాత్రమే, ఎందుకంటే ఉక్రెయిన్ కూడా అప్పటి సోవియట్ యూనియన్‌లో భాగమే. అయితే గోర్బచేవ్ శకంలో సోవియట్ యూనియన్ నుండి ఉక్రెయిన్ విడిపోవడంతో క్రిమియా రష్యాకు దూరమైంది. భౌగోళికంగా కానీ, సంస్కృతిపరంగా గాని, చరిత్రపరంగా కానీ రష్యాలో అంతర్భాగమైన క్రిమియా ప్రజలు తమతో ఏ మాత్రం పొసగని ఉక్రెయిన్‌లో భాగంగా మారారు. తూర్పు, పశ్చిమ జర్మనీలను ఏకం చేయడానికి సమ్మతిస్తే నాటో (నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ – కమ్యూనిస్టు వ్యతిరేక తూర్పు యూరోప్ దేశాల కూటమి)ని రష్యావైపు వెళ్లకుండా కట్టడి చేస్తామని పశ్చిమదేశాలు అతనికి హామీ యిచ్చాయి. కానీ మాట తప్పాయి. అవి తూర్పు వైపు విస్తరిస్తూ వుంటే బోరిస్ ఎల్ట్‌సిన్ అభ్యంతర పెడితే "అవి రష్యా గుమ్మందాకా రావు లెండి" అని ఉత్తుత్తి భరోసా యిచ్చాయి. ఆ తర్వాత రష్యా చుట్టూ వున్న దేశాలలో కల్లోలాలు రేపి, రష్యానుండి వాటిని విడగొట్టి అక్కడ తమ సైన్యశిబిరాలు ఏర్పాటు చేసుకున్నాయి. అక్కణ్నుంచి తమపై ఏ క్షణాన్నయినా దాడి చేయవచ్చుని రష్యన్ల భయం. చెక్ రిపబ్లిక్‌లో, యితర తూర్పు యూరోప్ దేశాలలో యిప్పటికే అమెరికా మిస్సయిల్ డిఫెన్స్ షీల్డ్ ఏర్పాటు చేసింది. జార్జియాకు రష్యాకు మధ్య గొడవలు జరుగుతూంటే 2008 యుద్ధంలో జార్జియా పక్షం వహించి రష్యాకు యిబ్బందులు కలిగిస్తోంది. 2008లో సెర్బియానుండి కొసోవో విడిపోయి స్వతంత్ర దేశంగా ప్రకటించుకుంటే దాన్ని అమెరికా, యితర పశ్చిమదేశాలు వెంటనే గుర్తించాయి. ఐక్యరాజ్యసమితిలో రష్యా, తదితర దేశాలు దాన్ని ప్రతిఘటించినా లాభం లేకపోయింది. యూరోపియన్ యూనియన్, నాటోలోని చాలా దేశాలు సెర్బియాను గుర్తించి వ్యాపారం చేయడం మొదలుపెట్టాయి.

అ తర్వాత అమెరికా, పశ్చిమదేశాలు ఉక్రెయిన్‌పై దృష్టి సారించాయి. నాటోలో చేరాలని దానిపై ఒత్తిడి తేసాగాయి. అదే జరిగితే మాస్కోకు కేవలం 425 కి.మీ.ల దూరంలో నాటో దళాలు తిష్టవేసి, రష్యాను బ్లాక్ సీ నుండి, మెడిటేరియన్‌ను నుంచి విడగొట్టేసి కాకసస్‌నుండి తరిమివేయగలిగేవి. (తదుపరి జరిగిన పరిణామాల్లో క్రిమియాను తమలో కలుపుకోవడం ద్వారా రష్యా ఆ ప్రమాదం నుండి తప్పించుకుంది). యుద్ధకారణాలు మాత్రమే కాకుండా రష్యన్లు ఉక్రెయిన్‌ను తమ మాతృభూమిగా పరిగణిస్తారు. ఉక్రెయిన్‌ను యితరులు ఆక్రమిస్తే తమ భూభాగాన్ని కాజేసినట్లే అనుకుంటారు. పైగా పాత సోవియట్ యూనియన్‌లో ఉక్రెయిన్ బలమైన ఆర్థికకేంద్రంగా వుండేది. మాస్కో తర్వాత రెండో స్థానం దానిదే. అలాటి ఉక్రెయిన్‌తో కలిసి యూరోపియన్ యూనియన్‌కు పోటీగా యూరేషియన్ ఎకనమిక్ యూనియన్ ఏర్పాటు చేద్దామనే వూహ పుతిన్‌కు వుంది. ససేమిరా అది జరగనివ్వనని అమెరికా పంతం పట్టింది. ఈ పరిణామాలన్నీ గమనించిన పుతిన్ ఉక్రెయిన్ విషయంలో గట్టిగా వ్యవహరించకపోతే పొరుగున మరో శత్రుదేశం, యింకో అమెరికన్ యుద్ధస్థావరం తయారవుతుందని భయపడ్డాడు. ఇలాటి ప్రయత్నాలు చేసి రష్యాను బలహీనపరచకపోతే పాత రష్యాలోని దేశాలన్నీ సాన్నిహిత్యం పెంచుకుని, సంఘటితమై ఒకప్పటి బలమైన సోవియట్ యూనియన్‌గా ఏర్పడతాయని అమెరికా, పశ్చిమ యూరోప్ దేశాల అంచనా.

అందుకే 2004-05 లో ఉక్రెయిన్‌లో ఆరంజ్ రివల్యూషన్ పేరుతో తమకు అనుకూలుర చేత విప్లవం చేయించి అప్పుడు అధ్యక్షుడుగా వున్న విక్టర్‌ను యానుకోవిచ్‌ను దింపించి ఉక్రెయిన్‌ను నాటో వైపు లాక్కోబోయారు. అయితే వాళ్ల మద్దతుతో అధికారంలోకి వచ్చిన యూలియా అవినీతికరమైన పాలనతో ప్రజాదరణ కోల్పోవడంతో విక్టర్ 2010లో మళ్లీ ఎన్నికల్లో గెలిచి అధ్యక్షపదవి చేపట్టాడు. అవినీతి నేరాలపై యూలియాను 2011లో జైలుకి పంపాడు. తమ ప్రతినిధిని మళ్లీ కూర్చోబెట్టాలనే తహతహతో ఫ్రాన్స్, జర్మనీ సారథ్యంలో యూరోపియన్ యూనియన్ (ఇయు) ప్రతిపక్షాలను దువ్వసాగింది. అది గమనించిన విక్టర్ 2013 ప్రారంభంలో ఇయుతో ఆర్థికపరమైన, రాజకీయపరమైన ఒప్పందం చేసుకోవడానికి సిద్ధపడ్డాడు. రష్యాతో కూడా సఖ్యంగా వుండి యిద్దరి నుండి సహాయం పొందుదామని చూశాడు. తక్కువ ధరలో గ్యాస్ సరఫరా షరతుపై రష్యాకు సెవస్టోపోల్ నావల్ బేస్‌ను 2042 వరకు లీజుకిచ్చాడు. 2013 నవంబరులో విక్టర్ ఇయుతో ఒప్పందం కుదుర్చుకోబోతూ వుండగా పుతిన్ రష్యా నుండి భారీ సహాయం ఆఫర్ చేసి తమవైపు మళ్లించుకున్నాడు. విక్టర్ ఇయుతో ఒప్పందం రద్దు చేసుకోవడం వలన ఉక్రెయిన్ల భవిష్యత్తు దెబ్బ తింటోందని పాశ్చాత్య మీడియా, వారికి అనుకూలురైన రాజకీయనాయకులు ప్రచారం మొదలుపెట్టారు. ఉక్రెయిన్‌లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. వాటిని అణచడానికి విక్టర్ సైన్యాన్ని పంపించాడు. మూణ్నెళ్లు పోయాక దేశంలో శాంతి నెలకొనడానికై సైన్యాన్ని

వెనక్కు పిలిపించి, ప్రతిపక్షాలతో శాంతి కుదుర్చుకోమని విక్టర్‌కు నచ్చచెప్పమని పుతిన్‌పై ఒబామా, అతనితోబాటు జర్మనీ, ఫ్రాన్సు, పోలండ్ అధినేతలు ఒత్తిడి తెచ్చారు. అతని మాటపై విక్టర్ అలాగే చేశాడు. సైన్యం తప్పుకోగానే ప్రతిపక్షాలు ప్రభుత్వ కార్యాలయాలు ఆక్రమించుకుని, అధ్యక్ష స్థానం నుండి విక్టర్‌ను తరిమేశాయి. కమ్యూనిస్టు వ్యతిరేక, నియో–నాజీ పార్టీలతో ఏర్పడిన యీ ప్రభుత్వానికి పశ్చిమదేశాలు మద్దతు ప్రకటించాయి. ఉక్రెయిన్ జనాభా 4.60 కోట్లు కాగా దానిలో 17% రష్యన్లే. రష్యన్ రెండో అధికారభాషగా వుంటుంది. కొత్త ప్రభుత్వం రష్యన్ భాషకు ఆ గుర్తింపు తొలగించింది.

తాము మోసపోయామని గ్రహించిన పుతిన్ ప్రతిచర్యలు ప్రారంభించాడు. క్రిమియా ప్రాంతంలో అత్యధిక సంఖ్యలో వున్న రష్యన్లను కాపాడడానికై ఉక్రెయిన్‌పై సైన్యాన్ని పంపడానికి రష్యన్ పార్లమెంటు అనుమతి సంపాదించాడు. విక్టర్‌కు, ప్రతిపక్షాలకు మధ్య జరిగిన ఫిబ్రవరి 21 నాటి ఒప్పందం అమలు చేయాలంటూ పుతిన్ చేసిన విజ్ఞప్తులను అమెరికా, పశ్చిమదేశాలు పట్టించుకోకపోవడంతో క్రిమియాను ఉక్రెయిన్‌నుండి విడిపోయేందుకు సహకరించాడు. మార్చి 16 న క్రిమియా రిఫరెండం నిర్వహించింది. రష్యాతో విలీనం కావాలని 98% ఓట్లు పడ్డాయి. దాని ప్రకారం క్రిమియా విడిపోయి స్వతంత్రదేశంగా ప్రకటించుకుంది. ఈ రిఫరెండం రాజ్యాంగవిరుద్ధం అని ప్రకటించాడు, పశ్చిమదేశాలు ఉక్రెయిన్ ప్రధానిగా నిలిపిన సెర్జి. అమెరికా, ఇయు ఔనౌనన్నాయి. నాడు కొసోవో యిదే పని చేస్తే సక్రమమే అన్నారు కదా అని పుతిన్ ఎత్తిపొడిచాడు. ఉక్రెయిన్‌లో ప్రజస్వామ్యయుతంగా ఎన్నికైన అధ్యక్షుణ్ని బలప్రయోగంతో తరిమివేసి కీలుబొమ్మ ప్రభుత్వాన్ని పెట్టడం ఏపాటి ధర్మమని నిలదీశాడు. అమెరికా, దాని మిత్రదేశాలు యీ వాదనను పట్టించుకోవటం లేదు. ఆంక్షలు విధించసాగాయి. వీసాపరమైన నిషేధాలు విధించడానికి సమాయత్తమయ్యాయి. క్రిమియాను తాము గుర్తించటం లేదని జి–7 దేశాలు, జపాన్ ప్రకటించాయి.

పుతిన్ వెనక్కి తగ్గటం లేదు. దానికి అంతర్గతమైన కారణాలు కూడా వున్నాయి. రష్యాలో మరింత ప్రజాస్వామ్యం కావాలంటూ ఉక్రెయిన్ ఆందోళనల తరహాలో యిటీవల నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. ఉక్రెయిన్ పట్ల కఠినంగా వ్యవహరించడం ద్వారా పుతిన్ తన దేశంలోని ఆందోళనకారులకు గట్టి సంకేతం పంపదలచుకున్నారు. ఈ క్రమంలో సోవియట్ యూనియన్ విఛ్చిన్నం తర్వాత యితర దేశాల్లో వుండిపోయిన 2.50 కోట్ల రష్యన్లలో మళ్లీ సోవియట్ యూనియన్ ఆవిర్భవిస్తుందనే ఆశాభావం రగిలిస్తున్నారు. ఉక్రెయిన్‌లో రష్యన్లు పెద్ద సంఖ్యలో వున్న ప్రాంతాల వారికి క్రిమియా విడిపోవడంతో ఊపు వచ్చింది. కేంద్రం నుండి తమ రాష్ట్రాలకు అధికారాలు బదిలీ చేయాలని కోరసాగారు. దీని కారణంగా ప్రస్తుతం వున్న యూనిటరీ వ్యవస్థ నుండి ఫెడరల్ వ్యవస్థకు మారితే రష్యన్ అనుకూల రాష్ట్రాల సంఖ్య పెరిగి రష్యాకు విరుద్ధంగా ప్రభుత్వం చేపట్టే చర్యలను అడ్డుకోగలరు. ప్రస్తుతం ఉక్రెయిన్ ఆర్థిక సంక్షోభంలో మునిగింది. ఐఎంఎఫ్ నుండి పశ్చిమదేశాల నుండి ఋణం కోరుతోంది. పొదుపు చర్యలు చేపడితేనే ఋణం యిస్తామంటున్నాయి అవి. అవి చేపట్టి ప్రజల ఆగ్రహానికి గురి కావడానికి కొత్త పాలకులకు భయం. పాలన సవ్యంగా సాగకపోతే దేశం విఛ్చిన్నమై, కొన్ని ప్రాంతాలు పశ్చిమదేశాలవైపు, కొన్ని రష్యావైపు మరలవచ్చు. అమెరికా, పశ్చిమదేశాలు రష్యాపై వాణిజ్యపరమైన ఆంక్షలు విధిస్తే అది చైనా వైపు మొగ్గు చూపించవచ్చు. చైనాతో బాటు భారతదేశంతో కూడా వ్యాపారబంధం పెంచుకోవచ్చు. రష్యాలో సహజ వనరులు చాలా వున్నాయి. మన దేశంతో దశాబ్దాలుగా మైత్రీబంధం వుంది. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంటుపై చర్చలు కూడా జరుగుతున్నాయి. పశ్చిమదేశాలతో చెడిపోతే రష్యా ఆ చర్చలను వేగవంతం చేయవచ్చు. అదే జరిగితే మన దేశం లాభపడుతుంది.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 3-5 వీక్లీకై ఎమ్బీయస్ : వహీదా రహమాన్ – కాస్ట్యూమ్స్**

నస్రీన్ మునీమ్ కబీర్ రాసిన "కాన్వర్సేషన్స్ విత్ వహీదా రహమాన్" పుస్తకం వెలువడింది. దానిలోని కొన్ని భాగాలు మచ్చుగా పత్రికల్లో వచ్చాయి. "జయసింహ" సినిమాలో వహీదా రెండో హీరోయిన్‌గా నటించింది. ఆ సినిమాకు సంబంధించిన విజయోత్సవం హైదరాబాదులో జరుగుతోంది. రోడ్డు మీద సినీతారలు వెళుతూంటే ప్రజలు హర్షధ్వానాలు చేస్తున్నారు. ఆ సమయంలో ఆ రోడ్డు మీద వున్న సినిమా డిస్ట్రిబ్యూషన్ ఆఫీసులో గురుదత్ కూర్చుని వున్నాడు. అప్పటికే అతను హిందీలో సినిమాలు నిర్మించి, డైరక్ట్ చేసి వున్నాడు. "సిఐడి" సినిమాకై కొత్త హీరోయిన్ గురించి వెతుకుతున్నాడు. ఈ కోలాహలం విని సంగతేమిటని డిస్ట్రిబ్యూటర్‌ను అడిగితే అతను సంగతి చెప్పి, "సినిమాలో వహీదా రహమాన్ అనే కొత్త హీరోయిన్ చూడడానికి ప్రేక్షకులు ఎగబడుతున్నారు" అని చెప్పాడు. పేరు వినగానే గురుదత్ ఆశ్చర్యంతో "ముస్లిమ్ అన్నమాట. ఉర్దూ వచ్చా?" అని అడిగాడు. "వాళ్లు తమిళనాడుకి చెందిన ముస్లిములు. తండ్రి విజయవాడలో పనిచేయడం వలన తెలుగు వచ్చు. ఉర్దూ సంగతి తెలియదు." అని డిస్ట్రిబ్యూటరు చెప్పాడు. "రేపు ఒకసారి కలవమని చెప్తావా?" అన్నాడు గురుదత్.

అప్పటికి సినిమా మ్యాగజైన్లు చాలా తక్కువగా వుండటం చేత వహీదాకు కాని, వాళ్ల తల్లికి గాని గురుదత్ పేరు తెలియదు. మధ్యవర్తి మాట కొట్టేయలేక మర్నాడు డిస్ట్రిబ్యూటర్ ఆఫీసులో గురుదత్‌ను కలిశారు. ఒక అరగంట సమావేశంలో గురుదత్ ఆమెతో చాలా కొద్దిగా మాట్లాడాడు. మీ వూరెక్కడ లాటి నాలుగైదు ప్రశ్నలు హిందీలో వేసి పంపించివేశాడు. వీళ్లు మద్రాసు వెళ్లిపోయారు. ఆ తర్వాత మూణ్నెల్లకు అంటే 1955 చివర్లో బొంబాయి నుండి ఒక మనిషి వచ్చి "గురుదత్‌గారు మిమ్మల్ని సినిమాలోకి తీసుకుంటారట.

రమ్మన్నారు.” అని చెప్పాడు. వీళ్లు బొంబాయి వెళ్లి గురుదత్ ఆఫీసులో అతన్ని కలిశారు. వహీదా వయసు 18 కంటె తక్కువ కాబట్టి మూడేళ్ల కాంట్రాక్టుపై ఆమె తల్లిని సంతకం చేయమన్నారు. అంతలో వహీదా “నేను ఒక షరతు పెట్టదలచుకున్నాను.” అంది. సిఐడి సినిమా డైరక్టర్ రాజ్ ఖోస్లా కూడా అక్కడే వున్నాడు. అతను ఆశ్చర్యపడుతూ “కొత్తగా వచ్చినవాళ్లు షరతులు పెట్టరు.” అన్నాడు. “ఏదైనా కాస్ట్యూమ్ యిష్టం లేకపోతే నేను వేసుకోను. అది ఒప్పందంలో రాయండి.” అంది వహీదా. గురుదత్ “నేను అలాటి సినిమాలు తీయను. నా సినిమాలేవైనా చూశావా?” అని అడిగాడు. “లేదు.” అంది వహీదా. “అయితే ఊళ్లో మిస్టర్ అండ్ మిసెస్ 55 ఆడుతోంది. ఇవిగో టిక్కెట్లు వెళ్లి చూసి రండి.” అన్నాడు.

మర్నాడు ఆఫీసుకి వచ్చి వహీదా “కాస్ట్యూమ్స్‌లో అభ్యంతర పెట్టదగినది ఏదీ లేదు. అయినా నేను చెప్పిన షరతు ఒప్పందంలో పెట్టండి.” అంది. రాజ్ ఖోస్లా మండిపడ్డాడు – “కాస్ట్యూమ్ సీనుపై ఆధారపడి వుంటుంది. నటిపై కాదు.” అని. వహీదా నెమ్మదిగానే అయినా స్థిరంగా చెప్పింది – “నాకు వయసు వచ్చిన తర్వాత స్విమ్‌సూట్ కూడా వేసుకోవచ్చు. కానీ ప్రస్తుతానికైతే నాకు సిగ్గు ఎక్కువ కాబట్టి అలాటి డ్రస్సు వేసుకోను.” అని. “అంత సిగ్గయితే సినిమాల్లోకి వేయడానికి ఎందుకు వచ్చావ్?” అని వెక్కిరించాడు రాజ్ ఖోస్లా. “నేను రాలేదు. మీరే రప్పించారు.” అంది వహీదా. గురుదత్ యీ సంభాషణ అంతా వింటూ కూర్చున్నాడు. ఏమీ పలకలేదు. కానీ వహీదా వెళ్లిపోయాక అగ్రిమెంటు మార్పించి, మర్నాడు వహీదాను రప్పించి సంతకం పెట్టించాడు.

కాస్ట్యూమ్ గురించిన గొడవ వహీదా, రాజ్ ఖోస్లాల మధ్య మళ్లీ వచ్చింది. “సిఐడి” సూపర్ హిట్ కావడంతో వహీదా దేవ్ ఆనంద్–గురుదత్‌లకు చాలా ఆత్మీయురాలైంది. రాజ్ ఖోస్లా దర్శకత్వంలో దేవ్, వహీదాలు హీరోహీరోయిన్లుగా తీసిన “సోల్వా సాల్” సినిమాలో ఒక బ్లౌజ్ వేసుకోవడానికి వహీదా అభ్యంతరపెట్టింది. రాజ్ ఖోస్లాకు కోపం వచ్చి షూటింగు ఆపేశాడు. మర్నాడు వేరే బ్లౌజ్‌తో వహీదా నటించింది. కానీ ఆమె మనసులో అతనిపై కోపం పోలేదు. “గైడ్” సినిమాను రాజ్ ఖోస్లా దర్శకత్వంలో తీయడానికి దేవ్ ఆనంద్ నిశ్చయించుకుని హీరోయిన్‌గా చేయమని వహీదాను అడిగితే “అతని డైరక్షన్‌లో చేయను. మా యిద్దరిలో ఎవరో ఒకరిని ఎంచుకో.” అందిట. (ఈ విషయం పుస్తకంలో లేదు లెండి, అప్పట్లో పత్రికల్లో వచ్చిన వార్త ఆధారంగా రాస్తున్నాను. ఈవిడ చెప్పినదేమిటంటే – ‘నేను అతని పేరుకి అభ్యంతరం చెప్పగానే దేవ్ ఆనంద్ ‘అప్పటికీ యిప్పటికీ రాజ్ చాలా మారాడులే’ అని నచ్చచెప్పాడు కానీ ఎందుకో ఆయనే రాజ్‌ను మార్చేశాడు’ అని) ఆ కథలో హీరోయిన్ నృత్యకళాకారిణి. వహీదా తప్ప వేరేవాళు ఆ పాత్రకు సరిపోరని అనుకున్న దేవ్ వహీదాను ఎంచుకుని రాజ్‌ను తప్పించి తన తమ్ముడు విజయ్ ఆనంద్‌కు దర్శకత్వం అప్పగించాడు. “గైడ్” కళాత్మక చిత్రంగా, ఆల్‌టైమ్ హిట్‌గా మిగిలింది. బ్లౌజ్ వివాదం కారణంగా దాన్ని దర్శకత్వం చేసే అవకాశాన్ని రాజ్ ఖోస్లా జారవిడుచుకున్నాడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : చలో పాలిటిక్స్

గతంలో రాజకీయాల్లోకి న్యాయవాదులు, సంఘసేవకులు ఎక్కువగా వెళ్లేవారు. తర్వాత దక్షిణాదిన సినిమా తారలు వచ్చి చేరారు. పోనుపోను చాలా మార్పులు వచ్చాయి. ఈ ఎన్నికలలో సమాజంలో అనేక వర్గాల వారు అభ్యర్థులుగా నిలబడుతున్నారు. ఐయేయస్‌లు, ఐపియస్‌లు గతంలో రాజకీయాల్లోకి పెద్దగా వచ్చేవారు కారు. ఈ సారి చాలామంది వచ్చారు. సత్యపాల్ సింగ్ ముంబయి పోలీసు కమిషనర్‌గా చేస్తున్న ఉద్యోగానికి ఫిబ్రవరిలో రాజీనామా చేసి రెండు రోజుల తర్వాత బిజెపిలో చేరాడు. సొంత రాష్ట్రమైన ఉత్తర్ ప్రదేశ్‌లో నరేంద్ర మోదీతో బాటు వేదికపై ఆసీనుడయ్యాడు. నాగపూర్‌లో పని చేసినప్పటినుండి అతనికి ఆర్ఎస్ఎస్‌తో సంబంధబాంధవ్యాలుండేవి. అందుకే నరేంద్ర మోదీ నిందితుడుగా భావింపబడిన ఇష్రాత్ జహాన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో గుజరాత్ హై కోర్టు వేసిన సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్)కి నాయకత్వం వహించమంటే నిరాకరించాడు. ఇప్పుడు ఏకంగా బిజెపిలో చేరిపోయాడు. ఆ తర్వాత కొద్ది రోజులకే అతని సహచరుడు పి కె జైన్ రాజకీయనాయకులు పోలీసు ప్రమోషన్లలో జోక్యం చేసుకుంటున్నారని ఆరోపణ చేస్తూ తన ఎడిషనల్ డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీసు పదవికి రాజీనామా చేశాడు. త్వరలోనే ఆయనా బిజెపిలో చేరతాడని అంచనా. ముంబయి పోలీసు వ్యవస్థలో అసిస్టెంటు కమిషనర్‌గా పనిచేసిన షంషేర్ పఠాన్ 2012లోనే రాజీనామా చేసి, ముస్లిములకు, దళితులకు రాజకీయ ప్రాధాన్యత యివ్వాలని పోరాడుతా అంటూ అవామీ వికాస్ పార్టీ పెట్టాడు. ఇప్పుడది మహారాష్ట్రలోని 48 సీట్లలోనూ పోటీ చేస్తుందట.

పోలీసులే కాదు ఆర్మీవారికి, యింటెలిజెన్సువారికి కూడా ఎన్నికలలో రావాలన్న బుద్ధి పుట్టింది. రా (రిసెర్చి అండ్ అనాలిసిస్ వింగ్ అనే పేరుతో నడిచే ప్రభుత్వ గూఢచారి సంస్థ)కు 2010 డిసెంబరు నుండి రెండేళ్లపాటు అధినేతగా వున్న సంజీవ్ త్రిపాఠి ఫిబ్రవరి 25 న రాజీనామా చేసి బిజెపిలో చేరాడు. వారం తిరక్కుండా మాజీ ఆర్మీ చీఫ్ వికె సింగ్ బిజెపిలో చేరాడు. అతనితో బాటు 30 మంది ఎక్స్ సర్వీస్‌మెన్ కూడా. మామూలుగా అయితే ప్రభుత్వోద్యోగం నుండి విరమించినవారు ఏదైనా ప్రయివేటు కంపెనీలో చేరాలంటే ఏడాది పాటు ఆగాలి. రాజకీయాల్లో చేరాలంటే అలాటి నిబంధన ఏమీ లేదు. అందుకని వీరందరూ పొలోమని వచ్చేస్తున్నారు. ప్రజలకు ఎంతోకొంత దూరంగానే మసలే పోలీసు అధికారులే రాజకీయాల్లో వస్తూ వుంటే నిత్యం జనంమధ్య మసలే జర్నలిస్టులు వూరుకుంటారా? నిజానికి గత 20 ఏళ్లగా జర్నలిస్టులు ఎన్నికలలో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 1970, 80 లవరకు

సమాజాన్ని సంస్కరిద్దామని జర్నలిజంలోకి వచ్చినవారు కోకొల్లలు. క్రమేపీ పత్రికాధిపతులు జర్నలిస్టు నీతినియమాలకు కట్టుబడకుండా తమ యితర వ్యాపారాలను పెంచుకోవడానికి పత్రికలను ఉపయోగించుకోవడం, తామే రాజకీయ నాయకులుగా అవతారం ఎత్తడం వీరిని మండించింది. స్వయంగా రాజకీయాల్లోకి వచ్చి వ్యవస్థను చక్కదిద్దడానికి ప్రయత్నాలు చేయసాగారు. ఎక్కువమంది అపజయం పాలయ్యారు. ఇప్పుడు ఆప్ పార్టీ వారికి ఆశలు కొల్పుతోంది.

గతంలోనే రాజకీయాల్లోకి వచ్చిన జర్నలిస్టుల్లో ఎం జె అక్బర్, శ్రీకాంత్ వర్మ, ఉదయన్ శర్మ, సీమా ముస్తఫా, రాజీవ్ శుక్లా, చందన్ మిత్ర వంటివారున్నారు. సీమా ముస్తఫా 1989లో జనతా దళ్‌లో చేరి రెండుసార్లు యుపి నుండి పోటీ చేసి ఓడిపోయి, మళ్లీ జర్నలిజంలోకి వచ్చేసింది. చందన్ మిత్ర బిజెపి తరఫున రాజ్యసభ ఎంపీగా వున్నాడు. ప్రస్తుతం లోకసభకు పోటీ చేస్తున్నాడు. గతంలో కాంగ్రెసు ద్వారా ఎంపీ అయిన ఎంజె అక్బర్ యిప్పుడు బిజెపిలో చేరవచ్చని పుకారు వుంది. 1980లలో శ్రీలంకలో ఎల్‌టిటిఇ స్థావరాల మధ్య సైకిలుపై తిరిగి వాస్తవాలు సేకరించి రిపోర్టు చేసిన "టైమ్స్ ఆఫ్ ఇండియా" జర్నలిస్టు అనితా ప్రతాప్ యిప్పుడు కోచి నుండి ఆమ్‌ఆద్మీ అభ్యర్థిగా నిలబడుతోంది. "అమర్ ఉజాలా" రిపోర్టరుగా ఎన్నో కుంభకోణాలు బయటపెట్టిన ముకుల్ త్రిపాఠి ఫరూకాబాద్‌లో సల్మాన్ ఖుర్షీద్‌కు వ్యతిరేకంగా ఆమ్‌ఆద్మీ అభ్యర్థిగా నిలబడుతున్నాడు. "ఆసాం ప్రతిదిన్" జర్నలిస్టు అయిన మనోరమ్ గొగొయ్ కూడా ఆమ్ ఆద్మీ తరఫున జోర్‌హట్‌లో పోటీ చేస్తున్నాడు. న్యూఢిల్లీలో ఆమ్ ఆద్మీ తరఫున నిలబడుతున్న అభ్యర్థుల్లో మోదీ 'స్నూప్‌గేట్' బయటపెట్టిన అశీష్ ఖేతాన్, సిఎన్ఎన్–ఐబిఎన్ యాంకర్‌గా చేసిన అశుతోష్ వున్నారు. గుజరాత్‌లో బిజినెస్ జర్నలిస్టు అయిన నచికేత దేశాయ్ "ఇక్కడ గుజరాత్‌లో కార్పోరేట్ రంగం, మీడియా, నాయకులు కలిసికట్టుగా మోదీ గురించి ప్రచారం చేస్తూ ప్రజల్ని ఎలా మభ్యపెడుతున్నారో చూస్తున్నాను. అందుకే ఆమ్ ఆద్మీలో చేరాను. అప్పట్లో జయప్రకాశ్ నారాయణ్ సంపూర్ణ క్రాంతి ఉద్యమం తిరిగి వచ్చినట్టు అనిపిస్తోంది. ఈ సారి ఎన్నికలలో పోటీ చేయడం లేదు కానీ పార్టీకై ప్రచారం చేస్తున్నాను." అన్నాడు.

సినిమాతారల విషయానికి వస్తే ఓటర్లు వారిని ఉత్సాహంగా ఆహ్వానించినా, వారితో ఫోటోలు దిగడానికి ఉబలాటపడినా ఆ నియోజకవర్గంలో వున్న పార్టీ కార్యకర్తలు అడ్డుకుంటున్నారు. రంగస్థలం, టీవీ, సినిమాల ద్వారా సుప్రసిద్ధురాలైన కిరణ్ ఖేర్ బిజెపి అభ్యర్థిగా చండీగఢ్‌లో నిలబడడానికి మార్చి 18 న అక్కడకు వెళ్లగానే స్థానిక బిజెపి కార్యకర్తలు నల్లజండాల ప్రదర్శన జరిపి, కుళ్లిన కోడిగుడ్లు విసిరారు. 'అమె ఎక్కణ్నుంచో వచ్చి దిగింది. ఇన్నాళ్లు జెండా మోసిన మాకు టిక్కెట్టు యివ్వలేదు' అని వారి కోపం. ఆమె రెండో భర్త అనుపమ్ ఖేర్ కశ్మీరీ కావడం వలన ఆ సందేహం వచ్చింది కానీ ఆమె పంజాబీ. పంజాబ్ యూనివర్శిటీలో చదివింది. మొదటి భర్త, కొడుకు పంజాబీలే. 'పైగా నేను మునిసిపల్ ఎన్నికలలో బిజెపి తరఫున ప్రచారం చేశాను.' అంటుందామె. సినిమా గ్లామర్‌లో కూడా ఆమెకు పోటీ వుంది. ఆమె కంటె దాదాపు 23 ఏళ్ల చిన్నదైన నటీమణి గుల్ పనాగ్ కూడా ఆమ్ ఆద్మీ పార్టీ తరఫున అదే నియోజకవర్గంలో పోటీ చేస్తోంది. ఆమె అత్త ఊరేగింపుల్లో "షహీద్" సినిమాలోని 'మేరా రంగ్ దే బసంతీ చోలా..' పాట పాడి ప్రజలను ఆకర్షిస్తోంది. ఎవరీమె అని తలతిప్పి చూస్తే గుల్ కనబడుతోంది.

వీళ్లిద్దరూ పోటీ చేస్తున్నది పవన్ కుమార్ బన్సల్ అనే కాంగ్రెస్ ఎంపీపై. అతను నాలుగుసార్లుగా వరుసగా గెలుస్తూ వస్తున్నాడు. యుపిఏ 2 ప్రభుత్వంలో రైల్వే మంత్రిగా పని చేసి, అతని రైల్ గేట్ స్కామ్‌లో యిరుక్కుని పదవి పోగొట్టుకున్నాడు. అతని మేనల్లుడు రైల్వేలో ఉద్యోగాలు, ప్రమోషన్లు యిప్పిస్తానని చెప్పి లంచాలు పట్టినట్టు చార్జిషీటు దాఖలైంది కానీ యితనికి సిబిఐ క్లీన్ చిట్ యిచ్చింది. దానిని ఎవరూ నమ్మటం లేదు. చండీగడ్ ధనికులు, ఎగువ మధ్యతరగతి వుండే నగరం కాబట్టి వీరికే ఛాన్సుంటుంది అనుకుంటాం. అయితే ఆ నగరంలో కూడా లేబర్ కాలనీలున్నాయనీ, వారి అవసరాలు తీరటం లేదని గ్రహించిన బహుజన్ సమాజ్ పార్టీ జన్నత్ జహాన్ అనే అభ్యర్థిని పోటీలోకి దింపింది. వీరందరిలో ఎవరు ప్రజాదరణ పొందుతారో వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : బెంగాల్ సిపిఎంలో నిరసన గళానికి ఉద్వాసన

పశ్చిమ బెంగాల్‌లో సిపిఎం పార్టీ పరిస్థితి నానాటికి దిగజారుతోంది. 34 ఏళ్ల పాలనలో వాళ్లు ప్రజలకు దూరమయ్యారని సులభంగా అనేయవచ్చు. కానీ అసలైన కారణాలు అనేకం – కమ్యూనిస్టు ఆదర్శాలతో ఎప్పుడో పార్టీలో చేరినవారు వృద్ధులైనా, అనారోగ్యపీడితులైనా యిప్పటికీ నాయకులుగా వున్నారు. మాజీ ముఖ్యమంత్రి బుద్ధదేవ్ భట్టాచార్యకు ఊపిరితిత్తుల సమస్య, పొలిట్ బ్యూరో సభ్యుడు నిరుపమ్ సేన్‌కు గుండె సమస్య. సిపిఎం లేబరు వింగ్ సీటు, బెంగాల్ యూనిట్ అధినేత శ్యామల్ చక్రవర్తికి స్పాండిలోసిస్. వారు పార్టీ సమావేశాలకు హాజరు కాలేకపోతున్నారు. అయినా పదవుల నుండి తప్పుకోవటం లేదు. యువతరం నుండి నాయకులు లేరు. చాలాకాలంగా అధికారంలో వుండటం చేత ఆదర్శాలు మరుగున పడి, జబర్దస్తీ చేసి డబ్బులు దండుకోవడం మరిగారు కార్యకర్తలు. ఇదంతా చూసి కమ్యూనిజం అంటే అరాచకం అనే అభిప్రాయానికి వచ్చారు బెంగాల్ ప్రజలు. అందుకనే మమతా బెనర్జీ పాలనలో ఎన్ని లోపాలున్నా భరిస్తూ, సహిస్తూ వస్తున్నారు తప్ప కమ్యూనిస్టులను మళ్లీ ఆదరించటం లేదు. ఎంతో కాలంగా పార్టీలో వున్న నాయకులను, సానుభూతిపరులను యీ వాస్తవం బాధిస్తోంది. "ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత ప్రస్తుత

నాయకత్వం తప్పుకుని యితరులకు అవకాశం యివ్వాలి.'' అన్నారు సోమనాథ్ చటర్జీ. విమాన్ బోస్ కూడా అదే అభిప్రాయాన్ని వ్యక్తపరచారు. ''ఓటమికి వ్యక్తులను బాధ్యులను చేయడం కాంగ్రెసు పద్ధతి. మన కమ్యూనిజంలో సామూహిక బాధ్యత వహిస్తాం'' అంటూ నాయకత్వం ఆ మాటలను కొట్టి పారేసింది.

అబ్దుల్ రజాక్ మొల్లా అనే పొలిట్ బ్యూరో సభ్యుడు మరింత ఘాటుగా విమర్శించాడు. కమ్యూనిస్టులు మతానికి వ్యతిరేకులు కాబట్టి, ముస్లిములు కమ్యూనిస్టులను సాధారణంగా దూరంగా పెడతారు. అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ అపజయం తర్వాత తన మతస్తులకు చేరువ కావడానికి మొల్లా హజ్‌కు వెళ్లి 'తను కూడా పక్కా ముస్లిమునే' అని చూపదలచుకున్నాడు. అయితే పార్టీ అతనికి అనుమతి యివ్వలేదు. ''హర్‌కిషన్ సింగ్ సుర్జీత్ తలపాగా, కృపాణ్‌తో అసలైన సిక్కులా తిరిగితే మీరేం చేశారు? ఇప్పుడు నా హజ్ ప్రయాణాన్ని ఎందుకు అడ్డుకుంటున్నారు?'' అని వాదించాక సరేనన్నారు. పార్టీ వ్యవహారాలపై మొల్లాకు చాలా ఫిర్యాదులున్నాయి. 'ఓటమి తర్వాత బుద్ధదేవ్, నిరుపమ్ సేన్ నాయకత్వం నుండి తప్పుకుని సూర్యకాంత మిశ్రకు అప్పగించమన్నాను. వినలేదు. యువనాయకులను ప్రోత్సహించడం లేదు. కార్యకర్తల్లో కుర్రవాళ్లకు కమ్యూనిజం గురించి చెప్పేవారు లేరు. గతంలో మృణాల్ సేన్, సునీల్ గంగోపాధ్యాయ వంటి మేధావులు కమ్యూనిజం గురించి ప్రజల్లో మంచి అభిప్రాయం కలిగించేవారు. క్రమేపీ సిపిఎం మేధావులను దూరం చేసుకుంది. ఇప్పుడు ప్రేరణ కలిగించేందుకు ఎవరూ లేరు. విదేశీ కంపెనీలకు వ్యతిరేకంగా నిర్వహించే నిరసన కార్యక్రమాలకు కుర్రాళ్లు కోక్ బాటిల్స్ చేతిలో పట్టుకుని వస్తున్నారు. గతంలో నాయకుల పుట్టినరోజులు జరిపేవాళ్లం కాదు. ఇప్పుడు జ్యోతిబాబు పుట్టినరోజు వేడుకలు జరుపుతున్నారు. మైనారిటీలను, వెనుకబడిన వర్గాలను సిపిఎం దూరం చేసుకుంటోంది. వాళ్లకోసం ఏమీ చేయడం లేదు. చెప్పినా వినడం లేదు. ఏమిటిదంతా?' అని మండిపడ్డాడు.

పార్టీ అతని ధోరణిని తప్పుపట్టింది. ఫిబ్రవరి 26 న పార్టీలోంచి బహిష్కరించింది. అతను వెంటనే వెనుకబడిన వర్గాల, ముస్లిములు సంక్షేమం కోసం పార్టీ పెడతానని ప్రకటించాడు. సిపిఎంతో పడదు కానీ, సిపిఐ, యితర లెఫ్ట్ పార్టీలతో కలిసి తృణమూల్‌తో పోరాడతానంటున్నాడు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : మహారాష్ట్రలో టోల్ గేట్ల వ్యవహారం

రాజ్ థాకరే మొదలుపెట్టిన టోల్ గేట్ వ్యతిరేక ఉద్యమం హింసాయుతంగా మొదలైనా సమాజానికి కొంత మేలు చేసింది. ఇకనైనా టోల్ గేట్ కంట్రోలు అథారిటీ ఏర్పడాలని అందరూ భావిస్తున్నారు. పిపిపి పథకం కింద, బిఓటి కింద కాంట్రాక్టర్లు రోడ్లు వేసిన తర్వాత దానిపై కొన్నేళ్లపాటు టోల్ వసూలు చేసుకునే అధికారం ప్రభుత్వం వారికి యిస్తుంది. ఆ అధికారాన్ని వాళ్లు వేరేవారికి సబ్ కాంట్రాక్టుకి యిచ్చేస్తున్నారు. ఎంత వసూలు చేయాలి, ఎన్నేళ్లు వసూలు చేయాలి అన్నదాన్ని ప్రజలకు తెలుపరు. అందువలన వారు గడువు దాటిపోయినా వసూలు చేసేస్తున్నారు. నాకు తెలిసిన ఉదాహరణ చెప్తాను – ఒక దినపత్రికకు సంబంధించిన కారు విశాఖ జిల్లాలో ఒక వూళ్లో టోల్ గేట్ వద్ద ఎప్పుడూ టోల్ కట్టేది కాదు. పత్రిక పేరు చెప్తే పోనిచ్చేసేవారు. ఒకరోజు ఒక కొత్త ఉద్యోగి వుండి రశీదు కట్టాల్సిందే అన్నాడు. ఒళ్లు మండిన పత్రికోద్యోగి స్థానిక విలేకరిని యీ టోల్ గేట్ కథేమిటో వెలికి తీయమన్నాడు. తీస్తే వాళ్లు వసూలు చేయవలసిన గడువు తీరిపోయి రెండేళ్లయిందని తేలింది. వెంటనే టోల్ గేట్ ఎత్తేశారు. దోపిడీ తప్పడంతో ఈ వివాదంలో ప్రజలు సుఖపడ్డారు. దేశవ్యాప్తంగా యిలాటివి ఎన్నో వున్నాయని తేలింది. అందువలన 2013 బజెట్ ఉపన్యాసంలో చిదంబరం హైవే సెక్టార్‌కు రెగ్యులేటర్ పెడతామని హామీ యిచ్చారు కానీ నెరవేర్చలేదు.

విదేశాల్లో ఎలక్ట్రానిక్ టోల్ వసూలు విధానం వుంటుంది. గేట్ దాటుతూండగా సిసి కెమెరా కారు నెంబరును ఫోటో తీస్తుంది. కట్టాల్సిన టోల్ కారుకి అనుసంధానం చేసిన క్రెడిట్ కార్డుకి ఆటోమెటిక్‌గా డెబిట్ అయిపోతుంది. మన దేశంలో వాహనాలను నిలబెట్టి మాన్యువల్‌గా టోల్ వసూలు చేయడం వలన ఎన్నో పనిగంటలు, పెట్రోలు ఖర్చవుతున్నాయి. ఏడాదిలో యిలా వృథా అయ్యే మొత్తం రూ.87 వేల కోట్లని ఐఐఎమ్ కలకత్తావారు లెక్కకట్టారు. హరియాణాలోని ఆమ్ ఆద్మీవారు తమ రాష్ట్రంలో టోల్ కలక్షన్‌పై శ్వేతపత్రాన్ని విడుదల చేయమని ప్రభుత్వాన్ని కోరారు. చాలా మంది కాంట్రాక్టర్లను గడువుకి మించి ఎందుకు వసూలు చేస్తున్నారని అడిగితే ''ఈ రోడ్డుపై బోల్డు ట్రాఫిక్ వుంటుందని ప్రభుత్వం మమ్మల్ని నమ్మించి కాంట్రాక్టు రాయించుకుంది. కానీ రోడ్డు వేశాక చూస్తే అంత ట్రాఫిక్ లేదు. అందుకని మా ఖర్చు మేం రాబట్టుకునేదాకా వసూలు చేస్తున్నాం'' అని సమాధానం చెప్తున్నారు. ఇప్పుడు మహారాష్ట్రలో జరిగిన ఆందోళనకు స్పందించక తప్పని పరిస్థితి ప్రభుత్వానికి వచ్చింది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి ''22 టోల్ యూనిట్లను రాష్ట్రప్రభుత్వం కాంట్రాక్టర్ల నుండి కొనేసి, ప్రజలకు భారం లేకుండా చేస్తుంది.'' అని హామీ యిచ్చారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 6-8 వీక్లీకై**

## ఎమ్బీయస్ : సమైక్యపార్టీ అవసరం వుందా?

తక్కిన పార్టీల గురించి రాసేటప్పుడు వాళ్లకు ఛాన్సుందా లేదా అని ఆలోచిస్తాం. కానీ కిరణ్ పెట్టిన సమైక్యాంధ్ర పార్టీ విషయానికి వస్తే అసలది వుండవలసిన అవసరం వుందా అన్న సందేహం వస్తుంది. ఎందుకంటే తక్కిన పార్టీలన్నీ చేస్తున్న హంగామాలో నూరో

వంతు కూడా అది చేయడం లేదు.

## ఎటు చూసినా సమరోత్సాహం

కాంగ్రెసు పార్టీ తెలంగాణలో ఒంటరిగా పోటీ చేసినా మాదే గెలుపు, పోనీ కదాని సిపిఐకి కొన్ని సీట్లు యిచ్చాం అంటోంది. సీమాంధ్రలో పార్టీ సవాళ్లు ఎదుర్కుంటోంది కానీ మేం నిలబెడతాం అంటున్నారు ఆ నాయకులు. టిడిపి చూడబోతే సీమాంధ్రలో అప్పుడే అధికారంలోకి వచ్చేసినట్లు బిల్డప్ యిస్తోంది. తెలంగాణలో కూడా మా బలం ఏమీ తగ్గలేదు అంటూ బిజెపితో గీచిగీచి బేరాలాడుతోంది. 'మీకు సీటు యిస్తే ప్రత్యర్థులకు ధారపోస్తారు, అదే మేమైతే కచ్చితంగా గెలుస్తాం' అంటున్నారు. సీమాంధ్రలో గెలుపు తథ్యం, తెలంగాణలో కొన్ని జిల్లాలలో కూడా.. అంటోంది వైకాపా. తెరాస 'ఒంటరిగా పోటీ చేసినా మాదే జయం. సమైక్యరాష్ట్రంలో యిన్నాళ్లూ దోచుకుతిన్నది కాంగ్రెసు వారే (యిప్పటిదాకా సీమాంధ్రులు దోచుకున్నారన్నారు, ఇప్పుడు కాంగ్రెసు వారంటున్నారు) వాళ్లకు మళ్లీ ఛాన్సు యిస్తామా?' అంటున్నారు. బిజెపి వారు తెలంగాణలో ఒంటరిగా పోటీ చేసినా సగానికి పైగా సీట్లు వస్తాయనుకుంటున్నారు. తెరాసతో కలిస్తే తక్కిన సగం కూడా వచ్చేసి ప్రభుత్వం మనదే అంటున్నారు.

అత్యాశ్చర్యకరంగా సీమాంధ్ర బిజెపిలో కూడా ఉత్సాహం పెల్లుబుకుతోంది. 5 పార్లమెంటు సీట్లు కావాలట. సిపిఐ నారాయణ భుజంపై కండువా వేసుకుని కాంగ్రెసు, తెరాసల మధ్య మధ్యవర్తిత్వానికి బయలుదేరారు. దేశమంతా కాంగ్రెసును సిపిఐ చీల్చి చెండాడుతోంది. ఖమ్మం వరకు వచ్చేసరికి నారాయణగారు కాంగ్రెసు మద్దతుతో ఎంపీ సీటు గెలవాలని చూస్తున్నారు. మరీ యింత ద్వంద్వ విధానమా? సిపిఎం కూడా యిలాటి ప్రయత్నాలు చేస్తోంది. పవన్ జనసేన, లోకసత్తా యివన్నీ బిజెపి-టిడిపి కూటమికి ఉపగ్రహాల్లా తేలుతున్నాయి. ఇంతమంది సమరోత్సాహంతో రంకెలు వేస్తున్నారు, టిక్కెట్టు దొరకదన్న భయం వున్నా, నమ్ముకున్న పార్టీ గెలిపించదన్న అనుమానం తగిలినా వెంటనే పార్టీ ఫిరాయిస్తున్నారు. పార్టీలు కూడా ఎలాటి సంకోచాలు పెట్టుకోకుండా వారిని ఆహ్వానిస్తున్నాయి. వారిపై నిన్నటిదాకా చేసిన అవినీతి ఆరోపణలను తూనాబొద్దు అనుకుంటున్నాయి. ఎవరు ఏ పార్టీలో వున్నారో చటుక్కున చెప్పడం కష్టంగా వుంది.

## మూకబలం, రూకబలం ఏదీ లేదు

ఇలాటి వాతావరణంలో స్తబ్దంగా, నిశ్శబ్దంగా వున్న పార్టీ సమైక్యపార్టీ. గర్జనలు, శంఖారావాలు పేర అదరగొట్టడం లేదు. వారి పార్టీలోకి దూకేవారు ఎవరూ లేరు. కాంగ్రెసు నుండి విడిపోయి వచ్చిన తర్వాత కిరణ్ వెంట నిలిచినవారి సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. మొత్తం అందర్నీ కలిపి రెండు చేతుల వేళ్లమీద లెక్కించవచ్చు. మరి కొంతకాలంలో అది ఒక చేతిమీద వేళ్లకే సరిపోయే సంఖ్యకు చేరినా ఆశ్చర్యం లేదు. గద్దె నుండి దిగిపోయి పార్టీ పెట్టమని కిరణ్‌ను ప్రోత్సహించినవారే ఆయనను ఒంటరిగా వదిలేసి వెళ్లిపోయారు. ఎందుకంటే కిరణ్ మొదటినుండి ఒంటరిగానే వుండేవారు. ఎవర్నీ నమ్మి చేరదీయలేదు. ఎవరితోను సంప్రదించలేదు. అందువలన యిప్పుడు ఎవరూ అతని వెంట రానంటున్నారు. ఉన్నవాళ్లు కూడా తమ నియోజకవర్గ ప్రజలు సమైక్యభావనకు అంకితమై వున్నారన్న ఉద్దేశంతో వున్నారు కానీ కిరణ్ మళ్లీ ముఖ్యమంత్రో, కేంద్రంలో మంత్రో అయ్యి తమ ప్రయోజనాలను కాపాడతాడన్న ఆశతో కాదు. పార్టీకి మూకబలమే కాదు, రూకబలం వున్నట్టూ లేదు. బడా వ్యాపారవేత్తలు ఎవరూ చేరలేదు. మీడియా బలం ముందే లేదు. వాళ్ల అభ్యర్థులెవరో, ఆశావహులెవరో ఏమీ రాయటం లేదు. ఎన్నికలలో నిలబడతాడో లేదో తెలియని పవన్‌కు యిచ్చిన కవరేజిలో పదోవంతు కూడా వీళ్లకు యివ్వలేదు. అసలు సోదెలోకి లేనట్టే చూస్తున్నారు. ఇలాటి పార్టీకి మనుగడ అవసరమా?

## కోర్టులను నమ్ముకునే అమాయకులు

అసలు సమైక్యపార్టీ ఆశయమే అందరికీ హాస్యాస్పదంగా తోస్తోంది. విభజన అయిపోయింది, చెంబూ తప్పేలా పంపకాలు జరిగిపోతున్నాయి. ఉద్యోగులు ప్రమోషన్లు వచ్చాక ఎవరెక్కడ కూర్చోవాలో చూసుకుని రుమాళ్లు వేసేసుకుంటున్నారు. ఇంకా సమైక్యంగా వుంచుతాం అంటూ వీళ్లు అంటూ వుంటే 'ఢిల్లీ సుల్తాన్ను పట్టుకుపోతాం' అని పిచ్చివాడు రోడ్లపై తిరిగినట్లుంది. కోర్టులు ఆపేస్తాయి అంటున్నారు వీళ్లు. కోర్టులు చూస్తే ముంగిలా కూర్చున్నాయి. సరైన సమయం రాలేదు, టూ ఎర్లీ అంటూ యిన్నాళ్లూ తాత్సారం చేసి యిప్పుడు రాజ్యాంగ ధర్మాసనానికి రిఫర్ చేస్తాం అన్నారట. ఇప్పటిదాకా చేయలేదట. దానికీ సమయం రాలేదా? పైగా విభజన గురించి కెసియార్‌కు నోటీసులు యిచ్చారట. అంటే తెలంగాణ ఆవిర్భావానికి కారకుడు కెసియారే తప్ప సోనియా కాదని కోర్టు కూడా నమ్ముతోందా? అలా యిలా చేసి వేసవికాలపు సెలవుల దాకా గడిపేస్తే సమ్మర్ వెకేషన్ తర్వాత తిరిగి వచ్చేసరికి రెండు ప్రభుత్వాలూ పని చేస్తూ వుంటాయి. ఇప్పుడు సమయం మించిపోయింది, టూ లేట్ అంటారు. ఇలాటి కోర్టులు విభజన ఆపుతాయని

ఎలా అనుకుంటారు? ఉండవల్లి నల్లకోటు అనవసరంగా యిస్త్రీ చేయించుకున్నారు.

మన రాష్ట్రపు విభజన విషయంలో ఎటు చూసినా నకారులే (మృచ్ఛకటికంలో శకారుల్లా) కనబడుతున్నారు. చిదంబరం, జైరాం రమేశ్ (కర్ణాటకకు చెందిన తమిళుడు), నారాయణస్వామి (పాండిచ్చేరికి చెందిన తమిళుడు – పాండిచ్చేరికి ప్రత్యేక రాష్ట్రప్రతిపత్తి కావాలని అక్కడివాళ్లు అడిగితే ప్రత్యేక రాష్ట్రం వేస్టు, ప్యాకేజీ అడుగుదాం అన్నాడక్కడ. తెలంగాణ విషయంలో మాత్రం ప్రత్యేక రాష్ట్రం యివ్వాలన్నాడు). గవర్నరుగారు, ఉద్యోగుల పంపకాల కమిటీ చైర్మన్ కమలనాథన్‌గారు, సీమాంధ్ర రాజధాని ఎక్కడ పెట్టాలో చెప్పడానికి వేసిన కమిటీ చైర్మన్ శివరామకృష్ణన్ గారు – అందరూ నకారులే. చివరకు సుప్రీం కోర్టు చీఫ్ జస్టిస్ కూడా!

## బెర్లిన్ గోడ యిటుక ఏం చెపుతోంది?

ఇంతమంది మేధావులు, ముఖ్య రాజకీయపక్షాలైన కాంగ్రెసు, బిజెపిల మద్దతుతో, టిడిపి పక్కవాయిద్యపు సహకారంతో (బాబుగారు మొహమాటం విడిచి జై తెలంగాణ అనేశారు, మా లేఖ వలనే విభజన జరిగిందని వరంగల్‌లో గొప్పలు చెప్పుకున్నారు) రాష్ట్రాన్ని పరపరా రంపంతో కోసేస్తూ వుంటే కిరణ్ పార్టీ బెర్లిన్ గోడ యిటుకలు చూపించి ఓదార్చబోతే ప్రజలు నమ్ముతారా? నమ్మరు. కానీ ఆ యిటుకల్లోనే ఒక సందేశం వుంది – ఆశ అనేది వదులుకోవద్దని! రెండవ ప్రపంచయుద్ధంలో జర్మనీ ఓడిపోతుందని, దాన్ని యితర దేశాలు రెండుగా చీలుస్తాయనీ ఎవరూ అనుకోలేదు. అలాగే కాంగ్రెసుకు పెట్టనికోటగా నిలబడిన ఆంధ్రప్రదేశ్‌ను అదే కాంగ్రెసు పార్టీ పొరుగు రాష్ట్రనాయకుల, అధికారుల సాయంతో రెండుగా చీలుస్తుందని ఎవరూ అనుకోలేదు. విభజన వలన కాంగ్రెసు ఏం బావుకుందో చెప్పమని సోనియా నడిగినా చెప్పలేరు. సీమాంధ్రలో ఖాళీ అయిపోతోంది. 25 ఎంపీ సీట్లలో 5 గెలుస్తామని కూడా గట్టిగా చెప్పలేని పరిస్థితి. ఇక తెలంగాణలో తెరాసతో పొత్తుకోసం వెంపర్లాడుతున్నా కుదరటం లేదు. కుదరని పక్షంలో 17 సీట్లలో మహా అయితే 6 సీట్లు గెలవవచ్చు. అంటే 33కి బదులు అందులో మూడోవంతు 11 స్థానాలు గెలుస్తుందన్నమాట. ఈ భాగ్యానికి ఎవరైనా రాష్ట్రాన్ని చీలుస్తుందని అనుకుంటారా? కానీ చీల్చింది. రాష్ట్రం రెండు ముక్కలైంది. అదీ అస్తవ్యస్తంగా, ఏ రాష్ట్రమూ సొంతంగా కాళ్లపై నిలబడే పరిస్థితి లేకుండా!

ప్రజలను ఏ మాత్రం సంప్రదించకుండా, ఏ రిఫరెండం జరపకుండా కొందరు నాయకుల అభీష్టం మేరకు జర్మనీని చీల్చినట్లే, ఆంధ్రప్రదేశ్‌ను చీల్చారు. ఆ ముక్కలు రెండూ మళ్లీ కలుస్తాయని ఎవరూ ఊహించలేదు. బెర్లిన్ గోడ దాటడానికి ప్రయత్నించి చనిపోయినవారు ఎంతోమంది వున్నారు. జర్మనీ మళ్లీ ఒకటి కాకుండా అంత దారుణంగా కాపలా కాశారు. అయితే రష్యా సామ్రాజ్యం కూలిపోయింది. ఇతరదేశాలపై పట్టు సడలించింది. అంతే జర్మనీ గోడ కూలింది. ఇరుప్రాంతాల జర్మన్లు కలిసి దాన్ని కూల్చేశారు. జర్మనీ యిప్పుడు మళ్లీ అగ్రరాజ్యంగా ఎదుగుతోంది. మళ్లీ కలవడానికి దాదాపు అర్ధశతాబ్దం పట్టింది. విడిపోవడం చూసిన ప్రజల్లో చాలామంది మళ్లీ కలవడం చూసి వుండకపోవచ్చు. కానీ వారి ఆశలు ఫలించాయి. సంకల్పం అంటూ వుంటే, ఏనాటికైనా సిద్ధించవచ్చని బెర్లిన్ గోడ సంఘటన చెపుతుంది.

## అన్‌హోనీకో హోనీ కర్ దే...

ఏ ఆర్టికల్ 3ను అడ్డం పెట్టుకుని, విపరీత వ్యాఖ్యానాలు చేసి రాష్ట్రాన్ని చీల్చారో, అదే ఆర్టికల్ 3ను సవరించి కలపవచ్చు కూడా. సిక్కిం ఒకప్పుడు విడి దేశం. భారత్‌లో కలుస్తుందని ఎవరైనా అనుకున్నామా? కలిపారు. గోవా, పాండిచ్చేరి, యానాం భారత్‌లో అంతర్భాగాలు కావు. 1947లో స్వాతంత్ర్యం వచ్చాక కూడా అవి పోర్చుగీస్, ఫ్రెంచ్ పాలనలో వుండేవి. గోవాలో చాలామంది మహారాష్ట్రులున్నారు కాబట్టి దాని విముక్తికై మహారాష్ట్రలో ఆందోళనలు జరిగాయి. చివరకు ఫలించి గోవా భారత్‌లో కలిసింది. దానితో బాటే తక్కినవీ. దేశ విభజన సమయంలో కశ్మీర్‌లో కొంతభాగాన్ని పాకిస్తాన్ ఆక్రమించుకుంది. దాన్ని వెనక్కి తెచ్చుకోవాలని భారత్ దౌత్యపరంగా ప్రయత్నాలు చేస్తోంది. పాక్ అడ్డుకుంటోంది. రేపు ఎప్పుడైనా పాక్ బలహీనపడినప్పుడో, భారత్ అనుకూల ప్రభుత్వం ఏర్పడినపుడో అది మళ్లీ భారత్‌లో కలవవచ్చు. తూర్పు పాకిస్తాన్, పశ్చిమ పాకిస్తాన్ విడిపోతాయని ఎవరైనా వూహించారా? 1971లో విడిపోయాక మళ్లీ వాళ్ల మధ్య అనుబంధం ఏర్పడి కలిసి భారత్‌ను వ్యతిరేకిస్తాయని కలగన్నారా? రాష్ట్రాల్లోని కొన్ని ప్రాంతాల విషయం తీసుకుంటే కన్యాకుమారి జిల్లా కొంతకాలం తమిళనాడులో వుంది, కొంతకాలం కేరళలో వుంది, మళ్లీ తమిళనాడుకి వచ్చింది. పాలఘాటు కూడా తమిళప్రాంతంగానే వుంటూ వచ్చి కేరళకు వెళ్లింది. తమిళనాడు–కేరళల మధ్య కొన్ని ప్రాంతాలు ఏ రాష్ట్రంలో కలవాలన్నదానిపై వివాదాలు వున్నాయి. సంయుక్త మహారాష్ట్ర ఉద్యమం కూడా సమైక్యాంధ్ర ఉద్యమం లాటిదే. నైజాంలోని మరాట్వాడా, సెంట్రల్ ప్రావిన్స్‌లోని విదర్భ, బొంబాయి రాష్ట్రంలోని మరాఠీ ప్రాంతాలు కలుపుతూ మహారాష్ట్ర ఏర్పడాలని ఉద్యమించారు. సాధించారు. ఇంకా సాధించాల్సినవి వున్నాయి. కర్ణాటకలోని బెళగాం కూడా మరాఠీలు ఎక్కువగా వుండే ప్రాంతం. అక్కడ మహారాష్ట్ర ఏకీకరణ సమితి అనే ఒక పార్టీ వుండి, బెళగాంను మహారాష్ట్రలో కలపాలి అనే డిమాండుతో ఎన్నికల్లో అన్ని స్థానాలు గెలుస్తూ వుండేది. ఇప్పటిదాకా ఆ కల సాకారం కాలేదు.

## విభజన నేర్పే గుణపాఠాలు

విడిపోవడం సులభం కానీ మళ్లీ కలవడం కష్టం అని వాదించవచ్చు. నిజమే. కానీ అసాధ్యం కాదు. ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలు విడిగా మనుగడ సాగించడం ఎంత కష్టమో పోనుపోను బాగా అర్థమౌతుంది. ఇరుప్రాంత నాయకులు వైషమ్యాలు రెచ్చగొట్టి, సమస్యలు పెంచితే మరింత జటిలమవుతాయి. పైగా ఢిల్లీ యిద్దరిపై పెత్తనం సాగించబోతోంది. ఉద్యోగుల పంపకాల విషయంలోనే చూడండి – ఎన్ని రకాల వాదనలు వింటున్నామో. పంచేందుకు ఒక స్థిరమైన కొలబద్ద లేకుండా వ్యవహారం చేస్తున్నారు. ఆప్షన్లు వుంటాయో లేదో చెప్పటం లేదు. చట్టానికి వ్యతిరేకంగా చేస్తే కోర్టుల్లో నిలుస్తాయో లేదో తెలియదు. ఉద్యోగులంత లిటిగెంట్లు ఎవరూ వుండరు. ఏ చిన్న పొరబాటు జరిగినా కోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకుంటారు. ఆఫీసుల్లో ప్రమోషన్లు తేలక, బదిలీలు తేలక పని కుంటుపడుతుంది. అలాగే రాజధాని విషయం తేల్చడానికి ఓ కమిటీ. దానికి ఆరునెలల గడువెందుకు? లాబీయింగుకి అవకాశానికి యివ్వడానికా? వివిధ ప్రాంతాల ప్రజల్లో వైషమ్యాలు రెచ్చగొట్టడానికా? అయినా అక్కడ ఏర్పడే ప్రభుత్వం తీసుకోవాల్సిన నిర్ణయాన్ని కేంద్ర కమిటీ ఎలా తీసుకుంటుంది? భద్రాచలం డివిజన్ సంగతి విషయం తీసుకోండి. ఇప్పటిదాకా ఏమైనా తేల్చారా? బిల్లులో ఒకటి రాశారు, తర్వాత సవరణ అన్నారు, ఆర్డినెన్సు అన్నారు, ఏదీ చేయలేదు, మహామేధావి జైరాం గారు ఎత్తు తగ్గించడానికి ప్లాను వేస్తున్నారు, రెండు నెలలు పోతే యీయన ఏ మూల వుంటాడో తెలియదు. ఇప్పుడు మాత్రం ఎగిరెగిరి పడుతున్నాడు. కెసియార్ కార్యవీర్యార్జునుడిలా వెయ్యి బాహువులతో నదీప్రవాహాన్ని ఆపేస్తానంటున్నాడు. చూడబోతే నదీజలాల విషయంలో  నాయకులు కొట్టుకుచచ్చి వ్యవసాయం నాశనం చేసి, ప్రజలకు విసుగు తెప్పించేట్లున్నారు.

## పునరాలోచన రాదని చెప్పలేం

ఇలా కొంతకాలం (ఎంతకాలమో యిప్పుడే చెప్పలేం) గడిచేసరికి 'ఎందుకొచ్చిన గొడవ యిది? కలిసిపోతే పోలేదా' అనుకోవచ్చు. కలిసిపోతే తమ పదవులు పోతాయన్న భయంతో కొందరు తప్పకుండా అడ్డుపడతారు. ఆ పరిస్థితిలో కనీసం కలిసిమెలిసి ప్రణాళికలు రచిద్దాం, సహకరించుకుందాం అనుకోవచ్చు. ఇరు రాష్ట్రాల మధ్య నిబంధనలు ఎత్తేసి మినహాయింపులు యిచ్చుకుని వ్యాపారాన్ని, సరుకుల రవాణాను ప్రోత్సహించవచ్చు. కలిసి ప్రాజెక్టులు నిర్మించుకోవచ్చు. శత్రుదేశాలైన భారత్, తూర్పు పాకిస్తాన్‌లు కలిసి ఫరకా బరాజ్ కట్టగా లేనిది యిరు రాష్ట్రాల్లో వున్న తెలుగువారు ఉమ్మడి ప్రయోజనాలకై కలిసి ప్రాజెక్టులు కట్టుకోలేరా? ఈ రెండు రాష్ట్రాలలో ఏ రాష్ట్రవాసి ఐనా సరే, స్థానికుడిగానే లెక్కిస్తాం అని తీర్మానించవచ్చు కూడా. ఇవన్నీ జరగాలంటే సమైక్య భావన సజీవంగా వుండాలి. కొందరైనా ఆ భావజాలం వ్యాప్తి చేయడానికి కంకణం కట్టుకుని వుండాలి.

ఈ విలీనం లేదా సహకారం ఏ పదేళ్లకో, యిరవై ఏళ్లకో జరుగుతుందనుకుంటే అప్పటిదాకా యీ పార్టీ నోట్లో వేలు వేసుకుని కూర్చోవాలా అన్న ప్రశ్న వస్తుంది. అలా అనుకుంటే బెళగాం మహారాష్ట్ర ఏకీకరణ సమితి అన్నేళ్లు మనగలిగి వుండేది కాదు. సమైక్యపార్టీ సీమాంధ్ర, తెలంగాణ రెండు ప్రాంతాల్లో ప్రతి నియోజకవర్గంలో ఏదో ఒక స్థాయిలో వ్యాపించి వుంటే విభజన వలన జరిగే నష్టాలు ప్రజలకు గమనంలోకి వచ్చిన ప్రతీసారీ వీళ్లు తమ ప్రచారం చేస్తూ వుండవచ్చు. స్థానిక నాయకులలో విభేదాలు వచ్చినపుడు వీరు తమ ప్రయోజనాలకు అనుగుణంగా పరిస్థితిని మలచుకుంటూ, సందర్భాన్ని బట్టి ఎవరో ఒకరికి మద్దతు యిస్తూ క్రమేపీ బలపడవచ్చు. ఇది దీర్ఘకాలంలో జరగవలసిన పని. అప్పటిదాకా నిలదొక్కుకునే ఓపిక వుండాలి. ఈ ఎన్నికలలో పెద్దగా సీట్లు రాలేదు కదాని, పార్టీ మూసిపడేస్తే పని జరగదు. సీట్ల సంఖ్య బట్టి చూస్తే కమ్యూనిస్టు పార్టీలు ఎప్పుడో కార్యకలాపాలు కట్టిపెట్టాలి. కానీ కొంత శాతం ఓట్లు వాళ్లకు తప్పకుండా పడతాయి కాబట్టి కొన్ని నియోజకవర్గాలలో అయినా వారి ప్రభావం వుంటుంది కాబట్టి, వారి అస్తిత్వానికి విలువ వుంది. సమైక్యపార్టీకి తప్పకుండా వారి కంటె ఎక్కువ విలువే వుంటుందని నా నమ్మిక.

ఈ ఎన్నికల వరకు చూసుకుంటే ఎటు చూసినా కప్పదాట్లే కనబడుతున్నాయి. ఎవరు ఏ పార్టీలో ఎందుకు చేరుతున్నారో తెలియకుండా వుంది. అలా చేరడానికి అవకాశవాదం తప్ప ఒక సిద్ధాంతనేపథ్యం కనబడటం లేదు. జీవితాంతం తిట్టిపోసిన పార్టీలోకే కేవలం టిక్కెట్టు యిస్తారన్న కారణంగా చేరుతున్నారు. వీరిని చూసి సాధారణ ఓటరు అసహ్యించుకుంటాడు. విద్యార్థికులు, యువత, మేధావివర్గాలు అయితే మరీను. వారిని ఆకట్టుకుంటే సమైక్యపార్టీ కొన్ని సీట్లు తప్పకుండా గెలుచుకోగలదు. ఆ వర్గాల వారికి టిక్కెట్లు యిచ్చినపుడే అది సాధ్యం. ఇవ్వడానికి వీరికి యిబ్బంది లేదు. ఎందుకంటే  వీరి పార్టీలో చేరడానికి రాజకీయనాయకులు, వ్యాపారవేత్తలు ఎగబడటం లేదు. అందువలన విద్యార్థులు, ఉద్యోగులు, మేధావులు, యువత – యీ వర్గాల వారికి టిక్కెట్లు యిస్తే తప్పకుండా ఓట్లు పడవచ్చు. ఆ శాతం ఎంత అని అడిగితే యిప్పుడే చెప్పలేం కానీ అది రెండంకెల సంఖ్య (అంటే 10 నుంచి ప్రారంభమవుతుంది) కావడానికి అవకాశమైతే వుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 9** **ఎమ్బీయస్ : తేజ్‌పాల్ కేసు నేర్పే పాఠం**

గోవాలో ఓ హొటల్ లిఫ్టులో తన కూతురు వయసున్న సహోద్యోగినితో సరసమాడబోయి తెహల్కా సంపాదకుడు తేజ్‌పాల్ చిక్కుల్లో పడ్డాడని అందరికీ తెలుసు. "ఆమెకిష్టమే అనే అభిప్రాయంతో శృంగారచేష్టలు చేశాను. అది పొరబాటు కాబట్టి ఆరునెలల పాటు నా బాధ్యతల నుండి తప్పుకుంటున్నాను." అని తేజ్‌పాల్ స్వయంగా తెహల్కా మేనేజింగ్ ఎడిటర్ సోమా చౌధరికి ఈమెయిల్ పంపి వ్యవహారం అంతటితో ముగించాననుకున్నాడు. కానీ బాధితురాలైన యువజర్నలిస్టు అంతటితో వదిలిపెట్టలేదు. చివరకు రేప్ చేశాడంటూ పోలీసులు 2013 నవంబరులో తేజ్‌పాల్‌ను అరెస్టు చేసి జైల్లో పెట్టారు. ఇప్పటిదాకా బెయిల్ కూడా దొరకలేదు. అతనిపై కేసు పెట్టడానికి పోలీసులకు ఉపయోగపడినది – క్రిమినల్ లా ఎమెండ్‌మెంట్, 2013! గత ఏప్రిల్ నుండే అమలులోకి వచ్చిన యీ చట్టంలోని ఏడు సెక్షన్ల కింద పోలీసులు కేసు పెట్టారు. వీటి ప్రకారం నిందితుడికి గరిష్టంగా పదేళ్ల శిక్ష పడవచ్చని తెలిశాక, యీ చట్టం యింత కఠినంగా, యింత ఏకపక్షంగా వుందా? అని అందరూ వులిక్కిపడ్డారు. ఎందుకంటే రేప్ అంటే మనందరం అనుకునే సామాన్యార్థం ఒకటుంది. స్త్రీ మర్మాంగంలో ఆమె కిష్టం లేకుండా పురుషుడు తన అంగాన్ని ప్రవేశపెట్టి కొద్దిసేపు కదలికలు సాగితేనే రేప్ అని అనుకుంటాం. ఆ రోజు ఆ లిఫ్టులో ఒకటిన్నర నిమిషాల్లో తేజ్‌పాల్ అంత దూరం పోలేదని అందరికీ తెలుసు. ఎక్కడో ఒత్తడమో, గిల్లడమో జరిగి వుంటుంది, దానికి ఆ అమ్మాయి అభ్యంతర పెట్టి వుంటుంది అని వూహిస్తాం. ఆ మాత్రానికి పదేళ్ల జైలు శిక్షా? ఇదెక్కడి చట్టంరా బాబూ అని విస్తుపోతాం.

పాఠకులకు కలిగే యీ సందేహాలను నివృత్తి చేయడానికి "ఔట్‌లుక్" వారపత్రిక తన మార్చి 3 వ సంచికలో అనూరాధా రామన్ రాసిన కథనాన్ని ప్రచురించింది. కొత్త చట్టం ప్రకారం స్త్రీకి తన శరీరంపై సర్వహక్కులు వుంటాయి. దానిలో ఏ భాగంలో నైనా సరే, (మర్మాంగమే కానక్కరలేదు) ఎవరైనా తమ పురుషాంగం చేతకానీ, మరే అంగం చేతకానీ, లేక వస్తువు చేతకానీ ఆమె అనుమతి లేకుండా ఆక్రమిస్తే (ఇన్వేజన్) దాన్ని రేప్‌గా పరిగణించాలి. దానికి జరిమానాతో బాటు ఏడేళ్ల శిక్ష (యావజ్జీవిత శిక్ష వేసేందుకు కూడా అవకాశం యిచ్చింది చట్టం). 'సెక్సువల్ హెరాస్‌మెంట్' కు మూడేళ్ల జైలు శిక్ష లేదా జరిమానా లేదా రెండూ పడతాయి. దాని నిర్వచనం ఏమిటంటే – మగవాడు ఆమెను స్పృశించినా, స్పృశించకుండా ఆమె నుండి సెక్సువల్ ఫేవర్ (లైంగిక అంగీకారం)కోసం ఒత్తిడి చేసినా, చొరవ తీసుకున్నా అది లైంగికపరమైన వేధింపేట! ఒత్తిడి చేశాడ, చొరవ తీసుకున్నాడా, కేవలం అడిగి చూశాడా – అన్నది తేల్చవలసినది అక్కడున్న మహిళ మాత్రమే. 'అబ్బే, ఆమె అప్పుడు ఒప్పుకుంది. తర్వాత మాట మార్చింది.' అని మగవాడు వాదిస్తే ఏం జరుగుతుంది? 'అతను చెప్పినది నాకు అర్థం కాలేదు' అనో 'దాని పరిణామాలు నేను వూహించలేదు' అనో ఆమె అందంటే యితని వాదన ఒప్పుకోరు. అంతేకాదు, అప్పుడు నేను తాగి వున్నాను అనో లేదా నన్ను చంపుతాననో, కొడతాననో బెదిరించి నా అనుమతి పొందాడు అనో ఆమె అంటే యితని వాదన చెల్లదు, శిక్ష తప్పదు. పదవిలో లేదా అధికారంలో వున్న వ్యక్తి తన కంటె తక్కువ హోదా (జూనియర్)లో వున్న మహిళతో పరస్పరాంగీకారంతో శృంగారంలో పాల్గొంటే – తమ పదవి వుపయోగించి అనుభవించినట్టుగా భావించి దాన్ని 'పవర్ రేప్' అన్నారు. దీనికి పదేళ్ల శిక్ష పడుతుంది.

ఇప్పటివరకు రేప్‌ను రుజువు చేయడం చాలా కష్టంగా వుండేది. 2011లో దేశంలో 15,423 రేప్ కేసులపై విచారణ జరిగితే 26% మందికి మాత్రమే శిక్ష పడింది. చట్టాల్లో లోపాలను సరిదిద్దుతున్నాం అనుకుంటూ యింత తీవ్రంగా దానికి మరమ్మత్తులు చేశారు. సెక్షన్ 354కి అదనంగా 354 (ఎ) అనే క్లాజ్ చేర్చారు. దాని ప్రకారం సెక్సువల్ ఫేవర్ కోసం బతిమాలినా, పోర్నోగ్రఫీ చూపినా, సరససంభాషణ జరిపినా, శృంగారపరమైన వ్యాఖ్యలు చేసినా కూడా నేరమే. మూడేళ్ల వరకు శిక్ష పడవచ్చు. అంగీకారం వుంటే ఏదైనా ఓకే, లేకపోతే ఏం చేసినా తప్పే అని గ్రహించాలి. అయితే అంగీకారానికి నిర్వచనం ఏమిటి? చట్టం ప్రకారం అంగీకారం నిర్ద్వంద్వంగా వుండాలిట. మగవాడు తన శరీరంలోకి చొరబడిపోతూ వుంటే ఆమె అడ్డుకోనంత మాత్రాన అంగీకారం యిచ్చినట్లు లెక్క కాదట. ఈ విధంగా చూస్తే 'వచ్చి నన్ను అనుభవించు' అని స్త్రీ లిఖితపూర్వకంగా రాసి యిస్తే తప్ప మగవాడు చొరవ తీసుకోకూడదు. అలా యిచ్చినా నన్ను బెదిరించి అలా రాయించుకున్నాడు అని ఆమె తర్వాత అంటే వీడు చచ్చేడే! చట్టం ఎంత కఠినంగా రూపొందిందో తేజ్‌పాల్ కేసు చూశాక అందరికీ తెలిసివచ్చింది. ఈ వ్యాసం చదివాక 'ఇంతకీ తేజ్‌పాల్ చేసినదేమిటి? అతనిపై యువజర్నలిస్టు చేసిన ఆరోపణలు ఏ మేరకు నిజం?' అన్న సందేహాలు కలగడం సహజం.

దీనికి సమాధానంగా అన్నట్టు "ఔట్‌లుక్" సరిగ్గా నెల్లాళ్లు పోయాక తన ఏప్రిల్ 7 సంచికలో మను జోసెఫ్ అనే జర్నలిస్టు రాసిన "వాట్ ద ఎలివేటర్ సా" అనే వ్యాసం ప్రచురించింది. తేజ్‌పాల్ వ్యవహారంలో జరిగినదేమిటో వాళ్లిద్దరికే తెలుసు. ఒక హొటల్ లిఫ్టులో రాత్రి 11.30 సమయంలో తామిద్దరే వున్నపుడు తనను (చట్టంలోని నిర్వచనం రీత్యా) 'రేప్' చేశాడని ఆమె అభియోగం. లిఫ్టులో సిసి కెమెరాలు వుంటే జరిగినదానికి సాక్ష్యం వుండేది. కానీ అక్కడ కెమెరాలు లేవు. లిఫ్టులు ఆగే లాబీల్లో వున్నాయి. లిఫ్టులోకి వెళ్లేటప్పుడు, లిఫ్టునుండి వచ్చేటప్పుడు మనుష్యుల హావభావాలు రికార్డయ్యాయి. వాటిని బట్టి లోపల ఏం జరిగిందో కొంత వూహించవచ్చు. ఆ కెమెరాల ఫుటేజి తనను నిర్దోషిగా చూపుతుందని తేజ్‌పాల్ ఆశ. కానీ ప్రాసిక్యూషన్‌వారు దాన్ని బయటపెట్టటం లేదు. ఈ జర్నలిస్టు వాటిని చూసి వున్నట్టున్నాడు. చూసినట్టుగా రాస్తే కోర్టు వారు దండిస్తారని కాబోలు, అది స్పష్టంగా రాయకుండానే వాటిలో వున్న విషయాలన్నీ రాశాడు. ఆ ఫోటోలు పత్రికలో వేయకుండా వాటి ఆధారంగా రేఖాచిత్రాలు వేశారు. 5 పేజీల ఆ సుదీర్ఘ వ్యాసం చదివితే నాకు అనిపించిందేమిటంటే – 'ఆమె తేజ్‌పాల్‌కు కాస్త 'లిఫ్ట్' యిచ్చింది, అతను వెకిలి చేష్టలు చేశాడు, ఆమెకు కోపం వచ్చింది, జరిగినదాన్ని ఆమె ఎక్కువ చేసి యాగీ చేస్తోంది' అని.

అతన్ని యిరికించే ప్రయత్నంలో ఆమె కొన్ని పొరబాట్లు చేసిందని కూడా గ్రహించవచ్చు. నవంబరు 7 రాత్రి 11.30 సమయంలో ఆమెతో ఒంటరిగా లిఫ్టులో వెళ్లింది. అతను అసభ్యకరమైన చేష్టలు చేశాడు. మర్నాడు మళ్లీ అతనితోనే లిఫ్టులో ఒంటరిగా వెళ్లడం వింతగా లేదా? ఆ హొటల్ బిల్డింగులో వున్నది రెండంతస్తులే. లిఫ్టులో వెళితే 14 సెకన్లే పడుతుంది. మీరు లిఫ్టులో వెళ్లండి సార్, నేను మెట్లెక్కి వస్తానవచ్చు. లేదా ఎవరితోనో సెల్‌ఫోన్లో మాట్లాడుతున్నట్టు నటిస్తూ తర్వాతి సారి వెళ్లవచ్చు. మొదటిరోజు రాత్రే లిఫ్టులోంచి బయటకు వచ్చిన తర్వాత తేజ్‌పాల్ తనను హెరాస్ చేస్తున్నాడని తన సహోద్యోగులతో చెప్పుకుందామె. అలాటప్పుడు మర్నాడే మళ్లీ ఎలా సాహసించింది? తేజ్‌పాల్ తను లిఫ్టులోంచి బయటకు నడుస్తూ వుంటే అతను సడన్‌గా తనను మళ్లీ లిఫ్టులోకి వెనక్కి గుంజాడని చెప్పింది. కెమెరాల్లో చూస్తే అతని చేతిని ఆమె పట్టుకుని బయటకు వెళ్తున్నట్టు వుంది. అతను తనను బలాత్కారం చేశాక లిఫ్టు బయటకు పరిగెట్టుకుంటూ వెళ్లానంది. కెమెరాల్లో చూస్తే ఆమె తాపీగా నడుస్తూ బయటకు వచ్చినట్టుంది. మర్నాడు తేజ్‌పాల్ తనను లిఫ్టులోకి లాగాడని చెప్పింది. కానీ కెమెరాల్లో చూస్తే అతను అప్పటికే లిఫ్టులో వున్నాడు. ఈమె పరిగెట్టుకుంటూ దానిలోకి వెళుతోంది. ఆమె నవంబరులో సోమా చౌధురికి పంపిన ఫిర్యాదుకి, పది రోజులు పోయాక మేజిస్ట్రేటు ముందు రికార్డు చేసిన వాంగ్మూలానికి తేడాలున్నాయి. ఈ తేడాలు ఎత్తి చూపితే ప్రాసిక్యూషన్ వారు 'ఒక రేప్ బాధితురాలికి కలిగే మానసిక ఆందోళనలో యిలాటి తొట్రుపాట్లు సహజమే' అనేశారు. అవతలి వ్యక్తికి పదేళ్ల జైలు శిక్ష పడుతూంటే ఎంత జాగ్రత్తగా ఫిర్యాదు చేయాలి!

ఇంతకీ తేజ్‌పాల్ తనపై చేసిన అత్యాచారం గురించి ఆమె మాటల్లో –' లిఫ్టులో అతను ముద్దులు పెట్టుకున్నాడు. నేను వద్దన్నా వినలేదు. ఆ తర్వాత అతను మోకాళ్ల మీద కూర్చుని, నా స్కర్టు ఎత్తిపట్టుకుని అండర్‌వేర్ కిందకు లాగాడు. నా మర్మాంగాన్ని ముద్దాడబోయాడు. నేను వద్దువద్దని చెప్పాను. అప్పుడు అతను తన వేళ్లను దానిలోకి జొనపబోయాడు. నేను ఆపమని చెపుతూ అతన్ని వెనక్కి తోసేశాను.' ఇదంతా చేస్తూ వుంటే లిఫ్టు తలుపులు తెరుచుకోవా అన్న సందేహం వస్తుంది. తెరుచుకోకుండా లిఫ్టును 0,1,2 ఫ్లోర్ల మధ్య తిరిగేట్లా అతను చేశాట్ట. 'క్లోజ్' బటన్‌పై వేలు నొక్కి పెట్టి వుంచితేనే అది సాధ్యం. నిమిషన్నరం పాటు అలా తిరిగినట్లు సాక్ష్యం వుంది. అలా తిరగడానికి యీమె క్లోజ్ బటన్‌ను నొక్కి పెట్టి వుంచి సహకరించి వుండాలి. 'అబ్బే అతనే ఒక చేతితో బటన్లు నొక్కుతూన్నాడు' అంటోంది ఈమె. వద్దని పెనగులాడుతున్న స్త్రీ లాంగ్ స్కర్టు ఎత్తి అండర్‌వేర్ కిందకు లాగి ముద్దాడాలన్నా, వేలు పెట్టాలన్నా రెండు చేతులు కావాల్సిందే. అనేక చేతులున్న రావణాసురుడికి తప్ప మరెవరికీ యిలాటి పని అసాధ్యం. అంటే ఆ లిఫ్టు బటన్ యీమెయే ఒత్తి పట్టుకుని వుండవచ్చని తోస్తుంది. ఆమె యిచ్చిన తొలి రాతపూర్వకమైన ఫిర్యాదులో 'అతను నా అండర్‌వేర్ లాగి కింద పడేశాడు. లిఫ్టు ఆగగానే దాన్ని చేతిలోకి తీసుకుని బయటపడ్డాను.' అని రాసింది. ఆ సమయంలో ఆమె చేతిలో అండర్‌వేర్ కాదు కదా, ఏమీ లేనట్టు కెమెరా ఫుటేజి చూపింది. అది చూశాక ఆమె వాంగ్మూలం మార్చింది. 'ఐ పిక్డ్ అప్ అండర్‌వేర్' స్థానంలో 'ఐ పుల్డ్ అప్ (పైకి లాక్కున్నాను) అండర్‌వేర్' అని రాసింది. అయినా నిలబడిన ఒక స్త్రీ అండర్‌వేర్‌ను ఆమె సహకారం లేనిదే కాళ్లనుండి పూర్తిగా తొలగించి కింద పడేయడం సాధ్యమా?

తేజ్‌పాల్ చెప్తున్నదాని ప్రకారం – 7 వ తారీకు రాత్రి వాళ్లిద్దరూ సెకండ్ ఫ్లోర్ నుండి గ్రౌండ్ ఫ్లోర్‌కు వెళ్లాక కాస్సేపు బయటకు వెళ్లి, మళ్లీ లిఫ్టు ఎక్కేలోపున వాళ్లిద్దరి మధ్య సరససంభాషణ జరిగింది. దాని పర్యవసానంగానే అతను ఆమెకు 'ఫింగర్‌టిప్స్..' అంటూ ఎస్సెమ్మెస్ పంపాడు. ఆమె దాన్ని తన కొలీగ్స్‌కు చూపించి తేజ్‌పాల్ తనతో చేసినదానికి రుజువుగా చెప్పింది. ఇంత జరిగినా మర్నాడు అంటే 8 వ తారీకు రాత్రి అతనితో కలిసి లిఫ్టు ఎక్కింది. అతను ఎవరితోనో మాట్లాడుతూ వుంటే అతని కోసం వెయిట్ చేసి, మరీ లిఫ్టు ఎక్కింది. ఆ రోజు జరిగిన దాని గురించి ఆమె – 'అతను నన్ను మళ్లీ ముద్దాడసాగాడు. నా డ్రెస్సు పైకి ఎత్తాడు. నాకు కోపం వచ్చింది. నేను మెట్లమీదుగా వెళతాను అన్నాను. అంతలో లిఫ్టు ఆగింది. నేను బయటకు నడిచాను.' అంది. కెమెరాల ఫుటేజి చూసినా చిరాకు మొహంతో ఆమె లిఫ్టులోంచి బయటకు రావడం, వెనక్కాల అతను నెమ్మదిగా రావడం కనబడుతోంది. అంతలోనే లిఫ్టులోకి వెళ్లాడు. ఆమె లిఫ్టులోకి పరిగెట్టుకుంటూ వెళ్లింది. ఎందుకో ఆమే చెప్పాలి (అలక తీర్చడానికా?) అలా వెళ్లాక 'నేను కోపంగా వున్నానని గ్రహించి అతను నన్ను ముట్టుకోవడానికి భయపడ్డాడు. సరిగ్గా గ్రౌండ్ ఫ్లోర్‌లో లిఫ్టు ఆగే సమయానికి నా పిఱ్ఱలమీద చరిచాడు.' అని తన ఫిర్యాదులో రాసింది. కానీ కెమెరా ఫుటేజి ప్రకారం వాళ్లిద్దరూ ఆ లిఫ్టులో ఒకరికొకరు ఐదడుగుల దూరంలో నిలబడినట్లు స్పష్టంగా కనబడింది. ఇద్దరి మొహం మీద ప్రతిఫలించిన అశాంతిని కెమెరాలు బంధించాయి.

మొత్తం వ్యవహారం చూస్తే వాళ్లిద్దరి మధ్య మొదటిరోజు సరసం జరిగినా, మర్నాటికి విరసంగా మారిందని బోధపడుతుంది. ఆమె ఎందుకోగాని పగబట్టి కథ మార్చేస్తోంది. చట్టం చూడబోతే మగవాడికి పూర్తిగా వ్యతిరేకంగా వుంది. "ఔట్‌లుక్"లో యీ వ్యాసం వచ్చాక మను జోసెఫ్‌పై మహిళా సంఘాలు విరుచుకుపడ్డాయి. అతనితో బాటు యిటువంటి కథనమే వేసిన "ద సిటిజన్" అనే ఆన్‌లైన్ పత్రికపై కూడా. 'నెట్‌వర్క్ ఆఫ్ విమెన్ ఇన్ మీడియా' అనే సంస్థ యీ జర్నలిస్టులపై ప్రెస్ కౌన్సిల్‌కు, ఎడిటర్స్ గిల్డ్‌కు ఫిర్యాదు చేసింది. ఆ రెండు పత్రికలు క్షమాపణ చెప్పాలని వారి డిమాండు. తేజ్‌పాల్ యితరత్రా ఏమైనా అకృత్యాలు చేసి వుండవచ్చు, ఆర్థికనేరాలు చేసి వుండవచ్చు. కానీ యీ కేసులో వాస్తవం ఏమిటో బయటకు రావాలి కదా. చట్టం యింత కఠోరంగా వున్నపుడు నేరం జరిగిందని నిస్సందేహంగా రుజువు కావాలి. ప్రాసిక్యూషన్ వాదంలో లోపాలు వుండకూడదు. దాన్ని ప్రశ్నించినందుకు యీ జర్నలిస్టులపై నిందలు వేస్తున్నారు. ఈ చర్చలు తీవ్రంగా, లోతుగా జరిగితే దురుద్దేశంతో నిందలు వేసిన సందర్భాల్లో చట్టంలో

మగవారికి కూడా కొన్ని రక్షణలు కల్పించాలని కొందరికి తోస్తుందేమో! ఈ కథ వలన నీతి ఏమిటంటే – సరసాలాడే సరదా మగవారు తగ్గించుకుంటే మంచిది. ఏ క్షణంలో అది విరసంగా మారి జైలుకి దారి తీస్తుందో తెలియదు కాబట్టి! **– (సమాప్తం) ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 11** **ఎమ్బీయస్ : బంగారం స్మగ్లింగ్**

ఈ సబ్జక్ట్ పాతదే కానీ, గతనెల్లాళ్లగా హైదరాబాదు ఎయిర్‌పోర్టులో బంగారం స్మగుల్ చేస్తూ పట్టుబడిన కేసులు ఎన్నో వెలుగులోకి వచ్చాయి. గత మూణ్నెళ్లల్లో యీ ఎయిర్‌పోర్టు నుండే బంగారం అక్రమ రవాణా పెరిగిందని కస్టమ్స్ అధికారులు చెప్తున్నారు. చైనా మాఫియా, పాకిస్తాన్ ఏజంట్లతో కలిసి దక్షిణాది రాష్ట్రవాసుల ద్వారా భారత్‌లోకి బంగారం స్మగుల్ చేయిస్తోందని కథనాలు కూడా వెలువడ్డాయి. అధికారులు చెప్పే అంకెలు వాస్తవాలకు కడుదూరంగా వున్నాయని పరిశీలకులు అంటున్నారు. నెలకు మూడు టన్నుల బంగారం భారతదేశంలోకి అక్రమంగా వస్తోందని చిదంబరం గారన్నారు. వరల్డ్ గోల్డ్ కౌన్సిల్ వారు యీ అంచనా చాలా తక్కువనీ ఏడాదికి 150–200 టన్నుల బంగారం భారత్‌లోకి చొరబడుతోందని అంటున్నారు. 2012లో 871 కేసులు బుక్ చేశారు. పట్టుబడిన బంగారం విలువ 99 కోట్ల రూ.లు. 2 డిసెంబరు నాటికి 1131 కేసులు, బంగారం విలువ 320 కోట్ల రూ.లు. మన కస్టమ్స్ శాఖలో సిబ్బంది తక్కువ. ఉన్నవారిలో మహిళా యిన్‌స్పెక్టర్లు మరింత తక్కువ. మహిళా స్మగ్లర్లను తనిఖీ చేయడం యిబ్బంది అవుతోంది. భారతీయులకు బంగారంపై మోజు ఎక్కువ. ఆడా, మగా అందరూ వేసుకుంటారు. పైగా బ్లాక్‌మనీ దాచుకోవడానికి బంగారం అత్యంత సులభమైన సాధనం. మన స్వర్ణదాహాన్ని తీర్చడానికి భారత్‌లో దొరికే బంగారం ఏ మూలకూ చాలదు. అందువలన అన్ని దేశాల నుండి దిగుమతి చేసుకోవడానికి చూస్తాం. ఇలాటప్పుడు ప్రభుత్వం ఆచరణసాధ్యమైన విధానాలను రూపొందించి, స్మగ్లింగ్ జరగకుండా చేయాలి. కానీ అనేక తెలివితక్కువ విధానాలను రూపొందించిన యుపిఏ, మహామేధావి చిదంబరం గారి సలహామేరకు 2011లో బంగారంపై ఇంపోర్టు డ్యూటీ 2% వుంటే, దాన్ని 2013 నాటికి 10% చేశారు. పైగా రిజర్వు బ్యాంక్ చేత 2013 ఆగస్టులో ఆదేశాలు జారీ చేయించారు – ఎవరైనా బంగారు వర్తకులు ముడి బంగారాన్ని దిగుమతి చేసుకుంటే దానిలో 20% బంగారాన్ని ప్రాసెస్ చేసి మళ్లీ ఎగుమతి చేయాలని!

ఈ విధానాల వలన బంగారం స్మగ్లింగ్ విపరీతంగా పెరిగింది. గల్ఫ్‌లో మనవాళ్లు ఎంతోమంది పనిచేస్తూ వుంటారు. వాళ్లలో చాలామందికి ఉద్యోగాలు దొరికి వుండవు, దొరికినవి పోయి వుంటాయి. 'ఇండియాలో ఇంటికి వెళ్లి రావాలంటే రిటర్న్ టిక్కెట్ యిస్తాం, పైన లక్షో, రెండో ముట్టచెబుతాం. కిలోకి 30 వేల నుండి 50 వేల రూ.ల దాకా కమిషన్.' అని ఆశపెట్టి వాళ్లను స్మగ్లర్లగా మారుస్తున్నారు. గల్ఫ్‌లో కేరళీయులు అందునా ముస్లిములు ఎక్కువమంది కాబట్టి కేరళ యిలాటి స్మగ్లింగ్‌లో అగ్రస్థానంలో వుంది. కాసర్‌గోడ్, కోళికోడ్, మళప్పురం జిల్లాలోని 35 ఏళ్ల లోపున్న ముస్లిం యువకులు యీ కార్యకలాపాల్లో ఆరితేరడంతో యిలాటి స్మగ్లర్లను 'కాసర్‌గోడ్ గ్యాంగ్' గా వ్యవహరిస్తున్నారు. వారిపై ప్రత్యేకంగా కన్నువేసి వుంచుతున్నారు. కస్టమ్స్‌వారి కన్ను కప్పడానికి స్మగ్లర్లు అవలంబిస్తున్న కొత్తకొత్త విధానాలు వింటే వాళ్ల తెలివితేటలకు అబ్బురపడతాం. టీవీ సెట్లలో, లాప్‌టాప్‌ల్లో, మొబైల్ బ్యాటరీల్లో, ఎమర్జన్సీ ల్యాంపుల్లో, పెన్నుల్లో, బూట్లలో, బెల్టుల్లో బంగారం తేవడం ఎప్పణ్నుంచో వింటున్నాం. ఇప్పుడు బంగారాన్ని ఆక్వా రెజియా (ఒక పాలు నైట్రిక్ యాసిడ్, మూడు పాళ్లు హైడ్రోక్లోరిక్ యాసిడ్)లో కరిగించి దాన్ని కండోమ్స్‌లో నింపి, వాటన్నిటిని లిక్విడ్ డిటర్జెంట్ డబ్బాల్లోనో, డిష్ వాషింగ్ లిక్విడ్స్ డబ్బాల్లోనో పెట్టి తెచ్చేస్తున్నారు. కస్టమ్స్ వాళ్లు అడిగితే బట్టలుతికే ద్రవం తెచ్చుకున్నాం అంటున్నారు. ఈ మధ్య ఒకతను అలాగ పట్టుకుని వస్తూ వుంటే కస్టమ్స్‌వారి మెటల్ డిటెక్టర్ సిగ్నల్ యిచ్చింది. వెతికితే ఎక్కడా లోహపదార్థం కనబడలేదు. చివరకు ఒక్కోటీ తీసి చీల్చి చెండాడితే ద్రవరూపంలో వున్న 2 కిలోల బంగారం దొరికింది.

ఆ మధ్య మంగుళూరు ఎయిర్‌పోర్టులో కాఫీపొడితో కలిపి తెచ్చిన అరకిలో బంగారపు రజను దొరికింది. అరకిలో బంగారాన్ని ఖర్జూర గింజల్లా మార్చి ఖర్జూరాల్లో జొనిపి తెచ్చిన కేసు పుణెలో దొరికింది. ట్రాలీ హేండిల్‌లో బంగారం దాచాడు ఒక ప్రబుద్ధుడు. మరొక మేధావి బంగారంతో స్టేపుల్ పిన్స్ చేయించి, వాటిని తన సామాన్లు పెట్టిన అట్టపెట్టెలకు స్టేపుల్ చేయించాడు. వాటర్ ప్యూరిఫైయర్‌లో చేసిన వైరింగ్ 4 కిలోల బంగారంతో చేశారని బెంగుళూరు ఎయిర్‌పోర్టు కస్టమ్స్‌వారు కనుగొన్నారు. బంగారాన్ని పల్చగా రేకుల్లా చేయించి క్రేపు రిబ్బన్లలా పట్టుకుని వస్తూంటే కోచి అధికారులు పట్టుకున్నారు. లోదుస్తులకు బంగారు తీగలతో ఎంబ్రాయిడరీ చేయించి వేసుకుంటున్నారు. ఆ మధ్య ఒక గడ్డపాడి మీద అనుమానంతో కస్టమ్స్ అధికారి చాచి లెంపకాయ కొట్టాడు. అతని చేతికి గట్టిగా తగిలింది. ఏమిట్రా అని చూస్తే గడ్డంలో బంగారు తీగలు దాచాడు. కాసర్‌గోడ్‌లో ఓ టైలర్ 430 గ్రా.ల బంగారాన్ని 29 కాప్సూల్స్ రూపంలో మింగివేసి తెచ్చాడు. ఎయిర్‌పోర్టు నుండి అతను బయటపడ్డాడు కానీ బంగారం అతనిలోంచి బయటపడడానికి తిరస్కరించింది. అన్ని రకాల ప్రయత్నాలు చేశాక చివరకు కలోనోస్కోపీ చేసి బయటకు లాగారు. రూ.2 లక్షలకు ఆశపడి ప్రాణం మీదకు తెచ్చుకున్నాడు. ఇక ఆడవాళ్లయితే బురఖాల్లో ప్రత్యేకమైన జేబులు కుట్టించుకుని తెచ్చేస్తున్నారు. దుబాయి వెళ్లేటప్పుడు నకిలీ నగలు వేసుకుని వెళుతూ అవి అసలు సిసలు బంగారం అని ప్రకటిస్తున్నారు. అక్కడకు వెళ్లి అసలైనవి

దిగేసుకుని వస్తున్నారు.

ఇలా పట్టుబడిపోతూ వుంటే స్మగ్లర్లకు నష్టం కదాన్న అనుమానం వస్తుంది. అందుకే వాళ్లు ఎనిమిదేసి సభ్యుల సిండికేట్లగా ఏర్పడుతున్నారు. ఎవరైనా ఒకరి కాండిడేటు పట్టుబడి బంగారం పోతే, తక్కిన ఏడుగురు విజయవంతంగా బయటకు తేగలిగితే ఆ నష్టం దీనిద్వారా పూడ్చుకుంటారు. ఈ సారి ఒకరిది పోతే యింకోసారి యింకోరిది పోవచ్చు. ఒక విధమైన గ్రూపు ఇన్సూరెన్సు అన్నమాట. మొత్తం స్మగ్లింగ్‌లో 2-3% మాత్రమే పట్టుబడుతోందని ఒక అంచనా. ఇంత భారీ ఎత్తున స్మగ్లింగ్ జరుగుతోందంటే యీ ముఠాలకు మద్దతుగా ట్రావెల్ ఏజన్సీలు, విమాన సంస్థల సిబ్బంది, కస్టమ్స్ అధికారుల్లో కొందరు, ఎయిర్‌పోర్టులో సెక్యూరిటీ స్టాఫ్, రాజకీయనాయకులు.. అందరూ వున్నారని వూహించవచ్చు. వీరి వెనక్కాల న్యాయవాదులు రెడీగా వుంటారు. ఎవరైనా పట్టుబడిన గంటలోపు అడ్వకేట్ అక్కడ ప్రత్యక్షమవుతాడు. ఒక్కరోజు కస్టడీలో వుంటే చాలు బెయిల్ వచ్చేస్తోంది. చట్టం కూడా ఎంత బలహీనంగా వుందంటే - కోటి రూ.ల విలువైన బంగారం స్మగ్లింగ్ కేసులో మాత్రమే నాన్-బెయిలబుల్ అఫెన్సుగా చూస్తారు. పట్టుబడిన బంగారాన్ని కాస్త తక్కువగా చూపించి విలువ 99 లక్షలే అంటే, బెయిల్ వచ్చేస్తుంది. వ్యవహారాలు యింత ఘోరంగా వుంటే మన ఆర్థిక వ్యవస్థ ఎలా బాగు పడుతుంది? **- ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఏప్రిల్ 12-13 వీక్లీకై ఎమ్బీయస్ : మరో మహాకూటమి ప్రయోగమా?

2009 ఎన్నికలలో టిడిపి లెఫ్ట్ పార్టీలతో, తెరాసతో పొత్తు పెట్టుకుంది. తెలంగాణాలోనే తప్ప ఆంధ్రప్రాంతంలో పెద్దగా ప్రభావం చూపలేదు. లెఫ్ట్ పార్టీలకు, తెరాసకు తెలంగాణలోనే సీట్లు దక్కాయి. 2004లో కాంగ్రెసు యివే పార్టీలతో పొత్తు పెట్టుకుని విజయం సాధించింది కాబట్టి, తర్వాతిసారి తను ఆ పని చేయాలని టిడిపి అనుకుంది. కాంగ్రెసుతో పొత్తు పెట్టుకున్నపుడు పెద్దగా చికాకులు రాలేదు. అందరూ కలిసి విజయం సాధించేశారు. ఆ తర్వాత కొట్టుకున్నారు. కానీ 2009 ఎన్నికలలో పొత్తు అంటూనే మహాకూటమి భాగస్వాములు దారుణంగా ఒకరినొకరు వంచించుకున్నారు, నిందించుకున్నారు. కెసియార్ ఓ అర్ధరాత్రి మీడియాకు ఫోన్ చేసి పొత్తు కాన్సిల్ అనేసి పడుక్కున్నారు. మళ్లీ మర్నాడు రాజీ అన్నారు. కార్యకర్తలకు ఎలాటి సంకేతం వెళ్లి వుంటుంది? అవతలిపార్టీకై సీటు వదులుకున్నాం అంటూనే తమ పార్టీవారికి బి ఫారాలు యిచ్చిన యీ కూటమి వైయస్‌ను ఎదిరించగలుగుతుందాని అందరూ సందేహించారు. కానీ ఏం ఫర్వాలేదని మీడియా హామీ యిచ్చింది. మొదట్లో వున్న విభేదాలు సర్దుకుపోయాయని, ఆ తర్వాత కూటమి ఫెవికాల్ వేసినట్టు అతుక్కుపోయిందని, మహాకూటమి మహావిజయం సాధించడం తథ్యమని హోరెత్తించేసింది. పత్రికలు, వెబ్‌సైట్లు మాత్రమే చదివినవారు ఆ కూటమి అధికారంలోకి వచ్చి తీరుతుందని చాలా నమ్మకాలు పెట్టుకున్నారు.

తీరా చూస్తే ఫలితాలు మరోలా వచ్చాయి. ఒంటరిగా పోటీ చేసిన కాంగ్రెసుకు తెలంగాణాలో అందరి కంటె ఎక్కువ సీట్లు వచ్చాయి. దాదాపు 45% సీట్లు వారివే. దీనికంతా కారణం తెరాస అని టిడిపి, టిడిపి అని తెరాస తిట్టిపోసుకున్నాయి. తెరాసతో పొత్తు పెట్టుకోవడం తను చేసిన ఘోరతప్పిదం అని చంద్రబాబు ప్రకటించారు. ఇప్పుడు యీ ఎన్నికలలో మరో ప్రహసనం ప్రారంభమైంది. బిజెపితో పొత్తు పెట్టుకోవడం ఘోరాతిఘోరమైన తప్పిదం, జన్మలో మళ్లీ అలాటి పని చేయను అని భీష్మప్రతిజ్ఞ చేసిన చంద్రబాబు మళ్లీ బిజెపితో జతకట్టారు. పార్టీలు ఇలా మాట మార్చడం వింతేమీ కాదు. శాశ్వతమిత్రులు, శాశ్వత శత్రువులు వుండరని ప్రతీ రాజకీయనాయకుడు నొక్కి వక్కాణిస్తాడు. ఏం చేసినా ప్రజల బాగుకోసమే, దేశసంక్షేమం కోసమే చేస్తున్నాం కాబట్టి, స్వప్రయోజనాలను పక్కు పెడుతున్నాం కాబట్టి మీరు అలాటివి ఎత్తి చూపకండి అని సుతారంగా మందలిస్తారు. మాట మార్చే అవకాశం, అవసరం వుంటాయన్న ముందుచూపు వున్నపుడు మరీ అంత భీషణప్రకటనలు చేయకుండా వుంటే పోయేది కదా! ఇప్పుడు బిజెపితో ఎందుకు చేతులు కలుపుతున్నట్లు? మోదీని పార్టీలోంచి తీసేశారా? లేదే! 2002 కంటె యిప్పుడు మహా పటిష్టమైన స్థితిలో వున్నాడాయన. ఇప్పుడు ఆయనను కేవలం పరిపాలనాదక్షుడిగానే మనం చూడాలని టిడిపి కోరిక. టిడిపికి జగన్ అవినీతి కనబడినట్లు, ఎడ్యూరప్ప అవినీతి కనబడదు. గాలి జనార్దనరెడ్డికి సన్నిహితుడంటూ జగన్‌ను దునుమాడుతున్న టిడిపికి అదే వ్యక్తికి స్నేహితుడైన, భాగస్వామి ఐన శ్రీరాములును పార్టీలో చేర్చుకున్న బిజెపి ప్రవర్తన ఎబ్బెట్టుగా కనబడదు.

ఇప్పుడు సిద్ధాంతాల గురించి రాద్ధాంతాలు చేసే సమయం కాదు. ఒకప్పుడు హరియాణాలో నాయకుల కప్పదాట్లు వినేవాళ్లం. ఇప్పుడు యిక్కడే చూస్తున్నాం. ఎవరు ఏ పార్టీలో వున్నారో తెలియకుండా పోయింది. వందలాది మంది పార్టీలు ఫిరాయిస్తున్నారు. సిపిఎం వాళ్లు తమ అభ్యర్థులు లేని చోట తెరాసకు మద్దతు యిస్తాననడం యింకా వింతగా వుంది. నోముల నర్సింహయ్య తెరాసకు డిఫెక్ట్ అయ్యాక ఏం చేస్తారో వేచి చూడాలి. చిత్తూరు జిల్లాకు చెందిన సిపిఐ నారాయణ తన పార్లమెంటు సీటుకోసం తన కులస్తులు ఎక్కువగా వున్నారని ఖమ్మం రావడం దేనికి? అనుక్షణం తిట్టే కాంగ్రెసు మద్దతుకోసం వెంపర్లాడి వాళ్లతో పొత్తు పెట్టుకోవడం ఎంత హేయం! నిత్యం నీతులు వల్లించే నారాయణ వంటి నాయకుడే ఇలా వుండడంతో సిపిఐలోని యితర ఎమ్మెల్యేలు కూడా సీట్లకోసం తెరాసలోకి వెళ్లిపోతున్నారు. పైగా కాంగ్రెసు సిపిఐకు ఎలాట్ చేసిన సీటులో కూడా అభ్యర్థిని ప్రకటించి తికమక పెట్టింది. ఇలాటి పరిస్థితిని మరింత గందరగోళపరుస్తున్నది - బిజెపి-టిడిపి పొత్తు. స్థానిక కార్యకర్తలు వద్దువద్దంటున్నా జాతీయస్థాయిలో బిజెపి నాయకులను చంద్రబాబు ఒప్పించగలిగారు. అంతో యింతో క్రమశిక్షణ గల బిజెపిలో కూడా కేంద్రనాయకులు రాష్ట్ర నాయకులను

అదుపు చేసే పరిస్థితి దాటిపోయింది. టిడిపి, బిజెపి శ్రేణుల్లో అడుగడుగునా నిరసనలే. ఇలాటప్పుడు పొత్తు కోసం వెంపర్లాట ఎందుకు అంటే 'కాంగ్రెసు-తెరాసల కూటమిని దెబ్బకొట్టడానికి' అంటున్నారు.

వాటి మధ్య ఎన్నికల ముందు పొత్తు కుదరలేదు. తర్వాత కుదురుతుందో లేదో ఎవరూ చెప్పలేరు. కెసియార్‌లకు సిద్ధాంతాలపై పట్టింపు లేదు. బిజెపిపై వ్యతిరేకత లేదు. కేంద్రంలో ఎన్‌డిఏ ఏర్పడితే మద్దతు యివ్వడానికి రెడీ అవుతారు. ఇస్తే పుచ్చుకోవడానికి బిజెపి వెనకాడదు. టిడిపి వాళ్లు ఫీలవుతారంటూ అడ్డు చెప్పదు. తెలంగాణలో టిడిపి కంటె తెరాసకు ఎక్కువ సీట్లు వస్తే (రావడానికే ఛాన్సుంది) మొహమాటానికి పోయి మద్దతు వద్దంటారా? ఇలాటి పరిస్థితిలో తెరాసను ఆపడానికి... అంటూ టిడిపి యీ పొత్తుకోసం తన కార్యకర్తలను వేదనకు గురి చేయడం దేనికి? ఇదే ప్రశ్న బిజెపి కూడా యింకోలా వేసుకోవాలి. 'టిడిపి విభజనకు వ్యతిరేకి. చివరిదాకా ఆపాలని చూసింది' అని తాము మనసారా నమ్మి, అదే ప్రచారం చేసి, యిప్పుడు వారిని పక్కన బెట్టుకుని ప్రచారానికి ఎలా వెళతామని కార్యకర్తలు అడుగుతూంటే నాయకులు ఏం సమాధానం చెప్తారు? విభజనకోసం విపరీతంగా శ్రమించిన కిషన్ రెడ్డి యీ రోజు పొత్తు వ్యతిరేకిస్తున్నారంటే వ్యతిరేకించరా? 7 జిల్లాల అధ్యక్షుల చేత తిరుగుబాటు చేయించారంటే చేయించరా?

'ఇలా యిలా ఆలోచించకూడదు, పార్టీ ప్రయోజనాల ద ృష్ట్యా పొత్తు ఆవశ్యకం' అనుకుంటే అది కుదిరేట్లు శాయశక్తులా ప్రయత్నించాలి. ఆ విషయంలో టిడిపి, బిజెపి రెండూ దారుణంగా విఫలం చెందాయి. బిజెపి 60 అసెంబ్లీ సీట్లు, 9 పార్లమెంటు సీట్ల దగ్గర బేరం మొదలుపెట్టింది. ఇప్పటి అసెంబ్లీలో, పార్లమెంటులో వాళ్లకున్న సీట్లెన్ని? 4-0. అక్కణ్నుంచి ఏం చేస్తే యీ స్థాయికి పెరుగుతాయి? మాట్లాడితే మోదీ ప్రభంజనం అంటారు. మోదీ గురించి పట్టణప్రాంతాల్లో కొంత తెలిసి వుంటుంది తప్ప గ్రామీణప్రాంతాల దాకా ఎక్కడ పాకింది? ఎన్ని ఓట్లు పడతాయి? తెలంగాణ సెంటిమెంటు అని మరొకటి చేరుస్తారు. ఆ సెంటిమెంటు ఎన్ని పార్టీలకు పని చేస్తుంది చెప్పండి. ఉద్యమం చేశామంటూ తెరాస అదే అంటుంది, బిల్లు పాస్ చేశామంటూ కాంగ్రెసు అదే అంటుంది, మద్దతిచ్చాం అంటూ బిజెపి అదే అంటుంది, ఆరేళ్ల క్రితమే లేఖ యిచ్చాం కాబట్టి అని టిడిపి కూడా అదే అంటుంది. మధ్యలో సిపిఐ కూడా నేనూ వున్నానంటుంది. తెలంగాణ ఓటరు తన ఓటును ఐదు ముక్కలు చేసి తలా ఒక ముక్కా వెయ్యాలి. బిజెపి తన బలాన్ని విపరీతంగా అంచనా వేసుకుందని ఎవరికైనా అనిపిస్తుంది.

ఇక టిడిపి - పార్టీ నిర్మాణ వ్యవస్థ, బిసిల సపోర్టు విషయంలో తెలంగాణలో టిడిపికి ఎదురు లేదనే అందరూ అంటారు. కానీ తెలంగాణ సమస్య వచ్చిన దగ్గర్నుంచి టిడిపి భాగ్యరేఖ వక్రిస్తూ వచ్చింది. 2004లో ఓడిపోయింది. ప్రత్యేక తెలంగాణకు సై అన్నా 2009లో ఓడిపోయింది. తర్వాత వచ్చిన ప్రతీ ఉపయెన్నికలో ఓడిపోయింది. డిపాజిట్లు కోల్పోయింది. నాయకుల్నీ కోల్పోయింది. టిడిపి విడిచి తెరాసలో చేరినవారిని ఓటర్లు అఖండమైన మెజారిటీతో గెలిపించారు. టి-టిడిపి నాయకులు కెసియార్‌ను బండబూతులు తిట్టినా ఓటర్లు ఖాతరు చేయలేదు. విభజన జరిగినా, జరగకపోయినా యీ సారి ఎన్నికలలో టిడిపికి తెలంగాణలో ఛాన్సు లేదు అనుకునే సమయంలో విభజన బిల్లు వచ్చింది. 'సీమాంధ్రులకు సమన్యాయం దక్కలేదు' అనే జండా పట్టుకుని బాబు ఢిల్లీలో తెగ తిరగడంతో, యీయన ఏదో ఒక పేరుతో విభజన అడ్డుకోవడానికి ప్రయత్నించాడన్న భావం వేర్పాటువాదుల్లో కలిగిందనేది నిర్వివాదాంశం. వారి సంఖ్య ఎంత అనేది యిప్పుడు తెలియదు కానీ యీసారి తెలంగాణలో టిడిపి అధికారంలోకి వస్తుందని కాని, గణనీయమైన సీట్లు గెలుచుకుంటుందని గాని ఎవరూ అనుకోవడం లేదు. అందుకే ఆయన 'బిసి ముఖ్యమంత్రి' అనగానే 'గాలికి పోయే పేలపిండి క ృష్ణార్పణం' అన్నట్టుందని వెక్కిరించారు. తన పార్టీలో బిసి నాయకులు ఎవరూ లేరన్నట్టు క ృష్ణయ్యను పార్టీలో చేర్చుకోవడం కానీ, బహుశా ఆయనే సిఎం కాండిడేటు అన్న సంకేతాలు పంపడం కానీ చూస్తే తెలంగాణపై ఆశలు విడిచినట్లే కనబడింది.

ఇలాటి పరిస్థితుల్లో బిజెపితో పొత్తు కుదిరే అవకాశం కనబడినప్పుడు అయినకాడికి రాజీ పడకుండా సీట్ల సంఖ్య వద్ద తీవ్రంగా బేరాలాడడం విస్మయం కొలుపుతోంది. బిజెపికి 45 ఎసెంబ్లీ సీట్లు, 8 పార్లమెంటు సీట్లు చాలని టిడిపి అభిప్రాయపడింది. అంటే 74 ఎసెంబ్లీ సీట్లు, 9 పార్లమెంటు సీట్లు తమకు కావాలన్నమాట. '45 కంటె ఎక్కువ సీట్లు బిజెపికి యిస్తే వాళ్లు గెలవలేక, మా ప్రత్యర్థుల విజయానికి దోహదపడతారు. 2009లో తెరాసతో యిలాగే జరిగింది' అని టిడిపి నాయకులు వాదిస్తున్నారు. ఆశాభావంతో వుండడం మనిషికి అవసరం, నాయకుడికి మరీ అవసరం. తనను తాను నమ్మించుకుంటూ, కార్యకర్తలను ఉత్సాహపరుస్తూ వుండాలి. అలా అని మరీ మోతాదు మించితే నేల విడిచి సాము చేసినట్లు అవుతుంది. గతంలో మహా కూటమి విషయంలో యిదే జరిగింది. తెలంగాణ తెచ్చిన సెంటిమెంటు వర్కవుట్ అవుతుందనుకుంటే తెరాస, కాంగ్రెసు లాభపడతాయి. ఎవరికి వారే ఆ లాభం తమకు చేకూరుతుందని అంచనా వేసుకున్నారు కాబట్టి, తెరాస-కాంగ్రెసు పొత్తు కుదరలేదు. అది అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ క్రెడిట్ ఏమీ లేని టిడిపికి, బిజెపికి యింతింత పట్టుదలలు అవసరమా? గతంలో కన్నా మేం యిప్పుడు బలపడ్డాం అని చెప్పుకుంటూనే 'ఫలానా సీటు మాకు వద్దు, మీరు తీసుకోండి' అంటూ అవతలివాళ్లకు తోసేయడం ఏమిటి? అంటే గెలిచే సీట్లు కొన్నే! అవీ తెలంగాణ సెంటిమెంటు బలంగా వున్న నియోజకవర్గాలే అని యిద్దరికీ తెలుసన్నమాట. వాటిని సమానంగానో, మరో లాగానో పంచుకుని, యితర సీట్లను ఎదుటివాళ్లకు యివ్వడంలో ఉదారంగా వ్యవహరిస్తే పోయేది కదా! అలా కాకుండా 45 అనీ, 50 అనీ, ఫైనల్‌గా 47 అనీ... యిలాటి చర్చలన్నీ బయటకు వస్తే కార్యకర్తలు కలిసి ఎలా పనిచేయగలుగుతారు?

వీళ్ల ఐక్యతను చెడగొట్టడానికి కెసియార్ ఎలాగూ వున్నారు. తెలంగాణలో పోటీ చేస్తున్న పార్టీలు ఉద్యమంలోనైనా ఎప్పుడో

ఒకప్పుడైనా కలిసి పని చేశాయి. మొదటినుండీ ఉప్పూ, నిప్పుగా వున్న పార్టీలు తెరాస-టిడిపిలు. టి-జాక్ నుండి టిడిపినుండి మెడపట్టుకుని గెంటేదాకా కెసియార్ నిద్రపోలేదు. వీలైతే ఒంటరిగా, లేకపోతే తెరాసతో కలిసి వెళదాం అనే భావన రాష్ట్ర బిజెపి నాయకుల్లో చాలామందికి వుంది. 'చంద్రబాబు నాయుడు, వెంకయ్య నాయుడు కలిసి యీ పొత్తు మీ నెత్తిపై రుద్దారు చూసుకోండి. ఇదంతా ఆంధ్ర నాయకత్వం. ఇద్దరిదీ ఒకటే కులం.' అని కెసియార్ బిజెపి కార్యకర్తలను కిర్రెక్కిస్తున్నారు. తెలంగాణ రాజకీయరంగంలో ఆయన 'బుల్ యిన్ చైనా షాప్'లా తయారయ్యారు. ఎవరి మధ్యా పొత్తు కుదరనీయటం లేదు. విలీనం అనీ, పొత్తు అనీ కాంగ్రెసు నాయకులను కన్‌ఫ్యూజ్ చేసి, చివరిదాకా ఏదీ తేల్చకుండా ఏడిపించారకు. టిడిపి నుండి, కాంగ్రెసు నుండి, సిపిఐ నుండి.. అన్ని పార్టీల నుండి తన పార్టీలోకి ఫిరాయింపులను ప్రోత్సహించి అందరి ఆగ్రహాన్ని మూటగట్టుకున్నారు. ఆయనపై కోపంతో కాంగ్రెసు కూడా కొందర్ని తమవైపు లాక్కుంది. దానితో అప్పటిదాకా జండా మోస్తూ వచ్చిన కార్యకర్తలకు ఆశాభంగం కలిగి తిరగబడుతున్నారు. అన్ని పార్టీల్లో యిదే పరిస్థితి.

ఈ గందరగోళంలో టిడిపి కొంతైనా పుంజుకుంటుందేమో, అది జరగకూడదని కెసియార్ కోరుకుంటున్నట్లు కనబడుతుంది. రేపు తమ అధికారంలోకి వచ్చాక యిప్పుడిస్తున్న హామీలు నెరవేర్చలేనపుడు ప్రభుత్వవ్యతిరేక ఆందోళనలు చేపట్టే సత్తా గల కార్యకర్తలు టిడిపికి వున్నారు. సీమాంధ్రలో టిడిపికి ఛాన్సుంది అంటున్నారు కాబట్టి, అక్కడ బలపడితే కొంతకాలానికి ఈ ఆందోళనల ద్వారా 2019 నాటికి యిక్కడా మళ్లీ ఒక ఫోర్స్‌గా ఎదగవచ్చు, ఎప్పటికైనా తమకు పోటీ రావచ్చు అనే అంచనా ఆయనది. ఇప్పుడే సాధ్యమైనంత అణిచేస్తే, యిక్కడెలాగూ లేదు కదాని నాయకత్వం సీమాంధ్రకు తరలిపోతే, ఒక బలమైన శత్రువు తొలగిపోయినట్లే కదా! ఈ వ్యూహంతో వున్న కెసియార్ బిజెపి-టిడిపి పొత్తు సవ్యంగా జరగకుండా సాధ్యమైనంత కృషి చేయవచ్చు. తాము ఓడిపోతామన్న భయం వున్నచోట క్షేత్రస్థాయిలో బిజెపికి లోపాయికారీ మద్దతు యిచ్చి వారిని ఆకట్టుకోవచ్చు. ప్రతిగా టిడిపికి బిజెపి ఓట్లు బదిలీ కాకుండా చేయాలన్న షరతు విధించవచ్చు. ఈ విధంగా చూస్తే తెలంగాణలో బిజెపి-టిడిపి పొత్తు మరో మహాకూటమి ప్రయోగం కాబోతోందనిపిస్తోంది. **- ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 14-15 వీక్లీకై** **ఎమ్బీయస్ : కోస్తా వాళ్లకు సెంటిమెంట్లు వుండవా?**

సీమాంధ్రలో టిడిపిలోకి పార్టీ ఫిరాయింపులు జోరుగా సాగుతున్నాయి. అక్కడ టిడిపి గెలుపు తథ్యం అని నాయకులు అనుకుంటున్నారు. అన్ని వేళలా నాయకులు ప్రజల నాడిని పట్టుకోగలరని అనుకోవడానికి లేదు. ఎమర్జన్సీ ముగిసిన తర్వాత 1978 ఎసెంబ్లీ ఎన్నికల వేళ నాయకులు యిలాగే జనతా పార్టీలోకి, వెంగళరావు (బ్రహ్మానందరెడ్డి) కాంగ్రెసులోకి వెళ్లిపోయారు. ఇందిరా కాంగ్రెసుకి అభ్యర్థులే దొరకలేదు. ఇందిరా గాంధీ, చెన్నారెడ్డి అప్పటిదాకా తమ చుట్టూ తిరిగిన కాంగ్రెసు నాయకులను పలకరించబోతే వాళ్లు మొహాలు తప్పుకు తిరిగారు. ఎదురుపడితే టిక్కెట్టు చేతిలో పెడతారేమోనన్న భయం చేత! అనామకులకు టిక్కెట్లు యిచ్చారు. నాయకుల తీరు యిలా వున్నా ప్రజలు ఇందిరా కాంగ్రెసుకు ఓట్లేశారు. మెజారిటీ సాధించి సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసింది. 1982లో ఎన్టీయార్ పార్టీ పెట్టినపుడు నాయకులు పెద్దగా చేరలేదు. సినిమా యాక్టరు కాబట్టి ప్రజలు చూడడానికి వస్తున్నారు అనుకున్నారు. కొత్తవాళ్లకు టిక్కెట్లు దక్కాయి. మూడింట రెండువంతుల మెజారిటీతో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చింది.

ఇవన్నీ మీడియాలోని వ్యక్తులకు గుర్తున్నాయో లేదో తెలియదు కానీ యిప్పుడు కొందరు కాంగ్రెసు నాయకులు టిడిపివైపు వెళ్లడంతో కోస్తాలో టిడిపి గెలుపు తథ్యం అని తీర్మానిస్తున్నారు. దానికి కారణం కూడా చెప్తున్నారు - 'సీమాంధ్రులు లోకజ్ఞానం కలవారు. జరిగిపోయినదానికి వగస్తూ కూర్చోరు. జరిగిందేదో జరిగింది, ముందు జరగాల్సింది చూడాలి. మనకు కావలసినది అభివృద్ధి! అది చేయగల సమర్థుడు బాబు ఒక్కడే అని వాళ్లు నమ్ముతున్నారు. బాబును చూసే తెలుగు భాషలో సమర్థుడు అనే పదం పుట్టిందని వాళ్లకు తెలుసు. ఆయన వలన తప్ప సీమాంధ్ర బాగుపడడం కల్ల అని ఏ పసిపాపనడిగినా చెపుతుంది.' - యిదీ మీడియా ధోరణి. ఎడిట్ పేజీ వ్యాసాల్లో, కథనాల్లో, వ్యాఖ్యల్లో, టీవీ చర్చల్లో, టీవీ కథనాల్లో ఎక్కడ చూసినా యిదే వల్లిస్తున్నారు. ఇదంతా నిజమా? ఈ లెక్క ప్రకారం సీమాంధ్రలో టిడిపి స్వీప్ చేసేస్తూ వుంటే జగన్‌కి ఏమీ వుండదా? అనే ప్రశ్న సహజంగా ఉద్భవిస్తుంది. దానికి వీరి వద్ద వున్న సమాధానం ఏమిటంటే - 'జగన్‌కు రాయలసీమలోని 4 జిల్లాల్లో కాస్త పట్టుంది, కానీ తక్కిన 9 జిల్లాల్లో టిడిపిదే హవా. దానికి కూడా కారణం వుంది, సమైక్య సెంటిమెంటు కానీ మరో సెంటిమెంటు కానీ రాయలసీమలో అలాటి భావనలు ఎక్కువ. కోస్తా వాళ్లు బొత్తిగా వ్యాపారమనస్తత్వం కలవాళ్లు. ఆచరణవాదులు. మెటీరియలిస్టులు. సెంటిమెంట్లు జాన్తానై. రేపటి సంగతేమిటి? దానిలో మనకు దక్కే లాభం ఏమిటి? - యిదే వాళ్లకు లెక్క. ఆ విధంగా వాళ్లు చంద్రబాబునే ఆదరిస్తారు.' అని.

కోస్తాలో సమైక్య సెంటిమెంటు లేదా? మరి అక్కడ సమైక్య ఉద్యమం ఎవరు చేసినట్లు? ఏ రాజకీయ నాయకుడూ సారథ్యం వహించకుండా, ఏ పార్టీ విరాళాలు గుప్పించకుండా ప్రజలు స్వచ్ఛందంగా వీధుల్లోకి వచ్చి ఆందోళనలు చేశారే! కనీసం రెండు నెలలపాటు వంతుల వారీగా, వారంతట వారు చందాలు వేసుకుని, ప్రజలను పీడించకుండా, ఆత్మహత్యలు చేసుకుని జనాల్ని రెచ్చగొట్టకుండా, యితర ప్రాంతీయులను ఎవర్నీ కొట్టకుండా, తిట్టకుండా శాంతియుతంగా చేశారే! ఇది సెంటిమెంటు కాదా? అది చూశాకనే కదా కిరణ్ కుమార్ రెడ్డికి కాస్త ధైర్యం వచ్చి బహిరంగంగా తన నిరసన తెలిపినది! సీమాంధ్ర ప్రజలకు సెంటిమెంటు,

చట్టుబండలూ ఏమీ లేవనే తప్పుడు అంచనాలు వేసుకునే అక్కడి నాయకులు ఢిల్లీలో 'ఏం ఫర్వాలేదు, మమ్మల్ని చీల్చేయండి' అని చెప్పారు. దానికి గాను ఏమేం లాభాలు పొందారో జైరాం రమేశ్‌ను అడిగితే చెప్తారు! రాజీనామా చేయగానే కావూరి గురించి కాస్త చెప్పారు. వాళ్ల అబ్బాయి గురించి చెప్పబోయి ఆపేశారు. పురంధరేశ్వరి గురించి కొంత చెప్పారు. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ కాంగ్రెసు నుండి దూరమైనవారి కథలన్నీ చెప్తారేమో! ఈ కథలు వింటే కాంగ్రెసులో వుండిపోయిన వారి కథలు వూహించుకోగలుగుతాం. దాసరి 'బ్రోకర్' కథలు చెప్తానన్నారు. తమ స్వార్థం కోసం యిలా అమ్ముడుపోతూ, ప్రజలు పట్టించుకోరు అనే ధైర్యంతోనే విభజనకు మద్దతిచ్చిన నాయకులు సమైక్య ఆందోళన చూసి తెల్లబోయారు. అప్పటికే వాళ్లకు దక్కాల్సింది దక్కేసింది కాబట్టి వెనక్కి వెళ్లలేక, తలలూపారు.

'సీమాంధ్రలో జరిగిన ఉద్యమమంతా తెలుగుజాతి ఐక్యత కోసం కాదు, కేవలం హైదరాబాదుపై పట్టు పోతుందన్న భయంతోనే ..' అంటారా? ఓకే, అలా అనుకున్నా, తమకు ఫైనల్‌గా హైదరాబాదు విషయంలో జరిగిన నష్టానికి కోపం వుండదా? హైదరాబాదు ప్రత్యేక రాష్ట్రం కాలేదు, యుటీ కాలేదు, ఎచ్ఎండిఏ పరిధి వరకు ఉమ్మడి రాజధాని అంటే అదీ కాలేదు, హైదరాబాదు ఆదాయంలో వాటా అంటే అదీ దక్కలేదు. దానికి ప్రత్యామ్నాయంగా నష్టపరిహారం యివ్వాలంటే మొదటి ఏడాది మాత్రమే యిస్తానన్నారు. సెక్రటేరియట్‌లో, రాజధానిలోని కొన్ని కార్యాలయాల్లో అటెండర్ ఉద్యోగంతో సహా అన్ని వుద్యోగాలు రాష్ట్ర స్థాయి వుద్యోగాల కిందే లెక్క. రాష్ట్ర స్థాయి వుద్యోగాల్లో దేశంలోని ఏ యితర రాష్ట్రం నుండైనా వచ్చి పోటీపడి వుద్యోగం తెచ్చుకోవచ్చని దేశరాజ్యాంగం చెపుతోంది. ఆ స్థాయి వుద్యోగాల్లో తమ ప్రతిభతో సీమాంధ్రులు అనేకమంది ఉద్యోగాలు సంపాదించుకున్నారు. వారిని తొలగించడం, తరిమివేయడం దేశ రాజ్యాంగానికే విరుద్ధం. 'అయినా సరే, వాళ్లు వెళ్లిపోవల్సిందే, లేకపోతే మా వాళ్లకు ఉద్యోగాలు ఎలా వస్తాయి?' అని నిరుద్యోగులను, విద్యార్థులను వారిపై ఉసికొల్పుతున్నారు టి-ఉద్యోగసంఘ నాయకులు. వారిని పంపించి వేస్తే అర్హులు దొరకవద్దా? అని కమిటీవాళ్లు అడిగితే, 'దానికేముంది? కింది స్థాయిలో వున్న తెలంగాణ వారికి ప్రమోషన్లు యిచ్చేయండి' అని అతి సులభంగా చెప్పేస్తున్నారు. అంటే స్థానికత ముఖ్యం తప్ప అర్హత కాదన్నమాట. తగినంత అర్హతతో న్యాయబద్ధంగా ఉద్యోగం తెచ్చుకున్నా సీమాంధ్ర ఉద్యోగులు తెలంగాణ విడిచి వెళ్లవలసినదే. 13 జిల్లాల సీమాంధ్ర, వున్నవారికే జీతాలు యివ్వలేని సీమాంధ్ర ప్రభుత్వం ఎంతమంది ఉద్యోగులను భరించగలదు? అందువలన వీరందరూ ఉద్యోగభ్రష్టులు కాకతప్పదు.

ఈ విధంగా హైదరాబాదు మాత్రమే కాదు, దానిలోని సౌకర్యాలన్నీ తమకు కాకుండా చేసినందుకు ఆ యా పార్టీలపై కోపం వుండదా? ఆ మహానగరం పోయేట్టు చేసినవారిపై ద్వేషం వుండదా? 'అక్కడ భూముల్లో, పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టి, వాళ్ల భూములకు రేట్లు పెంచి, వాళ్లకు లాభాలు చేకూర్చి, చివర్లో మాట పడ్డాం. మనల్ని తరిమివేశారు, మన ప్రాంతం నుండి వాళ్లకు ఆదాయం, పన్నులు వెళ్లకూడదు. అక్కడి డీలర్లు వద్దు, మనం అక్కడకి వెళ్లి డబ్బు ఎందుకు ఖర్చు పెట్టుకోవాలి? కస్టమర్లను, కన్స్యూమర్లను మర్యాదగా చూడడం వాళ్లకు రాదు. మన జాతి మొత్తాన్ని రాక్షసులంటున్నారు. ఆ డబ్బు ఖర్చు ఏదో యిక్కడే పెడదాం. ఆ పెట్టుబడులేవో యిక్కడే ఏడుద్దాం. మన దగ్గరున్న జనం బాగుపడతారు. ఇకపై యిక్కడే మనం అన్నీ కట్టుకోవాలి. ఈ లోపున కావాలంటే మద్రాసు నుండో, బెంగుళూరు నుండో సరుకులు తెప్పించుకొందాం. విద్యకు, వైద్యానికి అక్కడికే వెళదాం.' అనే కసి అక్కడి ప్రజల్లో రగులుతోందని వినబడుతోంది. హైదరాబాదుకు వచ్చేవారి సంఖ్య తగ్గుతోందని, కాల్ టాక్సీలు 200 దాకా తగ్గాయని విన్నాను. ఇలాటి పరిస్థితి కల్పించినవారిపై కక్ష వుండదని అనగలమా? సిగ్గులేనివాళ్లు కాబట్టి, వాళ్లకు డబ్బే సర్వస్వం కాబట్టి అవమానాల్ని తుడిచేసుకుంటారని అని వూరుకుందామా?

...అబ్బే కసి ఉంటుంది కానీ, అది కాంగ్రెసు పైన మాత్రమే వుంటుంది' అంటున్నారు మీడియా మోతుబరులు. కసి ఉంటే కాంగ్రెసుతో ఆగిపోదు. లెక్కప్రకారం బిజెపి, టిడిపిలపై కూడా వుండాలి. లోకసభలో సుష్మా స్వరాజ్ చిన్నమ్మ అవతారం మరవగలరా? బిల్లు ప్రవేశపెట్టలేదని ముందురోజు వాదించి, మర్నాడు ఒక్క సవరణ కూడా ప్రతిపాదించకుండా తలుపులు మూసి ఓకే చేయించిన సంగతి గుర్తుండదా? రాజ్యసభలో వెంకయ్య, అరుణ్ జైట్లే ఏదో మొహమాటానికి మాట్లాడినట్లు అభ్యంతరాలు తెలిపి ఆ తర్వాత సవరణలకు పట్టుబట్టకుండా అన్నిటికీ తలూపినది టీవీల సాక్షిగా చూడలేదా? ఇక టిడిపి ఏం ఉద్ధరించింది? విభజన చేయాలి అంటూ టిడిపి యిచ్చిన లేఖ మరువగలరా? సమన్యాయం చేయాలి, హైదరాబాదులో వాటా వుండాలి, రక్షణలు కల్పించాలి యిలాటి షరతులు ఏమీ లేకుండా, వాటి గురించి ఏ అఖిలపక్షంలోనూ ప్రస్తావించకుండా 2008 నుండి ఆరేళ్లపాటు లాక్కుని వచ్చిన వైనం తెలియదా? లోకసభలో యిద్దరు టి-టిడిపి ఎంపీలు సీమాంధ్ర టిడిపి ఎంపీను చావగొట్టిన సంగతేమిటి? సమైక్యత కోసం మోదించుకున్న మోదుగులకు కనీసం నరసరావు పేట లోకసభ టిక్కెట్టు కూడా లేకుండా చేశారు చంద్రబాబు. ఆయన నోట సమైక్యవాదం అన్న మాట అసెంబ్లీ కూడా పలికించలేకపోయింది. తను ఏ వాదినో చెప్పడానికో రెండు రోజుల గడువు అడిగాడు - రెండు రోజుల తర్వాత అసెంబ్లీకి ఏ గతి పట్టబోతోందో అందరికీ తెలిసినా! సీమాంధ్ర కష్టాల పట్ల, అవసరాల పట్ల ఆయనకున్న అక్కర అంతటిది!

టిడిపి, బిజెపి, కాంగ్రెసు ఎవరైనా సరే - విభజనోద్యమం సందర్భంగా సీమాంధ్రులపై తెలంగాణలోని అనేక పార్టీల నాయకులు మాట్లాడిన పరుషపదజాలం, యిప్పటికీ విషం కక్కుతూండడం ఆంధ్ర ఓటర్లు గమనించడం లేదా? ఉద్యోగులకు ఆప్షన్లు వుండవని కెసియార్ బహిరంగంగా అంటున్నారు. 'కాదు వుంటాయి, ఉండేట్లా చూస్తాం' అని ఒక్క పార్టీ అయినా మానిఫెస్టోలో రాస్తోందా? 'మా పిల్లలకు ఉద్యోగాలు కావాలి, అందువలన వారిని తరిమేద్దాం' అనే ప్రతీ టి-నాయకుడు అంటాడు, పోన్లే వుండనిద్దాం అని

ఛస్తే అనడు. ప్రయివేటు ఉద్యోగాల్లో కూడా స్థానికులకు రిజర్వేషన్‌లు వుండాలి' అనే అందరూ వాదిస్తారు. పెట్టుబడిదారులను ఆహ్వానిస్తాం – మా వాళ్లకు ఉద్యోగాలు యిస్తే...! అనే స్లోగనే అందరిదీ. తెలంగాణలో ఉద్యోగాల గోల వదిలేయండి. పోలవరం ప్రాజెక్టు సీమాంధ్రకు ఎంతో అవసరమైనది, పోనీ కట్టుకోనీ అని ఒక్కరైనా అంటున్నారా? పడగొడతాం, డిజైన్ మార్చమంటాం, ఎత్తు తగ్గించమంటాం, గిరిజనుల గుడిసె ఒక్కటి మునిగినా వూరుకోం – అని రంకెలు వేసేవాళ్లను నిలవరించే పెద్దమనిషి ఒక్కడైనా తెలంగాణ నాయకుల్లో కనబడుతున్నారా? పోనీ టి–టిడిపి నాయకుల్లో..?ఈ యూనిట్ కూడా చంద్రబాబు కిందే పని చేస్తోంది కదా. ఆయన వాళ్ల చేత యీ ముక్క అనిపించగలడా? అలాటివాడు తమకు ఏదో ఒరగబెడతాడని సీమాంధ్రులు ఎలా అనుకుంటారు?

'సీమాంధ్ర ప్రస్తుతం దిక్కుమాలిన పరిస్థితిలో వుంది. కేంద్రం నిధులు విదిలించకపోతే అడుక్కుతినాలి. అందువలన గడుసుతనంతో కేంద్రంలో అధికారంలోకి వచ్చే పార్టీతో సఖ్యంగా వుండే టిడిపిని గెలిపిస్తారు' అనే వాదన ఒకటి ముందుకు తెస్తున్నారు. పాయింటు నెంబరు వన్ – కేంద్రంలో అధికారంలో వున్న పార్టీతో బాంధవ్యాలు బాగుంటే నిధులు వస్తాయన్న మాట ఎంతవరకు నమ్మాలి? పదేళ్లగా అక్కడా, యిక్కడా కాంగ్రెస్సే! ఏం బావుకున్నాం? కొత్త రైల్వే లైన్లు లేవు, వైజాగ్ రైల్వే డివిజన్ కూడా దక్కించుకోలేకపోయాం. ఏ శాఖ చూసుకున్నా, మనకు ఔట్ ఆఫ్ టర్న్ వచ్చినది ఏదైనా వుందా చెప్పండి. రావలసినవే రాలేదు. వరద సహాయనిధి, కరువు సహాయనిధి.. కూడా అందటం లేదు. మనకు దక్కినవేమిట్రా అంటే – విభజనకు ఒప్పుకోండి, బోల్డు హామీలు యిస్తాం అనే ప్రతిపాదన ఒక్కటే. 'కాంగ్రెసుకి అలాటి బుద్ధి లేదు కానీ బిజెపికి వుంది. ఈ సారి కేంద్రంలో బిజెపి వస్తుంది కాబట్టి యిస్తుంద'నుకుంటే వాళ్లకు బాగా ఓట్లేసి గెలిపించబోయే యుపి, బిహార్ లాటి వాటికి నిధులిస్తారు కానీ రెండు, మూడు సీట్లు (పోటీ చేసేదే 5 సీట్లు) యిచ్చిన సీమాంధ్ర రాష్ట్రానికి ఎందుకిస్తారు? యుపి, బిహార్ రాష్ట్రాలలో రాబోయే ఎసెంబ్లీ ఎన్నికలలో బిజెపి పార్టీ అధికారంలోకి వచ్చేందుకు వీలుగా అక్కడ కేంద్ర నిధులు గుమ్మరించవచ్చు. మనకు యీ ఎన్నికలు జరిగాక ఇంకో అయిదేళ్ల వరకు అసెంబ్లీ ఎన్నికలు లేవు. అప్పటిలోగా మనతో ప్రయోజనం ఏమిటి? అందువలన తాము యిచ్చే నిధుల వలన ఒనగూడే లాభాన్ని ఓట్లగా మార్చుకునే పార్టీ యంత్రాంగం వాళ్లకు ఏర్పడేవరకూ ఊరిస్తూ కూర్చోబెడతారు. ఆ పార్టీనిర్మాణం అయిదేళ్లకో, పదేళ్లకో జరుగవచ్చు. అప్పటిదాకా హామీలే దక్కుతాయి.

'అబ్బే అలాక్కాదు, వాళ్లు చాలా ఉత్తములు. మన దీనావస్థ చూసి మనకే యిస్తారు' అనుకుని ఓటర్లు నమ్మిన పక్షంలో అప్పుడు డైరక్టుగా బిజెపికే ఓట్లేయాలి. మధ్యలో టిడిపికి ఎందుకు? 'బిజెపి వాళ్లకు సీమాంధ్రలో పార్టీ నిర్మాణం లేదు కాబట్టి, 5 సీట్ల కంటె ఎక్కువ పోటీ చేయడం లేదు కాబట్టి వారి సంకీర్ణ ప్రభుత్వానికి మద్దతు యిచ్చేవారికి వేయాలనుకుంటారు. ఆ విధంగా టిడిపి లాభపడుతుంది.' అని వాదించబోతే మరి వైకాపాకు కూడా సమానమైన ఛాన్సు వుంది కదా! కేంద్రంలో ఎవరున్నా వాళ్లకు మద్దతు యిచ్చి రాష్ట్రాన్ని వ ృద్ధి చేస్తానని జగన్ కూడా అంటున్నారు. ఈ లాజిక్‌తో ఓటర్లు వైకాపాకు కూడా వేయవచ్చు కదా! అయినా మద్దతుదారులు ఎంతకాలం బిజెపితో వుంటారో ఎవరికి ఎరుక? 2002లో గోధ్రా అల్లర్ల తర్వాత టిడిపి కేంద్ర కాబినెట్ నుండి తన మంత్రులను ఉపసంహరించింది. రేపుమర్నాడు మరో మతకలహం జరిగితే అప్పుడూ విత్‌డ్రా చేస్తే..? ఏదో రాష్ట్రంలో బిజెపి ప్రభుత్వ మద్దతుతో, కేంద్ర బలగాలు గుడ్లప్పగించి చూస్తూ వుండగా మెజారిటీ మతస్తులు ముస్లిములను హింసించారని ఆరోపిస్తూ టిడిపియో, క్రైస్తవులను హింసించారని వైకాపాయో మద్దతు ఉపసంహరిస్తే.. సీమాంధ్రకు నిధులు ఆగిపోతాయా? అలా అయితే మధ్యలో సత్రకాయ పార్టీలకు ఓట్లేసి వీళ్ల ద్వారా బిజెపిని మెప్పించాలని చూడడం దేనికి? ఏకంగా బిజెపికే ఓటేసేయాలి.... కానీ వేస్తారని మీడియా గట్టిగా చెప్పగలదా? చెప్పలేదు. చెప్పదు. వాస్తవం మాట్లాడుకోవాలంటే – సీమాంధ్రలో టిడిపి బలాన్ని యింతకింత చేసి చూపడానికే మీడియా చూస్తోంది. దాని కోసం ఏవేవో కారణాలు వెతుకుతోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 16-19 వీక్లీకై ఎమ్బీయస్ : ఫ్రాన్సు స్కూళ్లలో పందిమాంసం తప్పనిసరి**

ఫ్రాన్సులోని రైటిస్టు పార్టీలలోకల్లా తీవ్రవాద పార్టీ అయిన నేషనల్ ఫ్రంట్ పార్టీ తమ దేశంలోకి వలస వచ్చేవారికి, మైనారిటీలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తూ వుంటుంది. ముఖ్యంగా ముస్లిములకు, యూదులకు! యూరోప్‌లోని అన్ని దేశాలలో కంటె ముస్లిములు ఫ్రాన్సులో ఎక్కువగా వున్నారు. ఇటీవల జరిగిన స్థానిక ఎన్నికల్లో నేషనల్ ఫ్రంట్ పార్టీ 1400 మునిసిపల్ సీట్లు చేజిక్కించుకుని 11 పట్టణాలలో అధికారంలోకి వచ్చింది. ఈ అధికారంతో ఇమ్మిగ్రెంట్స్‌ను ఎలా చిక్కులు పెట్టాలా అని ఆలోచించి ఆ పార్టీ నాయకురాలు మెరీనే లే పెన్ యీ పట్టణాలలోని ప్రభుత్వ స్కూళ్లు నిర్వహించే క్యాంటీన్లలో యికపై పందిమాంసం లేని భోజనం వుండదని ఒక ప్రకటన చేసింది. యూదులకు, ముస్లిములకు మతపరంగా సూకరమాంసభక్షణ నిషిద్ధం. అందువలన వారి మతవిశ్వాసాలను గౌరవిస్తూ యిన్నాళ్లూ విద్యార్థులకు పోర్కు వున్న మీల్స్, లేని మీల్స్ అంటూ ఆప్షన్లు వుండేవి. ఇప్పుడది తీసిపారేసిందీవిడ. క్యాంటీన్‌లో తినాలంటే పోర్కు తినాల్సిందే! ఫ్రాన్సులో కాథలిక్కులు అత్యధికంగా వున్నా రాజ్యాంగం ప్రకారం వాళ్లు సెక్యులర్ విధానాలను పాటిస్తూ వచ్చారు. ఇప్పుడు కాథలిక్ నియమాలను మైనారిటీలపై రుద్దుతున్నారంటూ ముస్లిములు ఆందోళన చెందుతున్నారు.**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : జశ్వంత్ సింగ్ బహిష్కరణకు కారణం...

బార్మర్ నియోజకవర్గం నుండి పోటీ చేస్తానని బిజెపి సీనియర్ నాయకుడు జశ్వంత్ సింగ్ అడిగితే అతనికి టిక్కెట్టు యివ్వకుండా కాంగ్రెసు నుండి అప్పుడే తమ పార్టీలోకి ఫిరాయించిన కల్నల్ సోనారామ్ చౌధురీకి యిప్పించింది, ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి వసుంధరా రాజే సింధియా. ఒళ్లు మండిన జశ్వంత్ స్వతంత్ర అభ్యర్థిగా నిలబడ్డాడు. పార్టీ అతన్ని తొలగించింది. ఎన్నికలలో తండ్రికి సహాయపడుతున్నందుకు అతని కుమారుడు మానవేంద్రను కూడా పార్టీలోంచి తీసేయవచ్చని అంటున్నారు. జశ్వంత్‌ను బహిష్కరించడం యిది రెండోసారి. 2009లో మొదటిసారి పంపేశారు. నితిన్ గడ్కరీ అధ్యక్షుడయ్యాక 2010లో మళ్లీ పార్టీలోకి లాక్కుని వచ్చాడు. ఇప్పుడు మళ్లీ ఉద్వాసన. ఎడ్యూరప్పలా జశ్వంత్ సింగ్‌పై అవినీతి ఆరోపణలు లేవు. పార్టీ పుట్టినప్పటినుండి 34 ఏళ్లగా దాన్నే అంటిపెట్టుకుని వుండి అనేక ముఖ్యమైన పదవులు అలంకరించాడు. వాజపేయి ప్రధానిగా వున్నపుడు విదేశాంగ మంత్రిగా వున్నాడు కూడా. న్యూక్లియార్ పరీక్షల తర్వాత భారత్‌ను ప్రపంచదేశాలు వెలివేస్తే తన వాక్చాతుర్యంతో అందర్నీ సమాధాన పరచిన ప్రజ్ఞ జశ్వంత్‌దే. రాజస్థాన్‌లో పుట్టినా డార్జిలింగ్ నుండి ఎంపీగా ఎన్నికైన చాకచక్యం వున్న నాయకుడు. వాజపేయికి, ఆడ్వాణీకి సన్నిహితుడైన యితనంటే మోదీకి పడకపోవడమే అతని ప్రస్తుత పరిస్థితికి కారణం.

అయితే దానికి వారు చూపిస్తున్న కారణం ఏమిటంటే – అతను దేశవిభజన గురించి అతను రాసిన ... పుస్తకం. దాన్ని గుజరాత్‌లో బహిష్కరించారు. విభజనకు జిన్నా ఎంత కారకుడో, నెహ్రూ, పటేల్‌లు కూడా అంతే కారకులని అతను చెప్పడం బిజెపి నాయకత్వానికి కోపం తెప్పించింది. నెహ్రూను తిట్టడం వరకూ అయితే ఫర్వాలేదు. ఇటీవల కాలంలో బిజెపి పటేల్‌ను ఆకాశానికి ఎత్తేస్తోంది. నిజానికి పటేల్ బిజెపికి పూర్వరూపాలైన హిందూ మహాసభ, ఆర్ఎస్ఎస్, జనసంఘం భావజాలానికి సంబంధించినవాడు కాదు. కాంగ్రెసువాదిగానే కడదాకా వున్నాడు. గాంధీ హత్య తర్వాత ఆర్ఎస్ఎస్‌ను నిషేధించాడు కూడా. అయినా పటేల్–గుజరాత్–మోదీ కనక్షన్ చూపించి, పటేల్‌కు భారీవిగ్రహం కట్టడం, దానికోసం దేశం నలుమూలల నుండి ఇనుము సేకరించడం యిలాటి కార్యక్రమాలతో మోదీని 'అభినవ పటేల్'గా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. దానికోసం మొదటగా చేయాల్సింది – పటేల్‌ను శిఖరంపై కూర్చోబెట్టడం, అతనిపై చిన్నపాటి విమర్శను కూడా అనుమతించకపోవడం. దేశవిభజనకు అంగీకరించిన మాత్రాన దేశద్రోహులుగా ముద్ర వేయడం తగదు. అంబేడ్కర్, రాజాజీ వంటి నాయకులు విభజనే పరిష్కారమని ఎప్పుడో చెప్పారు. గాంధీ మొండిపట్టుదల వలననే ఆలస్యం జరిగింది.

డి సి ఝా రాసిన "మహాత్మా గాంధీ – ద కాంగ్రెస్ అండ్ ద పార్టిషన్ ఆఫ్ ఇండియా" ప్రస్తుతం మార్కెట్లోకి వచ్చింది. దానిలో స్పష్టంగా రాశారు – 'మౌంట్‌బాటెన్ వైస్రాయిగా వస్తూనే గ్రహించాడు, విభజన వద్దని జిన్నాకు నచ్చచెప్పడం అసాధ్యం కాబట్టి కాంగ్రెసును విభజనకు ఒప్పించడం ఒక్కటే మార్గం అని! గాంధీ కొరకరాని కొయ్య కాబట్టి వదిలేశాడు. నెహ్రూను ఒప్పించాడు. పటేల్ సెక్రటరీగా వున్న వి పి మేనోన్‌ను ఒప్పించి, అతని ద్వారా పటేల్‌కు, కృష్ణ మేనోన్‌కు నచ్చచెప్పించాడు. నెహ్రూ, పటేల్‌లు గాంధీని ఆరాధించారు, అతని మాటను గౌరవించారు కానీ కొన్ని విషయాల్లో ఆయనను పక్కకు పెట్టేసి నిర్ణయాలు తీసుకున్నారు.' అని. కాంగ్రెసు–ముస్లిం లీగు సంకీర్ణ ప్రభుత్వంలో తమను జిన్నా వేధించిన తీరు చూసి 'దేశాన్ని విడగొట్టేసి వీళ్లను పంపించివేస్తే తక్కినదాన్ని మనకు నచ్చిన రీతిలో మనం ఏలుకోవచ్చు' అనే భావన కాంగ్రెసు నాయకులలో కలిగిందన్న విషయం అందరికీ ఎప్పుడో తెలుసు. ఇదే విషయాన్ని తన పుస్తకంలో రాసినందుకు జశ్వంత్ సింగ్‌కు శిక్ష పడింది. ఈనాటి నాయకుల రాజకీయ అవసరాలకు అనువుగా గతచరిత్రను కూడా మార్చి రాసే రోజులు వస్తాయి. మార్చకుండా వాస్తవాలే రాస్తే దండన తప్పదు. – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : పాకిస్తాన్ పోలీసులూ యింతేనా?

మన దేశంలోని పోలీసులు తలాతోకా లేకుండా కేసులు పెట్టడం చూస్తూనే వున్నాం. పాకిస్తాన్‌లో జరిగిన యీ సంఘటన వింటే అక్కడా యింతే అని తెలుస్తుంది. లాహోర్‌లో బీదసాదలు వుంటే అహోతా ఠాణేదారన్ ప్రాంతంలో ఒక స్థలంలో ఒక కుటుంబం నివసిస్తోంది. వారు తమకు సంబంధించిన వస్తువులు దొంగిలించారు, తనిఖీ చేయాలి అంటూ గ్యాస్ కంపెనీ అధికారులు ఫిబ్రవరి 1 న వాళ్ల యిళ్లమీదకు వచ్చారు. అప్పుడు యీ కుటుంబసభ్యులు, వారి పొరుగువారు – మొత్తం 30 మంది దాకా వున్నారు – ఆ అధికారులపై రాళ్లు విసిరి గాయపరిచారు. ఆ విధంగా వారు హత్యాయత్నం చేశారంటూ వారిపై స్థానిక పోలీసు స్టేషన్‌లోని ఇన్‌స్పెక్టర్ కషీఫ్ ముహమ్మద్ కేసు పెట్టాడు. నిందితుల్లో తొమ్మిది నెలల కుఱ్ఱాణ్ని కూడా చేర్చేశాడు. వాడు కూడా రాళ్లు విసిరి, అధికారులను చంపబోయాట్ట! ఏదైనా వస్తువు పోతే సోదా చేయవలసినది పోలీసులు! మధ్యలో గ్యాస్ కంపెనీ అధికారులు రావడమేమిటి అనే సందేహం కలుగుతుంది. కేసులు ఎదుర్కుంటున్న కుటుంబపెద్ద యాసిన్ అనేదేమిటంటే – తాము నివసిస్తున్న స్థలంపై కొందరు ధనికులు కన్నేసి, తమపై తప్పుడు కేసులు బనాయించి తరిమివేసే ప్రయత్నంలోనే యిదంతా జరుగుతోందని, పోలీసులు వాళ్లతో కుమ్మక్కయ్యారని! ఏప్రిల్ మొదటివారంలో కేసు విచారణకు వచ్చినపుడు జడ్జిగారికి ఆ అనుమానం వచ్చినట్టు లేదు కానీ, యీ

తొమ్మిది నెలల పిల్లవాడు కోర్టులో ఏడుస్తూ వుండడం, వాణ్ని వాళ్ల తాత పాలు పట్టి సముదాయించడం చూసి ఆయనకు చిర్రెత్తుకొచ్చింది. ఈ కుర్రాడిపై కేసు పెట్టినందుకు యిన్‌స్పెక్టరును సస్పెండు చేయమని పోలీసు శాఖకు ఆదేశాలిచ్చాడు. ఆ పిల్లవాడు నోరు తెరిచి అడక్కుండానే బెయిల్ యిచ్చాడు. కానీ వాడి మీద కేసు కొట్టేసి, కేసులోంచి విడుదల చేయలేదు. అంటే పోలీసులతో బాటు న్యాయాధీశులకు కాస్త తిక్క వుందన్నమాట! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : ట్రైవ్యాలీ నిందితురాలి ఆదాయంలో 90% భారతీయుల నుండే!

అమెరికాలోని ట్రై వ్యాలీ యూనివర్శిటీ పేరు మర్చిపోవడం కష్టం. 2010లో వందలమంది మన తెలుగు కుర్రాళ్లు ఆ యూనివర్శిటీని నమ్మి నిండా మునిగిపోయారు. వాళ్ల కాళ్లకు బేడీలు వేసినందుకు మనమంతా ఆందోళన చెందాం. ఆ యూనివర్శిటీ వ్యవస్థాపకురాలు సుసాన్ గ్జియోపింగ్‌సూ పై యూనివర్శిటీలో లేని సౌకర్యాలు వున్నట్టు నకిలీ ధృవపత్రాలు సమర్పించడం దగ్గర్నుంచి, అక్రమంగా నగదు బదిలీలు, వీసా మోసాల దాకా 31 కేసులు పెట్టారు. విద్యార్థుల నుండి ఫీజు రూపంలో వసూలు చేసినదానితో సౌకర్యాలు కల్పించలేదు. ఆ డబ్బుని రియల్ ఎస్టేటులో పెట్టింది. బెంజ్ కారు, రెండు భవంతులు కొనుక్కుంది. శాన్‌ఫ్రాన్సిస్కో జిల్లా కోర్టులో విచారణ జరిగి మార్చి నాలుగోవారంలో ఆమెను దోషిగా తేల్చారు. శిక్ష ఏమిటో జూన్ 20 న చెప్తారు. యిలాటి వాటి ద్వారా ఆమె రూ.35 కోట్లు సంపాదించింది. అయితే దీనిలో 90% భారతీయ విద్యార్థుల నుండి వసూలు చేసిందన్న వాస్తవం కర్ణకఠోరంగా వుంది. ఇలాటి బోగస్ యూనివర్శిటీలో మనవాళ్లు ఎలా చేరారు? పోనీ మొదట్లో వెళ్లినవాళ్లు మోసపోయారనుకున్నా వాళ్లు తర్వాతి వారిని హెచ్చరించలేకపోయారా? ఒకరికి మరొకరికీ పరిచయం లేదు కాబట్టి అది సాధ్యపడలేదని అనుకోవాలా? లక్షల రూపాయలు కట్టి యీ యూనివర్శిటీకి వచ్చాక మోసపోయామని గ్రహించిన విద్యార్థులు నాలిక కరుచుకుని వెనక్కి వెళ్లిపోవకపోవడం వాళ్లు చేసిన పొరబాటు. అప్పు చేసి పంపించిన తలిదండ్రులు బాధపడతారని అనుకుని, వాళ్లకు అబద్ధాలు చెపుతూ వేరే వూళ్లల్లో చిన్న చిన్న పనులు చేస్తూ జీవితం వెళ్లబుచ్చాలని చూశారు. అది చట్టవిరుద్ధం కాబట్టి అక్కడి పోలీసులు వారిని అరెస్టు చేశారు. పోలీసుల చర్యలు న్యాయసమ్మతం కాబట్టి మన దేశస్తులు వారిని ఖండించలేకపోయారు. ఏది ఏమైనా యీ ఉదంతంలో కొట్టవచ్చినట్టు తెలియవచ్చిన అంశం ఏమిటంటే – ఏమారిపోవడానికి మన భారతీయులు ముందువరుసలో వుంటారు అని. లేకపోతే ప్రపంచంలో యిన్ని దేశాల వాళ్లుండగా భారతీయులే ఆమెకు చిక్కడం ఏమిటి! ఇలాటి బోగస్ యూనివర్శిటీలు యింకెన్ని వున్నాయో, యింకెన్ని కథలు బయటకు వస్తాయో – వేచి చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : ఎన్నికల బరిలో కళాకారులు

సినిమా కళాకారులు రాజకీయాల్లోకి రావడమనేది గతంలో దక్షిణాదిన మాత్రమే వుండేది. పోనుపోను దేశంలోని యితర రాష్ట్రాలకూ వ్యాపించింది. ఈ సారి ఎన్నికలలో కనబడే కొన్ని పేర్లు చూడండి! ఢిల్లీలో – బిశ్వజిత్ (తృణమూల్), మనోజ్ తివారి (బిజెపి), పంజాబ్‌లో – గుల్ పనాగ్ (ఆప్), కిరణ్ ఖేర్, వినోద్ ఖన్నా (బిజెపి), ఉత్తర ప్రదేశ్‌లో – రవి కిషన్, నగ్మా (కాంగ్రెసు), హేమా మాలిని, రాజ్ బబ్బర్ (బిజెపి), జయప్రద (ఆర్ఎల్‌డి) బిహార్‌లో – కునాల్ సింగ్ (కాంగ్రెస్), ప్రకాష్ ఝా (జెడి(యు), ఆసాంలో – బిజూ ఫూకన్ (బిజెపి). ఒడిశాలో – అపరాజితా మహంతి, బిజయ్ మహంతి (కాంగ్రెసు), అనుభవ్ మహంతి (బిజెడి). గుజరాత్‌లో – పరేష్ రావల్ (బిజెపి), మహారాష్ట్రలో – మహేష్ మంజ్రేకర్ (ఎంఎన్ఎస్) కమాల్ ఖాన్ (సమాజ్‌వాదీ), నవనీత్ కౌర్ రాణా (ఎన్‌సిపి). అందరి కంటె పశ్చిమ బెంగాల్ స్కోర్ ఎక్కువగా వున్నట్టుంది. అక్కడ బిజెపి పక్షాన – జార్జి బేకర్, బాబుల్ సుప్రియ, బప్పీ లాహిరి నిలబడుతుండగా తృణమూల్ కాంగ్రెసు పక్షాన – మూన్‌మూన్ సేన్, సంధ్యా రాయ్, దీపక్ అధికారి, సౌమిత్ర రాయ్, అర్పితా ఘోష్, ఇంద్రాణి సేన్ పోటీ చేస్తున్నారు. వీరితో బాటు పిసి సర్కార్ జూ. (మెజీషియన్) కూడా బిజెపి తరఫున నిలబడుతున్నారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : హాలీవుడ్ నటుడు మిక్కీ రూనీ మరణం

అక్కినేని నాగేశ్వరరావు పోయినపుడు 'ప్రపంచంలో యింతకాలం సినిమాల్లో వేసిన నటుడు మరొకరు లేరు' అని అనబోయిన కొందరు అంతలో మిక్కీ రూనీని తలచుకుని ఆగిపోయారు. తన 7వ యేట సినిమాల్లో చేరి ...... వయసు వరకు నటించిన మిక్కీ తన 94వ యేట ఏప్రిల్ మొదటివారంలో కన్నుమూశారు. మన సురభి బృందంలా వాళ్ల నాన్నది కూడా సంచారనాటకబృందం. అందువలన తప్పటడుగుల దశలోనే బాలపాత్రలతో స్టేజి ఎక్కాడు. పాడేవాడు, ఆడేవాడు, పియానో, డ్రమ్స్ వాయించేవాడు. "ఆర్చిడ్స్ అండ్ ఎర్మైన్" (1927)సినిమాలో మరుగుజ్జుగా వేయడంతో అతని కెరియర్ ప్రారంభమైంది. ఆ తర్వాత రెండు రీళ్ల సినిమాలు అనేకవాటిల్లో వేశాడు. నాటకాల్లో వేస్తూనే అనేక సినిమాల్లో నటించాడు. షేక్‌స్పియర్ రాసిన "మిడ్ సమ్మర్ నైట్స్ డ్రీమ్"

నాటకాన్ని వార్నర్ బ్రదర్స్ వారు 1935లో సినిమాగా మలచినపుడు దానిలో మిక్కీ వేసిన వేషానికి మంచి పేరు వచ్చింది. అతని "ఎ ఫ్యామిలీ ఎఫయిర్" (1937) సినిమా హిట్ కావడంతో దానిలో ప్రధాన పాత్ర ఐన ఆండీ హార్డీ పేరుతో మెట్రోవాళ్లు సీరీస్ తీశారు. వాటన్నిటిలో మిక్కీయే నటించాడు. జూడీ గార్లండ్‌తో కలిసి "బేబ్స్ యిన్ ఆర్మ్స్" (1939) అనే మ్యూజికల్‌లో అతను చేసిన నృత్యానికి, నటనకు ఆస్కార్ నామినేషన్ లభించింది. తర్వాత వాళ్లిద్దరూ కలిసి మరి కొన్ని మ్యూజికల్స్‌లో వేశారు. అతని రెండో ఆస్కార్ నామినేషన్ "ద హ్యూమన్ కామెడీ" (1943)కి దక్కింది.

ఇదీ, ఎలిజబెత్ టేలర్‌తో కలిసి నటించిన "నేషనల్ వెల్వెట్" (1944) అతని ఉత్తమోత్తమమైన సినిమాలుగా చెప్పవచ్చు. ఆ తర్వాత అతను ఎన్నో సినిమాల్లో వేశాడు. తెలుగునాట కూడా బాగా హిట్ అయిన "ఇట్స్ ఎ మ్యాడ్ మ్యాడ్.. వరల్డ్ (1963)"లో అతను వేసిన పాత్ర ద్వారా మనందరికీ బాగా గుర్తున్నాడు. అనేక ఫీచర్ ఫిల్మ్స్ వేశాక టీవీ సినిమాల్లో నటించాడు. టీవీ కార్యక్రమాలను హోస్ట్ చేశాడు. ఆ తర్వాత అనేక యానిమేషన్ సినిమాల్లో జంతువుల పాత్రలకు వాయిస్ ఓవర్ యిచ్చాడు. టీవీ సీరీస్‌లో నటించాడు. ఇలా చివరిదాకా ప్రేక్షకులను అలరిస్తూనే వున్నాడు. రెండు సార్లు ఆత్మకథ రాసుకున్నాడు. 45వ యేట ఒకసారి, 71వ యేట మరోసారి. ఒకదాని తర్వాత మరొకటి ఎనిమిది వివాహాలు చేసుకున్నాడు. వారిలో అవా గార్డ్‌నర్ వంటి ప్రఖ్యాత నటీమణి కూడా వుంది. తన పెళ్లిళ్లపై తనే ఓ సారి జోక్ చేసుకున్నాడు – 'నా మేరేజి సర్టిఫికెట్‌పై హెడింగ్ 'టు హూమ్‌సోఎవర్ యిట్ మే కన్‌సర్న్..' అని వుంటుంది.' అని! (ఫోటో – "ఇట్స్ ఎ మ్యాడ్ మ్యాడ్.. వరల్డ్ (1963)"లో మిక్కీ రూనీ) – **ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఏప్రిల్ 20 ఎమ్బీయస్ : వికె మూర్తి కెమెరా విన్యాసం

గురుదత్ సినిమాలను యిష్టపడేవారు అతని సినిమాలలోని ఫోటోగ్రఫీని కూడా యిష్టపడతారు. "ప్యాసా" వంటి సినిమాల్లో ఫోటోగ్రఫీ కాని, నేపథ్యసంగీతం కాని ఒక మూడ్‌ను క్రియేట్ చేస్తాయి. అవన్నీ కలిసి మనను ఎక్కడికో తీసుకుపోతాయి. అందుకే "ప్యాసా", "కాగజ్ కే ఫూల్", "సాహిబ్ బీబీ ఔర్ గులామ్" వంటి క్లాసిక్స్ విడుదలైన 50 ఏళ్ల తర్వాత కూడా విదేశాల్లో సైతం మన్ననలు పొందుతున్నాయి. గురుదత్ సినిమాలకు ఫోటోగ్రాఫర్‌గా పని చేసిన దాదా సాహెబ్ ఫాల్కే ఎవార్డు గ్రహీత వికె మూర్తి ఏప్రిల్ 7 న 91 వ యేట మరణించారు. ఏప్రిల్ 8 వ తారీకు వార్తాపత్రికల్లో ఆయన గురించి కొంత సమాచారం వచ్చింది. "పాకీజా" వంటి క్లాసిక్స్‌కు ఫోటోగ్రఫీ అందించిన విషయాలు రాశారు. పాఠకులు అది చదివే వుంటారన్న భావనతో ఆ వివరాల జోలికి వెళ్లకుండా గురుదత్‌కి ఆయనకు వున్న సంబంధం గురించి మాత్రం రాస్తాను.

మూర్తి మైసూరులో 1923లో పుట్టారు. మెట్రిక్ పాసయ్యాక సినిమాల్లో నటుడిగా చేరదామనుకుని బొంబాయి స్టూడియోలు చుట్టూ తిరిగారు. పని దొరకలేదు. 1941లో మద్రాసు వచ్చి వయొలిన్ నేర్చుకున్నారు. అంతలో క్విట్ ఇండియా ఉద్యమం వస్తే దానిలో పాల్గొని జైలుకి వెళ్లి 5 నెలలున్నారు. బయటకు వచ్చాక రామ్‌గోపాల్ అనే డాన్సర్ ట్రూపులో వయొలినిస్టుగా ఆరునెలల కాంట్రాక్టు లభించింది. 1946లో మద్రాసులో పాలిటెక్నిక్ యిన్‌స్టిట్యూట్‌లో ఫోటోగ్రఫీ కోర్సులో చేరి పాసయ్యారు. బొంబాయి స్టూడియోల్లో కెమెరా యూనిట్‌లో ఉద్యోగం కోసం ప్రయత్నించి దొరకక, జీవనోపాధి కోసం కొన్ని సినిమా పాటలకు వయొలిన్ వాయించారు. కొన్నాళ్లకు ఫాలీ మిస్త్రీ అనే టాప్ కెమెరామన్ వద్ద అసిస్టెంటుగా వుద్యోగం దొరికింది. ఆయనతో లక్ష్మీ స్టూడియోస్ వదలి ఫేమస్ సినీ స్టూడియోకు వెళితే, మూర్తి ఆయనను అనుసరించారు. ఆ రోజుల్లో స్టూడియోలు వీళ్లకు స్టూడియోలు నెలజీతాలు యిచ్చేవి. ఎవరైనా నిర్మాత, తన ఫోటోగ్రాఫర్‌ను తెచ్చుకుంటే స్టూడియో కెమెరాలతో బాటు కెమెరా అసిస్టెంట్లను కూడా తోడుగా యిచ్చేది.

గురుదత్ "బాజీ" (1951) సినిమా షూట్ చేయడానికి ఫేమస్ స్టూడియో ఎంచుకున్నాడు. అతని ఫోటోగ్రాఫర్ వి. రాత్రాకు స్టూడియో తరఫున మూర్తి అసిస్టెంటుగా పనిచేశాడు. ఆ సినిమాలో చాలా క్లిష్టమైన షాట్ ఒకటి గురుదత్ ప్లాన్ చేశాడు. 'సునో గజరియా గాయ్" పాట ఒక బార్‌లో చిత్రీకరించారు. హీరో దేవ్ ఆనంద్ డాన్స్ ఫ్లోర్‌కు ఎదురుగా నిలబడి క్రమంగా వేదిక వద్దకు వెళ్లి, వాళ్లను చూస్తూ ముందువరసలో వున్న కుర్చీలో కూర్చుంటాడు. ఈ కదలికలన్నీ ఒక్క షాట్‌లో కట్‌లు లేకుండా రావాలి. అది కూడా దేవ్ నెత్తిమీద వున్న అద్దంలోంచి టాప్ యాంగిల్ నుండి కెమెరా కన్ను చూస్తూ క్రమంగా కిందకు యాంగిల్ మార్చుకుంటూ దేవ్‌ను అనుసరిస్తూ వెళ్లి వేదికపై డాన్సర్లందరినీ కవర్ చేస్తూ చివరకు దేవ్‌పై క్లోజ్ షాట్‌తో ఆగాలి. ఈ ట్రాకింగ్ అండ్ ట్రాలీ షాట్ తీయాలంటే బరువైన కెమెరాను భుజాన వేసుకుని పరుగులు పెట్టుకుంటూ తీయాలి. రాత్రా స్థూలకాయుడు. అందుకని యీ పని మూర్తికి అప్పచెప్పాడు. అతను చక్కగా నిర్వహించాడు. గురుదత్ అతన్ని బాగా మెచ్చుకున్నాడు. ఆ సినిమా రషెస్ చూస్తుండగానే మూర్తి పనితనం అతన్ని ఆకట్టుకుంది. అంతే తర్వాతి సినిమా "జాల్"కు అతన్ని ఫోటోగ్రాఫర్‌గా నియమించుకున్నాడు. అప్పట్లో సినిమాలన్నీ స్టూడియోల్లో తీసేవారు. దానికి భిన్నంగా "జాల్" బొంబాయి, గోవాలకు మధ్య రత్నగిరి తీరంలో సహజవాతావరణంలో తీశారు. అది హిట్ అయింది. మూర్తితో గురుదత్‌కు వ్యక్తిగత బంధం ఏర్పడింది. ఇక అక్కణ్నుంచి గురుదత్ సినిమాలన్నిటికీ అంటే – "బాజ్" (1953), "ఆర్ పార్" (1954), "మిస్టర్ అండ్ మిసెస్ 55" (1955), "సిఐడి" (1956), "శైలాబ్ (1956), "ప్యాసా"

(1957), ''12 ఓ క్లాక్'' (1958), ''కాగజ్ కే ఫూల్'' (1959), ''సాహిబ్ బీబీ ఔర్ గులామ్'' (1962), లకు వికె మూర్తియే ఫోటోగ్రాఫర్.

1960 నాటి ''చౌధ్‌వీ కా చాంద్'' సినిమాకు ఫోటోగ్రాఫర్ నారిమన్ ఎ. ఇరానీ అయినా రెండు కలర్ సాంగ్స్ (వాటిలో చౌధ్‌వీ కా చాంద్ హెూ, యా అఫ్‌తాబ్ హెూ – ఒకటి) మాత్రం వికె మూర్తి చిత్రీకరించారు. దానికి కారణం సినిమా తీసే సమయానికి మూర్తి ఆ సమయానికి యూరోప్‌లో వుండడం. 1960ల నాటికి కలర్ సినిమాల యుగం ప్రారంభమవుతోందని గ్రహించిన గురుదత్ ఆ రకమైన ఫోటోగ్రఫీలో తర్ఫీదు పొందడానికై మూర్తిని తన ఖర్చులపై యూరోప్ పంపాడు. ''గన్స్ ఆఫ్ నవరోన్'' (1961) సినిమా గ్రీస్‌లో తయారవుతోంది. దాని ఫోటోగ్రాఫర్ ఆస్వాల్డ్ మోరిస్. ఆ టీములో మూర్తి చేరారు. టీములో యితర సభ్యులకు మూర్తి గురించి పెద్దగా తెలియదు. ఏదో సాధారణ ఫోటోగ్రాఫర్ కాబోలు అనుకున్నారు. ఓ రోజు గురుదత్ నుండి టెలిగ్రాం వచ్చింది – ''కంగ్రాట్స్. నీకు ''కాగజ్ కే ఫూల్'' సినిమా ఫోటోగ్రఫీకై 1960 ఫిల్మ్‌ఫేర్ ఎవార్డు వచ్చింది.'' అని. అప్పుడు ఓహెూ యీయన యింతటి ఘనుడా అనుకున్నారు వాళ్లు. ''కాగజ్ కే ఫూల్'' సినిమా భారతదేశంలోనే తొలి సినిమాస్కోప్ సినిమా. గురుదత్ 1958లో ట్వంటియత్ సెంచరీ ఫాక్స్ వారి నుండి సినిమాస్కోప్ కాపీరైట్ లైసెన్సు తీసుకుని ఆ సినిమా తీశాడు. దేశంలో అన్ని థియేటర్లలోను సినిమాస్కోప్‌లో ప్రదర్శించే సౌకర్యం అప్పట్లో లేదు కాబట్టి 35 ఎంఎంలో కూడా కొన్ని ప్రింటులు తీశారు. ఫిల్మ్ ఫేర్ ఎవార్డు గెలుచుకునేటంతటి స్థాయిలో ''కాగజ్ కే ఫూల్'' రూపొందడానికి వెనక ఒక కథ వుంది.

గురుదత్ స్వతహాగా చాలా మంచివాడు, సహచరులతో చిన్నా పెద్దా భేదం లేకుండా కలిసిపోతాడు. కానీ అతనితో పని చేయడం చాలా కష్టం. చాలా మూడీ ఫెలో. ఎప్పుడు ఏ సినిమా మొదలుపెడతాడో, ఎప్పుడు మధ్యలో మానేస్తాడో తెలియదు. షూటింగుకి వచ్చాక ఓపెనింగ్ షాట్‌కి సరైన యాంగిల్ అతనికి స్ఫురించకపోతే 'ప్యాకప్' అనేస్తాడు. మర్నాడు మళ్లీ అక్కడికే వచ్చి ప్రయత్నిస్తాడు. తన నటనపై తనకు నమ్మకం లేదు. అయినా తగిన హీరో దొరక్క తనే కథానాయక పాత్రలు వేసేవాడు. అందరూ బాగుందన్నా తన నటన తనకు తృప్తి నివ్వకపోతే సీను మళ్లీ తీద్దామనేవాడు. డైలాగులు మర్చిపోయేవాడు. టేకులపై టేకులు తినేవాడు. కోపిష్టి. చికాకు చూపేవాడు. మర్నాడు క్షమాపణ చెప్పేవాడు. అతని పెర్‌ఫెక్షన్ తక్కినవారికి విసుగు తెప్పించినా సినిమాల పట్ల అతనికున్న అంకితభావం చూసి ఎవరూ ఫిర్యాదు చేసేవారు కాదు. సాటి నటులకైతే ఆ యా దృశ్యాల వరకే సంబంధం వుంటుంది. కానీ కెమెరామన్ సినిమా తీసినంతకాలం అతనితో వేగవలసిందే. అయితే మూర్తి గురుదత్ అంటే ఎప్పుడూ చికాకు పడలేదు. అతను 'ఓకే' అనేంతవరకు ఓపిగ్గా పనిచేస్తూనే వుండేవాడు. అంతేకాదు, ఒక సినిమా విషయంలో గురుదత్ ఓకే అన్నా యీయన ఓకే అనలేక బాధపడ్డాడు.

''ఆర్ పార్'' సినిమా తీసేటప్పుడు జరిగింది ఆ సంఘటన. దానికి ముందు తీసిన ''బాజ్'' ఆర్థికంగా గురుదత్‌ను చాలా దెబ్బ తీసింది. అందువలన యీ సినిమా త్వరత్వరగా తీద్దామని తొందరపడుతున్నాడు. మూర్తి సరైన లైటింగ్ గురించి తంటాలు పడుతూంటే ''ఏమిటీ చాదస్తం మూర్తీ, టైము వేస్ట్ చేయకు, త్వరగా కానీయ్'' అంటూ కేకలేసేవాడు. ఓ షాటుకి పెట్టిన లైటింగ్ మూర్తికి తృప్తి నివ్వలేదు. ఇంకా టచెస్ చేద్దామన్నాడు. ''అక్కర్లేదు, వున్నది చాలు.'' అని గురుదత్ గట్టిగా చెప్పి షాటు తీయించేశాడు. మూర్తికి బాధేసింది. అందరూ లంచ్‌కు వెళ్లినపుడు ఓ మూల కూర్చుని కన్నీరు కార్చసాగాడు. సినిమా నుండి తప్పుకుందామన్న ఆలోచన వచ్చింది. లంచ్ దగ్గర మూర్తి కనబడకపోయేసరికి గురుదత్‌కు అనుమానం వచ్చి స్టూడియోకి వచ్చి చూశాడు. మూర్తి వద్దకు వచ్చి అనునయంగా ''నా ఆర్థిక పరిస్థితి నీకు తెలుసు కదా. అందుకే యిలా కానిచ్చేయమంటున్నాను. మళ్లీ నిలదొక్కుకోనీ. నీ ప్రతిభ యావత్తు చూపించే సినిమా ఒకటి తీస్తానని మాట యిస్తున్నాను. ఒక సినిమా డైరక్టర్ కథ అది. విశాలమైన స్టూడియోల్లో కథ నడుస్తుంది. అనేక మూడ్స్ వుంటాయి. బ్రైట్ లైట్, సబ్‌డ్యూడ్ లైట్, కాండిల్ లైట్.. రకరకాల లైటింగులతో నువ్వు రెచ్చిపోదువు గాని...'' అని ఓదార్చాడు.

ఇది జరిగిన ఐదేళ్లకు ఆ సినిమా తయారైంది. మధ్యలో ''ప్యాసా'' (తెలుగులో ''మల్లెపూవు''గా తీశారు) వంటి క్లాసిక్ వచ్చింది. అది విమర్శకులను మెప్పించడంతో బాటు వాణిజ్యపరంగా కూడా విజయవంతం అయింది. గురుదత్ కెరియర్‌లో అది మైలురాయిగా నిలిచిపోయింది. దానిలో తన సంతాపసభకు తనే హాజరైన గురుదత్ ద్వారం వద్ద నిలబడి వున్న దృశ్యాన్ని ఎవరూ మర్చిపోలేరు. అలాగే వేశ్యావాటిక సెట్టింగును కూడా. నలుపుతెలుపు రంగుల్లో వెలుగునీడల విన్యాసం చూడాలంటే అలాటి సినిమాలు చూడాలి. ఇక ''కాగజ్ కే ఫూల్'' సినిమా వచ్చేవరకు మూర్తి చెలరేగిపోయాడు.

దానిలో ఒక ప్రత్యేకమైన లైటింగు గురించి ప్రస్తావించి తీరాలి. ఆ సినిమా నిర్మాణం జరిగిన మెహబూబ్ స్టూడియోలో పై నున్న రేకుల మధ్య కన్నం లోంచి మధ్యాహ్నం పూట సూర్యకాంతి ఒక కాంతిపుంజంలా పడేది. ఒకసారి దాన్ని చూస్తూ గురుదత్ ''మూర్తీ నాకు స్టూడియో లైట్లతో ఆ ఎఫెక్టు యివ్వగలవా? క్లయిమాక్స్‌లో డైరక్టరు కుర్చీలో కూర్చుని హీరో చచ్చిపోతాడు. అప్పుడు అలాటి లైటింగ్ ఒక కాంతిజలపాతంలా అతనిపై పడాలి.'' అన్నాడు. ''సూర్యకాంతి పడే సమయానికి ఆ సీను తీయాలి తప్ప లైట్లతో దాన్ని సృష్టించలేం. కాంతి చెదిరిపోతుంది.'' అన్నాడు మూర్తి. ''ప్రయత్నించి చూడు. నీకు మార్గం దొరికేవరకూ ఆ సీను చిత్రీకరణ వాయిదా వేస్తాను.'' అన్నాడు గురుదత్. మూడు నాలుగు రోజులు పోయాక మేకప్‌మన్ ఒకతను చేతిలో అద్దం పట్టుకుని స్టూడియో బయటకు వెళితే సూర్యకిరణం అతని అద్దం మీద పడి, ప్రతిఫలించింది. అది వీళ్లు అనుకున్నట్టే కాంతిస్తంభంలా పడింది. మూర్తికి

ఐడియా వచ్చేసింది. 4 అడుగుల పొడుగు, 3 అడుగుల వెడల్పు వున్న అద్దాలు రెండు తెప్పించాడు. ఒకదాన్ని టెర్రేస్‌పై పెట్టి సూర్యుడి వెలుగు పడేట్లు చేశాడు. సూర్యకిరణం దాని నుండి పరావర్తనం చెంది, స్టూడియో లోపల పెట్టిన మరొక అద్దం మీద పడేట్లు చేస్తే అనుకున్న ఎఫెక్టు వచ్చేసింది. దాని చుట్టూ కాస్త దుమ్ము, కాస్త పొగ చేర్చేటప్పటికి ఒక మూడ్ క్రియేట్ అయింది. లోపలి అద్దం కోణం మార్చుకుంటూ తమకు తగినట్టుగా షాట్లు తీసుకున్నారు.

సీనియర్ ఫోటోగ్రాఫర్ ఫరీదూన్ ఇరానీ అటువైపు వెళుతూ యిది చూసి ''మూర్తీ, సన్‌లైట్‌లో షూటింగు చేస్తున్నావా?'' అని అడిగాడు. మూర్తి తన పద్ధతి చెప్పేసరికి, 'ఇదెక్కడి వింతపద్ధతిరా బాబూ' అని ఆయన తెల్లబోయాడు. రషెస్ చూశాక వచ్చి అద్భుతంగా వుందని మెచ్చుకుంటూ కౌగలించుకున్నాడు. దాంతో గురుదత్‌కు ధైర్యం వచ్చి, ''వక్త్ నే కియా, క్యా హసీ సితమ్'' పాటకు కూడా యిదే టెక్నిక్ ఉపయోగించాడు. దురదృష్టమేమిటంటే సినిమా ఫ్లాపయింది. దీని తర్వాత గురుదత్ వేరే ఏ సినిమాకు దర్శకుడిగా తన పేరు వేసుకోలేదు.

1962లో ''సాహిబ్ బీబీ ఔర్ గులామ్'' తీసినప్పుడు డైరక్టరుగా రచయిత అబ్రార్ అల్వీ పేరు వేశాడు. సినిమా తనే డైరక్టు చేశానని, పాటలు మాత్రం గురుదత్ డైరక్టు చేశాడనీ అబ్రార్ అంటాడు. అతనికి బెస్ట్ డైరక్టర్‌గా ఫిల్మ్‌ఫేర్ అవార్డు వచ్చింది కూడా. ఫోటోగ్రాఫర్‌గా మూర్తికి రెండో ఫిల్మ్‌ఫేర్ అవార్డు వచ్చింది. ''సాహిబ్..'' కూడా నలుపు, తెలుపు సినిమాయే. జమీందారు భవనంలో భర్త చేత నిరాదరించబడి ఒంటరి జీవితం గడుపుతున్న కథానాయిక జీవితంలోని వెలుగునీడలను కెమెరా చక్కగా పట్టుకుంది. సినిమా విజయవంతం అయినా గురుదత్ వ్యక్తిగత సమస్యలతో విషాదంలో మునిగిపోయాడు. ఆత్మహత్యా ప్రయత్నాలు చేశాడు. సినిమాలు ప్రారంభించడం, మధ్యలో ఆపేయడం ఎక్కువైంది. మూర్తి మద్రాసుకి తరలిపోయి అక్కడ తీస్తున్న ''సూరజ్'' వంటి సినిమాలకు పనిచేస్తూండేవాడు. 1964లో గురుదత్ ''బహారేం ఫిర్ భీ ఆయేంగే'' (1966లో రిలీజైంది. తెలుగులో ''కూతురు-కోడలు''గా వచ్చింది) ప్లాన్ చేశాడు. మూర్తి తన అసిస్టెంటు కె జి ప్రభాకర్‌ను ఫోటోగ్రాఫర్‌గా సిఫార్సు చేశాడు. ''సూరజ్'' లోని కొన్ని దృశ్యాలు బొంబాయిలోని మెహబూబ్ స్టూడియోలో తీస్తూండగా అక్కడికి గురుదత్ వచ్చి ''ఇక్కడ నీ పని అయిపోయిన తర్వాత వచ్చి మా సినిమాకు కొన్ని సీన్లు తీసిపెట్టాలి'' అని కోరాడు. సరేనని మూర్తి మాలా సిన్హాతో కొన్ని దృశ్యాలు, జానీ వాకర్ పాట తీశాడు.

ఆ రోజుల్లో గురుదత్ తన పెద్దార్ రోడ్ ఫ్లాట్‌లో ఒంటరిగా వుండేవాడు. భార్య విడిపోయి పిల్లలతో వేరే చోట వుండేది. డిప్రెషన్‌లో వుండి విపరీతంగా మద్యం సేవించేవాడు. రతన్ అనే ఒక పనివాడు మాత్రం వుండేవాడు. మూర్తిని ఒక రోజు పిలిపించి ''చూశావా, నేను ఒక్కణ్నే అయిపోయాను. నువ్వు మద్రాసు వెళ్లిపోయావు. అక్కడ నీకెంత అడ్వాన్సు యిచ్చారు? అది నీకు యిచ్చేస్తాను. వెనక్కి యిచ్చేసి బొంబాయి వచ్చేసెయ్.'' అన్నాడు. మితభాషి అయిన గురుదత్ అంత ఎమోషనల్‌గా మాట్లాడడం చూసి మూర్తి చలించిపోయాడు. కానీ తన వృత్తిపరమైన బాధ్యతలను విస్మరించలేకపోయాడు కాబట్టి మద్రాసు తిరిగి వెళ్లిపోయాడు. ఆ అక్టోబరులోనే గురుదత్ ఆత్మహత్య చేసుకున్నాడు.

కొసమెరుపు - 1997 లో నేను ఆంధ్రజ్యోతి వీక్లీకై గురుదత్‌పై సుదీర్ఘవ్యాసం రాస్తూ వికె మూర్తి ఫోటోగ్రఫీని మెచ్చుకుంటూ ఆయన తెలుగువాడు అని రాశాను. సుప్రసిద్ధ విమర్శకులు, మిత్రులు వివికె రంగారావుగారు 'ఫోటోగ్రఫీకి, తెలుగువాడు కావడానికి సంబంధం ఏముంది? అదెందుకు రాయడం?' అని చివాట్లు వేశారు. 'పాఠకులు కనెక్ట్ అవుతారు కదాని...' అని నసిగాను. 'అయినా ఆయన కన్నడిగుడు. మైసూరువాడు. తప్పు రాశావ్.' అన్నాడాయన. అప్పట్లో సినిమా సమాచారం సేకరించడం కష్టసాధ్యంగా వుండేది. 'తెలుగువాడని ఎవరో చెపితే రాశాను. సరిదిద్దుకుంటాను.' అన్నాను. కొన్నాళ్లకి వికె మూర్తి జీవితగాథ కన్నడంలో వెలువడింది. దానిలో తమది కర్ణాటకలో స్థిరపడిన తెలుగు కుటుంబమే అని ఆయన రాసుకున్నారట!

ఆయన ప్రతిభను అక్షరాల్లో కుదించడం కష్టం. వీలైతే పైన చెప్పిన సినిమాలు చూడండి. లేకపోతే గూగుల్ యిమేజిలకు వెళ్లి ఆ సినిమా స్టిల్స్ చూడండి. ఆయన ప్రతిభకు జోహార్లు తెలపండి. **(సమాప్తం)- ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 22-23 వీక్లీకై** **ఎమ్బీయస్ : తెలుగుల పాలిటి శివసేన - తెరాస**

తెలంగాణ రాష్ట్ర ప్రకటన రాగానే కెసియార్ చేసిన ప్రకటనలోని హుందాతనం ఎన్నికలవేళ వచ్చేసరికి మాయమై పోయింది. జాతీయ స్థాయిలో వ్యవహరించబోయే స్టేట్స్‌మన్‌లా కాకుండా ఉపప్రాంతీయ పార్టీ స్థాయి నాయకుడిలా మాట్లాడుతున్నారు. విభజన బిల్లులో అంగీకరించిన అన్ని విషయాలను తిరగతోడుతూ వాటికి అంగీకరించినందుకు కాంగ్రెసును తిట్టిపోస్తున్నారు. దీనికంతా కారణం సీమాంధ్రుల కుట్రే అంటూ వారినీ తిడుతున్నారు. ఎన్నికల సమయంలో సాధారణంగా ఆవేశకావేషాలు హద్దు మీరతాయి. కార్యకర్తలను హుషారు చేయడానికి, ఓటర్లను ఆకట్టుకోవడానికి అసాధ్యమైన హామీలు, ప్రతిపక్షులపై తీవ్రమైన ఆరోపణలు చేయడం కద్దు. ఆ తర్వాత అవన్నీ మర్చిపోయి మామూలుగా వుంటూంటారు కూడా. కెసియార్ కూడా అలాగే వుంటారని అనుకుని ఊరడిల్లవచ్చా?

**నెగ్గినా, ఓడినా యీ ధోరణి మారదు**

ఈ ఎన్నికలలో తెరాస చాలా రిస్కు తీసుకుని పోటీ చేస్తోంది. 2004, 2009లలో పొత్తులు పెట్టుకుని పోటీ చేసింది. ఉపయెన్నికలలో సొంతంగా పోటీ చేసినపుడు కొన్నిసార్లు ఘోరంగా దెబ్బ తింది. మరి కొన్ని సార్లు ఘనవిజయం సాధించింది. 2009 డిసెంబరు ప్రకటన తర్వాతే తెరాస బాగా ఎదిగిందని చెప్పాలి. ఈ ఎన్నికలలో కాంగ్రెసు, బిజెపిలతో పొత్తు పెట్టుకుని వుంటే విజయం సాధించినా ఆ పొత్తుకు పోతుందేమోనన్న భయమో ఏమో కానీ, తెరాస తన సత్తా ఎంతో పరీక్షించుకుంటోందనే చెప్పాలి. ఓటర్లకు తెరాసపై మోజు వుందన్న అభిప్రాయంతోనే యితర పార్టీ నాయకులు వచ్చి తెరాసలో చేరుతున్నారు. కార్పోరేట్ దిగ్గజాలు కూడా. ఇప్పుడు ఛాన్సు వదులుకుంటే మరెప్పుడూ తన శక్తి చూపించే అవకాశం రాదన్న ఉద్దేశంతో తెరాస ఒంటరిగా పోటీ చేస్తోంది. ఆ క్రమంలో కాంగ్రెసు, బిజెపిలతో తలపడుతోంది. ఫలితాలు ఎలా వస్తాయో యిప్పుడే చెప్పలేం కానీ కెసియార్ ప్రజలను కోరుతున్నట్లు 100 ఎసెంబ్లీ సీట్లయితే రావని కచ్చితంగా చెప్పవచ్చు. అనేక చోట్ల తెరాసకు పార్టీ కార్యకర్తలు లేరు. వ్యవస్థ లేదు. కొన్ని జిల్లాలలో తెరాసకు మొదటినుండీ పట్టు లేదు. పట్టున్న వరంగల్, కరీంనగర్ జిల్లాలలో యితర పార్టీ నాయకులు కూడా తెలంగాణ కోసం ఉధృతంగా పని చేసినవారే కాబట్టి వారికీ ఓట్లు పడి పోటీ తీవ్రంగా వుంటుంది. ఫిరాయింపులు ప్రోత్సహించిన చోట, తొలినుండీ వున్న కార్యకర్తలు అలిగి తిరుగుబాటు చేయవచ్చు. ఈ లెక్కన చూస్తే తెరాస గెలుచుకునే సీట్ల సంఖ్య 50 కు దరిదాపుల్లో వుంటుందనుకోవచ్చు. ఊపు వస్తే 10–15 కలుస్తాయి. లేకుంటే అన్ని తగ్గుతాయి. ఏది ఏమైనా తెరాస అధికారం అంచుల్లో వుంటుంది కానీ తప్పకుండా అధికారంలోకి వస్తుంది అని యీ దశలో చెప్పలేం.

తెరాస అధికారంలోకి వస్తే – యిప్పుడు ఎడాపెడా చేస్తున్న వాగ్దానాలు తీర్చలేదని మెడమీద తలకాయ వున్నవాడెవడైనా చెప్పవచ్చు. యీ మాట అన్ని పార్టీలకూ వర్తిస్తుంది. ఎవరూ హామీలు నెరవేర్చరు. దానికి వారు చెప్పే కారణాలు – పూర్వపు ప్రభుత్వం ఖజానా ఖాళీ చేసింది, కేంద్రం సహకరించలేదు, ప్రభుత్వయంత్రాంగం సహకరించటం లేదు, ప్రతిపక్షాలు ప్రతీదాన్నీ రాజకీయం చేస్తున్నాయి, ఆర్థికసంక్షోభానికి కారణం కేంద్రవిధానాలు, అమెరికా విధానాలు, ప్రపంచబ్యాంకు విధానాలు... యిలా వుంటాయి. తెరాస కూడా యివన్నీ చెపుతూనే యింకా కొన్ని చేరుస్తుంది – తెలంగాణ ఎదగకుండా, దానికి నిధులు రాకుండా సీమాంధ్రులు అడ్డుపడుతున్నారు, వాళ్ల పల్లకి మోసే యింటిదొంగలు కూడా వారితో చేరుతున్నారు, ఆంధ్రరాష్ట్రం ఏర్పడినా వెళ్లిపోకుండా యిక్కడే వుండిపోయిన ప్రభుత్వోద్యోగులు, పారిశ్రామికవేత్తలు ప్రభుత్వ పథకాలు సామాన్యులకు అందకుండా చేరుస్తున్నారు, మా పార్టీ పాలనా సామర్థ్యానికి చెడ్డపేరు తెచ్చేందుకు అహరహం శ్రమిస్తున్నారు... ఇలా ప్రతీదానికీ ఆంధ్రులను నిందించడం పరిపాటి అవుతుంది. తెరాస అధికారంలోకి రాకుండా ప్రతిపక్షంలో వుంటే – అప్పుడు కూడా నిందలేస్తుంది. ప్రభుత్వంలో వున్న పార్టీకి ఆంధ్రలో శాఖ వుంది కాబట్టి, వాళ్లకు మేలు చేసేలా వ్యవహరిస్తున్నారని, వాళ్లకు అమ్ముడుపోయారనీ, తామే అధికారంలో వుండి వుంటే అలా జరిగివుండేది కాదనీ, మళ్లీ ఉద్యమం చేసి ఆంధ్ర తొత్తులను తరిమేదాకా నిద్రపోమనీ... యిలా!

## ప్రజలను రెచ్చగొట్టడం సులభం

ప్రజల్లో సాధారణంగా అసంతృప్తి వుంటుంది. దానికి ఎవరో ఒకరిని దోషులుగా నిలబెట్టి, వారినుండి మిమ్మల్ని రక్షించడానికే అవతరించానని చెప్పడం చాలా అనువైన పని. తెరాస చేస్తూ వచ్చినది అదే. విభజన జరిగినప్పుడు యిరుపక్షాలకు ఎంతో కొంత యివ్వక తప్పని పరిస్థితి వుంటుందని అందరికీ తెలుసు. హైదరాబాదును, దాని ఆదాయాన్ని సొంతం తెలంగాణకు కట్టపెట్టినపుడు సీమాంధ్రకు కూడా ఏవో కొన్ని రాయితీలు యివ్వకతప్పదు కదా. ఎప్పుడో శాంక్షన్ అయిన పోలవరం ప్రాజెక్టును యిప్పుడు మెహర్బానీగా యిచ్చినట్టుగా చూపించారు. ప్రత్యేక రాష్ట్ర హోదా అన్నారు, అదీ తక్కిన రాష్ట్రాలు ఒప్పుకుంటేనే సాధ్యమవుతుంది. పన్ను రాయితీలు, వెనుకబడిన ప్రాంతాలుగా గుర్తింపు వగైరాలు వచ్చే కేంద్రప్రభుత్వం కటాక్షవీక్షణాలపై ఆధారపడి వున్నాయి. పోలవరం ముంపు గ్రామాల ఆర్డినెన్సు విడుదల చేయబోయి ఆపేశారు. ఇవన్నీ కాగితాలపై యిచ్చిన ఉత్తుత్తి హామీలే. కానీ వీటినే కెసియార్ చూపించి 'ఆంధ్రకు అన్నీ దోచిపెడుతూంటే టి–కాంగ్రెసు నాయకులు గుడ్లప్పగించి చూస్తూ కూర్చున్నారు, బిజెపి వారు వంతపాడారు' అని ప్రచారం చేస్తున్నారు. పోలవరం కట్టనీయం అని టి–కాంగ్రెసు నాయకులు ప్రకటిస్తేనే వాళ్లు అచ్చమైన తెలంగాణ బిడ్డలట, కాకపోతే కారట. ఆ రాయితీలు, ప్రత్యేక హోదాలు తెలంగాణకు యివ్వకపోవడం అన్యాయం అని హుంకరిస్తున్నారు. తెలంగాణకు హైదరాబాదు పూర్తిగా యిస్తారని ఎవరూ అనుకోలేదు. ఆదాయంలో సీమాంధ్రకు వాటా యిస్తారనే అనుకున్నారు. అది కూడా ఎగ్గొట్టినా కెసియార్‌కు చాలలేదు. ఇంకా ఏదో చేయలేదని సాధిస్తున్నారు.

ఆయన ప్రధాన టార్గెట్ ఉద్యోగులు. వాళ్లకు ఆప్షన్లు ఎలా యిస్తారు? వాళ్లు వెళ్లకపోతే తెలంగాణ నిరుద్యోగులకు ఉద్యోగాలు ఎలా వస్తాయి? అని తెలంగాణ యువత ఉపాధి అవకాశాలు చెడిపోవడానికి ప్రభుత్వోద్యోగుల ఆప్షన్లే కారణం అని చిత్రీకరిస్తున్నారు. ఆప్షన్ల విషయంలో రాజ్యాంగం కొన్ని పద్ధతులు నిర్దేశించి వుంటుంది. గతంలో రాష్ట్రాలు విడిపోయినప్పుడు ఎలా చేశారో చూసి, అలాగే యిక్కడా చేస్తారు. చేయాలి. లేకపోతే బాధితులు కోర్టులకు ఎక్కి మొత్తం ప్రక్రియపై స్టేలు తెచ్చుకుంటారు. కెసియార్ చెప్పారు కదాని ఆప్షన్లు మానడమో, పొన్నాల చెప్పారు కదాని యివ్వడమో చేయరు. ఆప్షన్లు వుండవని చెప్పకపోతే పొన్నాల తెలంగాణ ద్రోహి

అని కెసియార్ తీర్మానించారు. హీరోషిమా, నాగసాకిల కంటె తెలంగాణలో ఎక్కువ విధ్వంసం జరిగిందట, దానికి కారణం వలస పాలకులట. కెసియార్ చాలా ఏళ్లు రూలింగు పార్టీలో వున్నారు. మరి ఆయనకు ఆ విధ్వంసంలో బాధ్యత లేదా? అన్నీ ఆంధ్రుల నెత్తిన రుద్ది ఉద్యమం నడిపారు. అనుకున్నది సాధించారు. ఇక రాష్ట్రం వచ్చాక కూడా ఎన్నికలలో లబ్ధికోసం అదే పాట పాడితే ఎలా? కానీ పాడతారు. ఈయనే కాదు, ప్రభుత్వంలో మంత్రి పదవులు దక్కక బయటకు వచ్చిన ప్రతి అసమ్మతి నాయకుడూ యిదే రాగం ఎత్తుకుంటారు. తక్కినవాళ్లు ఆంధ్రులకు అమ్ముడుపోయారని, అది చూడలేకే బయటకు వచ్చాననీ చెప్పుకుంటారు. గతంలో విజయశాంతి చెప్పుకోలేదా? తను తెలంగాణ బిడ్డ అనే కారణం చేత ఆంధ్ర సినిమా నటులు, నిర్మాతలు అవకాశాలు యివ్వలేదట, ఆ ఆధిక్యం భరించలేకే బయటకు వచ్చి తల్లి తెలంగాణ పార్టీ పెట్టిందట. ఆమె అంతటి స్టార్ కావడానికి కారణం ఎవరో అందరికీ తెలుసు. రాజకీయ అవసరం ఏమైనా అనిపిస్తుంది.

ఈ రగడలు యిప్పట్లో చల్లారవు

కెసియార్ చెప్పినమాటల్లో ఒక వాస్తవం వుంది – ఆంధ్రులతో పంచాయితీ ముగిసిపోలేదు అని. ఉమ్మడి రాజధాని వున్నంతకాలమే కాదు, తర్వాత కూడా నదీజలాల వద్ద, నీటి ప్రాజెక్టుల పంపిణీ వద్ద, విద్యుత్ పంపకాల వద్ద, ఆస్తి అప్పుల వివాదాల వద్ద.. యిలా ఎన్నో ఏళ్లపాటు యిచ్చిపుచ్చుకోవడాలు జరుగుతూనే వుంటాయి. కొన్నిటిలో ఒకరిది పై చేయి అవుతుంది, మరి కొన్ని వాటిల్లో యింకోరిది అవుతుంది. ఈ రోజు సోనియా తెలంగాణకు అనుకూలంగా వ్యవహరించి సీమాంధ్రకు సున్న చుట్టినట్లు, రేపో, మర్నాడో కేంద్రంలో వచ్చే ప్రభుత్వం సీమాంధ్రను చంకకు ఎత్తుకుని, తెలంగాణను నిర్లక్ష్యం చేయవచ్చు. అంతా ఆనాటి రాజకీయ అవసరాలపై ఆధారపడుతుంది. తాము కోరుకున్న విధంగా జరగనప్పుడల్లా అధికారంలో వున్నవారు అమ్ముడుపోయారని అంటూ వుంటే యీ రగడ ఎప్పటికీ చల్లారదు. ఢిల్లీలో వున్న ఎపి భవన్‌పై కెసియార్‌కు అంత మమకారం దేనికో తెలియదు. దానిలో ఆంధ్రకు వాటా యివ్వకూడదట, అచ్చం తెలంగాణకే కావాలట. హైదరాబాదు వంటి మహారాజధాని దక్కినందుకు ఆయనకు తృప్తి లేదు. విద్యుత్ సౌధ తెలంగాణకు పూర్తిగా యిచ్చేసి ఆంధ్ర విద్యుత్ బోర్డుకు గచ్చిబౌలిలో భవనం చూస్తున్నారని వార్తలు వచ్చాయి. నగరం నడిబొడ్డులో వున్న విద్యుత్ సౌధ నుండి మమ్మల్ని వూరవతలికి పొమ్మంటే ఎలా అని ఆంధ్ర ఉద్యోగనాయకులు గోల చేస్తూంటే, పాత భవనాలు మా మొహాన కొట్టి, కొత్తవి వాళ్లకిస్తారా అని తెలంగాణ ఉద్యోగనాయకులు ఫిర్యాదు చేస్తున్నారు. ఇలా ప్రతీదాన్నీ వివాదంలోకి దించితే పంపకాలకై వచ్చిన కేంద్ర ఉన్నతోద్యోగులు జుట్టు పీక్కోవాలి.

ఉమ్మడి రాజధాని పదేళ్లెందుకు? అని యింకో పేచీ. అసలు ఉమ్మడి రాజధాని వలన ఆంధ్ర రాష్ట్రానికి లాభం ఏమిటో నాకు అర్థం కాలేదు. ఆంధ్ర ఉద్యోగులు, నాయకులు మాటిమాటికీ హైదరాబాదు వచ్చి యిక్కడి వ్యాపారసంస్థలు దెబ్బ తినకుండా చూడడం తప్ప దాని వలన ఆ రాష్ట్రానికి ఒనగూడే ప్రయోజనం ఏముంది? హైదరాబాదులోని వాళ్ల ఆఫీసులకు అద్దె కట్టుకోవాలి. అక్కడే అయితే తక్కువలో వస్తాయి. ఆ అద్దె తెలంగాణ రాష్ట్రానికే ఆదాయంగా వస్తుంది. అలాగే వారు పెట్టే ఖర్చంతా తెలంగాణ అభివృద్ధికే దోహదపడుతుంది. హైదరాబాదు ఆదాయంలో సీమాంధ్రకు వాటా వుంటే అదో దారి. అది లేనప్పుడు వాళ్లు యిక్కడకు వచ్చి తెలంగాణకు మేలు చేయడం దేనికి? పైగా అలా రావడం వలన యిక్కడకు వచ్చి యింకా దోపిడీ కొనసాగిస్తున్నారన్న మాట పడడం తప్పు! వాళ్లు యిలా వస్తూపోతూ వుంటే – 'మెడ పట్టుకుని గెంటినా యింకా సిగ్గు లేకుండా వస్తున్నారు' అని ప్రచారం చేయడం తథ్యం. ఇలాటి వాదనలే మహారాష్ట్రలో శివసేన చేసింది. శివసేన ఆవిర్భావానికి పూర్వం బొంబాయి, మహారాష్ట్ర అన్ని జాతుల వారికీ ఆశ్రయం యిచ్చింది. గుజరాతీలు, సింధీలు, పార్శీలు, పంజాబీలు, దాక్షిణాత్యులు.. అందరూ బొంబాయి ఆర్థికాభివృద్ధికి తోడ్పడి దాన్ని ఫైనాన్షియల్ కాపిటల్ ఆఫ్ ఇండియాగా తీర్చిదిద్దారు. శివసేన వచ్చాక రూపం మారింది. బొంబాయి మహారాష్ట్రులదే అన్న నినాదం బయలుదేరింది.

## శివసేన – గుజరాతీలు

మహారాష్ట్ర నుండి గుజరాత్ విడివడింది. అయినా గుజరాతీలకు వ్యతిరేకంగా బొంబాయిలో ఉద్యమాలు జరగలేదు. ఎందువలన? గుజరాతీలు అక్కడ పెట్టుబడులు పెట్టారు, చిన్న వ్యాపారాల నుండి పెద్ద వ్యాపారాల దాకా చేస్తూ మహారాష్ట్రులకు కూడా ఉద్యోగాలు యిచ్చారు. ఉద్యోగాల విషయంలో మరాఠీ వారితో పోటీ పడలేదు. గుజరాతీలకు చదువు పట్ల, ఉద్యోగాల పట్ల పెద్దగా శ్రద్ధ లేదు. వారు ప్రధానంగా వ్యాపారస్తులు. అందువలన మరాఠీలు, శివసైనికులు వారిని ఏమీ అనరు. వారినే కాదు, ఏ పెట్టుబడిదారుణ్నీ వాళ్లు ఏమీ అనరు. అంతేకాదు, వారి మద్దతుతో కార్మిక నాయకులను హింసించారు. ఇతర ప్రాంతాల నుండి వచ్చిన వారిలో తమిళులన్నా, కన్నడిగులన్నా వారికి కోపం వుండేది. ఎందుకంటే వారు వైట్ కాలర్ ఉద్యోగులుగా వచ్చి తమ అవకాశాలు చెడగొడుతున్నారని! అందువలన తమిళ కాలనీలపై, ఉడుపి హోటళ్లపై దాడులు చేస్తూ సాధారణ మరాఠీలను ఆకట్టుకున్నారు. ఇటీవలి కాలంలో బ్లూ కాలర్ ఉద్యోగాలలో ఉత్తరభారతం నుండి జనాలు వచ్చి పొట్ట పోసుకుంటున్నారని వారిపై దాడులు చేస్తున్నారు. తెలంగాణకు వచ్చేసరికి పరిస్థితి ఏమిటంటే – ఇక్కడ ఆంధ్రులు పెట్టుబడిదారులు కావడంతో బాటు ఉద్యోగార్థులు కూడా. రిస్కు తీసుకుని పెట్టుబడి పెట్టి తమకు ఉద్యోగాలు యిస్తే తెలంగాణ వారికి అభ్యంతరాలు వుండవు కానీ, తమతో పాటు ఉద్యోగాలకు

పోటీ పడితే చికాకే.

నిరుద్యోగులను, చిరుద్యోగులను ఆకట్టుకోవడానికి తెరాస శివసేన బాట పట్టే అవకాశాలు చాలా వున్నాయి. ప్రతి పార్టీలో మితవాదులు, అతివాదులు వుంటారు. దూకుడుగా మొదలైన నాయకత్వం కొంతకాలానికి నిదానిస్తుంది. అప్పుడు యువతరంలోని అతివాదులు విడిగా వచ్చేసి వృద్ధనాయకులపై తిరుగుబాటు చేసి యువతను ఆకట్టుకుని యింకా ఎక్కువ పరుషపదజాలాన్ని ఉపయోగిస్తారు. బాల థాకరే కొడుకు ఉద్ధవ్ థాకరే కంటె సోదరుని కుమారుడు రాజ్ థాకరే ఎక్కువ పాప్యులారిటీ తెచ్చుకుంటున్న విషయం గమనిస్తున్నాం. ఇక్కడ కెసియార్, కెటియార్, హరీష్‌రావుల విషయంలో ఆ కథ పునరావృతం కావచ్చు. అదే జరిగితే నష్టపోయేది తెలంగాణ సమాజమే. అర్హత మాట ఎత్తకుండా భూమిపుత్రుల వాదంతో ఉద్యోగాలు కావాలనే వాదన అన్ని చోట్లా ప్రబలింది. అది అక్కడితో ఆగదు. కులం ప్రాతిపదికపై యివ్వాలంటారు. కులం తర్వాత ఉపకులం ప్రస్తావన కూడా వస్తుంది. ఆంధ్రులకు వ్యతిరేకంగా పోరాడడానికి తెలంగాణ వారంతా కలిసి వచ్చారు. ఇప్పుడు ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి విభేదాలన్నీ ఉబికి వస్తున్నాయి. ఎవరికి వారే యమునాతీరే చందంగా మారి దొరల పాలన, గడీల పాలన అంటూ నిందించుకుంటున్నారు. చీలిపోతున్నారు. యువతలో నాణ్యత పెంచి, వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి బదులు యిలాటి ప్రాంతీయవాదాన్ని రెచ్చగొట్టి యిక్కడి పారిశ్రామిక వేత్తలపై నిషేధాలు విధించడం మొదలుపెడితే యిక్కడ పెట్టుబడులు పెట్టడానికి వారు జంకుతారు. అంతిమంగా అది రాష్ట్రవికాసానికి అవరోధంగా మారుతుంది. తెలంగాణ ప్రజల హితాన్ని కోరేట్లయితే కెసియార్ బాల్ థాకరే మార్గాన్ని విడిచి స్టేట్స్‌మన్‌గా వ్యవహరించాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 24-25 వీక్లీకై** **ఎమ్బీయస్ : పొత్తుల వెనుక ఎత్తుపైయెత్తులు**

సీమాంధ్రలో టిడిపి-బిజెపి పొత్తులపై తుదిరూపం ఇవాళ రావచ్చంటున్నారు. వస్తుందో లేదో తెలియదు. నిన్న బాబు 'తెలంగాణలో బిజెపితో పొత్తు వుంది, సీమాంధ్రలో లేదు' అని బహిరంగంగా అన్నారు. వెంటనే 'ఆయన అన్నది విన్నాం. ప్రస్తుతానికి పొత్తు వుంది. రేపు ఏ విషయం తేలుస్తాం' అన్నారు జావడేకర్. అదే ఫైనలో, ఆ తర్వాత 'అబ్బే యివన్నీ తూనాబొడ్డు, ఆటల్లో అరటిపండు, ఉత్తుత్తినే వేళాకోళం ఆడుకున్నాం' అంటారేమో తెలియదు. ఈ రెండు పార్టీల మధ్య తెలంగాణలో పొత్తు గురించి కూడా యిలాటి సీ-సా గేమ్ జరిగింది. ఫైనల్‌గా ఏదో తునితగవు చేసుకున్నారు. అక్కడ పొత్తు వద్దని బిజెపి క్యాడర్ తిరుగుబాటు చేసినా బాబు బిజెపి జాతీయనాయకత్వాన్ని ఒప్పించి వాళ్ల మెడలు వంచారు. సీమాంధ్రకు వచ్చేసరికి తిరుగుబాటు చేయడం టిడిపి క్యాడర్ వంతైంది. ఇప్పుడు వారి మెడలు వంచవలసిన టిడిపి నాయకత్వమే వారికి తలవంచుతోంది. దానికి పలుకారణాలు చెపుతోంది.

## బలం లేనిచోట్ల సీట్లు అడిగితే ఎలా..?

రెండు రాష్ట్రాలు యింకా విడిపోనప్పుడు పొత్తు పార్టీలు మొత్తం ప్యాకేజీ ఒకేసారి మాట్లాడుకోవలసినది. తెలంగాణలో పొత్తు కుదిరి, నామినేషన్ల ఘట్టం పూర్తయేదాకా ఆంధ్రపై పేచీ పెట్టకుండా వుండి, యిప్పుడు టిడిపి పేచీ పెట్టడం అన్యాయంగా తోస్తుంది. బిజెపికి ఎలాట్ చేసిన స్థానాల్లో టిడిపి నాయకులు ఎడాపెడా నామినేషన్లు వేసేస్తున్నారు. వీరికి బుద్ధి చెప్పడానికి తెలంగాణలో అన్ని స్థానాలకూ పోటీ చేయాలని తెలంగాణ బిజెపి నాయకులు అనుకున్నా అక్కడ నామినేషన్ల గడువు దాటిపోయింది. స్థూలంగా అంకెలు నిర్ధారించుకున్నాం కాబట్టి, పొత్తు కుదిరినట్టే అని బిజెపి నాయకులు అనుకున్నారు లాగుంది. ఇప్పుడు బాబు బిజెపిలో తప్పులు ఎంచుతున్నారు. వారు తమకు బలం లేని చోట్ల సీట్లు అడిగారట, అక్కడ బలహీనమైన అభ్యర్థులను నిలుపుతున్నారట, తాము చెప్పిన కాండిడేట్లకు టిక్కెట్లు యివ్వలేదట. ఈ కారణాలు భలే వింతగా వున్నాయి. పొత్తు ప్రతిపాదన చేసినపుడు బిజెపికి బలం వుండి, నామినేషన్ల వద్దకు వచ్చేసరికి హఠాత్తుగా బలం యిగిరిపోయిందా?

అసలు బిజెపికి ఆంధ్రలో బలం ఎక్కడుంది కనుక? ఒకచోట బలం వుందని, మరో చోట బలం లేదని, ఫలానా బిజెపి నాయకుడు బలవంతుడని, ఫలానావారు బలహీనుడని బాబు ఎలా నిర్ణయిస్తున్నారు? గత అసెంబ్లీలో బిజెపికి ఆంధ్రలో సీట్లు లేవు కదా, వారు చేపట్టిన ఉద్యమాలు ఏవీ లేవు కదా. స్థానిక ఎన్నికలు జరిగి వుంటే ఫలానా మునిసిపాలిటీలో వారికి ఆధిక్యం వుంది అనుకునేవారం. టీవీ చర్చల్లో కూడా బిజెపి నాయకులు పాల్గొన్నారు అంటే వారు తెలంగాణ నాయకులే తప్ప, ఆంధ్ర నుండి ఎవరూ లేరు. జులై తెలంగాణ ప్రకటన వచ్చిన తర్వాత ఆంధ్ర బిజెపి నాయకులంటూ ఒకరిద్దరు అప్పుడప్పుడు టీవీల్లో కనబడ్డారు. ఇలాటి బిజెపికి కొన్ని స్థానాల్లో బలం వుందని, మరి కొన్ని వాటిల్లో లేదని బాబు ఎలా చెప్పగలరు? ఆట్టే మాట్లాడితే ఎక్కడా లేదు. కమలం గుర్తును గ్రామీణప్రాంత ప్రజలు గుర్తు పడతారని కూడా అనుకోను. ఇప్పుడు మోదీ హవా వీస్తోందని హోరెత్తిస్తున్నారు కాబట్టి నగరాలలో మధ్యతరగతి ప్రజలు (వీళ్లల్లో ఓట్లేసేవారు ఎందరో తెలియదు) బిజెపికి ఓటేస్తారని అనుకోవాలి. అది కూడా మోదీని ప్రధాని చేయడానికి.. అంటే, పార్లమెంటు ఎన్నికలలోనే బిజెపికి ఛాన్సుంది! స్థానిక బిజెపి నాయకుణ్ని మంత్రిని చేయడానికై అసెంబ్లీ ఎన్నికల్లో బిజెపికి ఓటేస్తున్నాం అని ఓటరు ఎవరి గురించైనా చెప్పగలరా? అసలు ఎవరున్నారో తెలిస్తే కదా! అందరూ బలహీన

నాయకులే. ఏ పొత్తు లేకుండా సొంతంగా నిలబడి గెలిచే కాండిడేటు ఒక్కడూ కనబడరు.

## బిజెపి దేహంలో టిడిపి ఆత్మ

బిజెపికి వున్న నాయకుల కొరత తెలిసే బాబు పాపం సాయపడదామనుకున్నారు. కాంగ్రెసు, వైకాపాల నుండి తన దగ్గరకు వచ్చినవారిలో కొందర్ని డైరక్టుగా చేర్చుకున్నారు. మరి కొంతమందిని బిజెపిలో చేర్పించారు. అంటే వారు పేరుకి బిజెపి, కానీ బాబు మనుష్యులన్నమాట. రేపుమర్నాడు బిజెపి టిడిపికి వ్యతిరేకంగా వ్యవహరించబోతే వీళ్లు అడ్డుకుంటారన్నమాట. బిజెపిలో వుంటే టిడిపి ప్రయోజనాలు కాపాడతారన్నమాట. 1960లలో సిపిఐ యిలాటి ప్రయోగమే చేసింది. కాంగ్రెసు పార్టీని అధికారంలోకి రాకుండా ఎలాగూ నిరోధించలేం కాబట్టి మనవాళ్లనే ఆ పార్టీలోకి పంపించి, వారి విధానాలను మన కనుగుణంగా మలచుకోవాలి, వారి చేత మనకు అనుకూలమైన పనులు చేయించుకోవాలి అని సిద్ధాంతపరమైన నిర్ణయం తీసుకుని ఆ విధంగా అనేకమంది పెద్దనాయకులు కాంగ్రెసులో చేర్పించింది. వాళ్లు ఒక జింజర్ గ్రూపుగా ఏర్పడి కాంగ్రెసులో విభేదాలను రెచ్చగొట్టారు. మొరార్జీ, అతుల్య ఘోష్, ఎస్ కె పాటిల్ యిత్యాదులు సిండికేటుగా ఏర్పడి ఇందిరా గాంధీని కట్టడి చేసే రోజుల్లో వీళ్లు ఇందిర చెంత చేరి, సిండికేటును తూర్పారబట్టి ఇందిర చేత బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు వంటి సోషలిస్టు కార్యక్రమాలు చేయించారు. వీరి పుణ్యమాని కాంగ్రెసు చీలింది. మద్దతు ఎంతదూరం వెళ్లిందంటే ఇందిర ఎమర్జన్సీ ప్రకటించినా వీరు మద్దతు యిచ్చారు. తమ పార్టీకి ధారాళంగా నిధులు పొందారు. ఆ సమయంలోనే సిపిఐకు అన్ని రాష్ట్రాలలో చక్కటి భవంతులు ఏర్పడ్డాయి. సిపిఎం ఎమర్జన్సీని ఎదిరించి, తన కార్యకర్తలను జైళ్లకు పంపింది. అందువలన ఎమర్జన్సీ అనంతరం సిపిఎం పెద్ద పార్టీగా ఎదిగింది, సిపిఐ కుంచించుకుపోయింది. బుద్ధి వచ్చిందని లెంపలేసుకుని కాంగ్రెసుకు దూరమయ్యారు. ఇప్పుడు టిడిపి కోవర్టులను బిజెపిలో చేర్చడంలో వ్యూహం ఏమిటో కొన్నేళ్లకు కానీ తెలియదు.

బిజెపికూడా చరిత్ర చదువుకున్నదే కాబట్టి బాబు చెప్పిన కాండిడేట్లకు టిక్కెట్టు యివ్వనంది. మా పార్టీ ఎవరికి యివ్వాలో చెప్పడానికి మీరెవరు అంటోంది. తమను పూర్తి డమ్మీ చేయడానికి బాబు పూనుకుంటే సహించే స్థితిలో ఆంధ్ర బిజెపి లేదు. తెలంగాణ బిజెపి వున్న కార్యకర్తలు వీళ్లకు లేకపోవచ్చు. కానీ మోదీ ప్రభంజనం జనాల్ని వూపేస్తోందన్న ఆశాభావం మాత్రం దండిగా వుంది. అది చూసే బాబు తన చుట్టూ తిరుగుతున్నారనీ, లేకపోతే ఛస్తే తమను దగ్గరకు రానివ్వనని ఒట్టు పెట్టుకున్న బాబు యిప్పుడు ఎందుకు వాటేసుకుంటున్నారని వాళ్ల సందేహం. ఆంధ్రలో బిజెపి నాయకులు లేరు కానీ ఆరెస్సెస్ కార్యకర్తలైతే వందల సంఖ్యలోనైనా వుంటారు కదా. వాళ్లు ముందుకు వచ్చి వ్యవహారాలు సెటిల్ చేయసాగారు. గతంలో టిడిపితో పొత్తు పెట్టుకుని రాష్ట్రంలో పార్టీని నాశనం చేసుకున్నామని, యిప్పుడు సొంతంగా ఎదగాలంటే బాబుకు తోకలా వుండకుండా స్వతంత్రంగా వ్యవహరించాలని గట్టిగా నిశ్చయించుకుని, బాబు చెప్పిన అభ్యర్థులను కాదంటోంది. అది బాబుకి చిర్రెత్తిస్తోంది. ఆరెస్సెస్‌పై ఆగ్రహాన్ని బహిరంగంగా వెళ్లగక్కారు కూడా. మహాకూటమి రోజుల్లో కెసియార్ వ్యవహరించినట్లు యిప్పుడు బాబు వ్యవహరించడం ఆశ్చర్యంగా వుంది. గుట్టుగా వుండే మనిషి యిప్పుడిలా బయటపడడమేమిటి? ఇది బిజెపిని బెదిరించి మరిన్ని సీట్లు తీసుకోవడానికా? ఈయనకు ఏం కావాలన్నా బిజెపి నుండి నరుక్కురావడానికి వెంకయ్యనాయుడున్నారు. 'బాబుగారు కోపంగా వున్నారట. మనకు మోదీ ప్రధాని కావడం అవసరం. ఆ నాలుగు పార్లమెంటు సీట్లు తీసుకుని 14 ఎసెంబ్లీ సీట్లలో సగం వాళ్ల మొహాన విసిరికొడదాం' అని వెంకయ్యగారు రాజ్‌నాథ్‌కు నచ్చచెప్పవచ్చు.

## తెలంగాణలో పర్యవసానాలు

ఇక్కడ ఎలాగోలా మేనేజ్ చేస్తారు, సరే, కానీ దీని పర్యవసానాలు తెలంగాణపై పడవా? అక్కడి బిజెపి నాయకులు అభ్యర్థులను నిలపలేరు కానీ నిలబడిన స్వతంత్ర అభ్యర్థులలో ఎవరో ఒకరికి మద్దతు యివ్వవచ్చు కదా. ఎవరూ దొరక్కపోతే తెరాస ఎలాగూ వుంది. కార్యకర్తలు ఒక ఏడాదిగా కలిసి ఉద్యమాలు చేస్తూ వుంటే వాళ్ల మధ్య పొత్తు వర్కవుట్ అవుతుంది. ఎన్నికల సమయంలో ఆఖరి రోజు వరకు చర్చలు, వాదోపవాదాలు జరిగితే ఆఖరి నిమిషంలో రెండు, మూడు వారాల గడువులో కార్యకర్తలు ఒకటవగలరా? ఈ కష్టాలకు తోడు ఆంధ్రలో తమ పార్టీకి టిడిపి జెల్లకాయ కొట్టిందని తెలిస్తే కార్యకర్తలు మండిపడరా? ఈ విషయాలు బాబుకి తోచడం లేదా? ఎక్కడో అక్కడ విషయాన్ని తెగ్గొట్టకుండా పొత్తుకి చెడ్డపేరు ఎందుకు తెస్తున్నారు? సమాధానం చెప్పడం కష్టం. తెలంగాణలో మీ మాట వినాల్సి వచ్చింది, కానీ ఆంధ్రలో నేనే కింగ్‌ను అని బిజెపికి గట్టిగా ప్రైవేటు చెప్దామనుకుంటున్నారా?

'మోదీ–బాబు యిద్దరిదీ ఒకే బాట, ఆ కాంబినేషన్ తిరుగులేనిది, ప్రస్తుతం సీమాంధ్రకు కావలసినది యిలాటి జమిలి నాయకత్వమే ' అని టిడిపి అనుకూల మీడియా ఊదరగొడుతోంది. మొదటగా గ్రహించవలసినది మోదీ గుజరాత్ మోడల్ వేరు, బాబు ప్రస్తుత మోడల్ వేరు. మోదీ స్కీములో సంక్షేమపథకాలు లేవు. అంతా కార్పోరేట్‌కు మేలు చేసే వ్యవహారాలే. గ్రామీణులకు, పేదలకు ఒరిగేదే ఏమీ లేదు. ప్రపంచబ్యాంకు మెచ్చుకునే విధానాలు వాళ్లవి. బాబు ఒకప్పుడు యిలాగే వుండేవారు. కార్పోరేట్ సిఇఓగా

రాష్ట్రాన్ని పాలించారు. కానీ అది బెడిసికొట్టింది. ఊళ్లో పల్లకీల మోత, యింట్లో ఈగల మోత అన్నట్టు అంతర్జాతీయ పత్రికలు ఆకాశానికి ఎత్తేస్తే, స్థానిక ఓటర్లు పాతాళానికి తొక్కేశారు. పదేళ్లగా ప్రతిపక్షంలో కూర్చోబెట్టారు. కాంగ్రెసు ఆశ చూపించిన సంక్షేమ పథకాలే వారికి నచ్చాయి. ఇక బాబు పంథా మార్చి సంక్షేమం అనడం మొదలెట్టారు. ఇప్పుడు ఆయన తనదీ, మోదీది ఒకటే ధోరణి అని ఎలా అనగలరు? విభజన తర్వాత సీమాంధ్రలో ఉద్యోగుల జీతాలు కూడా యివ్వలేని పరిస్థితి వస్తుందని చెప్పిన యీ ఆంధ్ర నాయకులందరూ యిప్పుడు పెద్ద పెద్ద పథకాల గురించి మాట్లాడుతున్నారు, వాటితో బాటు సంక్షేమపథకాలు కూడా అమలు చేస్తారట. అన్ని పార్టీల మానిఫెస్టోలు అతిశయోక్తులతో వుంటే బాబుగారిది మరీ ఎక్కువగా వుంది. ఆయన మోదీ బాటైనా పట్టాలి, లేదా సంక్షేమ పథకాల గురించైనా మాట్లాడాలి. రెండూ చెపితే జనం నమ్మడం కష్టం.

## వైకాపాతో బహుపరాక్

ఒక విషయం మాత్రం స్పష్టం. టిడిపి వైకాపాను గట్టి ప్రత్యర్థిగా భావిస్తోంది. బయటకు ఏం చెప్పినా, వైకాపాకు తమతో సమానంగా సీట్లు వచ్చే ప్రమాదం వుందన్న భయం లోపల వుంది. ఏ మాత్రం ఏమరుపాటుగా వున్నా, వైకాపాకు తమ కంటె ఎక్కువ సీట్లు వస్తాయన్న శంకా వుంది. బిజెపికి యిచ్చిన సీట్లలో బలమైన అభ్యర్థులు లేక, వైకాపాకు గెలిస్తే తమకు అధికారం చేజారిపోతుందన్న జంకు వుంది. అందువలన ప్రతి సీటూలోనూ తమ అదృష్టాన్ని పరీక్షించుకుందామని చూస్తున్నారు. ఒకప్పుడైతే కాంగ్రెసు, వైకాపా, టిడిపి సమానస్థాయిలో వుండేవి. విభజన తర్వాత కాంగ్రెసు నాయకుల గుండెధైర్యం జారిపోవడంతో ఆ పార్టీని సీమాంధ్రలో దివాళా తీయించడానికి ఆ నాయకులందరినీ తన పార్టీలో చేర్చుకోసాగారు. ఆ స్ట్రాటజీ బాగానే వుంది కానీ యిది ఏ ఆర్నెల క్రితమో జరిగివుంటే బాగుండేది. సరిగ్గా ఎన్నికల సమయంలో అప్పటిదాకా నియోజకవర్గాన్ని పోషించుకుంటూ వచ్చిన వ్యక్తిని పక్కకు పడేసి కాంగ్రెసువాణ్ని తీసుకుని వచ్చి 'వీరివీరి గుమ్మడిపండు, వీరి పేరే అభ్యర్థి' అంటే యీ టిడిపి కార్యకర్తకు దిమ్మ తిరిగిపోదా? తాము ఆందోళనలు చేసినదీ, యితన్ని అవినీతి పరుడని నిందించినదీ ఈ కాంగ్రెసు నాయకుడికి వ్యతిరేకంగానే కదా. ఇప్పుడు అతను యింద్రుడు, చంద్రుడని ప్రజలకు చెప్పడం ఎలా? అందువలన తన క్యాడర్ అర్ధమనస్కంగా పనిచేసి విజయావకాశాలు దెబ్బ తీస్తారన్న యింగితం బాబుకి కూడా వుండే వుంటుంది. ఇప్పుడు ఆయన ప్రకటించిన ఎంపీ అభ్యర్థుల జాబితాలో ఒరిజినల్ టిడిపి వారి కంటె యితర పార్టీ నాయకులే రెట్టింపు వున్నట్టున్నారు. ఈ కారణాల చేత తన పార్టీ విజయావకాశాల గురించి మీడియాలో వచ్చేదంతా ఆయన నమ్మటం లేదనుకుంటున్నాను. అందుకే బిజెపి నుండి సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు గుంజుకుందామని చూస్తున్నారు. లేదా తన వాళ్లచేతనే బిజెపి వేషం వేయించి గెలిపించుకుందామని చూస్తున్నారు.

టిడిపికి తెలంగాణలో అధికారం దక్కుతుందని ఎంతటి ఆశావాదీ చెప్పడు. సీమాంధ్రలో ఛాన్సుంది అన్నవరకే చెప్పగలం. ఛాన్సు గట్టిగా లేకపోతే, అధికారం కొద్దిలో మిస్సయిపోతే మూడుసార్లు వరుసగా ఓటమి చవిచూసినట్లు అవుతుంది. ఇక టిడిపి క్యాడర్ చెల్లాచెదరు కావచ్చు. వాళ్లు ఎక్కడకు పోవచ్చు? కాంగ్రెసు పార్టీలో కాని, దాని నుండి విడివడి వచ్చిన వైసీపీ, సమైక్యపార్టీలలో చేరడానికి సిద్ధాంతరీత్యా అభ్యంతరాలు వుండవచ్చు. మోదీ ప్రధాని అయి, దక్షిణాదిన పార్టీ వేళ్లూనుకునేలా చేయాలని భావిస్తే ఆ పార్టీలో చేరిన పక్షంలో త్వరగా పెద్ద నాయకుడిగా ఎదిగే అవకాశాలున్నాయి. అందువలన యీ క్యాడర్ బిజెపిలో చేరి, టిడిపికి ప్రత్యర్థిగా మారవచ్చు. అది జరగకుండా చూడాలంటే బిజెపి ఆంధ్రలో బలపడకుండా చేయాలి. దానికి గాను పొత్తు వుంటుందంటూనే వాళ్ల అభ్యర్థులు గెలవకుండా చేయాలి. గెలిచిన కొద్దిమంది అభ్యర్థులూ తనవాళ్లయి వుండాలి.

## టిడిపి తరఫు వాదన

పొత్తు యిలా చెడగొట్టడానికి టిడిపి యిస్తున్న సంజాయిషీ ఏమిటంటే – మోదీకి సన్నిహితుడైన అదానీ జగన్‌కు కలిసి మంతనాలు సాగించారట. ఇలా డబుల్‌గేమ్ ఆడుతున్న బిజెపి ధోరణి చూసే బాబుగారికి ఆగ్రహం వచ్చిందట. ఈ సమావేశం వార్తను టిడిపి అనుకూల మీడియాయే ప్రచారంలోకి తెచ్చినా నమ్మడానికి ఏమీ శంకించనక్కరలేదు. రాజకీయాల్లో ఒకరితో మరొకరు ఎప్పుడూ కలుస్తూనే వుంటారు. తెలంగాణ సాధించుకోవడానికి కాంగ్రెసు ఢిల్లీ పెద్దలు బిజెపి నాయకుల యిళ్లకు వెళ్లలేదా? ఎన్నికల వేళ రాజకీయ నాయకులు, వారి తరఫున పారిశ్రామికవేత్తలు ప్రత్యర్థులను కలిసి బేరసారాలు ఆడడం సహజం. టిడిపి బలపడకుండా వైకాపా ప్రయత్నిస్తుందన్నది అందరికీ తెలిసినది సత్యం. 'టిడిపితో పొత్తెందుకు, ఎన్నికల తర్వాత మీరు అధికారంలోకి వస్తే నేను మీకు మద్దతు యిస్తాను కదా' – అని జగన్ మోదీకి ప్రతిపాదించడంలో ఆశ్చర్యం ఏముంది? టిడిపి, వైకాపాలలో ఎవరికి ఎక్కువ సీట్లు వస్తాయో తెలియని యీ ఘడియలో 'అబ్బే మీ మొహం చూడం' అని బిజెపి అంటుందా? ద్వారములు తెరిచే వున్నాయి అంటుంది ఏ పార్టీ అయినా. తెరాస, బిజెపి యీరోజు తెలంగాణలో పోటీ పడుతున్నాయి. ఎన్నికల తర్వాత తెరాస బిజెపికి మద్దతు అంటే వద్దంటుందా? దానికి గాను టిడిపిని దూరం పెట్టాలి అనే షరతు విధిస్తే 'ఛ, ఛ, అది మిత్రద్రోహం అవుతుంది' అని బిజెపి నిరాకరిస్తుందా? ఇవన్నీ బాబుకి మాత్రం తెలియవా? ఆయన మూడో ఫ్రంట్‌ను మోస్తూనే హఠాత్తుగా ఆ కాడి పారేసి, ఎన్‌డిఏ కాడి

ఎత్తుకోలేదా? అందువలన టిడిపి-బిజెపి కూటమి విచ్ఛిన్నం చేయడానికి జగన్ చేసే సకలయత్నాలలో యీ సమావేశం కూడా ఒకటి కావచ్చు' అనుకుని దానికి స్పందించనవసరం లేదు.

కానీ తీవ్రంగా స్పందిస్తున్నారు. సమావేశం ఎప్పుడు జరిగిందో మీడియా చెప్పటం లేదు. అదేదో మొన్న జరిగినట్లు, బాబు వెంటనే రియాక్ట్ అయినట్టు బిల్డప్ యిస్తున్నారు. ఎప్పుడో జరిగినా, నిన్ననే తెలిసింది అనుకోవడానికి లేదు. ఎందుకంటే రాజకీయాల్లో విభీషణులకు కొరత లేదు. వార్తలు అక్కణ్నుంచి యిక్కడకు మోసుకుని వచ్చేవాళ్లు కోకొల్లలు. అయితే యీ వార్తను సాకుగా చూపించడానికి కారణం ఏమిటంటే – బిజెపి తను చెప్పినట్లుగా ఆడలేదని బాబుకి కోపం వచ్చింది. 'మీ కంట్లో నన్ను వేలుపెట్టనీయటం లేదు. మీ దగ్గర సరైన అభ్యర్థులు లేరు కాబట్టి, నేను చెప్పిన నా మనిషిని మీ పార్టీలో చేర్చుకుని టిక్కెటు యివ్వండి' అంటే యీ బ్యాక్‌సీట్ డ్రైవింగ్‌కు బిజెపి ఎలా ఒప్పుకుంటుంది? ఒప్పుకోవాలని బాబుగాని, ఆయన సానుభూతిపరులు కానీ ఎలా ఆశిస్తారు? బిజెపికి యిచ్చిన సీట్లు కృష్ణార్పణం అనుకుంటేనే పొత్తు నిలుపుకోవాలి. లేకపోతే ధైర్యం వుంటే ఒంటరిగా పోటీ చేయాలి. అంతేగాని తన కనుసన్నల్లో వేరే పార్టీ నడవాలని చూడడం అసంబద్ధం.

ఈ తర్కం తప్పు అనవచ్చు. బాబుకి అనవసరంగా దురుద్దేశాలు అంటగడుతున్నా నన‌వచ్చు. కానీ యిలా ఆలోచించకుండా వేరే ఏ విధంగా ఆలోచించినా బాబు చేష్టలకు అర్థం కనబడటం లేదు. బిజెపి-టిడిపి పొత్తు వుంటుందా లేదా? ఉంటే/ఉండకపోతే రఘురామరాజు, పురంధరేశ్వరిల పరిస్థితి ఏమిటి? పవన్ బిజెపికి మద్దతిస్తాడా? లేక టిడిపి కా? లేక యిద్దరికీనా? లేక తన స్నేహితులకు మాత్రమేనా? – ఇలాటి ప్రశ్నలకు యీ వారాంతంలోనే సమాధానం లభిస్తుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఏప్రిల్ 26- 27 వీక్లీకై ఎమ్బీయస్ : ఔషధ రంగంలో రాబోయేది సంకటకాలమే

జబ్బులు పెరుగుతున్నాయి. మందులు సరిగ్గా పనిచేయటం లేదు. అంటువ్యాధుల్లో డ్రగ్ రెసిస్టెన్స్ పెరుగుతోంది. బ్యాక్టీరియాలు ఎప్పటికప్పుడు రూపం మార్చుకుని మనపై దాడి చేస్తున్నాయి. వాటిని ఎదుర్కోవాలంటే ఔషధరంగంలో నిరంతరం పరిశోధనలు జరుపుతూ వుండాలి. పరిశోధన రిస్కుతో కూడుకున్నది. ఎన్నో ఏళ్లు పరిశోధించినా ఫలిస్తుందన్న గ్యారంటీ లేదు. అప్పటిదాకా పడిన శ్రమ, పెట్టిన ఖర్చు వృథా అవుతుంది. అందువలన ఏదైనా పరిశోధన ఫలిస్తే, వాటిపై పేటెంటు సంపాదించి, ఆర్ అండ్ డి (ఔషధాల పరిశోధన, రూపకల్పన) పై అప్పటిదాకా పెట్టిన ఖర్చు రాబట్టడానికి మందును హెచ్చు ఖరీదుకు అమ్ముతూ వచ్చారు. పేటెంట్ హక్కుల గడువు త్వరలో ముగుస్తోంది కాబట్టి యికపై వారు ఆ ధరలకు అమ్మలేరు. పైగా క్లినికల్ ట్రయల్స్ వ్యయం బాగా పెరిగిపోయింది. అందువలన వారికి ఆర్ అండ్ డిపై ఆసక్తి పోయింది. మార్చి ఆఖరివారంలో హైదరాబాదులో నైపర్ (జాతీయ ఫార్మా విద్య, పరిశోధన సంస్థ)లో జరిగిన సదస్సులో సైంటిస్టులు యీ విషయంపై ఆందోళన వ్యక్తం చేశారు. ఫైజర్, రోష్ కంపెనీలు నాలుగేళ్లగా పరిశోధనపై వ్యయం తగ్గించేశారు. ఫైజర్ యాంటీ బ్యాక్టీరియల్ పరిశోధనలను 2010లోనే ఆపేసింది. ఆ మాటకొస్తే 90% ఫార్మా కంపెనీలు యాంటీ బయాటిక్స్‌లు రూపొందించడం మానేశాయి. 15 మేజర్ ఫార్మా కంపెనీలు 2012లో ఆర్ అండ్ డిపై 8386 కోట్ల డాలర్లు ఖర్చు పెడితే, 2013లో అది 8400 అయింది. అంటే 1% వృద్ధి కూడా లేదన్నమాట.

ఈ పరిస్థితుల్లో భారతదేశపు ఫార్మా కంపెనీలు పరిశోధనపై దృష్టి సారిస్తే ఎంతో లాభపడతాయి. ఇక్కడ సైంటిస్టులు జీతాలు తక్కువ. ఔషధ పరీక్షల వ్యయమూ తక్కువే. అయితే మనకున్న పెద్ద సమస్య ఏమిటంటే నాణ్యతను పట్టించుకోకపోవడం! గత ఏడాదిగా భారత్‌నుండి అనేక ఔషధాలు విదేశాలకు ఎగుమతి అయి అక్కడి కంపెనీలకు దడ పుట్టించాయి. అమెరికాకు దిగుమతి అయ్యే ఓటిసి మందుల (ఓవర్ ద కౌంటర్) వ్యాపారంలో భారత్‌ది రెండో స్థానం. వాళ్ల పౌరులు భారతదేశపు మందులు విరివిగా వాడుతున్నారు కాబట్టి వాటి నాణ్యతపై అమెరికా గట్టి నిఘా పెట్టింది. యుఎస్ ఎఫ్‌డిఏ (ఫుడ్ అండ్ డ్రగ్ ఎడ్మినిస్ట్రేషన్) అధికారులు భారతదేశంలో తయారయ్యే మందులను లోతుగా పరీక్షించ సాగారు. దానితో రాన్‌బ్యాక్సీ దోషిగా దొరికిపోయింది. తప్పుడు డేటా యిచ్చామని, తప్పుయిపోయిందని ఒప్పుకుని వాళ్లు 500 మిలియన్ డాలర్ల జరిమానా కట్టారు. 2013లో ఎఫ్‌డిఏ భారత్‌లో 160 మందుల ఫ్యాక్టరీలు పరీక్షించి, 8 కంపెనీలకు వార్నింగు యిచ్చింది.

ఇక్కడ తయారయ్యే మందులలో మాలిన్యాలున్నాయని అనే సందర్భాలు చాలా తక్కువ. ప్రధాన సమస్య పేపర్ వర్క్ సరిగ్గా లేకపోవడం. మన ఇండియన్స్ పని త్వరగా చేయడంపైనే దృష్టి పెడతాం. వాళ్లు అలాగ కాదు. ఫ్యాక్టరీలో తయారైన మందుల్ని గోడౌనులో దాచాం అని రాస్తే వూరుకోరు. వాటిని ఒక పెట్టెలో పెట్టాం, ఆ పెట్టెను ఒక ట్రాలీలో పెట్టాం, దాన్ని గోడౌన్ వద్దకు తీసుకుని వచ్చాం, తలుపు గొళ్లెం పైకి ఎత్తాం, కొద్దిగా తోశాం.. యిలా అన్నీ రాయాలంటారు. లేకపోతే ప్రొసీజర్ సరిగ్గా జరగలేదు అంటూ డిస్‌క్వాలిఫై చేస్తారు. వాళ్లకు కావలసినట్టు మనను మనం మలచుకుంటే మాత్రం మనకు ఎన్నో అవకాశాలున్నాయి. ఔషధ తయారీలో నాణ్యతపై అస్సలు రాజీపడకపోవడం, పరిశోధనలపై దృష్టి నిమగ్నం చేయడం జరిగితే ఈ రంగంలో మనం ఎంతో దూసుకుపోవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : దక్షిణభారతంపై బిజెపి కన్ను

ఎన్‌డిఏకు కనీసం 272 సీట్లు రావాలంటే బిజెపికు 225 సీట్లకు మించి రావాలి. బిజెపి బలమంతా ఉత్తరభారతం, పశ్చిమభారతంలో కనబడుతోంది. తూర్పున పెద్దగా ఆశలు లేవు. ఇక దక్షిణాదిన వున్న 129 సీట్లలో నాలుగోవంతైనా తెచ్చుకోవాలి. తెచ్చుకోగలదా? 1998లో దానికి 20 సీట్లు వచ్చాయి. 1999లో 18 వచ్చాయి. అప్పుడు వాజపేయికి అనుకూలంగా పవనాలు వీస్తున్నాయి కాబట్టి అది సాధ్యపడిందని గుర్తు పెట్టుకోవాలి. 2004 వచ్చేసరికి కర్ణాటకలో 18 గెలుచుకుంది కానీ తక్కిన మూడు రాష్ట్రాలలో సున్నా. ఐదేళ్ల గడిచేసరికి 19 వచ్చాయి. కర్ణాటకలోనే! తక్కిన చోట్ల ఎప్పట్లా సున్నా! ఓట్లశాతం చూడబోతే కర్ణాటకలో 1998 నుండి 2009 మధ్య 14.6% పెరిగింది. (27% నుండి 41.6%) కేరళలో 0.7% తగ్గింది. (8% నుండి 7.3%), తమిళనాడులో 4.6% తగ్గింది (6.8% నుండి 2.3%), మన రాష్ట్రంలో అయితే 14.5% తగ్గింది. (18.3% నుండి 3.8%). అంటే కర్ణాటకలో తప్ప వేరెక్కడా పరిస్థితి బాగా లేదు. కర్ణాటకలో కూడా 2009 నుండి పరిస్థితి దిగజారింది. 2013 అసెంబ్లీ ఎన్నికలలో 224 ఎసెంబ్లీ సీట్లలో 18% సీట్లు అంటే 40 తెచ్చుకుని ప్రతిపక్షంలో కూర్చుంది. మోదీ ప్రచారం చేసినా పని చేయలేదు. ఎడ్యూరప్ప పెట్టిన పార్టీ ఓట్లు చీల్చింది కాబట్టి యిలా జరిగిందనుకుంటూ వాళ్లని తమ పార్టీలో చేర్చుకున్నారీసారి. తమిళనాడు, కేరళలలో ఒక్క అసెంబ్లీ సీటూ గెలవలేదు.

మన రాష్ట్రంలో 2009 ఎన్నికలలో 2, ఉపయెన్నికలలో మరో 2 వెరశి 4 గెలుచుకున్నారు. తెలంగాణకు పాటుపడ్డాం కాబట్టి తెలంగాణలో బలం పుంజుకున్నాం అని ఆశపడి 47 ఎసెంబ్లీ సీట్లు, 8 పార్లమెంటు సీట్లలో నిలబడుతున్నారు. టిడిపితో పొత్తు ఏ మేరకు లాభిస్తుందో, వీటిలో నాలుగో వంతైనా గెలుస్తారో లేదో తెలియదు. కర్ణాటకలో మళ్లీ బలం పుంజుకుంటే అక్కడో 20, ఇక్కడ 2/3 గెలుచుకున్నా మొత్తం 25 లోపే. తమిళనాడు నుండి 1999లోలా 4 సీట్లు గెలవాలంటే డిఎంకె, ఎడిఎంకెల వంటి బలమైన పార్టీలతో పొత్తు కుదరాలి. కానీ కుదరలేదు. అందువలన వారిద్దరితో పడని పార్టీలన్నిటినీ చేరదీసి ఒక కూటమి ఏర్పరచారు. దాని ప్రకారం డిఎండికె (విజయకాంత్ పార్టీ) 14, బిజెపి, పిఎంకె (డాక్టర్ రామదాసు పార్టీ) చెరో 8, ఎండిఎంకె (వైకో పార్టీ) 7 స్థానాల్లో పోటీ చేస్తున్నాయి. ఐజెకె, కెఎన్‌ఎమ్‌కె అనే మరో రెండు పార్టీలకు చెరో ఒక స్థానం కేటాయించారు. పొత్తులోని యితర భాగస్వాములకు వున్న పాప్యులారిటీతో పోలిస్తే స్థానిక బిజెపి నాయకుల పాప్యులారిటీ సోదిలోకి కూడా రాదు. సాధ్యమైనన్ని ఎక్కువ సీట్లు గెలిచి ప్రధానిగా తన అదృష్టాన్ని పరీక్షించుకోవాలన్న పట్టుదలతో వున్న జయలలిత దగ్గరకు రానివ్వకపోవడం వలన యీ నాయకులందరూ బిజెపితో పొత్తు పెట్టుకున్నారు. తమిళనాడులో మైనారిటీలు గణనీయంగా వున్నారు. పైగా వాజపేయి కున్న ఉదారవాది యిమేజి మోదీకి లేదు. పొత్తు ఏ మేరకు ఫలిస్తుందో వేచి చూడాలి.

ఇక కేరళలో కూడా మైనారిటీలు ఫలితాలను నిర్ణయించగలరు. అందువలన మోదీ బిసి కార్డు బయటకు తీశారు. కేరళలో బిసిలలో బలమైన ఓటు బ్యాంకుగా వున్న ఈళవాలను ఆకట్టుకోవడానికి వారు ఆరాధించే శ్రీ నారాయణ ధర్మ పరిపాలన ట్రస్టు వారి ఫంక్షన్‌కు వెళ్లి 'నేనూ బిసినే' అని చెప్పుకున్నాడు. అటువంటి కులానికే చెందిన మాతా అమృతానందమయి ఆశ్రమానికి వెళ్లి ఆమె భక్తురాలినని చెప్పుకున్నాడు. రాష్ట్రంలోని అతి పెద్ద దళిత సంఘమైన కేరళ పులయ మహాసభ సమావేశానికి వెళ్లి 'నాదీ తక్కువ కులమే, మా పార్టీ మీ రాష్ట్రంలో అంటరానిదే..' అంటూ పోలికలు చెప్పాడు. ఇవన్నీ కనీసం ఒక్క సీటైనా అక్కడ గెలిచిపెడతాయో లేదో వచ్చే నెలలో తేలిపోతుంది. ఏది ఏమైనా మోదీ ఇంగ్లీషులో వక్త కాకపోవడం దక్షిణాదిన పెద్ద మైనస్ పాయింటుగానే చెప్పాలి.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : కోర్టు దృష్టికి వచ్చిన సరితా నాయర్ చీరలు

2013 జులైలో కేరళ ముఖ్యమంత్రి ఊమెన్ చాండీ సరితా నాయర్ అనే మహిళ కారణంగా వివాదంలో చిక్కుకున్న సంగతి యీ శీర్షికలో ప్రస్తావించడం జరిగింది. ఆమె, బిజూ రాధాకృష్ణన్ అనే వ్యక్తి కలిసి సహజీవనం చేస్తూ కొచిలో టీమ్ సోలార్ రెన్యూవబుల్ ఎనర్జీ సొల్యూషన్స్ అనే కంపెనీ పెట్టి సోలార్ ఎనర్జీ ప్రాజెక్టులు, విండ్‌మిల్ ప్రాజెక్టుల పేరు చెప్పి ప్రజలను మోసగించి కోట్లాది రూపాయలు కొట్టేశారు. ఈ ఇద్దరూ కలిసి తనను మోసం చేసి రూ.40.50 లక్షలు కొట్టేశారని పెరంబవూరు నివాసి ఐన ఎం.కె.సజ్జాద్ అనే వ్యాపారి ఫిర్యాదు చేయడంతో జూన్ 2013లో వీళ్లను అరెస్టు చేశారు. ఆమె సెల్‌ఫోన్ రికార్డులు పరిశీలించినపుడు ముఖ్యమంత్రి కార్యాలయంతో ఆమె తరచుగా మాట్లాడుతున్నట్టు తేలింది. ఆయన కార్యాలయంలో నలుగురు సిబ్బంది ఈ సరితా నాయర్‌కు సహాయపడినట్లు తేలింది. వారిలో ఊమెన్ వ్యక్తిగత సహాయకుడు టెన్నీ జోసెఫ్ ఆమెతో అశ్లీల సంభాషణలు కూడా చేసేటంత చనువుగా వున్నాడట. గన్‌మన్ సలీం రాజ్ కూడా సరితతో తెగ మాట్లాడాడు. ప్రభుత్వం చేత పనులు చేయించుకుందామనేవారి వద్దకు సరిత వెళ్లి 'నాకు ముఖ్యమంత్రి తెలుసు, మంత్రులు తెలుసు, ఎంపీలు తెలుసు, అధికారులు తెలుసు, మా కంపెనీ పెట్టే ఇన్వెస్ట్‌మెంట్ ప్లానులకు గవర్నమెంటు సపోర్టు వుంది' అంటూ ఫోటోలు, దొంగ డాక్యుమెంట్లు చూపించేది. వారి ఎదురుగానే ముఖ్యమంత్రి కార్యాలయంలో మాట్లాడేది. ఆ విధమైన బిల్డప్ యివ్వడానికి ఊమెన్ సిబ్బందిలో యీ నలుగురు సహకరించారు.

ఇవన్నీ బయటకు వచ్చాక ఊమెన్ తన సిబ్బందిలో యిద్దర్ని తొలగించి పోలీసు విచారణకు ఆదేశించాడు.

2014 ఫిబ్రవరిలో ఆమె బెయిల్‌పై బయటకు వచ్చింది. 49 కేసుల్లో నిందితురాలైన ఆమె మార్చి 3 న 22 పేజీల అఫిడవిట్ దాఖలు చేసి దానిలో అనేకమందిపై ఆరోపణలు చేసింది. కన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఎపి అబ్దుల్ కుట్టి తనను తిరువనంతపురం హొటల్లో రేప్ చేశాడంది. కేరళ ఎసెంబ్లీ చీఫ్ విప్ పి సి జార్జి నన్ను రాజకీయ ప్రయోజనాలకు వాడుకుందామని చూసి, నేను కాదంటే జైలుకి పంపుతానని బెదిరించాడంది. ముఖ్యమంత్రిని యీ కేసులో యిరికిస్తే 10 కోట్ల రూ.లు, యిల్లు యిస్తామని సిపిఎం నాయకులు కబురు పంపారంది. వీళ్లందరూ ఆమె ఆరోపణలు ఖండించారు. త్వరలో యింకా కొన్ని పేర్లు బయటపెడతానని ఆమె బెదిరిస్తోంది. తొమ్మిది నెలల జైలు జీవితంలో అనేకసార్లు కోర్టుకి హాజరైన ఆమె వచ్చిన ప్రతిసారి వేర్వేరు చీరలు కట్టడం గమనించి కేరళ హైకోర్టు ప్రభుత్వాన్ని మందలించింది. 'జైలు నియమాల ప్రకారం రెండు చీరల కంటె ఎక్కువ కట్టకూడదు కదా, యిన్ని ఎలా అనుమతించారు?' అని. ఆ చీరలు స్వాధీనపరచుకోమని సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) వారిని ఆదేశించింది కూడా. ఒక అంచనా ప్రకారం ఆమె వద్ద వున్న చీరల ఖరీదు రూ.13 లక్షలు. 'అబ్బే, అవి అంత ఖరీదైనవి కావు. నా దగ్గరున్నవి మొత్తం 75 చీరలు. దేని ధరా రూ.3000 దాటదు.' అంటోంది సరిత. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : ఒడిశాలో నవీన్ అవకాశాలు

ఒడిశాలో మనలాగే అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. 147 అసెంబ్లీ సీట్లు. 21 లోకసభ సీట్లు. బిజూ జనతాదళ్ పార్టీ నాయకుడు నవీన్ పట్నాయక్ ముఖ్యమంత్రిగా కొనసాగడం ఖాయమనిపిస్తోంది. అతనితో తలపడే నాయకుడు ఎవరూ ప్రత్యర్థి వర్గాలలో కనబడటం లేదు. 11 ఏళ్లపాటు బిజెపితో సఖ్యం చేసిన నవీన్ 2009 ఎన్నికలకు ముందు వారితో తెగతెంపులు చేసుకుని సిపిఐ, సిపిఎం, ఎన్‌సిపిలతో సీట్ల సర్దుబాటు చేసుకున్నాడు. ఈ సారి ఎవరితోనూ పొత్తు లేకుండా ఒంటరి పోరాటమే. 36 మంది సిటింగ్ ఎమ్మెల్యేలకు, 6గురు సిటింగ్ ఎంపీలకు టిక్కెట్లు యివ్వకపోవడంతో వారు అసంతృప్తిగా వున్నారు కానీ స్వతంత్ర అభ్యర్థిగా నిలబడే సాహసం చేయలేదు – అంజలీ బెహరా తప్ప! ఆమె ప్యారీ మోహన్ మహాపాత్రకు సహచరురాలు. ప్యారీమోహన్ బ్యూరోక్రాట్‌గా వుంటూ రాజకీయాల్లోకి వచ్చారు. నవీన్ చంద్రగుప్తుడైతే ఆయన చాణక్యుడనేవారు. 2012లో తనపై కుట్ర చేశాడంటూ నవీన్ అతన్ని బయటకు పంపించాడు. ప్యారీమోహన్ ఒడిశా జన మోర్చా అనే పార్టీ పెట్టి అభ్యర్థులను నిలబెడుతున్నాడు. 2009లో కోస్తా ప్రాంతంలోని 77 సీట్లలో బిజెడి 69 గెలుచుకుంది. అతనీ సారి కోస్తా ప్రాంతంలో కొన్ని ఓట్లు చీల్చి బిజెడికి నష్టం కలిగిస్తాడని అంచనా. 2009లో 54 స్థానాల్లో బిజెడి స్వల్ప మెజారిటీతో గెలుచుకుందని మర్చిపోకూడదు. ఈ సారి 45 అసెంబ్లీ స్థానాలలో బిజెడికి తిరుగుబాటుదారుల బెడద వుంది.

నవీన్ ప్రభుత్వంపై కొన్ని ఆరోపణలు వున్నాయి. మైనింగ్ స్కామ్‌లో 60 వేల కోట్ల రూ.ల గోల్‌మాల్ జరిగిందని షా కమిషన్ అంది. కోట్లాది రూపాయల చిట్‌ఫండ్ కుంభకోణంలో అధికారపార్టీ సభ్యుల హస్తం వుంది. అయితే వీటి గురించి ప్రజలకు చెప్పి నవీన్‌ను నియంత్రించగల సామర్థ్యం వున్న ప్రతిపక్షాలు కనబడటం లేదు. కాంగ్రెసు పార్టీ ఢిల్లీ పెద్దలు మన రాష్ట్రంలో చేసినట్లే అనవసరంగా పెత్తనం చేసి స్థానిక నాయకత్వాన్ని నాశనం చేశారు. దాంతో ప్రతిపక్షనాయకుడైన భూపేందర్ సింగ్ కాంగ్రెసు పార్టీ వదలి నవీన్‌కు విధేయుడుగా మారిపోయాడు. గతంలో తమతో స్నేహం చేసి, తర్వాత తృణీకరించి నెగ్గుకుని వచ్చిన నవీన్‌పై బిజెపి పగబట్టి వుంది. ఇప్పుడు మోదీ తరంగం భారత్‌ను ముంచెత్తుతోందన్న ఆశతో వున్నారు కాబట్టి చిన్నా చితకా పార్టీలను పోగేసి తమిళనాడులోలా యిక్కడా ఒక కూటమి ఏర్పరచాలని చూసింది. కానీ బండి ముందుకు సాగలేదు. సిపిఐ, సిపిఎం, సిపిఎంఎల్ కలిసి ఒక కూటమిగా ఏర్పడ్డాయి కానీ వాటికి బలం లేదు. ఇన్నేళ్లగా అధికారంలో వున్న బిజెడిపై యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్ ఫీలింగ్స్ వుంటాయి. అయితే యిన్ని పార్టీలు రంగంలో వుండడం చేత ప్రభుత్వ వ్యతిరేకత ఓట్లను చీల్చి, అంతిమంగా నవీన్‌కే ఉపయోగపడవచ్చు.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : 1962 ఇండో చైనా యుద్ధం

1962లో చైనా మనపై దాడి చేసింది. ఆ దాడిలో మన భారతసైన్యాలు ఓడిపోయాయి. మనల్ని ఓడించినా చైనా ముందుకు చొచ్చుకుని వచ్చి ఢిల్లీని ఆక్రమించలేదు. నెల్లాళ్ల యుద్ధం తర్వాత దానంతట అదే వెనక్కి వెళ్లిపోయింది. ఇది జరిగి 50 ఏళ్లు దాటినా యింకా దానిపై చర్చ సాగుతూనే వుంటుంది. ఆ యుద్ధవైఫల్యం నెహ్రూ చేతకానితనం వలననే జరిగిందని అందరూ దుమ్మెత్తి పోస్తూ వుంటారు. రెండవ ప్రపంచయుద్ధం తర్వాత యుద్ధం వలన ఎంత ఘోరమైన నష్టాలు జరుగుతాయో ప్రపంచదేశాలన్నీ గుర్తించాయి. యుద్ధనివారణకు ఐక్యరాజ్యసమితి ఏర్పడింది. కొత్తగా ఆవిర్భవించిన భారతదేశానికి ప్రధానిగా అయిన నెహ్రూ దేశరక్షణ పేరుతో సైన్యానికే నిధులన్నీ వెచ్చిస్తే అభివృద్ధి చేపట్టలేమనుకున్నారు. పారిశ్రామికీ కరణ, గ్రామీణాభివృద్ధి, పంచవర్ష ప్రణాళికలు యిలా ఎన్నో డెవలప్‌మెంటల్ యాక్టివిటీస్‌కు ఖర్చు పెట్టవలసిన ధనాన్ని తుపాకులపై ఖర్చు పెడితే వృథా అనుకున్నారు. ఇరుగుపొరుగులతో

సఖ్యతగా వుంటే డిఫెన్సు బజెట్ తగ్గించవచ్చనుకున్నారు. పంచశీల ప్రతిపాదించారు. చైనాకు స్నేహహస్తాన్ని చాచారు. వారు టిబెట్‌ను ఆక్రమించినా దలైలామాకు మన దేశంలో శరణు యిచ్చి వూరుకున్నారు తప్ప చైనాను మందలించి, వారితో కయ్యానికి కాలు దువ్వలేదు. పాకిస్తాన్‌తో ఆక్రమిత కశ్మీర్ వివాదం వున్నా యుద్ధం చేయకుండా సహనం వహించారు.

ఇదంతా అప్పట్లో భారతప్రజలు హర్షించారు. నెహ్రూను శాంతిదూత అన్నారు. ఇంతలో 1962లో నెహ్రూ నమ్మకాన్ని వమ్ము చేస్తూ చైనా దాడి చేసింది. 15, 20 ఏళ్ల పాత ట్యాంకులతో, జీపులతో భారతసైన్యం వారిని ఎదుర్కోలేకపోయింది. నెహ్రూకు, రక్షణమంత్రి కృష్ణ మేనోన్‌కు మతిపోయింది. ప్రతిపక్ష పార్టీలు నెహ్రూను అపహాస్యం చేశాయి. సైన్యానికి సరైన బట్టలు కూడా సమకూర్చకుండా వారి ప్రాణాలు తీశాయని విమర్శించాయి. నెహ్రూ అహం దెబ్బ తింది. అతి కొద్దికాలానికే ఆయన మరణించాడు. చైనాతో యుద్ధంలో భారత నాయకత్వం, సైన్యం చేసిన పొరబాట్లపై అనేక పుస్తకాలు వచ్చాయి. ఇప్పుడు తాజాగా మరో పుస్తకం వచ్చింది. నెవిల్ మాక్స్వెల్ అనే జర్నలిస్టు భారతప్రభుత్వం యిన్నాళ్లూ దాచిన రహస్యపత్రాలలో దొరికిన సమాచారం అంటూ ''ఇండియాస్ చైనా వార్'' అనే పుస్తకం రాశాడు. దాని ప్రకారం దాడి చేసినది ఇండియాయేట! చైనా తరఫు మెటీరియల్‌తో దాన్ని సరిచూసుకున్నాడా అంటే అది లేదు. వాళ్లు రహస్యపత్రాలు ఏమీ యివ్వలేదట.

ఈయన అభిప్రాయంతో విభేదిస్తూ బెర్టిల్ లింట్‌నర్ అనే స్వీడిష్ చరిత్రకారుడు వ్యాసాలు ప్రచురించాడు. ఆనాటి దాడికి చైనా అంతర్గత రాజకీయాలే కారణమన్నాడు. 1958లో మావో చైనాలో 'గ్రేట్ లీప్ ఫార్వర్డ్' ఉద్యమం చేపట్టాడు. మూడేళ్లు పాటు సాగిన ఆ ఉద్యమంలో ఆకలిదప్పులతో దాదాపు 30 లక్షలమంది చనిపోయారు. అందరూ మావోను నిందించసాగారు. 1960లో రష్యాతో విడిపోవడం వలన కూడా చైనా బలహీనపడింది. ప్రజల దృష్టిని మరల్చడానికి , సాటి నాయకుల విమర్శలు తట్టుకోవడానికి మావో యితర దేశాలపై దాడి చేశాడు. దేశాధినేతలు యిలా చేస్తూనే వుంటారు. వింతేమీ లేదు. తమ ప్రతిపక్షం కొమిన్‌టాంగ్ బర్మాలో క్యాంపులు నడుపుతూ, అమెరికా మద్దతుతో చైనాపై అప్పుడప్పుడు దాడులు జరుపుతూ వుంటే 1961లో 20 వేల మంది సైనికులను పంపి ఆ క్యాంప్‌ను నాశనం చేయించాడు. తర్వాతి ఏడాది భారత్‌పై యిదే రకమైన దాడి చేశాడు. కొమిన్‌టాంగ్ లాగే దలైలామా కూడా ఇండియాలో కాంపులు నడుపుతూ చైనాపై దాడి చేయడానికి సన్నాహాలు చేస్తున్నాడని, దాడి చేసి దలైలామాకు, అతనికి ఆశ్రయం యిచ్చిన ఇండియాకు బుద్ధి చెప్పామని ప్రజలకు చెప్పి వుంటాడు. అందుకే ఆ యుద్ధకారణం గురించి అప్పుడు కానీ, యిప్పుడు కానీ చైనా పెదవి విప్పలేదు. దాడి తర్వాత మావో ప్రతిక్షకులు నోరు మూసుకున్నారు. అందువలన మావో ప్రయోజనం సిద్ధించిందనే చెప్పాలి. రెండు వాదనలూ వింటే లింట్‌నర్ వాదనే ఎక్కువ సబబుగా అనిపిస్తుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 30-32 వీక్లీకై** **ఎమ్బీయస్ : తెలుగుజాతికి అవమానమా..?**

మోదీగారి ఉపన్యాసం తెలుగుజాతిపై జాలిపడడమే మెయిన్ థీమ్‌గా సాగింది. తెలుగుజాతికి అవమానం జరిగిపోయింది, వారి ఆత్మగౌరవాన్ని నాశనం చేసినది కాంగ్రెసు పార్టీ కాబట్టి, వారిని తుదముట్టించి, కాంగ్రెసేతర పార్టీలను నెత్తిమీద పెట్టుకోవాలి అనే పాట గతంలో ఎన్టీయార్ పాడినదే. ఇప్పుడు మళ్లీ అంది వస్తుందనుకుని మోదీ అదే పల్లవి ఎత్తుకున్నారు. ఆత్మగౌరవం దెబ్బతినడం గురించి యిద్దరూ చెప్పిన అంశాలను కలిపి చూస్తే – ముఖ్యమంత్రులను మార్చడం, అంజయ్య పట్ల రాజీవ్ దురుసు ప్రవర్తన, మరణించాక పివి పట్ల అపచారం..! వీటిని వరుసగా పరామర్శిద్దాం.

## ముఖ్యమంత్రిని మారిస్తే జాతిని అవమానపరచినట్లా?

మొదట ఒక రాష్ట్ర ముఖ్యమంత్రిని అతని పార్టీ హై కమాండ్ మారిస్తే అది ఆ జాతి పట్ల అపచారం చేయడమా? రేపు ఆంధ్ర, తెలంగాణలలో ఒకే పార్టీ అధికారంలోకి వచ్చిందనుకోండి. ఆ పార్టీ హై కమాండ్ ఒక రాష్ట్రంలో సిఎంను ఐదేళ్లు కొనసాగించి, మరో రాష్ట్రంలో ప్రతీ ఏడాదికీ మార్చిందనుకోండి. అప్పుడు తెలుగుజాతి పట్ల అవమానం చేసినట్లా? చేయనట్లా? బిజెపి ఉత్తరాఖండ్‌లో 2007 నుండి 2012 లోపున మూడుసార్లు ముఖ్యమంత్రిని మార్చింది. గుజరాత్‌లో 1995 మార్చి నుండి 18 నెలల్లో యిద్దర్ని మార్చింది. మరి మార్చిన ప్రతీసారీ ఆ యా జాతులు అవమానించ బడినట్లేనా? జాతీయ పార్టీలు సరే, ప్రాంతీయపార్టీలు జిల్లా అధ్యక్షులను చిత్తం వచ్చినట్లు మార్చటం లేదా? దశాబ్దాలుగా జండా మోసినవాళ్లను పక్కన పడేసి, పార్టీ ఫిరాయింపుదారులకు టిక్కెట్లు యివ్వడం లేదా? అంటే ఆ జిల్లా వాళ్లందరినీ రాష్ట్రనాయకత్వం అవమానించినట్లేనా? రేపు చంద్రబాబో, జగనో తెలంగాణ యూనిట్ అధ్యక్షుణ్ని మారిస్తే తెలంగాణ వారందరినీ అవమానించినట్లా? ఎన్టీయార్ ఒక్క కలం పోటుతో తన కాబినెట్‌లో మంత్రులందరినీ యింటికి పంపించినప్పుడు వాళ్లందరూ తెలుగువాళ్లే అయినా, పంపినవాడు తెలుగువాడు కాబట్టి తెలుగువారి ఆత్మగౌరవానికి దెబ్బ తగల్లేదా? ఇందిరా గాంధీ కూడా తన పార్టీ నాయకులతో అలాగే వ్యవహరించింది. అయితే ఎన్టీయార్ తన వాక్చాతుర్యంతో దాన్ని తెలుగువారిని అవమానించడం అనే కలర్ యిచ్చి ఓట్లు దండుకున్నారు.

ఇందిరా గాంధీ ముఖ్యమంత్రులను తరచుగా ఎందుకు మార్చేది అన్న విషయం కాస్త ఆలోచించి చూడండి. నెహ్రూ కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రులుగా హేమాహేమీలు వుండేవారు. వారిలో కొందరు నెహ్రూను ధిక్కరించ గలిగే శక్తి కలిగి వుండేవారు. 1965 తర్వాత కేంద్రప్రభుత్వం బలహీనపడసాగింది. రాష్ట్రాలు ఎక్కువ అధికారాలు అడగసాగాయి. ఇందిర 1966 లో ప్రధాని అయ్యాక అదే పరిస్థితి కొంతకాలం కొనసాగింది. ఆ తర్వాత ఆమె దేశంలో తను తప్ప వేరే ఏ నాయకుడూ బలంగా వుండకూడదన్న పథకం వేసి అమలు చేయసాగింది. బలమైన రాష్ట్ర ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా వున్న వర్గాన్ని ప్రోత్సహించి, ముఖ్యమంత్రులను బలహీనపరిచేది. ప్రతి రాష్ట్రంలో ఒక్కో కులం రాజకీయంగా బలంగా వుండడం చూసి, వారి ప్రాబల్యం తగ్గించడానికి వేరే కులాల వారిని పట్టుకుని వచ్చి ముఖ్యమంత్రులను చేసేది. దానితో బాటే అతని అసమ్మతి వర్గాన్ని దువ్వుతూ వుండేది. స్వాతంత్ర్య పోరాటంలో ఎందరో బ్రాహ్మణ నాయకులు పాల్గొన్నా, అప్పటి ప్రభుత్వాలకు నాయకత్వం వహించినా, స్వాతంత్ర్యం వచ్చాక చాలా రాష్ట్రాలలో బ్రాహ్మణులు రాజకీయంగా బలహీనులుగా మారారు. ఇందిర తన హయాంలో వారిని ముఖ్యమంత్రులుగా చేసింది. బెంగాల్‌లో సిద్దార్థ శంకర్ రాయ్, (1972-77), ఉత్తరప్రదేశ్‌లో 1971-77 మధ్య కమలాపతి త్రిపాఠీ, ఎన్ డి బహుగుణ, ఎన్ డి తివారీ, - మధ్యప్రదేశ్‌లో 1969-77 మధ్య పిసి సేఠీ, ఎస్ సి శుక్లా, ఒడిశాలో 1972-77 మధ్య నందినీ శతపథీ, బినాయక్ ఆచార్య, గుజరాత్‌లో 1973 వరకు హితేంద్ర దేశాయ్, ఘన్‌శ్యామ్ ఓఝా, రాజస్థాన్‌లో 1973-77 మధ్య హర్‌దేవ్ జోషి..ఇలా బ్రాహ్మణ అభ్యర్థి దొరక్కపోతే కులబలం లేనివారిని పెట్టింది. బిహార్‌లో 1972-77 మధ్య కేదార్ పాండే, జగన్నాథ్ మిశ్రాలతో బాటు అబ్దుల్ గఫూర్ అనే ముస్లిమ్‌ని, కర్ణాటకలో 1972-77లో దేవరాజ్ అర్స్ అనే బిసిని, 1980లో గుండూరావు అనే బ్రాహ్మణున్ని పెట్టింది. వారి మీద ప్రేమ కారిపోతోందని అనుకోవడానికి లేదు. కులపరంగా రాజకీయరంగంలో బలహీనులై వుండడమే వారి క్వాలిఫికేషన్.

మన రాష్ట్రానికి వస్తే రాజకీయాల్లో రెడ్ల ప్రాబల్యం హెచ్చు. విశాలాంధ్ర ఉద్యమం నడిచే రోజుల్లోనే శ్రీశ్రీ రాశాడు - 'తెలుగు రాజ్యమేర్పడితేను, తొలి వజీరు రెడ్డి - తాగడానికి కుళ్లనీళ్లు, తినడానికి గడ్డి' అని. నిజానికి తెలుగు రాజ్యం ఏర్పడగానే ముఖ్యమంత్రి అయినది ప్రకాశం పంతులు. కానీ రెడ్డి రాజవుతాడని శ్రీశ్రీ ఎలా వూహించాడంటే - రాజకీయాల్లో వుండదలచినవాడికి సాహసంతో బాటు జూదరి మనస్తత్వం వుండాలి. నెగ్గినా ఓడినా ఫర్వాలేదన్నట్లు వుండాలి. నెగ్గినపుడు పదిమందిని చేరదీయాలి. ఓడినపుడు సైతం అనుచరులను పోషించాలి. వేరే వృత్తి చేసుకుంటూ మధ్యలో యిటువైపు చూద్దామంటే లాభం లేదు. ఇదే పూర్తి వ్యాపకంగా వుండాలి. తనపై తనకు పూర్తి నమ్మకం వుండి, కార్యకర్తల్లో హుషారు నింపుతూ వుండాలి. మన రాష్ట్రానికి సంబంధించినంత వరకు యిది రెడ్లలో పుష్కలం. అందుకే ఏ పార్టీ అభ్యర్థులను చూసినా వాళ్లే బహుళంగా కనబడుతున్నారు.

'జనాభా లెక్కల ప్రకారం 3% వున్నాం. అయినా ఎమ్మెల్యేల సంఖ్యలో మా శాతం 0.3 కూడా లేదు' అని కులసంఘాల సమావేశాలు పెట్టి వాపోతారు కొందరు కులస్తులు. తమలో రిస్కు తీసుకునే లక్షణాలు ఏ మేఱకు వున్నాయో ఆత్మావలోకనం చేసుకుంటే యీ ఏడుపు వుండదు. ఇందిరా గాంధీ ప్రధాని అయిన కొత్తల్లో మన రాష్ట్రానికి వచ్చినపుడు బ్రహ్మానందరెడ్డి తన కాబినెట్ సహచరులను పరిచయం చేస్తూ వుంటే '...రెడ్డి' పదం పదేపదే వినబడి అప్పుడే తీర్మానించుకుందట - వీళ్లను కట్టడి చేయాల్రా అని. అందుకని తెలంగాణ ఉద్యమం కారణంగా బ్రహ్మానందరెడ్డిని దింపే అవకాశం రాగానే బ్రాహ్మణుడైన పివిని గద్దె నెక్కించింది. ఆయన వుండగా ఆంధ్రోద్యమం వచ్చింది. నిభాయించుకోలేక పోయాడు. దింపేయాల్సి వచ్చింది. రాష్ట్రపతి పాలన తర్వాత మళ్లీ రెడ్డిని ఎక్కించకుండా వెలమ కులస్తుడైన వెంగళరావుకి అవకాశం యిచ్చింది. ఆయన సమర్థవంతంగా పాలించాడు కాబట్టి ఐదేళ్లపాటు కదల్చకుండా వుంచింది. 'అంటే అప్పుడు తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని కాపాడిందన్నమాట!?!'

1978లో నుండి 1983లోపున నలుగుర్ని మార్చింది - చెన్నారెడ్డి, అంజయ్య, భవనం వెంకట్రామ్, విజయభాస్కరరెడ్డి. వీళ్లందరూ రెడ్లే. (అంజయ్య బిసి అని అనుకునే వారు కానీ, ఆయన గద్దె నెక్కగానే చెప్పుకున్నాడు - తను రెడ్డే అని. వెంకట్రామ్ 'రెడ్డి' అని తగిలించుకోలేదు) మళ్లీ రెడ్లు ఎందుకు వచ్చారంటే 1977లో ఇందిర కేంద్రంలో ఓడిపోయాక ప్రముఖ నాయకులందరూ ఆమెను విడిచిపెట్టేశారు. 1978లో ఆంధ్రప్రదేశ్‌లో పోటీ చేసేటప్పుడు చెన్నారెడ్డి ఒక్కరే ఆమె పార్టీలో - కాంగ్రెస్ (ఐ) - లో చేరారు. ఆయనను దింపేసిన తర్వాత అంజయ్య, భవనం యిద్దరూ పొలిటికల్ లైట్‌వెయిట్స్. విజయభాస్కరరెడ్డి ముఖ్యమంత్రి అయ్యేనాటికి ఆయన కంటూ పెద్ద వర్గం లేదు. మంత్రిగా చేసినా, కర్నూలు జిల్లాలో మాత్రమే ఆయన పలుకుబడి వుండేది. ఇదంతా ఎందుకు చెప్పానంటే - తన మాట వినే బలహీనులకోసం వెతుకుతారు తప్ప పనికట్టుకుని జాతిని అవమానించడానికి ముఖ్యమంత్రులను మార్చరు. అయినా మార్చడానికి కారణభూతులెవరు? ఆ పార్టీలో, ఆ కాబినెట్‌లో వున్న సహచరులే కదా ఢిల్లీకి వెళ్లి ముఖ్యమంత్రిపై చాడీలు చెప్పి మార్పించేది! అప్పుడు తెలుగుతనం గుర్తుకు రాదా? మొన్నటికి మొన్న చూశాం - రోశయ్యను ఎలా మార్చారో! కిరణ్ ఢిల్లీలో ఎవర్నో పట్టుకుని పని చేయించుకున్నారు. రోశయ్యగారికి ఆఖరి నిమిషం దాకా తెలియను కూడా తెలియలేదు. మరి కిరణ్ దిగిపోగానే ఎంతమంది ఢిల్లీకి ప్రయాణం పెట్టుకుని పైరవీలు చేసుకోలేదా? అప్పుడేమైంది యీ ఆత్మగౌరవం కబుర్లు!

ఇక అంజయ్యగారి ఉదంతానికి వద్దాం. రాజీవ్ గాంధీ ఏదో పని గట్టుకుని అంజయ్యగారిని, తద్వారా తెలుగువారిని అవమానించినట్టుగా కలరింగు యిస్తున్నారు. ముందుగా ఒక విషయం మనం గ్రహించాలి. ఈ నాయకుల్లో చాలామంది తమ కంటె పెద్ద నాయకుడు కనబడగానే పాదాభివందనాలు మొదలెట్టేస్తారు. అలవాటు లేనివాడికి కూడా అలవాటు చేసేస్తారు. కొన్ని పార్టీల్లో యిది మరీ దారుణంగా కనబడుతుంది. ద్రవిడ పార్టీల్లో ఏకంగా సాష్టాంగాలే! కాంగ్రెసు పార్టీలో ఇందిర శకం నుండి వంగివంగి

దణ్ణాలు పెట్టడం ఎక్కువైంది. ఎమర్జన్సీ టైములో సంజయ్ గాంధీని ఇందిర వారసుడిగా ప్రొజెక్టు చేసే రోజుల్లో అతని చెప్పులు మోయడానికి కూడా సీనియర్ కాంగ్రెసు నాయకులు వెనకాడలేదు. యుపి ముఖ్యమంత్రిగా వున్న ఎన్ డి తివారీ సంజయ్ చెప్పులు మర్చిపోతే పట్టుకుని వచ్చారు. తెలుగు నాయకుల్లో సీనియర్ కేంద్రమంత్రిగా వున్న కొత్త రఘురామయ్యగారు గారు అదే పని చేశారు. 1978 ఎన్నికల్లో 'సంజయ్ గాంధీ చెప్పులు మోసిన రఘురామయ్య' అని ప్రత్యర్థులు విమర్శలు గుప్పిస్తే 'తప్పేముంది, అతను నాకు కొడుకు లాటివాడు' అని సమర్థించు కోబోయేడాయన.

తర్వాతి రోజుల్లో యీ చెప్పులు మోయడం మరీ ఎక్కువైంది. టీవీ కెమెరాలు రికార్డు చేస్తున్నాయని తెలిసినా నాయకులు మానడం లేదు. నన్నడిగితే మోయించుకున్నవాడి కంటె మోసేవాళ్లది తప్పంటాను. మన రాష్ట్రంలో ఒక దళితమంత్రికి అగ్రవర్ణ ఐయేయస్ అధికారులతో చెప్పులు తెప్పించుకోవడం సరదా అని విన్నాను. అది చూసి అగ్రవర్ణాలపై దళితులు హజం చూపుతున్నారు అనగలమా? అతడు మంత్రి కాకపోతే యీ అధికారి చెప్పులు మోసేవాడా? అలాగే టిక్కెట్ల కోసమో, నామినేటెడ్ పదవి కోసమో అనుచరులు తన కాళ్లు పట్టుకోవడానికి సిద్ధపడితే అది పార్టీ అధినేత తప్పా? అవి దక్కకపోతే బయటకు వెళ్లి తనను అమ్మనాబూతులు తిడతాడని కూడా అధినేతకు తెలుసు. ఇక్కడ ఆత్మగౌరవం కాపాడుకోవలసిన బాధ్యత ఛోటా నాయకుడిది!

అంజయ్య ఎపిసోడ్ జరిగేనాటికి రాజీవ్ ప్రధాని కాదు. ప్రధానిగారి కొడుకు. కాంగ్రెసు పార్టీలో జనరల్ సెక్రటరీయో ఏదో. అతను హైదరాబాదు వస్తే బేగంపేట విమానాశ్రయానికి ముఖ్యమంత్రిగా వున్న అంజయ్య అనుచరగణాన్ని వేసుకుని వెళ్లారు. విమానం ఆగుతూండగానే, ఆలస్యం చేస్తే రాజీవ్ కళ్లల్లో ఎక్కడ పడమేమోనని, భారీ కాయంతో, భారీ దండల్తో రన్‌వే పైకి, పరుగులు పెట్టుకుంటూ వెళ్లారు. వెనక్కాల బోల్డుమంది జనం. స్వతహాగా పైలట్ అయిన రాజీవ్‌కు విమానాశ్రయంలో యీ భద్రతారాహిత్యం ఒళ్లు మండించింది. ఆ పూలదండల రేకులు ప్రొపెల్లర్లలో పడితే ఏమవుతుందోనన్న ఆందోళనతో అంజయ్యను మందలించాడు. చెప్పడం ఘాటుగానే చెప్పాడు. అంజయ్యగారు మంచివాడే కానీ ఆయన రూపంకానీ, భాష కానీ ఏ మాత్రం సోఫిస్టికేటెడ్‌గా వుండదు. ఇందిరకు విధేయుడన్న కారణంగానే పదవి దక్కిందని, ఆయనమీద అనేక జోకులు వున్నాయనీ రాజీవ్‌కు తెలుసు. అందుకుని దురుసుగానే మందలించాడు. దానికి అంజయ్య మొహం మాడ్చుకున్నారు తప్ప నిరసన తెలపలేదు. తను చేసినది ఎయిర్‌పోర్టు రూల్సుకు వ్యతిరేకమని ఆయనకు తెలుసు. ఈ వార్త పత్రికలకు ఎక్కాక ఎవ్వరూ అంజయ్యగారిని సమర్థించలేదు. రాజీవ్ కాస్త మెత్తగా చెప్పి వుండాల్సిందనే అనుకున్నారంతే. అయినా అతను రాజకీయాలకు, ఆర్భాటాలకు కొత్త. రాజీవ్ హత్యపై కార్తికేయన్ రాసిన పుస్తకంలో బెంగుళూరు పర్యటనలో రాజీవ్ తన బట్టలు తనే ఎలా వుతుక్కున్నారో వుంది. రాజకీయాలకు వచ్చి కొన్నాళ్లయ్యాక వందిమాగధులు పొగడ్తలతో అహంకారాన్ని పెంచి అగడ్తల్లో తోశారు. అంజయ్య ఉదంతం టైముకి రాజీవ్ యింకా ముదిరిపోలేదు. కాంగ్రెసు తెలుగువారిని ఆత్మగౌరవాన్ని దెబ్బ తీసింది అని ఆనాడు ఎన్టీయార్, యిప్పుడు మోదీ ప్రచారం చేసుకోవడానికి మాత్రమే పనికి వచ్చింది.

ఎప్పుడో జరిగిన అంజయ్యగారి సంగతి వదిలేయండి. ఇప్పుడేం జరుగుతోంది? విభజన తీరుపై మనల్ని సంప్రదించకుండానే రాష్ట్రాన్ని విడగొట్టారు. సీమాంధ్రులను సంగతి సరే, విభజన కోరిన తెలంగాణ ఉద్యమనాయకులను కూడా ఎలా చేద్దాం అని అడగలేదు. అసలు వాళ్ల ప్రమేయమే లేదని జైరాం రమేశ్ చెప్తున్నారు. ఢిల్లీలోనే కూర్చుని అన్నీ తేల్చేశారు. వివాదాస్పద విషయాలైన ఉద్యోగుల ఆప్షన్లు, కొత్త రాజధాని ఎంపిక, పోలవరం ముంపు గ్రామాల ఆర్డినెన్సు, ఆస్తుల అప్పుల పంపకాలు... యిలాటివి రెండు రాష్ట్రాలూ కూర్చుని తేల్చుకోవాలిట. అంటే బ్రిటిషువారు స్వాతంత్ర్యం యిస్తూనే సంస్థానాధీశులతో మన పిలకలు ముడివేసినట్లు ఢిల్లీవాళ్లూ యిప్పుడు చేశారన్నమాట. సర్దార్ పటేల్ వున్నాడు కాబట్టి రాజుల పిలకలు కోసేసి భారతదేశంలో కలిపాడు. లేకపోతే యింకా తన్నుకుంటూనే వుండేవాళ్లం. కెసియార్ చెప్తున్నట్లు ఆంధ్ర-తెలంగాణ పంచాయితీ యిప్పట్లో తేలేది కాదు. ఇంత అధ్వాన్నంగా విభజన జరిగేలా చేసినందుకు మన ఆత్మగౌరవం దెబ్బ తినలేదా? మన నాయకులు ఏం చేశారు? మాలో మేం కూర్చుని మాట్లాడుకున్నాం, ఇలా చేస్తే సమన్యాయం, ఎవరికీ నొప్పి వుండదు అని చెప్పారా? మాలో మేం కలిసి కూర్చునే ముచ్చటే లేదు. మీరు తండ్రిలా, తాతలా, శకునిమామలా మధ్యస్తం చేయండి అని బతిమాలాడామా లేదా? ఒక్క పార్టీ అయినా సమన్యాయం యిది అని తేల్చిచెప్పిందా? రెండు ప్రాంతాల నాయకులను పంపడం, చెరో మాటా చెప్పించడం.. యిదే నాటకం కదా. ఇప్పుడు వాళ్లు అన్యాయం చేశారని వాపోవడం దేనికి? వాళ్లు తెలుగువాళ్ల చేత తెలుగువాళ్లను పార్లమెంటులో అడ్డు కొట్టించారు, కొట్టించారు. కాంగ్రెసు, టిడిపిలకు యీ విషయంలో వ్యత్యాసం లేదు. బిజెపి వాళ్లయితే కాంగ్రెసుతో కలిసి ద్రోహం చేశారు. ఇదంతా జరగనిచ్చినందుకు మనం సిగ్గుతో తలవంచుకోవలసిన పని లేదా? మన నాయకులందరికీ మాట్లాడితే ఢిల్లీ వెళ్లిరావడమే సరిపోయింది. అసలు వీళ్ల ట్రిప్పులతోనే మన ఉమ్మడి రాష్ట్రం అప్పులు పెరిగిపోయాయి. ఈ రోజు మన ఆత్మగౌరవం హరించబడిందని అనడానికి బిజెపి-టిడిపిలకు నోరెలా వస్తోంది?

ఇక పివి గారి గురించి చెప్పాలంటే - ఆయన ఎన్నికలలో ఓడిపోయిన తర్వాత, మరణానంతరం సోనియా ప్రవర్తన గురించి మాట్లాడుతున్నారు. పివి సోనియాకు ఏం చేశారో చెప్తున్నారా? ఆవిడ మొదట్లో రాజకీయాలకు దూరంగా వుందామనుకుంది. ఆ తర్వాత చెంచాలు రెచ్చగొట్టడంతో దిగుదామనుకుంది. అప్పుడు పివి ఎప్పటికప్పుడు అడ్డంకులు సృష్టించి, ఆవిడను రంగంలోకి దిగకుండా చూశారు. ఇందిరా గాంధీ కుటుంబం రాజకీయాల్లోకి వస్తే వారసత్వపు రాజకీయాలు మళ్లీ వస్తాయని ఆయనకు తెలుసు.

ఆయన తెలుగువాడు, పండితుడు అయితే కావచ్చు కానీ డర్టీ పాలిటిక్స్ ఆడడంలో ఎవరికీ తీసిపోడు. తెలుగువాడు కదాని ఎన్టీయార్ ఆయనకు పోటీ పెట్టకుండా వూరుకుంటే, ఆ కృతజ్ఞత లేకుండా తనకు అవసరమైనప్పుడు టిడిపి ఎంపీలను తనవైపు ఫిరాయింపచేసుకున్నాడు. విజయభాస్కరరెడ్డి తనపై కువ్యాఖ్యలు చేశారని విని, తన సమక్షంలో సభలో చెప్పులు వేయించినది పివియేనని యిప్పుడు అందరికీ విదితమే. 1996 ఎన్నికలలో కాంగ్రెసు గెలిచి, ఆయన మళ్లీ ప్రధాని అయి వుంటే సోనియాను రాజకీయంగా సమాధి చేసి వుండేవాడేమో! సరే, పివికి అవమానం జరిగింది. పివి ఉపకారం పొందిన తెలుగు కాంగ్రెసు నాయకులు తిరగబడ్డారా? ఎయిర్‌పోర్టుకి రాజీవ్ పేరు పెడితే ఉద్యమాలు చేశారా? జై తెలంగాణ అంటూ వాహనాల నెంబరు ప్లేట్లపై ఎపి కొట్టేసి టిజి రాసినవాళ్లయినా, శంషాబాద్ ఎయిర్‌పోర్టు పేరు ఆర్‌జిఐఎ అవి వున్నచోట ఆర్‌జి తీసేసి పివి పెట్టలేకపోయారా?

ఇది కుటిల రాజకీయం. ఈరోజు సోనియాది పైచేయి. అందుకే కాంగ్రెసు పాలిత రాష్ట్రాలలో ఎక్కడ చూసినా ఇందిర, రాజీవ్ పేర్లు. బిజెపి ప్రభుత్వాలైతే వేరే పేర్లు పెడతారు. రేపు పివి వారసులు ప్రధానులైతే రాజీవ్ పేర్లు మార్చేస్తారు. పివి మాట ఒక్కటే ఎత్తడం దేనికి? ఎన్టీయార్‌కి ఏం జరిగింది? బాబు వస్తూనే ఎన్టీయార్ స్మృతులు చెరిపేయాలని చూశారు. కావాలనుకుంటే ప్రధాని అయివుండేవాణ్ని అని ఆయనే చెప్పుకుంటారు కదా, తెలంగాణ రాకుండా ఆపారు కదా, ఎన్టీయార్‌కు భారతరత్న యిప్పించారా? పార్లమెంటులో విగ్రహం పెట్టించారా? తన పథకాలకు జన్మభూమి, వెలుగు, దీపం, రోశ్నీ, చేయూత, నీరు-మీరు, క్లీన్-గ్రీన్, ... లాటి పేర్లు పెట్టారు తప్ప ఎన్టీయార్ పేరు, కనీసం 'అన్న' ఐనా, కలిసి వచ్చేట్లు పెట్టారా? ఎన్నికలలో దెబ్బ తిన్నాక మాత్రమే ఎన్టీయార్ పేరును ప్రాచుర్యంలోకి తెచ్చారు. పివి వలన ఉపకారం పొందిన కాంగ్రెసు వాళ్లు తక్కువే. ఎన్టీయార్ పేరు చెప్పుకునే టిడిపి నాయకులందరూ బతికారు. వారిలో ఒక్కరైనా బాబు ప్రవర్తనను ఖండించారా? లేదే! రేపు ఏ కారణం చేతనైనా ఎన్టీయార్ కుటుంబీకులు పార్టీని చేజిక్కించుకుంటే అప్పుడు ఖండిస్తారు. బాబు జ్ఞాపకాలను చెరిపేయడానికి చూస్తారు.

ఈ రాజకీయాల్లో ఎక్కడుంది ఆత్మగౌరవం? అసలు జాతిగౌరవం నిలబెట్టడం అనేది కొందరు రాజకీయ నాయకుల చేతల్లో లేదు. ప్రతి వ్యక్తికి ఆత్మగౌరవం వుండాలి. దాన్ని అతను కాపాడుకోవాలి. అతన్ని పొగిడినా, తెగడినా దాన్ని అతని జాతికి ఆపాదించనవసరం లేదు. మోదీ నరహంతకుడు అని ఎవరైనా అంటే యావన్మంది గుజరాతీలను అవమానించినట్లు కాదు. గాడ్సే మహాత్మా గాంధీని చంపాడంటే మరాఠీ బ్రాహ్మలకు గుజరాతీ బనియాలంటే కోపం అని కాదు. అంజయ్య, పివిలకు జరిగిన అవమానం రాజకీయాల కారణంగా జరిగిందే తప్ప తెలుగు జాతికి సంబంధించినది కాదు. ఈ రోజు విభజనలో పాలుపంచుకున్న, వారిని సమర్థించిన, వారికి వ్యతిరేకంగా పోరాడకుండా వున్న - ఏ పార్టీకి ఆత్మగౌరవం గురించి మాట్లాడే హక్కు లేదు. సాటి తెలుగువాడితో కూర్చుని సంప్రదించుకోకుండా, ఢిల్లీలో లాబీయింగుతో పనులు కానిచ్చుకుందా మనుకునేవాళ్లకు గౌరవం ఎక్కణ్నుంచి, ఎలా వస్తుంది? **- ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 33-35 వీక్లీకై ఎమ్బీయస్ : టిడిపి గ్రాఫ్ పెరుగుతోందా?**

ఎన్నికలు దగ్గర పడేకొద్దీ వైకాపా గ్రాఫ్ పడిపోతోందని, టిడిపిది పెరిగిపోతోందని సర్వే ఫలితాలు వస్తున్నాయి. వీటిని ఎంతవరకు నమ్మాలో తెలియకుండా పోయింది. మూడేళ్లగా ఆంధ్ర ప్రాంతంలో వైకాపా దున్నేస్తుందని, తెలంగాణలో తెరాస దున్నేస్తుందనీ సర్వేలు ఘోషిస్తూ వచ్చాయి. అవి బేస్ చేసుకుని ఆ యిద్దర్నీ కలుపుకుని మళ్లీ అధికారంలోకి రావచ్చనే ఉద్దేశంతోనే కాంగ్రెసు విభజనకు ఒడిగట్టిందని కూడా చాలామంది తీర్మానించారు. ఇప్పుడు ఎన్నికలు వారాల్లోకి వచ్చాయి. వైకాపా, తెరాసలు కచ్చితంగా అధికారంలోకి వస్తాయని ఎవరైనా చెప్పగలరా? కాంగ్రెసు వాళ్లతో కుమ్మక్కయిందని కూడా అనగలరా? ఎన్నికలు దగ్గరకు వచ్చేసరికి ఎంతమంది పార్టీలు ఫిరాయించారో చూడండి. పొత్తులు, విపత్తులు ఎన్ని వచ్చాయో గమనించండి. ఈ స్థితిలో ఫలితాలు చెప్పడం కష్టం. మరి అలాటప్పుడు ఎప్పుడో ఏళ్ల క్రితమే సర్వేలు చేయడమెందుకు? రాబోయే ప్రభుత్వాల గురించి అంచనాలు ఎందుకు? అయినా సరే సర్వేలు చేయిస్తూనే వుంటారు, పత్రికలు ప్రముఖంగా వేస్తూనే వుంటాయి, మనం చర్చిస్తూనే వుంటాం. వాటిని ఏ పార్టీనాయకులూ నమ్మరు. తమకు అనుకూలంగా ఫలితాలు వచ్చినవారు కూడా! 'ఇంకా ఎక్కువ సీట్లు వస్తాయి' అంటారు ముసిముసి నవ్వులు నవ్వుతూ. ఎన్నికల ఫలితాల తర్వాత సర్వే ఫలితాలపై సర్వేలు వస్తాయి. ఎవరిది కరక్టు, ఎవరిది కాదు అని విశ్లేషణ. ఎందుకు కరక్టు కాదో మాత్రం చెప్పరు.

## సర్వే సరదాలు

మీరు సరదాకి ఏదైనా సర్వే చేయిద్దామని ఎవరినైనా సంప్రదించి చూడండి, ఎంత ఖర్చుతో, ఎంత సమయంతో కూడుకున్న వ్యవహారమో తెలుస్తుంది. ఒక్క వూళ్లో, కొన్ని వందల మందిని ప్రశ్నించి, విశ్లేషించడానికి వేలాది రూపాయలవుతుంది. చాలా రోజులు పడుతుంది. పత్రికల వాళ్లు అంత ఖర్చు ఎందుకు పెడతారు? పార్టీల వాళ్లు మాత్రం..? అయినా ఎన్నికలు దగ్గరకు వచ్చేవరకు అధికశాతం ఓటర్లు ఎటూ తేల్చుకోరు. 'చెప్పలేం' అనేవారే కీలకం. వాళ్లే ఫలితాలను తారుమారు చేస్తారు. అందుకని

చివరివారంలో జరిపే సర్వేలే కొంతవరకైనా కరక్టు ఫలితాలను యివ్వగలవు. అప్పటిదాకా ఎవరూ ఆగరు కదా. ఏదో ఒక హంగు చేసి పత్రికలు అమ్ముకోవాలి. టీవీ రేటింగ్ పెంచుకోవాలి. నిజాయితీగా ఫలితాలను వెలువరిస్తే హర్షించేవారు తక్కువ. అందువలన పత్రికలు, టీవీలు వారివారి ప్రయోజనాలకు అనుగుణంగా సర్వేలను తీర్చిదిద్దుతున్నాయన్న అనుమానాలు వస్తున్నాయి. ఒకే వారంలో ఒకే నియోజకవర్గంలో మూడు సర్వే సంస్థలు నిర్వహించిన సర్వేలలో వేర్వేరు ఫలితాలు వస్తున్నాయంటే ఏమిటి అర్థం? పైగా ఫలితాలను ప్రభావం చేయడానికి కార్పోరేట్లు వేలు పెడుతున్నారు కాబట్టి వాళ్ల స్పాన్సర్‌షిప్‌తో సర్వేలు జరుగుతున్నాయన్న అనుమానం వుంది కాబట్టి వీటిని నమ్మలేకుండా వున్నాం.

మొన్నటికి మొన్న ఢిల్లీ ఎసెంబ్లీ ఎన్నికలలో సర్వే అంచనాలు చూశాం. ఒక్క సర్వే కూడా ఆమ్ ఆద్మీ అధికారంలోకి వస్తుందని చెప్పలేదు. అందరూ బిజెపికే పట్టం కట్టారు. కాబోయే ముఖ్యమంత్రి అంటూ డా॥ హర్షవర్ధన్‌కు టీవీవాళ్లు కంగ్రాట్స్ చెప్పారు. ఆయన చిరునవ్వు నవ్వి వూరుకుంటే 'అదేమిటి? నీకు నమ్మకం లేదా?' అంటూ కవ్వించారు. జోస్యాలు ఎంతవరకు నిజమవుతున్నాయో, యీ సర్వేలూ అంతే మేరకు నిజమవుతున్నాయి. దీనికి కారణం – 'నిజం చెప్తే నాకేంటి లాభం?' అనే సగటు మనిషి ఆలోచనే. సామాన్యుడి మనోభావం అంటూ ఏ టీ కొట్టువాడి నోటి ముందు టీవీ మైకు పెడితే ఏం చెప్తున్నాడు? పేపర్లో ఏం వస్తోందో అదే వల్లిస్తున్నాడు. మా నియోజకవర్గంలో ఏ పనీ జరగలేదు అని తిడుతున్నాడు. సరే, ఓటు ఎవరికి వేస్తావ్? అంటే చూడాలి అంటాడు. ఎవరు నెగ్గుతారని అనుకుంటావ్? అంటే రకరకాలుగా చెప్తున్నారు, ఫలానాది వస్తుందని మీబోటి వాళ్లు అంటున్నారు అంటాడు తప్ప తనేమనుకుంటున్నాడో చెప్పడు. చెప్తే అవతలి పార్టీవాళ్లు వచ్చి తన్నవచ్చు, ఎందుకొచ్చిన గొడవ? భారతీయులు గడుసువాళ్లు. హిపాక్రసీ ఎక్కువ. అందువలన పాశ్చాత్య దేశాల్లో సర్వేలు ఫలించినట్లు యిక్కడ ఫలించవు.

## గ్రాఫ్ ఎందుకు మారింది?

ఇలాటి పరిస్థితుల్లో ఫలానా సర్వే యిలా వచ్చింది అంటూ చర్చించడం వలన ఏమైనా లాభం వుంటుందా? ఏమో! వైకాపా గ్రాఫు పడిపోయింది, టిడిపి గ్రాఫు పడిపోయిందనేవాళ్లు దానికి కారణం ఏమైనా చెప్తున్నారా? ఎక్స్–యాక్సిస్, వై–యాక్సిస్ హఠాత్తుగా మారిపోయాయా? అప్పటికీ యిప్పటికీ హఠాత్తుగా వచ్చిన మార్పు ఏమిటి? 'మార్పు ఏమిటంటే – విభజన జరిగింది. అందువలన సమైక్యమా? విభజనా? అన్నది ఎన్నికల అంశంగా కాకుండా పునర్నిర్మాణం, నవ నిర్మాణం అనేవి ముఖ్యాంశాలుగా మారాయి. వాటిల్లో చంద్రబాబుది అందె వేసిన చేయి కాబట్టి ఆయనదీ మోదీది కలిస్తే డెడ్లీ కాంబినేషన్ కాబట్టి టిడిపి గ్రాఫ్ అమాంతం పెరిగిపోయింది' ఇదీ కొందరి వాదన. సమైక్యమా? విభజనా? అనేది ఎన్నికల అంశం కానప్పుడు తెలంగాణలో తెరాసకు, కాంగ్రెసుకు ఓట్లు ఎందుకు పడాలి? విభజన చేశాం, కొత్తరాష్ట్రం తెచ్చాం/యిచ్చాం అనే కదా వాళ్లు కాన్వాస్ చేసుకుంటున్నది, ఓట్లు వస్తాయని ఆశిస్తున్నదీ, సీట్లు వస్తాయని సర్వేలు చెపుతున్నదీ...! పునర్నిర్మాణం, పాలనానుభవం అనే ఫ్యాక్టర్లపై టిడిపికే ఎక్కువ సీట్లు రావాలి కదా. వస్తాయని టిడిపియే అనుకోవడం లేదు. అందుకే కృష్ణయ్యగారే ముఖ్యమంత్రి అని ప్రకటించేశారు. టిడిపి కాకపోతే పాలనానుభవంలో కాంగ్రెసుకు మార్కులు పడాలి. మరి కాంగ్రెసు తెలంగాణలో అధికారంలోకి వస్తుందని అనగలమా? టి–కాంగ్రెసు నేతలకే ఆ నమ్మకం లేదు. విభజన అనేది అంశమే అయితే రెండు రాష్ట్రాలలోనూ దాని ప్రభావం వుండితీరుతుంది. ఆ అంశంపై టిడిపి పట్ల తెలంగాణలో వ్యతిరేకత వుంది అని అందరూ ఒప్పుకుంటున్నపుడు, సమైక్యం గురించి నిలబడలేదన్న కోపం సీమాంధ్రులలో టిడిపిపై కూడా వుండాలి కదా. అలాటప్పుడు గ్రాఫ్ ఎలా పెరుగుతుంది?

## టిడిపి విజయావకాశాలు

మామూలుగా చూస్తే ఆంధ్రలోని 175 సీట్లలో 150 సీట్లు టిడిపి, వైకాపా పంచుకుంటాయనుకోవచ్చు. తక్కిన 25 సీట్లలో వివిధ పార్టీలు అంటే కాంగ్రెసు, జెఎస్పీ, బిజెపి, లెఫ్ట్, రెబెల్స్, యిండిపెండెంట్స్ గెలుస్తారనుకుందాం. ఇక యీ 150ను యివి ఏ నిష్పత్తిలో పంచుకుంటాయి? ఉరామరిగా సగం, సగం అనుకుందాం. వైయస్సార్ యిమేజి వుంది, జగన్ ఓదార్పు యాత్ర పేరుతో తిరిగినది వుంది, మొదట్లోనే సమన్యాయం, చివరినైనా సమైక్యం అన్నందుకు కాస్త ఫలితం వుంటుంది. ఇన్ని వున్నాయి కాబట్టి సగం కంటె ఎక్కువే రావాలి కదా అనవచ్చు. జగన్‌కు వ్యతిరేకంగా విపరీతంగా జరుగుతున్న ప్రచారానికి ఎంతోకొంత ప్రభావం వుండి తీరుతుంది. అందువలన ఓటర్లలో సగం మంది జగన్‌ను ఎట్టి పరిస్థితుల్లోను రానీయకుండా చేయాలని అనుకోవచ్చు. గతంలో కాంగ్రెసు బలంగా వున్నపుడు, కాంగ్రెసు, టిడిపి, వైకాపా సమాన స్థాయిలో వుంటాయనుకునే వాణ్ని. కానీ యిప్పుడు కాంగ్రెసు బలహీనపడింది. జెయస్పీ పుంజుకోలేదు. టిడిపి సమైక్యానికి సరిగ్గా నిలబడక మద్దతు పోగొట్టుకుంది. అన్నీ బలహీనపడ్డాయి.

అయినా టిడిపి ఒక్కటే వైకాపాకు బలమైన ప్రత్యర్థిగా నిలిచింది కాబట్టి జగన్ వ్యతిరేక ఓట్లకు గుత్తగా టిడిపికి పడే అవకాశం వుంది. అందువలన టిడిపి, వైకాపాకు చెరి 75 వస్తాయనుకుని లెక్క ప్రారంభించడం సబబు. ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ 3–5% ఓట్ల స్వింగ్ వస్తే 10–15 సీట్లు అటూ యిటూ అవుతాయి. అంటే 85–90 సీట్లతో ఒకరు అధికారంలోకి వచ్చే అవకాశం

వుంది. మరొకరికి 55-60 వచ్చి తీరతాయని లేదు. మధ్యలో వున్న రెబెల్స్ కొన్ని పట్టుకుని పోవచ్చు. అంటే చాలా సున్నితమైన వ్యవహారంగా వుంది. 5% స్వింగ్ మేనేజ్ చేయాలంటే తమకు సాంప్రదాయకంగా వేసే ఓటర్లలో విశ్వాసాన్ని నిలుపుకోవడమే కాదు, కొత్త ఓటర్లను తమవైపు తిప్పుకోవాలి. చంద్రబాబు యిటీవలి చర్యలు యీ దిశగా వున్నాయా? వాటి కారణంగా టిడిపి గ్రాఫ్ నిజంగా పెరిగిందా అనేది చూదాం.

## వలసలు ప్రోత్సహిస్తున్న టిడిపి

గ్రాఫ్ పెరిగిందని అనుకోవడానికి ముఖ్య కారణం - కాంగ్రెసు నాయకులందరూ టిడిపిలోకి జట్లుజట్లుగా వచ్చి పడడం. ప్రజలందరూ టిడిపివైపు వున్నారని గ్రహించారు కాబట్టే వాళ్లు పార్టీ ఫిరాయించారనుకోవాలి. కాంగ్రెసుపై ప్రజలు విముఖత చూపుతున్నారన్నది ప్రస్ఫుటంగా తెలుస్తోంది. పిసిసి అధ్యక్షుడి నియోజకవర్గంలో అభ్యర్థే పారిపోయాడంటే యింకేం చెప్పాలి? విజయవాడ వంటి నియోజకవర్గంలో కాంగ్రెసు టిక్కెట్టు యిస్తే అతను మర్నాడు బిజెపిలో చేరాడంటే ఏమనుకోవాలి? కాంగ్రెసులోంచి బయటకు వచ్చాక వైకాపాలోకి వద్దామని కొందరు ప్రయత్నించారు. అక్కడ కౌంటరు క్లోజయింది. టిక్కెట్ల కసరత్తు ఎప్పుడో ప్రారంభం కావడం చేత కాబోలు దాదాపు అన్ని సీట్లకు ఒకేసారి అభ్యర్థులను ప్రకటించారు. తిరుగుబాటు అభ్యర్థులు కూడా చాలా తక్కువ. టిడిపి ఓపెన్ డోర్ పాలసీతో అందర్నీ రప్పించుకుంది. తన పార్టీలో చేర్చుకోలేని వారిని దగ్గరుండి బిజెపిలో చేర్పించింది. ఈ విధంగా ఆంధ్రలో కాంగ్రెసును దివాలా తీయించానని బాబు అనుకున్నారు.

1977లో జనతా పార్టీ ప్రభవించినపుడు కూడా యిలాగే పార్టీలు మారారు. అంతకుముందు ప్రజాపార్టీ, కృషికార్ లోక్ పార్టీ, స్వతంత్ర పార్టీ, సోషలిస్టు పార్టీ, రిపబ్లికన్ పార్టీ.. కొంతకాలానికి పాత కాంగ్రెసు, కొత్త కాంగ్రెసు, కాంగ్రెసు (ఆర్), కాంగ్రెసు (ఐ), కాంగ్రెసు (టి) యిలా అనేక పార్టీలు వుండేవి. కాంగ్రెసు వాళ్లే అటూయిటూ దుముకుతూ వుండేవారు. కమ్యూనిస్టు వాళ్లు విడిగా వుండేవాళ్లు. జనసంఘ్‌వాళ్లు ఒకళ్లూ యిద్దరూ నామమాత్రంగా వుండేవారు. కమ్యూనిస్టులు, జనసంఘ్‌వాళ్లూ తప్ప యీ కాంగ్రెసు వాళ్లందరూ మళ్లీ మెయిన్ కాంగ్రెసులోకి వచ్చేస్తూ వుండేవారు. టిడిపి ఆవిర్భావం తర్వాత బలమైన ప్రత్యామ్నాయం ఏర్పడింది. దశాబ్దం క్రితం తెలంగాణలో తెరాస ప్రభవించింది. అయితే టిడిపినుండి, తెరాస నుండి కాంగ్రెసులోకి, కాంగ్రెసులోంచి ఆ పార్టీల్లోకి దూకడాలు కూడా జరిగాయి. ఈ ఎన్నికల సమయంలో కమ్యూనిస్టులు సైతం పార్టీ ఫిరాయిస్తున్నారు. కాంగ్రెసువారు బిజెపిలోకి కూడా వెళుతున్నారు. సిద్ధాంతాల బెడద లేకుండా సాగుతున్న యీ ఫిరాయింపులకు లక్ష్యం పదవి మాత్రమే. రేపు ఎన్నికలలో ఎవరు గెలిస్తే వారి వైపు అందరూ పొలోమని వెళ్లిపోతారు. అందువలన ఏదైనా పార్టీని - ముఖ్యంగా కాంగ్రెసును- దివాళా తీయించడం కష్టం. దేశం మొత్తం మీద ఓ 100 ఎంపీ సీట్లు గెలుచుకుని, ఢిల్లీలో తృతీయ ఫ్రంట్ మద్దతుదారుగానో లేక మరొక రూపంలోనో ఒక శక్తిగా వుండక మానదు కాబట్టి, దానికి అనుబంధంగా యిక్కడ కార్యకలాపాలు నిర్వహించేవాళ్లు వుంటూనే వుంటారు. ఈ తాత్కాలిక ప్రయోజనం కోసం పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహించి టిడిపి పొందేది ఎంత? పోగొట్టుకునేది ఎంత?

## కార్యకర్తల్లో అసంతృప్తి

కాంగ్రెసు ఫిరాయింపుదారుల వలన తమ అవకాశాలు చెడిపోయాయని తొలినుండీ వున్న టిడిపి కార్యకర్తలు, నాయకులు నిస్పృహ చెందడం సహజం. కాంగ్రెసు నుండి వచ్చినవారిలో 7 గురికి ఎంపీ స్థానాలు, 28 మంది అసెంబ్లీ స్థానాలు యిచ్చారట. బాబే చెప్పిన ప్రకారం ఒక్కో పార్లమెంటు అభ్యర్థి 7 ఎసెంబ్లీ స్థానాలను ప్రభావితం చేస్తాడు. ఆ విధంగా చూస్తే 49 ప్లస్ 28 స్థానాల్లో 77 స్థానాల్లో అసంతృప్తి వుందన్నమాట. కొన్ని కామన్ వుండవచ్చు కాబట్టి 70 అనుకుందాం. ఇక పొత్తులో భాగంగా బిజెపికి యిచ్చిన స్థానాల్లో కూడా అసంతృప్తులుంటారు. అవి 4 పార్లమెంటు, 12 అసెంబ్లీ స్థానాలు, అంటే 40 స్థానాలన్నమాట. ఇలా చూస్తే దాదాపు 100 స్థానాల్లో టిడిపి కార్యకర్తలు నిరాశలో, నిస్పృహలో వున్నారని అనుకోవాలి. 14 చోట్ల ఓపెన్‌గా తిరుగుబాటు అభ్యర్థులు బరిలో నిలిచారు. ఎంతమందికి ఎమ్మెల్సీ పదవులిస్తామని, రాజ్యసభకు పంపిస్తామనీ ఆశపెట్టి ఆపగలరు? అలాటి వాగ్దానాలు బాబు నెరవేర్చలేకపోవడం కూడా ఆయన ముఖ్య సహచరులు చూశారు.

ఫిరాయింపులను ప్రోత్సహించడం ఒక పొరబాటైతే బిజెపితో పొత్తు మరొక పొరబాటు కాబోతోంది. మోదీ హవా దేశమంతా వీస్తోందని, బిజెపికి ఓటు శాతం పెరిగిందని, దాన్ని తనతో కలుపుకోకపోతే గతంలో జెపి, పిఆర్పీ ఓట్లు చీల్చినట్లు యీ సారి బిజెపి చీలుస్తుందని బాబు లెక్క వేసి బిజెపితో పొత్తుకోసం ఆరాటపడ్డారు. ఎంత హవా వున్నా, సీమాంధ్రలో బిజెపికి కార్యకర్తలెవరున్నారు? పార్టీ నిర్మాణం ఎక్కడుంది? పీఆర్పీ సంగతి వేరు. చిరంజీవి యింటింటికీ తెలిసిన పేరు. కమలం గుర్తు అనేది గ్రామీణుల్లో సగానికి సగం మందికి తెలియనే తెలియదు. ఈ ఓట్ల చీలిక టిడిపి ఓట్లే చీలుస్తారన్న గ్యారంటీ లేదు కదా. జగన్‌కు కూడా ఆ భయం వుండాలి కదా. అయినా బాబు మాత్రమే పొత్తు పెట్టుకోకపోతే లాభం లేదనుకుని చిక్కులు తెచ్చుకున్నారు. మరి పొత్తు యీ విధంగా తెల్లార్చారు కాబట్టి ఓట్ల బదిలీ సవ్యంగా సాగుతుందా? సాగకపోతే యీ కసరత్తు ప్రయోజనం ఏమిటి? సొంతపార్టీ వాళ్లను

మండించడం తప్పు!

### పట్టువిడుపు ఎందుకు చూపలేదు?

టిడిపి బిజెపి పొత్తు వివాదం యిద్దరికీ శోభ నివ్వలేదు. బిజెపి బలహీన అభ్యర్థులను నిలబెట్టిందని బాబు బహిరంగంగా చెప్పారు. వాళ్లు యిద్దరు, ముగ్గుర్ని మార్చారు. బస్, అంతా ఓకే అన్నారు. ఆ యిద్దరి కోసమా, యింత రగడ! దాని వెనుక కారణం ఏదో వుందని అందరికీ అనిపించింది. రఘురామ కృష్ణంరాజును బాబే బిజెపిలోకి పంపారని, పురంధరేశ్వరి విషయంలో బాబు భార్య పంతం పట్టడం వలననే పొత్తు చిక్కుల్లో పడిందని వార్తలు రావడం టిడిపికి శ్రేయస్కరం కాదు. కుటుంబ వ్యవహారాలతో రాజకీయాలు నడపడం కష్టం. జాతి ప్రయోజనాల కోసం, దేశప్రయోజనాల కోసం ఒకప్పుడు యీసడించిన మోదీతో చేతులు కలుపుతున్నానంటున్న బాబు తన భార్యకు కాస్త నచ్చచెప్పుకుని పురంధరేశ్వరి విషయంలో కాస్త పట్టు సడలించి వుంటే బాగుండేది కదా అనిపిస్తుంది. ఈ విషయంలో వెంకయ్య నాయుడు కూడా అసంతృప్తి చెందినట్లు పేపర్లలో వచ్చింది. బిజెపి తరఫున ఆంధ్రలో గ్లామరున్న నాయకురాలిగా ఆమెను ప్రొజెక్టు చేద్దామనుకుంటే యిలా జరిగిందేమిటని ఆయన విసుగు చెందారట. మహాకూటమి రోజుల్లో తెలంగాణలో తెరాసతో యిలాటి పేచీలే యిద్దర్నీ దెబ్బ తీశాయి. అయినా బిజెపి బలమైన అభ్యర్థులను పెట్టలేదని బాబు ప్రకటించడం వింతగా వుంది. ఎవరు బలమైనవారో, ఎవరు కాదో తూచే వెయింగ్ మెషిన్ ఆయన వద్ద వుందా? ఉంటే 2004లో, 2009లో అన్ని చోట్లా బలమైన అభ్యర్థులనే పెట్టలేకపోయారా?

### తెలంగాణ బిసి సిఎం ప్రకటన ఏకపక్షమా?

తెలంగాణలో కూడా పొత్తు సరిగ్గా సాగడం లేదని అందరికీ తెలిసిపోయింది. కిషన్ రెడ్డి విముఖత స్పష్టంగా కనబడుతోంది. హైదరాబాదు సభలో టిడిపి భాగస్వామ్యం లేకపోవడం చేత సభ అనుకున్న రీతిలో విజయవంతం కాలేదని విమర్శలు వచ్చాయి. పైగా కృష్ణయ్యను టిడిపి తమ పార్టీ ముఖ్యమంత్రిగా ప్రకటించడమేమిటి? టిడిపి–బిజెపి కూటమి కదా పోటీ చేస్తున్నది! కృష్ణయ్యను కూటమి తరఫు ముఖ్యమంత్రిగా ప్రకటించాలి తప్ప తన పార్టీ తరఫున మాత్రమే అనకూడదు. 45 సీట్లు బిజెపికి యిచ్చిన తర్వాత వీళ్లు గెలిచేవెన్ని? ఆ సీట్లతోనే కృష్ణయ్యను సిఎం చేస్తారా? కూటమి గెలిస్తే బిజెపి తరఫున సిఎం ఎవరూ కావడానికి వీల్లేదన్న సంకేతం దానిలో వుందా? ఇలా ప్రకటించడానికి బిజెపి ఆమోదం వుందా? ఇవన్నీ పొత్తు సవ్యంగా నడవడానికి వీల్లేకుండా చేస్తున్న చర్యలు. కిషన్ రెడ్డి, ఆరెస్సెస్ కలిసి బాబును ఒక ఆటాడించాయని, బిజెపి నాయకత్వం కూడా బాబును ఖాతరు చేయకుండా పెద్ద నాయకులెవరూ పలకకుండా కౌన్సిలరుగా కూడా ఎన్నిక కాలేని జావడేకర్‌ను బాబుతో సంప్రదింపులకు పంపిందని చెప్పుకుంటున్నారు.

జాతీయ స్థాయి రాజకీయాలు చేసిన బాబుకి యిప్పుడు యీ పరిస్థితి దాపురించింది. విడిపోతే బలహీనపడతాం అన్నదానికి యిదే నిదర్శనం. మన తెలుగువాళ్ల మొహానికి జైరాం రమేశ్‌లు, జావడేకర్‌లు చాలనుకుంటున్నారు ఢిల్లీ నాయకులు. బిజెపిలో వెంకయ్య నాయుడు ఒక్కరే బాబుకి అండగా నిలిచారని స్పష్టమవుతోంది. దానికి కారణం ఒకటే కులం కావడం అని ప్రత్యర్థులు ప్రచారం చేస్తున్నారు. బాబు స్థాయి నాయకుడు పవన్ యింటికి మాట్లాడడం కూడా టిడిపి అభిమానులను కలవర పరచే అంశమే. పవన్‌కున్న కెపాసిటీ ఏమిటో యిప్పటిదాకా తెలియదు. అయినా పోజుకి తక్కువ లేదు. మోదీ అంటే గౌరవం అంటూనే మోదీ కంటె లేటుగా సభకు వచ్చాడు. జూనియర్‌ను దూరం చేసుకుని, పవన్ వెంట పాకులాడడం టిడిపి అభిమానులకు – ముఖ్యంగా కమ్మ ఫీలింగ్ వున్నవారికి చేదుగా తోస్తుంది.

### ఎందుకీ తడబాట్లు?

ఇవన్నీ బాబు యిమేజిని మసకబార్చి, ఎన్నికల ఫలితాలను ప్రభావితం చేయవచ్చు కదా! బాబు ఎందుకిలా చేస్తున్నారని ఆలోచిస్తే ఒకటే సమాధానం తోస్తోంది. బాబు పాతికేళ్లపాటు నిరంతరంగా పాలిస్తారని టిడిపి అభిమానులు, సమర్థకులు అనుకున్నారు. పదేళ్లు కాకుండానే విఘాతం కలిగింది. పదేళ్లగా ప్రతిపక్షంలో వున్నారు. రెండు వరుస ఓటములు. ఈలోగా ఎవరూ ఎదురుచూడని విధంగా విభజన జరిగింది. బాబు కూడా మానసికంగా దానికి సిద్ధపడలేదు. విభజన పట్ల బాబు ద్వంద్వ వైఖరి కారణంగా ఒకప్పుడు టిడిపికి పట్టు వుండే తెలంగాణ భాగమంతా చేజారింది, ముఖ్యంగా హైదరాబాదు. టిడిపి సానుభూతిపరులకు హైదరాబాదులో వున్న ఆస్తుల పట్ల భయాందోళనలు కలగసాగాయి. ఏ ప్రభుత్వం ఏర్పడినా అది టిడిపి పట్ల సానుభూతి చూపించేది ఐతే కాదు. తెలంగాణలో టిడిపి అధికారంలో వస్తుందని ఎంతటి ఆశావాదీ అనుకోడు.

ఇక మిగిలినది ఆంధ్రప్రాంతం మాత్రమే. దానిలో జగన్ గెలిస్తే టిడిపి సానుభూతిపరులకు దక్కేది ఏముంది? ఎటువంటి వేధింపులకు గురికావాలో ఏమో! ఒకసారి అధికారంలోకి వస్తే జగన్ వంటి యువకుడు ఎన్నాళ్లు పాలిస్తాడో ఏమో! ఈ సారి ఏదో

ఒకటి చేసైనా సరే టిడిపి గెలవాలి, లేకపోతే బాబు నాయకత్వంపై టిడిపి సానుభూతిపరులకు నమ్మకం పోతుంది. టిడిపి పార్టీ సజీవంగా వుంచుతూనే బాబు నాయకత్వం మారాలన్న డిమాండు రావచ్చు. అందువలన యీ ఎన్నికలలో ఎలాగైనా గెలిచి తీరాలన్న టెన్షన్‌లో చంద్రబాబు వుండవచ్చు. ఆ టెన్షనే యిన్ని పొరబాట్లు చేయిస్తోందేమో! ఇవన్నీ నాబోటి వాడి అశాస్త్రీయమైన ఊహాపోహలు. రాజకీయ నాయకుల మానసిక విశ్లేషణలో దిట్ట అయిన 'రేపు' నరసింహారావుగారిని అడిగితే కరక్టుగా చెప్పగలరు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 28- 29 వీక్లీకై ఎమ్బీయస్ : మధ్యప్రదేశ్‌లో బిజెపి పరిస్థితి**

ఏడాది క్రితం జరిగిన మధ్యప్రదేశ్ ఎన్నికలలో బిజెపి ఘనవిజయం సాధించింది. ఆ స్ఫూర్తితో యీ పార్లమెంటు ఎన్నికలలో మొత్తం 29 స్థానాలూ గెలవాలనే లక్ష్యంతో 'మిషన్ 29' అనే కోడ్‌నేమ్‌తో బిజెపి ఎన్నికలకు తయారైంది. 2009 పార్లమెంటు ఎన్నికలలో బిజెపి 16 స్థానాలు గెలిచింది. 2013 ఎన్నికలలో 26 లోకసభ నియోజకవర్గాలలో బిజెపికి కాంగ్రెసు కంటె 8% ఓట్లు ఎక్కువ వచ్చాయి. అదే పరిస్థితి కొనసాగితే 26 తెచ్చుకోవడం కష్టం కాదనే భావన బిజెపిది. 230 సీట్లున్న అసెంబ్లీలో 58 స్థానాలు మాత్రమే తెచ్చుకోగలిగిన కాంగ్రెసు హీనస్థితి నుండి యింకా కోలుకోలేదు. రాష్ట్ర అధ్యక్షుణ్ని, శాసనసభలో ప్రతిపక్ష నాయకుణ్ని మార్చినా కార్యకర్తల్లో ఉత్సాహం పుంజుకోలేదు. అది కూడా బిజెపికి ధీమా నిస్తోంది. అందుకే సుష్మా స్వరాజ్ యిక్కడి నుండి పోటీ చేస్తున్నారు. తప్పకుండా గెలుస్తామనగానే ఆశావహులు పెరుగుతారు. ఆశాభంగం కలిగితే తిరగబడతారు. అంతర్గత కలహాలు పెరుగుతాయి. నాయకత్వం ప్రతిపక్ష పార్టీలను దెబ్బ కొడదామనే లక్ష్యంతో బయటివారిని చేర్చుకుని తన కార్యకర్తలను ఉసూరుమనిపిస్తుంది. మన రాష్ట్రంలో వివిధ పార్టీల్లో జరుగుతున్న కథే అక్కడ ఎంపీలోనూ జరుగుతోంది. కాంగ్రెస్ నుండి ఫిరాయించిన ఉదయ్ ప్రతాప్ సింగ్‌కు బిజెపి హొషంగాబాద్ టిక్కెట్టు యిచ్చింది. భగీరథ్ ప్రసాద్ సింగ్ అనే రిటైర్డ్ ఐయేయస్ అధికారి కాంగ్రెసులో వున్నాడు. కాంగ్రెసు అతనికి టిక్కెట్టు యిచ్చింది. తన పేరు జాబితాలో వెలువడిన రోజే అతను బిజెపిలోకి మారాడు. రోజే బిజెపి భిండ్ టిక్కెట్టు యిచ్చేసింది. సహజంగానే స్థానిక బిజెపి నాయకులకు కోపం వచ్చింది.

మోదీ ప్రభంజనంలో గడ్డిపోచను నిలబెట్టినా గెలుస్తాడనే అతివిశ్వాసంతో బిజెపి నాయకత్వం రాజధాని ఐన భోపాల్ టిక్కెట్టును అలోక్ సంజార్ అనే అతనికి యిచ్చింది. అతను పార్టీ ఆఫీసులో పనిచేస్తాడంతే. ఇచ్చేముందు ఆ నియోజకవర్గంలోని ఎమ్మెల్యేలను సంప్రదించలేదు. వారిలో ఐదుగురు యీ అభ్యర్థిని వ్యతిరేకిస్తున్నారు. మాజీ ముఖ్యమంత్రి బాబూలాల్ గౌర్ భోపాల్ మేయర్‌గా వున్న తన కోడలికి టిక్కెట్టు యిమ్మన్నాడు. ఆయన్నూ నిరాశపర్చడంతో ఆయన రచ్చ కెక్కాడు. తన కొడుక్కి టిక్కెట్టు యివ్వలేదని గోపాల్ భార్గవ అనే గ్రామీణాభివృద్ధి మంత్రి ఒకరోజు మౌనవ్రతం పట్టాడు. తన భార్యకు గాని, కూతురుకి గాని టిక్కెట్టు యివ్వలేదని ఆగ్రహించిన వ్యవసాయ మంత్రి గౌరీశంకర్ బిషన్ ప్రచారం చెయ్యను పొమ్మన్నాడు. భార్యలకు టిక్కెట్టు అడిగి భంగపడిన రవాణామంత్రి భూపేందర్ సింగ్, ఆర్థికమంత్రి జయంత్ మాలయా రుసరుసలాడుతున్నారు.

కాంగ్రెసు సంగతి చూడబోతే – సుష్మా స్వరాజ్‌కు వ్యతిరేకంగా విదిశాలో కాంగ్రెసు పార్టీ లక్ష్మణ్ సింగ్‌ను నిలబెట్టింది. ఇతను దిగ్విజయ్ సోదరుడు. అన్నపై అలిగి 2004లో పార్టీ వీడి బిజెపిలో చేరి, మళ్లీ పార్టీలో చేరాడు. కమల్ నాథ్, జ్యోతిరాదిత్య సింధియాలకు గెలిచే అవకాశాలు వున్నాయట. సింధియాకు వ్యతిరేకంగా బజరంగ్ దళ్ నాయకుడు జైభాన్ సింగ్ పవయా నిలబడ్డాడు. రాష్ట్ర పరిశ్రమల మంత్రి యశోధర రాజేను సింధియాకు వ్యతిరేకంగా ప్రచారం చేయమని అడిగితే 'ఏ పార్టీకి చెందినా, అతను నా మేనల్లుడు. నేను వ్యతిరేకప్రచారం చేయను' అని చెప్పేసిందామె. అంతేకాదు, ప్రచారం సందర్భంగా సింధియా కుటుంబానికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసిన తన పార్టీ అభ్యర్థి పవయాపై కేసు పెట్టింది కూడా. ఇవన్నీ చూస్తే ఎంపీలో బిజెపికి 25 సీట్ల కంటె ఎక్కువ వచ్చే అవకాశాలు లేవనిపిస్తుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఎమ్బీయస్ : యుపిలో అమిత్ షా కృషి**

ఈ ఎన్నికలలో యుపిలో బిజెపి ఎక్కువ సీట్లు గెలుచుకుంటే ఆ ఘనత అమిత్ షా కార్యశైలిదే. అతని సామర్థ్యం తెలిసిన మోదీ స్వయంగా అతన్ని ఎంపిక చేసి యుపికి యిన్‌చార్జిగా పంపించాడు. వాళ్లిద్దరికీ 30 ఏళ్ల పరిచయం. శంకర్ సింగ్ వాఘేలా గుజరాత్‌లో బిజెపి అధ్యక్షుడిగా వున్నపుడు మోదీ అమిత్‌ను అతనికి పరిచయం చేశాడు. అమిత్ తన దీక్షతో, సామర్థ్యంతో ఎదుగుతూ వచ్చాడు. వాజపేయి, అద్వాణీ గుజరాత్‌నుండి పోటీ చేసినపుడు వారి ప్రచారభారం నెత్తిన వేసుకుని వారి ప్రశంసలు పొందాడు. మోదీ ముఖ్యమంత్రి అయిన తర్వాత కాబినెట్‌లో అతని కుడిభుజంగా మెలిగాడు. చెప్పిన పని చక్కపెట్టుకుని వచ్చాడు. సొహ్రాబుద్దీన్ బూటకపు ఎన్‌కౌంటర్ కేసులో సిబిఐ చార్జిషీటుకు గురై, అరెస్టయి, ప్రస్తుతం పెరోల్‌పై తిరుగుతున్నాడు.

గత మేలో యుపికి రాగానే అక్కడి పరిస్థితి అధ్యయనం చేశాడు. కులం ప్రాధాన్యత వహిస్తున్న యుపిలో దళితులు బియస్పీవైపు, బిసిలు ఎస్పీవైపు వుండడం చూశాడు. బిజెపికి వున్న అగ్రవర్ణాల సపోర్టు చాలదనుకుని, బిసి ఓట్లు ఎస్పీ నుండి లాక్కోవడానికి

ప్రణాళికలు రచించాడు. మోదీ బిసి కులస్తుడన్న సంగతిని హైలైట్ చేస్తూ బిసి నాయకులను బిజెపిలోకి తీసుకురావడానికి చూశాడు. లక్నోకు వెళ్లి రెండు సార్లు బిజెపి లోంచి బయటకు వెళ్లిపోయిన బిసి నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి కళ్యాణసింగ్‌ను కలిసి బేరమాడాడు. తన లోధ్ కులస్తులు ఎక్కువగా వున్న ఆలీగఢ్, హత్రాస్, బులంద్ షహర్‌లలో తను చెప్పిన కాండిడేట్లకు టిక్కెట్లు యివ్వాలన్న అతని డిమాండ్‌కు ఒప్పుకున్నాడు. ఆ ప్రకారం మార్చిలో కళ్యాణ్ సింగ్ బిజెపిలో చేరడం, వెంటనే పార్టీ ఉపాధ్యక్షుడు కావడం జరిగింది. ఈ సారి ఎన్నికలలో బిజెపి కశ్యప్, కూర్మి, రాజభర్, కుశావహా, తదితర కులాలకు చెందిన బిసిలకు 20 సీట్లు యిచ్చింది. ఇంతవరకు బాగానే వుంది కానీ దీని కారణంగా బిజెపిని సమర్థిస్తూ వచ్చిన బ్రాహ్మణ, రాజపుత్ర కులాల వారికి కోపం వచ్చింది. వారణాశి, లక్నో నియోజకవర్గాల నుండి మురళీ మనోహర్ జోషి, లాల్జీ టాండన్ వంటి సీనియర్ నాయకులను తప్పించి మోదీ, రాజ్‌నాథ్‌లకు యిచ్చేముందు కనీసం వారిని సంప్రదించకపోవడం అవమానంగా భావించారు. మోదీ పేరు చెప్పి అమిత్ వారిని నోరు మూయించాడు. లాల్జీ టాండన్‌ను కలిసి 'రాజ్ నాథ్ ప్రచార బాధ్యత నీదే. లక్నోలో మోదీ సభకు నిర్వహణ నీదే' అని నచ్చచెప్పాడు.

కళ్యాణ్‌సింగ్‌ను వెనక్కి తీసుకురావడంతో ఇప్పటికే పార్టీలో వున్న బిసి నాయకులు ఓం ప్రకాశ్ సింగ్, వినయ్ కతియార్‌లకు ఆగ్రహం వచ్చింది. 'గుజరాత్‌లో కట్టే పటేల్ విగ్రహానికి యినుము సేకరించే పని నీదే' అని ఓం ప్రకాశ్‌ను బుజ్జగించాడు. ఆరెస్సెస్ నాయకులనే కాదు, అనుబంధ సంస్థలైన అఖిల భారత విద్యార్థి పరిషత్, హిందూ జాగరణ్ మంచ్ నాయకులను కూడా కలిసి వారి మధ్య సమావేశాలు ఏర్పరచి కమ్యూనికేషన్ గ్యాప్ తగ్గించాడు. ఇతని ప్రయత్నాల వలన ఆరెస్సెస్ నాయకుడు సురేశ్ సోనీ ఆరెస్సెస్, బిజెపి నాయకుల మధ్య సమన్వయసభను లక్నోలో ఏర్పాటు చేశాడు. అమిత్ ప్రతీ నియోజకవర్గానికీ వెళ్లి 'మోదీ గెలుపు ఖాయం' అంటూ కార్యకర్తలను ఉత్తేజపరిచాడు. ఇప్పటివరకు 40 భారీ సభలు ఏర్పరచాడు. 400 ప్రచార రథాలు సిద్ధం చేశాడు. 1.40 లక్షల బూత్ కమిటీలు ఏర్పడాలని ఆదేశించాడు. ఒక్కో కమిటీలో 10 మంది సభ్యులుంటారు. వారు బిజెపి ఓటర్లను గుర్తించి వారిని బూత్‌కు తీసుకుని రావాలి. ఇలా గ్రౌండ్ వర్క్ చేస్తూనే హిందూత్వ పేరుపై ఓటర్లను ఆకర్షించడానికి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నాడు. ఒకటి బెడిసికొట్టి ఎలక్షన్ కమిషన్ అతన్ని ప్రచారానికి వెళ్లవద్దని ఆర్డరేసింది. వెళ్లకపోతే చేసినదంతా వ్యర్థమవుతుందన్న భయంతో క్షమాపణ చెప్పి నిషేధం ఎత్తి వేయించుకున్నాడు. ఎస్పీకి చెందిన ఆజం ఖాన్ మాత్రం ఆ తెలివి ప్రదర్శించలేదు.

ఇదంతా చదివి యీ సారి బిజెపి యుపిలో 80 సీట్లూ గెలిచేస్తుందని అనుకోవడానికి లేదు. తక్కిన రాష్ట్రాలలో జరిగినట్లే యిక్కడా బిజెపి యితర పార్టీల నుండి నాయకులను ఫిరాయింపు చేసుకుని తన కార్యకర్తలను నొప్పించింది. దోమారియాగంజ్ నుండి పోటీ చేస్తున్న జగదంబికా పాల్ కాంగ్రెసు నుండి రాగా, ఫిరోజాబాద్ అభ్యర్థి ఎస్ పి సింగ్ బాఘేల్ బియస్పీ నుండి రాగా, ఫతేపూర్ సిక్రి అభ్యర్థి చౌధురీ బాబూలాల్ ఆర్ఎల్‌డి నుండి వచ్చారు. గోండా అభ్యర్థి కీర్తివర్ధన్ సింగ్, అలహాబాద్ అభ్యర్థి శ్యామా చరణ్ గుప్తా, కైసర్‌గంజ్ అభ్యర్థి భూషణ్ శరణ్ సింగ్ ఎస్పీ నుండి వచ్చారు. ఈ గోడదూకుళ్ల ప్రభావం ఏ మేరకు వుంటుందో వేచి చూడాలి. – ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)

## ఎమ్బీయస్ : బిహార్‌లో అందరి నోటా బిసి మంత్రమే

బిహార్‌లో లాలూ ఎన్నో ఏళ్లు రాజ్యం చేశాడు. అతనికి అనుచరుడుగా వున్న నితీశ్ విడివడి వచ్చేశాక లాలూ బలం క్షీణించింది. 2009 పార్లమెంటు ఎన్నికలలో నితీశ్ బిజెపితో పొత్తు పెట్టుకున్నాడు. 40 సీట్లలో 15 బిజెపికి యివ్వగా 12 గెలుచుకుంది. నితీశ్ జెడియుకి 20 రాగా, కాంగ్రెసుకు 2, లాలూకి 4 వచ్చాయి. 2010 అసెంబ్లీ ఎన్నికలలో జెడియు, బిజెపి కలిసి పోటీ చేసి 115, 91 తెచ్చుకున్నాయి. మిశ్రమ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశాయి. బిజెపి మోదీని తలకెత్తుకున్నాక నితీశ్ దూరమయ్యాడు. బిహార్‌లో ముస్లిముల జనాభా ఎక్కువ. వాళ్లూ, యాదవులూ కలిసి లాలూకి ఓటుబ్యాంకుగా నిలిచారు. తను మోదీతో కలిసి ఊరేగితే ముస్లిములు లాలూ వైపు మరలిపోతారని నితీశ్ భయం. బిజెపి నితీశ్ ప్రభుత్వం నుండి తప్పుకుంది. ఇప్పుడు నితీశ్ ఒంటరి పోరాటం చేస్తున్నాడు. అతను తన అభివృద్ధి పథకాలతో మహాదళితులను, యాదవులు కాక తక్కిన బిసిలను ఆకట్టుకుని నాయకుడిగా ఎదుగుతూ వస్తున్నాడు. మోదీని వ్యతిరేకించిన నితీశ్‌కు ఎలాగైనా బుద్ధి చెప్పాలని బిజెపి సంకల్పించింది. తను 30 సీట్లలో పోటీ చేస్తోంది. పొత్తులో భాగంగా బిహార్‌లో యింకో రాజకీయశక్తి అయిన దళిత నాయకుడు పాశ్వాన్‌కు 7, నితీశ్‌నుండి విడిపోయి వచ్చిన కుశావహా కులనాయకుడు ఉపేంద్రకు 3 సీట్లు యిచ్చింది. దేశంలో వేరే చోట హిందూత్వ గురించి ప్రచారం చేసే బిజెపి యిక్కడ బిసిల గురించే మాట్లాడుతోంది. మోదీ బిసి అనే విషయాన్ని నొక్కి చెపుతోంది. లాలూ, నితీశ్‌ల నుండి బిసిల ఓట్లు గుంజుకుంటే, తమకు ఎప్పుడూ ఓట్లేసే భూమిహార్, రాజపుత్, బ్రాహ్మణ ఓట్లు ఎలాగూ పడతాయని వారి అంచనా.

ప్రచారంలో శ్రమకు ఖర్చుకు బిజెపి వెనకాడటం లేదు. 243 అసెంబ్లీ నియోజకవర్గాలకు 243 వీడియో వ్యాన్‌లు రెడీ చేశారు. అవి రోజులో ఏడు చోట్ల ఆగి ప్రతీ చోట 25 నిఁఎల మోదీ ప్రసంగాన్ని ఎల్ఇడి స్క్రీన్‌లపై ప్రదర్శిస్తాయి. 70 రోజుల్లో 70 వేల ప్రచార సభలు నిర్వహించి కోటి మందికి మోదీ సందేశం చేరేట్లు చేస్తున్నాయి. ఇప్పటికే యీ వ్యాన్‌ల ద్వారా 25 లక్షల మోదీ మాస్క్‌లు జనాలకు చేరాయి. 2009లో 33 లక్షల మంది బిజెపికి ఓటు వేశారు. వారి సెల్‌ఫోన్ నెంబర్లు తీసుకోవడంతో బాటు

కొత్తగా 15 లక్షలమంది నెంబర్లు పోగేశారు. ఈ 48 లక్షల మందికి సెల్‌ఫోన్ ద్వారా ప్రచారం చేస్తారు. వీడియో వ్యాన్‌ల ద్వారా ప్రదర్శన చూసినవారి స్పందనలు సేకరించడానికి 100 మంది ఎగ్జిక్యూటివ్స్‌ను నియమించారు. వీరందరినీ మానిటార్ చేయడానికి రాజ్యసభ ఎంపీ ఆర్ కె సిన్హా, అతని కొడుకు ఋతురాజ్ వున్నారు. అతను లీడ్స్ యూనివర్శిటీలో తర్ఫీదు పొందాడు. ఈ విధంగా ఒక కార్పోరేట్ మార్కెటింగ్ కాంపెయిన్ స్టయిల్లో బిహార్‌ను అదరగొడుతోంది బిజెపి.

లాలూ కాంగ్రెసుతో జతకట్టాడు. 2010 ఎన్నికలలో లాలూకి 19% ఓట్లు, కాంగ్రెసుకు 8% ఓట్లు వచ్చాయి. అవి కలిస్తే ఒక గట్టి శక్తిగా మారవచ్చు. అందువలన పత్రికలు చేస్తున్న సర్వేలలో బిజెపి కూటమికి కనీసం 20 వస్తాయని, లాలూ కూటమికి కనీసం 8 వస్తాయని, నితీశ్‌కు మహా అయితే 5 వస్తాయని అంచనా. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : అళగిరి బలమెంత?

కరుణానిధి కొడుకులు అళగిరికి, స్టాలిన్‌కు పడదు. అళగిరి ఎవరు చెప్పినా వినేరకం కాదని 1980లలోనే తెలిసిపోయింది. ఇద్దర్నీ ఒకచోట వుంచితే ప్రమాదమని కరుణానిధి "దక్షిణ తమిళనాడులో మన పార్టీ బలహీనంగా వుంది. నువ్వు మధురైలో కాపురం పెట్టి, అక్కడి మన పార్టీ పత్రిక 'మురసొలి' సర్క్యులేషన్ పెంచి, పార్టీ క్యాడర్ విస్తరింపచేయి." అని అళగిరిని మధురైకి తోలేశాడు. అళగిరి అప్పణ్నుంచి అక్కడే వుండి, దక్షిణ తమిళనాడులో డిఎంకెను ద ృఢపరిచాడు. అదంతా అతని సామ్రాజ్యంగా పేరుపడింది. ఇటీవలి గొడవల్లో కరుణానిధి అళగిరిని పార్టీలోంచి తరిమేశాడు. అయినా అళగిరి "నేను వేరే పార్టీ పెట్టను." అని ప్రకటించి తండ్రికి విధేయత చాటుకున్నాడు. తండ్రి మరణం తర్వాత పార్టీని చీల్చి సగం పట్టుకుపోదామని అతని ఆలోచన. అతనికి వుందని చెప్తున్న బలమంతా మీడియా సృష్టే తప్ప మరేమీ కాదని నిరూపించడానికి స్టాలిన్ తన అనుచరులను దక్షిణ తమిళనాడులోని నియోజకవర్గాలలో అభ్యర్థులుగా పెట్టాడు. దాంతో అళగిరి ఆ 10 నియోజకవర్గాలలోని డిఎంకె అభ్యర్థులను ఓడించమని తన అనుచరులకు పిలుపు నిచ్చాడు. ఇది వినగానే బిజెపితో పొత్తు పెట్టుకున్న వైకో పార్టీ అభ్యర్థులు అళగిరి వద్దకు వచ్చి తమకు సపోర్టు యివ్వమని అడిగారు. తక్కిన వూళ్లలో మాట ఎలా వున్నా మధురైలో మాత్రం డిఎంకె అభ్యర్థి వేలుసామి ఓడిపోవడం ఖాయం. అతని పేరు ఎవరికీ తెలియదు. పైగా ఆ పార్లమెంటు నియోజకవర్గంలోని ఆరు అసెంబ్లీ స్థానాల్లో ఐదింటిలో ఎడిఎంకె ఎమ్మెల్యేలున్నారు. ఎడిఎంకె అభ్యర్థి డిప్యూటీ మేయర్ గోపాలక ృష్ణన్ నగరంలో అందరికీ పరిచితుడు. జయలలిత మూడేళ్ల పాలనపై అసంత ృప్తి వుంది. ముఖ్యంగా తాగునీరు, విద్యుత్ సమస్యలతో జనం బాధపడుతున్నారు. ఎన్నికల అనంతరం మోదీతో చేయి కలుపుతుందేమోనన్న భయం ముస్లిము ఓటర్లలో వుంది. అయినా మధురైలో ఎడిఎంకె అభ్యర్థి విజయం ఖాయం అంటున్నారు. మొత్తం మీద ఎడిఎంకె విజయం సాధిస్తే అళగిరి ఎటు చేరతాడో వేచి చూడాలి.

అళగిరి తమాషా యిలా వుండగా 2జి స్కాము ఫేమ్ రాజా కథ వేరేలా వుంది. కెంతాలాలో డిఎంకె టిక్కెట్టుపై అతను నిలబడ్డాడు. అతనికి ప్రత్యర్థిగా 2009 ఎన్నికల్లో నిలబడి ఓడిపోయిన యువకుడు ఎస్.గురుమూర్తిని బిజెపి తన అభ్యర్థిగా నిలబెట్టింది. అయితే అతను ఎన్నికల అధికారికి ఎ, బి ఫార్మ్‌లు యివ్వడం మర్చిపోయాడు. వెంటనే అతన్ని అనర్హుడిగా ప్రకటించారు. అందువలన రాజా గెలుపు సులభమవుతోంది. అంత ముఖ్యమైన పేపర్లు యితనెలా మర్చిపోయాడు, అధికారి మాత్రం ఎత్తి చూపలేదా? అని అడుగుతుంటే యిదంతా రాజాయో, ఎడిఎంకెయో వెనక్కాల నుండి ఆడించిన డ్రామా అంటున్నారు. ఎందుకంటే పొత్తులో భాగంగా బిజెపి తీసుకున్న సీట్లు 7. వాటిలో యిది యిలా చీదేయడంతో 6టిలో పోటీ చేస్తోంది. మరి బిజెపి పొత్తుదారులైన వైకో, పిఎంకె యిత్యాది పార్టీలు తమ ఓటును ఏం చేయాలి? డిఎంకెకు వ్యతిరేకంగా వేయాలంటే ఎడిఎంకెకు వేసి తీరాలి. అది జరగడానికి గాను గురుమూర్తిని ముందే కొనేశారని పుకారు. లేకపోతే 2009 ఎన్నికలలో నిలబడిన వ్యక్తికి ఎ, బి ఫారాలు యివ్వాలని తెలియదంటే ఎవరు నమ్ముతారు? **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 36**

## ఎమ్బీయస్ : తెలంగాణలో బలాబలాలు

తెలంగాణలో రేపు ఎన్నికలు జరగనున్నాయి. ఎవరు గెలుస్తారు? అని అందరికీ సహజంగానే కుతూహలం వుంటుంది. భవిష్యత్తు తెలియదు కాబట్టే ఉత్సుకత కొద్దీ ఎవరికి తోచిన వూహలు వారు చేస్తారు. కచ్చితంగా ఎవరూ చెప్పలేరు. నేను ఏ సర్వేలూ నిర్వహించలేదు. నా వద్ద ఏ రహస్యసమాచారమూ లేదు. పేపర్లలో చదివినదాన్ని బట్టి, కామన్‌సెన్స్ ఉపయోగించి అంచనాలు వేసి చెప్తున్నాను. ఏ గ్యారంటీలు, వారంటీలు లేవు. తెలంగాణలో కాంగ్రెసు–తెరాస కలిసి పోటీ చేస్తే స్వీప్ చేసేదని, విడివిడిగా చేస్తున్నారు కాబట్టి హంగ్ ఎసెంబ్లీ వస్తుందని అతి సులభంగా అందరూ చెప్తున్నారు. మరి హంగ్‌లో ఎవరికెన్ని, ఎవరి మద్దతుతో ఎవరు అధికారంలోకి వస్తారు అనేది రెండో ప్రశ్నగా మొలుచుకు వస్తుంది. ఎన్నికల అనంతరం ఏమైనా కావచ్చు, ఎన్నికల ప్రచారంలో వుపయోగించిన తిట్లను అటకెక్కించి ఎవరితోనైనా ఎవరైనా చేతులు కలపవచ్చు. అందువలన దానిపై ప్రస్తుతం పెద్ద చర్చ చేయనక్కరలేదు కానీ, ఎవరికి ఎన్ని వస్తాయో గట్టిగా ఆలోచించి చూదాం.

తెలంగాణ తెచ్చినందుకు తెరాసకా, యిచ్చినందుకు కాంగ్రెసుకా ఎవరికి ఓట్లేస్తారు? అన్నదే అందరూ విశ్లేషిస్తున్నారు. ఈ ప్రశ్న యావత్తు తెలంగాణకు వర్తిస్తుందా లేదా అన్నది మొదట చూడాలి. తెలంగాణ వచ్చినందుకు ఎంతమంది ఆనందించారు? తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్నవారందరూ, తెలంగాణ ఉద్యమం బలంగా వున్నచోటల్లా యీ సెంటిమెంటు వర్కవుట్ అవుతుంది అనుకుంటే రెండున్నర జిల్లాలతో ఖాతా మొదలవుతుంది. రాకమునుపు పెద్ద ఫీలింగు లేకపోయినా, వచ్చింది కాబట్టి, యిప్పుడు ఆంధ్రావాళ్లందరూ తెలంగాణ ఖాళీచేసి వెళ్లిపోతే తమ పిల్లలకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నే ఆశతో కొన్ని వర్గాలు వుంటాయి. అవి అన్ని జిల్లాలలోనూ విస్తరించి వుంటాయి. ఆంధ్రావాళ్లు వెళ్లిపోతే తమ వ్యాపారాలు దెబ్బతింటాయని, పరిశ్రమలు మూతపడి తమ ఉద్యోగాలు పోతాయనే భయంతో కొన్ని వర్గాలు వుంటాయి. ఈ వర్గాలు ప్రధానంగా హైదరాబాదు, రంగారెడ్డి, మెదక్ జిల్లాల వరకే వుంటాయని అనుకోవచ్చు.

విభజన వలన తాము ఏం కోల్పోతామో తెలంగాణ వారికి ఎవరూ సరిగ్గా వివరించి చెప్పటం లేదు. రెండేళ్ల క్రితమే విభజన జరిగి వుంటే దాని సత్ఫలితాలో, దుష్ఫలితాలో అందరికీ అనుభవంలోకి వచ్చేవి. ఇప్పుడు కేవలం బిల్లు మాత్రమే పాస్ అయింది కాబట్టి ఇక్కడ 'బంగారు తెలంగాణ' అక్కడ 'సింగపూరాంధ్ర' ఏర్పడతాయని చెప్పి వూదరగొడుతున్నారు. తక్కువ శాతమే అయినా కొందరు నమ్మవచ్చు. ఎన్నికల వాగ్దానాలు చూస్తే మతి పోతుంది. మితిమీరిన సంక్షేమపథకాలు ప్రకటిస్తున్నారు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌పై విపరీతంగా పెట్టుబడులు పెడతామంటారు రెండింటికీ డబ్బు ఎలా సరిపోతుంది? కేంద్రాన్ని బతిమాలి తెస్తామని కొందరు, కొట్లాడి తెస్తామని మరికొందరు అంటారు. ఇవి నమ్మేవాళ్లు మాత్రమే తెలంగాణ వచ్చినందుకు ఆనందించాలి.

ఆనందించినా, ఆనందించకపోయినా తెలంగాణ అనేది ఫేట్ ఎకాంప్లీ (మార్చలేని వాస్తవం). ఇక ముందు కథేమిటి అన్నది చూస్తారా? తెలంగాణ తెచ్చిన లేదా యిచ్చిన వాళ్లకు కృతజ్ఞత తెలుపుతారా అన్నది ముఖ్యమైన పాయింటు. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది. 1952లో మొదటి సార్వత్రిక ఎన్నికలలో కాంగ్రెసుకు 100% ఓట్లు, సీట్లు రాలేదు. అప్పటికే ఐదేళ్లు అయిపోయింది కాబట్టి ఆ పొంగు తగ్గిపోయింది అనుకుందాం. ఇప్పుడైతే తెలంగాణ బిల్లు వేడివేడిగానే వుంది కాబట్టి అది ఎన్నికలలో అంశంగా వుండి తీరుతుంది అని మీడియా బలంగా నమ్ముతోంది. కాస్సేపు మనమూ నమ్మి ఆలోచనను కొనసాగిద్దాం. తెలంగాణ యిచ్చినందుకు సంతోషించిన ఓటర్లు ఎవరికి ఓటేయాలి? ఉద్యమం చేసిన తెరాసకా, బిల్లు పాస్ చేసిన కాంగ్రెసుకా, సహకరించిన బిజెపికా, లేఖ యిచ్చి మార్గం సుగమం చేసిన టిడిపికా? నిలడుతున్న ప్రతి అభ్యర్థీ తెలంగాణ ఉద్యమానికి నేను ఫలానా చేశాను అని చెప్పుకుంటూనే వుంటాడు. పార్టీ పరంగా చూడాలంటే 'తెలంగాణ బిల్లులో తెరాస పాత్ర ఏమీ లేదు, ఇద్దరు ఎంపీలతో వాళ్లేం సాధించారు?' అని కాంగ్రెసు పెద్దలంటున్నారు. 'నవమాసాలు మోసిన తల్లికి బిడ్డ దక్కాలా? లేక పురుడు పోసిన మంత్రసానికా?' అని కవిత పాయింటు లాగారు. 'సోనియా మంత్రసానితనం లేకపోతే ఆ గజగర్భం అలా మరో పుష్కరం పాటు కొనసాగుతూనే వుండేది కదా' అని రేపు కాంగ్రెసువాళ్లు అనవచ్చు.

ఒకటి మాత్రం నిజం – తెలంగాణ ఉద్యమ సెంటిమెంటుతో తెరాస విజయం నల్లేరు మీద బండి నడక అనుకున్నవాళ్లు నాలిక కరుచుకోవాల్సి వస్తోంది. కెసియార్ యింతగా శ్రమిస్తున్నారంటేనే, యిన్ని దుర్భాషలాడుతున్నారంటేనే అర్థమవుతోంది. యుద్ధంలో గెలిచినవారు పరాజితులపై నోరు పారేసుకోవాల్సిన పని లేదు. కానీ కెసియార్ 'సీమాంధ్ర నాయకులు', 'వలస నాయకులు' 'వాళ్లకు యిక్కడేం పని?' అంటూ విరుచుకుపడుతూనే వున్నారు. 'ఉద్యమం యింతటితో అయిపోలేదు. ఆంక్షలు లేని సంపూర్ణ తెలంగాణ వచ్చేవరకు ఆంధ్ర నాయకులతో కొట్లాడవలసినదే. అది మాతోనే సాధ్యం, ఆంధ్రలో ప్రయోజనాలున్న ఏ పార్టీకి సాధ్యం కాదు' అనే సంకేతం పంపడానికై ఆయన అలవాటు లేని పద్ధతిలో చెమటోడుస్తున్నారు. కాంగ్రెసును, టిడిపిని తిట్టారు. ఓకే. ప్రచారం చివర్లో బిజెపిని, మోదీని కూడా దుమ్ము దులిపేశారు. కేంద్రం సహకారంతో నిధులు తెచ్చి తెలంగాణలో పవర్ ప్రాజెక్టులు, స్టీలు ఫ్యాక్టరీలు, ప్రత్యేక ప్రతిపత్తి సాధిస్తానని అంటూ జాతీయ పార్టీలు రెండింటితో చెడగొట్టుకుంటున్నారేమిటి అంటే మూడో ఫ్రంటువైపు వెళతా అంటున్నారు. 2009లో మూడో ఫ్రంటుతో కలిసి పోటీ చేసి, ఎన్నికలు కాగానే ఎన్‌డిఏతో కలిసి వూరేగారు. ఈ సారి రివర్స్ అన్నమాట. అయితే ఆ క్రమంలో మోదీని సన్నాసి అనడం, హైదరాబాదును యూటీ చేస్తాడు, దేశానికి ద్వితీయ రాజధాని చేస్తాడు చూసుకోండి అంటూ ఆరోపించడం కాస్త డోసు ఎక్కువైంది. హైదరాబాదును యూటీ చేయడానికి బిజెపి మొదటినుండీ వ్యతిరేకి. మజ్లిస్, బిజెపి ఒకే అభిప్రాయానికి వచ్చిన అరుదైన అంశం యిది.

మోదీ వ్యక్తిగత అభిప్రాయం ఏ మేరకు చెల్లుతుందో చూడాలి కదా. బిజెపి మానిఫెస్టోలో అయితే యీ ప్రస్తావన ఏదీ లేదు. అయినా హైదరాబాదు, రంగారెడ్డి ప్రజలు కెసియార్ మాటలను నమ్మారంటే తెరాసకే ముప్పు. విభజన తర్వాత హైదరాబాదు కళ తప్పుతుందని భయపడేవారికి యూటీ చేస్తారనేది చల్లని కబురు. వాళ్లంతా బిజెపికి జై అనవచ్చు. కెసియార్ హఠాత్తుగా బిజెపిపై విరుచుకుపడడానికి కారణం – వాళ్లకు బలం పెరుగుతోందన్న సందేహమా? లేక నిజామాబాద్‌లో తన కూతురు బిజెపి ప్రత్యర్థిని దెబ్బ తీయడానికా? ఒకవేళ అదే నిజమైతే తెలంగాణ యిచ్చినందుకు బిజెపికి కూడా ఓట్లు వచ్చే అవకాశం వుందన్నమాట. తెలంగాణ కోరుకున్నవారి ఓట్లు కాంగ్రెసు, తెరాస, బిజెపిల మధ్య ఏదో ఒక నిష్పత్తిలో చీలతాయని గట్టిగా అనవచ్చు. టిడిపికి మాత్రం పడకపోవచ్చు. టిడిపి తెలంగాణకై పోరాడామని ఎంత చెప్పుకున్నా వీరతెలంగాణవాదులైతే నమ్మరు. టిడిపికి ఓట్లు వేరే కారణాల వలన పడాలి తప్ప యీ కారణం చేత మాత్రం కాదు. తెలంగాణ ఉద్యమం 40 అసెంబ్లీ నియోజకవర్గాలలో బలంగా

వుందనుకుంటే వాటిలో బిజెపికి ఓ 6,7 వస్తాయనుకుంటే కాంగ్రెసు, తెరాస చెరో 17-18 స్థానాలు పంచుకోవాలి. ఉద్యమం సాగుతున్నంతకాలం నిస్తేజంగా వుండి, పదవులు అనుభవించి, ఆఖరి క్షణంలో తెలంగాణ తెచ్చింది మేమే అంటూ వచ్చిన కాంగ్రెసుకు తెరాసతో సమానంగా సీట్లు వస్తాయా అన్న సందేహం కలుగుతుంది.

కాంగ్రెసుకు సంస్థాగతమైన బలం ఎప్పుడూ వుంటుంది. కొందరు నాయకులు తమ అనుచరగణాన్ని ఎప్పుడూ మేన్‌టేన్ చేస్తూ వుంటారు. తమ వద్దకు వచ్చినవాళ్లకు పనులు చేసి పెడుతూ వుంటారు. నియోజకవర్గానికి పనికివచ్చే ప్రాజెక్టులు, ఫ్యాక్టరీలు తేకపోవచ్చు కానీ వ్యక్తిగతంగా కొందరికి పనులు చేసి పెట్టి మంచి పేరు సంపాదించుకుంటారు. సీమాంధ్రలో కాంగ్రెసు తిరుక్షవరం అంటున్నారు కదా, అయినా వాళ్లు 10 సీట్లు తెచ్చుకుంటే నేను ఆశ్చర్యపోను. అవి స్థానిక నాయకుల బట్టి వస్తాయి, పార్టీ సిద్ధాంతాల బట్టి కాదు, మానిఫెస్టో చదివి కాదు. తెరాస కానీ, కాంగ్రెసు కానీ – ప్రజలకు అందుబాటులో వుండే ఎమ్మెల్యే అభ్యర్థి కనబడితే అతనికి గెలుపు అవకాశాలు బాగుంటాయి. తెలంగాణ వచ్చినా, ఉమ్మడి రాష్ట్రం పోయినా ప్రతి వాడికీ నాకు పనులు జరగడం ఎలా? అన్న రంధే వుంటుంది. తమకు తెలిసిన నాయకుడు ఏ పార్టీలోకి దూకినా అతనికి వేసే ఓట్లు వేస్తూ వుంటారు. తెరాస ఎమ్మెల్యేలు ఎన్నికలలో, ఉపయెన్నికలలో గెలుస్తూ వచ్చినా వాళ్లు రాజీనామా చేసి అధికారానికి దూరంగా వుండడమే ఎక్కువ. అధికారంలో వున్న కాంగ్రెసు ప్రభుత్వం వాళ్ల ప్రాబల్యం తగ్గించడానికే చూసింది. అందువలన తెరాస ఎమ్మెల్యేల కంటె కాంగ్రెస్ ఎమ్మెల్యేలు, మంత్రులే పనులు ఎక్కువ చేసి పెట్టి వుండవచ్చు. హరీశ్ రావు వంటి పెద్ద నాయకుల కథ వేరు. తక్కిన వాళ్ల సంగతి మాట్లాడుతున్నాను. పైగా యీ ఎన్నికలలో కాంగ్రెసు నాయకులందరూ రాష్ట్రమంతా తిరిగి పార్టీని బలోపేతం చేసుకునే పని పెట్టుకోలేదు. తమ నియోజకవర్గంలోనే మకాం వేసి, పూర్తిగా ఫోకస్ చేసుకుంటున్నారు. ఆ కృషి, ఆ ప్రచారం కొంతవరకైనా తప్పక ఫలిస్తుంది.

తెలంగాణ సెంటిమెంటు బలంగా లేని తక్కిన 80 స్థానాల మాటేమిటి? ఇక్కడ మళ్లీ ప్రాక్టికల్ విషయాలే గణనకు వస్తాయి. ఎవడి వలన తెలంగాణకు లాభం? అంతకంటె నాకు లాభం? అన్న ప్రశ్న వేసుకుని చూసుకుంటారు. కేంద్రంలో ఎన్‌డిఏ వస్తుందంటున్నారు కాబట్టి బిజెపి-టిడిపి కూటమికి వేసేస్తారని అనుకోవడానికి లేదు. తమిళులు బిజెపి ఫ్రంట్‌కు యిబ్బడిముబ్బడిగా ఓట్లేస్తారని అనగలమా? ఇప్పటివరకు ఏ రాష్ట్రమూ అలాటి లెక్కలు వేసుకుని ఓట్లు వేయలేదు. కొత్త రాష్ట్రం కాబట్టి నిధుల అవసరం వలన యీసారి లెక్కలు వేస్తారు అనుకుందామనుకుంటే పాత రాష్ట్రానికి మాత్రం నిధుల అవసరం లేదా? తాము ప్రకటించే సంక్షేమపథకాల ఖర్చు కేంద్రమే భరించాలని ప్రతి రాష్ట్ర ప్రభుత్వమూ డిమాండ్ చేస్తుంది. అక్కడా యిక్కడా పదేళ్లగా కాంగ్రెసు అధికారంలో వున్నా మన రాష్ట్రానికి ఒరిగిందేమిటి? ఇప్పుడు మాట్లాడుతున్న ప్రాణహిత జాతీయ హోదా, పోలవరం జాతీయ హోదా, స్టీలు ఫ్యాక్టరీలు, ఐఐఎమ్‌లు యిన్నాళ్లూ మచ్చుకి ఒకటైనా విదల్చలేదేం? కేంద్రంలో ఎవరున్నా కొట్లాడి తెస్తాం అని తెరాస చెప్పవచ్చు. కొట్లాడనక్కరలేకుండా, యుపిఏ1లో కేంద్రంలో, రాష్ట్రంలో మంత్రిపదవులు యిచ్చినపుడు ఏం చేశారు? కెసియార్ మన రాష్ట్రానికి గాని, కనీసం తెలంగాణకు కానీ ఏమైనా తెచ్చారా? రాష్ట్రమంత్రులుగా చేరినవారు తమ నియోజకవర్గాలకు ఏమైనా చేశారా? గిల్లికజ్జాలు పెట్టుకుని బయటకు వచ్చేశారు. రేపు యిదే పని కేంద్రంలో చేయరని నమ్మకం ఏమిటి?

పార్టీలుగా పాలనానుభవం మాకుంది అని టిడిపి, కాంగ్రెసు అనవచ్చు. వ్యక్తులుగా యితర పార్టీల్లో వున్నవారికీ వుంది. ఎందుకంటే యీ పార్టీల్లోంచే వాళ్లు ఆ పార్టీల్లోకి వెళ్లారు. ఏ పనిలోనైనా అనుభవం వుండడం అదనపు అర్హతే తప్ప చిత్తశుద్ధి వుండడం ముఖ్యం. కిరణ్‌కు ఏ అనుభవం వుందని మూడేళ్లకు పైగా ముఖ్యమంత్రిగా లాగించేశారు? ఎన్టీయార్‌కు..? ఎమ్జీయార్‌కు...? జయలలితకు...? మాయావతికి..? నవీన్ పట్నాయక్‌కు..? వీళ్లంతా మంత్రి పదవి చేయకుండానే అయిన ఫస్ట్ టైమ్ చీఫ్ మినిస్టర్లే కదా! ఓ మూడు నాలుగు నెలలు తడబడతారు. తర్వాత సర్దుకుంటారు, సలహాదారులు మంచివాళ్లని పెట్టుకుంటే సరి!

మోదీ హవా తెలంగాణను ఊపేస్తోంది అని కొన్ని పత్రికలు రాస్తున్నాయి. మోదీ హవా పేపర్లలో, యింటర్నెట్‌లో కనబడినంతగా ప్రజల్లో కనబడదు. గుజరాత్ అభివృద్ధి అబ్బో అంటూ కొంతకాలంగా వూదరగొడుతూ వచ్చారు. ఆ మోడల్‌లో వాస్తవం తక్కువ, అతిశయోక్తులు ఎక్కువ. అయినా సీమాంధ్రకు వేరే మాస్టర్ ప్లాన్, తెలంగాణకు వేరే మాస్టర్ ప్లాన్ వేసేవాళ్లు గుజరాత్ ప్లాన్ అన్ని చోట్లా వర్తిస్తుందని ఎలా అనగలరు? గుజరాతీల్లో వున్న వ్యాపారగుణం తెలంగాణవారిలో వుందా? వాళ్లకున్న సముద్రతీరం వుందా? ఇక్కడున్న మావోయిస్టులు అక్కడున్నారా? మోదీ పేరు నగరయువతను కదిలించినట్లుగా గ్రామీణులను, మైనారిటీలను కదిలించదు. అందువలన బిజెపికి ఓట్లు కురుస్తాయని నమ్మడానికి లేదు. వారితో కలిసినందుకు టిడిపికి ఒరిగేదీ ఏమీ లేదు. టిడిపితో కలిసి బిజెపి నష్టపోవడం తప్ప! టిడిపి-బిజెపి పొత్తుకు తెలంగాణ బిజెపి నాయకత్వం ససేమిరా అందని అందరికీ తెలిసిపోయింది కాబట్టి ఓట్లు బదిలీ కావు. అదే సమయంలో పొత్తు గురించి బిజెపిపై ఆగ్రహమూ వుండకపోవచ్చు.

ఇక ఆంధ్రమూలాలున్న వారి ఓట్ల గురించి కూడా చర్చ నడుస్తోంది. అవి కనీసం 40 సీట్లలో ప్రభావం కనబరుస్తాయి. అందుకే 'వాళ్లను కడుపులో పెట్టుకుంటాం, రక్షిస్తాం, పెట్టుబడులు పెడితే ఆదరిస్తాం' అంటూ అందరూ హామీలు గుప్పిస్తున్నారు. ఇవి చెప్తారు కానీ 'వాళ్లనీ ఉద్యోగాలకు అప్లయి చేసుకోనిస్తాం, మాతో బాటు ఎన్నికలలో పోటీ పడనిస్తాం' అనరు. 'మీరు పెట్టుబడి పెట్టండి, ప్రాంతీయత పరిగణించి మాకు ఉద్యోగాలు యివ్వండి' అదీ స్లోగన్. 40 ఏళ్ల క్రితం వచ్చినవాళ్లు తెలంగాణవాళ్లే అంటున్నారు కెసియార్. ఈ అంకె రాజ్యాంగంలోని ఏ ఆర్టికల్ ప్రకారమో తెలియదు. ముల్కీ రూలు వుండేటప్పుడు కూడా 40 ఏళ్లు కావాలనలేదు.

ఉద్యోగుల వద్దకు వచ్చేసరికి పుట్టిన చోటు బట్టి నిర్ధారించి వెనక్కి పంపేయాలంటున్నారు. ఎన్నికలలో నిలబడితే 'వలస నేతలు' అని యీసడిస్తున్నారు. అందువలన ఆంధ్రమూలాలున్నవారు తెరాసకు ఓటేయడానికి జంకడం సహజం. తెరాస బాగా బలంగా వున్నచోట, వీరు కాలనీల్లో ఒకేచోట వుంటే తప్పనిసరి పరిస్థితుల్లో వేయవచ్చు. లేకపోతే 'ఫలానా గుంటూరు క్యాంపు ఓట్లు మనకు పడలేదు' అని తెలిసిపోయి పగ బట్టవచ్చు. చెదురుమదురుగా వుండే ఓటర్లు మాత్రం తమను రక్షించేవారి కోసం వెతకవచ్చు. వారెవరు? బిజెపి, సిపిఐ, టి-టిడిపి.. నాయకులందరూ కూడా ఆంధ్రులకు వ్యతిరేకంగా మాట్లాడినవారే. కిషన్‌రెడ్డి, దత్తాత్రేయ వంటి హైదరాబాదులో పోటీ చేసే బిజెపి నాయకులు సంయమనం పాటించారు కానీ కరీంనగర్ బిజెపి నాయకుడు విద్యాసాగరరావు వంటి పెద్దమనిషి దగ్గర్నుంచి పరుషపదాలు వుపయోగించారు. వీళ్లు తమను రక్షిస్తారా? అన్న సందేహం వారికి రావచ్చు.

వైకాపా పార్టీని తెలంగాణ ఎన్నికలలో ఎవరూ సీరియస్‌గా తీసుకోవడం లేదు. సమైక్యనినాదం ఎత్తుకుని జగన్ తెలంగాణకు తిలోదకాలు యిచ్చేశాడని, ఖమ్మం జిల్లాలో తప్ప వేరే ఎక్కడా ఉనికి కూడా లేదని అంటున్నారు. అయినా టిడిపి ఓట్లు చీల్చడానికి అనేక చోట్ల అభ్యర్థులను నిలబెట్టి కెసియార్‌కు దోహదపడుతున్నాడని అంటున్నారు. జగన్ కాంగ్రెసు ఓట్లు చీల్చుకోగలడు కానీ టిడిపి ఓట్లు ఎలా చీల్చుకోగలడు? గతంలో టిడిపికి ఓట్లు వేసినవారు వైయస్సార్‌కు వ్యతిరేకంగానే వేశారు కదా, వాళ్లు యిప్పుడు అతని కొడుక్కి వేస్తారా? ఇలా ఆలోచిస్తే యీ వాదనకు అర్థం లేదు. కానీ యింకోలా ఆలోచించి చూడాలి. సమైక్య పల్లవి ఎత్తుకున్న జగన్‌ను బలమైన వైసిపి తెలంగాణ నాయకులు వదిలిపెట్టేశారు. అయినా జగన్ చలించలేదని, తన విధానాన్ని సడలించలేదనీ ఒప్పుకోవాలి. అందువలన తెలంగాణలోని సమైక్యవాదులకు, ఆంధ్రమూలాలు వున్నవారికి వైసిపిపై అభిమానం వుండే అవకాశం వుంది. తెలంగాణలో తమకు రక్షణ కల్పించడానికి జగన్ ముందుకు వస్తాడన్న ఆశ కలగవచ్చు. వీళ్లు మామూలుగా అయితఆంధ్రమూలాలు వున్న టిడిపికి వేస్తారు కానీ రెండుకళ్ల సిద్ధాంతం కారణంగా వాళ్లకు టిడిపిపై నమ్మకం పోయి, వైసిపీకి వేసే ఛాన్సుంది అనుకుంటేనే టిడిపి ఓట్లు చీలుతాయన్న అంచనాకు రావచ్చు.

ఇలాటి  ఓటర్లు ప్రతి నియోజకవర్గంలో ఎంతమంది వుంటారన్నది వూహించడం కష్టం. ఈ ఫీలింగుకి తోడు వైయస్‌పై అభిమానం వున్న తెలంగాణ ఓటర్లు, క్రైస్తవులు, దళితులు వైకాపాకు బలంగా నిలుస్తున్నారన్న టాక్ వుంది కాబట్టి వాళ్ల ఓట్లూ కలవవచ్చు. 10 స్థానాల్లో నైనా గెలుస్తారని గట్టిగా చెప్పలేం కానీ వీళ్ల కారణంగా 40, 50 సీట్లలో ఫలితాలు తారుమారు అవడం ఖాయం. ఎన్నికల తర్వాత హంగ్ ఏర్పడితే తెరాసకు వైకాపా మద్దతు యిస్తుందన్న రహస్యఒప్పందం వుందనీ, అందుకే కెసియార్-జగన్‌లు ఒకరినొకరు విమర్శించుకోవడం లేదని ఒక మాట వినబడుతోంది. ఒప్పందం గురించి తెలియకపోయినా వారు ఒకరినొకరు విమర్శించుకోకపోవడం వాస్తవం. అందుకే జగన్ సమైక్యవాదం ఎత్తుకోవడం వెనక కారణాలపై అపనమ్మకం కూడా కలిగింది. కానీ సమైక్యవాదాన్ని పూర్తిగా భుజానికి ఎత్తుకున్న కిరణ్‌ను జనాలు పట్టించుకోవడం మానేశారు. హైదరాబాదులో సమైక్యవాదం వుందనుకున్న నియోజకవర్గాలలో కూడా వారికి మంచి అభ్యర్థులు దొరికినట్టు లేదు. అందువలన సమైక్యవాద భావాలున్నవాళ్లకు, ఆంధ్రమూలాలున్నవాళ్లకు జగనే దిక్కవుతున్నాడు. కానీ అతను పోయిపోయి ఆంధ్రులను అనుక్షణం తిట్టిపోసే కెసియార్‌తో కుమ్మక్కు కావడం చేత ఆ ఓటర్లు వైకాపాను దూరంగా పెడతారు.

ఎన్నికలలో తమ స్థానాలు పెంచుకునే అవకాశం మజ్లిస్‌కు బాగా వుంది. మోదీ వచ్చేస్తున్నాడని సాధారణ హిందువులు పెద్దగా నమ్మకపోయినా, ముస్లింలు మాత్రం నమ్మి భయపడతారు. తమను రక్షించడానికి మజ్లిస్‌కే ఓట్లేస్తారు. మజ్లిస్ హిందువులను కూడా అభ్యర్థులుగా పెట్టి ఆకట్టుకుంటోంది. మజ్లిస్ ఎమ్మెల్యేలు మనకు భీకరంగా కనబడినా వాళ్లు ప్రజలకు అందుబాటులో వుంటారని, కష్టానికి, సుఖానికి ఆదుకుంటారని ప్రతీతి వుంది. వాళ్లు 10 స్థానాలు గెలుచుకున్నా ఆశ్చర్యం లేదు. ఇక మనం ఫైనల్ టాలీ వేసి చూడవచ్చు. పోటీ ప్రధానంగా తెరాస, కాంగ్రెసుల మధ్య వుంది. తెలంగాణ ఉద్యమం బలంగా వున్నచోట్ల తెరాస ఎక్కువ గెలుచుకుంటే, బలహీనంగా వున్నచోట్ల కాంగ్రెసు ఎక్కువ గెలుస్తుంది. బిజెపి ఎక్కువ సీట్లు ఉద్యమం వున్న చోట్ల గెలుచుకుంటే, టిడిపికి వచ్చే సీట్లు బలహీనంగా వున్నచోట మాత్రమే వస్తాయి.

ఇలా చూస్తే తప్పకుండా గెలిచే స్థానాలు తెరాసకు 35-40, కాంగ్రెసుకు 35-40, మజ్లిస్‌కు 8-10 వున్నాయనుకుంటే తక్కిన 30-40 స్థానాల గురించి చెప్పడం కష్టం. టిడిపి-బిజెపిలకు కలిపి 12-15 వస్తాయనుకుంటే, వైకాపాకు 6-8 వస్తాయనుకుంటే, వామపక్షాలకు 5-7 అనుకుంటే కనీసం 10-12 సీట్లలో  క్రాస్ ఓటింగు జరిగి యిండిపెండెంట్స్, రెబెల్స్ గెలుస్తారు. అబ్బే, ఇంత కాంప్లికేటెడ్‌గా వుండదు, ఓటరు నిర్ణయాత్మకంగా ఓటేస్తాడు అనే ఆశాభావం వున్నవారు కూడా గెలిచే పార్టీకి (తెరాస/కాంగ్రెస్) 50 సీట్లకు మించి వస్తాయని గట్టిగా చెప్పలేని పరిస్థితి వుంది. అందుకే అందరూ సంకీర్ణ ప్రభుత్వం తథ్యం అంటున్నారు. **(సమాప్తం)**
**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

**ఏప్రిల్ 39- 41 వీక్షీకై ఎమ్బీయస్ : రాజకీయాల్లో పౌండ్రక వాసుదేవులు**

వాసుదేవ కృష్ణుడు వుండే రోజుల్లో అసలైన వాసుదేవుణ్ని నేనే అంటూ కరూశ దేశపు రాజు చెప్పుకునేవాడు. కృష్ణుడు పొరుగూరు వెళ్లగా చూసి ద్వారకకు వెళ్లి 'లోకంలో యిద్దరు వాసుదేవులు ఎలా వుంటారు? ఒక గొల్లవాడు నా పేరు పెట్టుకుంటాడా? నా దగ్గరా గదా, సుదర్శన చక్రం వున్నాయి' అని గోల చేశాడు. సాత్యకి యుద్ధం చేసి అతన్ని ద్వారక నుండి తోలేశాడు. అప్పుడు

కాశీరాజు వద్దకు వెళ్లి మొరపెట్టుకుంటే ఆ రాజు కృష్ణుడు తన పేరులో నుంచి వాసుదేవ పదాన్ని తీసేయాలనే ఆదేశాలతో దూతను పంపాడు. కృష్ణుడు యుద్ధంలో తేల్చుకుందాం రమ్మన్నాడు. కాశీరాజు, పౌండ్రక వాసుదేవుడు వెళ్లారు. కృష్ణుడి చేతిలో చచ్చారు.

అది పౌరాణిక గాథ. ఇప్పుడు ఛత్తీస్‌గఢ్ ఎన్నికలలో ఓటర్లను కన్‌ఫ్యూజ్ చేయడానికి ప్రత్యర్థి పేరుతో సామ్యం వున్నవాళ్లను రంగంలోకి దింపడం ఓ చిట్కాగా మారింది. మహాసముంద్‌లో అజిత్ జోగితో పోటీ పడుతున్నది సిటింగ్ ఎంపీ – చందూలాల్ సాహు (బిజెపి). చందూలాల్ సాహు పేరున్నవాళ్లు ఏడుగురు, చందూరామ్ సాహు పేరున్నవాళ్లు ముగ్గురు నామినేషన్లు పడేశారు. రాయపూర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి సత్యనారాయణ శర్మ. అక్కడ అదే పేరున్న మరో ముగ్గురు నిలబడ్డారు. బిలాస్‌పూర్‌లో అటల్ బిహారీ వాజపేయి మేనకోడలు కరుణా శుక్లా కాంగ్రెస్ తరఫున సిటింగ్ బిజెపి ఎంపీ లఖన్ సాహుతో తలపడుతున్నారు. అక్కడ మరో ఐదుగురు లఖన్ సాహులు బరిలోకి దిగారు. ఉత్తరప్రదేశ్‌లో హేమమాలిని పోటీ చేస్తున్న మథుర నియోజకవర్గంలో ముగ్గురు హేమ–లున్నారు. కేరళలో శశి థరూర్ పోటీ చేస్తున్న తిరువనంతపురంలో ఏడుగురు శశి– లు వున్నారు. ఎన్నికల గుర్తు చూడకుండా ఎవరైనా ఓటరు పేర్లు చదువుకుంటూ వెళితే పొరబాటున తమ పేరు మీద మీట నొక్కుతాడని, తమ పేరు మీద కూడా కొన్ని ఓట్లు జమ అవుతాయన్న ఆశ తప్ప యీ అభ్యర్థులకు వేరే ఆశ ఏమీ లేదు. అందుకే శ్రమ పడటం లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : గోవా రాజకీయాల్లో చర్చి పాత్ర

గోవాలోని కాథలిక్స్‌లో చాలామందిపై చర్చి ప్రభావం వుంటుంది. 2012 ఎన్నికల సమయంలో అవినీతిమయమైన కాంగ్రెసు ప్రభుత్వాన్ని కూలదోయండని చర్చి యిచ్చిన పిలుపు వలననే ప్రతిపక్షంలో వున్న బిజెపి అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి మనోహర్ పారికర్ పాలన బాగానే సాగుతోంది. ఈ లోకసభ ఎన్నికలలో గోవాలో వున్న రెండు పార్లమెంటు సీట్లు (ఉత్తర గోవా, దక్షిణ గోవా) తామే గెలుచుకుంటామన్న ఆనందంతో బిజెపి వుంది. చాలా ముందుగానే అభ్యర్థులను నిర్ణయించడంతో బాటు బూత్ కమిటీలు కూడా ఏర్పరచారు. మోదీ ప్రధాని కాబోతున్నాడనీ, తనకు ఆయన బాగా క్లోజ్ కాబట్టి ఒక్క ఫోన్‌కాల్‌తోనే పనులు జరిపిస్తాననీ, గోవాకు ప్రత్యేక రాష్ట్ర హెూదా తెప్పిస్తాననీ, ఎకో సెన్సిటివ్ జోన్‌లో వ్యాపారకార్యకలాపాలపై నిషేధాలు ఎత్తించివేస్తాననీ, గనుల మూసివేత వలన నిరుద్యోగులైన వారికి స్పెషల్ ఫైనాన్షియల్ ప్యాకేజీ యిప్పిస్తాననీ యిలా హామీలు గుప్పిస్తున్నాడు. ఓటర్లలో 40% మంది క్రైస్తవులున్న దక్షిణ గోవాలో హిందూ అభ్యర్థి నెగ్గి 50 ఏళ్లయింది. ఈసారి ఆ చమత్కారం కూడా చేసి చూపిస్తామని బిజెపి నమ్ముతోంది.

దీనికంతా కారణం తమ బలంతో బాటు ప్రతిపక్షంలో వున్న కాంగ్రెస్ అంతర్గత కలహాలు. ఉన్న రెండు సీట్లకోసం కాంగ్రెసు నాయకులు చచ్చేట్లా పోటీ పడడంతో అధిష్టానం చాలాకాలం తాత్సారం చేసి చివరకు ఉత్తర గోవాకు మాజీ ముఖ్యమంత్రి రవి నాయక్‌ను, దక్షిణ గోవాకు సిటింగ్ ఎంపీ ఐన ఫ్రాన్సిస్కోను అభ్యర్థులుగా ఎంపిక చేశారు. దక్షిణ గోవా సీటు తనకు కావాలని ఎలక్సియో అనే ఎమ్మెల్యే తిరుగుబాటు చేయడంతో అధిష్టానం బెదిరిపోయి, ఫ్రాన్సిస్కోను తీసేసి ఎలక్సియోకు యిచ్చింది. దాంతో ఫ్రాన్సిస్కో కొడుకు షాలోమ్ తన తండ్రికి జరిగిన అవమానానికి ప్రతీకారంగా పార్టీ విడిచిపెట్టి యిండిపెండెంట్‌గా పోటీ చేస్తున్నాడు. దీనికి తోడు మాటిమాటికి పార్టీలు మారుతూ ప్రస్తుతం కాంగ్రెసులో మజిలీ చేసిన చర్చిల్ అనే నాయకుడు తన కూతురు వాలెంకాకు టిక్కెట్టు యివ్వమని కోరి, అది తీరకపోవడంతో అలిగి తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా నిలబడ్డాడు. కూతురు పార్టీలోనే వుంటూ తమ అభ్యర్థికి కాకుండా తండ్రికి ప్రచారం చేస్తోంది. విభీషణుల లిస్టు యింకా వుంది. మావిన్ అనే కాంగ్రెస్ ఎమ్మెల్యే కూడా టిక్కెట్టు అడిగి భంగపడి, బిజెపి అభ్యర్థికి ప్రచారం చేస్తున్నాడు.

ఈ కారణాల వలన బిజెపి గెలుపు తథ్యం అనుకుంటూ వుండగా సడన్‌గా గోవా చర్చి మేల్కొంది. మోదీ పేరు చెప్పకుండానే 'కార్పోరేట్‌లు–మతతత్వ శక్తులు కలిసి భారతదేశపు సెక్యులరిజాన్ని నాశనం చేయబోతున్నాయని, అప్రమత్తంగా వుండాలనీ' సలహా యిచ్చింది. అహ్మదాబాద్‌లో ప్రశాంత్ అనే సంస్థ నడిపే ఫాదర్ సెడ్రిక్ ప్రకాష్ మోదీ గుజరాత్‌లో మతమార్పిడులు నియంత్రిస్తూ చట్టం తెచ్చాడని గోవా కాథలిక్కుల్లో ప్రచారం చేస్తున్నాడు. అంతేకాదు, మోదీ ఉత్తర్‌ప్రదేశ్‌లో మాట్లాడుతూ కాంగ్రెస్ గోవధను ప్రోత్సహిస్తూ, గోమాంసం ఎగుమతులు పెంచుతూ 'పింక్ రివల్యూషన్' తెచ్చిందని అన్నాడని గుర్తు చేస్తున్నాడు. పారికర్ అధికారంలోకి వచ్చాక గోరక్షా సమితి కోరికపై పశువధపై నిషేధం విధించడం, క్రైస్తవులకు, ముస్లిములకు కొన్ని నెలలపాటు గోమాంసం దొరక్కుండా పోవడం జరిగింది. మోదీ ప్రధాని అయితే యివన్నీ ఉధృతం అవుతాయన్న భయం పట్టుకుంది యిప్పుడు. ఈ భయాలతో చర్చి పూజారులు తమ నాయకుల మధ్య రాజీ కుదిర్చి అందరూ కలిసి ఎలెక్సీనే సమర్థించేట్లు చేస్తే బిజెపి ఓటమి ఖాయం అనే అనుమానం వచ్చింది పారికర్‌కు. అందువలన మోదీ గురించి ప్రచారం ఆపేశారు. ఇప్పుడంతా పారికర్ పాలన గురించి, అతని సంక్షేమపథకాల గురించి, అభివృద్ధి కార్యక్రమాల గురించి మాత్రమే ప్రచారం చేస్తున్నారు. బిజెపి సెక్యులర్ పార్టీ అని, పారికర్ లిబరల్ అని, కర్ణాటకలో శ్రీరామ సేనె అధినేత ప్రమోద్ ముతాలిక్ బిజెపిలోకి వస్తానంటే అడ్డుకున్నాడనీ ఓటర్లకు పదేపదే చెప్తున్నారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : సొంత యింట్లో ఆజాద్ ఏం చేస్తున్నట్లు?

మన ఆంధ్ర–తెలంగాణ గొడవలు కాదు కానీ ఢిల్లీలోని అంగుష్టమాత్రులు, అగస్త్యభ్రాతలు మనపాలిట పెద్ద లీడర్లగా అవతారం ఎత్తారు. వాళ్లు వస్తే చాలు మనవాళ్లందరూ పంచెలూడిపోతున్నా వెంట పరుగులు పెట్టి, ప్రాధేయపడుతూ, పాదాలమీద పడుతూ వచ్చారు. అలాటి లీడర్లలో గులాం నబీ ఆజాద్ ఒకరు. 2014 తర్వాత ఆయన ఎక్కడ వుంటాడో తెలుసుకోవాలంటే తన నియోజకవర్గంలో ఆయన ప్రచారం ఎలా సాగుతోందో చూపు సారిస్తే సరి. జమ్మూ ప్రాంతం నుండి జమ్మూకశ్మీర్‌కు ముఖ్యమంత్రిగా ఎంపికైన తొలి వ్యక్తి ఆజాద్. పిడిపితో భాగస్వామ్యంతో ప్రభుత్వం ఏర్పరచి, అమర్‌నాథ్ భూమి గొడవలో 2008 జులైలో పదవి పోగొట్టుకున్నాడు. అతని ఉదంపూర్ నియోజకవర్గంలో హిందూ ఓటర్లు పెద్ద సంఖ్యలోనే వున్నారు. ఆజాద్‌కు మత పిచ్చి లేదంటారు. దేశమంతా కాంగ్రెసు వ్యతిరేక పవనాలు వీస్తున్నాయి కాబట్టి తను నిలబడకూడదనే అనుకుని తన బదులు అనుచరుడు చౌధరీలాల్ సింగ్‌కు టిక్కెట్టు యిమ్మనమని అధిష్టానానికి సిఫార్సు చేశాడు. కానీ వాళ్లు వినలేదు. నువ్వే నిలబడు అన్నారు. ఆ సహచరుడు యిప్పుడు ప్రచారానికి గైరుహాజరవుతున్నాడు. ఓటర్లలో ఎక్కడా ఉత్సాహం కనబడటం లేదు. 'ఈయన కేంద్ర ఆరోగ్యమంత్రిగా పని చేసినా మా ప్రాంతంలో తాలూకా స్థాయి హాస్పటల్స్‌లో కూడా ఎక్స్‌రే మిషన్లు పెట్టించలేదు.' అని ఫిర్యాదు చేస్తున్నారు. 'కిస్త్‌వార్‌లో మతకలహాలు జరిగాక ముస్లిములకు తుపాకీ లైసెన్సులు అతి సులభంగా యిచ్చేస్తున్నారు' అని కూడా అంటున్నారు.

ఆజాద్‌కు వ్యతిరేకంగా నిలబడుతున్న బిజెపి అభ్యర్థి డా. జతీందర్ సింగ్ రాణా. గతంలో డా. నిర్మల్ సింగ్ అనే బిజెపి నాయకుడు ఆజాద్‌తో రెండుసార్లు తలపడి కొద్దిలో ఓడిపోవడంతో అతనికి బదులుగా యీసారి యితనికి టిక్కెట్టిచ్చారు. జతీందర్ మెడికల్ డాక్టర్, మంచి వక్త, కాలమిస్టు. అతని సోదరుడు దేవేందర్ అధికార పార్టీ అయిన నేషనల్ కాన్ఫరెన్సులో ముఖ్యమైన నాయకుడు, ముఖ్యమంత్రి ఫరూక్ అబ్దుల్లాకు సలహాదారు. హిందువులు ప్రధానంగా వుండే జమ్మూ ప్రాంతంలో ప్రస్తుతం మోదీ ఓటర్లను బాగా ఆకట్టుకున్నాడు. గత డిసెంబరులో జరిగిన సభకు 80 వేలమంది రాగా యీ మార్చిలో జరిగిన సభకు 20 వేలు వచ్చారు. మనతో పోలిస్తే యీ అంకెలు గొప్పగా తోచకపోవచ్చు కానీ అక్కడ అది రికార్డే! **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : నితిన్ గడ్కరీ సాహసం

'నితిన్ గడ్కరీ స్వస్థలం నాగపూరు. కానీ అక్కణ్నుంచి పోటీ చేయాలంటే అతనికి భయం. ఎందుకంటే నాగపూర్‌లో కాంగ్రెసే ఎప్పుడూ గెలుస్తుంది. విదర్భ ప్రాంతంలోని 11 సీట్లలో పదిటిలో కాంగ్రెసు ఓడిపోయినా నాగపూర్‌లో మాత్రం గెలుస్తుంది. 19 లక్షల ఓటర్లున్న నాగపూర్‌లో దళితులు, ఒబిసిలు, ముస్లిములు కలిసి 7 లక్షలమంది వున్నారు. వారు బిజెపి వంటి రైటిస్టు పార్టీలను ఆదరించరు. కాంగ్రెసుకే ఓటేస్తారు. అందుకే బిజెపికి అధ్యక్షుడిగా పని చేసినా నితిన్ యిక్కడనుండి పోటీ చేసే సాహసం చేయరు.' అని ఒక టీవీ కార్యక్రమంలో చెప్పగా చూసిన నితిన్‌కు పౌరుషం పొడుచుకు వచ్చింది. వార్ధా వంటి నియోజకవర్గంలో నిలబడితే సులభంగా గెలవవచ్చనే అంచనా వున్నా కావాలని నాగపూర్‌లోనే నిలబడ్డాడు. ముంబయిలో 55 ఫ్లయిఓవర్లు కట్టినందుకు, ముంబయ్–పుణె ఎక్స్‌ప్రెస్ హైవేను రికార్డు సమయంలో పూర్తి చేసినందుకు అతనికి మంచిపేరుంది. అదే సమయంలో పుర్తి పవర్, సుగర్ కంపెనీ వాటాల స్కాముల్లాటివీ వున్నాయి. వాటి కారణంగానే అతను బిజెపి అధ్యక్ష పదవినుండి దిగిపోవలసి వచ్చింది. అందరితో కలిసిపోతాడు, పనులు త్వరగా చేయిస్తాడు కానీ మధ్యలో మేస్తాడు అనే యిమేజితోనే నాగపూర్‌లో అతను ప్రచారం చేస్తున్నాడు. మోదీ అనుచరుడన్న అంశం అతనికి ఉపయోగపడుతుందో లేదో చెప్పలేకుండా వున్నారు. ముస్లిములు నితిన్‌ని మతతత్వవాది అనరు కానీ వెనకవున్న మోదీని చూస్తే భయపడతారు.

నితిన్ ప్రత్యర్థి అయిన విలాస్ ముత్తెమ్‌వార్ ఏడుసార్లుగా ఎంపీగా గెలుస్తూ వస్తున్నాడు. గత నాలుగుసార్లు నాగపూరు నుండే గెలిచాడు. అవినీతి ఆరోపణలు లేవు. క్లీన్ యిమేజికి తోడు నాగపూర్‌కు రెండు భారీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులు – మిహాన్, గోసి ఖుర్ద్ – తెచ్చిపెట్టిన ఘనత వుంది. 2009 ఎన్నికలలో విలాస్ సమీప బిజెపి అభ్యర్థి బన్వారీలాల్ పురోహిత్‌పై 24 వేల ఓట్ల మెజారిటీతో మాత్రమే గెలిచాడు. నితిన్, విలాస్‌లతో బాటు ఆమ్ ఆద్మీ తరఫున అంజలీ దమాణియా నిలబడ్డారు. ఆవిడ అవినీతి వ్యతిరేక పోరాటకార్యకర్త. మహారాష్ట్రలో ఇరిగేషన్ స్కామ్‌లతో బాటు గడ్కరీ పుర్తి స్కామ్ కూడా బయటపెట్టినది ఆమెయే. అందుకని నాగపూర్ మురికివాడల్లో అమిత కృషి చేస్తున్న డా॥ రూపా కులకర్ణి అనే స్థానిక ఆప్ కార్యకర్తను కూడా పక్కన పెట్టి ఆమెను బొంబాయినుండి తీసుకుని వచ్చారు. అయితే యిటీవల అంజలి గురించిన ఒక విషయం బయటపడింది. ఆవిడ 2007లో వ్యవసాయభూమి కొని, కొన్నేళ్ల తర్వాత దాన్ని వ్యవసాయేతర ప్రయోజనాలకు వాడుకుంటానని అడిగి ప్రభుత్వం చేత మార్పించుకున్నారట. ఇదో పెద్ద విషయం కాకపోయినా, బిజెపివారు ఎన్నికలలో అంశంగా చేశారు. పైగా ఆవిడ ముంబయినుండి వచ్చింది తప్ప నాగపూరుతో సంబంధం ఏముంది అంటున్నారు. 'గుజరాతీ అయిన మోదీ ఉత్తరప్రదేశ్‌లోని వారణాశిలో పోటీ చేయగాలేనిది నేను ఒకే రాష్ట్రంలోని మరో నగరం నుండి పోటీ చేయకూడదా? అయినా నన్ను గెలిపిస్తే నేను నాగపూరులోనే నివాసం వుంటాను.' అంటోంది అంజలి.

**– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : జయప్రద పార్టీ సంగతేమిటి?

తెలుగునటి జయప్రద సమాజ్‌వాదీ పార్టీ నుండి బయటకు వచ్చాక ఏ పార్టీలో చేరాలా అని తర్జనభర్జన పడి చివరకు రాష్ట్రీయ్ లోక్‌దళ్‌లో చేరారు. ఆ పార్టీ అధ్యక్షుడు అజిత్ సింగ్ తెలంగాణ ఉద్యమానికి మద్దతు యిచ్చిన 'జాతీయ' నాయకుడిగా, ఆంధ్రప్రదేశ్‌లో కూడా తన పార్టీ ఒక శాఖ పెట్టినవాడిగా మనందరికి సుపరిచితుడు. తెలంగాణ యిస్తే తన రాజకీయక్షేత్రమైన పశ్చిమ ఉత్తరప్రదేశ్‌ను 'హరితప్రదేశ్' అనే విడి రాష్ట్రంగా యిప్పించుకోవచ్చని ఆయన తాపత్రయం. ఆయన తండ్రి చరణ్ సింగ్ కాంగ్రెసువాదిగా తన రాజకీయప్రస్థానం ప్రారంభించారు. 1967లో కాంగ్రెసు బలహీనపడగానే బయటకు వచ్చి భారతీయ క్రాంతి దళ్ పేర ఉత్తర్‌ప్రదేశ్‌లో పార్టీ పెట్టి, సంయుక్త విధాయకదళ్ పేర మిశ్రమ ప్రభుత్వాలు నడిపి ముఖ్యమంత్రి పదవి సంపాదించుకున్నారు. ఆయన నిజాయితీపరుడు, రైతు బాంధవుడు కానీ పదవీలాలస హెచ్చు. 1974లో కాంగ్రెసుకు వ్యతిరేకంగా బిజూ పట్నాయక్, రాజ్ నారాయణ్, కర్పూరీ ఠాకుర్ వంటి నేతలు నడుపుతున్న ఏడు ప్రాంతీయ పార్టీలను కలుపుకుని భారతీయ లోక్ దళ్ పార్టీ అని తయారు చేసి దానికి నాయకత్వం వహించాడు. ఎమర్జన్సీలో జైలు జీవితం అనుభవించి బయటకు వచ్చాక ఆ పార్టీని పాత కాంగ్రెసు, సంయుక్త సోషలిస్టు పార్టీ, జనసంఘ్‌లతో కలిపి జనతాపార్టీగా ఏర్పరచి 1977 పార్లమెంటు ఎన్నికలలో నెగ్గి ఉపప్రధాని అయ్యాడు. ఆ తర్వాత ఇందిరా గాంధీ ప్రోత్సాహంతో జనతా పార్టీని చీల్చి తను ప్రధాని అయ్యాడు కానీ మెజారిటీ నిరూపించుకోలేక ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగాడు. 1980 ఎన్నికలలో జనతా దళ్ (ఎస్) పార్టీ పేర పోటీ చేసి విఫలమయ్యాడు. తర్వాత లోక్‌దళ్ పార్టీ పెట్టాడు. ఏం చేసినా జాట్‌లు, ముస్లిములు అతన్ని వెంట నిలిచారు.

అతని అంత్యదశలో రాజకీయవారసత్వం వూరికే పోకూడదనుకుని విదేశాల్లో పని చేస్తున్న అజిత్ సింగ్‌ను వెనక్కి పిలిపించి పార్టీ పగ్గాలు అప్పగించారు. భాగస్వాములను మార్చడంలో అతను తండ్రిని మించిపోయాడు. 2004 ఎన్నికలలో సమాజ్‌వాదీతో కలిసి 10 సీట్లలో పోటీ చేసి 3 గెలుచుకున్నాడు. 2009 ఎన్నికల్లో బిజెపితో కలిసి 9టిలో పోటీ చేసి 5 గెలుచుకున్నాడు. కానీ 2011లో యుపిఏలో చేరాడు. ఈసారి ఎన్నికలకు ముందు బిజెపితో పొత్తు పెట్టుకుందామనుకున్నాడు కానీ బిజెపిలోని జాట్ నాయకులు 'అజిత్ సింగ్‌తో పొత్తు పెట్టుకుంటే జాట్ వర్గాలలో మన పార్టీ ఎదగదు' అని వాదించారు. '2009 తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో అతని పార్టీకి 9 మంది ఎమ్మెల్యేలు మాత్రమే వున్నారు. 403 స్థానాలున్న అసెంబ్లీలో యిది 2.3% మాత్రమే. ముజఫర్‌నగర్ అల్లర్ల తర్వాత జాట్‌లకు, ముస్లిములకు మధ్య తగాదాలు వచ్చాయి. ఇద్దరూ కలిసి లోకదళ్‌కు ఓటేయరు' అని వారి అంచనా. ఇక దిక్కులేక అజిత్ యుపిఏతోనే కొనసాగుతున్నాడు. 8 సీట్లకు పోటీ చేస్తున్నాడు. ఒక దానిలో జయప్రద అభ్యర్థి. రైతులందరూ కలిసి వుంటే లోకదళ్‌కు ఛాన్సు వుంటుంది కానీ వాళ్లు కులాలవారీగా, మతాలవారీగా విడిపోతే లాభం లేదు. వాళ్లు అలా విడిపోకుండా అజిత్ నివారించలేకపోయారు. అందుకే 'హరితప్రదేశ్'లో యీసారి అతని పంట పండదంటున్నారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## ఎమ్బీయస్ : శివసేన గెలిచేవెన్ని?

ఎన్‌డిఏలో టిడిపి చేరడానికి ముందు బిజెపితో బాటున్న మూడు పార్టీల్లో శివసేనే పెద్దది. 2009లో బిజెపితో పొత్తుతో అది 22 సీట్లలో పోటీ చేసి 11 గెలుచుకుంది. ఈసారి ఎన్‌డిఏ అధికారంలోకి రావాలంటే శివసేన పెర్‌ఫామెన్స్ కూడా బాగుండాలి. ఉందా? ఈ సారి ఎన్నికలలో బిజెపి–సేన పొత్తు గతంలో అంత గట్టిగా లేదు. కారణం – బిజెపి రాజ్ థాకరే పార్టీ ఐన ఎంఎన్ఎస్‌తో కూడా సరసాలాడడం! పరస్పర సంశయాలతోనే పొత్తు సాగుతోంది. వీరిద్దరికి మౌలిక స్వభావంలోనే తేడా వుంది. బిజెపి హిందూత్వ పార్టీ. ఏ రాష్ట్రంలో వున్నవారైనా సరే, హిందువుల కోసం పోరాడదామంటుంది. శివసేన అలా కాదు. మహారాష్ట్రలో మరాఠీలకే ఉద్యోగాలు అనే నినాదం దానిది. 1966లో పార్టీ ఏర్పడ్డాక అది కాంగ్రెసుతో సన్నిహితంగా మెలిగింది. అప్పట్లో బొంబాయిలోని ఫ్యాక్టరీల్లో కమ్యూనిస్టులు నడిపే ట్రేడ్ యూనియన్లు బలంగా వుండేవి. వాటిని బలహీనపరచడానికి శివసేన కండబలాన్ని కాంగ్రెసు ఉపయోగించుకుంది. ఫ్యాక్టరీ యజమానుల ధనబలం, కాంగ్రెసు రాజకీయబలంతో ఎదుగుతూ పైకి మాత్రం మరాఠీలకోసమే యిదంతా చేస్తున్నమని చెపుతూ నగరాలలోని మధ్యతరగతి మహారాష్ట్రీయులను శివసేన ఆకర్షించింది. కానీ అక్కడికే పరిమితమై పోవడంతో 1980లలో బాల థాకరే హిందూత్వ జండా పట్టుకున్నాడు. ముస్లిములకు వ్యతిరేకంగా మాట్లాడసాగాడు. 1989లో తొలిసారి పార్లమెంటుకి పోటీ చేసి ఒక సీటు మాత్రమే గెలిచింది శివసేన. 1991లో నాలుగు.

ఇదే హిందూత్వ ఎజెండాతో తాము, బిజెపి విడివిడిగా పోటీ చేస్తే నష్టపోతున్నామని గ్రహించి 1995 అసెంబ్లీ ఎన్నికలలో పొత్తు పెట్టుకున్నారు. గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పరచారు. శివసేనకు తక్కువ సీట్లు వచ్చినా మిశ్రమప్రభుత్వంలో బిజెపి వాళ్లకే పెద్దపీట వేసింది. 1996 పార్లమెంటు ఎన్నికలలో కలిసి పోటీ చేస్తే సేనకు 15 సీట్లు వచ్చాయి. 1999లో కూడా! అయితే క్రమేపీ రెండు

పార్టీల మధ్య విభేదాలు వచ్చాయి. ఎందుకంటే బిజెపితో పొత్తు కారణంగా అప్పటిదాకా ముంబయి, థాణె, పుణె, నాసిక్‌లకు పరిమితమైన శివసేన గ్రామీణప్రాంతాలకు కూడా విస్తరించింది. అది బిజెపికి నచ్చలేదు. 2006లో రాజ్ థాకరే బయటకు వెళ్లిపోవడంతో సేన బలహీనపడిందని, గతంలో యిచ్చినన్ని సీట్లు వాళ్లకు యివ్వనక్కరలేదని బిజెపి అభిప్రాయపడసాగింది. ఉద్ధవ్‌కు అది రుచించలేదు. అతను తండ్రంత తీవ్రవాది కాదు. తన బాబాయి బాల థాకరే మోడల్లో రాజ్ మరాఠీలకే మహారాష్ట్ర అంటూ ఉత్తరభారతీయులను హింసిస్తూ వుంటే, ముంబయి ఓటర్లలో ఉత్తరభారతీయులు కూడా చాలామంది వున్నారనీ, గెలుపుకి వారి మద్దతు అవసరమని గ్రహించిన ఉద్ధవ్ ఎక్కడనుండి వచ్చినవారైనా తాము 'ముంబయ్‌కర్' అనుకుంటే చాలని అంటాడు.

2012లో బాల థాకరే పోయినతర్వాత బిజెపి శివసేనను వదిలేసి రాజ్‌తో పొత్తు పెట్టుకోవాలా అని కూడా ఆలోచించింది. కానీ రాజ్ కూడా పెద్దగా ఎదగలేదు. సరిగ్గా చెప్పాలంటే గెలిచేటంత ఎదగలేదు, ఎదుటివాణ్ని చెడగొట్టేటంత ఎదిగాడు. 2009 పార్లమెంటు ఎన్నికలలో సేన నిలబడిన 7 సీట్లలో, బిజెపి నిలబడిన 5 సీట్లలో 12 సీట్లలో పోటీ చేశాడు. పది సీట్లలో లక్ష కంటె ఎక్కువ ఓట్లు తెచ్చుకుని కాంగ్రెస్-ఎన్‌సిపి విజయానికి దోహదపడింది. రెండు సీట్లలో బిజెపి/సేన అభ్యర్థులు మూడో స్థానంలో నిలిచేట్లు చేసింది. అదే సంవత్సరం జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో 13 సీట్లు గెలిచింది కానీ 30 సీట్లలో బిజెపి-సేన అవకాశాలు చెడగొట్టింది. అందువలన శివసేనను వదిలిపెట్టి రాజ్ ఎంఎన్‌ఎస్‌తో కలిసి ఊరేగితే ఎలా వుంటుందాని బిజెపి నాయకులకు వూహలు వచ్చాయి. కితం ఏడాది మోదీని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించిన దగ్గర్నుంచి బిజెపి మహారాష్ట్ర యూనిట్‌కి ధైర్యం పెరిగి శివసేనతో కయ్యానికి కాలు దువ్వుతోంది. 2013 జులైలో ఉత్తరాఖండ్ వరదలు వచ్చినపుడు అక్కడ చిక్కుకున్న గుజరాతీలను రక్షించడానికి మోదీ టీములు పంపించారని బిజెపి గొప్పలు చెప్పుకున్నపుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి పృథ్వీరాజ్ చౌహాన్ 'వరద బాధితుల్లో అలా ప్రాంతీయత చూడడం తప్పు. మేం పంపిన టీములు అన్ని ప్రాంతాల వారికీ సాయపడ్డాయి' అని ప్రకటించాడు. ఉద్ధవ్ తన 'సామ్నా' పత్రికలో రాసిన సంపాదకీయంలో మోదీ ప్రాంతీయత భావాలను నిరసించి, పృథ్వీరాజ్‌ను శ్లాఘించాడు. అది బిజెపికి కన్నెఱ్ఱ అయింది.

శివసేన బలహీనపడుతోందని వారికి తోచింది. సేన సీనియర్ లీడర్ మనోహర్ జోషి ఉద్ధవ్ నాయకత్వ శైలిని విమర్శించడం, దానివలన ఉద్ధవ్ అతనిపై తీవ్రచర్య తీసుకుని ఎన్నికలలో తప్పించడం వారు గమనించారు. ఎన్నికల ప్రకటన వచ్చిన తర్వాత యిద్దరు సిటింగ్ ఎంపీలు, మరో నలుగురు ముఖ్యనాయకులు పార్టీ విడిచిపెట్టి వెళ్లిపోయారు. నలుగురు ఎన్‌సిపిలో చేరగా, ఒకరు కాంగ్రెస్‌లో మరొకరు ఎంఎన్‌ఎస్‌లో చేరారు. ఎన్‌సిపి ఎందుకంటే – శివసేనలో చాలాకాలంగా ఉన్న నాయకులకు కాంగ్రెస్‌తో గత అనుబంధం వుంది. శరద్ పవార్ ఒరిజినల్‌గా కాంగ్రెస్ వాడే కదా! ఆ పరిచయం యిప్పుడు పని చేసింది. శివసేన బలం తగ్గుతోందని గ్రహించి మార్చి నెలలో బిజెపి రాజ్‌తో మంతనాలాడింది. అది తెలిసి ఉద్ధవ్ భగ్గుమన్నాడు. బిజెపి ఏదో సర్ది చెప్పింది కానీ ఫైనల్‌గా చూస్తే యీ ఎన్నికలలో రాజ్ పార్టీ 9 సీట్లలో పోటీ చేస్తోంది. వాటిలో 2 బిజెపికి వ్యతిరేకంగా కాగా, 7 శివసేనకు వ్యతిరేకంగా! శివసేనను పూర్తిగా నాశనం చేస్తే తప్ప బిజెపి తనను దగ్గరకు తీసుకోలేదని రాజ్ గ్రహించాడు. ఈ కొట్లాటల్లో రెండూ బలహీనపడితే ఎన్‌డిఏ కూటమికి, తద్వారా బిజెపికి నష్టం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (ఏప్రిల్ 2014)**

## మే 1-2 వీక్లీకై ఎమ్బీయస్ : ఎన్నికల బొమ్మల లాంతరు

మన దేశం అంటేనే వైవిధ్యభరితం. ఇక ఎన్నికలనగానే ఎన్నో వికారాలు బయటపడతాయి. చాదస్తాలు, మూఢనమ్మకాలు, చిట్కాలు – గెలుస్తామంటే చాలు, మనుషులు వింతవింతగా ప్రవర్తిస్తారు. వాటిలో కొన్ని –

– జయలలితకు నమ్మకాలు జాస్తి. ఆవిడ సినిమా రంగంలోకి 'వెణ్నీర ఆడై' (తెల్ల చీర) అనే సినిమాతో ప్రవేశించి ఖ్యాతి సంపాదించినా ముదురు రంగు ఆవిడకు కలిసి వస్తుందని ఎవరో చెప్పారు. అందుకే ముదురు రంగు చీరలే కడుతుంది. వాటిలో మెరూన్ రంగు ఎక్కువ. ఆవిడ హెలికాప్టర్ కూడా మెరూన్ రంగుదే. దానికి గంటకు 3 లక్షల రూ.ల అద్దె. తనకోసం దానిలో మార్పులు చేయించుకుంది. నాలుగో సీటు తీయించేసి కాళ్లు చాపుకుని కూర్చునేట్టు విశాలంగా చేసుకుంది.

– ఎడిఎంకె పార్టీ తరఫున పార్లమెంటు సభ్యులుగా పోటీ చేసేవారందరినీ ఏప్రిల్ 1 వ తేదీ మధ్యాహ్నం 1. 40 నుండి 3 గం.ఎల లోపునే నామినేషన్లు వేయమని పార్టీ హుకుం జారీ చేసింది. అంతమందికి ఒకే టైము ఎలా మంచిదయ్యిందా అని ఆశ్చర్యపడుతున్నారా? ఆ ముహూర్తం – వాళ్ల జాతకాల బట్టి కాదు, జయలలిత జాతకంబట్టి పెట్టింది.

– హేమమాలిని మథురలో రాష్ట్రీయ లోక్ దళ్ అభ్యర్థి, అజిత్ సింగ్ కుమారుడు అయిన జయంత్ చౌధురిపై పోటీ చేస్తోంది. 2009 ఎన్నికలలో ఆ పార్టీకి, బిజెపికి పొత్తు వుండడం చేత అతనికి మద్దతుగా ప్రచారం చేసిందామె. ఇప్పుడు అతనిపై విమర్శలు గుప్పిస్తోంది.

– పాతకాలపు హిందీ హీరో బిశ్వజిత్ తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా ఢిల్లీలో పోటీ చేస్తున్నాడు. జనాలు తనను మర్చిపోయి వుంటారని కరక్టుగానే వూహించి తను నటించిన హిందీ సినిమాల లిస్టుని ప్రచారంలో భాగంగా పంచుతున్నాడు. తమాషా ఏమిటంటే వాటిలో "ఏప్రిల్ ఫూల్" అనే సినిమా కూడా వుంది! అంతే కాదు, "బీస్ సాల్ బాద్" (ఇరవై ఏళ్ల తర్వాత అని అర్థం) అని 1962 నాటి

సినిమా కూడా వుంది. లిస్టు చదివినవారు 'ఏభై ఏళ్ల తర్వాత కూడా యింకా ఏం గుర్తు పెట్టుకుంటాం సార్' అంటున్నారట.

– మలయాళ నటుడు మోహన్‌లాల్ 'ఇన్నోసెంట్' అనే హాస్యనటుడి తరఫున ప్రచారం చేస్తున్నాడు. అతను లెఫ్ట్ ఫ్రంట్ అభ్యర్థి. ఇది యుపిఏకు కోపం కలిగిస్తోంది. ఎందుకంటే మోహన్‌లాల్‌కు లెఫ్టినెంట్ కల్నల్ హోదా యిచ్చింది యుపిఏనే! ఇప్పుడు యిలా ప్రచారం చేయడాన్ని మిలటరీ క్రమశిక్షణారాహిత్యంగా పరిగణిస్తారేమో చూడాలి!

– రాజ్ బబ్బర్ ఘజియాబాద్ నుండి కాంగ్రెస్ తరఫున నిలబడుతున్నాడు. నామినేషన్ వేసేముందు హిందువులను తృప్తి పరచడానికి హవన్ నిర్వహించి, ఆ తర్వాత ముస్లిములకోసం మసీదుకి, సిక్కుల కోసం గురుద్వారాకు వెళ్లి ఆ పై నామినేషన్ వేయాలని ప్లాను. అయితే హవన్ పూర్తయేసరికి పుణ్యకాలం గడిచిపోతోంది. అందువలన పొగ వలన మండుతున్న కళ్లు నులుముకుంటూ కారెక్కాడు. అది కదలడానికి మొరాయించింది. ఎట్టకేలకు బయలుదేరదీసి, నామినేషన్ ముహూర్తం మించిపోతోందని మసీదుకి, గురుద్వారాకు కార్లోంచే దణ్ణం పెట్టుకుని ఎలక్షన్ ఆఫీసుకి ఉరుకులు పెట్టాడు. అక్కడ పెద్ద క్యూ వుంది. మన చిరంజీవి స్టయిల్లో క్యూ జంప్ చేద్దామని చూస్తే, అక్కడా కార్తిక్ స్టయిల్లో జనాలు అడ్డుకున్నారు. కళ్లు చికిలిస్తూ క్యూలో నిలబడ్డాడు.

– రాఖీ సావంత్ రాష్ట్రీయ ఆమ్ పార్టీ అని పెట్టి వాయువ్య ముంబయి నుంచి పోటీ చేస్తోంది. ఆమె గుర్తు పచ్చిమిర్చి. పెద్దగా చదువుకోకపోయినా నెహ్రూ జాకెట్, గాంధీ టోపీ, కళ్లజోడు పెట్టుకుని నేతా స్టయిల్లో పోస్టర్లు వేయించుకుంది. ఆమెకు ప్రత్యర్థిగా నిలబడిన ఆప్ అభ్యర్థి మయాంక్ గాంధీ 'రాఖీకి ఓటేసేవారు వినోదం (ఫన్) కోసమే వేస్తారు' అనడంతో ఆమెపై కేసు పెట్టింది.

– రామ్ సేవక్ ధోబి అనే కాంగ్రెస్ మాజీ ఎమ్మెల్యే వున్నాడు. ఇందిరా గాంధీ కాలం నుండి ఆమె కుటుంబ సభ్యులకు నామినేషన్ వేసినపుడు యితను పక్కన వుంటే విజయం తథ్యం అని నమ్మకం. అందువలన యిప్పటికీ నామినేషన్ వేసేటప్పుడు యితన్ని పిలిపిస్తారు. ఇప్పుడు అతనికి 92 ఏళ్లు. అయినా పిలిపిస్తారు. ఇతను వెళ్లి వస్తూ వుంటాడు.

– క్రైస్తవ ఫాదిరీలు కూడా ఎన్నికలలోకి దిగారు. తిరునల్వేలి జిల్లాలో కూడంకుళం న్యూక్లియార్ ప్రాజెక్టుకి వ్యతిరేకంగా జరిగిన పోరాటానికి సారథ్యం వహించిన ఫాదర్ జేసురాజ్ ఆప్ టిక్కెట్టుపై నిలబడ్డాడు. తిరువనంతపురంలో ఫాదర్ స్టీఫెన్ ఇండిపెండెంట్‌గా నిలబడ్డాడు. క్రైస్తు, మార్క్స్ సిద్ధాంతాలను కలగలపి పాటలతో కేరళలో ప్రచారం చేసే 'కామ్రేడ్ ప్రీస్ట్' ఫాదర్ మేత్యూ వళక్కున్నం సేవలను సిపిఎం పార్టీ తమ పార్టీ ప్రచారానికి వినియోగించుకుంటోంది.

– 2 జి స్కామ్ ధర్మమాని 'రాజా' అనగానే తమిళనాడులో అందరూ ఉలిక్కిపడుతున్నారు. డిఎంకె మంత్రి ఎ.రాజా జైలుకి వెళ్లినపుడు తమిళనాడు సిపిఐ నాయకుడు డి.రాజా యిబ్బంది పడేవారు. తెలిసీతెలియని వాళ్లు కొందరు ఏ ఎయిర్‌పోర్టులోనో తారసిల్లి 'జైలుకి వెళ్లింది మీరు కాదా?' అని అడిగేవారట. ఇప్పుడు శివగంగ నియోజకవర్గం నుండి బిజెపి అభ్యర్థిగా నిలబడుతున్న ఎచ్. రాజా ప్రచారానికి వెళ్లినపుడు 'ఆ రాజా నువ్వేనా?' అని అడుగుతున్నారట. తను వేరే అని చూపించుకోవాలని, బిజెపి వారి నార్త్ యిండియన్ స్టయిల్లో 'రాజాజీ' అని చెప్పుకోసాగాడతను. కానీ తమిళ ప్రజలకు రాజాజీ అంటే 'సి.రాజగోపాలాచారి' మాత్రమే. ఇదీ లాభం లేదని తన పార్టీ గుర్తు కలుపుకుని 'లోటస్ రాజా' అని చెప్పుకుంటున్నాడు.

– కేసుల్లో యిరుక్కోని నిష్కళంకులనే నిలబెడతామనే హామీతో ఆప్ పార్టీ రాజకీయాల్లోకి వచ్చింది. కానీ ఒడిశాలో వాళ్ల అభ్యర్థి నరేంద్ర మహంతీపై 28 క్రిమినల్ కేసులున్నాయి. అదేమిటి అంటే 'గిరిజన ప్రాంతాల్లో వారి అభ్యున్నతి కోసం పని చేస్తున్న అతనిపై ప్రభుత్వం అన్యాయంగా మోపిన కేసులవి' అని ఆప్ అంటోంది.

– అహ్మదాబాద్ (తూర్పు) నుండి పోటీ చేస్తున్న దశరథ్ దేవ్‌డా ఎన్నికల హామీ ఒక్కటే – గృహహింస నుండి మగవాళ్లను రక్షించడం!

– దక్షిణ ముంబయి నుండి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న గౌరవ్ శర్మ అనే యువకుడు స్పైడర్ మ్యాన్ సూటు వేసుకుని ప్రచారం చేసుకుంటున్నాడు. ఒక్క తాడు వుంటే పెద్ద పెద్ద బిల్డింగులు కూడా ఎక్కేయగల శర్మ పదో అంతస్తు అపార్ట్‌మెంట్ వంటింటి కిటికీల్లోంచి గృహిణులకు హలో చెప్పి ఓట్లడగగలడు.

– ఓటర్లను చేరుకోవడం ప్రచారంలో ఒక పెద్ద సమస్య. ఇరుకుసందుల్లోకి వెళ్లడం కష్టం కాబట్టి తమిళనాడులోని మయిలాడుదురై నియోజకవర్గంలో మనిదనీయ మక్కల్ కచ్చి తరఫున పోటీ చేస్తున్న హైదర్ అలీ తన ఫ్రెండు స్కూటర్ వెనకసీట్లో కూర్చుని సందుల్లోకి వెళ్లిపోతున్నాడు.

– పర్వతప్రాంతాల్లో ప్రయాణం మరో రకమైన కష్టం కాబట్టి ఉత్తరాఖండ్ కాంగ్రెస్ పార్టీ మేఘాలయా పారాగ్లయిడింగ్ అసోసియేషన్ సహాయం కోరింది. వాళ్లు గ్లయిడర్లపై అభ్యర్థులను తోడుగా తీసుకుని వెళ్లి ఓటర్ల వద్దకు ఎగురుకుంటూ వెళుతున్నారు. భూమికి 15 అడుగుల ఎత్తులో వేళ్లాడుతూ ఓట్లు అడుగుతున్న అభ్యర్థులను చూసి ఓటర్లు ముచ్చటపడుతున్నారు.

– తమిళనాడులోని ఎండిఎంకె నాయకుడు వైకో ఓటర్లకు ఏ సేవ చేయడానికైనా రెడీయే కానీ షేక్‌హ్యాండ్ యివ్వడానికి మాత్రం ఒప్పుకోడు. అంతేకాదు, తన కార్యకర్తలెవరూ గోళ్లు పెంచుకోకూడదని ఆదేశాలు జారీ చేశాడు.

– డార్జిలింగ్‌లో తృణమూల్ తరఫున పోటీ చేస్తున్న బైచుంగ్ భూటియా ఫుట్‌బాల్ ఆటగాడు. ఫుట్‌బాల్ స్టేడియంలో అయిత్తే ఓటర్లు ఎక్కువమంది ఒకేసారి దొరుకుతారు కదాని వెళితే 'ఓట్ల సంగతి తర్వాత, ఓ ఆట ఆడదాం రమ్మ'న్నారు. ఓట్లకోసం వంటలు చేస్తున్నవారుండగా యిదో లెక్కా అనుకుని కాస్సేపు ఆడి వచ్చాడు. బెంగాల్‌లోనే రాయ్‌గంజ్‌లో సిపిఎం అభ్యర్థిగా నిలబడిన

మొహమ్మద్ సలీం క్విజ్ మాస్టర్. నియోజకవర్గంలో తిరుగుతూ భారత రాజకీయాలపై క్విజ్‌లు నిర్వహిస్తూ జనాలను పోగేస్తున్నాడు, ఆపై ఓట్లు అడుగుతున్నాడు.

– కార్యకర్తలకు టీ యిచ్చినా ఎన్నికల ఖర్చులో రాసేస్తామని ఎన్నికల కమిషన్ అంటోంది. దానికి మస్కా కొట్టడం ఎలాగో అభ్యర్థులకు తెలుసు. చిక్కబళ్లాపూర్‌లో కాంగ్రెస్ ఒక పెద్ద సభ నిర్వహించింది. సభ అయిపోయాక కార్యకర్తలకు భోజనం పెట్టాలి. ఎలా? అందుకని పక్కనే వున్న కమ్యూనిటీ హాల్లో కుశాల అనే పిల్లవాడి బారసాల జరుగుతోంది మీరందరూ రండి అని పిలిచారు. వెళ్లినవాళ్లకు బిర్యానీలతో సహా సుష్టుగా భోజనం పెట్టారు. వెళ్లేముందు పిల్లవాణ్ని ఆశీర్వదించి వెళ్లాలేమో అని చూస్తే పిల్లాడూ లేడు, వాడి తలిదండ్రులూ లేరు! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

## మే 3 -4 వీక్లీకై ఎమ్బీయస్ : తూర్పు తిరిగి దణ్ణం పెట్టమన్న మోదీ

మోదీగారి తిరుపతి ఉపన్యాసం చాలా ఉత్సుకతతో విన్నాను – కెసియార్ ఆరోపించినట్లు హైదరాబాదును యూటీ చేస్తామని చెప్తారా లేదా అని. ఆ మాటే లేదు. మొదట్లో ఆ ఐడియా వుందేమో, కెసియార్ ముందే చెప్పేసి ప్రీఎంప్ట్ చేశారేమో తెలియదు. ఏమైతేనేం, సీమాంధ్రులకు హైదరాబాదు విషయంలో కొత్తగా హామీ ఏదీ దక్కలేదు. మోదీగారు చెప్పినదేమిటి? ప్రపంచమంతా తూర్పువైపు చూస్తోంది. మీరూ చూడండి. సముద్రం కనబడుతుంది. పశ్చిమాన సముద్రతీరం వున్న గుజరాత్ కంటె తూర్పున సముద్రతీరం వున్న మీకు అవకాశాలు అధికంగా వుంటాయి. ఏం దిగులు పడకండి. కష్టపడడం మీకు ఎలాగూ అలవాటే. పడండి. పడుతూనే వుండండి, మరింత అలవాటు పడతారు. పెట్రోలు, గ్యాస్ వంటి సహజవనరులు మీకున్నాయి అని కూడా చెప్పారు. ఉంటే ఏం లాభం రిలయన్సు వాళ్లు మీ గుజరాత్‌కే పట్టుకెళ్లిపోతున్నారు కదాని జనాలెవరూ లేచి అడగలేదు.

ఆ గ్యాస్‌బావులే వాళ్ల కొంప ముంచుతున్నాయి. ఆంధ్రలో వచ్చే ప్రభుత్వం తమ చెప్పుచేతల్లో వుండాలనే రిలయన్సు వారు యీ ఎన్నికలలో డబ్బు గుమ్మరిస్తున్నారని, అందుకే దేశం మొత్తంలో పట్టుబడిన డబ్బులో సగం యిక్కడే దొరికిందనీ అంటున్నారు. ఈ సాగరఘోషంతా గ్యాస్ కోసమే అని అర్థమవుతోంది. లేకపోతే ఆ సముద్రం యిప్పటిదా? భూమి పుట్టినప్పటినుండీ వుంది. దాన్ని యిప్పుడే ఆంధ్రులకు ఎవరో తెచ్చి యిచ్చినట్టు, యికపై దానిలో చేపలు పట్టుకుంటూ హాయిగా బతికేసేయవచ్చు అన్నట్టు యీ బిల్డప్ ఏమిటి? మాట్లాడితే సీమాంధ్రకు సముద్రం వుంది అంటున్నారు. దానివలన ఆ ప్రాంతం ఏమైనా బాగుపడిందా? పడితే అక్కడివాళ్లు హైదరాబాదు వంటి కొండలు, గుట్టల ప్రాంతానికి వచ్చి బతుకుతెరువు వెతుక్కోవడం దేనికి? సీమాంధ్ర నాయకులు ఏమైనా బాగుపరచారా? మోదీగారి పక్కనే చంద్రబాబుగారున్నారు. దాదాపు పదేళ్లు ముఖ్యమంత్రిగా వున్నారు. అంతకితం ఎన్టీయార్ పాలించినప్పుడు కూడా ముఖ్యపదవుల్లో వున్నారు. టిడిపి బాబు హస్తగతం అయ్యాక రాసిన ఎన్టీయార్ జీవితచరిత్రల్లో చాలామంది ఎన్టీయార్ పథకాలన్నిటి వెనకా బాబు మేధస్సే వుందని రాశారు. అందువలన మొత్తం టిడిపి పాలనను బాబు ఖాతాలో వేసినా తప్పులేదు. అంతటి సుదీర్ఘకాలంలో బాబు అక్కడ ఎన్ని పోర్టులు కట్టించారు? ఎన్ని ఓడలు తయారు చేయించారు? ప్రభుత్వం చేత ఎంత గ్యాసు తీయించారు? కేరళలా సీఫుడ్ ఎగుమతులు ఎన్ని చేయించారు?

ఓ పక్క గుజరాత్‌లో మోదీ యివన్నీ చేస్తూ వుంటే అవి చూసి అప్పుడెందుకు యిన్‌స్పైయిర్ కాలేదు? ఇప్పుడు మోదీయే నాకు ఆదర్శం ఎందుకంటున్నారు? మోదీ ఎడారి ప్రాంతానికి నీళ్లు తెప్పిస్తూ వుంటే, బాబుగారు రాయలసీమ మెట్టప్రాంతాన్ని గాలికి వదిలేసి తన ఆస్తులున్న హైదరాబాదుపైనే పడ్డారనుకోవాలా? కోస్టల్ కారిడార్ అనేది అద్భుతమైన ఆలోచన. అవినీతి గబ్బు పట్టించి భ్రష్టు పట్టించడం వేరే మాట. కానీ కోస్టల్ కారిడార్ వంటిది బాబు రూపకల్పన చేయించారా? తుపానులు వచ్చిపడుతున్నాయి కదా, వాటిని ఎదుర్కోవడానికి శాశ్వతమైన ఏర్పాట్లు ఏమైనా చేశారా? ఇవే ప్రశ్నలు కాంగ్రెసు పాలకులకూ వేయవచ్చు. సముద్రం వుంది కాబట్టి చెలరేగిపోతాం అని చేస్తున్న హంగామా చూస్తేనే ఒళ్లు మండుతోంది. దీనికి తోడు రాజధాని నిర్మాణం ఒకటి. ఏం మోదీ ఢిల్లీతో ఎందుకు పోల్చాలి? మా గాంధీనగర్‌లా సింపుల్‌గా కట్టుకోండి, అది చాలు అనవచ్చుగా. రాహుల్ గాంధీ ఓ పక్కనుంచి ఐఐటి, ఐఐఎమ్, వల్లకాడు, వశినాపురం అంటూ హామీలు దంచేస్తున్నాడు. మరో పక్క మోదీ ఢిల్లీని తలదన్నే నగరం కట్టండి, నేను నిధులిస్తాను అనేస్తున్నాడు. అప్పుడే అంతా ఫిక్సయిపోయినట్లు!

మోదీ ప్రధాని అవుతాడో లేదో యిప్పటిదాకా తేలలేదు. కార్పోరేట్లు రంగంలోకి దిగి మీడియాను ప్రభావితం చేయడానికి చూస్తూండడంతో ఏ సర్వేను నమ్మలేకుండా వున్నాం. కామన్‌సెన్స్ ఉపయోగించి చూస్తే మార్చి మూడోవారంలో వీక్–సిఎన్ఎన్–ఐబిఎన్ కొంతవరకు వాస్తవంగా తోచింది. దాని ప్రకారం యుపిఏకు 111–123 (కాంగ్రెసుకు 94–106), ఎన్‌డిఏకు 234–246 (బిజెపికి 206–218) వచ్చేట్లు వున్నాయి. (దీనిలో టిడిపికి విడిగా 13–19 చూపారు. దాన్ని ఎన్‌డిఏకు కలపాలి). 1999లో వాజపేయి హవా నడిచినపుడు బిజెపి తెచ్చుకున్నది 183. అదే యిప్పటిదాకా హైయస్ట్. నాలుగైదు రోజులుగా ఆంధ్రజ్యోతి ఢిల్లీ ప్రతినిథి మోదీ హవాగురించి చాలా విశ్లేషణత్మకంగా చక్కగా రాస్తున్నారు. అంచనాలు కూడా యిస్తున్నారు. ఇవి వీక్ కంటె లేటెస్టు. వాస్తవాలకు మరింత దగ్గరగా వుండవచ్చు. సానుకూల పవనాలు వీస్తే బిజెపికి 200–220 సీట్లు రావచ్చని ఆయన అంచనా.

ఉత్తరాఖండ్(5), హిమాచల్(3), హరియాణా(3), ఛత్తీస్ గఢ్(8), ఝార?ండ్ (8), అసాం (5), కశ్మీర్ (1), గోవా (1), తమిళనాడు

(2), మహారాష్ట్ర (15), బెంగాల్ (1-2) లలో యిద్దరిదీ ఏకాభిప్రాయం వున్నట్టు తోస్తోంది. ఇక్కడికి 53 అయ్యాయి. ఇక తక్కిన రాష్ట్రాలకు వస్తే వీక్ సర్వే ప్రకారం 141-182 మధ్య వస్తే యీయన అంచనా ప్రకారం 137-144 మధ్య వస్తాయి. వివరాలు కావాలంటే – రాష్ట్రం (మొత్తం సీట్లు) – వీక్ సర్వే – కృష్ణారావుగారి అంచనా

యుపి (80) – 42-50 – 35-40

బిహార్ (40) 21-29 15

మధ్యప్రదేశ్ (29) 24-28 24

రాజస్థాన్ (25) 21-25 19 (తగ్గవచ్చు కూడా)

గుజరాత్ (26) 20-26 18-20

కర్ణాటక (26) 7-13 15

ఒడిశా (21) 3-7 6

ఢిల్లీ (7) 3-4 5

ఎలా చూసినా బిజెపికి సొంతంగా 200 దాటకపోవచ్చు. ఎన్‌డిఏలో భాగస్వాములు ఎన్ని పట్టుకురాగలరు? మహా అయితే 40, 50! 272 కంటె తక్కువ పడితే ప్రాంతీయపార్టీలను ఆశ్రయించవలసిందే. వారు తమ రాష్ట్రంలోని మైనారిటీల ఓటింగు సరళిని బట్టి మోదీని ప్రధానిగా ఒప్పుకోమంటే మోదీకి బదులు వేరెవరో, అతని సహచరుడే కావచ్చు – ప్రధాని కావచ్చు. ఇలాటి పరిస్థితుల్లో మోదీ అప్పుడే తను ప్రధాని అయిపోయినట్టు, నిధులిచ్చేసినట్లు, ఇక ముఖ్యమంత్రి హోదాలో బాబు ఖర్చుపెట్టడం మాత్రమే మిగిలినట్లు కాబోయే ప్రధానమంత్రి, కాబోయే ముఖ్యమంత్రి వేదికపై ముచ్చట్లాడడం తమాషాగా తోచింది.

బాబుగారి ఉపన్యాసం మామూలుగానే అనేక హామీలతో వుంది కాబట్టి కొత్తగా చెప్పేదేమీ లేదు. పవన్ మాత్రం మంచి ప్రశ్న వేశారు. సీమాంధ్రులను తిడుతున్న కెసియార్‌ను సీమాంధ్రకు ముఖ్యమంత్రి అవుదామనుకుంటున్న జగన్ ఎందుకు తిట్టడం లేదు? అని. నా మనసులోనూ అదే ప్రశ్న వేసుకుని విముఖత పెంచుకున్నాను. దానితో బాటు పవన్‌పై కూడా కొన్ని ప్రశ్నలు పుట్టుకుని వచ్చాయి. కెసియార్ సీమాంధ్రుల్ని తిడితే పవన్ ఓర్చుకున్నాడట. కానీ మోదీని తిడితే చికాకేసుకుని వచ్చి తాట తీస్తానన్నాట్ట. అంటే ఆంధ్రుల కంటె మోదీ ఎక్కువై పోయాడా? ఎందుకు? ఆయన తనను ఔట్‌సోర్స్ చేసుకున్నాడనా? నాకు దీనిలో దమ్మిడీ ఆదాయం లేదని పవన్ రెండు, మూడుసార్లు నొక్కి చెప్పడంతో దానిపైనే నా దృష్టి పోయింది. డబ్బు యివ్వడం లేదేమో, పోయిన ఆస్తులు తెప్పించి యిస్తున్నారేమో, లేక మనకు యిచ్చినట్టుగానే ఆయనకూ హామీలు యిస్తున్నారేమో అని సందేహం కలిగింది.

తర్వాత – విభజన చేసేశారని యిప్పుడు వచ్చి లెక్చర్లు దేనికి? టిడిపి లేఖ యిచ్చినపుడో, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ తీర్మానం చేసినపుడో, మంత్రుల ముఠా నివేదిక అప్పుడో, అసెంబ్లీకి తీర్మానం వచ్చినపుడో, పార్లమెంటులో తెలుగు ఎంపీలను తన్నించినపుడో నోరు విప్పలేదేం యీయన? యాక్టర్‌కు టైమింగ్ ముఖ్యమంటారు. బహుశా పవన్‌కూడా టైమింగ్ కోసం ఆగారేమో. కిశోర్ కుమార్ డబ్బు దగ్గర చాలా గట్టి. 'పాట రికార్డింగ్ చేసేయండి, డబ్బు దారిలో వుంది' అని నిర్మాత అంటే సరే అని మొదలుపెట్టి ఆ అనీ, వూ అనీ, దగ్గి, తుమ్మి, గొంతు సవరించుకుని టైము వేస్టు చేసేవాడు. ఇక ఆపండి మహాప్రభో అని నిర్మాత డబ్బు పట్టుకుని వచ్చి చేతిలో పెడితే గొంతు పెగిలేది.

తనకు రాజకీయపరిజ్ఞానం బాగా వుందన్నట్లు పవన్ యింప్రెషన్ కలిగిస్తారు. జాతీయ నాయకుల పేర్లు తడుముకోకుండా చెప్తారు. తెలంగాణ ఉద్యమం ఎందుకు వచ్చిందో కూడా నిన్న చరిత్ర చెప్పారు. 2004లో వైయస్ పాలన వచ్చాక ఆయనా, ఆయన అనుచరులూ కలిసి తెలంగాణలో భూములు కబ్జా చేయడం వలన తెలంగాణ ప్రజల్లో సీమాంధ్ర నాయకులపై కోపం వచ్చి ఉద్యమం వచ్చిందట! 2001లోనే టిడిపి పాలనలోనే తెలంగాణకు విద్యుత్, నీళ్ల విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ కెసియార్ తెరాస పెట్టారని మనం అనుకుంటూ వచ్చాం, అమాయకులం. 2004 పాటికి తెరాస బలం పుంజుకుందని కాంగ్రెసు అధిష్టానం అనుకుని వారితో పొత్తు పెట్టుకుంది. ఆ తర్వాత వైయస్ ముఖ్యమంత్రి అయ్యారు. తిక్కలో పవన్ లెక్క తప్పినట్టున్నారు. ఇంతకీ కబ్జాలు చేసేవారెవరు? సీమాంధ్రులు అంటూ వచ్చారు తెరాస వారు. మొన్న ఎన్నికలలో పదం మార్చి కాంగ్రెస్ వారు – అన్నారు. సీమాంధ్ర కాంగ్రెస్‌వారు దోచుకుంటూ వుంటే తెలంగాణ కాంగ్రెస్‌వారు హారతులు పట్టారన్నారు. ఇప్పుడీయన సీమాంధ్ర కాంగ్రెస్ నాయకుల్ని మరింత క్వాలిఫై చేసి వైయస్ అనుయాయులు అన్నారు. వైయస్ వున్నంతకాలం ఆయనతో అంటకాగి యిప్పుడు టిడిపిలోకి దూకిన నాయకులు కూడా ఆ బ్యాచ్‌లో వున్నారో లేదో పవనే చెప్పాలి.

కబ్జా చేసినవారెవరని తెలంగాణ ఉద్యమకారులను అడిగితే పద్మాలయ నుండి మొదలుపెడతారు. అవన్నీ వైయస్ హయాంలోనే జరిగాయా అన్నది కూడా పవనే చెప్పాలి. అవునూ పవన్ కోటి రూపాయలిచ్చి పీపుల్స్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఏదో పెట్టారు కదా. అదేం చేస్తోంది? కబ్జాదారుల నుండి భూమి సొంతదారులను రక్షించే పని పెట్టుకోలేదా? పోనీ యిప్పుడు జనసేనైనా ఆ పని తలకెత్తుకుని కబ్జాదారులను గుర్తించి తరిమివేస్తుందా? పవన్ సొంత భూమి కూడా అన్యాక్రాంతం అయిందని, ఆ సందర్భంగా ఆయనకు ఆర్థిక, హార్దిక నష్టం వాటిల్లిందని విన్నాం. అలా నష్టపరిచినది వైయస్ అనుయాయులా!? నేను వేరేలా విన్నానుస్మీ! అసలు విషయమేమిటో పవన్ 'ఇజం'కు కొనసాగింపుగా 'నిజం' రాస్తే తప్ప మనం వూరికే వూహించుకుంటూనే వుంటాం. పవన్, బాబు, మోదీ కలిస్తే

పంగనామాలు అని కెసియార్ అంటే పవన్ మంచి రిటార్టు యిచ్చారు – మూడు ఒకట్లు చూస్తే తనకు ఆపదమొక్కులవాడు గుర్తుకు వస్తాడని. ఆయనకు వచ్చిన ఆపదలేమిటో తెలియదు కానీ యీ కలయిక వలన అవి తొలగిపోయేట్టున్నాయి.

ఇక మోదీ సీమాంధ్రులకు యిచ్చిన వరాల మాట ఏమిటంటారా? ఆయనే చివర్లో అందరి చేతా అనిపించారు – గోవిందా గోవింద అని! అదే ఆయన మనకిచ్చిన సందేశం! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

**మే 5** **ఎమ్బీయస్ : ఆంధ్రలో బలాబలాలు**

ఆంధ్రలో ప్రచారం ముగిసింది. ఇప్పటిదాకా వున్న పరిస్థితిని బేరీజు వేసే ప్రయత్నమిది. నేను ఏ సర్వే చేయించలేదు. దీనిలో అంకెల కంటె చర్చే ఎక్కువ కనబడుతుంది. క్షేత్రస్థాయిలో వున్నవారే పరిస్థితి అంచనా వేయడం కష్టం అనుకుంటే మీడియా మరీ గందరగోళ పరుస్తోంది. ఎప్పటికప్పుడు టిడిపి భలే పుంజుకుంటోంది అని రాస్తున్నారు. టీవీ ఛానెల్స్‌లో చెపుతున్నారు. గత జులై విభజన ప్రకటన తర్వాత నుండి టిడిపి దూసుకుపోతోంది అని రాస్తూ వచ్చారు – బాబు నోట సమైక్యం అనే మాట అసెంబ్లీలో రాకపోయినా. ఇక పార్లమెంటులో బిల్లు పాసయ్యాక చెప్పనే అక్కరలేదు. 'విభజన ఎలాగూ అయిపోయింది. నవనిర్మాణానికి బాబే సమర్థుడని అందరికీ అర్థమైంది. ఇప్పటిదాకా వైకాపా పట్ల చూపిన మొగ్గు యిప్పుడు యిటు తిరిగింది' అని రాశారు. కాంగ్రెసు నాయకులందరూ  టిడిపికి క్యూలు కట్టడంతో అది నిజం కాబోలు అనిపించింది. వారి రాక వలన టిడిపిలో ఏర్పడ్డ విభేదాలు త్వరలోనే సమసిపోయాయని మీడియా మనకు ధైర్యం చెప్పింది.

అంతలో బిజెపితో పొత్తు విషయం వచ్చిపడింది. కలహాలు బయటపడ్డాయి. 'అయినా సర్దుకున్నాయి. పొత్తు అద్భుతంగా నడుస్తోంది' అని మళ్లీ రాశారు. ఆ తర్వాత 'మోదీ–పవన్–బాబు సభలు అద్భుతంగా జరగడంతో వైకాపా వైపు వున్న ఓటర్లు యిటువైపు తిరిగిపోయారు' అని రాశారు. ఈ రాతల్లో, టీవీ కార్యక్రమాల్లో 'ప్రస్తుతం వైకాపా బలంగా వుంది' అని ఎన్నడూ చెప్పలేదు. అది గతించింది అనుకున్నాక 'ఇప్పుడు బలహీనపడింది' అని మాత్రమే చెప్తూ వచ్చారు. వైకాపా బలాన్ని గుర్తించడానికి మీడియా నిరాకరిస్తోందని అర్థమైంది.

ఉన్నదున్నట్టు చెప్పడమనేది మీడియా ఎప్పుడో మర్చిపోయిందని తిట్టుకుంటూ అక్కడున్న స్నేహితులను అడిగితే – "టిడిపిది మీడియాలో ప్రచారం, వైకాపాది ప్రజల్లో ప్రచారం. వైకాపాను తీసిపారేయడానికి లేదు. క్రైస్తవులను బాగా పోగేశారు. కాంగ్రెసు నుండి దళితులను కూడా బాగా గుంజుకున్నారు. వైయస్ పట్ల అభిమానం కొన్ని వర్గాల్లో యింకా పోలేదు. కాంగ్రెసు వైయస్‌ను వదిలేసుకుంది. దాని ఓట్లు ఎవరికి పోతాయో చూడాలి. మధ్యతరగతి ప్రజల్లో టిడిపి, బిజెపి పట్ల అభిమానం వుంది. కేసుల కారణంగా జగన్ పట్ల వ్యతిరేకత కూడా బలంగానే వుంది. గ్రామీణ ప్రాంతాల్లో వైకాపాకు బలం వుంది. పట్టణాలలో టిడిపికి వుంది." అంటున్నారు. లగడపాటి అన్నారు కదా – 70% ఓటింగు దాటిందంటే టిడిపికి గెలుపని. మధ్యతరగతివాళ్లు కదలి వచ్చి ఓటేస్తే అవి టిడిపికి పడతాయని తాత్పర్యం. తెలంగాణలో సరాసరి 70% దాటినా, హైదరాబాదులో 53% దాటలేదు. అదే పరిస్థితి అక్కడా వస్తే, వైకాపాకు బలం వున్న గ్రామాల్లో 78% పడి, పట్టణాల్లో 62% పడితే, అప్పుడు టిడిపికి గెలుపు అని చెప్పలేం కదా! పైగా వీళ్లు యింకో విషయం మర్చిపోతున్నారు. హైదరాబాదు 53% శాతంలో నాలాగ 'నోటా' నొక్కినవాళ్లు ఎందరో తెలియదు. విభజన అకృత్యంలో అందరూ పాపులే అనే థియరీతో అక్కడి నాలాటి మధ్యతరగతి ప్రజలు, విద్యావంతులు 'నోటా' నొక్కితే టిడిపికి కాని, మరొకరికి కానీ ఏం లాభం?

తెలంగాణ ఎన్నికలలో కంటె ఆంధ్ర ఎన్నికలలో డబ్బు, మద్యం ఏరులై పారుతోందని వింటున్నాం. జగన్ అక్రమార్జన డబ్బే దీనికంతా కారణం అనే ప్రచారం విరివిగా సాగుతోంది. ఇక్కడ గమనించ వలసినదేమిటంటే – ఒకే పార్టీ డబ్బు ఖర్చు పెట్టడం అనే ప్రశ్న ఉత్పన్నం కాదు. ఎదుటివాళ్లు డబ్బుతో గెలుస్తున్నారు అనుకున్నపుడే వీళ్లూ పోటాపోటీగా ఖర్చు పెడతారు. ఓటరుకూడా వాళ్లు 500 యిస్తున్నారు, మీరు 750 యివ్వండి, వెయ్యి యివ్వండి అని బేరమాడతాడు. వైకాపా, కాంగ్రెసు, టిడిపి – మూడిట్లో కాంగ్రెసు కాడి పారేసినట్టే వుంది. తెలంగాణలో ఖర్చు పెట్టి వుండవచ్చేమో కానీ, ఆంధ్రలో రూపాయి పెట్టినా వేస్టు అనే అభిప్రాయానికి హై కమాండ్ వచ్చి వుంటుంది. సోనియా, రాహుల్ ఎంత మొక్కుబడిగా వచ్చారో చూశాం.

ఇక టిడిపి, వైకాపా రెండూ విరివిగా ఖర్చు పెడుతూండవచ్చు. తేడా అంటే ఉన్నీస్‌బీస్ అనుకోవచ్చు. అక్కడున్న అభ్యర్థి మోజు, సత్తా బట్టి ఒక చోట ఒకరిది ఎక్కువ కావచ్చు, మరొక చోట యింకోరిది కావచ్చు. ఇలా ఖర్చు పెడుతున్నది అక్రమంగా సంపాదించినది లేదా అక్రమార్జనకు పెట్టుబడి అనుకోవడం తప్పేమీ కాదు. ఇలాటివారు ఎవరు నెగ్గినా వారు పదవులను ఉపయోగించి అవినీతికి పాల్పడతారని వూహించవచ్చు. ఈ అభ్యర్థులలో చాలామంది మొన్నటిదాకా పదవులు అనుభవించినవారే కదా. ఈ డబ్బు, మద్యం ఎఫెక్టు ఎంతవరకు పనిచేస్తుందో తెలియటం లేదు. 2009లో కూడా చూశాం అభ్యర్థులందరూ డబ్బు తగలేసినా నెగ్గేవాడు ఒకడే. అంటే ఓటర్లు అందరి దగ్గరా డబ్బు తీసుకుని తమకు యిష్టమైనవాడికి ఓటేస్తున్నారన్నమాట. ఇలాటి పరిస్థితుల్లో డబ్బెందుకు ఖర్చు పెడుతున్నారో పెట్టేవారికే తెలియాలి.

ఈ ఫ్యాక్టర్ పక్కన పెట్టి ఆలోచిస్తేనే కథ ముందుకు సాగుతుంది. వైకాపా గ్రాఫ్ స్టడీగా వుంది. గ్రామీణప్రజలు, క్రైస్తవులు,

ముస్లిములలో కొందరు, వైయస్ అభిమానులు దానికి పునాదిగా వున్నారు. అదే సమయంలో ఎట్టి పరిస్థితుల్లో జగన్‌కు ఓటేయకూడదని భీష్మించుకుని వున్న ఓటర్లూ వున్నారు. టిడిపికి హికప్స్ వున్నాయి. అవకాశాలు వస్తున్నాయి, పోతున్నాయి. గతంలో జరిగిన ఉపయెన్నికలలో కాంగ్రెసు, టిడిపి, వైకాపా ముక్కోణపు పోటీలో వైకాపా అమితంగా లాభపడింది. ఇప్పుడు కాంగ్రెసు ఓటు బ్యాంకు చీలుతోంది. ఆ ఓట్లలో కొన్నయినా టిడిపివైపు మళ్లుతాయి కాబట్టి టిడిపి బలపడింది. కానీ బాబు రాజకీయంగా వేస్తున్న అడుగులు సవ్యమైన ఫలితాలను యివ్వడం లేదు. తెలంగాణలో ఏదో బావుకుంటామనుకుని విభజనకు వంతపాడారు. ఇప్పుడు అక్కడేం జరిగింది? తెరాసయా, కాంగ్రెసా అంటున్నారు. సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేయలేకపోతే తెరాసకు బిజెపి మద్దతు యిచ్చినా యివ్వవచ్చు – తెరాసకు మొత్తం టిడిపి కంటె ఎక్కువ పార్లమెంటు సీట్లు వస్తే! విభజనకు వంతపాడి బాబు పోగొట్టుకున్నదే ఎక్కువని తేల్తోంది.

అది చాలనట్టు యీ బిసి రంధి పట్టుకుంది. ఢిల్లీలో కూర్చున్న కాంగ్రెస్ అధినేతలు ఉత్తరభారతంలోని ఫార్ములాలను యిక్కడ అమలు చేయబోయి దెబ్బతింటారు. వాళ్ల కులాల సమీకరణలు వేరు. బిసిలకు, సోషలిస్టు ఉద్యమానికి లింకు వుంది. ఇక్కడ సోషలిస్టు ఉద్యమం బలపడలేదు. సోషలిస్టు ఉద్యమం నడిచిన ఉత్తరప్రదేశ్, బిహార్‌లలోనే బిసిలు రాజకీయంగా బలపడ్డారు. ఆ ఉద్యమం లేని బెంగాల్, ఒడిశా, గుజరాత్, రాజస్థాన్ వంటి అనేక రాష్ట్రాలలో బిసిలకు రాజ్యాధికారం దక్కలేదు కదా! కులరహిత సమాజం పేరుతో ద్రవిడ ఉద్యమం కూడా బిసిలనే ఫోకస్ చేసింది కాబట్టి తమిళనాడులో, నారాయణగురు వంటి సామాజిక ఉద్యమకార్యకర్తల కారణంగా కేరళలో బిసిలకు అధికారం సిద్ధించింది. తెలుగునాట అవేమీ లేవు. బిసిలకు రిజర్వేషన్లు ప్రతిపాదించిన మురళీధరరావు కమిషన్ రిపోర్టును ఎన్టీయార్ అమలు చేస్తానని ప్రకటించిన సభలో నేనున్నాను. ఆయన చాలా ఆర్భాటంగా దేవుడు ప్రత్యక్షమై వరం యిచ్చినంత హంగామాతో నాటకీయంగా ఎనౌన్సు చేశాడు. సభలో చప్పట్లు మోగలేదు. సాధారణ ప్రజలెవరికీ ఆ కమిషన్ గురించి ఏమీ తెలియదు. ఇదీ యిక్కడి రాజకీయ చైతన్యం!

ఉత్తరప్రదేశ్‌లో బియస్పీ ఆ మధ్య ఎన్నికలలో బ్రాహ్మణ, దళిత కాంబినేషన్‌తో ఎన్నికలు గెలిచింది. వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో బియస్పీ శాఖను యాక్టివైజ్ చేసి అదే సమీకరణంతో ఎన్నికలలో పోటీ చేస్తామని హంగు చేశారు. మాయావతిని రప్పించారు. ఉత్తరప్రదేశ్‌లో బ్రాహ్మణుల సంఖ్యాబలం, ఆర్థికబలం, రాజకీయబలం యిక్కడికి తీసుకురాలేరు కదా. అందుకనే దానికి పురిట్లోనే సంధి కొట్టింది. ఇప్పుడు కాంగ్రెసు పెద్దలు ఏవేవో లెక్కలు వేసి రాష్ట్ర విభజన చేసేసినట్టే, కాంగ్రెసుకి రెండు ప్రాంతాల్లోనూ బిసి అధ్యక్షుల్ని పెట్టేశారు. పొన్నాలకు ముఖ్యపదవి కట్టబెట్టడంతో తెలంగాణ కాంగ్రెసులో రెడ్లు తిరగబడ్డారని, తెరాస ద్వారా వెలమ ముఖ్యమంత్రి కాకుండా అడ్డుకోవడానికై వైకాపాకు ఓట్లేశారనీ వార్తలు వస్తున్నాయి. ఫలితాలు వచ్చాక అసలు సంగతి తెలుస్తుంది. ఇక ఆంధ్రలో కాంగ్రెసుకు సాంప్రదాయికంగా ఓట్లేసే రెడ్లు ఎలా ఫీలవుతున్నారో చూడాలి. రఘువీరా రెడ్డికి (బిసి) అధ్యక్షపదవి కట్టబెట్టినందు వలన కాంగ్రెసుకు ఏమైనా మేలు చేకూరిందా? అంతెందుకు 2009 ఎన్నికలలో చిరంజీవి బిసి, బిసి అన్నారు, సామాజిక తెలంగాణ అన్నారు. ఏమైనా లాభపడ్డారా?

అదేమీ ఎనలైజ్ చేయకుండా బాబు కృష్ణయ్యగార్ని ఆఖరి నిమిషంలో పార్టీలో చేర్చుకుని తెలంగాణకు బిసి సిఎం అని ప్రకటించారు. ఆ అభ్యర్థి గెలుస్తాడో లేదో తెలియదు. తెరాస సిఎం కాండిడేట్ కెసియార్‌తో ఆయన్ని పోల్చి చూడండి. తూగుతాడా? తెలంగాణలో ఆ ప్రకటన వలన టిడిపి బావుకున్నదేముంది? ఏమీ లేదు. అలాటిది యిప్పుడు ఆంధ్రలో కూడా బిసి, కాపు ఉపముఖ్యమంత్రులు అంటూ బాబు కొత్త ఆఫర్. మ్యేనిఫెస్టోలో లేనివి కొత్తగా చేరుస్తున్నారంటే ఏమిటర్థం? ఎన్నికలలో వైకాపాను ఎదుర్కోవడానికి బలం చాలటం లేదు, కొత్త స్ట్రాటజీ వర్కవుట్ చేయాలి, కొత్త హామీలు యివ్వాలని అనుకున్నారనే కదా! వైకాపాకు మైనారిటీల బలం వుంది, దానితో పోటీ పడాలంటే హిందువులను సంఘటితం చేయాలి అనుకుంటే – కమ్మ సిఎం కాబట్టి రెడ్డి డిప్యూటీ సిఎం అంటే తూకం సరిపోయేది. కాపు ప్లస్ బిసి ఎందుకు?

విభజన తర్వాత టిడిపి అభిమానులందరూ చెప్తూ వచ్చినదేమిటంటే – 'ఇన్నాళ్లూ సమైక్యరాష్ట్రంలో రెడ్లు సంఖ్యాపరంగా ఎక్కువగా వుండి అధికారం చలాయించారు. ఇప్పుడు విడిపోయింది కాబట్టి ఆంధ్రలో కమ్మ రెడ్డి సమానమవుతారు. కమ్మలు, కాపులతో కలిసి పోటీ చేసి రెడ్లను చెక్‌లో పెడతారు' అని. ఏ కులమైనా, మరో కులంతో కలిసి నడిస్తే మంచిదే. కులాల మధ్య సంకులసమరం నడవాలని ఎవరూ కోరుకోరు. అయితే కమ్మ, కాపు కలుస్తారా? అన్నదే ప్రశ్న. రెండు, మూడు జిల్లాలలో వాళ్లు సమానస్థాయిలో అన్ని రంగాలలో పోరాడతారు. 2009 ఎన్నికలలో చిరంజీవి పార్టీ పెట్టినపుడు కొందరు టిడిపి అభిమానులు నాకు మెయిల్స్ రాశారు – 'ఇన్నాళ్లూ కాపులు కాంగ్రెసుకు ఓట్లేస్తూ వచ్చారు. ఇప్పుడు చిరంజీవి పార్టీ పెట్టాడు కాబట్టి, వాళ్లంతా పిఆర్పీకి ఓట్లేస్తారు. కాపుల ఓట్లు కోల్పోయిన కాంగ్రెసు బలహీనపడుతుంది. కమ్మ, బిసిల ఓట్లు చెక్కుచెదరకుండా టిడిపికి పడతాయి కాబట్టి మహాకూటమిదే గెలుపు' అని. ఈ లెక్కలన్నీ ఎటు పోయాయో కానీ, ఫలితాలు వచ్చాక పీఆర్పీ వలననే టిడిపి ఓడిపోయింది అంటూ వాళ్లే వాపోయారు. కాపులందరూ చిరంజీవికి వేశారా, కాపులే వేశారా అన్నది కూడా నాకు బోధపడలేదు.

సెఫాలజిస్టులు కూడా కులాల వారీగా గణాంకాలతో విశ్లేషించడానికి యిష్టపడతారు. కానీ అన్నదమ్ములు, భార్యాభర్తలు వేర్వేరు పార్టీలకు ఓటేయడం గమనిస్తూ వచ్చిన నాకు ఒక కులం వారందరూ ఒకే పార్టీకి ఓటేస్తారంటే నమ్మబుద్ధి కాదు. ఈ ఫీలింగు నాయకుల్లోనే వుంటుందేమో! అసలు మనుష్యుల ఆలోచనాసరళే వింతగా వుంటుంది. కాలేజీ స్టూడెంట్స్ యూనియన్ ఎన్నికల్లోనే

గమనించాను – నువ్వు ఫలానావాడికి ఎందుకు ఓటేశావ్? అని అడిగితే, 'అందరికంటె ముందు వాడు వచ్చి అడిగాడు కాబట్టి...' అని చాలామంది చెప్పేవారు. చదువుకున్నవాడివి నీకు యిదేం లాజిక్? అని అడిగితే 'నా యిష్టం' అనేవాడు. మా కజిన్ కాలేజీలో 'బండి యెనక బండి కట్టి..' పాట అద్భుతంగా పాడినందుకు ఒకతనికి ఓట్లు గుద్దేశారు. గెలిచేవాడికే ఓటేయాలనే సిద్ధాంతం చాలామందికి వుంటుంది. 'మనకు బాగా తెలిసున్నవాళ్లకు తెలుసు, రేపేదైనా అవసరం పడితే పలుకుతాడు' అని యింకా బోల్డుమందికి లెక్క వుంటుంది. ఇలాటి క్లిష్టమైన మ్యాట్రిక్స్‌లో ఒక కులం ఓట్లన్నీ ఒకరికే ఎలా పడతాయి? చదువుకోనివారిలో, సామాజికంగా నిమ్నకులాలలో కట్టు వుండవచ్చు. కానీ చదువు పెరిగినకొద్దీ, వ్యక్తిగత అభిప్రాయాలు ఏర్పరచుకున్న కొద్దీ యింకోడు చెప్పినవాడికి నేనెందుకు వేయాలి? అనే పౌరుషం వుంటుంది. తండ్రి మాట ఏ విషయంలోనూ వినని పిల్లలు యీ విషయంలో మాత్రం వింటారా? తండ్రిదీ, పిల్లలదీ ఒకే కులం అయినా వేర్వేరు పార్టీలకు ఓటేయవచ్చు కదా!

కులం, మతం ఏమీ లేదు, మా మంత్రం అభివృద్ధి మాత్రమే అంటూన్న నాయకులే మళ్లీ యీ కులాల వారీ పదవులు ప్రకటిస్తారు. కాంగ్రెసు హయాంలో డిప్యూటీ సిఎంలు వున్నారు కానీ టిడిపిలో ఎప్పుడూ లేరు. తను కో-పైలట్ అని నాదెండ్ల భాస్కరరావు చెప్పుకున్నందుకే ఎన్టీయార్‌కు చచ్చేటంత కోపం వచ్చింది. టిడిపిలో అధినాయకుడి మాటే ఫైనల్. వేరే అధికారకేంద్రం సహించరు. నందమూరి వంశస్తులు కాబినెట్‌లోకి వస్తే ఆ ప్రమాదం వుందని గ్రహించే బాబు హరికృష్ణను త్వరలోనే తప్పించారు. దగ్గుబాటి వెంకటేశ్వరరావుకి కూడా త్వరలోనే ఉద్వాసన పలికారు. పార్టీ అధ్యక్షపదవి, ముఖ్యమంత్రి కూడా ఒకరే వుండే సంప్రదాయం టిడిపిది. ఇటువంటి గతం వున్న బాబు యిప్పుడు ఒకరు కారు, యిద్దరు డిప్యూటీ సిఎంలు భరిస్తారంటే వింతగానే వుంది.

పైగా కాపులను బిసిలలో చేర్చేందుకు కమిషన్ వేస్తారట. అంటే ఆ కమిషన్ ఏం చెప్పాలో కూడా ముందే చెప్పేశారన్నమాట! కాపుల్ని బిసిల్లో చేర్చడం గురించి దశాబ్దాలుగా వింటున్నాను. దీనివలన కాపులు సంతోషిస్తారో లేదో తెలియదు కానీ బిసిలకు ఒళ్లు మండడం ఖాయం. వాళ్ల రిజర్వేషన్లు ఆ మేరకు దెబ్బ తింటాయి కదా. పైగా బిసిల కంటె కాపులకు ఆర్థికంగా, రాజకీయంగా బలవంతులు. రిజర్వేషన్ ఫలితాలను వాళ్లే ఎక్కువగా పొందవచ్చు. అయినా కాపుల్నీ బిసిల్లో చేర్చాక, యిద్దరు బిసి డిప్యూటీ సిఎంలు అవుతారు కదా. అది ఎబ్బెట్టుగా వుండదా? సరే ఇదంతా భవిష్యత్తులో జరగాల్సిన కార్యక్రమం. ప్రస్తుతానికి దీనివలన ఓట్లు రాల్తాయా లేదా అన్నది చూడాలి. ఒక కులస్తులే ఒక పార్టీకి ఓటేస్తారో లేదో అని సందేహించే పరిస్థితి. బిసిల్లో వందకు పైగా కులాలున్నాయి. వాళ్లల్లో వాళ్లకు ఎక్కువతక్కువ ఫీలింగులు వుంటాయని ఎబిసిడి.. అనడంతోనే తెలుస్తోంది. ఈ ఎన్నికల్లో మాత్రం మనమంతా సమానం అనుకుంటూ అందరూ కట్టకట్టుకుని ఒకే పార్టీకి ఓటేస్తారా!? నమ్మశక్యంగా లేదు. తెలంగాణలో కమ్మ ఫ్యాక్టర్ పెద్దగా లేదు కాబట్టి బిసిలకు ప్రాధాన్యత యిచ్చినా నడిచింది. ఆంధ్రలో కమ్మవారి జనాభా ఎక్కువ కదా. అక్కడ వారిని పక్కన పెట్టి బిసిలకు పెద్దపీట వేస్తామంటే సహిస్తారా?

జగన్ మైనారిటీ ఓట్లు ఎదుర్కోవడానికి కాబోలు ఎన్నడూ లేనట్లుగా యీ కులపంచాయితీకి ప్రాధాన్యత పెంచారు. అదే సమయంలో మైనారిటీలు చేజారి పోకుండా చూసుకోవడానికే జగన్ గురించి మైనారిటీలకు బాబు ఫిర్యాదు చేశారు. తన కేసుల రీత్యా కేంద్రంలో ఎవరు అధికారంలోకి వస్తే వారికి జగన్ మద్దతు యిస్తారని అందరికీ తెలుసు. ఎటొచ్చీ ఆయన ఆ మాట చెప్పకుండా రాష్ట్రసంక్షేమం కోసం.. అంటున్నాడు. 'మోదీయో, ఎల్లయ్యో ఎవరు వచ్చినా మద్దతు యిచ్చి నిధులు తెస్తా' అంటున్నాడు – మోదీకున్న గ్లామర్ తనకు విఘాతం కలగకుండా చూడడానికి కాబోలు! పార్లమెంటు ఎన్నికలలో ఒక పార్టీకి, అసెంబ్లీ ఎన్నికలలో మరో పార్టీకి వేయడం (క్రాస్ ఓటింగ్ అంటున్నారు) యిటీవల బాగా గమనించాం. 2009 ఎన్నికలలో అసెంబ్లీకి టిడిపికి, పార్లమెంటుకి కాంగ్రెసుకు ఓట్లు వేయడం చేతనే కాంగ్రెస్ ఎంపీలు 33 మంది ఎన్నికయ్యారు. అది మన్‌మోహన్‌కు అప్పుడున్న గ్లామర్. ఆ నిష్పత్తిలో వైయస్‌కు అసెంబ్లీ సీట్లు రాలలేదు. 2014 తెలంగాణ ఎన్నికలలో కూడా క్రాస్ ఓటింగ్ జరిగిందని అందరూ చెప్తున్నారు. అలా చేయడంలో కొందరు తడబడటం చేత తమ పార్టీకి నష్టం వాటిల్లింది అని కూడా కొందరు చెప్పుకుంటున్నారు.

'మోదీకి ప్రధానిగా చూద్దామనుకుంటే చూడండి, కానీ అసెంబ్లీ వరకు నాకే ఓటేయండి, బాబుకి కాదు' అని చెప్పడానికై జగన్ మోదీని ప్రధాని చేయడానికి నాకు అభ్యంతరం లేదు, రాష్ట్రానికి మేలు చేస్తే చాలు.. అన్నట్లు చెప్పారు. టిడిపి పొత్తు వున్నా బిజెపి జగన్ మద్దతును కాదనదు కూడా. ఉత్తరప్రదేశ్‌లో ప్రత్యర్థులైన ఎస్పీ, బియస్పీ యిద్దరూ యుపిఏకు మద్దతు యిచ్చిన సందర్భాలున్నాయి. మోదీ కోసం బాబుకు ఓట్లేయనక్కరలేదని జగన్ తాత్పర్యం. బాబు దాన్ని తప్పు పట్టారు. మైనారిటీల్లారా, బిజెపి మతతత్వ పార్టీ అంటూ వచ్చిన జగన్ దాన్ని మద్దతుకు అర్హమైనదిగా ఎలా భావిస్తున్నారు? అని గుర్తు చేయబోయారు, తను ఏకంగా పొత్తు పెట్టుకున్న విషయాన్ని విస్మరించారు. తమాషా ఏమిటంటే అందరికీ మైనారిటీల ఓట్లూ కావాలి, మోదీ గ్లామర్‌ను ఎన్‌క్యాష్ చేసుకోవడమూ కావాలి.

ఇంతకీ మోదీకి ఆంధ్రలో గ్లామరుందా? సభల్లో పవన్ లేకుండా వట్టి మోదీ, బాబులే మాట్లాడితే జనం ఎలా వచ్చేవారో మరి. మోదీ హిందీ ఉపన్యాసం తెలుగు ప్రజలకు ఎక్కిందా? వెంకయ్య నాయుడు అనువాదం బాగానే వుంది కానీ, ఆయన స్వంతంగా మాట్లాడితే వాడే చమత్కారం అనువాదాల్లో ఉపయోగించలేదు కదా. మోదీ గుజరాత్‌లో రేగిస్తాన్ కచ్ గురించి మాట్లాడితే మనవాళు ్లు కనక్ట్ అయ్యారా? స్థానిక సమస్యల గురించి ఆయన పెద్దగా మాట్లాడలేదు. గుజరాత్ రండి, మా గొప్ప చూడండి, మీరూ నేర్చుకోండి అనే ధోరణే సాగింది. ఇక పవన్‌కు అభిమానుల కేరింతలు బాగానే వచ్చాయి. అతని మాటల్లో నిజాయితీ లేకపోవడం

బయటవాళ్లకు కనబడుతోంది. మోదీ వలన తెలంగాణ వచ్చిందని యిక్కడ చెప్పి, వైయస్ అక్రమాల వలన వచ్చిందని అక్కడ చెపితే ఎలా? విభజన నిర్ణయం తప్పో రైటో యిప్పటిదాకా పవన్ తేల్చలేదు. తనే గందరగోళంలో వున్నట్టు కనబడుతున్నాడు. తెలంగాణలో కాంగ్రెసును, తెరాసను తిట్టాడు. ఆంధ్రకు వచ్చేసరికి తెరాస లేదు కానీ, కాంగ్రెసు వుంది కదా, దాన్ని తిట్టడం అనవసరం అనుకున్నాడు. టిడిపి-బిజెపి కూటమికి ప్రధాన ప్రత్యర్థి జగన్ కాబట్టి జగన్నే తిట్టాడు. గతంలో తను టిడిపిని పెద్దగా ఏమీ అనలేదని చెప్పుకుంటున్నాడు కానీ శుబ్భరంగా తిట్టాడని. ప్రత్యర్థుల పట్ల చిరంజీవి తన ప్రసంగాల్లో పాటించిన మర్యాద పవన్ పాటించలేదని మనందరికీ గుర్తుంది. టిడిపి అంత గొప్ప పార్టీయే అయితే 2009 ఎన్నికలలో ప్రజారాజ్యానికి మద్దతు యిచ్చేబదులు టిడిపికే యివ్వలేకపోయాడా!?

డైలాగులకు చప్పట్లు పడినంత మాత్రాన ఓట్లు పడవని 2009 జూనియర్ ఎన్నికల సభల్లోనే తెలిపోయింది. చిరంజీవి కూడా అదరగొడతారని, కాపుల ఓట్లు కొల్లగొడతాడనీ అన్నారు. పార్టీ పెట్టడానికి ఏడాది ముందు నుండీ హంగు చేశారు. చాలామంది మేధావులు ఆయన పార్టీలో చేరారు. పార్టీ పెట్టిన కొన్ని నెలలకు ఎన్నికలు వచ్చాయి. అంతటి మెగాస్టార్ సైతం ఏ మేరకు ప్రభావం చూపించారో కళ్లారా చూశాం. ఇప్పుడీ పవన్ - చిరంజీవంతటి స్టార్ కాదు, జనసేన పార్టీకై ప్రజలను సన్నిద్ధం చేయలేదు, వెంట ఎవరూ మేధావులు, ఆలోచనాపరులు లేరు. ఒంటికాయ సొంటికొమ్ములా తిరుగుతున్నారు. స్పష్టమైన విధానాలు ప్రకటించలేదు. తనెప్పుడూ కాపుగా చూపించుకోలేదు, కాపులకంటూ ప్రత్యేకంగా చేసినది లేదు. టిక్కెట్టు కొనుక్కుని వస్తేనే కాపునైనా, మరొకరినైనా అలరించాడు. కొనకపోతే కాపులకోసం బెనిఫిట్ షోలు ఆర్గనైజ్ చేయలేదు. ఈ పరిస్థితుల్లో పవన్ వచ్చి చెపితే కాపులందరూ టిడిపి-బిజెపి కూటమికి ఓట్లేసేస్తారని ఎలా అనుకోగలం? యువతలో ఆయనకు ఫాలోయింగ్ వుంది కాబట్టి యువకులను కొంతమేరకు ప్రభావితం చేయగలడు అని అనుకోవచ్చు. అంతకు మించి చెప్పడం అతిశయోక్తియే.

తెలంగాణలో కంటె ఆంధ్రలో పోరు రసవత్తరంగా సాగుతున్నట్టు కనబడుతోంది. ధనప్రవాహం ఒకటే కాదు, హైదరాబాదు నుండి వెళ్లి మరీ ఓట్లు వేస్తున్నారట చాలామంది. అక్కడ ఓటు వేయడానికి యిక్కడి ఓటు దాచుకున్నారట. హైదరాబాదు ఓటింగు శాతం తగ్గడానికి యిది ఒక కారణం కావచ్చు. వీళ్లు వెళ్లి ఎవరికి ఓటేస్తారు? విభజనచేసి తమ బతుకులను అయోమయం చేసిన పార్టీలపై కసి తీర్చుకుంటారా? అలా అయితే వాళ్లు నోటాకు వేయాలి లేదా కిరణ్ సమైక్యపార్టీకే ఓటేయాలి. వేస్తారా? ఈ ఎన్నికలలో తక్కిన పార్టీలన్నీ భవిష్యత్తులో అది చేస్తాం యిది చేస్తాం అని ఉత్తుత్తి హామీలు గుప్పిస్తున్నారు. వర్తమానం, సమీప భవిష్యత్తు ఎంత ఘోరంగా వుందో కిరణ్ ఒక్కరే చెపుతున్నారు. విభజన వలన తెలంగాణకు కూడా నష్టమే అని ఆయన చేసిన వాదనతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. ఆయన పార్టీ అభ్యర్థి మా నియోజకవర్గంలో వుండి వుంటే నేను ఓటేసేవాణ్ని. లేకపోవడం చేతనే నోటాకు వేశాను. 'సమైక్యవాదం కోర్టులో కూడా వీగిపోయింది. అది గతజల 'సేతుబంధనం' అని అనుకోవచ్చు. కోర్టు కేసు కాదు, కలిసి వుండాలనే స్పిరిట్ ముఖ్యం. రెండు రాష్ట్రాలు ఒకరితో మరొకరు సహకరించుకుంటూ కాన్ఫెడరేషన్‌లా వుండాలి. అది లేకపోతే ఎన్నో గొడవలు జరుగుతాయి. కెసియార్ సిఎం అవుతాడంటున్నారు. తన వైఫల్యాలన్నిటికీ ఆంధ్రులనే బాధ్యులను చేస్తాడాయన. దీనికి అక్కడ ప్రతిక్రియ ప్రారంభమవుతుంది. ఇప్పటిదాకా తెలంగాణలో వున్న ఆంధ్రుల గురించి మాట్లాడుతూ వచ్చారు. ఇటీవల వచ్చిన గణాంకాలు చూస్తే వేలమంది తెలంగాణ ఉద్యోగులు, విద్యార్థులు ఆంధ్రలో వున్నారని తెలుస్తోంది. మామూలు పౌరులు కూడా చాలామంది వుండవచ్చు. తెలంగాణ ఉద్యోగ సంఘాలు గ్రామస్థాయి నుండి ఆంధ్రమూలాలున్న ఉద్యోగులు వెళ్లిపోవాలని పట్టుబడుతున్నారు. టి-బిల్లు రాష్ట్రస్థాయి ఉద్యోగుల గురించే చెపుతోందని కేంద్ర కమిటీ అంటోంది. అడుగడుగునా పేచీలు వస్తాయి.

హైదరాబాదు ఆదాయంలో వాటా యివ్వలేదు కాబట్టి ఆంధ్ర పరిస్థితి దయనీయంగా వుంటుంది. అన్నీ గాలిబుడగల్లాటి వాగ్దానాలే. ఏదీ అమలు చేయలేరు. రుణాల మాఫీ అన్నది అర్థం లేని మాట. అంటే రుణం పుచ్చుకోనివాడు, సక్రమంగా చెల్లించినవాడు వెర్రివాడన్నమాట. ఇది దీర్ఘకాలికంగా ఆర్థిక వ్యవస్థను దెబ్బ తీస్తుంది. ఎవడూ అప్పు తీర్చడు. తీర్చడేమోనన్న సందేహంతో అప్పు యిచ్చేవాడు యివ్వడు. ఎలాగైనా అధికారంలోకి రావాలని వీళ్లు హామీలు యిస్తున్నారు. అవి తీరనిరోజున సమాజంలో అశాంతి తప్పదు. కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం ఏర్పడుతుందని ఎవరూ చెప్పలేకుండా వున్నారు. కేంద్రమే అస్తవ్యస్తంగా వుంటే ఆంధ్ర నిరుద్యోగులను ఆదుకునేవారెవరు? కంటికి ఎదురుగా ఉపాధి అవకాశాలతో హైదరాబాదు కనబడుతోంది. ఇక అక్కడకు వచ్చి జబర్దస్తీ చేయడమో, లేక అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనడమో జరుగుతుంది. విభజించేయండి అంటూ హడావుడి చేసినవారెవరూ యివన్నీ క్షుణ్ణంగా పరిశీలించలేదు. ఎన్నో గొడవల్ని అపరిష్కృతంగా వదిలేశారు. ఈ నేరంలో పాలు పంచుకున్నవారందరినీ శిక్షించకుండా వదిలేయకూడదనే నా భావన. వదిలేస్తే 'వీళ్లను ఏం చేసినా ఫర్వాలేదు, ఏవో నిధులు విదిలిస్తామని హామీలు చూపితే చాలు తోక వూపుకుంటూ ఓట్లేస్తారు' అనే అభిప్రాయానికి వచ్చేస్తారు. రేపు యింకో రాష్ట్రాన్ని యిదే పద్ధతిలో చీలుస్తారు. తెలుగువారందరూ తమ కసిని ఓట్ల ద్వారా చూపలేకపోతే నోటా ద్వారానైనా చూపాలని నా ఆశ. కిరణ్ సమైక్యపార్టీ వీటన్నిటి గురించి మాట్లాడుతోంది. కానీ కిరణ్ నాయకత్వంపై తక్కిన నాయకులెవరికీ నమ్మకం లేకపోవడం వలన దానికి ఆదరణ లేకుండా పోయింది. ప్రజలైనా ఆదరిస్తారని మీడియా చెప్పడం లేదు.

కానీ కిరణ్ పార్టీ కొన్నయినా ఓట్లను తప్పక చీలుస్తుందని నా అభిప్రాయం. అలాగే కాంగ్రెసు కూడా. టిడిపి, వైకాపా అభిమానులు ఎదుటి పార్టీకి బలం వుందని అంగీకరిస్తూనే తమ పార్టీకి 100కు పైగా వస్తాయని, ఎదుటివాళ్లకు 60 చిల్లర వస్తాయని అంటున్నారు. అంటే కాంగ్రెస్, జెయస్పీ, లెఫ్ట్, బిజెపి, యిండిపెండెంట్స్, రెబెల్స్ వీళ్లందరికీ కలిపి పదిలోపే వస్తాయా? అది తర్కబద్ధంగా లేదు.

నా ద ృష్టిలో వాటన్నిటికి 15–20 సీట్లు తప్పకుండా పోతాయనుకుంటున్నాను. తక్కిన 155–160 సీట్లు వైకాపా, టిడిపిలు పంచుకోవాలి. ఒకరికి 100 వస్తే తక్కినవాళ్లకు 55–60. 90–95 వస్తే 65–70. మరి ఏ పార్టీకి ఛాన్సుంది? ప్రాంతీయాభిమానం బట్టి చెప్పాలంటే బాబు, జగన్ యిద్దరూ రాయలసీమ వారే. కానీ రాయలసీమ గురించి జగన్ మాట్లాడినంతగా బాబు మాట్లాడరు. రాజధాని సీమకు, కోస్తాకు మధ్య పెడతానని, పేరులో రెండు పేర్లు కలిసి వచ్చేట్లు పెడతాననీ జగన్ బహిరంగంగా అనేశారు. బాబు మరో సింగపూర్ అంటారు కానీ అది ఎక్కడ కడతారో చెప్పరు. ఎందుకంటే జగన్‌లా రాయలసీమను ఫేవర్ చేస్తూ మాట్లాడితే ఆయనకు పట్టు బాగా వున్న విజయవాడ–గుంటూరు బెల్టు ఆగ్రహిస్తుందేమోనని భయం. 1953లోనే తమకు రాజధాని వచ్చి వుండాల్సిందని, యిప్పుడు వచ్చి తీరాలని ఆ ప్రాంతవాసులకు స్ట్రాంగ్ ఫీలింగు వుంది. గుంటూరుకు హైకోర్టు యిచ్చి సరిపెట్టి, రాయలసీమవైపుకి రాజధాని యిస్తారేమోనన్న భయమూ వుంది. ఇది గ్రహించిన బాబు యిక్కడ కూడా రెండు కళ్ల సిద్ధాంతం అమలు చేసి, మౌనం పాటిస్తున్నారు. లౌక్యం అన్ని చోట్లా పనికి రాదు.

పైగా బాబు కంటె వైయస్సే రాయలసీమ గురించి ఎక్కువ మాట్లాడుతూ వచ్చారు. బాబు చిత్తూరుకి చేసినదాని కంటె, వైయస్ కడపకు చేసినది చాలా ఎక్కువ. అందువలన రాయలసీమ వాసులు బాబు కంటె జగన్‌నే ఎక్కువ ఆదరిస్తారని అనిపిస్తోంది. రాయలసీమలో జగన్‌కు వున్న ఎడ్జ్ కోస్తాలో బాబుకి వుందా లేదా అన్నది చూడాలి. వైజాగ్‌లో విజయమ్మను నిలబెట్టి జగన్ ఉత్తరాంధ్రలో వైకాపా కార్యకర్తలకు ఉత్సాహం తెచ్చిపెట్టారు. ఆమెకు దీటుగా ఏ పురంధరేశ్వరో నిలబడితే పోటీ రంజుగా వుండేది. కానీ బిజెపి తరఫున హరిబాబు వంటి వీక్ కాండిడేట్‌ను నిలబెట్టారు. 2009 ఎన్నికలలోనే ఉత్తరాంధ్ర టిడిపి చేజారింది. వైయస్‌ను ఆదరించింది. అదే విధంగా తూర్పుగోదావరి జిల్లా కూడా..! ఇప్పుడు అదే అభిమానం జగన్‌పై చూపితే వైకాపాకు లాభమే. టిడిపి కాంగ్రెస్ నుండి ఫిరాయింపుదారులను తెచ్చుకుని, బిజెపితో పొత్తు పెట్టుకుని, తన అవకాశాలను దెబ్బ తీసుకుందనే నా అనుమానం. ఇలా లెక్కవేసి చూస్తే వైకాపాకు 100 సీట్లు వస్తాయని అనిపిస్తుంది.

కానీ యిక్కడో ఫ్యాక్టర్ వుంది. వైకాపా అనిల్ ద్వారా మతమార్పిళ్లు బాగా చేయించి, క్రైస్తవులను తన ఓటుబ్యాంకుగా చేసుకుంటోందని, పాస్టర్లను చేరదీస్తోందని, వాళ్లను రాజకీయాల లబ్ధికి ఉపయోగించుకుంటోందని ప్రజలు నమ్ముతున్నారు. జగన్ తిరుపతి గుడిలో సంతకం పెట్టడానికి తిరస్కరించడం వంటివి దానికి తోడయ్యాయి. ఆయన క్రైస్తవుడని జగానికంతా తెలుసు. అయినా గుడికి వచ్చాడంటే సంతోషమే. అక్కడ సంతకం పెట్టడం నియమం, మర్యాద, ధర్మం. పెట్టనని మొరాయించడం గుడి నియమాల పట్ల నిరాదరణ, హిందువులను బాధించే చర్య. ఈ క్రైస్తవ పునరుత్థానానికి అడ్డుకట్ట వేయకపోతే హిందూమతం ప్రమాదంలో పడుతుందని హిందూ సంస్థలు ప్రచారం చేస్తున్నాయి. వాటికి బిజెపి, మోదీ తోడయ్యారు. హిందువుల్లో, మధ్యతరగతి ప్రజల్లో యీ భావం రగిలితే మాత్రం జగన్ వ్యతిరేక ఓట్లు పెరుగుతాయి. అంతేకాదు, పవన్ బాగా హైలైట్ చేయడం వలన కెసియార్‌తో జగన్ కుమ్మక్కయ్యాడని కూడా జనాలు నమ్ముతున్నారు. తమ పట్ల విషం చిమ్ముతున్న కెసియార్‌ను పన్నెత్తి ఒక్క మాట పలకని జగన్ పట్ల ఆంధ్రులు అంత ఉదారంగా వుండకపోవచ్చు. ఈ కారణాల చేత వైకాపా ఏ 90 దగ్గరో అటూయిటూగా ఆగిపోయినా ఆశ్చర్యం లేదు. మోదీ మ్యాజిక్ నిజంగా పనిచేసి మధ్యతరగతి ప్రజలు బిజెపి–టిడిపికి యిబ్బడిముబ్బడిగా ఓట్లు వేస్తే మాత్రం యీ అంకెలు టిడిపికి వస్తాయి! బాబు చేసిన పోరబాట్ల వలన, తెలంగాణ కాంగ్రెస్ తరహాలో టిడిపికి వెన్నుపోట్లు తగిలి యీ అంకె చేరకపోవడానికే ఛాన్సుంది. (సమాప్తం)

**– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

**మే 9 -10 వీక్లీకై** **ఎమ్బీయస్ : నిజాంకు మహర్దశ**

తెలంగాణలో ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేస్తారో కచ్చితంగా చెప్పటం లేదు. తెరాసకు అవకాశాలు ఎక్కువున్నాయంటున్నారు కానీ సొంతంగా చేస్తుందా, వేరే ఎవరి మద్దతైనా తీసుకుంటుందా అన్నది తేలలేదు. మోదీని సన్నాసి అన్నాక బిజెపి మద్దతు తీసుకోకపోవచ్చు. కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకుంటే గతంలో చేసినట్లు వాళ్లు తెరాసను చీలుస్తారేమోనన్న భయం వుంది. అందువలన మజ్లిస్ అయితే మంచిదని అనుకుంటున్నారట. మజ్లిస్ వద్ద కాంగ్రెస్ ఆల్‌రెడీ క్యూ కట్టి వుంది. స్నేహపూర్వకమైన పోటీ అంటూనే మజ్లిస్ తమకు ద్రోహం చేసిందని టి–కాంగ్రెస్ నాయకులు మొత్తుకున్నా పొన్నాల గతం మర్చిపోయి మజ్లిస్‌తో పొత్తు పెట్టుకుందాం అంటున్నారు. మజ్లిస్ ఎటూ తేల్చటం లేదు. ఒవైసీ కృష్ణుడిలా నిద్ర నటిస్తూ వుంటే దుర్యోధన, అర్జునుల్లా కాంగ్రెస్, తెరాస ఒకళ్లు తల దగ్గర, మరొకళ్లు కాళ్ల దగ్గర వేచి వున్నారు. మే 16 తర్వాత గానీ శ్రీవారు నిద్ర లేవరట. లేచి ఎవరో ఒకరికి తల వూపవచ్చు. రాబోయే తెలంగాణ ప్రభుత్వంలో మజ్లిస్ ప్రముఖపాత్ర వహిస్తుందని సులభంగా వూహించవచ్చు. అదే జరిగితే ఉర్దూ ప్రాముఖ్యత పెంచాలని, తెలుగుతో సమానహోదా కల్పించాలని యిలాటి డిమాండ్లు తప్పక వస్తాయి. ఒవైసీ సీమాంధ్రులను లింగ్విస్టిక్ మైనారిటీలుగా గుర్తించాలని కూడా ఓ దశలో డిమాండ్ చేశారు. నాకైతే దానిలో లాజిక్ అర్థం కాలేదు. సీమాంధ్రులు తెలుగు కాక వేరే భాష మాట్లాడతారా? భాష గురించి సరేగానీ, నిజాం నవాబుకి మహర్దశ పడుతుందని అనిపిస్తోంది నాకు. టాంక్‌బండ్‌పై కొన్ని విగ్రహాలకు స్థానచలనం తప్పదని కూడా...!

నన్నయ, తిక్కన, త్యాగయ్య వరకు సహిస్తారేమో, సంఘసంస్కర్తలైన రఘుపతి వెంకటరత్నం నాయుడు, గురజాడ వామపక్షీయుడైన

శ్రీశ్రీ వాళ్లని స్పేర్ చేయవచ్చు. 'సి ఆర్ రెడ్డి, బళ్లారి రాఘవ, త్రిపురనేని రామస్వామి చౌదరి, ముట్నూరి కృష్ణారావు వంటి వారి కార్యక్షేత్రం ఆంధ్రయే కదా, వాళ్ల విగ్రహాలు వాళ్లని పట్టుకుని పొమ్మనమందాం, విగ్రహాలు పెట్టవలసిన మనవాళ్లు చాలామంది వున్నారు, వారికి యిక్కడ చోటు చాలవద్దా?' అని ఎవరైనా వాదించవచ్చు. కెబియార్ పార్కు పేరు మారుస్తామని కెసియార్ ప్రతిజ్ఞ చేశారు కదా, యిలాటివి పెద్ద విషయం కాదు. ఇప్పుడున్న విగ్రహాలకు తోడుగా కానీ, వారి స్థానంలో గాని వచ్చి చేరే విగ్రహాలలో ఏడో నిజాంది వుండవచ్చని నా అనుమానం. ఎందుకంటే మజ్లిస్ వాళ్ల కంటె ఎక్కువగా కెసియార్ నిజాంను కీర్తించారు. కెసియార్ పాటనే చాలామంది తెలంగాణ శాసనసభ్యులు కూడా అసెంబ్లీలో వినిపించారు. మామూలుగా అయితే చరిత్ర గురించి ఎవరూ పట్టించుకోరు. తెలంగాణ తీర్మానంపై చర్చ ధర్మమాని ఏడో నిజాం మంచిచెడ్డల గురించి శాసనసభ్యులు వాదోపవాదాలు చేసుకున్నారు. ఆయన ఉస్మానియా యూనివర్శిటీ, ఉస్మానియా ఆసుపత్రి కట్టించి విద్య, వైద్యం ప్రోత్సహించాడని ఒకరంటే, అంత మంచివాడైతే ఆయనకు వ్యతిరేకంగా సాయుధపోరాటం ఎందుకు చేశారట? అని మరొకరు అడిగారు. భగవద్గీత అనువాదానికి డబ్బిచ్చి, తిరుపతి గుడికి డబ్బులు పంపి, హిందువుల పట్ల ఆదరం చూపాడంటే ఒకరంటే, హిందువుల పట్ల వివక్షత చూపి ఇస్లాంలోకి మతమార్పిడులు ప్రోత్సహించాడని మరొకరు అన్నారు. ఇంతకీ ఆయన ఎలాటివాడు? ఎవరు నిజం చెపుతున్నారు? నిజాంల పాలన గురించి నేను వెబ్‌సైట్లో రాస్తున్న "నిజాం కథలు" సీరియల్‌లో అనేక వివరాలు యిస్తున్నాను. అవి చదివే ఓపిక లేనివారికి ఆయన గురించిన వాస్తవాలు క్లుప్తంగా యీ వ్యాసంలో యిస్తున్నాను.

సాయుధపోరాటం జరిపినది, పోలీసు చర్య ద్వారా పటేల్ గద్దె దింపినదీ ఏడో నిజాం ఉస్మాన్ ఆలీ ఖాన్‌ని. అతని తండ్రి, ఆరో నిజాం అయిన మహబూబ్ ఆలీ ఖాన్ (ఆయన విగ్రహం ప్రస్తుతం టాంక్‌బండ్‌పై వుంది) ఉదారుడు, నిదానస్తుడు, కుట్రలకు, కుతంత్రాలకు పోయేవాడు కాదు. రోజువారీ పనులను దివాన్లకు అప్పగించి విలాసంగా జీవితం గడిపేవాడు. హంగూ ఆర్భాటంతో ఆర్థికవ్యవస్థను కుప్పకూలే స్థితికి తెచ్చాడు. అతని వారసుడు ఉస్మాన్ నిరాడంబరుడు, నిర్మోహమాటి, సంశయజీవి. గోప్యత ఎక్కువ, కుట్రలు ప్రోత్సహించేవాడు. తన మాటే చెల్లాలన్న మంకుపట్టుంది. దివాన్లను నమ్మకుండా తరచుగా మార్చేవాడు. 1911లో తండ్రి మరణానంతరం ఉస్మాన్ రాజ్యానికి వచ్చాడు. 1949లో భారతసైన్యం చేతిలో ఓడిపోయి సింహాసనం వదిలిపెట్టాడు. ఈ 38 ఏళ్ల పాలనను రెండు భాగాలుగా విడగొట్టవచ్చు. తొలి 20 ఏళ్లు అతడు సంస్కరణలు చేసి, ప్రాజెక్టులు కట్టి కొన్ని మంచిపనులు చేశాడు. తనకు 45 వచ్చేసరికి అంటే 1931 నాటికి అతనిలో మార్పు వచ్చింది. సంస్కరణలు వెనకబడ్డాయి. తర్వాతి కాలంలో పెడదారి పట్టాడు. పరిపాలనలో ఆఖరి పుష్కరకాలం అధ్వాన్నంగానే నడిచిందని చెప్పాలి.

మొదటగా గమనించవలసినదేమిటంటే – నిజాం హైదరాబాదును తప్పించి తక్కిన ప్రాంతాలను పట్టించుకోలేదు. నీటి సౌకర్యం కోసం ప్రాజెక్టులు కట్టాడు తప్ప, పట్టణాలలో, గ్రామాల్లో నివాస సౌకర్యాలు వుండేవి కావు. అందుకని డబ్బున్నవాళ్లందరూ గ్రామాల్లో భూములున్నా హైదరాబాదులోనే కాపురం వుండేవారు. జిల్లాలలో చాలా పట్టణాలకు విద్యుత్ సౌకర్యం కూడా వుండేది కాదు. ఇక గ్రామీణ ప్రాంతాల మాట చెప్పనే అక్కరలేదు. నిజాంలు తమ కోసం, తన బంధువుల కోసం హైదరాబాదులో భవంతులు కట్టుకుంటే, ఆ నగరానికి డ్రైనేజి సౌకర్యం ఏర్పాటు చేస్తే, చెరువులు తవ్విస్తే వాటిని చూపి అభివృద్ధి అనుకోమంటారు కొందరు. దేశంలోని నగరాల్లో ఐదో స్థానంలో రాజధాని వుండి, అధమస్థానంలో తక్కిన వూళ్లు వుంటే అదేం గొప్ప? పాలన ఎలా వుందో తెలుసుకోవాలంటే తలసరి ఆదాయం ఎలా వుందో, రాజ్యం మొత్తంమీద విద్య, వైద్య సౌకర్యాలు ఎలా వున్నాయో, శాంతిభద్రతలు ఎలా వున్నాయో, ప్రజల హక్కులు ఏ మేరకు కాపాడబడ్డాయో, అధికారుల దాష్టీకంపై నియంత్రణ ఎలా వుందో... యిలాటివి చూసి అప్పుడు అంచనా వేయాలి. ఆ విధంగా చూస్తే పాలకుడిగా నిజాంకు చాలా తక్కువ మార్కులు పడతాయి. 1914లో నిజాం రాజ్యంలో అక్షరాస్యత 2.8% ! చదువుకున్నవాళ్లు తనకు ఎదురు తిరుగుతారన్న భయం కొద్దీ నగరంలో తప్ప వేరెక్కడా కాలేజీలు, హైస్కూళ్లు లేకుండా చేశాడు. గ్రామాలో బళ్లు వుండేవి కావు. పట్టణాలలో వున్నవి కూడా స్థానికుల మాతృభాషలో కాదు, ఉర్దూ మీడియంలో! 1956 నాటికి తెలంగాణలో వున్న మొత్తం స్కూళ్ల సంఖ్య ఒక్క గుంటూరు జిల్లాలోని స్కూళ్ల సంఖ్యకు సమానం కాదు. ఇక నిజాం రాజ్యం ఏ విధంగా గొప్పదనుకోవాలి?

పదవి చేపట్టగానే ఉస్మాన్ వెట్టి చాకిరీని, దేవదాసీ వ్యవస్థను నిషేధించాడు. సంపన్నులు ఆడే కోడిపందాలు, ఎడ్లపోటీలను కట్టడి చేశాడు. ప్రభుత్వోద్యోగుల కోసం జమీందారులు ఏర్పరచే గానాబజానాలను నిషేధించాడు. కోర్టు గదుల్లో పొగతాగడం నిషేధించి డ్రస్ కోడ్ విధించాడు. ఈ నిషేధాలన్నీ ప్రజలకోసమే. తను మాత్రం వ్యక్తిగత స్థాయిలో ఏ సుఖాన్నీ వదులుకోలేదు. అజంతా, ఎల్లోరా గుహల్లోని చిత్రాలు కాపాడడానికి చర్యలు తీసుకున్నాడు. హైదరాబాదులో హైకోర్టు కట్టించాడు. మూసీనది పొడవునా కరకట్టలు పటిష్టపరిచాడు. మూసీపై డ్యామ్‌ను నిర్మించాడు. ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ తవ్వించాడు. వీధులు విస్తరించాడు. సిమెంటు రోడ్లు వేశాడు. 1000 కెవి థర్మల్ స్టేషన్ నెలకొల్పారు. నగర అభివృద్ధికోసం ట్రస్టును ఏర్పరచాడు. తన రాజ్యాన్ని సముద్రం అవతలికి విస్తరించాలంటే సముద్రతీరానికి మార్గం వుండాలని యోచించిన నిజాం మడగావ్ రేవుకు చేరడానికై హైదరాబాదు నుండి గదగ్‌కు రైల్వే లైను వేయించాడు. 1935 నాటికి ఉస్మాన్‌కి తన రాజ్యంపై పూర్తి పట్టు లభించింది. రాజ్యపు ఆర్థికపరిస్థితి చాలా బావుంది. అనేక నీటిపారుదల ప్రాజెక్టులు పూర్తయ్యాయి. నిజాం కట్టించిన ప్రాజెక్టుల్లో తలమానికమైన నిజామాబాద్‌లో నిజాం సాగర్, మహబూబ్‌నగర్‌లో కోయిల్ సాగర్, ఖమ్మంలో వైరా, పాలేరు ప్రాజెక్టులు పూర్తయ్యాయి. మద్రాసు రాష్ట్రంతో తుంగభద్ర

జలాల పంపిణీపై 80 ఏళ్లగా నానుతున్న సమస్య ఒక కొలిక్కి వచ్చి సామరస్యంగా పరిష్కారమైంది. మరిన్ని ఎకరాల భూమి సాగులోకి వచ్చింది. ఇలా రావడంతో వ్యవసాయంలో మార్గదర్శకం వహించాలని కోరుతూ కోస్తా ప్రజలను నిజాం ఆహ్వానించాడు. వారు వచ్చి తెలంగాణలో స్థిరపడ్డారు.

మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ప్రజాధనాన్ని బ్రిటిషువారికి సమర్పించి, నిజాం పెద్ద పెద్ద బిరుదులు పొందాడు. వారి నుండి అమితమైన అధికారాలు పొంది పోనుపోను నియంతగా మారిపోయాడు. పన్నులపై వచ్చే ఆదాయంలో ఎంతభాగం నిజాం తీసుకోవచ్చు అనేదానిపై ఆంగ్లేయుల నియంత్రణ వుండేది. వారిని ఖుషామత్తు చేసి తన రాజభరణాన్ని 50 లక్షల రూపాయలకు పెంచుకున్నాడు నిజాం. అంతేకాదు, నజరానాల రూపంలో పదవులు ఆశించే జమీందార్ల నుండి, ఉద్యోగార్థుల నుండి బోల్డంత డబ్బు, కానుకలు వసూలు చేసేవాడు. నజరానా చెల్లించినవారు అసమర్థులైనా, అవినీతిపరులైనా సరే పదవులు యిచ్చేసేవాడు. ప్రజల సమస్యలను తెలుసుకోవడానికి తొలినాళ్లలో రాజ్యంలో పర్యటనలు చేసిన నిజాం తర్వాతి రోజుల్లో కానుకలు వసూలు చేసుకోవడానికి మాత్రం వెళ్లేవాడు. ఉస్మానియా యూనివర్శిటీ పెట్టాడు కానీ దానిలో బోధనా భాష ఏది? జనాభాలో 14% మాట్లాడే ఉర్దూ! తెలుగు (48%), మరాఠీ(26%) , కన్నడ (12%) భాషలకు దానిలో చోటు లేదు. ప్రజల్లో 85% మంది హిందువులు, 12% మంది ముస్లిములు వుంటే ఉద్యోగులలో అధికశాతం ముస్లిములే. వారు కూడా యితర ప్రాంతాల నుండి వచ్చినవారు. సిద్దిక్ దీన్‌దార్ అనే వ్యక్తి మతమార్పిడులను ప్రోత్సహిస్తూ ఉద్యమం నడిపాడు. సిద్దిక్ చర్యలకు తమకు సంబంధం లేదని ప్రభుత్వం ప్రకటించింది కానీ హిందువులు నమ్మలేదు. ఈ వివక్షతకు, మతమార్పిడికి వ్యతిరేకంగా ఆర్యసమాజ్ 1937 నుండి పోరాడసాగింది. అంతకుముందే 1926లో మజ్లిస్ ఏర్పడింది. నిజాం రాజ్యంలో స్థానిక ముస్లింల దుస్థితి బాపడానికి సంస్కరణవాదంతో ప్రారంభమైంది. కానీ దేశంలోని యితర ప్రాంతాల్లో ఎదుగుతున్న ముస్లిం లీగ్‌తో కలిసి పనిచేయసాగింది. ఇది కాక కాంగ్రెస్ కూడా యిక్కడ శాఖ ప్రారంభించింది. సివిల్ లిబర్టీస్ వారు కూడా పోరాడేవారు.

నిజాం వీళ్లందరినీ అణిచివేయడానికి చూశాడు. ఎలాటి ఉద్యమకారులైనా సరే అంతిమంగా తన అధికారానికి ముప్పుగా తయారవుతారని అతని భయం. వీళ్లని జైల్లో పెట్టాడు. పత్రికలు పెట్టనిచ్చేవాడు కాడు. సభలు జరపనిచ్చేవాడు కాడు. జమీందార్ల ద్వారా ప్రజలను అణచివేసేవాడు. వారి స్వేచ్ఛను హరించాడు. రాజ్యంలో మూడోవంతు జాగీర్ల రూపంలో వుంది. రాజ్యం యొక్క మొత్తం ఆదాయం 8 కోట్ల రూపాయలుంటే దానిలో 70% ఆదాయం 19 మంది జాగీర్దార్లకు వచ్చేది. జాగీర్దార్లు తమ సొంత ప్రాంతాలలో ప్రభుత్వ ప్రాంతాలతో పోలిస్తే పది రెట్ల పన్నులు వసూలు చేసేవాళ్లు, ప్రజలను పీడించేవారు. వెట్టి చాకిరీ మళ్లీ వచ్చేసింది. నజరానాలు ముడుతున్నందున నిజాం నోరెత్తేవాడు కాడు. 1940ల నుండి నిజాం ప్రజల్లోకి రావడం మానేశాడు. నల్లమందుకి అలవాటు పడ్డాడు. ఏ దివాన్‌ను సవ్యంగా పాలించనివ్వలేదు. ఇంతలో రెండవ ప్రపంచయుద్ధం వచ్చింది. బ్రిటన్‌కు విపరీతంగా సహాయం చేసి వాళ్ల ఆదరాన్ని మరింతగా పొందాడు. భారతదేశం నుండి విడిచిపెట్టే రోజు వస్తే తన రాజ్యం తనకు అప్పగించి వెళతారని నమ్మాడు. కాంగ్రెసు అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యం వస్తుందని, అది నిజాం రాజ్యం పొలిమేరల్లోకి రాకుండా వుండాలని మజ్లిస్, నిజాం కోరుకున్నారు. తన రాజరికం కొనసాగడానికి నిజాం మజ్లిస్ చెప్పినట్టు ఆడసాగాడు. 1947లో బ్రిటిషువాళ్లు వెళ్లిపోయారు. తన రాజ్యం నెలకొల్పడానికి యిదే అదను అనుకున్నాడు నిజాం. పూర్వం తన ఏలుబడిలో వున్న మచిలీపట్నం, బీరారు అన్నిటినీ మళ్లీ సంపాదించాలనుకున్నాడు.

దివాన్ సి.పి.రామస్వామి అయ్యర్ ప్రోద్బలంతో ట్రావన్‌కూర్ సంస్థానం తాము స్వతంత్ర రాజ్యమని 1947 మే 9న ప్రకటించుకుంది. నిజాంకు అది ఆదర్శప్రాయమైంది. జూన్ 6న ఆయనా ఒక ఫర్మాన్ విడుదల చేసారు – బ్రిటిషు పాలన అంతరించడంతో తన స్వతంత్ర్యం తనకు తిరిగి వచ్చిందని ఆయన ప్రకటించుకున్నారు. 'ఆజాద్ హైదరాబాద్ జిందాబాద్ – అల్ హజ్రత్ పాయిందాబాద్' అనే నినాదాల మధ్య చార్మినార్‌పై అసఫ్ జాహీ పతాకం ఆవిష్కరించబడింది. నిజాంను ఎగదోసినది కాశీం రజ్వీ నాయకత్వాన రజాకార్లు. రజాకార్లు చేసిన దోపిడీలు, ఘాతుకాలు అన్నీ యిన్నీ కావు. నిజాం వాళ్లను ఏమీ అనలేదు. రజ్వీ బంగాళాఖాతం దాకా తన రాజ్యాన్ని విస్తరింపచేస్తాడని ఆశ పెట్టుకుని నిజాం అతని చేతిలో కీలుబొమ్మగా మారాడు. జాగీర్దార్లకు, రజాకార్లకు, కాంగ్రెసువారికి, కమ్యూనిస్టులకు మధ్య తన రాజ్యంలో అంతర్యుద్ధం జరిగినా పట్టించుకోలేదు. తను స్వతంత్ర రాజుగా వెలగాలి. భారత్‌తో కుదరకపోతే పాకిస్తాన్‌లో విలీనమవ్వాలి. తన రాష్ట్రంలో 85% మంది హిందువుల మనోభావాలు ఎలా వున్నా తనకు అనవసరం. ఈ స్వార్థబుద్ధే నిజాం కొంప ముంచింది. 1948లో పోలీసు చర్యతో సర్దార్ పటేల్ నిజాం ఆశలు అడుగంటించాడు.

ఇదీ చరిత్ర. 38 ఏళ్ల పాలనలో నిజాం కొన్ని ప్రజోపయోగమైన పనులు చేస్తే, హైదరాబాదును సుందరంగా తీర్చిదిద్దితే, సొంత ఖజానాలో కోట్లాది రూపాయలు పోగేసుకుంటే అది గొప్ప కాదు. అతని పాలనలో జమీందార్లు బాగుపడ్డారు. ప్రజలను పీడించారు. ప్రజలను బానిసత్వంలో వుంచి, వారి జీవితంలో చీకట్లు నింపిన న నిజాం మంచి పాలకుడు ఎప్పటికీ కానేరడు. 'మా నిజాం రాజు, తరతరాల బూజు' అని మహాకవి దాశరథి చెప్పినది అక్షరాలా సత్యం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

**మే 11 –12 వీక్లీకై** **ఎమ్బీయస్ : విభజన ఎవరికి లాభించింది?**

రాష్ట్రవిభజన రాజకీయ కారణాల చేతనే జరిగిందని అందరికీ తెలుసు. కాంగ్రెస్ ఏం లెక్కలు వేసుకుని దీన్ని తలకెత్తుకుందో, బిజెపి మరేం ల్కెలు వేసుకుని పాలుపంచుకుందో మాత్రం తెలియదు. అయితే వాళ్లకు రాజకీయలబ్ధి చేకూరిందా, చేకూరితే ఏ మేరకు, మరెవరికి లాభించింది చూదాం. మొదట కాంగ్రెసు – ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెసు పరిస్థితి ఘోరంగా వుంది కాబట్టి రాహుల్ గాంధీని ప్రధానిగా చేసే లక్ష్యంతో విడగొట్టి లాభం పొందుదామని చెప్పారు. చూడబోతే తల్లకిందులుగా తపస్సు చేసినా రాహుల్ ప్రధాని అయ్యే సీను కనబడటం లేదు. ఎన్‌డిఏకు మెజారిటీ రాని పక్షంలో, ప్రాంతీయ పార్టీల ఫ్రంట్ ఏర్పడితే దానికి మద్దతు యిచ్చి కాంగ్రెసు కొన్ని మంత్రిపదవులు తెచ్చుకుంటే యితనికీ ఒకటి దక్కవచ్చేమో! రాహుల్ కోసం రాష్ట్రం ముక్కలు చేసి వుంటే అది నెరవేరలేదనే చెప్పాలి. ఇక ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెసు పరిస్థితి ఘోరంగా వుందనే అంచనాకు ఎలా వచ్చారో తెలియదు. పంచాయితీ ఎన్నికలలో వాళ్లకే ఎక్కువ సీట్లు వచ్చాయి. స్థానిక ఎన్నికలు జరిపి, బలాబలాలు తెలుసుకుని వుంటే అది ఒక సూచికగా వుండేది. ఆంధ్రలో వైకాపా, తెలంగాణలో తెరాస దూసుకుపోతున్నాయి కాబట్టి కాంగ్రెసును రక్షించుకోవడానికి యీ పని చేయాలని వాళ్ల సలహాదారులు చెప్పారట. వైకాపా, తెరాసల బలం యిప్పుడు తేలబోతోంది. పైకి ఏం చెప్పుకున్నా అత్తెసరు సీట్లు తెచ్చుకుని, కనాకష్టం మీద ప్రభుత్వం ఏర్పాటు చేస్తారో లేదో తెలియని పరిస్థితి వాళ్లది. మరి వాళ్ల అండ చూసుకునే కాంగ్రెసు మమ్మల్ని అన్యాయం చేసిందని ఆంధ్ర కాంగ్రెసు నాయకులు చేసి టిడిపిలోకి దూకేముందు గోలగోల చేశారు. మీడియా అలాటి కలరింగ్ యిచ్చింది మరి.

విభజన తర్వాత తెరాస, కాంగ్రెసులో విలీనం కాదు కదా, పొత్తు కూడా పెట్టుకోలేదు. కత్తులు దూసుకున్నారు. సమానస్థాయిలో సీట్లు వస్తే ప్రభుత్వ ఏర్పాటు చేయడానికై యిద్దరూ కలబడి కొట్టుకోవడం తథ్యం. మరి యిలాటి తెరాసను కాంగ్రెసు నమ్ముకుందా!? ఇక వైకాపా. కేంద్రంలో ఎవరు వచ్చినా వారికి మద్దతు యిచ్చి ఫలానా ఫలానా మంత్రిపదవులు అడుగుతానని జగన్ ఎప్పుడో చెప్పారు. తన కేసులు నీరుకార్పించుకోవడానికి అని కొందరంటారు. కారణం ఏదైనా కాంగ్రెసుకే యిచ్చి తీరతానని చెప్పలేదు. మొదట్లో యుపిఏ3కు యిస్తానని అన్నా, యుపిఏ3 ఏర్పడే అవకాశం లేకపోతే ఎలా యిస్తాడు? మరి జగన్ మద్దతు నమ్ముకుని కాంగ్రెస్ విభజించింది అనడం కూడా వింతగానే పరిణమించింది కదా. మరి కాంగ్రెస్ ఏ కారణం చేత విభజనకు ఒడిగట్టింది? అంటే మాత్రం చెప్పలేను. చేశాక యిప్పుడు దానికి ఏం జరిగిందో చూడండి. సీమాంధ్రలో తిరుక్షవరం. త్రి డిజిట్ సీట్లలో సింగిల్ డిజిట్ తెచ్చుకునే పరిస్థితి. కేంద్రానికి ఒక్క సీమాంధ్ర ఎంపీ కూడా వెళ్లే సీను లేదు. ఈ పళ్లంరాజులు, ఝూన్సీలు, కృపారాణులు, కిశోర్ చంద్రదేవులు ఎంత బాగా వెలగబెడతారో చూడాలి. తెలంగాణకు వస్తే – వెన్నుపోట్లు జరిగాయని టి–కాం నాయకత్వమే అంటోంది. మజ్లిస్ మద్దతుతోనైనా ప్రభుత్వం ఏర్పాటు చేసి తీరుతుందని ఎవరూ గట్టిగా చెప్పలేని పరిస్థితి. మొత్తం మీద చూస్తే 2009లో ఉమ్మడి రాష్ట్రంలో గెలుచుకున్న సీట్లలో 35–40% సీట్లు తెచ్చుకుంటోందన్నమాట. కాంగ్రెస్ ఏమీ బావుకోలేదని అర్థమైంది.

తర్వాత చెప్పుకోవలసినది బిజెపి – తెలంగాణలో వారి పరిస్థితి గతంలో కంటె తప్పకుండా మెరుగుపడుతుంది. కానీ ఏ మేరకు? టు–డిజిట్ ఫిగర్ వస్తుందనుకోవచ్చా? ఏమో. దాని వలన లాభం ఏమిటి? తెరాస, కాంగ్రెస్ రెండూ ప్రభుత్వ ఏర్పాటులో బిజెపిని దగ్గరకు రానిచ్చేట్టు లేవు. మజ్లిస్ కేసి చూస్తున్నాయి, సిపిఐ కేసి చూస్తున్నాయి. మామూలుగా అయితే కిషన్‌రెడ్డిని చూసి కెసియార్ బిజెపితో భాగస్వామ్యానికి సరే అనేవారేమో కానీ, టిడిపితో పొత్తు పెట్టుకున్నందుకు కెసియార్ బిజెపి నాయకత్వాన్ని క్షమించరు. చచ్చే పార్టీకి ఊపిరి పోశారని నిందిస్తారు. బిజెపి భాగస్వామి అయిన టిడిపి తెలంగాణలో అధికారంలోకి వచ్చే సమస్యే లేదు. అందువలన వస్తే ఆ పది సీట్లతో బిజెపి ఉద్యమాలు చేస్తూ, 2019లో మాదే ప్రభుత్వం అని క్యాడర్‌ను ఊరిస్తూ గడపాలి. ఇక సీమాంధ్రలో మోదీని, పవన్‌ను తెచ్చి తప్పెట్లు, తాళాలు మోగించినా అదంతా టిడిపికి ఉపయోగపడిందంటున్నారు. బిజెపికి 2 అసెంబ్లీ, 1 పార్లమెంటు వస్తే గొప్పట. 1999లో తనను తాను అర్పించుకుని టిడిపిని నిలబెట్టిన పని బిజెపి మళ్లీ చేసినట్లా? మోదీ ప్రధాని అయ్యే సూచనలు కనబడకపోతే ప్రాంతీయ పార్టీల ఫ్రంట్‌కి కన్వీనర్‌గా వుండమని వారు అడిగితే బాబు నిరాకరిస్తారా? జగన్ చెప్పినట్లే మోదీ అయినా, మమత అయినా ఆంధ్రరాష్ట్ర ప్రయోజనాలకోసం అంటూ మరో నేషనల్ ఫ్రంట్ ప్రభుత్వానికి సూత్రధారి పాత్ర పోషిస్తారు. ఆంధ్రలో బిజెపి ఎదుగుదల ఆగిపోతుంది.

ఇక సిపిఐ – తెలంగాణ ఉద్యమంలో 'బేగానే శాదీమే అబ్దుల్లా దీవానా' అన్నట్లు రెచ్చిపోయిన పార్టీల్లో యిదొకటి. ఇదంతా నారాయణగారు ఎంపీ కావడానికే అనిపించింది. తను నెగ్గుతానని ఆయన కూడా చెప్పటం లేదు. ఓ ఎమ్మెల్యేను తెరాసకు అర్పించుకున్నారు. తెలంగాణ యిస్యూ పై భయంకరంగా పోరాడేసినందుకు 2009 కంటె ఒక్క సీటైనా ఎక్కువ వస్తుందా అంటే చెప్పలేని పరిస్థితి. సీమాంధ్రలో దాని గురించి మాట్లాడేవాడు కూడా లేడు. సిపిఎం – విభజన వలన ఏ మార్పుకూ గురి కాని పార్టీ యిదే. ఉన్న ఒక్క ఎమ్మెల్యే గెలుస్తాడో, లేక తెలంగాణ అంశం వలన ప్రభావితం అయి ఓడిపోతాడో తెలియదు. దీని పాప్యులారిటీ పెరగలేదు, తరగలేదు. వైకాపా – విభజనకు ముందు అది రాష్ట్రమంతా వ్యాపించి వున్న పార్టీ. రాష్ట్రమంతా కలిపి 135–140 సీట్లు తెచ్చుకుని మరో చిన్న పార్టీతో కలిసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేటంత స్థాయిలో వుండింది. కానీ విభజన ప్రకటన వచ్చిన తర్వాత వైకాపా సమన్యాయం వదిలేసి సమైక్యం అనడంతో తెలంగాణ యూనిట్ ఘోరంగా దెబ్బ తినేసింది. ఇప్పుడు అన్ని సీట్లు సీమాంధ్రలో కూడా రాని పరిస్థితి. జగన్ విభజనకు సహకరించాడని టిడిపి సీమాంధ్రలో ఎంత ప్రచారం చేస్తున్నా, తెలంగాణలో అది నమ్మటం లేదు. పడే ఓట్లు వైయస్సార్‌పై అభిమానంతో పడాల్సిందే. కాంగ్రెస్, టిడిపిలకు అడ్డు కొట్టడానికి వైకాపా తెరాసకు చేరువ కావలసిన

పరిస్థితి వచ్చింది. కాంగ్రెస్ ఛాయలో మజ్లిస్ వున్నట్టు, తెరాస ఛాయలో వైకాపా వుండవచ్చు. ఆ విధంగా చూస్తే వైకాపా తెలంగాణలో దెబ్బ తినడానికి విభజనే కారణం. సీమాంధ్రలో కూడా విభజనకు ముందు వైకాపాకు అనుకూలంగా వున్న పరిస్థితి వుంది. తర్వాత అనేక శక్తులతో చేతులు కలిపి వైకాపాతో సమానస్థాయిలో టిడిపి పోరాడే స్థాయికి చేరుకుంది. విభజన వలన దెబ్బ తిన్న పార్టీల్లో వైకాపా ఒకటి.

తెరాస – విభజన వలన లాభపడిన పార్టీ. ఇప్పటివరకు వేరేవారి భుజాల మీద ఎక్కి నెగ్గుతూ వచ్చిన పార్టీ సొంతంగా పోటీ చేసి తన సత్తా చూపించుకోబోతోంది. 40% సీట్లు తెచ్చుకున్నా గతంలో కంటె చాలా ఎదిగినట్లే కదా. అవసరమైతే వేరేవాళ్లను జూనియర్ పార్ట్‌నర్‌గా చేర్చుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయడానికి సిద్ధపడుతోందంటే చూడండి, 2009 నుండి యిప్పటికి ఎంత సాధించిందో! ఇక టిడిపి – విభజన వలన ఒకచోట బాగా నష్టపోయి, మరో చోట బాగా లాభపడిన పార్టీ యిది. తెలంగాణ ఉపయెన్నికలలో దెబ్బ తిన్నా క్యాడర్ నిలిచింది. పంచాయితీ ఎన్నికల ఫలితాలతో స్థయిర్యం వచ్చింది. కానీ ప్రకటన తర్వాత పార్టీ పూర్తిగా అడుగంటింది. మా లేఖ వలనే తెలంగాణ వచ్చింది అని చెప్పుకున్నా ఆ మాట ఆంధ్రలో నమ్మారో లేదో తెలియదు కానీ తెలంగాణలో నమ్మలేదు. ఆంధ్రా పార్టీగానే ముద్ర పడింది. బిజెపితో గీచిగీచి బేరాలాడి పార్టీ ఏం బావుకుందో తెలియదు. వాళ్ల ముఖ్యమంత్రి అభ్యర్థి గెలుపే సందేహాస్పదంగా వుంది. కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక దాని వైఫల్యాలపై ఉద్యమాలు చేస్తూ యింకో ఐదేళ్లు శ్రమించాలి. అలా కష్టపడినా ఆ ఘనత ప్రధాన ప్రతిపక్షం (కాంగ్రెస్ లేదా తెరాస)కు పోతే వీళ్లకు లాభం ఏముంది? ఆంధ్రకు వస్తే – జులై ప్రకటనకు ముందు కాంగ్రెస్, టిడిపి, వైకాపా యించుమించు ఒక స్థాయిలో వుండేవి. త్రిముఖ పోటీ అనుకునేవారం. పంచాయితీ ఎన్నికలలో కూడా టిడిపి తన సత్తా చూపింది. ప్రకటన తర్వాత కాంగ్రెస్ దివాలా తీయడంతో దాని ఓటు బ్యాంకును వైకాపాతో సమానస్థాయిలో పంచుకోగలిగింది. అందుకే అనేక నియోజకవర్గాలలో పోటాపోటీగా నడుస్తోంది.

ఏ మేరకు టిడిపి లాభపడిందన్నదే చర్చనీయాంశమైంది. బాబు 120 ప్లస్ అంటున్నారు. అవతల వైకాపావారు 130 అంటున్నారు. బాబు ధీమాకు కారణం ఏమిటని టిడిపి అభిమానుల్ని అడిగితే – లగడపాటి సర్వే ఎత్తి చూపిస్తున్నారు. ఓటింగు 70% దాటితే టిడిపికే గెలుపు అని చెప్పారు కదా, మొత్తం మీద దాదాపు 78% పోలింగ్ జరిగింది కాబట్టి టిడిపి గెలుస్తుంది అని లెక్క. మహిళలు, యువత పెద్ద సంఖ్యలో ఓటేశారు. 'యువత అంతా మోదీకే. అక్కడ మోదీ, యిక్కడ బాబు వస్తేనే మాకు ఉద్యోగాలు వస్తాయి అనుకుని యితర ప్రాంతాలలో పనిచేసే వాళ్లు కూడా సొంత ఖర్చులతో వచ్చి వేశారు' అంటున్నారు. కావచ్చు. ఓటింగు శాతం పెరిగితే మధ్యతరగతి ఓట్లు కూడా పడ్డాయనీ, అది బిజెపి-టిడిపి కూటమి గెలుపుకి సంకేతమనీ భాష్యం చెపుతున్నారు. మరి యుపిలో అదే రోజున 56% ఓటింగు మాత్రమే జరిగింది. అక్కడ బిజెపికి ఓట్లు పడలేదని, సాంప్రదాయికంగా ఓట్లు గుద్దే ఎస్పీ, బియస్పీలకే గెలుపు అని ఒప్పుకుంటారా? మన దగ్గర ఓటింగు పెరిగినది గ్రామీణ ప్రాంతాలలో ఓటింగు వలన, నగరాలలో ఓటింగు పెద్దగా పెరగలేదని గ్రహించాలి. (పూర్తి వివరాలకోసం ఎదురుచూస్తున్నాను). మహిళలు బయటకు వస్తే బిజెపి-టిడిపిలకే ఓటేస్తారని ఎలా అనుకోగలం? మహిళల్లో – కనీసం గ్రామీణ మహిళల్లో – జగన్‌కు ఆదరణ వుందని అంటూ వచ్చారు. ఈ ఓట్లు జగన్‌కు వెళ్లవచ్చేమో అన్న సందేహం కూడా రావటం లేదు మనకు. రాష్ట్రాభివృద్ధి జరగాలి, తమ పిల్లలకు యిక్కడే ఉద్యోగాలు రావాలి అని మహిళల ఆశ అనుకోండి. అభివృద్ధి అనగానే బాబు ఒక్కరే గుర్తుకు వస్తారా? గతంలో వచ్చారా? హైదరాబాదుకి అంతర్జాతీయ స్థాయి సంతరింపచేసి, తమ పిల్లలను ఎన్నారైలుగా మార్చినందుకు బాబును 2004లో గెలిపించారా? జలయజ్ఞం ఎడ్వాన్సుల పేరుతో ప్రభుత్వ ఖజానా ఖాళీ చేస్తున్నారని ప్రచారం చేసినా 2009లో వైయస్‌ను దింపి బాబును ఎక్కించలేదేం? అప్పుడు అభివృద్ధి అక్కరలేకపోయిందా? అప్పుడు ఇప్పుడే కావాలనుకుంటున్నారా?

బాబు మోడల్ ఆఫ్ అభివృద్ధి ప్రజలు ఆల్‌రెడీ చూసేశారు. చూడాల్సింది జగన్ పాలనే. జగన్ యిప్పటిదాకా తన ఎడ్మినిస్ట్రేటివ్ ప్రతిభను రాజకీయాల్లో కనబరిచినది లేదు. అయినా వైయస్ పథకాల పునరుద్ధరణ అంటున్నాడు కదా, 108 మళ్లీ ఉధృతంగా వస్తుందేమో, ఓ సారి ఛాన్సిచ్చి చూదాం అనే భావనతో స్త్రీలు ఓట్లు గుద్దుతున్నారేమో! ఇక యువత – పవన్‌ను అభిమానించేవారే యువత అని నిర్వచించడం దుస్సాహసం. యువత ఓట్లు జగన్‌కు వెళ్లకూడదన్న రూలు లేదు కదా. అదనంగా వచ్చిన ఓట్లు పొందడంలో టిడిపి, వైకాపా సమానస్థాయిలో వున్నారనుకోవడంలో తప్పేమీ లేదు. అబ్బే కాదు, మూడింట రెండు వంతులు టిడిపికి, తక్కినదే వైకాపాకు అనుకున్నా టిడిపికి కేక్‌వాక్ కాదు. పొద్దున్న టీవీ చర్చల్లో విజయవాడ సీనియర్ జర్నలిస్టు తన వూహ చెప్పారు – ఏ పార్టీ గెలిచినా 100 కంటె తక్కువ వస్తాయి అని. అంటే 90 నుండి 100 లోపున వస్తాయన్నమాట. మరి ఏ పార్టీకి వస్తాయి అన్నదే తేలటం లేదు. ఎవరి అభిమానులు వాళ్లకు తగ్గట్టు చెప్పుకుంటున్నారు. తటస్థంగా వుంటుందనుకున్న ఆంధ్రభూమి టిడిపికి 90 సీట్ల వరకు యిచ్చి వైకాపాను 75-80 లోపునే ఆపేసింది. వీళ్లందరికీ ఒకటే లెక్క. మోదీ ప్రధాని కాబోతున్నాడని, ఆంధ్రకు నిధులు కావాలంటే మోదీకి ఓట్లేసి తీరాలనీ అనుకుని యువత, మహిళ టిడిపి-బిజెపి కూటమికి ఓట్లేశారు అని. మోదీ ప్రధాని అభ్యర్థిత్వం గురించి ఎంతమంది ఓటర్లకు తెలుసో నాకు తెలియదు. యుపిఏతో విసిగిపోయారు కాబట్టి కొత్త మొహం కదాని మోదీకి ఓట్లేయవచ్చు అనుకుందాం. 'కొత్తమొహం' అనే లాజిక్ ఉపయోగిస్తే ఆ ఎడ్వాంటేజి జగన్‌కు కూడా వర్తిస్తుంది. 'బాబు అభివృద్ధి మోడల్‌లో గ్రామీణ ప్రాంతాలు, హైదరాబాదు తప్ప తక్కిన పట్టణాలు దెబ్బ తిన్నాయని అనుభవించి తెలుసుకున్నాం. జగన్ విషయంలో ఛాన్సిచ్చి చూదాం' అని ఓటర్లు అనుకోవచ్చు కదా. అనుకున్నారని నేనటం లేదు. కానీ అలా కూడా ఆలోచించి

చూడరేం అని నా ప్రశ్న. పైగా వీళ్లంతా టిక్కెట్టు దొరక్క కడుపుమండిన నాయకుల గురించి ఏమీ మాట్లాడడం లేదు. కాంగ్రెస్, జెయస్పీ ఏ మేరకు ఓట్లు చీలుస్తాయో లెక్క వేయడం లేదు. అందువలన వీళ్ల అంచనాలు తప్పుతాయని నా భయం. ఏ విషయం పై వారం తెలిసిపోతుంది.

టిడిపికి అధికారం చిక్కినా, చిక్కకుండా కొద్దిలో జారిపోయి ప్రధాన ప్రతిపక్షంగా మారినా విభజన ప్రకటన కంటె ముందున్న పొజిషన్ కంటె యిప్పుడు మెరుగైన పొజిషన్‌లోకి వచ్చిందని ఒప్పుకోవాలి. కాంగ్రెస్‌ను తనలో కలిపేసుకుంది. ఎన్టీయార్ పోయిన తర్వాత టిడిపి డూప్లికేట్ కాంగ్రెస్‌గా మారిందని బాధపడేవాణ్ని. ఇప్పుడది సీమాంధ్ర వరకు చూస్తే ఒరిజినల్ కాంగ్రెస్‌గా మారిపోయింది. రాత్రికి రాత్రి పార్టీ ఫిరాయించి వచ్చినవారికి టిక్కెట్లు, ధనవంతులకే ప్రాధాన్యం, కులాల లెక్కలేసి హామీ లివ్వడం.. అంతా కాంగ్రెస్ పోకడే! కానీ ఆ పోకడే కాంగ్రెస్‌ను పదికాలాల పాటు రాజకీయాలలో వుంచుతూ వచ్చింది. ఇప్పుడు దాన్ని టిడిపి పుణికి పుచ్చుకుంది. ఎన్నికల అనంతరం తక్కిన కాంగ్రెసు వారు కూడా టిడిపిలోకి వచ్చేయవచ్చు. అధికారంలోకి వస్తే జోరుగా వస్తారు, లేకపోతే కాస్త ఆగి వస్తారు. బాబు అంటే అస్సలు పడనివారు వైకాపాలోకి వెళతారు. టిడిపి, వైకాపాల ధర్మమాని ఆంధ్రలో కాంగ్రెస్ పూర్తిగా లుప్తమైతే పోతే ఒక దరిద్రం తీరిపోతుంది. ఇక రెండు పార్టీలతోనే వేగవచ్చు. విభజన వలన ప్రజలకు కలిగిన మేలేదైనా వుందా అంటే యిదే ప్రధానమైనది అని చెప్పుకోవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

**మే 13-14 వీక్లీకై ఎమ్బీయస్ : మోదీ – ముస్లిములు**

సమాజంలో అన్ని వర్గాలనూ కలుపుకుని పోతామని మోదీ చెపుతూ వుంటారు. ఆర్థికాభివృద్ధిలో మాత్రమే అని ఆయన అర్థం కాబోలు. ఎందుకంటే రాజకీయాల్లో ముస్లిములను ఆయన ప్రోత్సహించటం లేదు. గుజరాత్ జనాభాలో ముస్లిములు 10% వున్నారు. కానీ ప్రధాని కాగోరుతున్న సమయంలో కూడా గుజరాత్‌లోని 26 పార్లమెంటు అభ్యర్థులలో ఒక్క ముస్లిమును కూడా ఆయన సెలక్టు చేయలేదు. గుజరాత్ కాంగ్రెసు కూడా దాదాపు అదే బాటలో నడిచింది. ఒక్క అభ్యర్థిని నవసారి నియోజకవర్గం నుండి నిలబెట్టింది. ఎస్పీ, బియస్పీ పార్టీలు చెరో అభ్యర్థిని నిలిపాయి. కానీ వాటికి అక్కడ పట్టు ఏమీ లేదు. దీనికి కారణం ఏమిటంటే 1984 తర్వాత గుజరాత్ నుండి ఏ ముస్లిము ఎంపీ నెగ్గలేదు. అతను వేరెవరో కాదు, అహ్మద్ పటేల్. అతను కూడా 1989లో బిజెపి అభ్యర్థి చేతిలో ఓడిపోయాడు. ఇక అప్పణ్నుంచి రాజ్యసభ ఎంపీగానే వుంటున్నాడు. దీనికి కారణం ఏమిటంటే గత పాతికేళ్లగా, బిజెపి బలపడిన కొద్దీ గుజరాతీ సమాజం మతం పేర చీలిపోయి ముస్లిము అభ్యర్థిని నిలబెడితే హిందువులు ఓట్లేయకపోవడం జరుగుతోంది.

శివసేన బలపడినకొద్దీ మహారాష్ట్రలో కూడా అదే పరిస్థితి నెలకొంది. అందుకే అక్కడి జనాభాలో ముస్లిములు 11% మంది వున్నా కాంగ్రెస్ యీసారి ఒక్క ముస్లిము అభ్యర్థికే టిక్కెట్టిచ్చింది. దేశం మొత్తం మీద కాంగ్రెసుకు 206 మంది ఎంపీలుంటే వారిలో 10 మంది మాత్రమే ముస్లిములు. పార్లమెంటు మొత్తానికి 29 మంది ముస్లిము ఎంపీలు వున్నారంతే. చూడబోతే ప్రతీ పార్టీ నాయకుడూ ముస్లిములకు ఉద్యోగాలలో రిజర్వేషన్లు యిస్తాం అంటారు. కానీ రాజకీయాల్లో మాత్రం ఆ రిజర్వేషన్ యివ్వరు, ఎందుకంటే వాళ్లకు ముప్పు వస్తుందని. మోదీ అసెంబ్లీ ఎన్నికలలో కూడా ముస్లిములను నిలబెట్టలేదు. స్థానిక ఎన్నికలలో మాత్రం కొందరికి యిచ్చాడు. ముస్లిములలో అక్షరాస్యత పెంచడానికి కేంద్రం ప్రత్యేకంగా నిధులు యిస్తుంది. గుజరాత్‌లో ఆ నిధులు వినియోగం కాకుండా మురిగిపోతున్నాయి. జరుగుతున్నదేమిటంటే గుజరాత్‌లో వ్యాపారాభివృద్ధి జరుగుతోంది. ముస్లిములలో సంపన్న వర్గాలు ఆ ఆర్థికప్రగతిలో బాగుపడుతున్నాయి. కింది వర్గాలలో వున్న ముస్లిముల పరిస్థితి దయనీయంగానే వుంది. బిజెపి వాళ్లు ముస్లిముల జోలికి వెళ్లరు, ఓట్లు అడగరు. ముస్లిములు తక్కువ స్థాయిలో వుండడానికి యిష్టపడితేనే వాళ్లకు గుజరాత్‌లో రక్షణ వుంటోంది. మోదీ గుజరాత్ మోడల్‌ను దేశమంతా అమలు చేస్తానంటున్నారు. ఇదే కాబోలు! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

**ఎమ్బీయస్ : సర్వేలూ, ఒపీనియన్ పోల్సూ**

సర్వేలను, ఒపీనియన్ పోల్స్ మనల్ని ముంచెత్తుతున్నాయి. ఇన్ని సర్వేలు వస్తున్నాయి కాబట్టి అన్నిటినీ ఒకచోట పోగేసి సరాసరి కడితే సరైన ఫలితం వస్తుందేమోననుకోవడం కుదరదు. ప్రఖ్యాత ఎకనమిస్టు వెంకటేశ్ ఆత్రేయ ఒక పత్రికలో యీ పోల్స్ గురించి చాలా సబబైన వ్యాఖ్యలు చేశారు. వాటి ప్రకారం ఈ పోల్ ఫలితాలను పోల్చి చూడడం చాలా కష్టం. ఎందుకంటే వాటిలో సామాన్యగుణం (కామన్ ఫ్యాక్టర్) లేదు. శాంపుల్ సైజు ఒకటి కాదు. ఒకరు 50 మందిని ఇంటర్వ్యూ చేసి దానిలో 30 మంది మోదీకి జై అంటే 60% మంది జనాభా జై అన్నారు అనేస్తారు. మరొకరు 50 వేల మందిని యింటర్వ్యూ చేస్తే దానిలో 20 వేలమందే జై అనవచ్చు. అప్పుడు 40% మంది జై అన్నారు అని రాస్తారు. రెండు శాతాలకు సరాసరి కట్టి 50% మంది జై అన్నారు అని మనం అనుకుంటే తప్పుతాం. ఎందుకంటే 50 వేల మంది చెప్పినదే వాస్తవానికి దగ్గరగా వుంటుంది. అదే విధంగా ఎన్నాళ్లలో నిర్వహించారు, ఎటువంటి వ్యక్తులను నియమించారు, వారి విద్యార్హతలేమిటి, వృత్తి నైపుణ్యత ఏమిటి అనేది కూడా చాలా ముఖ్యం. ఇంకో

ముఖ్యమైన అంశం సమాజంలో అన్ని వర్గాలూ కవర్ అయ్యాయా లేదా అన్నది చూడాలి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాలను చేరుకోవడం చాలా కష్టం. వారికి ప్రశ్నలు వివరించడం, సమాధానాలు రాబట్టడం ఓపికతో, సమయం వెచ్చించి చేయవలసిన పనులు. సంపన్నవర్గాలలోని యువత అయితే ఎస్ఎమ్ఎస్‌ల ద్వారా సులభంగా సేకరించేయవచ్చు. చాలామంది ఆ పని చేసేసి అదే జనాభా మొత్తం అభిప్రాయంగా చిత్రీకరిస్తున్నారు. అది కేవలం సంపన్న యువత అభిప్రాయం మాత్రమే కదా!

చాలాభాగం సర్వేలు అతి తక్కువ గడువులో పూర్తి చేయమంటున్నారు. బజెట్ పెద్దగా యివ్వటం లేదు. దాంతో ఎవరు కనబడితే వాళ్లను నియమించి తూతూమంత్రంగా చేస్తున్నారు. సమాచారం వచ్చాక విశ్లేషణకు చాలా సమయం పడుతుంది. దానిలో నిపుణులు చేయాలి. డబ్బు, సమయం ఖర్చవుతుంది. వీళ్లు ఆ జాగ్రత్తలు తీసుకున్నారా లేదా తెలియదు. పైకి చెప్పరు. చెప్పి తీరాలన్న ప్రభుత్వ నిబంధన ఏమీ లేదు. అన్నిటికన్న ముఖ్యమైన వ్యత్యాసం మరొకటి వుంది – ప్రశ్నావళి కామన్‌గా వుండటం లేదు. కొన్ని సర్వేలలో ఏ పార్టీకి ఓటేస్తారని అడుగుతున్నారు, మరి కొన్ని సర్వేలలో ప్రధానిగా ఎవరంటే యిష్టపడతారని అడుగుతున్నారు. అయిదారు పేర్లుండాలి కాబట్టి బరిలో లేని వాళ్ల పేర్లు కూడా చేరుస్తారు. ప్రధానిగా మోదీ/మన్‌మోహన్/రాహుల్/మమతా బెనర్జీ/జయలలిత – యిలా పెడితే మన్‌మోహన్ తను పోటీ చేయనని ముందే చెప్పేశారు. మమతా, జయలలితల గురించి పక్క రాష్ట్రాల వారు ఎవరు పట్టించుకుంటారు? అంతిమంగా సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడి గతంలో గుజ్రాల్, దేవెగౌడ వంటి వాళ్లు ప్రధానులయినట్లు, యిప్పుడు ఏ శరద్ పవారో అయితే యీ సర్వేలన్నీ వేస్ట్ కదా! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

## ఎమ్బీయస్ : మోదీ ప్రభంజనం

మోదీ వేవ్ దేశాన్ని కుదిపివేస్తోందని మీడియా ఘోషిస్తోంది. ఈ ఎన్నికలు దాదాపుగా ఏకపక్షంగా సాగుతున్నాయి. పదేళ్ల పాలన వలన ప్రభుత్వవ్యతిరేకత మూటగట్టుకున్న యుపిఏ ఎన్నికలకు ముందే కాడి పారేసినట్లు వుంది. 2009లో మన్‌మోహన్ మా ప్రధాని అభ్యర్థి అని ప్రకటించి ఎన్నికలకు వెళ్లిన కాంగ్రెస్ యీ సారి రాహుల్ గురించి ఆ మాట చెప్పే దమ్ము చూపడం లేదు. అక్కడే తెలిసిపోయింది అయ్యగారి పస. అవినీతి, అధిక ధరలు, నాయకత్వలేమి, సోనియా అనారోగ్యం, రాహుల్ అసమర్థత – యివన్నీ చూస్తే యుపిఏ మళ్లీ అధికారంలోకి రాదని ఎవరైనా చెప్పేయగలరు. దాని స్థానంలో ఎవరు వస్తారు అన్నదే ప్రశ్న. ఎన్‌డిఏ వస్తుందా లేదా? రాకపోతే నానాజాతి సమితి లాగ ప్రాంతీయపార్టీల కూటమి వస్తుందా? వచ్చినా నిలుస్తుందా? ఇవి పరిశీలకులను వేధించే ప్రశ్నలు. ఈ సందిగ్ధతే ఎన్‌డిఏకు యిది సువర్ణావకాశాన్ని కల్పిస్తోంది. మోదీని ముందు పెట్టుకుని బిజెపి ముందుకు సాగుతోంది. మోదీ ఏ బాణాన్నీ వదలడం లేదు. గుజరాత్‌లో గెలుస్తూ వచ్చినా అతను బిసి కార్డు వాడలేదు. హిందూత్వనే నమ్ముకున్నాడు. జాతీయ రాజకీయాలకు వచ్చేసరికి యుపి, బిహార్‌లలో బిసి కార్డు తురుపు ముక్కలా పనికి వస్తుందని దాన్ని బయటకు తీశాడు. గోధ్రా గురించి యిన్నాళ్లూ మాట్లాడకపోయినా గుజరాత్‌లో చెల్లిపోయింది. ఇప్పుడు కాన్వాస్ పెరిగేటప్పటికి ఏదో ఒకటి చెప్పక తప్పలేదు. సాధ్యమైనంతవరకు ఆ విషయాల జోలికి వెళ్లకుండా అభివృద్ధి, గుజరాత్ నమూనా పైనే మాట్లాడుతున్నాడు. అతని అనుచరులు మాత్రం హిందూత్వను గట్టిగా వినిపిస్తున్నారు. ఎందుకంటే అభివృద్ధి రంధిలో పడి హిందూత్వను వదిలిపెడితే సాంప్రదాయికంగా పడే ఓట్లు పోతాయన్న భయం. అందువలన వాటాలు వేసుకుని ప్రచారం చేసుకుంటున్నారు.

ఈ సారి వచ్చిన అవకాశం మళ్లీ వస్తుందో రాదోనన్న భయం బిజెపిలో వుంది కాబట్టి సర్వశక్తులూ ఉపయోగిస్తున్నారు. ఎన్‌డిఏకు 272 ప్లస్ అనే నినాదంతో మొదలుపెట్టి ఆ తర్వాత సర్వేలు నిర్వహించి వాటి ఫలితాలు అంటూ విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. వాటి ప్రకారం 543 పార్లమెంటు స్థానాల్లో 423 స్థానాల్లో ఎన్‌డిఏ భాగస్వాములు మొదటి లేదా రెండవ స్థానాల్లో వున్నారట. 260 స్థానాల్లో మొదటి స్థానంలో వున్నట్లు చెప్పవచ్చుట. 'ఇది మార్చిలో నిర్వహించిన పోల్స్, పోనుపోను హవా మరింత జోరుగా వీస్తోంది కాబట్టి యిప్పుడు 300కు పైగా వస్తాయి' అని చెపుతూ కార్యకర్తలలో ఉత్సాహాన్ని నింపుతున్నారు. అయితే వాస్తవం ఏమిటంటే బిజెపిలోనే అంతఃకలహాలు వున్నాయి. మోదీ, రాజ్‌నాథ్ సింగ్ ఏకమై ఆరెస్సెస్ సహాయంతో అద్వానీ, సుష్మా స్వరాజ్, మురళీ మనోహర్ జోషి, జస్వంత్ సింగ్ వంటి నాయకులను అణచివేశారు. ఎన్నికలకు ముందు గొడవ పడితే పార్టీకే ముప్పు అనే భయంతో అందరూ నోరు మూసుకున్నారు. ఫలితాలు వచ్చాక ఎన్‌డిఏకు ఎవరు సారథ్యం వహించాలి అనే ప్రశ్న వచ్చినపుడు యీ విభేదాలు బయటపడడం సహజం. అప్పటిదాకా భారమంతా మోదీపై వేసి వీళ్లు మౌనంగా వున్నారు. ఎందుకంటే కార్పోరేట్ శక్తులు మోదీనే సమర్థిస్తున్నాయి. అతన్ని చూసే వాళ్లు ధనం కుమ్మరిస్తున్నారు. మీడియాను మేనేజ్ చేస్తున్నారు. ఏ పేపర్లో చూసినా, ఏ టీవీలో చూసినా నమోజపమే కనబడేట్లా చేస్తున్నారు. ఈ ప్రచారం ఎక్కడ ఏ మేరకు ప్రభావం చూపిస్తోంది అన్నదే ఉబలాటం కలిగించే విషయం.

తెలంగాణ మాట ఎలా వున్నా ఆంధ్రలో మోదీ ప్రభావం కనబడింది. తమిళనాడులో బిజెపి కూటమిలో చాలామంది చేరడం మోదీ ప్రభావమే. బెంగాల్‌లో బిజెపికి సీటు రాకపోయినా ఓట్లశాతం పెరగడం ఖాయంట. ఒడిశాలో గతంలోనే బిజెపి వుంది కాబట్టి బిజెడి తర్వాతి స్థానం బిజెపి దక్కించుకోవచ్చు. ఇవి చూపించి దేశమంతా మోదీ హవా వీస్తోందని చేసే ప్రచారాన్ని కొందరు బిజెపి నాయకులు బహిరంగంగానే నిరాకరిస్తున్నారు. మోదీకోసం వారణాశి సీటు వదులుకోవలసి వచ్చిన మురళీ మనోహర్ జోషి ఒక

టివి ఇంటర్వ్యూలో మోదీ హవా లేదని చెప్పారు. వెంటనే మోదీ జోషి ప్రచారసభకు రానని చెప్పేశారు. సుష్మ స్వరాజ్ కూడా మోదీని వ్యతిరేకిస్తోందని అందరికీ తెలుసు. ఆమెను ప్రచారానికి పిలిచిన ఒక అభ్యర్థి వాహనాన్ని పంపలేదు సరికదా, తను కూడా వచ్చి పలకరించలేదు. ఆమె వెంటనే వెనక్కి వెళ్లిపోయింది. మోదీని వ్యతిరేకించిన వారికి అవమానాలు తప్పవనే సంకేతం దృఢంగా వెళుతోంది.

మోదీ హవా బాగా పనిచేసి సీట్లు తేవలసిన రాష్ట్రాలు బిహార్, యుపి. బిహార్‌లో నితిశ్ దెబ్బ తినడం ఖాయమైనా దాని వలన బిజెపితో బాటు లాలూ కూడా లాభపడబోతున్నారు. అందువలన బిహార్‌లో పరిస్థితి మెరుగుపడుతుంది కానీ బిజెపి అదరగొట్టేస్తుందని చెప్పడానికి లేదు. ఉత్తర్ ప్రదేశ్‌లో మోదీ సంచలనాలు సృష్టిస్తున్నారని అందరూ ఒప్పుకుంటున్నారు. ఏ మేరకు అనేదే తెలియటం లేదు. గతంలో కంటె తప్పకుండా మెరుగుపడిందనుకోవచ్చు కానీ 50 సీట్లకు పైగా తెచ్చుకుంటేనే హవా వుందని చెప్పుకోవాలి. మతం పేరుతో ఓట్లు సమీకరిద్దామని బిజెపి ప్రయత్నం చేస్తున్నా అక్కడి ప్రజలు కులాలవారీగా విడిపోయివున్నారు. మోదీ ప్రధాని అయితే కావచ్చు కానీ, మా కులాలను రక్షించేవారికే మేం ఓటేయాలి కదా అంటున్నారు అక్కడి వారు. మోదీదే గెలుపు అని అంటున్నారే అని అడిగితే వాళ్లు ఒక ఉపమానం చెప్పారుట. వర్షాకాలంలో చెరువు నీటిపై నాచు తెట్టు చెరువంతా ఆకుపచ్చగా మారిపోయిందనుకుంటాం. కానీ చేయి ముంచి చూస్తే నీళ్లు మామూలు రంగులోనే వుంటాయి. అలాగే యీ ప్రచారం చూసి యుపి అంతా కాషాయమయమై పోయిందని మీరు అనుకుంటున్నారు. మా ఆలోచనల్లో పెద్దగా మార్పు రాలేదు అన్నారట.

అయితే కావచ్చు. ఎందుకంటే యుపిలో మొన్న విడతలో కూడా ఓటింగు శాతం పెరగలేదు. పైగా వారణాశిలో మోదీ గెలుపు తథ్యం అంటున్నా, అక్కడ మోదీ గంగా హారతి యిద్దామనుకుంటే ఎలక్షన్ కమిషన్ అడ్డుపడిందని, ఎలక్షన్ కమిషన్ నిషేధించినా ర్యాలీ అని హంగు చేస్తున్నారు. విజయంపై విశ్వాసం వుంటే యీ గిమ్మిక్స్ ఎందుకు చేస్తాడు? ముఖ్యమైన విషయం వారణాశిలో బ్రాహ్మణ ఓట్లు 3 లక్షలకు పైగా వున్నాయి. వాటి వల్లనే గతంసారి మురళీ మనోహర్ జోషి కొద్ది మెజారిటీతో నెగ్గాడు. ఈసారి జోషిని బలవంతంగా తప్పించి మోదీ వచ్చి బ్రాహ్మణులకు కోపం తెప్పించాడు. పైగా అరవింద్ కేజ్రీవాల్ వారణాశిలోనే తిష్టవేసుకుని కూర్చుని గల్లీ గల్లీ తిరిగి, ప్రజల అభిమానాన్ని చూరగొంటున్నాడు. యుపిలో బిజెపి పరిస్థితి అంత గొప్పగా లేదని అనుకోవడానికి యిదీ కారణం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

**మే 15-17 వీక్లీకై ఎమ్బీయస్ : మన్‌మోహన్ వైఫల్యం**

మన్‌మోహన్ ప్రభుత్వం ఎన్నికల్లో ఘోరంగా ఓడిపోయింది. సోనియా, రాహుల్ 'మేం నైతిక బాధ్యత వహిస్తున్నాం, రాజీనామా చేస్తున్నాం' అని పైకి అనడం, 'అబ్బే, మీరు కూడా మమ్మల్ని వదిలేస్తే మేం బొత్తిగా దిక్కులేనివాళ్లమై పోతాం' అని కాంగ్రెస్ నాయకులు మొత్తుకోవడం జరిగిపోయింది. ఇక తరువాతి దశలో యీ నాయకులంతా 'తప్పంతా మన్‌మోహన్‌ది. ఈ అసమర్థ ప్రధాని ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయలేకపోవడం చేతనే ఓడిపోయాం' అని కోరస్ పాడి, ఆయన్ను దోషిగా నిలబెడతారు. కాంగ్రెసు చరిత్ర పుస్తకాల్లో ఆ విధంగా రాస్తారు కూడా. పివి నరసింహారావు వద్ద పనిచేసినపుడు మేధావిగా పేరుబడడమే కాదు, యుపిఏ1 ప్రభుత్వాన్ని సమర్థవంతంగా నడిపి, 2009 ఎన్నికలలో మళ్లీ గెలవడానికి కారణభూతుడైన మన్‌మోహన్ యిమేజి ఆ తర్వాత యింతలా ఎందుకు దిగజారిందో సంజయ్ బారు తన పుస్తకంలో వివరించారు. అలా దిగజారడానికి కారణం సోనియా గాంధీ అని అందరికీ తెలుసు. తన ఆఫీసు వరకు అవినీతి లేకుండా చూసుకుంటే చాలని, తనపై ఎవరూ వేలెత్తి చూపకుండా వుంటే చాలని మన్‌మోహన్ అనుకున్నారు. ప్రజలు అలా అనుకోలేదు. సోనియా చెపితే మాత్రం, యీయన తన సహచరుల అవినీతిని సహించడమేమిటని మండిపడ్డారు, శిక్షించారు. "నేను ప్రధానమంత్రిగా ఏమీ సాధించలేకపోయినా, ఆర్థికమంత్రిగా నా విజయాల గురించి ప్రజలు గుర్తుంచుకుంటారు" అని మన్‌మోహన్ తన సెక్యూరిటీ ఎడ్వయిజర్ ఎం. కె. నారాయణన్‌తో ఒకసారి అన్నారట. 2014 ఘోరపరాజయం తర్వాత మన్‌మోహన్‌కు ఆనాటి ఖ్యాతి కూడా మిగులుతుందో లేదో అని అనుమానం వస్తోంది. పివి హయాంలో యీయన చూపిన తెలివితేటలు యీయనవి కావేమో, పివి చెప్పగా యీయన చేసినవేమో అని కూడా అనుకోవచ్చు. ఎందుకిలా జరిగింది?

ప్రధాని కాగానే మన్‌మోహన్‌ను పివితో పోల్చారు. ఆయనలాగే దేశాన్ని ప్రగతిపథంలో నడిపిస్తారని అనుకున్నారు. కానీ అలా జరగలేదు. పివికి ఆయనకు గల పోలికేమిటి, తేడా ఏమిటి? అనే విషయంపై కాలమిస్టు కావేరీ బామ్‌జాయ్ చక్కటి పరిశీలన చేశారు. మన్‌మోహన్ అవినీతిరహితంగా ప్రభుత్వాన్ని నడపబోయినపుడు కాంగ్రెసు నాయకులు సోనియా వద్దకు వచ్చి "ఈయనా పివిలాగే తయారయ్యాడు. పార్టీ ప్రయోజనాలను పక్కన పెట్టి (అనగా నిధులు సంపాదించుకోనీయటం లేదని భావం) సొంత యిమేజి గురించి పాకులాడుతున్నాడు." అని ఫిర్యాదు చేశారట. పివి పేరెత్తితేనే సోనియాకు మంట అని తెలిసి ఆ పోలిక తెచ్చారు. నిజానికి మన్‌మోహన్ హయాంలో, ముఖ్యంగా 2009 తర్వాత చాలా స్కాములు జరిగాయి. ఎటొచ్చీ వాటిలో మన్‌మోహన్ ప్రత్యక్ష జోక్యం లేదంతే! సోనియా కోరుకున్న విధంగానే ప్రభుత్వం నడిచింది. మన్‌మోహన్‌కు యిష్టం లేనివారిని కూడా మంత్రులుగా రుద్దింది. వాళ్లు ఏం చేసినా చూసీచూడకుండా వదిలేయమంది. మన్‌మోహన్ తనను తాను ఒక ఎడ్మినిస్ట్రేటర్‌గానే పరిగణించుకుని

పార్టీ వ్యవహారాల జోలికే కాదు, యితర మంత్రిత్వశాఖల జోలికి కూడా వెళ్లలేదు. తన సంస్థలో అవినీతి జరగకుండా చూడడం, తన సహచరులందరూ తన మాట వినేట్లా చూసుకోవడం కూడా ఎడ్మినిస్ట్రేటర్ బాధ్యతల్లో ఒకటి అని ఆయనకు తోచలేదు. తను అనుకున్న విధంగా ప్రభుత్వాన్ని నడపలేనని గ్రహించిన రోజున ఆయన ప్రధానిగా తప్పుకుని వుంటే యీ నాటి అప్రతిష్ఠ తప్పేది.

పివిలో ఒక ఎడ్మినిస్ట్రేటర్‌తో బాటు, ఒక రాజకీయవేత్త కూడా వున్నాడు. చిన్నప్పటినుండి కాంగ్రెసు రాజకీయాల్లో నలిగిన వ్యక్తి ఆయన. పార్టీపై పట్టు సాధిస్తే తప్ప ప్రభుత్వంపై పట్టు రాదని ఆయనకు తెలుసు. అందుకనే తను ప్రధాని అయిన కొన్ని నెలలకే 1992లో జరిగిన ఎఐసిసి సెషన్‌లో తనను తాను పార్టీ అధ్యక్షుడిగా చేసుకున్నాడు. కాంగ్రెసు వర్కింగ్ కమిటీని తన విధేయులతో నింపేశాడు. పార్టీలో తన వ్యతిరేకులను యిబ్బంది పాలు చేయడానికి హవాలా స్కాముల వంటివి ఉపయోగించుకున్నాడు. రాజకీయంగా కూడా బలంగా వుండడానికి పివి చేసిన ప్రయత్నాలు మన్‌మోహన్ చేయలేదు. మన రాష్ట్ర విభజన విషయంలో సైతం తన సొంత అభిప్రాయాన్ని పక్కన పెట్టి సోనియా చెప్పినట్లు తలవూపాడు. ఆంధ్ర ప్రాంతానికి వెళ్లి వివరించే సాహసం చేయలేదు. సోనియాను కట్టడి చేయడానికి పివి బోఫోర్స్ స్కామును ఉపయోగించుకోవడం చేత తర్వాతి రోజుల్లో సోనియా పివిపై కక్ష సాధించింది. 1996లో కాంగ్రెసు 140 సీట్లు గెలిచి మిశ్రమ ప్రభుత్వం ఏర్పరచడానికి పివి ప్రయత్నిస్తూండగానే జనరల్ సెక్రటరీ మాధవరావు సింధియా చేత 'ప్రభుత్వ ఏర్పాటుకై కాంగ్రెసు ప్రయత్నించదు' అని సోనియా ప్రకటింపచేసి, పివికి అడ్డుకొట్టింది. చనిపోయిన తర్వాత పివి శవం కూడా ఢిల్లీలో వుండకుండా చేసింది. 2009లో కాంగ్రెసు పార్టీ 125 వ వార్షికోత్సవ సభలో ప్రధానులు పేర్లు చెపుతూ పివి పేరు తలవను కూడా తలవలేదు. తనకూ అలాటి గతే పడుతుందని భయపడి కాబోలు మన్‌మోహన్ రాజకీయంగా బలపడడానికి అస్సలు ప్రయత్నించలేదు. సోనియా చెప్పినట్లల్లా ఆడి, ప్రధాని పదవిలో చివరిదాకా కొనసాగి, ఏం బావుకున్నాడా అని చూస్తే ఏమీ కనబడటం లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

## ఎమ్బీయస్ : పాకిస్తాన్–తాలిబన్ లింకు

తాలిబన్లను పాకిస్తాన్ ప్రభుత్వమే పెంచి పోషిస్తోందని, మన దేశంలో ఉగ్రవాద చర్యలకు ఐఎస్ఐయే కారణమని అందరికీ తెలుసు కానీ వాటికి ఆధారాలు దొరకడం కష్టం. తన పాత్రికేయ వృత్తి రీత్యా ఆ ఆధారాలు సంపాదించిన కార్లోటా గాల్ అనే "న్యూయార్క్ టైమ్స్" కరస్పాండెంట్ రాసిన "ద రాంగ్ ఎనిమీ" అనే పుస్తకం యిప్పుడు మార్కెట్లోకి వచ్చింది. 9/11 దాడి తర్వాత "న్యూయార్క్‌టైమ్స్" వారు ఆమెను ఆఫ్ఘనిస్తాన్‌కి పంపించి ఆ దాడుల వెనక తాలిబన్లు, ఆల్ కైదా పాత్ర గురించి పరిశోధించమన్నారు. అప్పటినుండి 12 ఏళ్లపాటు ఆమె అఫ్ఘనిస్తాన్‌లోనే వుండిపోయి, అక్కడ అమెరికన్లు చేసిన విధానపరమైన లోపాల గురించి కథనాలు పంపుతూ వచ్చింది. తమపై దాడి తర్వాత అమెరికా అఫ్ఘనిస్తాన్‌పై విరుచుకుపడి తాలిబన్లను నాశనం చేసిన సంగతి అందరికీ తెలుసు. తాలిబన్లు నిర్మూలించబడినందుకు, అమెరికా సహాయంతో హమీద్ కర్జాయ్ ప్రభుత్వం ఏర్పడినందుకు అఫ్ఘనిస్తాన్ ప్రజలు ఎంతో సంతోషించారని ఆమె రాసింది. కానీ అది ఎక్కువకాలం నిలవలేదు. అఫ్ఘనిస్తాన్‌ను పరోక్షంగా తమ అధీనంలోకి తెచ్చుకోవడానికై మళ్లీ తాలిబన్ల ప్రభుత్వం ఏర్పరచాలని పథకం వేసిన పాకిస్తాన్ ప్రధాని పర్వేజ్ ముషారఫ్, అతని యింటెలిజెన్సు చీఫ్ అష్ఫాక్ పర్వేజ్ కయానీ తాలిబన్లకు పాకిస్తాన్ పర్వతప్రాంతాల్లో ఆశ్రయం కల్పించి, వారికి తర్ఫీదు యిప్పించారు. మదరసాల్లో చదువుకుంటున్న అనేకమంది పిల్లల్ని వాళ్ల తలిదండ్రులకు తెలియకుండా తాలిబన్లు తీసుకుని వచ్చేసి ఆ క్యాంపుల్లో సూయిసైడ్ బాంబర్లగా తయారుచేసి వారిని అఫ్ఘనిస్తాన్‌లో ప్రయోగించారు. 2006 నాటికి దక్షిణ అఫ్ఘనిస్తాన్‌లో యిలాటి ఆత్మాహుతి దాడులు కనీసం 100 జరిగి వుంటాయి. ఇలా పిల్లల్ని పోగొట్టుకున్న వారు బహిరంగంగా బాధపడడానికి కూడా భయపడేవారు. ఐయస్ఐ ఏమైనా చేస్తుందేమోనని వారి భయం.

ఉగ్రవాదంపై పోరాటానికి అమెరికాతో సహకరిస్తున్నామని పైకి చెప్తూనే పాకిస్తాన్ అంతర్గతంగా తాలిబన్లను, కశ్మీరీ ఉగ్రవాదులను, ఇండియన్ ముజాహిదీన్‌ను, అల్ కైదా సంబంధిత సంస్థలకు సహాయం అందిస్తోందని జర్నలిస్టులు రాస్తున్నా అమెరికన్ ప్రభుత్వాధికారులు చాలాకాలం నమ్మలేదు. నమ్మక తప్పని పరిస్థితి వచ్చినపుడు 'పాకిస్తాన్ వద్ద అణ్వాయుధాలు వున్నాయి. వారితో పేచీ పెట్టుకోలేం' అనేవారు. క్రమంగా తాలిబన్లు చెలరేగిపోయి కాబూల్‌పై దాడులు జరిపినపుడు, వాటికి మూలం పాకిస్తాన్‌లో దొరికినపుడు యిక ఒప్పుకోక తప్పలేదు. 2008 జులైలో అమెరికన్ సెక్యూరిటీ అధికారులు రొటీన్‌గా ఐయస్ఐ అధికారుల ఫోన్ 'ట్యాప్' చేస్తూండగా ఒక అధికారి ఇండియన్ ఎంబసీపై కారు బాంబు ఎటాక్ గురించి ప్లాన్ చేసిన వైనం వారి దృష్టికి వచ్చింది. కొన్ని నెలల తర్వాత ముంబయిపై జరిగిన దాడిలో ఐయస్ఐ హస్తం పూర్తిగా తేటతెల్లమైంది. ఉగ్రవాదంపై పాకిస్తాన్ ప్రభుత్వం ఆడుతున్న నాటకం గురించి అమెరికాకు ఏ సందేహం మిగలలేదు. అందుకే వారు 2011 మేలో బిన్ లాడెన్ పై దాడి చేసేముందు ఐయస్ఐకు చెప్పలేదు. ఆ నాటి దాడిలో లాడెన్ దొరికాక కూడా అతని వునికి గురించి తమకేమీ తెలియదని పాకిస్తాన్ ప్రభుత్వం చెపుతూ వచ్చింది. అలా ఎలా చెప్పగలదు? అది నిజమా కాదా? అని కార్లోటా గాల్ రెండేళ్లపాటు పరిశోధించి ఆ వివరాలు తన పుస్తకంలో రాసింది.

ఏబటాబాద్‌లో లాడెన్ దాగున్న యింటి పేరు వజీర్‌స్తాన్ హవేలీ. పాకిస్తాన్–అఫ్ఘనిస్తాన్ సరిహద్దుల్లో వున్న పర్వతప్రాంతాల్లో

శిక్షణ పొందుతూ అఫ్గనిస్తాన్‌పై దాడులు చేస్తూ వాటిలో గాయపడినవారిని ఐయస్ఐ పాకిస్తాన్‌లోని కొన్ని నగరాలలో, ప్రశాంతంగా వుండే కాలనీల్లో విడిగా వుండే యిళ్లల్లో ఆశ్రయం కల్పిస్తూ చికిత్స చేయించేది. స్థానికంగా వుండే ఇంటెలిజెన్సు అధికారులకు, సివిల్ అధికారులకు అలాటి యిళ్లను పట్టించుకోవద్దని, సోదా చేయనక్కరలేదని ఆదేశాలు యిస్తారు. వాటిలో ఎవరు నివాసం వుంటారో కూడా వారికి తెలియదు. అటువంటిదే యీ హవేలీ కూడా. దీనిలో లాడెన్ వున్న విషయం స్థానిక అధికారులకు కూడా వాళ్లకు తెలియదు. తెలిసి వుంటే ఆ నోటా యీ నోటా విషయం పొక్కి వుండేది.  ఐయస్ఐలో కూడా అమెరికన్ గూఢచారులు వుంటారు కాబట్టి సిఐఏకు తెలిసి వుండేది, లాడెన్‌పై కక్ష కట్టిన అమెరికన్ ప్రభుత్వం అతనిపై దాడి చేసేది. అందువలన ఐఎస్ఐ ఏం చేసిందంటే లాడెన్ సంగతి చూడడానికి ఒక ప్రత్యేకమైన డెస్క్ ఏర్పాటు చేసి, అక్కడో అధికారిని కూర్చోబెట్టింది. లాడెన్ విషయాల్లో ఏ నిర్ణయం తీసుకోవాలన్నా అతనే తీసుకున్నాడు. ఎవరినీ సంప్రదించే పని లేదు. అందువలననే వ్యవహారం రహస్యంగా వుండిపోయింది. ఐయస్ఐలో ఎవరైనా ఒక అధికారి ఒక ఆదేశం యిస్తే చాలు, తక్కినవారెవరూ ఎందుకు, ఏమిటి అని ప్రశ్నించరు. అది ఆ సంస్థ నిర్వహణ తీరు. ఆ హవేలీ జోలికి పోవద్దు అని ఒక్క సూచన పైనుండి వచ్చింది. అంతే స్థానిక అధికారులు ఎవరూ ఆ జోలికి వెళ్లలేదు.

నిజానికి దానికి కొన్ని వందల గజాల దూరంలోనే కాకుల్ మిలటరీ ఎకాడమీ వుంది. దానికి ఏడాదికి రెండుసార్లు ఆర్మీ చీఫ్ వస్తూ వుంటాడు. అక్కడ తర్ఫీదు పొందే కాడెట్లపై ఉగ్రవాదుల దాడులు కూడా జరుగుతూంటాయి. అందువలన సెక్యూరిటీ కాపాడడానికి చుట్టుపట్ల యిళ్లన్నీ  తిరిగి ఎవరున్నారో వాకబు చేసి అవసరమైతే సోదాలు చేస్తూ వుంటారు. ఇలాటి పరిస్థితుల్లో యీ యింట్లో ఎవరున్నారో ఎవరూ పట్టించుకోకపోవడానికి కారణం – ఆ ఐయస్ఐ ఉన్నతాధికారి ఆదేశాలే! చివరకు 2011 మే 2న ఆ యింటిపై దాడి జరిగి 40 నిఎఎల పాటు అమెరికన్ సైనికులు ఆ యింట్లో వీరవిహారం చేసినప్పుడు కూడా ఆ అకాడెమీ నుండి ఎవరూ వచ్చి తొంగిచూడకపోవడానికి కూడా అదే కారణం! సిఐఏ అధికారులకు లాడెన్ ఆచూకీపై సమాచారం లభించి ఆ యింటి కాంపౌండ్‌ను పరీక్షించినపుడు గమనించిన విషయం ఏమిటంటే – ఆ యింటికి సొరంగం లేదు, దాక్కోడానికి నేలమాళిగ లేదు, ఏదైనా దాడి జరిగితే తప్పించుకుని పోవడానికి మరో ద్వారం లేదు. ఇలాటి యింట్లో లాడెన్ ఎందుకున్నాడు? 'అమెరికన్లు దాడి జరిపే ప్రమాదం వుంటే మాకు ముందుగా తెలుస్తుంది. అప్పుడు నిన్ను నిమిషాల్లో వేరే యింటికి తరలించేస్తాం' అని ఐయస్ఐ అధికారి హామీ యివ్వడం చేతనే! అందుకనే అమెరికన్లు దాడి చేసినపుడు లాడెన్ ఆశ్చర్యానికి గురయ్యాడు. అచేతనుడై పోయి ఆయుధాలు చేతిలోకి తీసుకోలేదు, పేల్చలేదు. ఇంట్లో పేలుళ్లు జరుగుతూంటే ఎలా రియాక్ట్ కావాలో కూడా తెలియనంత దిగ్భ్రాంతికి గురయ్యాడు. ఇది సిఐఏ ముందే వూహించింది. ఐయస్ఐను విశ్వాసంలోకి తీసుకుంటే వాళ్లు లాడెన్‌కు చెప్పేస్తారని గ్రహించుకుని వారికి చెప్పకుండానే మొత్తం ఆపరేషన్ నిర్వహించింది.

అయితే యింతకీ లాడెన్ డెస్క్ నిర్వహించిన ఆ ప్రత్యేక అధికారి ఎవరు? అది స్పష్టం కాలేదు. ఐయస్ఐ చీఫ్‌గా 2004 నుండి 2007 దాకా పని చేసి రిటైరైన కయాని కావచ్చు, లేదా అతని తర్వాత ఆ పదవిలోకి వచ్చిన అహ్మద్ షుజా పాషా కావచ్చు, లేదా అతనికి డిప్యూటీగా పనిచేసి తర్వాత వారసుడిగా వచ్చిన జహీర్ ఉల్ ఇస్లాం కావచ్చు, వీరెవరూ కాకుండా నదీమ్ తాజ్ కూడా కావచ్చు. అతను ముషారఫ్‌కు భార్యవైపు బంధువు, మిలటరీ ఇంటెలిజెన్సుకు, ఐయస్ఐకు నాయకత్వం వహిస్తూ ముషారఫ్‌కు మిలటరీ సెక్రటరీగా పనిచేశాడు. ఇలాటి పుస్తకాల వలన తమ అధినేతల నిర్వాకాల గురించి పాక్ ప్రజలకు కనువిప్పు కలిగి వారిపై తిరగబడితేనే కానీ ఐయస్ఐ ఆగడాలకు కళ్లెం పడదు. – ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)

## ఎమ్బీయస్ : ఏ మేరే వతన్‌కే లోగోంఉ – నెహ్రూ స్పందన

జవహర్‌లాల్ నెహ్రూ మరణించి 50 వ వర్ధంతి ఈ మేలో జరుగుతోంది. ఆ సందర్భంగా అనేకమంది ప్రముఖులు ఆయనతో అనుభవాలను నెమరు వేసుకున్నారు. 'ఏ మేరే వతన్‌కే లోగోంఉ' పాటతో నెహ్రూకు కన్నీళ్లు తెప్పించిన లతా మంగేష్కర్ ఆ రోజు ఏం జరిగిందో ఒక వ్యాసం ద్వారా తెలిపారు – 1962లో చైనాతో యుద్ధం ముగిసిన రెండు నెలలకు రిపబ్లిక్ దినోత్సవ సందర్భంగా ఢిల్లీలో ఒక కార్యక్రమం ఏర్పాటు చేశారు. దానికి లతాను ఆహ్వానించారు. సినిమాల నుండి దేశభక్తి గేయాలను, భజనలను ఆలపించాలని ఆమె అనుకున్నారు. అయితే చైనా యుద్ధంలో మరణించిన సైనికులకు అశ్రునివాళి అర్పిస్తూ కవి ప్రదీప్ 'ఏ మేరే వతన్ కే లోగోంఉ' అనే పాట రాశారు. దాన్ని లతా ఆలపించాలని కోరుకుని ఆమెకు ఫోన్ చేశారు. ఆమె తను బిజీగా వున్నాననీ, కొత్త పాట నేర్చుకోవడానికి రిహార్సల్స్ చేయలేననీ, గతంలో పాడినవే మళ్లీ పాడతాననీ అన్నారు. ఆయన 'లతా, నువ్వు ఒకసారి వచ్చి పాట విని అప్పుడు చెప్పు." అని పట్టుబట్టాడు. గాంధేయవాది ఐన ప్రదీప్ కవి, గాయకుడు, సంగీతదర్శకుడు కూడా. ఒక కాగితంపై పాట రాసి లతాకు యిచ్చి కొన్ని లైన్లు పాడి వినిపించాడు. లతాకు విపరీతంగా నచ్చేసింది. సరే పాడతానంది. ఆ పాట మొదటి మూడు లైన్లకు ప్రదీప్ యిచ్చిన ట్యూనే వాడారు. తర్వాతి తక్కిన పాటంతా సి.రామచంద్ర కూర్చారు. ఆయన లతాకు నేర్పాడు. అప్పటికే వాళ్లిద్దరి మధ్య సఖ్యత చెడినా యీ పాట కోసం కలిసి పనిచేశారు. అసలు రామచంద్ర లతా, ఆశా యిద్దరి చేతా పాడిద్దామని ప్లాన్ చేశారని, కానీ లతా పట్టుబట్టి ఆశాను తీయించేసిందనీ అంటారు.

ఫంక్షన్‌కు నాలుగు రోజుల ముందే రామచంద్ర ఢిల్లీ వెళ్లి అక్కడ ఏర్పాట్లు చూడవలసి వచ్చింది. 'మీరు లేకుండా రిహార్సల్స్ ఎలా?' అంది లతా. ఆయన కూడా గాయకుడే కాబట్టి ఒక టేపు మీద పాట పాడి లతాకు యిచ్చి వెళ్లాడు. 1963 జనవరి 26న ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక విమానంలో సినీ కళాకారులందరూ వెళ్లారు. దిలీప్ కుమార్, నెహ్రూ అభిమాని అయిన దర్శకనిర్మాత మెహబూబ్ ఖాన్ (నెహ్రూ మరణించిన మర్నాడే యీయనా గుండెపోటుతో పోయాడు) కూడా వచ్చారు. లతా విమానంలోనే పాట ప్రాక్టీసు చేసింది. మర్నాడు సాయంత్రం వీళ్ల ఫంక్షన్ జరిగింది. లతా వేదిక ఎక్కి "అల్లా తేరో నామ్" ("హమ్ దోనో" సినిమాలోది) పాడింది. తర్వాత యీ పాట పాడింది. పాట సాగుతున్నంతసేపు సూది కిందపడితే వినబడేటంత నిశ్శబ్దం. ఆ తర్వాత హెూరున చప్పట్లు. వేదికపై నెహ్రూతో సహా సభాసదులంతా కన్నీళ్లు పెట్టారు. పాట పాడుతున్న లతా యీ కన్నీళ్లు గమనించలేదు. వేదిక వెనక్కి వచ్చి కాఫీ తాగుతోంది. ఇంతలో మెహబూబ్ ఖాన్ ఆమె వద్దకు వచ్చి "పండిట్‌జీ (నెహ్రూని అలాగే పిలిచేవారు) పిలుస్తున్నారు." అంటూ చేయిపట్టుకుని నెహ్రూ వద్దకు తీసుకెళ్లి "ఇదిగో మా లతా..." అన్నాడు గర్వంగా. నెహ్రూ ఆమె కేసి చూస్తూ "అమ్మాయ్, యివాళ నన్ను ఏడిపించేశావ్" (లడ్కీ, తూనే ముఝే ఆజ్ రులాయా హై) అన్నాడు. కాస్సేపు పోయాక యిక వుండలేక ఫంక్షన్ పూర్తి కాకుండానే వెళ్లిపోయాడు. ఎందుకంటే చైనా యుద్ధం ఆయనను మానసికంగా కలచివేసింది. శాంతిదూతగా ప్రపంచఖ్యాతి తెచ్చుకున్న తను పాలిస్తున్న దేశంపై పొరుగున వున్న చైనా మిత్రద్రోహం చేసి దాడి చేయడం తనను నైతికంగా దెబ్బ తీసినట్లే అని భావించాడాయన. ఆ కలతతోనే మరుసటి ఏడాది కన్ను మూశాడు. ఆ యుద్ధంలో మరణించిన సైనికుల త్యాగాల గురించి రాసిన ఆ పాట ఆయన్ని కదలించివేసింది.

మర్నాడు తన నివాసంలో టీకి రమ్మనమని నెహ్రూ సినీ కళాకారులందరినీ ఆహ్వానించాడు. లతా కూడా వెళ్లింది. రాజ్ కపూర్, దిలీప్ కుమార్, శంకర్, జైకిషన్, మదన్‌మోహన్ యిత్యాదులు నెహ్రూతో మాట్లాడుతూండగా లతా ఓ మూల ఒదిగి నిలబడింది. అతిథుల బాగోగులు చూసుకుంటున్న ఇందిరా గాంధీ ఆమె వద్దకు వచ్చి "మీరు కూడా వచ్చి కలవండి." అంది. "వద్దు నాకిక్కడే బాగుంది." అంది లతా. "అలా అయితే మీరు యిక్కడే నిలబడండి. మీ వీరాభిమానులు యిద్దరు మిమ్మల్ని కలవడానికి తపిస్తున్నారు." అంటూ వెళ్లి రాజీవ్, సంజయ్‌లను తీసుకుని వచ్చింది. కొన్ని నిమిషాలు పోయాక నెహ్రూ గట్టిగా "లతా ఎక్కడుంది?" అని గట్టిగా కేక వేశాడు. లతా ఆయన దగ్గరికి వెళ్లింది. "బొంబాయి తిరిగి వెళ్లాక మళ్లీ యీ పాట పాడతావా?" అని అడిగాడు. "ఏమో తెలియదు" అంది లతా. అప్పుడాయన ఒక ఫోటోగ్రాఫర్‌ను పిలిచి లతాను, తనను కలిపి తీయమన్నాడు. తర్వాత లతా నెహ్రూ సెక్రటరీతో "ఫోటో కాపీ వచ్చాక నెహ్రూ గారి సంతకంతో నాకు పంపించండి." అని కోరింది. ఆ ఫోటో యిప్పటికీ లతా వద్ద వుంది.

కొన్ని నెలల తర్వాత బొంబాయిలోని బ్రేబర్న్ స్టేడియంలో ఒక చారిటీ షో జరిగితే నెహ్రూ అతిథిగా వచ్చాడు. లతా పాటల కార్యక్రమం కూడా వుంది. ఆమె వేదిక వెనక్కాల వుండగా నెహ్రూ గారి నుండి సందేశం వచ్చింది – వచ్చి 'ఏ మేరే వతన్‌కే లోగోంఁ' పాడాలని. ఈమె రామచంద్ర వద్దకు వెళ్లి "మీ ఆర్కెస్ట్రా దగ్గర నొటేషన్ వుందా?' అని. ఉందన్నాడు. అందరూ కలిసి త్వరగా రిహార్సల్ వేసి చూసుకున్నారు. ఓకే అనుకున్నాక లతా వెళ్లి పాడేసింది. పాట అయిపోగానే నెహ్రూ లేచి వెళ్లిపోయారు. కారులో ఎక్కాక వెళ్లబోతూ లతాను పిలిపించారు. ఆమె రాగానే కిటికీ అద్దం కిందకు దింపి, ఆమె చేతిని పట్టుకుని అదిమి, "నీ పాట వినడానికే వచ్చాను. నువ్వు పాడి వుండకపోతే చాలా నిరాశపడేవాణ్ని." అన్నాడు. రసజ్ఞుడైన నెహ్రూకు అనేక లలితకళల పట్ల అవగాహన వుంది. స్పందించే హృదయం వుంది. ఎమ్ఎస్ సుబ్బులక్ష్మి పాట విని "ఈ సంగీత చక్రవర్తిని ముందు నేను కేవలం ఒక దేశానికి ప్రధానమంత్రిని మాత్రమే" అన్నాడాయన. ఆయన తర్వాత వచ్చిన ప్రధానుల్లో పివి నరసింహారావు, వాజపేయిలకు కళల పట్ల అభినివేశం వుంది. కానీ నెహ్రూతో పోల్చడానికి మాత్రం సరిపోరు.– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)

## మే 18 ఎమ్బీయస్ : ఎన్నికల ఫలితాలు

సబ్జక్టులోకి వెళ్లబోయేముందు కాస్త వ్యక్తిగత వివరణ – పదిరోజులుగా నా ఆర్టికల్స్ కనబడకపోవడంతో చాలా రకాలైన వ్యాఖ్యలు వచ్చిపడడంతో యీ వివరణ అవసరపడుతోంది. నేను యూరోప్ పర్యటనలో వుండడం చేత వ్యాసాలు రాయలేకపోయాను. దాంతో 'ఏమైంది? ఆరోగ్యసమస్యా?', 'గ్రేట్ ఆంధ్రాకు రాయడం మానేశావా?', 'ఫలితాలు చూసి హతాశుడవై మందుకొట్టి తొంగున్నావా?' 'నిరాశలో మునిగిపోయావా?' యిలా బోల్డు వాకబులు. నిజానికి టూరుకి వెళ్లబోయేముందు 'పదిరోజుల విరామం' పేర ఒక ఆర్టికల్ రాద్దామనుకున్నాను. 'ఫలితాలు వచ్చేసరికి నేను ఇండియాలో వుండను, తెలుసుకునే అవకాశం కూడా వుండదు. ఈ లోగా మీరు ఏవేవో ఊహించుకోకండి. జగన్ ఓడిపోతే ఆత్మహత్య చేసుకుని వుంటానని, నెగ్గి వుంటే నన్ను మీడియా సలహాదారుగా తీసుకుని వుంటాడని అనుకోకండి. నా సీరియల్స్ పాఠకులు దిగాలు పడకండి. ఒకవేళ నేను ఎక్కిన విమానం హైజాక్‌కు గురైతే నీతిచంద్రిక కథలో పులికి చిక్కిన ఆవు దూడకు పాలిచ్చి తిరిగి వస్తానని వేడుకున్నట్లు వాళ్లను 'నా సీరియల్స్ పూర్తి చేసి వచ్చేస్తాను. లేకపోతే ఆ పాఠకులు వూరుకోరు. ముఖ్యంగా రాజీవ్ హత్య పూర్తి చేయకపోతే 'ఎమ్బీయస్ హత్య' వార్త చూడాల్సి వస్తుందని బెదిరిస్తున్నారు' అని బతిమాలుకుని వస్తాను..' యిలా సరదాగా రాద్దామనుకున్నాను.

అంతలోనే అనుమానం వచ్చింది – ఇదేదో ఫేస్‌బుక్ వ్యవహారంలా తోస్తుందాని. ఫేస్‌బుక్‌లో చూడండి 'ఇవాళ మార్నింగ్ వాక్‌కు

వెళ్లాను, కొత్తబూటు కాబట్టి కరిచింది, దారిలో కుక్క మొరిగింది, దొంగ అనుకుని జనాలు వెంటబడడంతో జాగింగ్ కూడా చేయాల్సి వచ్చింది, దాని తాలూకు సెల్ఫీ యిదిగో..' అంటూ రాస్తూంటారు. అలాగే యిదీ అనిపిస్తుందని భయం వేసి, మధ్యలో దుమ్మా కొట్టడం అలవాటే కదా అని వూరుకున్నాను. తీరా చూస్తే యిదీ వరస! తిరిగి వచ్చాక గత పదిరోజుల పేపర్లు క్షుణ్ణంగా చదివితే తప్ప ఫలితాల విశ్లేషణ రాయలేను. ఇవాళ్టి నుండి ఆ పనిలోనే వున్నాను. 'నీ ప్రిడిక్షన్ తప్పింది. మీ జగన్ రాలేదు' అంటూ కొంతమంది రాశారు. మొదటగా 'మా జగన్' కాదు. నేను జగన్ పార్టీకి ఓటెయ్యలేదని మొదటే రాశాను. అవకాశం వుంటే సమైక్యపార్టీకి ఓటేసి వుండేవాణ్నని రాశాను. ఆంధ్రలో ప్రజలు ఆ పార్టీకి సింగిల్ డిజిట్‌లోనైనా సీట్లు యివ్వాలని ఆశించాను. విభజన జరిగిపోయాక సమైక్యమేమిటి నీ మొహం అనేవారికి దానిలోనే సమాధానం యిచ్చాను – సమైక్యభావన ముఖ్యం అని.

ఇవాళ చూడండి, 200 కంటె తక్కువమంది సెక్రటేరియట్ ఉద్యోగుల స్థానికతపై కొట్టుకుని చచ్చిపోతున్నారు. ఇది ఒక శాఖలో! తక్కిన శాఖల విషయానికి వస్తే యింకెన్ని గొడవలు వస్తాయో తెలియదు. దొంగ సర్టిఫికెట్లు యిచ్చారని వీరంటారు. కాదు, ఎక్కడ చదివామో అక్కడి సర్టిఫికెట్లు యిచ్చాం, అది బోగస్ ఎలా అవుతుందని వారంటారు. స్థానికత నిర్ణయించడానికి జన్మస్థలమో, చదివిన స్థలమో దేన్ని ప్రాతిపదికగా తీసుకోవాలో యిప్పటిదాకా విధానపరమైన నిర్ణయం లేకుండా ఎలా వుంటుంది? జన్మస్థలం అన్నా అది వివాదమే. సాధారణంగా ఎవరైనా అమ్మమ్మ గారింట్లో పుడతారు. తాతగారు ఉద్యోగరీత్యా ఏ వూళ్లో వుంటే ఆ వూళ్లో పుడతారు. అది పరరాష్ట్రం కావచ్చు, పరదేశం కావచ్చు. దాన్ని పట్టుకుని నువ్వు బెంగాలీవి, పంజాబీవి, ఆస్ట్రేలియన్‌వి అంటే ఎలా? అన్నదమ్ముల్లా విడిపోదాం అంటూ స్లోగన్స్ యిచ్చినవారు యిలాటి విషయాలపై కొట్టేసుకుంటున్నారు. ఇలాటివి ఎన్నో ఎన్నో వస్తాయి. పైగా ఆంధ్ర ముఖ్యమంత్రి 'చంద్ర'బాబుకి, తెలంగాణ ముఖ్యమంత్రి 'చంద్ర'శేఖర్‌కు 'చుక్కెదురు'. ఇద్దరూ ప్రతీ అంశాన్నీ వివాదం చేసి, తమ తమ ప్రాంతాల్లో ఛాంపియన్లుగా ఎదగడానికి చూడవచ్చు. ఇది ఉభయ ప్రాంతాలకూ నష్టం. అందుకే సమైక్య భావనైనా వుండాలంటాను. అయితే ఆ పార్టీని ఎవరూ నమ్మినట్లు లేదు. అది దురదృష్టం.

ముందుగా ఆంధ్ర ఫలితాల గురించి కాస్త చెప్తాను. ఫలితాలపై మీడియా అంచనాలు, నాయకుల అంచనాలు ఒకసారి గుర్తుకు తెచ్చుకోండి. ఎన్నికల సమయంలో కార్యకర్తలను ఉత్సాహపరచడానికి క్లీన్ స్వీప్ చేస్తాం అని చెప్పడం సహజం. అయిపోయిన తర్వాత కూడా బాబు, జగన్ యిద్దరూ 130– 140 దాకా వస్తాయని ప్రకటనలు చేశారు – ఎందుకో, ఏం ఆశించో, తమ క్యాంపునుండి ఎమ్మెల్యేలు పారిపోతారన్న సందేహంతోనో తెలియదు. ఎన్నికల రోజున స్వయంగా చూసిన కొందరు పరిశీలక మిత్రులు (టిడిపి, వైకాపా పార్టీల వాళ్లు) తమ పార్టీకి 120 నుండి 140 వరకు ఖాయం అని చెప్పారు. 9 వ తారీకు పేపర్ల ప్రకారం బాబు ''మా పార్టీకి (కూటమి అనలేదాయన) 120 నుంచి 130 సీట్లు, యిరవైకి పైగా ఎంపీ సీట్లు వస్తాయి. ప్రజల మద్దతు ప్రభంజనం రూపం దాలిస్తే యింకా పెరిగితే పెరగవచ్చు'' అన్నారు. ఎవరెన్ని చెప్పినా నేను నెగ్గే పార్టీకి 90 నుండి 100 మాత్రమే వస్తాయని చెప్పాను. నెగ్గిన టిడిపికి 102 వచ్చాయి. అంటే నా అంచనా 2% తప్పితే బాబు గారి అంచనా 30% కు పైగా తప్పింది. (జగన్‌దైతే చెప్పినదానిలో 50% కూడా రాలేదు) ఓడే పార్టీకి 55 నుండి 70 లోపున వస్తాయన్నాను. (వైకాపాకు 67 వచ్చాయి) అంత మార్జిన్ కూడా ఎందుకిచ్చానంటే కాంగ్రెస్, జెయస్పీ, బిజెపి, యిండిపెండెంట్స్, లెఫ్ట్ వంటి పార్టీలకు ఎన్ని వస్తాయో చెప్పలేకపోతున్నాం కాబట్టి అన్నాను. అంటూనే ఎంతైనా వాటికి 15–20 సీట్లు వస్తాయని గెస్ చేశాను. వాస్తవానికి వాటికి 6 (బిజెపికి 4, యితరులకు 2) మాత్రమే వచ్చాయి. 90 నుండి 100 తెచ్చుకునే పార్టీ ఏది అనే విషయం రాస్తూ వైకాపాకు రాయలసీమ వాసులు బాబు కంటె జగన్‌ను ఎక్కువ ఆదరిస్తారని రాశాను. అనంతపురం తప్ప తక్కిన జిల్లాల్లో వైకాపాకే ఎక్కువ వచ్చాయి. నెల్లూరులో అయితే వైకాపాకే చాలా ఎక్కువ వచ్చాయి.

కోస్తా ప్రాంతాల్లో 'ఉత్తరాంధ్ర, తూగోజి 2009లో వలె జగన్‌పై చూపితే ... వైకాపాకు లాభం.' అని రాశాను. (చూపలేదు. అక్కడే వైకాపా దెబ్బ తింది) ఆ పరిస్థితిలో వైకాపాకు 100 సీట్లు వస్తాయని అనిపిస్తోంది అంటూనే కేవియట్లు రాశాను. క్రైస్తవం ద్వారా ఓట్లు సమీకరిస్తున్నాడన్న ఫీలింగ్ వలన వలన హిందువుల్లో జగన్ వ్యతిరేక ఓట్లు పెరిగాయని, కెసియార్‌తో సాన్నిహిత్యం (నా వ్యాసం తర్వాత, ఎన్నికలయిపోయాక కెసియార్ మాట్లాడుతూ ఆంధ్రకు జగనే సిఎం అని చెప్పి, తమ మధ్య లింకును చాటుకున్నారు) కారణంగా ఆంధ్రులు జగన్ పట్ల ఉదారంగా వుండకపోవచ్చని రాశాను. ఇవన్నీ రాసి వైకాపా 90 దగ్గర ఆగిపోవచ్చని రాస్తూ మళ్లీ దానికి రైడర్‌గా 'మోదీ మ్యాజిక్ పనిచేసి మధ్యతరగతి యిబ్బడిముబ్బడిగా ఓట్లు వేస్తే మాత్రం యీ అంకెలు టిడిపికి వస్తాయి' అని రాశాను. (మోదీ మ్యాజిక్ దేశమంతా పనిచేసింది, మధ్యతరగతి యిబ్బడిముబ్బడిగా ఓట్లు వేశారు) టిడిపికి యీ అవకాశముంది అని రాస్తూనే 'పార్టీ ఫిరాయింపుదార్లను తీసుకుని సొంత క్యాడర్‌ను అసంతృప్తికి గురి చేసిన కారణంగా వెన్నుపోట్లు తగిలి టిడిపి యీ అంకె చేరకపోవడానికి ఛాన్సుంది' అని రాశాను. ఇదీ నా ఆఖరి వాక్యం. అయితే మోదీ హవాలో ఆ ఫ్యాక్టర్ పెద్దగా పనిచేయలేదు. పిఠాపురంలో మాత్రం టిడిపి రెబెల్ నెగ్గాడు.

ఆ విధంగా చూస్తే నా అంచనాలు మరీ యిదిగా తప్పలేదు. ఇక్కడో విషయం రాయాలి. నేను యూరోప్ ట్రిప్‌కు వెళ్లాను కదా. 45 మంది వున్న గ్రూపు అది. అందరూ స్టేటుబ్యాంక్ ఆఫీసర్లూ, వాళ్ల కుటుంబాలే. మధ్యతరగతి కుటుంబీకులే. అందరూ టిడిపి వీరాభిమానులే, జగన్ అంటే విపరీతమైన కోపం కలవారే. స్విజర్లండ్‌లో యుబిఎస్ బ్యాంకు చూడగానే 'జగన్ బ్యాంక్' (ఇంకెవరి వద్దా బ్లాక్‌మనీ లేనట్టు) అని కేకలు వేసినవారే. బాబు, మోదీ గెలిచితీరతారని ఉత్సాహంగా మాట్లాడినవారే. ఫలితాలు వెలువడిన

రోజున కాస్త చిరునవ్వులు కనబడ్డాయి కానీ తర్వాత చప్పబడ్డారు. బిజెపికి బాగానే వచ్చినా టిడిపి 102 వద్ద ఆగిపోవడం వాళ్లకు మింగుడుపడలేదు. మీడియా హైప్ వలన కనీసం 140 వస్తాయని అందరూ ఆశించివున్నారు. చెప్పవచ్చేదేమిటంటే – టిడిపి గెలిచింది కానీ అది అభిమానులు ఆశ పెట్టుకున్నంత ఘనవిజయం మాత్రం కాదు.

నేను టిడిపికి ఘనవిజయం దక్కలేదు అని రాస్తే కొందరు నొచ్చుకున్నారు. టిడిపికి వచ్చినవి 58% సీట్లు. పాస్ మార్కు 50% అయినపుడు, ఫస్ట్ క్లాసు రావాలంటే కనీసం 60% రావాలి కదా. వైకాపా కంటె 35 సీట్లు అంటే 20% సీట్లు ఎక్కువ వచ్చాయి కానీ ఓట్ల శాతంలో తేడా చూస్తే 2% మాత్రమే. 2004లో టిడిపి ఓడిపోయినప్పుడు బాబు దగ్గర్నుంచి అందరూ – కాంగ్రెసుకు మాకంటె కేవలం 2% ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయి అన్నారు. ఇప్పుడు జగన్ కూడా అదే చెప్పుకుంటున్నారు – మా కంటె కేవలం 6 లక్షల ఓట్లు మాత్రమే ఎక్కువ వచ్చాయని! కేంద్రంలో కాంగ్రెసుపై బిజెపి సాధించిన ఘనవిజయంతో పోలిస్తే టిడిపి విజయం తెలిపోతోంది కదా. కానీ ఏ మాట కా మాట చెప్పాలంటే – ఆంధ్రలో వైకాపా, తెలంగాణలో తెరాస గెలిచి తీరతాయని గత కొన్నేళ్లగా విపరీతంగా ప్రచారం జరుగుతున్నా ఆత్మవిశ్వాసంతో, స్థయిర్యంతో బాబు పోరాడుతూ రావడం వలననే యీ విజయం సాధ్యపడింది. ఫలితాలు రావడానికి ముందే నేను రాశాను – విభజన వలన టిడిపి లాభపడుతోంది అని. 2009లో ఉమ్మడి రాష్ట్రంలో టిడిపికి వచ్చిన మొత్తం సీట్లు 92, యీ రోడు రెండు రాష్ట్రాలలో కలిపి వాళ్లకు వచ్చినవి 117! 25 పెరగడం అంటే మాటలు కాదు కదా! రెండు రాష్ట్రాలలో బలంగా వున్న పార్టీ అదొక్కటే. కాంగ్రెసుకు ఆంధ్రలో సున్నా, వైకాపాకు తెలంగాణలో కేవలం 3. టిడిపి తెలంగాణలో కాంగ్రెసు తర్వాతి స్థానం. ఆంధ్రలో పాలకపక్షం!

ఆంధ్రరాష్ట్రంలో వచ్చిన ఫలితాలను పరిశీలించినపుడు కొన్ని ధోరణులు స్ఫుటంగా కనబడుతున్నాయి. పోరాటం రెండు పార్టీల మధ్యనే కేంద్రీకృతం అయింది. కాంగ్రెసు, యితర పార్టీలకు కొన్ని సీట్లు వస్తాయని, రెబెల్స్, యిండిపెండెంట్స్ ఓట్లు చీల్చి, ఎన్నికల చిత్రాన్ని గందరగోళ పరుస్తారని నేను అనుకుంటూ వచ్చాను. అందువలననే స్పష్టమైన ఫలితాలు రావని, ఏ పార్టీకీ వాళ్లనుకుంటున్న 130లు, 140లు రావని చెప్తూ వచ్చాను. అయితే కాంగ్రెసు, కానీ యితర పార్టీలు కానీ సోదిలోకి లేకుండా పోయాయి. ఎటువంటి క్లిష్టపరిస్థితుల్లోనైనా కాంగ్రెసుకు 20% ఓటు బ్యాంకు వుంటూ వచ్చింది. ఎమర్జన్సీ తర్వాత కూడా రాష్ట్రంలో కాంగ్రెసు గెలిచింది. కానీ యీసారి దేశమంతా కాంగ్రెసు వ్యతిరేక పవనాలు బలంగా వీచి వారి ఓటింగు శాతం 28% నుండి 19.3%కి పడిపోయింది. (బిజెపికి 12% పెరిగింది) కాంగ్రెసుకు కంచుకోట అయిన ఆంధ్రలో నేడు 19.3% కాదు కదా, 3% తెచ్చుకుంది. బొత్స కుటుంబం బలంగా వున్న ఉత్తరాంధ్రలో 5% తెచ్చుకోబట్టి కానీ లేకపోతే ఆ అంకె యింకా పడిపోయి వుండేది. 289 లక్షల ఓట్లలో కేవలం 8 లక్షల ఓట్లు తెచ్చుకుందంటే పరిస్థితి ఎంత ఘోరంగా వుందో చూడండి. బిజెపి 15 రెట్ల స్థానాల్లో పోటీ చేసి దాని కంటె కేవలం 1.70 లక్షల ఓట్లు ఎక్కువ తెచ్చుకుందంటే అంతకంటె సిగ్గుచేటు వుందా?

సుమారు డజను మంది కాంగ్రెసు వారికి మాత్రమే 10 వేలకు పైగా వచ్చాయి. 150 మంది కాంగ్రెసు అభ్యర్థులకు డిపాజిట్ పోయింది. వాళ్లకు 5 వేల కంటె తక్కువ ఓట్లు వచ్చాయి. వారిలో చాలామంది 2 వేలు కూడా రాలేదు. 8 నియోజకవర్గాల్లో వెయ్యి కంటె తక్కువ వచ్చాయి. పిరమిడ్ పార్టీ కంటె తక్కువ ఓట్లు తెచ్చుకున్న మహానుభావులున్నారు. ముఖ్యమంత్రి పదవికై ఆశ పడిన ఆనం రామనారాయణరెడ్డికి 9000 కూడా రాలేదు. పిసిసి అధ్యక్షుడు రఘువీరారెడ్డికి మూడో స్థానం దక్కింది. గాండ్రించిన కొండ్రు మురళీమోహన్‌కు 5 వేలు కూడా రాలేదు. చివరకి దాకా ఊగుతూనే వున్న సాకె శైలజానాథ్‌కు 2 వేల పైన చిల్లర వచ్చింది. బొత్స ఒక్కరే 42 వేలు తెచ్చుకుని మర్యాద దక్కించుకున్నారు. కొందరు ఎంపీల ఓట్లు చూస్తే అవి పార్లమెంటు సీటుకా, అసెంబ్లీ సీటుకా అన్న సందేహం వచ్చింది. రాష్ట్రం ఏమైనా సరే, సోనియాకు విధేయులమంటూ చెప్పుకున్న పళ్లంరాజు, పనబాక లక్ష్మి, కిశోర్ చంద్రదేవ్, కిల్లి కృపారాణి.. ఒకరని ఏముంది, అంధరూ.. మట్టి కరిచారు. కాంగ్రెసుతో పాటు తక్కిన పార్టీలు కూడా పూర్తిగా గుండుసున్న చుట్టేశాయి. కిరణ్ కుమార్‌ను ఎవ్వరూ నమ్మలేదు. ఆయన తమ్ముడు కూడా నెగ్గలేదు. సమైక్యపార్టీ, లోకసత్తా ఒకే స్థాయిలో వున్నాయనుకుంటా.

తక్కిన పార్టీలు తుడిచిపెట్టుకుపోవడంతో ఇక టిడిపి, వైకాపాల మధ్య ముఖాముఖీ యుద్ధం జరిగింది. టిడిపి గెలిచింది. కానీ యీ విజయం అంత సులభంగా దక్కలేదు. బాబు తన స్ట్రాటజీ మార్చుకుంటూ, మెరుగులు దిద్దుకుంటూ పోయారు. మానిఫెస్టో విడుదల చేసిన తర్వాత కూడా కాపు, బిసి డిప్యూటీ సిఎం పదవుల హామీ యిచ్చారు. ప్రతీ ఓటూ ముఖ్యమే అనుకుంటూ పోరాడారు. కాంగ్రెసునుండి ఫిరాయింపులను ప్రోత్సహించారు. బిజెపితో పొత్తు కోసం ఆరాటపడ్డారు. గీచిగీచి బేరాలాడి చివరకు వెంకయ్యనాయుడు సహాయంతో నిలుపుకున్నారు. పవన్ కళ్యాణ్ యింటికి వెళ్లి పిలుచుకుని వచ్చారు. ఆయన స్థాయి నాయకుడికి యిది అవసరమా? ఈ ఫిరాయింపులు పార్టీకి చేటు తేవా? క్యాడర్ నిస్పృహ చెందదా? అనే సందేహాలు పరిశీలకులను బాధించినా, ఆయన అనుకున్నది చేశారు. మనసుకు కష్టం కలిగినా టిడిపి కార్యకర్తలు సర్దిచెప్పుకుని పనిచేసినట్లున్నారు. ఈసారి అధికారంలోకి రాకపోతే జగన్ పవర్‌లోకి వచ్చి యింకో పదేళ్ల దాకా పాలిస్తాడన్న భయం పట్టుకుందిలాగుంది. కసితో కష్టపడ్డారు. ఎక్కడెక్కడినుండో ఓటర్లను రప్పించి ఓట్లు వేయించారు. ఓటింగు శాతం పెరగడం టిడిపికి లాభించింది.

పవన్ కళ్యాణ్ ఫ్యాక్టర్ ఏ మేరకు పనిచేసింది? అంటే కాపు కులస్తులు అధికంగా వున్న ప్రాంతాల్లో టిడిపి–బిజెపి బాగా గెలిచింది కాబట్టి ప్రభావం వుందనే అనుకోవాలి. ఆయన రాకపోయినా కాపులు యీసారి టిడిపికి వేసేవారేమో అని కూడా అనుకోవచ్చు. కానీ

పవన్ రావడం వలన ఆ ఓట్లు కన్సాలిడేట్ అయి వుండవచ్చు. ఆయన టిడిపికి వ్యతిరేకంగా ప్రచారం చేసి వుంటే, లేదా ఒంటరిగా పోటీ చేసి వుంటే కాపు ఓట్లపై ఆయన ప్రభావం గురించి స్పష్టంగా తెలిసేది. పవన్ ప్రభావితం చేయగల యింకో వర్గం యువత – వాళ్లు అన్ని కులాలలో వుంటారు. వారిని ఏ మేరకు చేశారనేది మరి కొన్ని గణాంకాలు వస్తే తెలుస్తుంది. కమ్మ – కాపు కలిశారన్న సమీకరణంతో చూడడం ఏ మేరకు కరక్టో నాకూ తెలియదు కానీ ఫలితాలను ప్రాంతాల వారీగా విడగొట్టి చూస్తే ఒక ట్రెండ్ కనబడుతోంది. దాని ప్రకారం యీ కులాలు ఎక్కువగా వున్నచోట టిడిపి బాగా గెలిచింది. 'ఉమ్మడి రాష్ట్రంలో రెడ్ల ప్రాబల్యం వుంటూ వచ్చింది, రాష్ట్ర విభజన జరిగాక కూడా యింకా వారేనా? మరొకరికి ఛాన్సు యిద్దాం.' అన్న భావనతో ఆ ప్రాంతాల్లో వైకాపాకు వ్యతిరేకంగా ఓట్లు వేసినట్లు తోస్తోంది. వైయస్ అనంతరం రోశయ్య సిఎం అయ్యారు. వైశ్యులకు అలాటి ఛాన్సు రావడం అరుదు. జగన్ తిరుగుబాటు చేయడంతో అతన్ని కట్టడి చేయడానికి రోశయ్యను అధిష్టానం తీసేసింది. ఆ చర్య వైశ్యులను బాధించి వుంటుంది. వైకాపాకు వ్యతిరేకం చేసి వుంటుంది. ఇలా అనేక వర్గాలు ఏకమై వైకాపా ఉధృతిని కట్టడి చేసి వుంటాయి. లేకపోతే ఉపయెన్నికలలో ఘనవిజయం సాధించిన వైకాపా, మొన్నటిదాకా జాతీయ మీడియా సర్వేలన్నీ తప్పక గెలుస్తాడని ఘోషిస్తూ వచ్చిన వైకాపా యింత వెనకబడిపోదు. ఇలా వెనకబడడానికి కారణం – అది కొన్ని ప్రాంతాల్లో పూర్తిగా దెబ్బ తినడమే. కాస్త వివరంగా అంకెలతో సహా చెప్తాను.

ఉత్తరాంధ్ర (శ్రీకాకుళం, విజయనగరం, వైజాగ్ జిల్లాలు)లో 34 సీట్లుంటే టిడిపికి ఓట్లలో 45%, సీట్లలో 71% వచ్చాయి. వైకాపాకు ఓట్లలో 41%, సీట్లలో 26% మాత్రమే దక్కాయి. కోస్తా (ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు)లో 67 సీట్లుంటే టిడిపికి ఓట్లలో 45%, సీట్లలో 71% రాగా, వైకాపాకు ఓట్లలో 43% వచ్చినా 22 సీట్లు మాత్రమే వచ్చాయి. తీరప్రాంతాలైన ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో 22 సీట్లుంటే టిడిపికి 44% ఓట్లు వచ్చిన సీట్లలో 36% మాత్రమే వచ్చాయి. వైకాపాకు 48% ఓట్లు వచ్చినా సీట్లలో 59% వచ్చాయి. రాయలసీమ (కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు)లో 52 సీట్లుంటే టిడిపికి 44% ఓట్లు, 42% సీట్లు వచ్చాయి, వైకాపాకు 47% ఓట్లు, 58% సీట్లు వచ్చాయి. అంటే ఓట్లు–సీట్లు కన్వర్షన్ విషయంలో వైకాపాకు తీరప్రాంతపు జిల్లాలు, రాయలసీమలో అడ్వాంటేజి వచ్చింది కానీ అక్కడున్న సీట్లు 74 మాత్రమే. 101 సీట్లున్న ఉత్తరాంధ్ర, కోస్తాలలో ఆ అడ్వాంటేజి టిడిపికి వచ్చింది. రావడం కూడా భారీగా వచ్చింది. 45% ఓట్లతో 71% సీట్లు గెలుచుకుంది. జగన్‌కు సపోర్టుగా నిలిచిన కడప, కర్నూలు, చిత్తూరు, నెల్లూరు, ప్రకాశం, గుంటూరులో కొంతభాగం రెడ్డి జనాభా ఎక్కువగా కలిగినవే. తక్కిన చోట్ల వారి జనాభా తక్కువ. ఈ పోలరైజేషన్ టిడిపికి లాభించింది. పోలరైజేషన్ వలన హోరాహోరీ పోరాటం జరిగిన తక్కువ మార్జిన్‌తోనే గెలిచిన సందర్భాలున్నాయి. 19 నియోజకవర్గాలలో 2 వేల మెజారిటీతో గెలుపు లభించిన వారిలో 13 మంది వైకాపావారు, 6గురు టిడిపివారు. వైకాపా గెలిచిన 67 నియోజకవర్గాల్లో దానికి 49.1% ఓట్లు వస్తే, టిడిపికి 41.3% ఓట్లు వచ్చాయి. టిడిపి–బిజెపి గెలిచిన 106 నియోజకవర్గాల్లో వాటికి 50.42% ఓట్లు వస్తే వైకాపాకు 41.79% వచ్చాయి.

కులపరంగా ఓటింగు అనేది ఉత్తరభారతంలో జరిగినంతగా మన దగ్గర జరగదు. కానీ ఒక్కోప్పుడు దాన్ని రెచ్చగొడుతూ వుంటారు. ప్రతీ ప్రాంతంలోనూ అన్ని కులాల వారూ వుంటారు. కులాలకు అతీతంగా రాజకీయభావాలతో ఓట్లు వేస్తారు. అందువలన దీన్ని 'బ్రాడ్లీ స్పీకింగ్..' ధోరణిలోనే తీసుకోవాలి. ఇక వైకాపా విషయానికి వస్తే – నెగ్గినచోట కూడా బ్రహ్మాండంగా నెగ్గలేదు. ఓడినచోట మరీ దారుణంగా ఓడలేదు. తొలిసారి సాధారణ ఎన్నికలలో పాల్గొన్న పార్టీకి యీ మాత్రం సాధించడం గొప్పేనని – ముఖ్యంగా నాయకుడు 16 నెలలు జైల్లో వున్న తర్వాత – చెప్పి వాళ్లు తప్పించుకోవచ్చు. కానీ ఉపయెన్నికలలో అద్భుతమైన విజయాలను సాధించిన వైకాపా సాధారణ ఎన్నికలకు వచ్చేసరికి చతికిలబడడానికి కారణాల గురించి వెతికితే ప్రధానంగా కనబడేది – ఆంధ్రులకు సోనియాపై, కెసియార్‌పై విపరీతమైన కోపం వుంది. జగన్ వారిద్దరితో కుమ్మక్కయ్యాడని సందేహం వారికి వుందని అర్థమవుతోంది. ఎన్నో ఏళ్ల కాంగ్రెసుకు 3% ఓట్లు వచ్చాయంటేనే తెలుస్తోంది కోపం డిగ్రీ ఎంత వుందో! కిరణ్ కుమార్ పార్టీ కూడా అంత చేటుగా దెబ్బ తినడానికి కారణం – సోనియా చెప్పినట్లు కిరణ్ ఆడాడన్న ప్రతిపక్షుల ప్రచారాన్ని ప్రజలు నమ్మారు. అందుకే అతనికీ వాత పడింది. రాష్ట్రవిభజనకు సహకరించాలన్న షరతుపైనే జగన్‌కు బెయిల్ సోనియా యిప్పించిందని నమ్మిన జనాలు జగన్‌కు వ్యతిరేకమయ్యారు. కాంగ్రెసుకు ఉరిశిక్ష వేసి, జగన్‌కు తక్కువ శిక్షతో పోనిచ్చారు.

అలాగే కెసియార్‌తో ఒప్పందం విషయం కూడా! కెసియార్‌ను జగన్ పల్లెత్తు మాట అనకపోవడం, జగన్ కెసియార్‌ను అనకపోవడం జనాలలో సందేహం కలిగించింది. పవన్ కళ్యాణ్ ఆ విషయాన్ని పదేపదే ప్రస్తావించి ప్రజల్లోకి తీసుకెళ్లగలిగారు. తెలంగాణలో తెరాసకు మెజారిటీ తగ్గితే వైకాపా ఆదుకుంటుందన్న ప్రచారం కూడా జోరుగా సాగింది. బలం లేకపోయినా తెరాస వ్యతిరేక ఓట్లు చీల్చడానికై వైకాపా అనేక చోట్ల అభ్యర్థులను నిలబెట్టిందన్న ప్రచారం కూడా ఆంధ్రులు నమ్మారు. ఎన్నికల తర్వాత కెసియార్ 'ఆంధ్రకు జగన్ సిఎం' అని చెప్పి, జగన్‌పై తన అభిమానాన్ని చాటుకున్నారు. రెండు రాష్ట్రాలు ఏర్పడుతున్న సమయంలో చాలా పేచీలు వస్తాయని, తమ ప్రయోజనాలను కాపాడగలిగిన మొనగాడు తమకుండాలని యిరుప్రాంతాల ప్రజలు గట్టిగా నమ్మారు. ఆంధ్రలో చంద్రబాబు వచ్చే సూచనలు బలంగా కనబడుతున్నాయి కాబట్టి, అతనితో ఢీకొని తెలంగాణకు నష్టం కలగకుండా చూసే సత్తా కెసియార్‌కు మాత్రమే వుందని తెలంగాణ ప్రజలు నమ్మడం చేతనే పార్టీవ్యవస్థ లేనిచోట్ల కూడా తెరాస గెలిచింది. ఉద్యమం కోసం పోరాడిన బిజెపికి కూడా వాళ్లు ఓట్లేయలేదు. కాంగ్రెసులాగే బిజెపికు కూడా రెండు చోట్ల యూనిట్లు వున్నాయి కాబట్టి రాజీ

పడతారన్న శంక వుంది. బిజెపికి వచ్చిన సీట్లన్నీ ఆంధ్రమూలాలున్నవారు అధికంగా వున్న ప్రాంతాలవే. ఉద్యమం నడిచిన చోట్ల బిజెపి నెగ్గలేదు. తెలంగాణ ప్రజల్లాగానే ఆంధ్రప్రజలు కూడా తమకోసం తెలంగాణ పాలకులతో పోరాడే ఉద్దేశం, శక్తి బాబుకి మాత్రమే వుందని అనుకున్నారు. జగనైతే కెసియార్‌తో రాజీ పడి, తమ ప్రయోజనాలను తాకట్టు పెట్టేస్తాడని సందేహించారు. బాబుకి గాని, జగన్‌కు గాని, అనేకమంది ఆంధ్రనాయకులకు గాని హైదరాబాదులో అనేక ఆస్తులున్నాయి. వాటిని రక్షించుకోవాలంటే కెసియార్‌తో సఖ్యంగా వుండాలి. అందుకే కెసియార్ నెగ్గగానే సినీప్రముఖులంతా క్యూలు కట్టి దణ్ణాలు పెట్టి వచ్చారు. ఆ ఆస్తులను కాపాడుకోవడానికి తమ రాష్ట్రానికి రావలసిన న్యాయమైన వాటాలు కూడా అడగరని ఆంధ్రులకు భయం.

జగన్ యీ సందేహాలను దూరం చేయలేదు. అసలు అలాటి అవసరమే లేదన్నట్లు ప్రవర్తించారు. వైయస్ సంక్షేమపథకాల గురించి చెప్పుకుంటూ జనాల్లో తిరిగితే చాలనుకున్నారు. తన పార్టీలో వున్న మైసూరా రెడ్డి వంటి వారికి వీటిని ఖండించే పని అప్పచెప్పి వుంటే డామేజి కొంతైనా తగ్గేది. కెసియార్‌ను తప్పుపట్టి వుంటే అనుమానాలు తగ్గి వుండేవి. కానీ జగన్ రాజకీయాల కంటె కెసియార్‌తో స్నేహధర్మానికే ఎక్కువ ప్రాధాన్యత యిచ్చినట్టున్నారు. ఇప్పుడు ఉద్యోగుల పంచాయితీయే చూడండి. విభజన చట్టంలో వున్నది కూడా అమలు చేయకూడదని తెలంగాణ ఉద్యోగి సంఘాలు, కెసియార్ అంటున్నారు. కెసియార్ ఆంధ్ర ఉద్యోగులను సెక్రటేరియట్ గేటు దాటనియ్యం అంటున్నారు. తెలంగాణ సెక్రటేరియట్‌లో యితర రాష్ట్ర వుద్యోగులున్నా ఫర్వాలేదు కానీ ఆంధ్ర ఉద్యోగులు వుంటే కల్తీ అయిపోతుందని ముఖ్యమంత్రి స్థాయికి చేరిన తర్వాత కూడా అంటున్నారు. దాన్ని బాబు ఖండించినంత ధాటీగా జగన్ ఖండించటం లేదు చూశారా. హుందాగా ప్రవర్తించాలని కెసియార్‌కు హితవు చెప్తున్నారంతే. ఇలాటి ప్రవర్తనే ప్రజల విశ్వాసం కోల్పోయేట్లు చేసింది.

కులమే కాదు, మతం కూడా యీ ఎన్నికలలో ప్రాధాన్యత వహించిందని నేను గట్టిగా నమ్ముతున్నాను. దేశం మొత్తం మీద యీ ధోరణి కనబడింది. తొలినుంచీ కాంగ్రెసు పార్టీకి ముస్లిములు, దళితులు దన్నుగా నిలిచేవారు. ఆ పార్టీ వాళ్లకు ఏం ఒరగపెట్టినా, లేకున్నా హిందూ మహాసభ వంటి పార్టీలను చూస్తే వాళ్లకు భయంగా వుండేది. వామపక్షాలు, సోషలిస్టు పార్టీలు సెక్యులరిస్టు ధోరణులు కనబరచినా, వారి నాస్తికవాదం ముస్లిములకు దూరం చేసింది. వీళ్ల సాలిడ్ సపోర్టుతో బాటు హిందువుల్లో కొన్ని కులాలు కూడా ఒక్కోప్పుడు మద్దతిచ్చేవి. అవి ఒక పార్టీ కంటూ కట్టుబడి వుండేవి కావు. ఇలాటి పరిస్థితుల్లో కాంగ్రెసును దెబ్బ కొట్టాలంటే హిందువులను విడకొట్టి వారిలో కొన్ని కులాలను కన్సాలిడేట్ చేసి ఓటుబ్యాంకుగా చేసుకోవాలని సోషలిస్టు నాయకుడు రామ్ మనోహర్ లోహియా అనుకున్నాడు. తమిళనాడులో డిఎంకె అలాటి ప్రయోగం చేసి విజయవంతమైంది. హిందువుల్లో వెనుకబడిన కులాలకు రాజకీయప్రాతినిథ్యం లభించడం లేదన్న నినాదంతో యుపి, బిహార్ రాష్ట్రాలలో ఉద్యమం చేశాడు. అది మొదట్లో బలహీనంగా వున్నా రానురాను బలపడి కర్పూరీ ఠాకూర్, లాలూ ప్రసాద్ యాదవ్, ములాయం సింగ్ యాదవ్ వంటి వారు నిలదొక్కుకోవడానికి ఉపయోగపడింది. వట్టి బిసిలే అంటే బలం చాలదని, వీళ్లు ముస్లిములను కూడా కలుపుకుని పోసాగారు. కాంగ్రెసు మీకేం చేయలేదు, మేం మీకు రిజర్వేషన్లు కల్పిస్తాం, మీ మసీదులను స్కూళ్లగా గుర్తించి, మతబోధకులను టీచర్లగా గుర్తించి జీతాలిస్తాం అంటూ వాళ్లను ఊరించారు. దళితులకు విడిగా పార్టీ వుండాలంటూ యుపిలో బియస్పీ పుట్టుకుని వచ్చింది. ఎస్పీ, బియస్పీ ఒక దశలో కలిసి పోటీ చేశారు. ఆ తర్వాత ప్రత్యర్థులుగా మారారు. మొత్తానికి బలమైన శక్తులుగా మారి అగ్రవర్ణాల నాయకత్వంలో నడిచే కాంగ్రెసు, బిజెపిలను వెనక్కి నెట్టేశారు. ఆ విధంగా మతం కార్డును ఎదుర్కోవడానికి కులం కార్డు బయటకు తీశారు వాళ్లు.

ఈ ఎన్నికలలో ఆ కులం కార్డును ఎదుర్కోవడానికి బిజెపి మతం కార్డు ఉపయోగించింది. ఏ కులానికి చెందినా హిందువులంతా ఒకటే, అందరూ సంఘటితంగా వుండి ముస్లిములను ఎదుర్కోవాలి. వాళ్లను అదుపులో పెట్టకపోతే పేట్రేగిపోతారు – అనే నినాదంతో అమిత్ షా ప్రచారం సాగించారు. 80 సీట్లున్న యుపిలో ముస్లిముల జనాభా 19%. మొహమాటానికైనా బిజెపి ఒక్క ముస్లిము అభ్యర్థికీ టిక్కెట్టు యివ్వలేదు. మాది హిందువుల పార్టీ దట్సాల్, దీనిలో ప్రతీ కులమూ మాకు ముఖ్యమే అంటూ హిందువుల్లో అన్ని కులాలకూ చేరువైంది. ఆ విధంగా ముస్లిములను బుజ్జగిస్తూ ఓట్లు తెచ్చుకుంటున్న ఎస్పీ నుండి, దళితులను బ్రాహ్మణులను నమ్ముకున్న బియస్పీ నుండి ఓట్లు గుంజుకుంది. కులాల వ్యత్యాసాలు మరచి అందరూ బిజెపికి వేయడం వలననే యుపిలో కనీవినీ ఎరుగనంతటి ఘనవిజయం బిజెపికి దక్కింది. బిహార్‌లోనూ అదే జరిగింది. అంచనాలకు మించి బిజెపి ఫలితాలు సాధించడానికి కారణం ఆ రెండు రాష్ట్రాలే! బిజెపిలోని యీ మూడ్ మన రాష్ట్రంలో కూడా పని చేసిందని నా ఊహ. 'క్రైస్తవులు, ముస్లిములు జగన్ వెంట సాలిడ్‌గా నిలబడ్డారు. వారికి దళితులు తోడవుతున్నారు. వైయస్ హయాంలో అనేక చర్చిలు కట్టడానికి ప్రభుత్వధనం ఖర్చు చేశారు. ఇక జగన్ వస్తే వాళ్లకు పట్టపగ్గాలుండవు. మతప్రచారం ముసుగులో అనిల్ రాజకీయాలు నిర్వహిస్తున్నాడు. మతమార్పిడులు విచ్చలవిడిగా చేయిస్తూ, జగన్‌కు ఓటు బ్యాంక్ పెంచుతున్నాడు. వీళ్లూ, ముస్లిములూ కలిస్తే యిక హిందూమతానికి కష్టకాలమే..' అనే ఆలోచన ఆంధ్రప్రజల్లో బాగా నాటుకుంది. తిరుపతిలో జగన్ ప్రవర్తన దానికి నీరు పోసింది. వ్యతిరేకత పెంచింది.

తూర్పు గోదావరి జిల్లా ఒకప్పుడు వైయస్‌కు, తర్వాత జగన్‌కు పెట్టనికోటగా వుండింది. ఇప్పుడు ఎందుకు ఎదురు తిరిగింది? ఉత్తరాంధ్ర వైకాపా ఆశలను వమ్ము చేయడానికి కారణం ఏమిటి? విజయమ్మ అక్కడ నిలబెట్టి జగన్ పొరబాటు చేశారా? నిజానికి అక్కడ విజయమ్మ నిలబడడం ఉత్తరాంధ్రలో వైకాపా కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపాలి. నింపి వుంటుంది కాబట్టే 41% ఓట్లు వచ్చాయి. అయితే 'వైజాగ్ రాజధాని కాబోతోంది. విజయమ్మ యిక్కడ నెగ్గితే కడప గ్యాంగులు వచ్చి యిక్కడి భూముల్ని, వ్యాపారాల్ని

కబళిస్తాయి.' అనే ప్రచారంతో స్థానిక సిండికేట్లు విపరీతంగా ధనం వెచ్చించి విజయమ్మను ఓడించాయని విన్నాను. కొందరు విశ్లేషకులు 'శాంతికాముకులైన ఉత్తరాంధ్ర, కోస్తా ప్రజలను కడప సంస్కృతిని సహించలేక వైకాపాను తిరస్కరించారు' అని రాశారు. అంటే 30% సీట్లు వైకాపాకు కట్టబెట్టిన కృష్ణా, గుంటూరు జిల్లాల ప్రజలు ఆ సంస్కృతిని వెల్‌కమ్ బోర్డు పెట్టుకుని ఆహ్వానించారా? విజయమ్మ అక్కడ నిలబడడానికి ముందూ, వెనకా అక్కడ లిక్కర్ సిండికేట్లు, ఇసుక సిండికేట్లు, ల్యాండ్ మాఫియాలు, మరోటీ మరోటీ వున్నాయి కదా! దోచుకునేవాడు దోచుకుంటూనే వుంటాడు. అవతలివాళ్లు వాటికి కులాల పేర్లూ, ప్రాంతాల పేర్లూ తగిలిస్తూ వుంటారు. హైదరాబాదులో కబ్జాలు ఎప్పుడూ జరుగుతూనే వున్నాయి. తెలంగాణ ఉద్యమం వచ్చాక వాటికి ఆంధ్ర రంగు పులిమి ఆంధ్రోళ్లు వచ్చి ఆక్రమించారు అన్నారు. మొన్న ఎన్నికలలో పవన్ కళ్యాణ్ అవన్నీ వైయస్ అనుచరులవని నిర్వచించారు. దోపిడీకి గురయ్యే ప్రజలకు కడప వారు దోచుకున్నా, స్థానికులు దోచుకున్నా ఒకటే, తేడా పడదు. అయినా పరాయి వాడనగానే ఫియర్ సైకోసిస్ పని చేస్తుంది.

విభజనకు ముందు మాట ఎలా వున్నా, విభజన తర్వాత కొత్త రాజధాని నిర్మాణం, కొత్త కాంట్రాక్టులు, భారీ ఎత్తున నిధుల వ్యయం యివన్నీ వుంటాయని సాధారణ ప్రజలకు కూడా తెలుసు. జగన్‌కు అవినీతిపరుడైన ముద్ర వుంది కాబట్టి యీ ప్రక్రియలో జనరేట్ అయ్యే డబ్బులు సింహభాగం మింగేస్తాడన్న భయమూ ఓటర్లకు కలిగి వుండడంలో ఆశ్చర్యం లేదు. ఆ మాటకొస్తే ఆంధ్ర ఎన్నికలలో ధనం విపరీతంగా ప్రవహించింది. రెండు పక్షాలూ ఖర్చు పెట్టాయి. ఏ పార్టీ నెగ్గినా యిదంతా అవినీతి చేసి రాబట్టుకుంటాయని సులభంగా గ్రహించవచ్చు. కానీ మీడియా జగన్ మీదే దృష్టి ఫోకస్ చేసి, ఓటర్లను ప్రభావితం చేసింది కాబట్టి టిడిపిని ప్రజలు ఎక్కువగా విశ్వసించారు. జెసి దివాకరరెడ్డి కాంగ్రెసు వున్నంతకాలం అక్రమ పర్మిట్లతో బస్సులు నడిపేవాడన్నారు, ఆందోళనలు చేశారు. టిడిపిలో చేరగానే పునీతుడై పోయారా? ఇలాటి తమాషాలు ఎన్నో జరిగాయి కానీ ప్రచారంలో యివన్నీ కొట్టుకుపోయాయి.

ఇంకో ముఖ్యమైన అంశం – బాబు అభివృద్ధిపై ఎక్కువ ఫోకస్ చేసి మాట్లాడారు. నేనూ మోదీ కలిసి రాష్ట్రాన్ని బాగుచేస్తాం అని చెప్పుకుంటూ వచ్చారు. జగన్ ఆ విషయంపై అతి తక్కువ మాట్లాడారు. ఎంతసేపూ వాళ్ల నాన్న కాలం నాటి సంక్షేమపథకాల గురించే మాట్లాడారు. జాతీయ స్థాయిలో తనకు ఎవరు దన్నుగా వుంటారో ఆలోచించలేదు, బయటకు చెప్పలేదు. అక్కడ హంగ్ ఏర్పడుతుందని, ఎవరు బలంగా వుంటే వారికి మద్దతిచ్చి నిధులు తెచ్చుకుంటానని అనుకున్నారు. సుస్థిరప్రభుత్వం ఏర్పడితే తన మద్దతు అవసరం పడదు కదా, అప్పుడేం చేయాలి అన్న ఊహే చేయలేదు. చివరకు అదే జరిగింది. ఎన్నికలకు ముందు చేసుకున్న పొత్తులకు ఎవరైనా ప్రాధాన్యత యిస్తారు. నిజంగా ఆంధ్రలో జగన్ నెగ్గి మోదీకి స్నేహహస్తం చాచినా, ఆయన అందుకోకపోవచ్చు.

డెవలప్‌మెంట్ ఓరియెంటెడ్ అయిన బాబే ప్రస్తుత అవసరం అని ప్రజలు అనుకున్నారు. దానికి తోడు ఆయన రైతు రుణాల మాఫీ ప్రకటించి సంక్షేమం పేర కూడా ఆట్టుకోవాలని చూశారు. కానీ అదే ఎన్నికలలో నెగ్గడానికి కారణం అంటే నాకు నమ్మడం కష్టంగా వుంది. రైతులుండే గ్రామాలలో కంటె పట్టణాల్లో టిడిపికి ఎక్కువ సీట్లు వచ్చాయి. 111 గ్రామీణ నియోజకవర్గాలు 63 వుంటే టిడిపి కూటమి అక్కడ గెలిచినది 57% సీట్లు. పట్టణ, పల్లెలు కలిసిన 35 సెమి అర్బన్ నియోజకవర్గాలలో 20 గెలిచిన టిడిపి కూటమి గెలిచినది 57% సీట్లు మాత్రమే. కానీ 29 అర్బన్ నియోజకవర్గాలలో 23 గెలిచి, అక్కడ 79% సీట్లు తెచ్చుకుంది. అంటే టిడిపి కూటమిని అర్బన్ ఓటర్లే ఎక్కువగా ఆదరించారన్నమాట. మధ్యతరగతి ఉత్సాహంగా ఓటింగులో పాల్గొన్నారు కాబట్టే టిడిపికి యీ విజయం దక్కిందని చెప్పవచ్చు. రైతులు ప్రతి జిల్లాలో వున్నారు. రుణ మాఫీ కేవలం ఒక ఫ్యాక్టర్ కాకుండా, అదే మెయిన్ అయి వుంటే అన్నిటా టిడిపికి ఓట్లు కురవాలి కదా!

ఇక ఎన్నికల సందర్భంగా టిడిపి అవలంబించిన స్ట్రాటజీల గురించి ఓ రెండు ముక్కలు. బిజెపి-టిడిపి కూటమిని బిజెపి జాతీయనాయకులు ఆహ్వానించినా తెలంగాణ బిజెపి నాయకులు, ఆంధ్ర టిడిపి నాయకులు హర్షించలేదు. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న తాము టిడిపితో చేయి కలిపితే మైల పడిపోతామని, తెలంగాణ ఓట్లు తమకు రావని బిజెపి తెలంగాణ నాయకులు పొత్తును నిరాకరిస్తూనే వచ్చారు. బహిరంగంగా ప్రకటనలు చేశారు. చివరకు ఏం జరిగింది? ఉద్యమం జరిపిన చోట్ల బిజెపి సీట్లు గెలవలేదు. అక్కడంతా తెరాసే గెలిచింది. బిజెపి గెలిచిన హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలలో ఉద్యమమే లేదు. అక్కడ ఎందుకు గెలిచిందంటే – టిడిపితో చేయి కలిపింది కాబట్టి, ఆంధ్రమూలాలున్న హైదరాబాదు, రంగారెడ్డి వాసులు తమను రక్షించేది టిడిపి మాత్రమే అని నమ్మి దానికీ, దానితో పొత్తు పెట్టుకున్న బిజెపికి ఓట్లు వేశారు కాబట్టి! టిడిపికి అక్కడ 10 సీట్లు వచ్చి జిల్లాలలో యింకో 5 వచ్చాయి. బిజెపికి అక్కడ ఏమీ రాలేదు.

ఇక ఆంధ్రలో బిజెపికి బలం ఏమీ లేదు కాబట్టి, దానితో పొత్తు అనవసరమనీ, పైగా విభజనకు కాంగ్రెసుతో సహకరించింది కాబట్టి దానిపై వ్యతిరేకత వుంటుందని, బిజెపికి సీట్లు ఎలాట్ చేయడం వలన సొంత క్యాడర్‌కు అన్యాయం జరుగుతుందని టిడిపి నాయకులు బిజెపితో పొత్తును వ్యతిరేకించారు. కానీ బాబు ఎవరి మాటా వినకుండా బిజెపితో పొత్తు పెట్టుకుని లబ్ధి పొందారు. గతాని కంటె భవిష్యత్తే ముఖ్యమని నమ్మిన ఆంధ్రులు మోదీ ఎలాగూ గెలుస్తున్నాడని, అతనితో చేతులు కలిపిన బాబును కూడా ఆదరించాలనీ నిశ్చయించుకున్నారు. ఈ ఇద్దరి కాంబినేషనే తమను గట్టెక్కిస్తుందని ఆశ పెట్టుకుని ఓట్లు వేశారు. పథకాలు, మానిఫెస్టోలూ అన్నీ సెకండరీ అనుకుని వుండాలి. అందుకనే వేరే ఊళ్ల నుంచీ, దేశాల నుంచీ ఎక్కడెక్కడినుంచో వచ్చి ఓట్లు వేశారు. మోదీ వచ్చి బాబును ప్రశంసించడం, యిద్దరి మధ్య సఖ్యత అనేక సభల్లో బాహాటంగా కనబడడంతో మోదీకి వున్న గుడ్‌విల్

బాబుకి కూడా ప్రసరించింది. నిర్మాణదక్షుడిగా బాబుకు ముందే పేరుంది. దానికి మోదీ హవా తోడ్పడింది. ఏ మేరకు తోడ్పడింది, బిజెపితో పొత్తు పెట్టుకుని వుండకపోతే ఏమై వుండేది అనేవి ఎకడమిక్ టాపిక్స్. ఒకటి మాత్రం వాస్తవం. టిడిపికి వచ్చిన పార్లమెంటు సీట్లకు, అసెంబ్లీ సీట్లకు తూకం కుదిరింది. కేంద్రంలో కూడా బాబు ప్రముఖంగా వుండాలన్న ఆకాంక్ష అలా తెలుస్తోంది. బిజెపికి వదిలిన సీట్లలో కూడా టిడిపి ఓటు చేసి వుంటే గెలుపు దక్కేదేమో! కానీ పొత్తు నిలిచేది కాదు. నిజానికి రాయలసీమలో బిజెపికి పొత్తు లాభం చేకూరలేదు. తిరుపతిలో బిజెపి అభ్యర్థి 38 వేల తేడాతో ఓడిపోయారు. పురంధరేశ్వరి 1.74 లక్షల తేడాతో ఓడిపోయారు. మదనపల్లెలో 16 వేల ఓట్ల తేడాతో ఓడిపోయారు. గుంతకల్లులో బిజెపి అభ్యర్థి మూడో స్థానంలో నిలిచారు. కడపలో కూడా డిటో. టిడిపి ఓట్లు బదిలీ కాకపోవడం వలననే యిలా జరిగిందని బిజెపి భావన. పైగా చివరి రెండింటిలో టిడిపి తన అభ్యర్థులను నిలబెట్టింది.

బాబు స్ట్రాటజీస్‌లో విమర్శకు గురైన యింకో అంశం – కాంగ్రెసు నుండి ఫిరాయింపులను ప్రోత్సహించడం! దానివలన పూర్తి లాభం చేకూరలేదు. కాంగ్రెసు నుండి తీసుకున్న వారిలో రాయపాటి, జెసి దివాకరరెడ్డి, పితాని, తోట, గంటా, మండలి యిత్యాదులు నెగ్గారు. శత్రుచర్ల, టిజి వెంకటేశ్, గల్లా అరుణకుమారి, శిల్పా బ్రదర్స్ యిత్యాదులు ఓడారు. అంటే యీ పాలసీ మిశ్రమ ఫలితాలను తెచ్చిపెట్టిందన్నమాట. కాంగ్రెసుపై ప్రజలకున్న ద్వేషం ఏ స్థాయిలో వుందో చూశాక వీళ్లు పార్టీ మారకపోయి వుంటే చావుదెబ్బ తిని వుండేవారని అర్థమవుతోంది. ఆ ఫిరాయింపుదార్లను తీసుకోకపోయినా ఆ నియోజకవర్గాల్లో వారి వలన ఏ హానీ జరిగేది కాదు. టిడిపికి పాజిటివ్ ట్రెండ్ కనబడిన యీ ఎన్నికలలో ఆ ఫిరాయింపులు అనవసరమనే తోస్తోంది. వీళ్లు పార్టీలో ప్రముఖ స్థానాలు ఆక్రమించారంటే వీళ్ల గతచర్యలపై విచారణ జరిగే అవకాశాలు కనుమరుగవుతాయి. ఏది ఏమైనా పదేళ్ల తర్వాత బాబు అధికారంలోకి వస్తున్నారు. పూర్తి రాష్ట్రానికి కాదు, సగం రాష్ట్రానికే. సగం చేయడానికి కారణభూతుల్లో ఆయనా ఒకరు. విభజన చేసినందుకు కాంగ్రెసుకు పెద్ద శిక్షే పడింది. విభజన చేయమని లేఖ యిచ్చినందుకు టిడిపికి పడిన శిక్ష – సగం ముక్క మాత్రమే దొరకడం! విభజన పాపంలో భాగస్వామి అయిన బిజెపికి శిక్ష ఎప్పుడు పడుతుందో తెలియదు. ఈ సగం రాష్ట్రానికైనా బాబు సిఎం కాగలుగుతున్నారంటే దానికి కారణం – విభజనే! ఇదొక పారడాక్స్!

ఈ విజయం కోసం ఆయన అమ్ములపొదిలో అన్ని అస్త్రాలనూ వాడారు. ఎక్కడా ఛాన్సు తీసుకోలేదు. ఎందుకంటే అది ఆయన నాయకత్వానికి జీవన్మరణ సమస్య అయిపోయింది. ఈ సారి టిడిపి ఓడిపోతే, అధ్యక్షుడిగా ఆయన తప్పుకోవాలనే డిమాండ్ వచ్చేది. ఆ పరిస్థితి తలెత్తకుండా ఆయన విజయం సాధించారు. అప్పుడే యిద్దరు ఎమ్మెల్యేలు అదనంగా ఆయన పార్టీలో చేరుతున్నారు. వైకాపా నుండి యింకా కొందరు వచ్చి చేరతామనవచ్చు. వీరు తెచ్చిపెట్టే తలకాయనొప్పులు ఎలా వుంటాయో తెలియదు. కొత్త రాష్ట్రాన్ని నిర్మించే అవకాశం బాబుకి దక్కింది. ఆర్థికపరిస్థితి అధ్వాన్నంగా వుంది కాబట్టి ఎన్నో సవాళ్లు కూడా వున్నాయి. వాటిని అధిగమించి, ఫలితాలు అందిస్తే ఆయనకు మంచి ఖ్యాతి లభిస్తుంది. టిడిపి ఓటర్లకు ఎన్నో ఆశలు కల్పించింది. ఏ మాత్రం విఫలం చెందినా వారి నిరాశ కూడా అంతే తీవ్రంగా వుంటుంది. కేవలం 2% ఓట్ల తేడాతో వెనకబడి వున్న ప్రతిపక్షం బలపడుతుంది. పదేళ్లగా అధికారానికి దూరంగా వున్న పార్టీ సభ్యులు, ఎన్నికల్లో విచ్చలవిడిగా ఖర్చు పెట్టిన నాయకులు అవినీతిరహితంగా ప్రభుత్వాన్ని నడపనిస్తారో లేదో వేచి చూడాలి. అంతేకాదు, మోదీ ప్రభుత్వాన్ని శాసించబోతున్న కార్పోరేట్ సంస్థలే ఆంధ్రప్రభుత్వాన్ని శాసించాలని చూస్తాయి. ముఖ్యంగా తీరప్రాంతపు పెట్రోలుపై కన్నేసిన రిలయన్స్! గుజరాతీ పెట్టుబడిదారులు ఆంధ్రను ముంచెత్తవచ్చు. ఆర్థికప్రగతికి వారి అవసరం వున్నా, వారిని అదుపు చేయకపోతే అనర్థం తప్పదు. అసలే బాబుకి ప్రపంచబ్యాంకు మనిషన్న పేరుంది. దానికి తోడు యీ కార్పోరేట్ బంధువున్న ముద్ర తోడయితే, గతం పునరావృతమవుతుంది. పొగడ్తల అగడ్తలో పడకుండా సామాన్యుడి బాధ అర్థం చేసుకుంటేనే ఆయనకూ, పార్టీకి లాభం. (సశేషం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)

**మే 23** **ఎమ్బీయస్ : ఆంధ్ర రాజధాని**

ఆంధ్రకు రాజధాని ఎక్కడో తేల్చడానికి కేంద్రం ఒక కమిటీ వేసింది. అది రాష్ట్రమంతా తిరిగి వివరాలు సేకరించి, సాధ్యాసాధ్యాలు బేరీజు వేస్తోంది. ఈ లోపునే విజిఎంటి (విజయవాడ, గుంటూరు, మంగళగిరి, తెనాలి) ప్రాంతంలోనే రాజధాని అని యిప్పటికే నిర్ణయమై పోయిందని పేపర్లు రాసేస్తున్నాయి. చంద్రబాబు చర్యలు కూడా ఆ మాట నిజమే అనిపించేట్లు చేస్తున్నాయి. కమిటీలనేవి సూచనలు మాత్రమే చేస్తాయి. నిర్ణయాలు ప్రభుత్వాలు తీసుకుంటాయి. శ్రీకృష్ణ కమిటీ ఎంతో అధ్యయనం చేసింది, ఎన్నో సూచనలు చేసింది. ప్రభుత్వం పట్టించుకుందా? అసలు పార్లమెంటు సభ్యులకు చదవడానికైనా యిచ్చిందా? ఇప్పుడు ఆంధ్రలో ఏర్పడినది టిడిపి ప్రభుత్వం. వాళ్లు ఏం తలచుకుంటే అదే చేయగలుగుతారు. ఎక్కడ కావాలంటే అక్కడ రాజధాని పెడతారు. గుంటూరు–విజయవాడ మధ్య రాజధాని పెట్టి, అనంతపురంలో రెండో రాజధాని పెట్టి రాయలసీమవాసులను తృప్తి పరుస్తారని మరో న్యూస్. అసలు ఒక రాజధాని కట్టడానికే డబ్బుల్లే ఛస్తూంటే, రెండు రాజధానులు ఎలా కడతారో నాకు అర్థం కాదు. రాజధాని ఒకచోట, హైకోర్టు మరోచోట పెట్టడమే సబబైన పని.

1953లో ఆంధ్ర రాష్ట్రానికి రాజధానిగా కర్నూలు చేసి, హైకోర్టు గుంటూరులో పెట్టారు. అప్పుడు రాజధాని మాకు కావాలని

విజయవాడ వాసులు చాలా ఆందోళన చేశారు. అప్పట్లో అది కమ్యూనిస్టు కంచుకోట కాబట్టి స్వతహాగా కాంగ్రెసువాదియైన ప్రకాశం గారు పెట్టనివ్వలేదని కమ్యూనిస్టులు ఆరోపిస్తూ వుంటారు. నేనూ కొంతకాలం దాన్ని నమ్మేవాణ్ని. తర్వాత తీరిగ్గా ఆలోచిస్తే కొన్ని వాస్తవాలు తట్టాయి. అప్పుడూ వాంఛూ కమిటీ వేశారు. వాళ్లూ కొన్ని సిఫార్సులు చేశారు. కమిటీలో వున్నవారికి రాజకీయవాస్తవాలు పట్టవు. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, యాక్సెసబిలిటీ వంటి విషయాలే చూస్తారు. కానీ నాయకుడికి ప్రజాభీష్టం కూడా ముఖ్యం. ఆంధ్రరాష్ట్రం ఏర్పడడానికి పూర్వం జరిగిన విషయాలు మనసులో పెట్టుకునే రాజకీయపరమైన ఆలోచన చేసి ప్రకాశం గారు కర్నూలుని రాజధానిగా ప్రకటించారు. ఉన్న విషయం ఏమిటంటే కోస్తా ప్రజలంటే – ముఖ్యంగా కృష్ణా, గుంటూరు జిల్లా వాళ్లంటే – యితర ప్రాంతాల వాళ్లకు బెదురు. వాళ్లలో చురుకుదనం, చొరవ ఎక్కువ. కొత్త ప్రాంతాల్లో కూడా చొచ్చుకుపోయి ఉద్యోగాలు సంపాదిస్తారు, వ్యాపారాలు చేస్తారు, ఆస్తులు కూడబెడతారు, తద్వారా యిరుగుపొరుగులో అసూయ రేకెత్తిస్తారు. కొంతకాలానికి వారిని డామినేట్ చేయాలని చూస్తారు. ఇవన్నీ వ్యక్తిగత లక్షణాలే కానీ ఒక ప్రాంతానికి చెందిన చాలామందిలో యీ సామాన్యలక్షణం (కామన్ ఫ్యాక్టర్) కనబడేసరికి దాన్ని ఆ ప్రాంతానికి, లేదా కులానికి ఆపాదిస్తారు. బెంగాలీలు కళాప్రియులు, గుజరాతీలు వ్యాపారగుణం కలవారు, తమిళులు పొదుపరులు... యిలా బ్రాండ్ చేయడానికి యిదే కారణం.

కోస్తా వారికి, పంజాబీవారికి పోలికలు కనబడతాయి. కొత్త ప్రదేశాలకు వెళ్లడం, కష్టపడి పనిచేయడం, ఖర్చుపెట్టడం, డాబు ప్రదర్శించడం, తమ ఉనికిని చాటుకోవడం.. యిలా అనేక లక్షణాలున్నాయి. వారి వలన వారున్న ప్రాంతాల్లో ఎకనమిక్ బయాన్సీ (ఆర్థికపరమైన చురుకుదనం) వస్తుంది. విభజన తర్వాత కోస్తావాసులు హైదరాబాదు విడిచివెళ్లిపోతే అక్కడి బయాన్సీ తగ్గుతుందేమోనన్న భయం అందుకే కలుగుతోంది. రియల్ ఎస్టేటు రిజిస్ట్రేషన్, వాహనాల రిజిస్ట్రేషన్, ఎక్సయిజ్ ఆదాయం వగైరా యిప్పటికే తగ్గాయట. హెూటల్స్, సినిమాహాళ్లు, షాపింగ్ మాల్స్ పై ప్రభావం మరింత తీవ్రంగా వుండబోతుంది. నార్త్ నుంచి ఎవరైనా వచ్చి భర్తీ చేస్తే ఆ లోటు కొంతమేరకు తీరవచ్చు.

కోస్తావాళ్లు యితర ప్రాంతాలకు వెళ్లి డామినేట్ చేస్తారన్న భయం వుండడం చేతనే రాయలసీమవాసులు వారితో కలిసి ఆంధ్రరాష్ట్రంగా విడిపోవడానికి యిష్టపడలేదు. మేం మద్రాసులోనే వుండిపోతాం అన్నారు. అప్పుడు వాళ్లని కోస్తా నాయకులు బతిమాలి, బామాలి మాతో రండి, మేం డామినేట్ చేయం అని ఒప్పందాలు చేసుకున్నారు. ఆ ఒప్పందం కాశీనాథుని నాగేశ్వరరావుగారి యింట్లో జరిగింది. ఆ యింటికి పేరు శ్రీ బాగ్. అందువలన దాన్ని 'శ్రీబాగ్ ఒప్పందం' అన్నారు. కాంగ్రెసువారు చేసుకునే అనేక ఒప్పందాల లాగానే దీన్నీ అటకమీద పడేశారు. రాయలసీమలో ఏ నాయకుడైనా రాజకీయంగా నిర్వ్యాపారంగా వుంటే వెంటనే 'శ్రీబాగ్ ఒప్పందం అమలు చేయాలి, లేకపోతే రాయలసీమవాసులం విడిపోతాం' అంటూ నిరసన చేస్తూ వుంటారు. ఎన్టీయార్ సిఎంగా వున్నపుడు రాజకీయంగా ఆయన్ని ఎదుర్కోలేక వైయస్సార్ రాయలసీమ ఉద్యమం నడిపారు. మొన్నటికి మొన్న బైరెడ్డి రాజశేఖరరెడ్డికి కూడా ఆ శ్రీబాగే అందివచ్చింది.

రాయలసీమ వాసులకు యీ భయాలెందుకు, కావాలంటే వాళ్లూ కోస్తా వాళ్లలా వుండవచ్చు కదా అని సులభంగా అనవచ్చు. నిజానికి వాళ్లు మద్రాసు, బెంగుళూరు, బొంబాయిలకు వెళ్లి అనేక వ్యాపారాలు చేస్తున్నారు. అభివృద్ధి చెందుతున్నారు. తమ ప్రాంతాల్లో ఎవరైనా పరిశ్రమలు పెట్టడానికి వస్తే అడలగొట్టి పంపేసిన సందర్భాలూ వున్నాయి. తెలంగాణలో యిటువంటి సమస్య లేకపోవడం చేతనే అన్ని జిల్లాల వారూ తెలంగాణలో పెట్టుబడులు పెట్టి ఆ ప్రాంతం అభివృద్ధి చెందడానికి కారకులయ్యారు. రాయలసీమవాసుల మనోభావాలు తెలిసిన ప్రకాశం గారు అందుకే కర్నూలును రాజధానిగా ఎంచుకుని వారిని శాంతింపచేశారు. అయితే విజయవాడవాళ్లు కోపగించుకున్నారు. అక్కడున్న ప్రకాశం గారి విగ్రహం పగలకొడతామని ప్రకటించారు. ఆ ముక్క ప్రకాశం గారికి చెపితే ఆయన శాంతంగా "పగలకొట్టుకోమను. అది పెట్టమని నేనడిగానా? వాళ్ల యిష్టం కొద్దీ పెట్టుకున్నారు, యిప్పుడు వద్దనుకుంటే మానేయమను." అన్నారు. సరే ఎంతైనా కర్నూలు తాత్కాలిక రాజధానే కదా అని విజయవాడవాసులు చల్లబడ్డారు.

ఇప్పుడు మళ్లీ ఆనాటి ఆంధ్రరాష్ట్రం తిరిగి వచ్చింది. ఈ సారి ఛాన్సు పోగొట్టునీయకూడదని పట్టుదలపై వున్నారు. దానికి తోడు అక్కడివాళ్లు ఆదరించిన టిడిపియే అధికారంలోకి వస్తోంది. అందువలన అక్కడే రాజధాని అనే మాట బలంగా వినబడుతోంది. అది ఎంతవరకు అభిలషణీయం? అన్నదానిపై ఆలోచిస్తే – విజయవాడ, గుంటూరు ప్రాంతాలు యిప్పటికే అభివృద్ధి చెందినవి. విజయవాడకు లొకేషనల్ ఎడ్వాంటేజి చాలా వుంది. అక్కణ్నుంచి దేశంలో ఎక్కడికైనా వెళ్లగల రవాణా సౌకర్యం వుంది. రైళ్లకు, రోడ్లకు కూడలి. వ్యాపారపరంగా అక్కడ ఎంతో బిజినెస్ జరగబోతోంది. రాష్ట్రం విడిపోయాక అన్ని కంపెనీలు తమ డిస్ట్రిబ్యూషన్ పాయింట్లను విజయవాడలో పెట్టవచ్చు. ఎందుకంటే అక్కణ్నుంచి గూడ్సు రైలు ద్వారా ఎక్కడికైనా అతి త్వరగా వస్తువులు చేరవేయవచ్చు. రోడ్డు ద్వారా పంపాలంటే నేషనల్ హైవే ఎలాగూ వుంది. ఇక బకింగ్‌హామ్ కెనాల్‌ను పునరుద్ధరించి జలరవాణాను ప్రోత్సహిస్తే మరీ మంచిది. రాష్ట్రంలో అన్ని ప్రాంతాలకూ సమదూరంలో వుంది. ఎక్కడికైనా డైరక్టు ట్రెయిన్ దొరక్కపోతే విజయవాడకు వచ్చేసి ఎలాగోలా వెళ్లిపోవచ్చు. పొరుగు రాష్ట్రాలకు కూడా. ఈ రకమైన సౌలభ్యం మరే నగరానికీ లేదు.

ఇదే కాకుండా విజయవాడ మీడియా కాపిటల్ కూడా. ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన చాలా ఏళ్లదాకా దినపత్రికలు కూడా మద్రాసు నుండే వచ్చేవి. కొంతకాలానికి ఆంధ్ర నడిబొడ్డున వుండాలని విజయవాడకు మారాయి. విజయవాడలోనే పత్రికాఫీసులు, పుస్తక

ప్రచురణ సంస్థలు, సినిమా పోస్టర్ల ముద్రణాలయాలు, పబ్లిసిటీ సంస్థలు, సినిమా డిస్ట్రిబ్యూషన్ సంస్థలు.. అన్నీ వుండేవి. ఆంధ్రభూమి తెలంగాణ పాఠకులకు క్యాటర్ చేసేది. దాదాపు 40 ఏళ్ల క్రితం ఈనాడు పెడదామనుకున్నపుడు విజయవాడలో అయితే పోటీ తట్టుకోవడం కష్టమని, వైజాగ్‌లో పెట్టారు. ఎందుకంటే విజయవాడ ప్రెస్ ఉత్తరాంధ్రను పెద్దగా కవర్ చేసేది కాదు. ఆ లోటు తీర్చడానికి ఈనాడు అక్కడ పెట్టి అక్కడ మార్కెట్ కాప్చర్ చేశారు. ఏడాది తర్వాత దాన్ని హైదరాబాదుకి తీసుకుని వచ్చేసి తెలంగాణకు మార్కెట్ కూడా కాప్చర్ చేశారు. అది చూసి యిక తక్కిన పత్రికలన్నీ హైదరాబాదుకి వచ్చాయి. నాకు తెలిసి 1994 వరకు కూడా ఆంధ్రజ్యోతికి విజయవాడే మెయిన్ ఆఫీసు. పోనుపోను అన్నీ హైదరాబాదులోనే వచ్చాయి. టీవీ ఛానెల్స్‌తో సహా! ఇప్పుడు రాష్ట్రం విడిపోయింది. విజయవాడకు పూర్వప్రాధాన్యం తిరిగి వస్తుంది. టీవీ ఛానెళ్లు ఆంధ్ర ఎడిషన్లు పెడతాయి. ఈనాడు అప్పుడే విడగొట్టింది. కానీ ఆంధ్ర ఛానెల్‌ను యిక్కడ నుండే వ్యవహరించడం కష్టం. ఎందుకంటే ఆ ఛానెల్‌లో ఎవరో తెలంగాణకు వ్యతిరేకంగా మాట్లాడారంటూ దాని ఆఫీసుపై స్థానికులు దాడి చేసే ప్రమాదం వుంది. టీవీ ఛానెళ్ల స్టూడియోలన్నీ హైదరాబాదులో వుండడం చేతనే సమైక్యవాదం దెబ్బ తింది. చర్చావేదికల్లో ఎప్పుడూ హైదరాబాదు వాసులనే పిల్చేవారు. గట్టిగా సమైక్యవాదం వినిపిస్తే యింటికి వచ్చి బెదిరిస్తారన్న భయంతో వారు నోరు విప్పేవారు కారు. అవాస్తవాలను ఖండించేవారు కారు. పత్రికల్లో రాసినా యిదే భయం. అందువలన ఏ ప్రాంతపు మీడియా ఆ ప్రాంతంలో వుంటేనే నిర్భయంగా వ్యవహరించగలదు.

విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో యిప్పటికే హాస్పటల్స్ చాలా వున్నాయి. మొదటినుండీ అక్కడ నర్సింగ్‌హోంలకు ప్రసిద్ధి. ఇప్పుడు అత్యాధునికమైన సౌకర్యాలు సమకూర్చుకుంటున్నారు. పేషంట్లలో 'హైదరాబాదుకు వెళ్లి వాళ్లకు ఆదాయం ఎందుకు పెంచాలి? మన దగ్గరే చేయించుకుందాం' లాటి ఫీలింగ్స్ యిప్పటికే వచ్చేశాయని వింటున్నాను. డాక్టర్లకేముంది, ఎక్కడ ఆదాయం వుంటే అక్కడికే వెళతారు. మంచి డాక్టర్లను తెప్పించుకుని, మంచి ఎక్విప్‌మెంట్ ఏర్పాటు చేస్తే అదే హెల్త్ టూరిజం సెంటర్‌గా మారుతుంది. దీనికి తోడు గుంటూరు మొదటినుండీ విద్యాకేంద్రంగా ప్రసిద్ధి. అప్పట్లోనే ధన్‌గారి యిన్‌స్టిట్యూట్ అని వుండేది. కోచింగ్ బాగా యిచ్చేవారని ప్రసిద్ధి. ఆ తర్వాత అనేక కార్పొరేట్ కాలేజీలు వెలిశాయి. తెలంగాణవారు సైతం తమ పిల్లల్ని అక్కడికి పంపించి చదివించుకుంటున్నారు. ఇలా చూసినపుడు యిప్పటికే విద్య, వైద్య, మీడియా, ట్రేడింగ్ సెంటర్‌గా వున్న విజయవాడ-గుంటూరు బెల్టు  ఇంకా ఎదుగుతుందని తెలుస్తోంది. పైగా కోస్టల్ కారిడార్ సౌకర్యం కూడా దానికే వుంటుంది. ఇప్పుడు రాష్ట్ర రాజధానికూడా అక్కడ పెట్టాలా? అన్నదే ప్రశ్న. ఇప్పటికే డెవలప్ అయిన చోట రాజధాని పెడితే అది మరో హైదరాబాదుగా తయారవుతుంది. అవసరమా? హైదరాబాదే కదా, తెలుగువాళ్ల మధ్య చిచ్చు పెట్టింది. పార్లమెంటు సాక్షిగా కొట్టుకునేట్లా చేసింది. 'ఒకచోటే అన్నీ పెట్టడం జరగదు, గతంలో చేసిన పొరబాటు మళ్లీ జరగనివ్వం, వికేంద్రీకరణ చేస్తాం' అని బాబు ఓ పక్క చెపుతూనే మరో పక్క విజిఎంటిలో రాజధానికి ఏర్పాట్లు చేస్తూన్నట్లు కనబడడం వింతగా వుంది.

గుంటూరులో గతంలో హైకోర్టు వుండేది. ఆ తర్వాత అక్కడ హైకోర్టు బెంచ్ పెట్టాలని గట్టిగా ఆందోళన జరిగింది. అక్కడ హైకోర్టు పెట్టి, మరోచోట రాజధాని పెడితే మంచిదని నా ఉద్దేశం. ఎక్కడ పెట్టాలి అనగానే అనేక క్లెయిమ్స్ వస్తాయి. హైదరాబాదు అనుభవంతో రాజధాని వున్నచోటే అన్నీ వస్తాయని  అందరూ అభిప్రాయపడడంతో యీ చిక్కు వస్తోంది. లేకపోతే ఓ పది బిల్డింగులు ఎక్కడ వుంటే ఏం పోయింది? అసలు రాజధానితో సామాన్యుడికి ఎన్నిసార్లు పని పడుతుంది? ఇన్నేళ్ల నా జీవితంలో సెక్రటేరియట్‌లో ఎప్పుడూ అడుగు పెట్టలేదు. (ఒకే ఒక్కసారి వెళ్లాను లెండి, కానీ అది చీఫ్ సెక్రటరీగారిని మా ఫంక్షన్‌కు ఆహ్వానించడానికి వెళ్లా! ఏ సెక్షన్ ఎక్కడో తలతిప్పి కూడా చూడలేదు) ఇప్పుడు ఇ-గవర్నెన్స్ వచ్చాక వెళ్లే అవసరాలు యింకా తగ్గిపోతాయి. బాబు ఎలాగూ డిజిటల్ మనిషే కాబట్టి, రాజధానికి రానవసరం లేకుండా ఏర్పాట్లు చేయగలరు. రాజధాని రాష్ట్రానికి మధ్యన వుండాల్సిన అవసరమూ లేదు. అనేక దేశాలకు, రాష్ట్రాలకూ రాజధానులు మూలల్లోనే వున్నాయట. మోదీగారి గాంధీనగర్ కూడా సింపుల్‌గానే వుంటుంది. ఆయన 'ఢిల్లీని తలదన్నే..' అంటూ అనవసరంగా వూరించాడు మనల్ని. కొత్త భువనేశ్వరూ అంతే. ఏవో పది, పదిహేను బిల్డింగులు వరసగా వున్నట్టు వుంటుంది. రాజధానిని సెలక్టు చేసినపుడు ప్రజల మనోభావాలను కాస్త మనసులో పెట్టుకోవాలంటాను నేను. దీనిలో నా స్వార్థం ఏమీ లేదు. ఆ రాష్ట్రంలో నాకు సెంటు భూమి కూడా లేదు. రాయలసీమకు, కోస్తాకు మధ్యలో వున్న ఒంగోలులో రాజధాని వస్తుందని గతంలో ప్రచారం జరిగింది. అదే మంచిదని అనుకుంటాను. ఎందుకంటే ప్రకాశం జిల్లా పక్క జిల్లాల తాలూకాలతో ఏర్పడింది. దానిలో కోస్తా, నెల్లూరు, రాయలసీమ పోకడలు అన్నీ కనబడతాయి. రాజధాని పూర్తిగా రాయలసీమలోనే పెట్టడంలో గల సాధ్యాసాధ్యాలపై చాలా చర్చలు జరిగాయి. ప్రతీ జిల్లాకు ఏదో ఒక అడ్డంకి వుంది. అవన్నీ యిప్పుడు ఏకరువు పెట్టడం అనవసరం.

ప్రకాశం జిల్లా ఎవరికీ పరాయిదానిగా తోచదు. అలా కాకుండా కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పెడితే స్థానికులు డామినేట్ చేస్తారనే భయం తక్కిన జిల్లాల వారికీ, ముఖ్యంగా రాయలసీమవాసులకు కలుగుతుందని నా అంచనా. దానివలన రాజకీయ నిరుద్యోగులు ప్రత్యేక రాయలసీమ నినాదాన్ని ఎత్తుకుంటారన్న భయం. వారికి విజయవాడ పరాయి ప్రదేశంగా తోచి బెంగుళూరు, మద్రాసులలో పెట్టుబడులు పెడతారేమో, ఆ మేరకు రాష్ట్రం నష్టపోతుందేమోనన్న శంక. ప్రకాశం జిల్లా వెనకబడిన ప్రాంతమే. ప్రభుత్వ భూమి కూడా వుంది. అటవీభూమిని డీ-నోటిఫై చేసి వాడుకోవచ్చుట. ఆ మేరకు వేరే చోట చెట్లు  నాటి యిక్కడ కట్టుకోవచ్చు. ఒక్కో చోట ఒక్కో యిండస్ట్రీ వచ్చేట్లుగా చేస్తామని అంటున్నారు. ఆచరణలో ఏం చేస్తారో చూడాలి. వినడానికి అన్నీ

బాగానే వున్నాయి – గోదావరి జిల్లాలలో ఫుడ్ ప్రాసెసింగ్ అనీ, సీమలో మైనింగ్ అనీ.. ఉత్తరాంధ్రలో సీ ఫుడ్ అనీ... ఇన్నాళ్లూ యివన్నీ చేయకుండా ఎందుకు కూర్చున్నారా అని ఆశ్చర్యం వేస్తోంది కదా. ఉమ్మడిగా వున్నపుడు చేయకూడదని ఎవరైనా నియమం పెట్టారా? ఇవన్నీ ఎప్పుడో పెట్టి అభివృద్ధి చేసి వుంటే అంతమంది ఆంధ్రవాసులు తెలంగాణకు ఉద్యోగాలకై వచ్చిపడేవారు కాదు.

స్థలసేకరణ తెలంగాణ అంత యీజీ కాదు. 'మా వూరిలో పరిశ్రమ రావాలి, మాకు ఉద్యోగాలు రావాలి, స్థలం మాత్రం మా పక్కింటివాడిది తీసుకోండి, నా జోలికి రావద్దు, విస్తరణలో నాది గజం పోయినా కోర్టు కెళతాను' అని చెప్పే లిటిగెంట్లు చాలామంది వున్నారక్కడ. అందుకే అక్కడ సెజ్‌లు రావడం కష్టమవుతోంది. పంటపొలాలు యివ్వడానికి ఎవరూ ఒప్పుకోరు. నందిగ్రామ్ వంటి సంఘటనలు జరిగే బెంగాల్‌లో పరిశ్రమలు రావటం లేదు. ఆంధ్రలో కూడా అలాటి సమస్యే రావచ్చు. ఇక ఎడ్యుకేషన్ హబ్‌గా పెట్టబోయే ప్రాంతం గురించి ఒక సూచన (వినేవారుంటే) – దయచేసి అది రాజధానిలో కానీ, ఏదైనా నగరంలోగాని పెట్టవద్దు. అన్ని ప్రాంతాలకు బస్సు ద్వారా, రైలు ద్వారా అందుబాటులో వుండే ఏదైనా మెట్టప్రాంతంలో వున్న చిన్న పట్టణంలో పెడితే బాగుంటుంది. ముఖ్యంగా కాస్ట్ ఆఫ్ లివింగ్ తక్కువగా వుంటేనే విద్యార్థులకు చదువు అందుబాటులో వుంటుంది. హాస్టల్లో వుండకపోయినా బయట వుండి చదువుకోవచ్చు. సెలవులకు యింటికి వచ్చేందుకు వీలుగా కనెక్టివిటీ బాగా వుండాలి. ఇప్పుడు హైదరాబాదులోనే ఉద్యోగాలు, చదువులు, పరిశ్రమలు అన్నీ వుండడంతో సెలవుల్లో బస్సుల, రైళ్ల రద్దీ పెరిగిపోతోంది. ఇవన్నీ విడగొట్టేస్తే యీ సమస్య రాదు.

మనకు నగరాలు అక్కరలేదు. పంజాబ్, హరియాణా, కేరళ తరహాలో ప్రతి పల్లెటూరిలో, సెమి అర్బన్ ప్రాంతంలో ఒక్కో యిండస్ట్రీ చొప్పున పెట్టుకుంటూ వస్తే అన్ని ప్రాంతాలూ బాగుపడతాయి. ఎవరూ ఊరు విడిచి వెళ్లనక్కరలేదు. ప్రస్తుతం పల్లెలు పాడుపడి వున్నాయి. పట్టణాలు కళ తప్పాయి. నగరంపై యావ పెరిగితే అక్కడ పౌరసౌకర్యాలు కుంటుపడతాయి. ధరలు ఆకాశాన్ని అంటుతాయి. ఇప్పటికే ఆంధ్రలో రియల్ ఎస్టేటు రేట్లు విపరీతంగా పెరిగాయి. తెలంగాణ ధనికులు అక్కడ కూడా యిన్వెస్ట్ చేస్తున్నారు. ఆ రేట్లలో కొన్న బిల్డర్లు అక్కడ యిళ్లు ఎలా కట్టి అమ్మగలరో దేవుడికి తెలియాలి. సామాన్యుడి జీవనం దుర్భరమై పోతుంది. ఎట్టి పరిస్థితిలోనూ నగరంలో రాజధాని పెట్టకూడదని ప్రజలు పట్టుబడితే తప్ప లాభం లేదు. వీటి దృష్ట్యా విజయవాడ–గుంటూరుకి యిప్పటికే నగరస్థాయి వుంది కాబట్టి అక్కడ రాజధాని పెట్టకపోవడమే శ్రేయస్కరం. **(సమాప్తం) – ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

**మే 25** **ఎమ్బీయస్ : ఫిరాయింపుల చేదుమాత్ర**

ప్రమాణస్వీకారాలు జరగకుండానే ఫిరాయింపులు మొదలయ్యాయి. విభజన కారణంగా కాంగ్రెసు పార్టీ ఆంధ్రలో తుడిచిపెట్టుకుని పోయింది. అది మళ్లీ ఓ పాటిగానైనా కోలుకోవడానికి కనీసం ఐదేళ్లు పడుతుంది – జాతీయనాయకత్వం బాగుంటే! అదే సోనియా, అదే రాహుల్ అయితే యిటువైపు తొంగి చూడడానికి కూడా భయపడి రారు. పార్టీని బలోపేతం చేయడానికంటూ జైరాం రమేశ్‌ను, కొప్పుల రాజును పంపుతారు. అంతే సంగతులు. అధికారంలోకి వస్తున్న టిడిపికి కాంగ్రెసు బెడద తప్పిపోయింది. ఇక మిగిలినది వైకాపా. 2% ఓట్ల తేడాతో పక్కలో బల్లెంలా వుంది. చేసిన హామీలు నెరవేరుస్తూ ప్రజలను, తద్వారా ప్రజాప్రతినిధులను తమవైపు తిప్పుకుంటూ వచ్చే ఎన్నికల నాటికి వైకాపాను నామమాత్రం చేయడమనే పద్ధతి పాఠ్యపుస్తకాల్లో, సంపాదకీయాల్లో నుడివే పద్ధతి. అంతకంటె అడ్డదారి – ఫిరాయింపులు ప్రోత్సహించి, అవతలి పార్టీని దివాళా తీయించడం. ఇప్పుడు టిడిపి అదే పనిలో పడింది. ఎన్టీయార్ తెలుగుదేశం పార్టీ పెట్టినపుడు కాంగ్రెసు వారిని తన పార్టీలోకి రమ్మనమని ప్రోత్సహించలేదు. ఎవరైనా ఫిరాయిద్దామనుకుంటే తమ పదవికి రాజీనామా చేసి రావాలని షరతు పెట్టారు. ఆ దెబ్బకు యిద్దరు ఎమ్మెల్యేలు వచ్చినట్లే వచ్చి వెనక్కి వెళ్లిపోయారు. పోతే పోనీ అనుకున్నాడాయన. కానీ యిప్పుడున్న టిడిపి, ఎన్టీయార్ నాటి తెలుగుదేశం కాదు. అసలు చంద్రబాబే పెద్ద ఫిరాయింపుదారు. సొంత పార్టీ ఓడిపోగానే, దాన్ని ఎడంకాలితో తన్నేసి, గెలిచిన పార్టీలో చేరిపోయాడు. ఆ తర్వాత ఆ పార్టీ నాయకుణ్నే దించేసి, తరిమేశాడు. అందువలన ఆయనకు ఫిరాయింపుదారుల మనస్తత్వం బాగా తెలుసు. వారితో ఏ భాషలో మాట్లాడాలో ఆ భాషలో మాట్లాడగలరు.

ఇప్పుడు ఎస్పీవై రెడ్డిగారు ఫిరాయించారు. అధికారపార్టీలో వుంటే నియోజకవర్గాన్ని బాగా అభివృద్ధి చేయవచ్చని సంజాయిషీ యిచ్చారు. ఈయన మొన్నటిదాకా అధికారపార్టీ ఎంపీగానే వెలగబెట్టారు. ఏం అభివృద్ధి చేశారు? తన ప్రాంత ప్రజల అభీష్టానికి విరుద్ధంగా రాష్ట్రాన్ని చీలుస్తూంటే నోరెత్తారా? బాబు పరిపాలన ప్రారంభమై అయిదారు నెలల తర్వాత, 'అబ్బో, యిదేదో బ్రహ్మాండంగా వుంది. దీనిలో నాకు భాగస్వామ్యం వుండితీరాలనుకున్నాను' అని చెప్పి మారి వుంటే అదో దారి. ఇంకా ప్రభుత్వం కుదురుకోలేదు, అప్పుడే డిఫెక్షన్లు. ఇక కర్నూలు ఎంపీ రేణుక, అటూ యిటూ వూగి, చివరకు 'వైకాపా ఎంపీనే కానీ టిడిపి అనుబంధ సభ్యురాలిని' అంది. అరకు ఎంపీ గీత కూడా యిప్పుడో, కాస్సేపటికో మారవచ్చుట. సిఎం రమేష్, సుజనా చౌదరి యీ చేపలు పట్టే పనిలో వున్నారట. ఇంకా ఎంతమంది ఎంపీలు, ఎమ్మెల్యేలు గాలానికి చిక్కుతారో తెలియదు. టిడిపి సిద్ధాంతాలు నచ్చాయి కాబట్టి చేరుతున్నాం అని మారేవారెవరూ అనలేరు. వీళ్లంతా ఎన్నికల్లో టిడిపిని తూర్పారబట్టి, వాళ్ల కాండిడేట్‌ని ఓడించి

పదవి చేపట్టినవారే. గత 10 రోజుల్లో టిడిపి కొత్త సిద్ధాంతాలు ఏవీ రూపొందించలేదు. మరెందుకు మారుతున్నారు? అని ఆలోచిస్తే సులభంగా వచ్చే సమాధానం – సులభార్జన కోసం అని. మేసేందుకు వీలున్న పార్టీ కోసం అన్వేషించి దానిలో చేరుతున్నారనుకోవాలి. ఇలాటివారు బాబు ప్రామిస్ చేసిన అవినీతిరహిత పాలనను అందించడంలో సహకరిస్తారా అనేది మొదటగా వచ్చే ప్రశ్న. సహకరించకపోతే యీ ఫిరాయింపులు బాబుకి తలనొప్పి తెచ్చిపెట్టవా అనేది రెండో ప్రశ్న. వీళ్లంతా సచ్ఛీలురు అని టిడిపి యివాళ అనలేదు కదా. పక్షం రోజుల కిందట దాకా వీళ్లంత దుర్మార్గులు లేరు, ఓట్లు వేయకండని లక్షలాది మంది ప్రజలకు చెప్తూ వచ్చారు కదా. గడపలో అడుగుపెట్టిన నాడే తెలిసింది, కాపురం చేసే తీరు అని సామెత. ప్రభుత్వం ఏర్పాటు కాకుండానే యిటువంటి ఆశపోతుల డిఫెక్షన్లు ప్రోత్సహించడం ద్వారా టిడిపి ఏ సంకేతం యిద్దామనుకుంటోంది?

ఈ ఫిరాయింపులను వైకాపా ఖండిస్తోంది. కానీ మొన్నటిదాకా వాళ్లు చేసినదీ యిలాటి పనులే కదా. కాంగ్రెసు నుండి బయటకు వచ్చాక జగన్, గతంలో ఎన్టీయార్‌లా యువతను ప్రోత్సహించి, సమాజంలో రాజకీయాల్లో నిర్లక్ష్యం చేయబడిన వర్గాలను చేరదీసి, నేతలను తయారుచేసుకుని వుంటే బాగుండేది. దానికి బదులు అడ్డదారి తొక్కారు. కాంగ్రెసు నుండి ఎమ్మెల్యేలను ఎగరేసుకుని పోవడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. వాళ్లు కొంతసేపు జగన్ వద్ద, మరికొంతసేపు కిరణ్ వద్ద దోబూచులాడారు. వీళ్ల అండ చూసుకుని కాంగ్రెసు ప్రభుత్వాన్ని పడగొట్టే ప్లాను వేసేదాకా వెళ్లారు జగన్. చివరకు అది ఫలించలేదు. కానీ డిఫెక్టర్లనే నమ్ముకునే కదా రాజకీయాలు చేసినది! రోశయ్య సిఎం అయినపుడు, కిరణ్ సిఎం అయినపుడు యీ డిఫెక్టర్లనే కదా ఉసి కొల్పి – 'మేం రోశయ్యను గుర్తించం, సెక్రటేరియట్‌కు రాం, పనులు చేయం, యింటి దగ్గరే కూర్చుని జీతభత్యాలు మాత్రం పుచ్చుకుంటాం...' అంటూ వేషాలు వేయించారు కదా. (ఇప్పుడు జనమే వాళ్లను యింట్లో కూర్చోబెట్టేశారు). 'నీవు నేర్పిన పాఠమే నీరజాక్ష' అన్నట్టు, యిప్పుడు ఎదుటివాళు ఆ డిఫెక్షన్ పాఠమే జగన్‌కు అప్పచెపుతున్నారు. అతని చేదుమాత్ర అతనిచేతే మింగిస్తున్నారు. రేణుక అనుబంధ సభ్యత్వం గురించి కళ్లెగరేసేవారు మొన్నటిదాకా సబ్బం హరి చేసినదేమిటో గమనించాలి. ఆయన కాంగ్రెసులోనే వున్నాడు, కానీ జగన్ పలుకు పలికాడు. మేకపాటి నిజాయితీగా రాజీనామా చేసి మళ్లీ గెలిచారు. కానీ హరి!? ఈ ఫిరాయింపులు తనకు అనుకూలంగా వున్నంతకాలం వైకాపా వాటిని మెచ్చుకుంది. ఇప్పుడు అవే తనకు దెబ్బ కొడుతున్నాయి. 'కత్తితో వ్యవహరించువాడు కత్తితోనే మరణించును' అనే అర్థంలో బైబిల్ వాక్యం వుంది. డేంజరస్ గేమ్ అంటూ మొదలుపెట్టాక అది ఎటు తిరుగుతుందో ఎవరికీ తెలియదు.

ఇదే నీతి టిడిపికి కూడా వర్తిస్తుంది. కాంగ్రెసు నుంచి ఫిరాయింపులను ప్రోత్సహించి యీ ఎన్నికలలో ఆయన మిశ్రమ ఫలితాలు పొందారు. అది విజయవంతమైన స్ట్రాటజీ అనడానికి లేదు. ఎన్నికల తర్వాత ఆ స్ట్రాటజీని యింకా విగరస్‌గా అమలు చేయడం దేనికి? వీళ్లు రావడం వలన సంఖ్యాబలం పెరగవచ్చు, కానీ వీళ్ల చేతిలో ఎన్నికలలో చావుదెబ్బ తిన్న స్థానిక టిడిపి నాయకుడు ఎలా ఫీలవుతాడు? గెలిచి, తన పార్టీకి వచ్చి తనపై పెత్తనం చెలాయిస్తే, పార్టీ హై కమాండ్‌లో అతని మాటే చెల్లుబాటయితే బాధపడడా? టిడిపిలో కార్పోరేట్ కల్చర్ వచ్చేసింది. సిఎం రమేష్, సుజనా చౌదరి వంటివారు గ్రాస్ రూట్స్‌నుండి వచ్చినవారు కారు. డబ్బుతో ఎవరినైనా, ఏదైనా సాధించవచ్చనే నమ్మకంతో వ్యవహరిస్తూ క్యాడర్ స్థయిర్యాన్ని దెబ్బ తీయగలరు, మనోభావాలను గాయపరచగలరు. జగన్‌ను దెబ్బ తీయాలనే ఆత్రుతతో, వీళ్లు తమ పార్టీనే బలహీనపరుచుకుంటున్నారని తోస్తోంది. 1978 ఎసెంబ్లీ ఎన్నికలలో ఇందిరా కాంగ్రెసు 175 సీట్లు గెలుచుకుని చెన్నారెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేసింది. జనతా పార్టీకి 60 సీట్లు వచ్చాయి, వెంగళరావు నాయకుడిగా వున్న రెడ్డి కాంగ్రెసుకు 30 సీట్లు వచ్చాయి. అయితే ఇందిరా కాంగ్రెసు ఆశకు పోయింది. రెడ్డి కాంగ్రెసును, జనతా పార్టీని తమలో కలిపేసుకోసాగింది. చివరకు రెడ్డి కాంగ్రెసు కనుమరుగైంది. జనతా పార్టీలో ఒకరో యిద్దరో మిగిలినట్లున్నారు. ఈ డిఫెక్షన్ల వలన ఇందిరా కాంగ్రెసు బలపడిందా? లేదు, అంతకలహాలతో బలహీనపడింది. 1978–83 మధ్య నలుగురు ముఖ్యమంత్రులు మారారు. చివరకు 1983లో తెలుగుదేశానికి అధికారం అప్పగించారు. చరిత్ర చెప్పే పాఠాలు యివి. విని నేర్చుకునేవారే కనబడటం లేదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

**మే 26-27 వీక్లీకై** **ఎమ్బీయస్ : సత్తా చాలని దత్తాత్రేయ**

బండారు దత్తాత్రేయ గారికి కేంద్రమంత్రి పదవి దక్కకపోవడంతో తెలంగాణకు అన్యాయం జరిగిందంటున్నారు కొందరు. దీని వెన ఆంధ్రనాయకుల కుట్ర వుందంటున్నారు. అంతేనా, అగ్రవర్ణాలు ఆదరించే పార్టీ ఐన బిజెపి యావన్మంది బిసిలకు అన్యాయం చేసిందంటున్నారు మరికొందరు. దత్తన్నకు మంత్రి పదవి యిస్తామని కబురు వచ్చిందట, కుటుంబంతో సహా ఢిల్లీ వెళ్లారట, చివరి నిమిషంలో జాబితాలో పేరు గాయబ్‌ట. గతంలో కూడా యిలాగే జరిగితే, వాజపేయిగారు పట్టుబట్టి కొన్నాళ్లకు రైల్వే సహాయమంత్రిగా చేశారట. దీనిలో వాస్తవమెంతో, కల్పన ఎంతో తెలియదు. దత్తాత్రేయగారు సౌమ్యుడు, ఉపకారి, అందరికీ అందుబాటులో వుండే వ్యక్తి. వివాదాల్లో యిరుక్కోరు. ఈ సారి కాకపోతే వచ్చేసారి విస్తరణలో యిచ్చినా యివ్వవచ్చు. ఇప్పుడు యివ్వలేదు కదాని ఆయన పార్టీ వీడి వెళ్లడు. ధర్నాలు చేయడు. అందువలన అర్జంటుగా కొంప మునిగిపోయినట్లు హంగామా చేయడం అనవసరం. ఆయన హయాంలో రైల్వే శాఖ ద్వారా రాష్ట్రానికి జరిగిన ప్రత్యేకమైన మేలు ఏదీ కనబడదు, అయినా ఆయనకు మంత్రిపదవి యిచ్చి వుంటే అందరం సంతోషించేవాళ్లం. కానీ బిజెపి అధిష్టానం ఆలోచనలు ఎలా వున్నాయో కూడా ఆలోచించి చూడాలి కదా.

బిసి వివక్షత కార్డు యీ కేసులో పని చేయదు. ఎందుకంటే మోదీయే బిసి. ఆయన తలచుకుంటే యివ్వలేడా? ఆయన మాటను కాదనగల దమ్ము ఎవరికి వుందక్కడ? ఇక తెలంగాణ ఫ్యాక్టర్. నిష్పక్షపాతంగా ఆలోచించి చూడండి – బిజెపి తెలంగాణకు ఎందుకు ప్రాధాన్యత యివ్వాలి? నిజానికి గత నాలుగైదేళ్లగా బిజెపి నిరంతరం తెలంగాణకోసం పోరాడుతూనే వచ్చింది. ఆంధ్ర బిజెపి దెబ్బ తింటున్నా జాక్‌లో వుండి తెరాసతో కలిసి పని చేసింది. తెరాస శాసనమండలి అభ్యర్థి ముస్లిము అయినా మద్దతు యిచ్చారు. కిషన్‌రెడ్డి తెలంగాణ అంతా తిరిగి పాదయాత్ర చేశారు. తెలంగాణ బిల్లు పాస్ కావడానికి కాంగ్రెసుకు సహకరించారు. బిల్లు అవకతవకలుగా వుందని చెప్తూనే దాన్ని సవరించే ప్రయత్నాన్ని కూడా తెలంగాణ ప్రజలు అపార్థం చేసుకుంటారన్న భయంతో ప్రతీదానికీ తలూపారు. దీనిపై నిలదీసిన ఆంధ్ర ప్రజలకు బిజెపి జాతీయ నాయకులు సమాధానం చెప్పుకోలేని పరిస్థితి తెచ్చుకున్నారు. ఇంత చేసిన వారికి తెలంగాణ ప్రజలు చేసిన ప్రత్యుపకారమేమిటి? మొన్న ఎన్నికలలో బిజెపికి వచ్చిన ఓట్ల శాతం 6.7%. ఉద్యమం తీవ్రంగా నడిచిన కరీంనగర్, వరంగల్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్‌లలో అయితే కేవలం 6%! ఉద్యమం బలహీనంగా వున్న హైదరాబాదు, రంగారెడ్డి, దక్షిణ తెలంగాణ జిల్లాలలో పర్సంటేజి బాగా వచ్చింది కాబట్టి మొత్తం మీద 6.7%కి దేకింది. అంటే తెలంగాణ ప్రజలు బిజెపికి కట్టబెట్టినది ఏమీ లేదు. మరి బిజెపి నాయకత్వం నుండి ఏదైనా ఎలా ఆశించగలరు?

'తెలంగాణకు నిధులు సమకూర్చడంకోసం జాతీయ నాయకత్వంతో ఎలా వ్యవహరిస్తారు?' అని కిషన్‌రెడ్డిని అడిగితే ఆయన 'ఓట్లు తెరాసకు వేసి, నిధులు తెచ్చే బాధ్యత మాపై పెడితే ఎలా?' అని అడిగారు. కెసియార్ యిలాటి వాదనే గతంలో వినిపించారు. 'ఓట్లు కాంగ్రెసుకు వేసి, తెలంగాణ రక్షణ బాధ్యత మాకు అప్పగిస్తే ఎలా? గాడిదలకు మేత వేసి, ఆవును పాలిమ్మంటే యిస్తదా?' అని. ఇప్పుడు ఆ వాదనే బిజెపికి వర్తిస్తుంది. తెలంగాణ బిజెపి, ఏ మొహం పెట్టుకుని జాతీయ బిజెపిని ఫేవర్స్ అడగగలదు? 'ఆంధ్రలో పార్టీని ముంచి, మీరడిగిన తెలంగాణ యిస్తే మీరు మాకేం యిచ్చారు?' అని వాళ్లడిగితే? సోనియా టి-కాంగ్రెసు నేతలను యిలాగే అడిగితే వాళ్లు వెక్కివెక్కి రాగాలు పెట్టారట. (అదంతా ఉత్తిదే అని పొన్నం చెప్పారు, సోనియా మెచ్చుకున్నారని చెప్పకుండా బతికించారు). బిజెపి నాయకులకు కూడా అలాటి సత్కారమే జరిగి వుంటుంది.

ఓట్లన్నీ పెద్దమ్మకే వేసేస్తారేమో, యీ చిన్నమ్మ సంగతీ గుర్తు పెట్టుకోండి అని సుష్మా తెలంగాణ ప్రజలను హెచ్చరించారు. ఇద్దర్నీ పక్కన పడేసింది తెలంగాణ ప్రజ. కాంగ్రెసుకు కాస్తయినా వడ్డించారేమో కానీ బిజెపికి అదీ లేదు. బిజెపి గెలిచిన సీట్లన్నీ తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వాళ్లవే. హైదరాబాదు, రంగారెడ్డిలో సమైక్యవాదం గట్టిగా వుందనేది లోకవిదితం. అందుకే కిషన్ రెడ్డి అంబర్‌పేట స్థానానికి రాజీనామా చేసి ఉపయెన్నికలకు ఎదుర్కోవడానికి దడిశారు. ఈ ఎన్నికలలో కూడా హైదరాబాదులో సమైక్యవాదులు, ఆంధ్రమూలాలున్నవారు విభజనకారకులైన కాంగ్రెసు, తెరాసలకు ఓట్లు వేయలేదు. ప్రత్యేకరాష్ట్రంలో తమను రక్షిస్తారనే ఆశతో టిడిపిని గెలిపిస్తూ పనిలో పనిగా దానితో జట్టుకట్టిన బిజెపిని ఐదు ఎసెంబ్లీ సీట్లతో, ఒక పార్లమెంటు సీటుతో గెలిపించారు. బయటి ప్రాంతాల్లో బిజెపి ఒక్క సీటైనా గెలవలేదు. గతంలో వున్నవి కూడా పోగొట్టుకున్నారు. అందువలన తెలంగాణ ఎసెంబ్లీలో కానీ, పార్లమెంటులో కాని బిజెపి తెలంగాణ యూనిట్ అస్తిత్వానికి కారణం ఆంధ్రమూలాలున్నవారి ఓట్లు. మరి కేంద్రమంత్రి పదవి యివ్వకపోతే తెలంగాణ ఉద్యమకారులకు అన్యాయం జరిగినట్లు ఎలా అయింది? వాళ్లు ఓట్లు వేస్తే కదా!

అబ్బే కాదు, అన్యాయం జరిగిందని వాదిస్తే, మరి యిదే ధోరణిలో ఆంధ్ర బిజెపికి కూడా అన్యాయం జరిగిందనాలి. అక్కడ మాత్రం ఎవరికి యిచ్చారు కనుక? మోదీ కాబినెట్‌లో ముగ్గురు తెలుగువారికి స్థానం అని పేపర్లు రాశాయి. ముగ్గురు ఎలా అయ్యారు? వెంకయ్యనాయుణ్ని కర్ణాటక కోటాలో వేయాలి. కాదు తెలుగు మూలాలు వున్నాయి కాబట్టి నిర్మలా సీతారామన్‌ను లెక్కలోంచి తీసేయాలి. ఆవిడ తమిళావిడ. ఏ రాష్ట్రం కోటాలో రాజ్యసభ ఎంపీ చేస్తారో యింకా తెలియదు. ఒకవేళ ఆంధ్ర కోటాలో చేసినా – వెంకయ్యలో ఎంత కన్నడత్వం వుందో, జైరాం రమేశ్‌లో ఎంత తెలుగత్వం వుందో, మన్‌మోహన్‌లో ఎంత అసామీత్వం వుందో, ఆవిడలో అంత తెలుగత్వం వుంది. తెలుగువారి కోడలు కాబట్టి.. అంటే శశి థరూర్ మూడు ప్రాంతాల వారికి అల్లుడు. ఆ రాష్ట్రాలూ, దేశాలూ సంతోషించేయాలి. నిర్మలా సీతారామన్ కార్యక్షేత్రం ఆంధ్ర కాదు. జాతీయస్థాయిలోనే ఆపరేట్ చేశారు. ఆంధ్ర బిజెపి నుండి యిద్దరు ఎంపీలున్నా (తెలంగాణకు రెట్టింపు) వారికీ యివ్వలేదు. ఎన్‌డిఏ భాగస్వాములందరికీ తలా ఒకటీ యిచ్చారు. టిడిపి వంతుకి అశోకగజపతిరాజు గారికి యిచ్చారు. ఆయన సమర్థుడు, అనుభవజ్ఞుడు. అన్ని విధాలా అర్హుడు. టిడిపికి దన్నుగా నిలబడిన ఉత్తరాంధ్రకు చెందినవాడు. ప్రాంతంతో బాటు కులం ఫ్యాక్టర్ కూడా పరిగణనలోకి తీసుకుని వుంటారు. ఈ సారి పశ్చిమగోదావరి జిల్లాలోని క్షత్రియులు సాలిడ్‌గా టిడిపి వెంట నిలబడి దాని విజయానికి దోహదపడ్డారు. క్షత్రియుడైన అశోక్‌గారిని కేంద్రమంత్రిని చేసి వాళ్లను తృప్తి పరిచారు. దక్షిణాదిన యితర రాష్ట్రాలలో ఏ పార్టీ క్షత్రియులకు ఎంపీ టిక్కెట్లు యిస్తున్నట్లు లేదు. ఆంధ్రప్రదేశ్ మాత్రమే వాళ్లను పట్టించుకుని, ఒకప్పుడు కల్నల్ డియస్ రాజు, తర్వాత కృష్ణంరాజు, ఇప్పుడు అశోకగజపతి రాజు వంటి వారిని మంత్రులుగా పంపుతోంది.

ఆంధ్రనుండి టిడిపికి ముగ్గురు కాబినెట్, నలుగురు సహాయమంత్రులు యిస్తారని మీడియా హోరెత్తించింది. అదేం జరగలేదు. అయినా ఎంతమందికని యిస్తారు? ఎందుకిస్తారు? బిజెకి రాజకీయ అవసరాలుండవా? వాళ్లు కావలసినది యుపి, బిహార్‌లలో పాగా వేయడం. త్వరలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి కాబట్టి అక్కడ పాగా వేయడం. అందుకే ఆ రాష్ట్రాలకు పదవులు బాగా వడ్డించారు. సొంతంగా బలం వుంది కాబట్టి తన పార్టీ సభ్యులను బాగా తృప్తి పరచగలిగారు. భాగస్వాములపై

ఆధారపడేటట్టయితే వాళ్లకు యింకా ఎక్కువ పదవులు యివ్వాల్సి వచ్చేది. ఇప్పుడు తలా ఒకటి యివ్వడం శివసేనకు నచ్చలేదు. రుసరుసలాడుతోంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు వాళ్లకు ఒకటి, రెండు పదవులు యింకా యివ్వవచ్చు. ఏమిచ్చినా, ఏమివ్వకపోయినా యిప్పుడు మోదీని నిలదీయ గలిగేవారెవరూ లేరు. నిధుల విషయంలో ఆంధ్ర, తెలంగాణ రెండూ మోదీపై చాలా ఆశలు పెట్టుకున్నాయి. నిధులు కురిపించేస్తాడనుకుంటున్నారు. ఇక్కడెందుకు యిస్తాడు? యుపి, బిహార్ వంటి రాష్ట్రాల్లో అవకాశాలు బాగా కనబడుతున్నాయి కాబట్టి అక్కడ యిచ్చి అక్కడ తమ ప్రభుత్వాలు వచ్చేట్లు చూసుకుంటారు. అయిదేళ్లదాకా మన దగ్గర ఎన్నికలు లేవు. నిధులిచ్చినా దాన్ని రాజకీయంగా వాడుకోగల సత్తా స్థానిక బిజెపి యూనిట్లకు లేదని తేలిపోయింది. మహా అయితే 2019 ఎన్నికలకు కాస్త ముందు కాసిన్ని నిధులు యివ్వవచ్చు. రాష్ట్రం విడిపోతే రెండు ప్రాంతాలు పోటీపడి కేంద్రంలో బలం పెంచుకుంటాయని కొందరు మేధావులు తెగ వాదించారు. విభజనకు ముందు మనకు ఎన్ని పదవులు వున్నాయో తెలుసు. విభజన తర్వాత యిప్పుడు చూడండి– ఆంధ్ర, తెలంగాణ రెండింటికి కలిపికి ఒకే కేంద్రమంత్రి పదవి దక్కింది. అదీ అధికారపార్టీకి చెందిన వ్యక్తి కాదు. రేపు టిడిపి–బిజెపిలకు చెడితే ఆయనా తప్పుకోవలసి వస్తుంది. కలసివుంటే కలదు సుఖం, విడిపోతే తీరని నష్టం అని పెద్దలు వూరికే అనలేదు.

దత్తన్నకు మంత్రిపదవి యివ్వకపోవడానికి పోలవరం ఆర్డినెన్సుకు లింకు పెట్టి కొందరు మాట్లాడుతున్నారు. ఆయన కాబినెట్‌లో వుండగా కాబినెట్ సమావేశం ఆర్డినెన్సుపై సంతకం పెట్టమని రాష్ట్రపతిని కోరడం ఆయనకు, పార్టీకి యిబ్బందికరమని, అందుకే పదవి యివ్వలేదనీ ఒక వాదన. ఈ విషయంలో ఆంధ్రకు మేలు జరిగింది కాబట్టి యిలా అంటున్నారు. రేపు నిధుల విషయంలోనో, విధివిధానాల విషయంలోనో తెలంగాణకు మేలు కలిగే నిర్ణయం కేంద్రం తీసుకోవాలంటే అప్పుడు అశోకగజపతిరాజును తీసేస్తారా? మన రెండు తెలుగు రాష్ట్రాలూ అడుగడుగునా కేంద్రం గడప తొక్కుతూనే వుండాలి. నెలనెలా జీతాలకో, కరంటుకో, శాంక్షన్‌లకో ముష్టి ఎత్తుతూనే వుండాలి. విభజనకోసం అన్ని అధికారాలూ వాళ్లకు అప్పగించి కూర్చున్నాం. ఏ నిర్ణయం తీసుకున్నా యింకో రాష్ట్రం అభ్యంతరపెడుతూనే వుండవచ్చు. అందుకని ఆ ప్రాంతం నుండి ప్రాతినిథ్యం లేకుండా చేస్తారా? ఇది అసమంజసం. ఆయనకు పదవి యివ్వకపోవడానికి కారణం – ఆయనకు సత్తా చాలకపోవడం! తెలంగాణ ప్రజలు ఆ సత్తా ఆయనకు యివ్వలేదు. తెరాసకు వ్యతిరేకంగా పోరాటాలు చేసి, తమ ఉనికిని చాటుకుని ఉపయెన్నికలలో నైనా (మెదక్ ఉపయెన్నిక రాబోతోంది) గెలిస్తేనే తెలంగాణ బిజెపిని అధిష్టానం గుర్తించి మన్నిస్తుంది. లేకపోతే ధూంధాం అంటూ పూసుకుని తిరిగి, అలాయ్–బలాయ్‌లో కలిసి విందులు కుడిచి, ఎన్నికల సమయంలో ఓట్లు వాళ్లకు ధారపోస్తే..యింతే సంగతులు...! **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

**మే 28 – 29 వీక్లీకై** **ఎమ్బీయస్ : తెలంగాణ చిహ్నంలో చార్మినార్**

మజ్లిస్ వారు తెలంగాణ చిహ్నంలో చార్మినార్ వుండాలంటున్నారు. దానికి తోడు ఉర్దూని రెండో అధికారభాషగా చేయాలంటున్నారు. నాకు తెలిసి ఉర్దూకి యిప్పటికే ఆ స్థాయి వుంది. అమలు కావడం లేదంతే. గతంలో ఆర్టీసీ బస్సులపై ఉర్దూలో కూడా బోర్డులు పెట్టేవారు. ఇప్పుడు సిటీ బస్సులు, రూటు బస్సులు, ఎంఎంటియస్.. ఎక్కడా ఉర్దూ కనబడటం లేదు. ఎందుకంటే ఉర్దూ మీడియంలో చదివేవారు తగ్గిపోతున్నారు. ఉద్యోగాలు కావాలంటే తెలుగు రావాలని, రెండో భాషగా తెలుగో, స్పెషల్ ఇంగ్లీషో తీసుకుంటున్నారు. ఉర్దూ ఉపాధ్యాయులు కూడా తగ్గిపోతున్నారనుకుంటా. విభజన తర్వాత తెలంగాణలో మజ్లిస్ బలం పెరుగుతుందని అందరూ అనుకున్నా, గొంగళీ అక్కడే వుండిపోయింది. అయినా యీ డిమాండ్లు చేయడానికి వారికి ధైర్యం ఎందుకు వచ్చిందంటే తెరాసవారు వారికి పిలిచి పీట వేస్తున్నారు. సమైక్యవాదానికి కట్టుబడిన మజ్లిస్‌కి, తెరాసకు ఎప్పుడూ సఖ్యత లేదు. నగరంలో మజ్లిస్ ఒక్కటే మాకు వ్యతిరేకంగా వుంది కానీ గ్రామాల్లో, పట్టణాల్లో వున్న ముస్లిములంతా మా వెంటే వున్నారు అని తెరాస చెప్పుకుంటూ వచ్చింది. అలాటిది ఎన్నికల అనంతరం యింత ప్రేమ ఎలా పుట్టుకుని వచ్చింది? అంటే హైదరాబాదులో తెరాసకు తగిలిన దెబ్బ! అక్కడ 13.5% ఓట్లు మాత్రమే వచ్చాయి. అంటే చావుదెబ్బ తిన్న కాంగ్రెసు కంటె 1% ఎక్కువ! హైదరాబాదు వాసులు తమ రక్షణకు టిడిపి–బిజెపినే నమ్ముకున్నారు. వాళ్లిద్దరికీ కలిపి 33% వచ్చాయి. రంగారెడ్డి జిల్లాలో కూడా తెరాస పరిస్థితి మరీ అంత బాగా లేదు. 2009 ఎన్నికలలో తెరాసతో చేతులు కలిపి దెబ్బ తిన్న టిడిపి యీసారి ఆంధ్రమూలాల వారిని రక్షిస్తామంటూ ప్రచారం చేసుకుని వారి విశ్వాసాన్ని, తద్వారా ఓట్లను చూరగొంది.

హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలలో టిడిపిని కంట్రోలు చేయడానికి కెసియార్‌కు తోచిన ఏకైక ఉపాయం – మజ్లిస్‌తో దోస్తీ. కావాలంటే కాబినెట్‌లో పదవులు యిస్తామన్నారట. మజ్లిస్ ఎమ్మెల్యే డిప్యూటీ సిఎం అవుతాడని కూడా ప్రచారం జరిగింది. మజ్లిస్‌వారు నో థ్యాంక్స్ అన్నారు. లోపలకి ఎందుకు రావడం? బయటనుండే ఆడిస్తాం అన్నారు. ఇదిగో, దీనితో మొదలుపెట్టారు. ఎక్కడిదాకా వెళతారో తెలియదు. వైయస్ హయాంలో మజ్లిస్‌వారు చెలరేగి ప్రభుత్వాధికారులను కూడా చావబాదారు. ప్రత్యర్థుల సంగతి సరేసరి. ఎన్నికలలో దుద్దుకర్రతో స్వైరవిహారం చేశారు. అడిగేవాడు లేడు. కిరణ్ కాస్త కట్టడి చేశారు. మజ్లిస్‌వారికి సోనియాతో వున్న సఖ్యత వలన ఢిల్లీ వెళ్లి ఫిర్యాదు చేశారు. ఇప్పుడు ఆ సౌలభ్యం లేదు. బిజెపిలో వినే నాథుడు లేడు. ఇప్పటికైనా కాస్త తగ్గుతారేమో ననుకుంటే తెరాస నెత్తికెక్కించుకుంటోంది. తెరాసకు సొంతంగా మెజారిటీ సీట్లు యిచ్చాడు ఓటరు. మజ్లిస్‌మీదో, వైకాపా మీదో ఆధారపడవలసిన అవసరం కల్పించలేదు. అయినా కేవలం – చంద్రబాబును, బిజెపిని అడ్డుకోవడానికి తెరాస యీ

మార్గం పట్టింది. తెలంగాణ ఏర్పడితే బిజెపి బలపడుతుందని మజ్లిస్ గగ్గోలు పెట్టింది. ఇంకా అలా జరగలేదు. కేంద్రంలో బిజెపి మద్దతుతో యిక్కడా పుంజుకుంటుందన్న భయంతో మజ్లిస్ తెరాసకు చేరువౌతోంది. 2009లో ఊరికి ముందే ఎన్‌డిఏ పంచన చేరబోయిన కెసియార్ యీ రోజు వారికి ఆప్తుడిగా కనబడుతున్నాడు. రేపు ఆయన మోదీకి శరణంటే వీళ్లేం చేస్తారో చూడాలి.

చార్మినార్‌ను తెలంగాణ చిహ్నంలో పెట్టాలని మజ్లిస్ అడిగింది కాబట్టి బిజెపి వెంటనే ఖండించింది. అది ఇస్లాం మతచిహ్నం, చార్‌మినార్ ఒక అంతస్తులో మసీదు వుంది అంటోంది. మరి దాని పునాదిలో 'భాగ్యలక్ష్మి' (!?) ఆలయం వుందని బిజెపి నాయకులు వాదిస్తున్నారు కాబట్టి దాన్ని హిందూచిహ్నం అనుకోవచ్చుగా! అనుకోవడం లేదు. ఓ సారెప్పుడో మజ్లిస్ పార్టీయే చార్మినార్ బొమ్మ వాడకాన్ని అడ్డుకుంటూ అది మా మతచిహ్నం అని వాదించిందట. ఇంతకీ అది మతచిహ్నమా? ఇస్లాంకు మూర్తిపూజ పనికిరాదు. అందుకని ప్రవక్త బొమ్మకానీ, విగ్రహం కానీ, ప్రతీకగానీ కనబడదు. ఎన్టీయార్ తన విదేశీయాత్రల్లో ఆంధ్రప్రదేశ్‌కు గుర్తుగా చార్మినార్ బొమ్మల్ని సువెనీర్లగా యిచ్చేవారు. ఎందుకంటే అది వ్యాధిపై మనిషి విజయానికి ప్రతీక. చార్మినార్ ఎందుకు కట్టారనేది ఒకసారి చదువుకుంటే మతంతో సంబంధం లేదని తెలుస్తుంది. హైదరాబాదు అనగానే అందరికీ ముందుగా గుర్తుకు వచ్చేది చార్మినారే! చంద్రబాబు వచ్చాక హైదరాబాదును ఐటీ సెంటర్‌గా రూపుదిద్దే క్రమంలో హైదరాబాదుకు ప్రతీకగా హైటెక్ సిటీ చూపించసాగారు. ఇప్పుడు కెసియార్ తెలంగాణ చిహ్నంలో ఆ కట్టడాన్ని వాడితే చూసిన ప్రతీవాడికీ బాబు గుర్తుకు వస్తాడు. అది కెసియార్ సహించలేరు. తెలంగాణ గుర్తుగా కాకతీయ తోరణం పెట్టుకోవచ్చు. కానీ కమ్మ కులస్తులు తమ వ్యాపార వ్యవహారాలకు కాకతీయ పేరు విస్తారంగా వాడి సొంతం చేసేసుకున్నారు. నిజానికి కాకతీయులు స్వతహాగా బోయ, పుళింద కులస్తులు. జైనమతంలోకి మారి, మళ్లీ హిందువులై, అన్ని కులాల వారితో సంపర్కం పెట్టుకుని, బంధుత్వాలు కలుపుకుని ఎదిగారు, విస్తరించారు. కానీ యిప్పుడు కాకతీయ గుర్తు వాడగానే కమ్మలు, తద్వారా టిడిపి ప్రజల మెదళ్లలో మెదులుతుందని కెసియార్ సందేహించి దాన్ని వదిలేస్తే –

ఇక మిగిలినది శాతవాహనులు. కరీంనగర్ జిల్లాలోని కోటిలింగాలలో వారి స్వతంత్రాధికారానికి అంకురార్పణ జరిగిందంటున్నారు కాబట్టి శాతవాహనులను తెలంగాణ సొంతం చేసుకోవచ్చు. కాకతీయులకున్నంత పాప్యులారిటీ శాతవాహనులకు లేదు కాబట్టి కాకతీయ తోరణం వాడక తప్పదు. ఎందుకంటే శాతవాహనులతో చిన్న చిక్కు వుంది. కొన్ని పురాణాలు వారిని 'ఆంధ్రభృత్యులు'గా వర్ణించాయి. ఆంధ్రులంటే తెలుగువారనే అర్థంలో వాడినంత కాలం ఫర్వాలేదు కానీ, యిప్పుడు ఆంధ్రపదాన్ని ఒక ప్రాంతానికి పరిమితం చేస్తున్నారు కాబట్టి ఆ పదం యిప్పుడు చాలా చికాకుగా వినిపించవచ్చు. ముఖ్యంగా కెసియార్ ఆంధ్రరాష్ట్రంతో అనునిత్యం గొడవలు దిగడానికి నిశ్చయించుకున్న యీ తరుణంలో! రాష్ట్ర విభజన బిల్లులో ఆయన తమకు అనుకూలంగా వున్నవి మాత్రం తీసుకుంటున్నారు. అనుకూలం కానివి వ్యతిరేకిస్తున్నారు. ఉద్యోగస్తుల విభజన అనేది రాజ్యాంగప్రకారం జరగాలి అంటే 'అబ్బే, ఆప్షన్లు వుండడానికి వీల్లేదు' అంటారు. ఆర్గనైజేషన్లు విడగొట్టినపుడు, కలిపినప్పుడు కొన్ని పద్ధతులుంటాయి. వాటిల్లో ఉద్యోగుల చిత్తం నడవదు. మేనేజ్‌మెంట్ నిర్ణయమే ఫైనల్. నచ్చకపోతే ఉద్యోగం వదులుకోవాలి. విఠల్‌గారి కేసులో ఆయన జూనియర్ అయ్యారు. ఆ విభాగంలో ఆ క్యాడర్‌లో తెలంగాణ ఉద్యోగులు ఎక్కువమంది వున్నారు. తెలంగాణకు ఎలాట్ చేయగా మిగిలినవారిని ఆంధ్రకు కేటాయించారు. ఆయన జూనియర్ కాబట్టి అటు వెళ్లాల్సిందే. అబ్బే నేను లీడర్ని, నాకు మినహాయింపు యివ్వాలి అనడం నియమవిరుద్ధం. ఇవన్నీ బయటకు వచ్చినపుడు 'సెక్రటేరియట్‌లో 90% మంది ఉద్యోగులు ఆంధ్రులే' వంటి ప్రకటనలు ఎంత అబద్ధమో తేలుతోంది. అదే నిజమైతే విఠల్‌గారు అటు వెళ్లవలసిన పరిస్థితి ఎందుకు ఏర్పడుతుంది? కెసియార్ ఏ నియమాన్నీ పాటించదలచుకోలేదు. అంతా తాము చెప్పినట్లే జరగాలని పట్టుబడుతున్నారు. తెలంగాణ ఉద్యోగవర్గాలను ఆకట్టుకోవడానికి త్వరలో ఆంధ్రా ఉద్యోగీ భాగో నినాదం యిచ్చినా ఆశ్చర్యపడను.

ఇప్పుడు పోలవరం వివాదం మొదలుపెట్టారు. బిల్లుకు అనుబంధంగానే ఆర్డినెన్సు తయారైంది. ఎటొచ్చీ ఎన్నికల కోడ్ రావడంతో కొత్త ప్రభుత్వాన్ని కూడా అడిగి సంతకం పెడదామని ప్రణబ్ ఆగారు. రాజ్యసభలో యీ విషయమై వాదించిన వెంకయ్యనాయుడు కొత్త ప్రభుత్వంలో మంత్రిగా వుండడంతో ఆయన చొరవ తీసుకుని కాబినెట్‌లో చెప్పి అంగీకరింపచేసి, ప్రణబ్ చేత సంతకం చేయించారు. దానికి రాద్ధాంతం దేనికి? పోలవరం డిజైన్ మార్చాలి అని యిప్పుడు అనడమేమిటి? 1980లో సెంట్రల్ వాటర్ కమిషన్ ఎప్రూవ్ చేసిన డిజైన్ అది. ఎన్నోసార్లు దానిపై చర్చలు జరిగాయి. టెండర్లు పిలిచారు. కెసియార్‌కు సన్నిహితులైన కాంట్రాక్టర్లు బిడ్ చేశారు. కొన్ని వేల కోట్లు ఖర్చు పెట్టారు. ఇప్పుడు కేంద్రప్రభుత్వం ఆ ప్రాజెక్టు తన బాధ్యతగా స్వీకరిస్తానని చెప్పి పని మొదలుపెట్టింది. విభజనకు సంబంధించిన ప్రతీ విషయంలో 'కేంద్రమే అన్నీ చూస్తుంది, యిక్కడి రాష్ట్రప్రభుత్వం ఒట్టి ఆటల్లో అరటిపండు' అంటూ వచ్చిన కెసియార్ యీరోజు హఠాత్తుగా రాష్ట్రప్రభుత్వానికి అధికారాలు ఎక్కణ్నుంచి తెస్తున్నారు? అన్నీ కేంద్రానికి అప్పగించారు కాబట్టే కదా తెలంగాణ వచ్చింది. ఇప్పుడు అడ్డం తిరిగితే ఒప్పుతుందా?

గ్రామాలు కాకుండా మండలాలు కలపడం సవ్యమైన పని. ఎందుకంటే పునరావాసం అనేది పక్కనున్న గ్రామాల్లో కల్పించాలి. ఎక్కడో వేరేచోట అంటే యిబ్బంది పడతారు. భద్రాద్రి రాముడి గుడి తెలంగాణలో, ఆస్తులు ఆంధ్రలో... అని సెటైర్లు వేస్తున్నారు. తిరుపతి వెంకన్న ఉండేది ఆంధ్రలో, ఆస్తులు తెలంగాణలో లేవా? పలు రాష్ట్రాల్లో లేవా? ఏమైంది? పోలవరం నిర్వాసితుల అంశం యీనాటిదా? ఆర్టికల్ 111 హరీశ్‌రావు కాబినెట్ మంత్రిగా వున్నపుడే వెలువడింది కదా! పోలవరం కట్టే మాటైతే మాకు తెలంగాణయే

వద్దు అనలేకపోయారా, కెసియార్? బిల్లు సగం సగం అమలు చేస్తామంటే ఎవరొప్పుకుంటారు? అయినా గిరిజనుల పునరావాసం గురించి మాట్లాడేవారు ఒక సంగతి గుర్తుపెట్టుకోవాలి. రోడ్డు వేసినా, విస్తరణ చేపట్టినా కూడా బాధితులంటారు. కొందరి స్థలాలు పోతాయి. ఇళ్లు కూలతాయి. అందుకని రోడ్డు వేయడం మానేస్తారా? ఉడ్‌హౌస్ కొటేషన్‌తో చెప్పాలంటే – గుడ్డు పగలకుండా ఆమ్లెట్ వేయలేం. మనమంతా పల్లెల్ని విడిచి నగరాలకు వచ్చేశాం. ఇక్కడంతా రద్దీ అయిపోయింది, పల్లెలకు వెనక్కి వెళ్లండి అని ప్రభుత్వం అంటే అమ్మో పల్లెల్లో వైద్యసౌకర్యం లేదు, విద్యుత్ సౌకర్యం లేదు అని గునుస్తున్నాం. గిరిజనులు మాత్రం అడవుల్లోనే వుండిపోవాలా? వాళ్లకు కరంటు అక్కరలేదా? మందులు అక్కరలేదా?

'వాళ్లు తెలంగాణలో వుంటామంటున్నారు, వాళ్ల గోడు వినండి' అని కొందరు సామాజిక కార్యకర్తల మొసలి కన్నీరొకటి. విభజనవాదులకు వ్యతిరేకంగా ఓటేసి తమ అభిప్రాయాన్ని తెలిపిన హైదరాబాదువాసులు 'మేం విడిగా వుందామనుకుంటున్నాం, హైదరాబాదును యూటీ చేయండి' అంటూ ప్రదర్శన నిర్వహిస్తూ అప్పుడూ యిదే మాట చెప్తారా? రాష్ట్రప్రజల అభీష్టం ఏమిటో విభజన బిల్లు తిరస్కరించి రాష్ట్ర ఎసెంబ్లీ చాటి చెప్పింది. అయినా దాన్ని పట్టించుకోకుండా పార్లమెంటు దాన్ని చట్టంగా చేసింది. అప్పుడు హర్షించినవారు ఇప్పుడు కొందరు గిరిజనులు యిలా అనుకున్నారని, అలా అనుకున్నారనీ వగచడం హాస్యాస్పదం. అయినా గ్రామాలు కాకుండా మండలాలు కలపాలన్న ఐడియా బిజెపిదే. రాజ్యసభలో దాని గురించే మాట్లాడారు. అధికారంలోకి రాగానే దాన్నే అమలు చేశారు. దీనిలో కుట్ర ఏముంది? చంద్రబాబు చేసిన మోసం ఏముంది? ఇదంతా ప్యాకేజీలో భాగమే. పోలవరం ముంపుగ్రామాలతో బాటు దిగువ సీలేరు ప్రాజెక్టు కూడా పోతోందని యిప్పుడనుకుంటే ఏం లాభం? ఇలాటి చిలక్కొట్టుళ్లు ఎన్ని కలిపితే హైదరాబాదు ఆదాయంలో వాటా పోగొట్టుకున్న ఆంధ్రకు లోటు తీరుతుంది? ఆరంభమే ఆంధ్రకు 18 వేల కోట్ల రెవెన్యూ లోటు, తెలంగాణకు 7500 వేల కోట్ల రెవెన్యూ మిగులు. కెసియార్ కంటికి యివన్నీ ఆనవా?

'భద్రాచలం తీసుకోండి, హైదరాబాదు మాకు వదిలేయండి' అని గతంలో అన్న కెసియార్ యిప్పుడు దీన్ని రాజకీయం చేద్దామని నిశ్చయించుకున్నారు. తను తప్ప తెలంగాణ ప్రయోజనాలు కాపాడేవారు ఎవరూ లేరన్న బిల్డప్ యివ్వడానికి ఎవర్నీ, ఏ పార్టీని సంప్రదించకుండా తెలంగాణ బంద్‌కు పిలుపు నిచ్చారు. అఖిలపక్షాన్ని తీసుకెళ్లి ప్రధాని వద్దకో, రాష్ట్రపతి వద్దకో వెళితే అదో అందం. అందరం కలిసి బంగరు తెలంగాణ నిర్మిద్దాం అని కబుర్లు చెప్పడమే తప్ప, ఆచరణలో అది చూపించలేదు. అందుకే పార్టీలేవీ బంద్‌కు మద్దతు యివ్వలేదు. సిపిఐ ఒక్కటీ మాత్రమే గొంతు కలిపింది. మేం చేసినవన్నీ తప్పులే అని ఆ పార్టీ సమావేశంలో యీ మధ్యే నాయకత్వం ఒప్పుకుంది. మళ్లీ అలాటి తప్పులే చేస్తోంది. వ్రతం చెడ్డా ఫలమూ దక్కటం లేదు. ఇక్కడా క్షవరమే, పార్లమెంటులోనూ క్షవరమే. జాతీయపార్టీ గుర్తింపు పోగొట్టుకుంది. తలతిక్క నిర్ణయాలు తీసుకున్న నారాయణ వంటి నాయకులకు శిక్ష వేయకుండా కబుర్లతో సమావేశాలు సరిపెడితే యిలాగే వుంటుంది.

ఏ పార్టీ కలిసిరాకపోయినా తెరాసకు ఫర్వాలేదు. తల్లిని చంపి, బిడ్డను బతికించారన్న మోదీ తన తెలంగాణ వ్యతిరేకతను నిరూపించుకున్నారని ధ్వజమెత్తింది. దీనిపై టిడిపి స్టాండ్ ఏమిటో చెప్పాలంటూ కవ్విస్తోంది. కాంగ్రెస్, వైకాపాలకు మాత్రం యిలాటి ఛాలెంజ్ విసరలేదు. అవి కూడా తెలంగాణలో పార్టీలే కదా. కానీ టిడిపిపైనే తెరాస గురి. పోలవరం కట్టాలి అని టి-టిడిపి అంటే తెలంగాణ ద్రోహి అనాలని తెరాస ప్లాన్. బాబే యిదంతా చేశారన్న ప్రచారం చేస్తే, తెలంగాణలో టిడిపి దెబ్బ తినడం మాట ఎలా వున్నా, ఆంధ్రలో రక్షకుడిగా బాబు యిమేజి పెరగడం ఖాయం. కెసియార్‌ను అదుపు చేయగల మొనగాడు చంద్రబాబు ఒక్కడే అనే నమ్మకం అక్కడ బలపడుతుంది. ఆంధ్రతో అనుబంధం వున్న తెలంగాణవాసుల్లో దాని మద్దతు పెరుగుతుంది. ఆ బలంతో తెలంగాణలో తెరాసను ఛాలెంజ్ చేసి బలహీనపరచవచ్చు. రాజకీయంగా బలహీనపడిన కొద్దీ కెసియార్ మజ్లిస్‌కు మరింతగా చేరువౌతారు. ఈనాటి ఆర్డినెన్సు వ్యతిరేక పోరాటంలో సిపిఐతో పాటు తెరాస భాషలో మాట్లాడిన మరో పార్టీ మజ్లిస్. వాళ్లు బంద్‌లకు వ్యతిరేకం కాబట్టి (రోజువారీ సంపాదనపై ఆధారపడిన పాతబస్తీ వాసులు బంద్ అంటే మండిపడతారు) బంద్‌కు మద్దతు యివ్వలేదు కానీ మండలాల బదిలీకి ఒవైసీ అభ్యంతరపెడుతూ లేఖ యిచ్చారు. ఇలా మజ్లిస్‌కు దగ్గరవుతూ పోతే వాళ్లు చెప్పినదానికల్లా కెసియార్ తలూపుతారు. అప్పుడు తెలంగాణ చిహ్నంగా చార్మినార్ వుండడం మాత్రమే కాదు, కాశీం రజ్వీ విగ్రహం టాంక్ బండ్‌పై వెలిసినా వెలవవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

**మే 30 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఋణమాఫీ జరిగేనా?**

జరిగితీరుతుందని టిడిపి నాయకులు, సిద్ధాంతకర్తలు బల్లగుద్ది చెపుతున్నారు. ఎలా? అని విశ్లేషకులు ప్రశ్నలు సంధిస్తున్నకొద్దీ 'అధ్యయనం చేసే హామీ యిచ్చాం, మీరేం సందేహించడనక్కరలేదు' అంటున్నారు. కానీ ఆ హామీ అమలు గురించి టిడిపి వారి కంటె యితరులకే ఎక్కువ బెంగగా వుంది. ఎందుకంటే బాబుగారి ట్రాక్ రికార్డు అంత గొప్పదేం కాదు. మద్యనిషేధం అమలు చేస్తామని చెప్పి, చేయలేదు. రెండు రూపాయలకు కిలో బియ్యం సరఫరా చేస్తామని చెప్పి మూడున్నరకు పెంచేశారు. బెల్టు షాపులు తీసేయిస్తామని చెపుతూనే వాటిని ప్రోత్సహించారు. తను ఏం చేసినా ప్రజలు అర్థం చేసుకుంటారనే గుడ్డి నమ్మకంతో గతంలో బాబుగారి పాలన నడిచింది. విద్యుత్ సంస్కరణలు చేపట్టడం వరకు ఓకే కానీ, ఆ పేరుతో మాటిమాటికీ విద్యుత్ చార్జీలు పెంచేయడం అన్యాయం అని

ప్రతిపక్షాలు గోల పెడితే 'నేను విజన్‌తో అలా ముందుకు వెళుతూంటే ప్రతీదీ రాజకీయం చేస్తున్నారు' అంటూ వాపోయారు. ప్రజలు అవన్నీ మర్చిపోయి వుంటారన్న ధీమాతో ఎన్నికలకు ముందు వచ్చిన యాడ్ – 'ఆయన వస్తున్నారు'లో 'ఆయన పాలనలో కరంటు కోతలే వుండేవి కావు' అని చెప్పించారు. అదే ఒక కోత! కరంటు కోతలతో పరిశ్రమలు మూతపడిన కాలమది. అప్పుడున్నది ఉమ్మడి రాష్ట్రం. ఇప్పుడు బాబు చేతికి వచ్చినది – ముక్కలైన రాష్ట్రం, ముష్టికోసం బయలుదేరవలసిన లోటు బజెట్ రాష్ట్రం. ఇలాటి రాష్ట్రంలో ఋణమాఫీ వంటిది చేపట్టగలరా? అనే అందరి బెంగా. బాబు అప్పుడే సన్నాయి నొక్కులు నొక్కుతున్నారు. 'నేను హామీ యిచ్చిననాటి పరిస్థితి యిప్పుడు లేదు. రాష్ట్ర ఆర్థికపరిస్థితి నేననుకున్నదాని కంటె ఘోరంగా వుంది.' అని. ఇదీ పరిస్థితి అని కిరణ్‌కుమార్ రెడ్డి పాపం గణాంకాలు వల్లిస్తూనే వున్నాడు. ప్రజలు వినలేదు సరే, యీయనలాటి నాయకులైనా పట్టించుకోకపోతే ఎలా?

టిడిపి మానిఫెస్టో రచయిత, ఆర్థిక నిపుణుడు కుటుంబరావుగారు మొన్న చర్చలో చెపుతున్నారు – 'బాబుగారు హామీ యిచ్చినపుడు ఉమ్మడి రాష్ట్రంగా వుంది, యిప్పుడు విభజన జరిగి పరిస్థితి మారిపోయింది' అని. విభజన టెక్నికల్‌గా జూన్ 2 న జరగవచ్చు కానీ, జరుగుతుందని మానిఫెస్టో రాసేనాటికే తెలుసు. వీళ్లంతా మాట్లాడితే బాంకులు సహకరించాలంటారు. బాంకులు అన్నదాన సత్రాలు కావు. వాళ్ల దగ్గరున్నది విరాళాల సొమ్ము కాదు. నాబోటి, మీబోటి కష్టమర్ల డబ్బు. వాళ్లు దానికి జవాబుదారీ వహించాలి. అప్పులు మాఫీ చేయండి అంటే వాళ్లకు నష్టం రాదా? అయినా యిలాటి సామాజిక బాధ్యతలన్నీ జాతీయ బ్యాంకుల నెత్తిమీదే ఎందుకు పెట్టాలి? ప్రయివేటు బ్యాంకులకు చెప్పరేం? ఇప్పుడిలా చేసి జాతీయ బ్యాంకులు నష్టాల్లో మునిగితే అప్పుడు వాటిని నిలబెట్టడానికంటూ ప్రయివేటీకరణ మొదలుపెడతారు. రిలయన్సు వారికి అప్పగిస్తారు. హామీలు రాజకీయపార్టీలవి. అమలు చేయవలసిన బాధ్యత బ్యాంకులది అవుతోంది, అనగా కష్టార్జితం బాంకుల్లో దాచుకున్న కస్టమర్లదన్నమాట. ఈ నష్టాలు పూడ్చుకోవడానికి వాళు ్లు ఋణాలపై వడ్డీ పెంచితే మళ్లీ మనపైనే భారం. ఋణాలు ఎగ్గొట్టేవాళ్లకు యీ చింత ఏమీ లేదు. బాగా డబ్బున్నవాళ్లూ అప్పులు ఎగ్గొడుతున్నారు. పేదవాళ్లకు, వ్యవసాయం పేర చిన్నా, పెద్దా రైతులచేత ప్రభుత్వం ఎగ్గొట్టిస్తోంది. దాని వలన కలిగే కష్టనష్టాలు మనలాటి మధ్యతరగతి వాళ్లకు.

ఆంధ్రరాష్ట్రానికి కావలసిన నిధులు ఎన్ని అనేది తేలితే రాష్ట్రప్రభుత్వం యీ ఋణభారం తన నెత్తిమీదే వేసుకుంటుందో లేదో చెప్పవచ్చు. విభజన ప్రకటన రాగానే చంద్రబాబు రాజధానికై నాలుగైదు లక్షల కోట్లు కావాలన్నారు. అంతా ఎద్దేవా చేస్తే టిడిపి ఎమ్మెల్సీ రాజేంద్రప్రసాద్‌గారికి కోపం వచ్చింది – బాబుగారు అన్నీ లెక్కలు వేసుకునే చెప్పారని వాదించారు. నాలుగుకి, ఐదుకి మధ్య ఒక లక్షకోట్లు తేడా వుంది. రాజధాని ఎక్కడో ఏమిటో తెలియకుండానే అక్కడి స్థలం రేటు తేలకుండానే అంత ఉరామరిగా ఆయన చెపితే యీయన మాత్రం కచ్చితంగా లెక్క కట్టి చెప్పారని వాదించారు. తనకు ప్రతికూలంగా వుండే కాంగ్రెసు కేంద్రంలో అధికారంలో వుండగా చెప్పిన లెక్క అది. అనుకూలమైన బిజెపి వచ్చాక యిప్పుడు ఆ అంకె చెప్పడం మానేశారు. నిధులిచ్చి ఆదుకోవాలి అని అస్పష్టంగా మాట్లాడుతున్నారు. సీమాంధ్రను సింగపూరు చేసే నినాదం బాబుగారిది. సింగపూరు నిర్మించడానికి ఎంత ఖర్చయిందో తెలుస్తే బాగుండును. దాని జనాభా 52 లక్షలు. దానికి 9 రెట్లు ఎక్కువ జనాభా వున్న ఆంధ్రరాష్ట్రానికి ఆ ఖర్చుకి 9 రెట్లు ఎక్కువ అవుతుందన్నమాట. ఉద్యోగుల జీతాలకే డబ్బు లేని పరిస్థితిలోకి నెడుతున్నారు అని ఓ పక్క విమర్శిస్తూనే యింత భారీ హామీ యిచ్చేశారు బాబు. తెలంగాణ ఉద్యోగులు మాత్రమే తెలంగాణలో పని చేయాలి అనే నినాదంతో కెసియార్ గొడవ చేసి నియమాలతో సంబంధం లేకుండా వాళ్లు ఆంధ్రావాళ్లు అనుకున్న వాళ్లందరినీ పంపించేయబోతున్నారు. వారి కోసం ఆంధ్రరాష్ట్రంలో సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించవలసి వస్తుంది. ఉన్నవాళ్లకే సర్దలేక ఛస్తూ వుంటే బాబు కొత్త ఉద్యోగాలు ఎలా సృష్టించగలరు? నిరుద్యోగులకు యిచ్చిన హామీలు ఎలా నెరవేర్చగలరు?

అసలు రాజధాని కట్టడానికే ఆంధ్రులకు డబ్బు లేదు, డబ్బిచ్చి ఆదుకోండి అని విరాళాల సేకరణ మొదలుపెట్టారు. ఇటువంటిది ఎక్కడా కనలేదు, వినలేదు. ప్రభుత్వానికి డబ్బే లేకపోతే విడగొట్టమని ఎవడేడ్చాడు? ప్రజలు పన్నులు సరిగ్గా కడితే చాలు, ప్రభుత్వాలకు యిలా బిచ్చం పడేయనక్కరలేదు. ఈ డ్రామాకు నాయకత్వం వహిస్తున్నది ఆంధ్రజ్యోతి! తెలంగాణ ఉద్యమాన్ని భుజాన మోసి, విభజన జరిగేదాకా నిద్రపోకుండా హంగామా చేసిన ఆంధ్రజ్యోతి యిప్పుడు ఆంధ్ర రాజధానికి నిధులు సమకూర్చమంటూ ప్రచారం చేయడమా? అంటే కాళ్లు విరక్కొట్టి ఆ పైన చంకకర్రలకు డబ్బు యిచ్చినట్టా? రేపు తెలంగాణ పునర్నిర్మాణానికి కూడా డబ్బులు వసూలు చేస్తారా? ఇలా డబ్బులు యిచ్చే ప్రజలకు ఆ డబ్బులు ఎలా వినియోగం అవుతాయో అవగాహన వుందా? మామూలుగా కొత్త మంత్రి రాగానే వాస్తు తనకు నప్పలేదంటూ తన అధికారిక నివాసానికి కనీసం పది, పదిహేను లక్షలు ఖర్చు పెట్టి మార్పుచేర్పులు చేయిస్తారు. ఆఫీసుకి యింకో పది! ఓ ఆర్నెల్లకు అతను దిగిపోయాక కొత్తగా వచ్చినవాడు మళ్లీ ఖర్చు చేయిస్తాడు. కొత్త కార్లు కొంటారు. పాతవాడు యిల్లు ఖాళీ చేయకపోతే వీళ్లు కొత్తది కొనిపిస్తారు. ఇప్పుడు యీ దాతలు పంపే డబ్బు యిలాటి విలాసాలకు ఖర్చవదని ఎవడైనా హామీ యివ్వగలడా? ఆడంబరంగా వుండము అని ఆంధ్రమంత్రులు రాసి యిచ్చారా? గుడారాల్లోనైనా వుంటాం, హైదరాబాదు ఖాళీ చేసి పోతాం అని అన్న బాబు వారం తిరక్కుండా యింకో ఏడాది దాకా హైదరాబాదులో వుంటాం అన్నారు. గుడారాలు, గుడిసెల్లో వుంటాం, ఆదివారాలు కూడా వచ్చి నిద్రాహారాలు మానేసి పనిచేస్తాం అని నాయకులు, ఉద్యోగులు అంటూంటే విని నవ్వుకోవాలి కానీ నమ్మేయకూడదు. వేళకు ఆఫీసుకి వస్తే చాలు, సామెత చెప్పినట్లు... గుళ్లో దీపం పెట్టినంత

పుణ్యం. ప్రకాశం గారి రోజుల్లో కర్నూలులో గుడారాల్లో లేరా? అంటే ఆ నాటి నాయకుల పద్ధతే వేరు.

ఈ విరాళదాతలకు ఆంధ్రరాష్ట్రంపై అంత మమకారమే వుంటే శ్రమదానం చేయవచ్చు, శారీరకంగా శ్రమ పడే ఓపిక లేకపోతే శ్రమదానం చేసేవారికి తిండితిప్పలకో, బట్టలకో వస్తురూపేణా సహాయం చేయవచ్చు. ఎందుకంటే ఆంధ్ర రాష్ట్రంలో వర్క్ ఫోర్స్ పెరగబోతోంది. తెలంగాణలో ప్రభుత్వోద్యోగుల్లో స్థానికత వివాదం చెలరేగడం చూస్తున్నాం. క్రమేపీ యిది ప్రయివేటు సంస్థలకు కూడా వ్యాపిస్తుంది. కెసియార్ కాంట్రాక్టు ఉద్యోగులను కూడా పర్మనెంటు చేస్తామంటున్నారు. నిరుద్యోగులకు యిప్పట్లో ఉద్యోగాలు రావు. అందువలన ప్రయివేటు సంస్థల్లో కూడా స్థానికులకే యివ్వాలన్న ఉద్యమం లేవనెత్తి ఆంధ్రులను పంపించివేయడం ప్రారంభమవుతుంది. ఈ నిరుద్యోగ యువతకు ఆంధ్రలో ఉపాధి కల్పించాలంటే అక్కడ నిర్మాణాలు చేపట్టాలి. ప్రభుత్వం వద్ద నిధులు లేవు. మోదీ ఆంధ్రరాష్ట్రం నిర్మాణానికి, ఋణమాఫీకి, మరో సంక్షేమపథకానికీ నిధుల వర్షం కురిపించేస్తాడని ఆశ పెట్టుకోవద్దు. ఆయనది సంక్షేమవిధానం కాదు. గుజరాత్‌లో చౌకగా ఏదీ లభించదు. డెవలప్‌మెంట్ కావాలంటే ఎవరైనా పెట్టుబడిదారులకు చెప్పి, పెట్టుబడులు పెట్టించవచ్చు, వారు పర్యావరణం గురించి, కార్మిక సంక్షేమం గురించి అనేక నియమాలు ఉల్లంఘించినా కళ్లు మూసుకోమనవచ్చు. గుజరాత్‌లో అదే జరిగింది. ఏదో ఒకలా ఎకనమిక్ యాక్టివిటీ జరిగితే అదే పదివేలు అనే పరిస్థితిలో వుంది ఆంధ్ర. ప్రాజెక్టుల వ్యయం తగ్గించాలంటే ప్రజలు శ్రమదానం చేయాల్సి వుంటుంది. అలా చేసేవారికి కూడు, గుడ్డా ఏర్పాటు చేసేందుకు ఈ దాతలు తమ విరాళాలను అలాటి కార్యాలకు ఉపయోగిస్తే మంచిదని నా భావన. ఇదేమీ అక్కరలేదు, మోదీ డబ్బు యిస్తాడనుకుంటే మాత్రం దెబ్బ తింటారు. డెవలప్‌మెంట్‌కీ, ప్రజాకర్షక పథకాలకూ, సంక్షేమపథకాలకూ అన్నిటికీ కేంద్రమే ఎందుకు భరిస్తుంది? అలా యిస్తే తక్కిన రాష్ట్రాలు వూరుకుంటాయా? ప్రత్యేక రాష్ట్ర హెూదాయే డౌట్‌లో వుంది. ఋణమాఫీ వంటి ప్రజాకర్షక పథకానికి బిజెపి ఆధ్వర్యంలోని కేంద్రం నిధులిస్తే వాళ్లకు రాజకీయ లబ్ధి కూడా వుండదు కదా. ఎంత చేసినా టిడిపికి పేరు వస్తుంది. అసలు బిజెపిని రాష్ట్రంలో బాబు ఎదగనిస్తారో లేదో గతానుభవాల దృష్ట్యా బిజెపికి సందేహాలుండవచ్చు. అందుకే మోదీ ఎందుకైనా మంచిదని జగన్‌కు ఎపాయింట్‌మెంట్ యిచ్చాడు. అవసరమైతే బాబుకి చెక్ పెట్టడానికి కూడా మోదీ సందేహించడని అర్థమవుతోంది. మోదీ నిధులు కురిపిస్తానని తిరుపతి సభలో కూడా చెప్పలేదు. తూర్పుతీరం వుంది, కష్టపడండి, పైకి రండి అని ఉపదేశమిచ్చాడంతే. బాబు ఢిల్లీ వెళ్లి మోదీని ఋణమాఫీ విషయంలో ఆయన చేయబోయే సహాయం ఎంతో కనుక్కుని వచ్చి వుంటారు. రేపు ప్రమాణస్వీకారం చేసేటప్పుడు విశ్వసనీయతకోసమేనా ఆ ఫైలుపై తొలి సంతకం పెడతారు. అయితే దానిలో ఎన్ని రైడర్స్ వుంటాయో, ఎన్ని చిక్కుముళ్లు వేస్తారో మీడియా హెూరు తగ్గాక కానీ స్పష్టం కాదు. ఆ నిర్ణయం ఎంత సబబో ఇలాటి సమర్థనల్లో అపారమైన అనుభవం వున్న ''ఈనాడు'' మనకు ఎలాగూ నచ్చచెపుతుంది. విందాం. అంతవరకు బెంగ వీడుదాం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

మే 31-33 వీక్లీకై ఎమ్బీయస్ : డ్యామ్ గురించి రెండు రాష్ట్రాల రచ్చ

శీర్షిక చూడగానే పోలవరం ప్రాజెక్టు గురించేమోనన్న సందేహం రావచ్చు. కాదు, ముల్ల పెరియార్ డామ్ గురించి కేరళ, తమిళనాడు ప్రభుత్వాల మధ్య వివాదం యిది. ఈనెల 7 వ తారీకున సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పుతో మళ్లీ వెలుగులోకి వచ్చింది. కేరళలోని పడమటి కనుమలలోని కార్డమామ్ హిల్స్‌లో పెరియార్ నది పశ్చిమాభిముఖంగా అరేబియన్ సముద్రంలోకి ప్రవహిస్తూ వుంటుంది. ఆ కొండలకు యివతల నుండి తమిళనాడు ప్రారంభమవుతుంది. మధురై పక్కన వైగై నది పారుతుంది కానీ అది చిన్నది కావడం చేత మధురైకు సాగునీటి సమస్య వచ్చింది. బ్రిటిషువారు యీ సమస్య గుర్తించి 1887-95 మధ్య 176 అడుగుల ఎత్తున్న యీ డామ్ కట్టి పెరియార్ నదీప్రవాహాన్ని తూర్పు ముఖంగా మళ్లించి నాలుగు జిల్లాల దాహార్తిని తీర్చారు. ముల్లయార్, పెరియార్ నదులు కలిసే చోట డ్యామ్ కట్టారు కాబట్టి ముల్లపెరియార్ డ్యామ్ అన్నారు. ఉండడం కేరళలో వున్నా, దాని మేన్‌టెనెన్స్ అంతా తమిళనాడుదే. మొదట్లో యిరిగేషన్‌కు మాత్రమే వుపయోగించినా తర్వాతి రోజుల్లో జలవిద్యుత్‌కు కూడా వాడుకుంటున్నారు. దానిలో 152 అడుగుల వరకు నీటిని నిలువ చేసేవారు.

1979లో మోర్వీలో డామ్ బద్దలై 15 వేల మందిని మరణించిన తర్వాత, కేరళలో యీ డ్యామ్ గురించి ఆందోళన ప్రారంభమైంది. తమిళనాడు ప్రభుత్వం డామ్‌ను సరిగ్గా మేన్‌టేన్ చేయడం లేదని, పగుళ్లు, లీకులు వచ్చినా వాటి గురించి పట్టించుకోవటం లేదని, ఎపుడైనా రిక్టర్ స్కేలుపై 6 కి మించిన భూకంపం వచ్చి డామ్ బద్దలయితే నష్టం కేరళకే ననీ, దాని నుండి లబ్ధి పొందుతున్న తమిళనాడుకి ఏ చింతా లేదని కేరళ ప్రజలు నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ స్వయంగా వచ్చి పరిశీలించి నిలువ నీటి ఎత్తును 152 నుండి 142కి తగ్గించమన్నారు. ఆ తర్వాత దాన్ని 136కి తగ్గించమన్నారు. రిపేర్లు కూడా చేపట్టమన్నారు. తమిళనాడు చేసిన రిపేర్లు కేరళ ప్రభుత్వం తరఫున వచ్చిన పరిశీలకులకు తృప్తి కలిగించలేదు. 1988లో డ్యామ్‌కు 20 కి.మీ.ల దూరంలో రిక్టర్ స్కేలుపై 4.5 పరిమాణం కల భూకంపం వచ్చి చాలా నాశనం జరిగింది. అందువలన యిప్పుడున్న 136 అ.ల ఎత్తుకు మించి నీటిని నిలువ చేయకూడదని కేరళవాసుల అభిప్రాయం.

కానీ తమిళనాడు ప్రభుత్వం 152 అడుగుల ఎత్తుదాకా నిలువ చేస్తామని పట్టుబట్టింది. ఎందుకంటే తేని, మధురై, శివగంగ,

రామనాథ్ జిల్లాలకు అదే తాగునీరు, సాగునీరు అందిస్తుంది. ఎత్తు తగ్గించిన తర్వాత 1980 నుండి 2005 మధ్య 40 వేల ఎకరాలకు నీరు అందకుండా పోయిందని వాదించింది. అయితే కేరళ దాని వాదాన్ని తిప్పికొట్టింది. 1979–80లో 1.71 లక్షల ఎకరాలు సాగు చేయగా 136 అ.లకు తగ్గించిన తర్వాత 1994–95లో 2.30 లక్షల ఎకరాలు సాగయ్యానని గణాంకాలు చూపింది. అంతగా కావాలంటే 110 సంఎల క్రితం సున్నపురాయితో కట్టిన పాత డ్యామ్‌ను కూల్చేసి, ఆధునిక విజ్ఞానంతో కొత్త డ్యామ్ కట్టుకోండి అని తమిళనాడుకు సూచించింది. తమిళనాడుకి యీ ప్రతిపాదనలు నచ్చలేదు. సుప్రీం కోర్టుకి వెళ్లింది. ముగ్గురు సభ్యుల కమిటీ వేస్తే వారు 142 అ.ల వరకు పెంచుకోవచ్చని అభిప్రాయపడ్డారు. దాని సిఫార్సు మేరకు 2006 ఫిబ్రవరిలో సుప్రీం కోర్టు ఆదేశాలు జారీ చేసింది. కోర్టు తీర్పు అమలు చేయకుండా చూడడానికి 15 రోజులు తిరక్కుండా కేరళ ఎసెంబ్లీ సమావేశమై ఆ డ్యామ్‌ను ఎన్‌డేంజర్డ్ (ప్రమాదభూయిష్టమైనది, కాపాడవలసినది) షెడ్యూల్‌లో చేరుస్తూ చట్టం చేసింది. డామ్ సేఫ్టీ అథారిటీ అనే ప్రభుత్వసంస్థను ఏర్పరచి 136 అ.ల లోపునే నీటిని నిలువ చేసేట్లు డ్యామ్ రక్షణను దానికి అప్పగించింది.

ఈ చట్టం కారణంగా కోర్టు తీర్పు అమలు కాకుండా పోయింది. ఏం చేయాలో పాలుపోని సుప్రీం కోర్టు రెండు ప్రభుత్వాలూ పరస్పర సంప్రదింపులతో పరిష్కరించుకోవచ్చు కదా అంది. పరిష్కారం ఎలా పొసుగుతుంది? డ్యామ్ వలన ప్రయోజనం ఒక రాష్ట్రానికి కలుగుతోంది, రిస్కు మరో రాష్ట్రానిది! చివరకు సుప్రీం కోర్టు ముగ్గురు సభ్యుల రాజ్యాంగ బెంచ్ ఏర్పాటు చేసి రాష్ట్రం చేసిన చట్టంపై భవిష్యత్తులో రాబోయే పరిణామాల గురించి అధ్యయనం చేయమంది. దాని నివేదిక ఆధారం చేసుకుని ఈ మే 7 న తీర్పు వెలువరించింది. కేరళ అసెంబ్లీ అలాటి చట్టం చేసి న్యాయవ్యవస్థ అధికారాలను ఛాలెంజ్ చేసిందని, రాజ్యాంగం ప్రకారం ఎగ్జిక్యూటివ్, లెజిస్లేచర్, జ్యుడిషియరీ – ఏ వ్యవస్థకు వుండే గౌరవం దానికి వుండాలని ఒకదానిని మరొకటి అతిక్రమించరాదని తీర్పులో చెప్పింది. కేరళ పాస్ చేసిన చట్టం కొట్టేసింది. 142 అ.ల ఎత్తువరకు నీరు నిలువ చేసుకోవచ్చని అంది. అది అమలయ్యేందుకు ముగ్గురు సభ్యులతో ఓ కమిటీ వేసింది. సెంట్రల్ వాటర్ కమిషన్ చైర్మన్ అధ్యక్షతన కేరళ, తమిళనాడు ప్రతినిధులు కలిసి పనిచేయాలని చెప్పింది. తమిళనాడు ప్రభుత్వం డ్యామ్‌కు మరమ్మత్తులు చేయాలని, కేరళ ప్రభుత్వం వారిని అనుమతించాలని కూడా చెప్పింది.

రాష్ట్రాలు విడగొట్టడం సులభమే. కానీ విభజన వలన తలెత్తే సమస్యల్లో నీటి పంపకాల సమస్య ప్రధానమైనది. దశాబ్దాలైనా ఆ రగడ సాగుతూనే వుంటుంది. ఆంధ్ర, తెలంగాణల మధ్య ఏం జరగబోతోందో యీ ముల్లపెరియార్ డ్యామ్ ఉదంతం సూచిస్తోంది.
**– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

## ఎమ్బీయస్ : బెంగాల్‌లో మొద్దు శీను లాటి కథ

కలకత్తాలోని ప్రెసిడెన్సీ జైలులో హర్‌ప్రీత్ సింగ్ (హేపీ సింగ్ అని కూడా అంటారు) అనే జీవితఖైదు అనుభవిస్తున్న 43 ఏళ్ల ఖైదీ వున్నాడు. అతను అఫ్తాబ్ అన్సారీ అనే అండర్‌వరల్డ్ డాన్‌కు అనుచరుడు. అతను మే 5 ఉదయం యోగాసనాలు వేసుకుంటూ వుండగా తోటి ఖైదీ మొహమ్మద్ నిజాముద్దీన్ అతని తలమీద ఒక యిటిక పెట్టి దెబ్బలు కొట్టి చంపేశాడు. నిజాముద్దీన్ కూడా యావజ్జీవశిక్ష అనుభవిస్తున్నవాడే. అతనికి మతిస్థిమితం లేదని, అప్పుడప్పుడు క్రూరంగా ప్రవర్తిస్తాడనీ జైలర్లు చెపుతున్నారు. మొద్దు శీను కథలా లేదూ!?

బెంగాల్‌లో ఖదీమ్స్ అనే చెప్పుల కంపెనీ యజమాని, ధనికుడు పార్థ ప్రతీమ్ రాయ్ బర్మన్‌ను 2001 జులై 23 న ఫ్యాక్టరీకి వెళుతూండగా కొందరు కిడ్నాప్ చేశారు. అతన్ని ఒక యింట్లో బందీగా వుంచి 3.75 కోట్ల రూ.ల డబ్బు పుచ్చుకున్న తర్వాతనే విడుదల చేశారు. దీనికి సూత్రధారి అఫ్తాబ్ అన్సారీ, పాత్రధారులు హేపీ సింగ్‌తో సహా మరో యింకో ముగ్గురు. ఈ డబ్బు అమెరికాలో 9/11 దాడులకు ఉపయోగపడిందని విచారణలో తెలిసింది. దాంతో పోలీసులు గట్టిగా ప్రయత్నించి వీళ్లను వెంటాడారు. హేపీ సింగ్ 2011 చివర్లో ఉత్తర్ ప్రదేశ్‌లో పట్టుబడ్డాడు. తక్కిన వాళ్లు కూడా. అయితే విచారణ సులభంగా సాగలేదు. రాయ్ బర్మన్ సాక్ష్యం చెప్పడానికి నిరాకరించాడు. అతని భయాలు అతనివి. కోర్టు విచారణ ఎనిమిదేళ్లపాటు సాగి 2009లో తీర్పు వెలువడింది. అందరికీ యావజ్జీవ కారాగార శిక్ష పడింది. అయితే అన్సారీ మరో కేసులో కూడా యిరుక్కున్నాడు. 2002లో కలకత్తాలోని అమెరికన్ సెంటర్‌పై జరిగిన దాడి జరిపి 5గురు పోలీసులను చంపి, 18 మందిని గాయపరచిన కేసులో అతని పాత్రకు 2005లో ఉరిశిక్ష విధించారు.

హేపీ సింగ్ అప్పణ్నుంచి జైల్లోనే వున్నాడు. మంచి ప్రవర్తన కనబరుస్తూ పెయింటింగ్‌ను హాబీగా చేసుకున్నాడు. ఈ పరిస్థితుల్లో యీ హత్య జరగడం అనేక అనుమానాలకు దారి తీస్తోంది. హంతకుడు నిజాముద్దీన్‌ను పిచ్చివాళ్ల సెల్‌లో కాకుండా యితని సెల్‌కు ఎందుకు పంపించారో జైలు అధికారులు చెప్పాలంటూ ప్రజాహక్కుల నేతలు నిలదీస్తున్నారు. ప్రభుత్వం జైలు అధికారులను సస్పెండ్ చేసింది. విచారణకు ఆదేశించింది.**– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

## ఎమ్బీయస్ : భగత్ సింగ్‌పై మరో పుస్తకం

భగత్ సింగ్‌పై యిప్పటికే దాదాపు 400 పుస్తకాలున్నాయట. సగం హిందీలో కాగా, తక్కినవి యితర భారతీయభాషలు, ఇంగ్లీషు.

ఒకటి జర్మన్ భాషలో కూడా వుంది. ఆయన జీవితంపై కూలంకషంగా పరిశోధించిన చమన్‌లాల్ అనే సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, ఢిల్లీ జెఎన్‌టియులో హిందీ ప్రొఫెసర్ "అండర్ స్టాండింగ్ భగత్ సింగ్" అనే పుస్తకం రాశారు. అందరి కంటె ఎక్కువగా భగత్ సింగ్‌ను ఎక్కువగా ప్రొజెక్టు చేసేది రైటిస్టులు. నిజానికి అతను కమ్యూనిస్టు భావాలు కలవాడు. నాస్తికుడు. చిత్రం ఏమిటంటే కమ్యూనిస్టులు భగత్ సింగ్‌ను చాలా ఏళ్లపాటు పట్టించుకోలేదు. తెలిసీ తెలియని వయసులో అతనేదో దుందుడుకుగా ప్రవర్తించి బలి అయిపోయాడనే భావం చాలామందిలో వుంది. అది వాస్తవం కాదని యీ పుస్తకం చెపుతుంది. 1931లో అతను ఉరి తీయబడేనాటికి అతని వయసు 24. కానీ అప్పటికే అతను అనేక విషయాలపై ఎంతో జ్ఞానాన్ని సంపాదించి వున్నాడని చమన్‌లాల్ అంటారు. "నేను ఎందుకు నాస్తికుణ్ని?" అని భగత్ పత్రికలకు రాసిన వ్యాసాన్ని కూడా ఆయన సేకరించారు.

భగత్ పినతండ్రి అజిత్ సింగ్ విప్లవకారుడు. అజ్ఞాతంలో వుండేవారు. వాళ్లకు పిల్లలు లేరు. అతని భార్య హర్‌నామ్ కౌర్ భగత్‌ను ఆప్యాయంగా చూసేది. అతను కాన్పూరు వచ్చాక గణేశ్ శంకర్ విద్యార్థి నడిపే "ప్రతాప్" అనే వామపక్ష హిందీ దినపత్రికలో పని చేశాడు. అక్కడే అతనికి బి కె దత్, జయదేవ్ కపూర్ వంటి విప్లవకారులు పరిచయమయ్యారు. వారిలో ఒకరైన అజయ్ ఘోష్ తర్వాతి రోజుల్లో కమ్యూనిస్టు పార్టీకి జనరల్ సెక్రటరీగా పనిచేశారు. భగత్ హిందీలో వ్యాసాలు రాసేవాడు. పంజాబ్‌లో భాషాసమస్య గురించి అతను రాసిన వ్యాసం చమన్‌లాల్‌కు లభించింది. "పంజాబ్‌లో పంజాబీ వుండాల్సిందే. హిందీ భాష పంజాబీ హృదయానికి చాలా దూరం. అయితే పంజాబీ ప్రస్తుతం గురుముఖి లేదా ఉర్దూ లిపులలో రాస్తున్నారు. రెండూ అసమగ్రమైనవే. అందుకని దేవనాగరి లిపిలో పంజాబీని వాడాలి." అని ఆ వ్యాసంలో భగత్ ప్రతిపాదించాడు. ఆ సందర్భంగా మాజిని, గారిబాల్డీ, టాల్‌స్టాయ్, కార్ల్ మార్క్స్, రూసో, వాల్టేర్‌లను అతను ఉటంకించాడు. అప్పటికి అతని వయసు 17 మాత్రమే. అంటే అతను ఎంతటి చదువరో అర్థం చేసుకోవచ్చు.

అతనికి స్పష్టమైన రాజకీయ అవగాహన కూడా వుండేది. 'హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ కార్మిక, కర్షక, విద్యార్థిలను ఆకర్షించాలి. వారితో బాటు విప్లవానికి సుముఖంగా వుండే వర్గాలకు చేరువ కావాలి.' అని రాశాడు. తన 'ఇంక్విలాబ్ జిందాబాద్' ఎద్దేవా చేస్తూ "మోడర్న్ రివ్యూ" పత్రిక సంపాదకుడు రామానంద్ చటర్జీ సంపాదకీయం రాస్తే "విప్లవం అంటే రక్తపాతం మాత్రమే కాదు. తుపాకులు, బాంబులు సాధనాలే కానీ అవే లక్ష్యం కాదు. మానసిక పరివర్తనే విప్లవధ్యేయం.." అంటూ లేఖ రాశాడు. భగత్ సింగ్‌ను గాంధీ ఎన్నడూ ఆదరించలేదు. సుభాష్ చంద్ర బోస్, జవహర్‌లాల్ నెహ్రూతో సత్సంబంధాలుండేవి. లాలా లజపతి రాయ్‌కి హిందూత్వ భావాలు మెండుగా వున్నా భగత్‌కు ఆయనంటే ఆదరం వుండేది. వీరందరి కంటె భగత్ పక్షాన నిలిచినది మహ్మదాలీ జిన్నా! భగత్ సింగ్ మరణించినపుడు పెరియార్ రామస్వామి నాయకర్ తన "కుడి అరసు" మార్చి 29, 1931 సంచికలో రాస్తూ గాంధీని తిట్టిపోశాడు. భగత్ సింగ్, అతని సహచరులు మతతత్వాన్ని, కులతత్వాన్ని, ప్రాంతీయతత్వాన్ని పూర్తిగా వ్యతిరేకించారు. అతని పేరుమీద సభలు, సమావేశాలు జరిపేవారు, వ్యాసాలు రాసేవారు యీ విషయాన్ని గుర్తు పెట్టుకుని ఆచరించాలి. అదే అతనికి ఘన నివాళి.**– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

## ఎమ్బీయస్ : పద్మనాభుని గుడి నుంచి రాజవంశానికి ఉద్వాసన

250 ఏళ్లగా తిరువనంతపురం పద్మనాభాలయం ధర్మకర్తలుగా వున్న తిరువాన్కూర్ రాజవంశం సెలవు పుచ్చుకోవలసి వచ్చింది. సుప్రీం కోర్టు ఆదేశాల ననుసరించి రాజవంశ ప్రతినిథి ఐన ఆదిత్య వర్మ ఏప్రిల్ 27న గుడికి తన హోండా సిటీ కారులో వచ్చి జిల్లా జడ్జికి గుడి తాళం చెవులు, నేలమాళిగల తాళం చెవులు అన్నీ అప్పగించారు. ఒక చిరునవ్వుతో తన విషాదాన్ని అదుపు చేసుకుంటూ తన చేతిలో వున్న కారు తాళం చెవిని ఎత్తి చూపిస్తూ "నా దగ్గర వున్న కీ యిది ఒక్కటే.." అన్నాడు. ఈ నాటకీయ ఘట్టానికి నేపథ్యం చాలానే వుంది.

వెయ్యేళ్లనాటి ఆ గుడికి తాము దాసానుదాసులమని, తమ ఆస్తి సర్వస్వం పద్మనాభుని సొంతమని, 1750లో అప్పటి రాజు మార్తాండవర్మ ప్రకటించారు. ఆయన వారసులందరూ గుడి ఆస్తులను సంరక్షిస్తూ వచ్చారు. స్వాతంత్ర్యం వచ్చాక, రాజరికాలు అంతరించాక ఏం చేయాలన్న ప్రశ్న తలెత్తింది. అప్పటిరాజు చిత్ర తిరునాళ్ బలరామవర్మకు, భారత ప్రభుత్వానికి 1949లో ఒప్పందం కుదిరింది. దాని ప్రకారం గుడి రాచకుటుంబం నిర్వహించే ట్రస్టు ఆధ్వర్యంలోనే గుడి నడపడానికి కేరళ ప్రభుత్వం ఒప్పుకుంది. 1991లో ఆయన మరణించాక, ఆయన తమ్ముడు మార్తాండ వర్మ వారసుడిగా వచ్చాక గుడిలో అక్రమాలు జరగనారంభించాయి. పాత రాజుకి ఆప్తుడు, మాజీ ఐపియస్ అధికారి అయిన టి పి సుందరరాజన్‌కు యిది బాధ కలిగించింది. గుడి ఆస్తులు అన్యాక్రాంతం అవుతున్నాయని కోర్టులో కేసు వేశాడు. 2007 డిసెంబరులో తిరువనంతపురం కోర్టు రాచకుటుంబానికి గుడిపై హక్కులు లేవని తీర్పు యిచ్చింది. దీన్ని మార్తాండవర్మ సవాలు చేశారు. 2011లో కేరళ హైకోర్టు కింది కోర్టును తీర్పును సమర్థిస్తూ గుడి ఆస్తులు స్వాధీనం చేసుకోమని కేరళ ప్రభుత్వాన్ని ఆదేశించింది. మార్తాండవర్మ దీనిపై సుప్రీం కోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకున్నారు. అయితే సుప్రీం కోర్టు ఒక కమిటీ వేసి గుడి ఆస్తుల విలువ తేల్చమని కూడా చెప్పింది. ఆ కమిటీ నేలమాళిగలు తెరవ నారంభించడంతో అందరికీ ఆ ఆలయసంపద గురించి తెలియవచ్చింది. అయితే ఆరవ మాళిగ (కల్లార బి అంటారు) తెరిస్తే

అరిష్టమంటూ ప్రచారం జరిపి దాన్ని తెరవనీయకుండా చేశారు.

ఇదే సమయంలో గుడి వ్యవహారాలు క్షుణ్ణంగా పరిశీలించమంటూ సొలిసిటర్ జనరల్‌గా పనిచేసిన గోపాల సుబ్రమణ్యంను అమికస్ క్యూరే (న్యాయస్థానానికి మిత్రుడు)గా నియమించింది. ఆయన తన ప్రాక్టీసు పక్కన పెట్టి, సొంత ఖర్చులతో రాకపోకలు సాగించి, లోతుగా విచారణ జరిపి ఈ ఏప్రిల్‌లో 575 పేజీల నివేదికను సమర్పించారు. దాని ఫలితమే యీనాడు రాచకుటుంబం నుండి గుడిని స్వాధీన పరచుకోవడం! ఈ నివేదికలోని ముఖ్యాంశాలు చూసినా కళ్లు తిరుగుతాయి.

దీ నేలమాళిగలనుండి బంగారం, నగలు, వజ్రాలు భారీ స్థాయిలో తరలించబడ్డాయి

బంగారు రజనును ఎవరికీ అనుమానం రాకుండా ఇసుకలో కలిపి గుడి బయటకు తరలించారు

30 ఏళ్లగా ఆదాయం వివరాలు సరిగ్గా లేవు, ఆడిట్ జరగలేదు. కరన్సీ నోట్లను ఒక స్టీలు బాక్స్‌లో పెట్టి తాళం కూడా వేయటం లేదు.

హుండీ నుండి నెలకు 130 లక్షల రూ.ల ఆదాయం వస్తోందని అంచనా. కానీ హుండీ తెరిచి లెక్కించేటప్పుడు రికార్డులు మేన్‌టేన్ చేయడం లేదు. హుండీ తెరిచి వచ్చిన నాణాలన్నీ లెక్కపెట్టాక, తిరుచ్చి నుండి వచ్చే వ్యాపారస్తుడి చేతికి యిస్తున్నారు. దానికి రసీదు అదీ వుండదు. పోనీ బ్యాంకులో ఖాతా లేదా అంటే 17 బ్యాంకుల్లో 34 ఖాతాలు పెట్టారు.

గుడి భూములను అమ్మేసినట్లు తోస్తోంది. కొన్ని ట్రస్టులు బోగస్‌గా కనబడుతున్నాయి.

ఉద్యోగుల వద్ద బంగారం, వెండి రేకులు కనబడ్డాయి. అవి వారి దగ్గర వున్నట్టు ఎక్కడా రికార్డు చేయలేదు

17 కిలోల బంగారం కనబడలేదు. ఏమైంది అని అడిగితే నగలు చేయమని బయటి కంసాలికి యిచ్చాం అన్నారు

కల్లార బి తెరిస్తే అరిష్టమంటూ యింత హంగామా చేశారు కానీ దాన్ని అంతకుముందే పలుమార్లు తెరిచారని స్వయంగా చూసినవారు చెప్పారు.  అక్కడున్న నగలను ఫోటోలు తీశారు. అవి తమ సొంతమని రాచకుటుంబం అనుకుని అమ్మాలని చూసింది. నగలు ఎలా వున్నాయో చూపడానికి ఫోటోలు తీసుకున్నారు.

కొన్ని గదులు చూస్తే వాటిలో విలువైన వస్తువులు వున్నాయని అనుమానం కూడా రాదు. వెళ్లి చూస్తే భక్తులు యిచ్చిన బంగారం, వెండి నగలన్నీ మామూలు పెట్టెల్లో పెట్టి వున్నాయి. అలాటి గదుల్లో తాళం వేసి పెట్టిన ఒక హుండీలో ప్రాచీనకాలం నాటి నాణాలు, నగలు కనబడ్డాయి. ఇవన్నీ గుడి ఉద్యోగుల అజమాయిషీలోనే వున్నాయంటున్నారు. తాళం చెవులు అడిగితే లేవంటున్నారు.

ఎన్నో పురాతన నాణాలు ఉట్టినే సంచుల్లో పడి వున్నాయి. భద్రత లేదు.

జరుగుతున్న అక్రమాలు బయటపెట్టడానికి ప్రయత్నించినవారిపై ఆగడాలు జరిగాయి. ఒక ఉద్యోగినిపై అత్యాచారం జరిగింది. ఒక ఉద్యోగిపై ఆసిడ్ దాడి జరిగింది. మరొక ఆటోడ్రైవర్‌ను చంపి గుడి ఎదుట వున్న కొలనులో పడేశారు

ఈ నివేదిక చదవగానే సుప్రీం కోర్టు యిక ఆగలేదు. వెంటనే గుడిని అప్పగించమని రాజకుటుంబాన్ని ఆదేశించింది. ఇప్పుడు మార్తాండవర్మ లేడు. 2013 డిసెంబరులో మరణించాడు. ఆయనపై కేసు వేసిన సౌందరరాజన్ 2011లోనే పోయాడు. ఐదుగురు సభ్యులతో గుడి నిర్వహణ కమిటీ ఏర్పాటు చేసింది. ఏదైనా ముఖ్యమైన విషయాలలో రాచకుటుంబాన్ని సంప్రదించండి తప్ప వారికి నిర్వహణలో భాగం కల్పించవద్దు అంది. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్‌గా పని చేసి రిటైరైన వినోద్ రాయ్‌ను గత పాతికేళ్లగా జరిగిన లావాదేవీలు సమీక్షించమంది. నిపుణుల కమిటీ ఏర్పరచి నేలమాళిగల్లోని వస్తువుల ఖరీదు కట్టమంది.

రాచకుటుంబం వీటన్నిటికి మౌనంగా సమ్మతించింది. బలరామవర్మ కుమారుడైన రామవర్మ, ఆస్పిన్‌వాల్ అండ్ కంపెనీ అనే వంద కోట్ల పబ్లిక్ లిమిటెడ్ కంపెనీకి మేనేజింగ్ డైరక్టర్. మంగళూరులో దాని హెడాఫీసు. షిప్పింగ్, లాజిస్టిక్స్, ప్లాంటేషన్స్, టూరిజం వ్యాపారాలు చేస్తూ వుంటారు. బెంగుళూరు, చెన్నయ్, త్రివేండ్రంలలో అనేక భవంతులు వున్నాయి. ఆయన తన ప్రతినిథిగా ఆదిత్యవర్మను పంపి ప్రభుత్వానికి తాళం చెవులు అప్పగించేశారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (మే 2014)**

**జూన్ 01** **ఎమ్బీయస్ : ఎన్నికల ఫలితాలు 2**

ఫలితాలపై చర్చ చూసి కొందరు ఫలితాలు వచ్చేసిన యిన్నాళ్లకి యిది అవసరమా అని వ్యాఖ్యానిస్తున్నారు. అంకెలు ఎక్కడైనా కనబడతాయి కదా అంటున్నారు. ఈ శాతాలూ అవీ బోరుగా వున్నాయంటున్నారు. ఫలితాలను వేర్వేరు కోణాలలో విశ్లేషించడం ఎప్పటినుండో వున్న ప్రక్రియ. సోషల్ సైంటిస్టులు ఏళ్ల తరబడి విశ్లేషిస్తారు. నేను 2009 ఎన్నికల తర్వాత కూడా ఎన్నో వారాల పాటు విశ్లేషణలు సేకరిస్తూనే వున్నాను. ఎందుకంటే  ఏ ఫలితానికీ సులభంగా సమాధానం దొరకదు. ప్రతీ సమాధానంలోనూ కొత్త ప్రశ్న మొలుచుకువస్తుంది. ఓటింగ్ పేటర్న్ (ధోరణి) కనుక్కోవడం చాలా కష్టం. అది తెలిస్తేనే పార్టీలు భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించుకో గలుగుతాయి. భారతీయసమాజం భిన్న సంస్కృతుల మేళవింపు. ఏ వర్గం ఎలా ఓటేసిందో, ఎందుకు వేసిందో, అసలు ఓటర్లలో వర్గస్వభావం వుందో లేదో, సర్వత్రా అలాగే వుందో, వేర్వేరు చోట్ల వేర్వేరు విధాలుగా పనిచేసిందో కనుక్కోవడం క్లిష్టమైన ప్రక్రియ. ఈ గందరగోళ పరిస్థితుల్లో ఒక సూత్రం కనుక్కోవడానికి ప్రయత్నించడం ఒక కసరత్తు. ఎన్నికలు జరిగిపోయిన కొన్ని నెలల దాకా జాతీయ మీడియా వీటిపై వ్యాసాలు ప్రచురిస్తూనే వుంటుంది. ఫలితాలు తెలిశాయి కదాని మానేయదు. తెలుగు

మీడియా ఫలితాలు వచ్చిన రెండు మూడు రోజుల్లో విశ్లేషణలు కట్టిపెట్టేస్తుంది. జీవితంలోనే కాదు, ప్రతీ చర్యకు సింహావలోకనం, సమీక్ష అవసరం అని భావించే నేను జాతీయ మీడియాను బాగా ఫాలో అవుతాను. వాటి సారాంశాన్ని పాఠకులకు అందిస్తాను.

ఇదంతా అనవసరం అనుకున్నవారు హాయిగా చదవడం మానేయవచ్చు. ఇదేమీ వారి సిలబస్‌లో లేదు కదా, కష్టపడి దీనిపై పరీక్ష రాయమని ఎవరూ అడగరు కదా. ఫలితాలు కరక్టుగా వూహించలేక పోయావు కానీ, యిప్పుడు గొప్పగా విశ్లేషిస్తున్నావే అని కొందరి వెక్కిరింత. కరక్టుగా వూహించడం పెర్‌ఫెక్ట్‌గా వస్తే యీ వ్యాసాలెందుకు రాసుకుంటాను? కోట్ల కొద్దీ ఖర్చు పెట్టే అభ్యర్థుల వద్ద లక్షల్లో ఫీజు తీసుకుని వారి ఫలితాలను ముందే చెప్పేసేవాణ్ని. 2009 ఫలితాలు వూహించావు కదా అంటే అది మిడతంభొట్లు జోస్యం కావచ్చునని నామీద నేనే జోకు వేసుకున్నాను. నీ ఊహ తప్పింది కాబట్టి రాజకీయవ్యాసాలు మానేయమని కొందరి సలహా. 2004, 2009లో టిడిపి అధికారంలోకి వచ్చితీరుతుందని రాసిన అనేకమంది కాలమిస్టులు ఫలితాల తర్వాత రాయడం మానేయలేదు. నేను ఏది రాసినా, అనేక షరతులతో రాస్తాను. ఎందుకంటే నాకే పుట్టెడు సందేహాలు. అలా కావచ్చు.., యిలా అయితే, అలా జరగడానికి ఆస్కారం వుంది...లాటి వాక్యాలతో ఏదీ స్పష్టంగా వుండదు. పూర్తి అవగాహన వున్నపుడే క్లియర్‌గా రాస్తాను.

ఇక విశ్లేషణ కొనసాగిద్దాం. తెలంగాణ ఫలితాల గురించి నేను పోలింగుకు ముందు రాసినది – 'ఇలా చూస్తే తప్పకుండా గెలిచే స్థానాలు తెరాసకు 35-40, కాంగ్రెసుకు 35-40, మజ్లిస్‌కు 8-10 వున్నాయనుకుంటే తక్కిన 30-40 స్థానాల గురించి చెప్పడం కష్టం. టిడిపి-బిజెపిలకు కలిపి 12-15 వస్తాయనుకుంటే, వైకాపాకు 6-8 వస్తాయనుకుంటే, వామపక్షాలకు 5-7 అనుకుంటే కనీసం 10-12 సీట్లలో క్రాస్ ఓటింగు జరిగి యిండిపెండెంట్స్, రెబెల్స్ గెలుస్తారు. అబ్బే, ఇంత కాంప్లికేటెడ్‌గా వుండదు, ఓటరు నిర్ణయాత్మకంగా ఓటేస్తాడు అనే ఆశాభావం వున్నవారు కూడా గెలిచే పార్టీకి (తెరాస/కాంగ్రెస్) 50 సీట్లకు మించి వస్తాయని గట్టిగా చెప్పలేని పరిస్థితి వుంది. అందుకే అందరూ సంకీర్ణ ప్రభుత్వం తథ్యం అంటున్నారు...'!

ఈ అంచనా తప్పింది. తప్పడానికి కారణం – ఆఖరి రెండు రోజుల్లో తెరాస అనుకూల పవనాలు బలంగా వీచి, యితర పార్టీలన్నీ డల్ అయిపోవడం. కాంగ్రెసు సరేసరి. ఇతర పార్టీల గురించి చెప్పాలంటే – మజ్లిస్‌కు 7 మాత్రమే వచ్చాయి. తెలంగాణ వచ్చినా అది బలపడలేదు. ఎంపీగా నిలబడిన అసదుద్దీన్ ఒవైసీకి యాకుత్‌పుర అసెంబ్లీ నియోజకవర్గంలో అసెంబ్లీ అభ్యర్థి కంటె తక్కువ వచ్చాయి. హైదరాబాదులోని ఆంధ్రమూలాలున్నవారికి అండగా నిలబడతామని మజ్లిస్ చెప్పినా వారు పట్టించుకోలేదు. సెటిలర్లు అనే పదం ఉపయోగిస్తే వూరుకోమని, వారందరికీ రక్షణగా వుంటామనీ మజ్లిస్ చెపుతూ వచ్చింది. కానీ వారు టిడిపిని ఎక్కువగా నమ్మారు. పైగా తెలంగాణ వచ్చాక బిజెపివారు బలపడతారని ముస్లిములు భయపెడితే, నగరంలో మజ్లిస్ బలపడుతుందని బిజెపి భయపెట్టింది. మతం పేర పోలరైజేషన్ అనేది దేశంలో అనేక చోట్ల కనబడింది. హైదరాబాదులో కూడా మజ్లిస్ గతంలో ఆదరించినంతగా హిందువులు ఆదరించినట్లు కనబడలేదు. ఇక కమ్యూనిస్టులు – 5-7 అనుకున్నాను కానీ, చెరో ఒకటీ వచ్చి ఆగిపోయాయి. కాంగ్రెసునే కాదు, వారితో పొత్తు పెట్టుకున్న ప్రతీ పార్టీని ఓటర్లు శిక్షించారు. సిపిఐకూ అదే గతి పట్టింది. సిపిఐ నారాయణ తను అభ్యర్థిగా నిలబడడంతో యితర నియోజకవర్గాలలో ప్రచారం చేయడానికి సమయం తగ్గిపోయింది. ఆయనకూ ఘోరపరాజయం తప్పలేదు. సిపిఐ క్యాడర్ కూడా ఉత్సాహంగా లేరు. సిపిఎంకు గతంలో కంటె ఏమీ పెరగలేదు.

వైకాపాకు 6-8 వస్తాయనుకున్నా. ఖమ్మంతో బాటు హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాల్లో కొందరు వేస్తారేమో అనుకున్నాను. కానీ జగన్, కెసియార్ కుమ్మక్కయ్యారని నాకు అనుమానం వచ్చినట్లే చాలామందికి వచ్చినట్లుంది, వైకాపాను దగ్గరకు రానీయలేదు. దాంతో 3 దగ్గర ఆగిపోయింది. కాంగ్రెసుకు 35 ఐనా వస్తాయనుకున్నాను. కానీ 21తో సరిపెట్టుకుంది. దేశం మొత్తం మీద కాంగ్రెసు వ్యతిరేకపవనాలు ప్రబలంగా వీచాయని గుర్తు పెట్టుకుంటే యిది మరీ అంత చేటు ఫలితం కాదని గుర్తించాలి. కాంగ్రెసు తెలంగాణ యిచ్చినా యిప్పించినది కెసియార్ అనే ఫీలింగే సర్వత్రా కలిగింది. పైగా తెలంగాణ వచ్చేశాక దాని ప్రయోజనాలకోసం ఆంధ్రతో కొట్లాడే సత్తా కెసియార్‌కే వుందనుకున్నారు జనం. అందుకే వాళ్లకు 14 తగ్గాయి. వీళ్లందరికీ తగ్గిన సీట్లు తెరాస ఖాతాలో పడ్డాయి. అయితే తెరాసకు దక్కిన విజయం ఏ పాటిది?

తెరాసకు వచ్చిన సీట్లు 63. అంటే మొత్తం సీట్లలో 53%. 50 వస్తే తప్ప పాస్ కాదు కాబట్టి 53% అనేది జస్ట్ పాస్ అయినట్లే లెక్క. ఆంధ్రలో టిడిపి ఒక్కదానికే 58% సీట్లు వచ్చాయి. టిడిపి-బిజెపి కూటమికి 60.5% వచ్చాయి. దానితో పోలిస్తే తెరాసకు వచ్చినవి 53% మాత్రమే. ఇక ఓట్ల శాతానికి వస్తే టిడిపికి 45% వస్తే తెరాసకు 34% వచ్చాయి. ఆంధ్రలో ముఖాముఖీ పోటీలో టిడిపి కూటమి విపక్షమైన వైకాపా కంటె 39 (మొత్తంలో 22.8%) ఎక్కువ సీట్లు ఎక్కువ తెచ్చుకోగలిగింది. తెలంగాణలో టిడిపి కూటమి – కాంగ్రెసు – తెరాస ముక్కోణపు పోటీ జరిగింది కాబట్టి తెరాస సమీప విపక్షమైన కాంగ్రెసు కంటె 42 సీట్లు (35.3%) ఎక్కువ తెచ్చుకోగలిగింది. ఓట్ల తేడా చూడబోతే 10%. ముక్కోణపు పోటీలో తెరాస వ్యతిరేక ఓట్లు చీలాయి కాబట్టి తెరాస గెలిచింది. నిజానికి టిడిపి తెలంగాణలో ఒక ఫోర్సుగా మిగిలిందని ఎవరూ అనుకోలేదు. కానీ అది 28 లక్షల ఓట్లు, అంటే 14.6% తెచ్చుకుంది. గ్రామీణ ప్రాంతాల్లోని దాని క్యాడర్ కాడి పారేయకుండా గట్టిగా ఆత్మవిశ్వాసంతో పని చేసి వుంటే యింకా మెరుగైన ఫలితాలు వచ్చేవి. ఎందుకంటే ఉద్యమం బలంగా వున్న వరంగల్‌లోకూడా దానికి 2 సీట్లు వచ్చాయి.

నిరాశ పరిచినది బిజెపి. అది ఉద్యమంలో పాలు పంచుకున్నా, తెరాసను గుర్తించినట్లుగా దాన్ని గుర్తించలేదు. ఉద్యమం నడిచిన ఉత్తర తెలంగాణ జిల్లాలలో దానికి 5.35% ఓట్లు వచ్చాయి. ఉద్యమం పెద్దగా లేని దక్షిణ తెలంగాణలో 2% ఓట్లు వచ్చాయి. ఉ

ద్యమం బొత్తిగా లేని, ఆంధ్రమూలాలున్నవారు బహుళంగా వున్న హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలలో దానికి ఏకంగా 5.85% ఓట్లు, 5 సీట్లు వచ్చాయి – అది కూడా టిడిపితో జత కట్టింది కాబట్టి. కాకపోతే ఎటూ కాకుండా పోయేది. హైదరాబాదులో టిడిపి 2004 ఎన్నికలలో 27.56% ఓట్లతో రెండు సీట్లు తెచ్చుకుంటే 2009లో తెరాసతో పొత్తు పెట్టుకుని 11.21% పోగొట్టుకుని ఒక సీటు గెలుచుకుంది. మళ్లీ యిప్పుడు బిజెపితో పొత్తు పెట్టుకుని 22.12% ఓట్లు, 9 సీట్లు సాధించింది. బిజెపి 2004లో 10% ఓట్లతో 1 సీటు గెలుచుకుంది. 2009లో ఓట్లు 1.4% పెరిగినా మళ్లీ ఒక సీటే. 2014లో 13.32% ఓట్లతో ఏకంగా 5 గెలుచుకుంది. అంటే వీళ్ల ఓట్లశాతం గణనీయంగా పెరగకపోయినా కాంగ్రెసుకు 15.3%, తెరాసకు 19.6% (2009 ఎన్నికలలో 4.6% వచ్చాయి) రావడంతో ప్రత్యర్థుల ఓట్లు చీలిపోవడం వీరికి లాభించింది.

ఉత్తర తెలంగాణలోని 5 జిల్లాల్లో తెరాస ఊపేసింది. 54 సీట్లలో 44 సీట్లు (అంటే 81.5%) గెలుచుకుంది. దక్షిణ తెలంగాణలోని 3 జిల్లాల్లో 36 కి 14 మాత్రమే (38.8%). అది కూడా మెహబూబ్‌నగర్‌లోని 14 సీట్లలో 50% సీట్లు గెలుచుకుంది కాబట్టి! హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలకు వచ్చేసరికి 29 సీట్లకు 5 మాత్రమే గెలిచి 17%తో తృప్తి పడవలసి వచ్చింది. ఎక్కడ 81, ఎక్కడ 17! దాదాపుగా అంకె తిరగబడింది. కాంగ్రెసుకు వచ్చిన 21 సీట్లలో మూడింట రెండు వంతుల సీట్లు (14) యీ దక్షిణ తెలంగాణలోనే వచ్చాయి. అక్కడ ఓట్లూ, సీట్లూ తెరాసతో సమానంగా వచ్చాయి. హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలకు వచ్చేసరికి యీ రెండిటికి కలిపి 7 వస్తే టిడిపి-బిజెపి కూటమికి వీళ్లకంటె రెట్టింపు, కరక్టుగా చెప్పాలంటే 15 వచ్చాయి. దీని అర్థం తెరాసకు దక్షిణ తెలంగాణలో కాంగ్రెసు సమాన ప్రత్యర్థి అయితే, రంగారెడ్డి, హైదరాబాదుల్లో టిడిపి-బిజెపి అనేక రెట్లు బలమైన ప్రత్యర్థి అన్నమాట. తెరాస బలమంతా సగం సీట్లున్న ఆ 5 ఉత్తర తెలంగాణ జిల్లాలలోనే వుంది. ఆ తర్వాత మెహబూబ్‌నగర్, నల్గొండలలో 50% వుంది. మూడోవంతు సీట్లున్న తక్కిన మూడు జిల్లాలలో 15% సీట్లు మాత్రమే తెచ్చుకోలిగిందంటే అక్కడ చాలా వీక్‌గా వుందన్నమాట.

కాంగ్రెసు ఘోరంగా దెబ్బ తినడానికి కారణం ఏమిటని వాళ్లు విశ్లేషించుకుని రెడ్డి కులానికి నాయకత్వం అప్పగించకపోవడం అని తేల్చారు. పొన్నాల లక్ష్మయ్య 'రెడ్డి' అయినా, జానారెడ్డిని పిసిసి అధ్యక్షుణ్ని చేసినా యింతకంటె మెరుగైన ఫలితం వచ్చేదనుకోను. తెలంగాణలో కాంగ్రెసు ఎప్పుడో కూలబడివుంది. 2004లో చంద్రబాబుపై వ్యతిరేకత కారణంగా వీళ్లు నెగ్గారు. 2009లో వైయస్ వీళ్లను భుజాన మోసి విజయతీరాలకు తీసుకుని వచ్చాడు. వీళ్లు తమ నియోజకవర్గానికి చేసింది తక్కువ. మీడియా సమావేశాలు పెట్టి 'తెలంగాణకు ఏమీ మేలు జరగలేదు. ఆంధ్రులు మాకు అన్యాయం చేశారు. మమ్మల్ని దోచుకున్నారు.' అంటూ ప్రకటనలు యివ్వడం తప్ప! ఈ భాష తెరాసకు చెల్లుతుంది. ఎందుకంటే అది ప్రతిపక్షంలో వుంది కాబట్టి! అధికారంలో వున్న కాంగ్రెసు తెరాస వాదనలను గణాంకాల సహాయంతో ఖండిస్తూ, తమ ప్రభుత్వాన్ని వెనకవేసుకుని రావాలి కానీ, వాళ్లన్నదాన్నే వీళ్లు రిపీట్ చేస్తే ఎలా? అది విన్నవాళ్లు 'అన్యాయం జరిగినది నిజమే అయితే మీరేం చేస్తున్నారు?' అనే సహజమైన ప్రశ్న వేస్తారు. దానికి సమాధానం కెసియార్ చెప్పారు – కాంగ్రెసు వాళ్లు శుంఠలు అని. (ఇది చాలా చిన్న పదం. ఆయన చాలా ఘోరంగా తిట్టాడు) ఒక్క కాంగ్రెసు నాయకుడైనా దాన్ని ఖండించలేదు. కెసియార్ తమల్ని పూచికపుల్లల్లా తీసిపారేసి ప్రజల దృష్టిలో చులకన చేస్తున్నాడన్న గ్రహింపే రాలేదు వాళ్లకు. తమ తిట్లకు ఆంధ్ర నాయకుల నుండి చిన్న స్పందన వచ్చినా వాళ్లపై విరుచుకు పడ్డారు కానీ కెసియార్‌ను పన్నెత్తి మాట అనలేదు.

ఎందుకు? ఎందుకంటే కెసియార్ అంతిమంగా కాంగ్రెసులో చేరతాడనీ, కాంగ్రెసు సంస్థాబలం, కెసియార్ యిమేజి బలం రెండూ కలిసి వచ్చి తాము తిరిగి ఎన్నికవుతామనీ వాళ్లు కలలు కన్నారు. అందువలన కాంగ్రెసు వాళ్లలో చాలామంది తెరాస భాషే మాట్లాడారు. తెరాసతో మంతనాలు సలిపారు. తెరాసకు తొత్తులుగా వ్యవహరించారు. కెసియార్‌పై లేవని నోరు తమ పార్టీ ముఖ్యమంత్రులపై మాత్రం లేచేది. తమ పార్టీ నాయకులనే అనునిత్యం తిట్టేవారు. ఈ క్రమంలో వాళ్లు ప్రజల దృష్టిలో నాయకులుగా గుర్తింపు కోల్పోయారు. చివరకు కెసియార్ కాంగ్రెసులో చేరలేదు సరికదా, కాంగ్రెసును, దాన్ని అంటిపెట్టుకున్నవారినీ ప్రజాద్రోహులుగా చిత్రీకరించారు. ప్రజలు దాన్ని నమ్మారు. అందుకనే ఉద్యమం బలంగా వున్నచోట కాంగ్రెసును మట్టికరిపించారు. 54 సీట్లు వుంటే 10% అంటే 5 సీట్లు వచ్చాయి. తెరాస కంటె 19% ఓట్లు తక్కువ వచ్చాయి. పోనీ ఉద్యమం లేని హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాల్లో గెలిచిందా అంటే అదీ లేదు. 29 సీట్లలో 7% అంటే రెండే రెండు వచ్చాయి. ఓట్లు చూడబోతే 18%. దక్షిణ తెలంగాణలో మాత్రమే తెరాసతో సమానంగా సీట్లు, ఓట్లు తెచ్చుకుని కాస్త నిలబడింది. ఓటమి తప్పించుకున్న కాంగ్రెసు ఎంపీలిద్దరూ – గుత్తా, నంది ఎల్లయ్య అక్కడివారే. గుత్తా ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నా కాస్త పెద్దమనిషి తరహా నిలబెట్టుకున్నారు. నంది ఎల్లయ్య ఎప్పుడూ యాక్టివ్‌గా లేరు.

ఉద్యమంలో సాటి తెలుగువారిపై నోరు పారేసుకుని ఉద్దండులమైపోయాం అనుకున్న పేపర్ టైగర్స్ – పొన్నం, మధు యాష్కీ, కోమటిరెడ్డి రాజగోపాల రెడ్డి, సిరిసిల్ల రాజయ్య, బలరాం నాయక్, వివేక్, అంజన్ కుమార్ యాదవ్, సర్వే సత్యనారాయణ, అంతెందుకు తనే తెలంగాణ యిప్పించానని చెప్పుకున్న జయపాల్ రెడ్డితో సహా – అందరూ ఎగిరిపోయారు. ఎమ్మెల్యేలుగా నిలబడిన వి హనుమంతరావు, విజయశాంతి, దామోదర రాజనరసింహ, గండ్ర వెంకటరమణారెడ్డి యిత్యాదులకు కూడా యిదే గతి. ఎవరికి వారు తాము సిఎం కాండిడేటు అనుకున్నారు. ఎన్నికల వేళ వచ్చేసరికి పక్క నియోజకవర్గానికైనా వెళ్లి ప్రచారం చేసే సాహసం చేయలేకపోయారు. పిసిసి అధ్యక్షుడు కూడా ఓడిపోయారంటే ఏమిటర్థం? దామోదర రాజనరసింహ ఉపముఖ్యమంత్రిగా వుండి,

పాలన అడ్డుకుంటూనే వున్నారు. సిఎంతో బహిరంగంగా కలహించారు. తెలంగాణ యిస్తున్నాం కాబట్టి తమదే అధికారం, తనదే సిఎం పదవి అనుకుని అహంకరించారు. చివరకు రాజకీయాల్లో చాలాకాలంగా చురుగ్గా లేని బాబూ మోహన్ చేతిలో భంగపాటు చెందారు.

వీళ్లంతా తమ పార్టీని తామే బలహీన పరుచుకుంటున్నామన్న స్పృహ కోల్పోయారు. ఆంధ్ర నాయకులను ధిక్కరిస్తే, అవమానిస్తే హీరోలమై పోతాం అనుకున్నారు. అదే దృక్పథంతో పార్లమెంటు సాక్షిగా సాటి తెలుగువారిని పట్టుకుని కొట్టినవారు, సోనియా కనుసైగలతో పార్లమెంటులో అల్లర్లు సృష్టించి అవిశ్వాసాన్ని అడ్డుకున్నవారు మట్టి కరిచారు. కాంగ్రెసు వారే కాదు, నామా నాగేశ్వరరావు, రాథోడ్ వంటి టిడిపి నాయకులకూ అదే గతి పట్టింది. బాగా నోరు పారేసుకున్న నాగం జనార్దనరెడ్డికి ఓటమి గుణపాఠం నేర్పి వుండాలి. ఆయన పార్టీ దేశంలో అత్యధిక స్థానాలు గెలుచుకున్న సందర్భంలో కూడా ఆయన గెలవలేదు.

అందరి కంటె ఎక్కువగా జయపాల్ రెడ్డి ఓటమి ఒక గుణపాఠం నేర్పుతుంది. కాంగ్రెసులో వుంటూ కెసియార్ బలాన్ని పెద్దగా చూపించి, అధిష్టానాన్ని తప్పుదారి పట్టించి, తెలంగాణ యిస్తే చాలు, విజయం మనదే అని వాళ్లను మభ్యపరచిన యీ శకుని, చేవెళ్ల నియోజకవర్గంలో మళ్లీ నిలబడే సాహసం చేయలేని యీ పిరికిమనిషి మెహబూబ్ నగర్‌లో కూడా నెగ్గలేకపోయాడు. నిజానికి ఆ జిల్లాలో కాంగ్రెసుకు మరే జిల్లాలోనూ రానంతగా 31% ఓట్లు వచ్చాయి. అయినా యీ కుటిలమేధావి గెలవలేదు. ఎందుకంటే వీళ్లు తయారు చేసిన ఫ్రాంకిన్‌స్టీన్ వంటి కెసియార్ వీళ్లనే కబళించాడు. కెసియార్‌ను పెద్దవాణ్ని చేసే క్రమంలో అతని మోకాలి దాకా వచ్చే నాయకుడు కూడా లేకుండా కాంగ్రెసు చేసుకుంది. రాష్ట్రస్థాయి నాయకుడు ఒక్కడూ లేడని అనుకున్నాం కానీ జిల్లా స్థాయి వాడు కూడా లేడని తేలిపోయింది. సోనియా, రాహుల్ సభలను కూడా నిర్వహించలేకపోయిన అసమర్థులు వీరు. తన పార్టీ చేసిన మేలు కూడా వీళ్లు చెప్పుకోలేక పోయారు. హైదరాబాదు విశ్వనగరం అని, దేశంలో మూడో వంతు ఫార్మా యిక్కడే వుందని, మూడోవంతు పౌల్ట్రీ యిక్కడే వుందని, ఐటిఐయార్ యిక్కడే వచ్చిందని అధికారం చిక్కాక కెసియార్ చెప్తున్నారు. ఈ విజయాల్లో మా పాత్ర ఎంతో వుందని కాంగ్రెసు చెప్పుకోలేదెందుకు? ఇన్ని వున్నా తెలంగాణ వెనకబడిందని కెసియార్ అబద్ధాలు చెపుతూ, ఆ పేరుతో ఉద్యమం నడుపుతూ, కాంగ్రెసును దోషిగా నిలబెడుతూ వుంటే వీళ్లూ అతనితో వంతపాడి, ఆంధ్రులను తిడుతూ కాలక్షేపం చేశారెందుకు? వీళ్లకు వచ్చినదల్లా సోనియా వద్దకు వెళ్లి ఏడవడం, తెలంగాణ యిస్తే 90% సీట్లు తెస్తామని బీరాలు పలకడం. సోనియాకు కూడా వీళ్లంత తెలివితేటలే వుండడం వలన వీళ్ల మాట నమ్మింది. ఇప్పుడు వగచినా, వీళ్లపై అరిచినా ఏం ప్రయోజనం?

ఎన్నికల ప్రచారంలో కొత్త కెసియార్‌ను ప్రజలు చూశారు. ఉద్యమం నడిపినంతకాలం ఆయన ఎప్పుడూ బద్ధకంగానే వున్నాడు. బస్సు యాత్ర, పల్లె నిద్ర, తెలంగాణ తల్లి విగ్రహాల ప్రతిష్ట అంటూ ప్రకటనలు యివ్వడం, ఆ తర్వాత ఏమీ చేయకుండా ఫామ్ హౌస్‌లో పడుక్కోవడం. అయితే ఎన్నికల సమయంలో ఉదయమే లేచి ప్రచారం మొదలుపెట్టారు. 20 రోజుల్లో 107 ఎన్నికల సభలు నిర్వహించారు. 96 నియోజకవర్గాలకు స్వయంగా వెళ్లారు. ఆయన ముందు వేరే ఏ నాయకుడూ ఆనలేదు. ఆంధ్రలో మోదీ ఎఫెక్ట్, పవన్ ఎఫెక్ట్ అంటూ లెక్కలు వేస్తున్నారు కానీ తెలంగాణలో అవేమీ పనిచేయకపోవడానికి, ఉద్యమం నడిచిన జిల్లాల్లో బిజెపికి సీట్లు రాకపోవడానికి కారణం కెసియారే! దేశమంతా ఆకాశానికి ఎత్తేస్తున్న మోదీని 'సన్నాసి' అనగలిగినవాడు కెసియారే. కాంగ్రెసు చేతిలో తెలంగాణ పెడితే రాజీ పడుతుందని, టిడిపి ఆంధ్ర పార్టీ అని ప్రచారం చేయడంతో బాటు టిడిపితో చేతులు కలిపిన బిజెపికి పార్లమెంటులో నైనా గెలిపిద్దామని చూస్తే తెలంగాణ రక్షించుకోలేమని గట్టిగా చెప్పి తెలంగాణవాదుల ఓట్లు కన్సాలిడేట్ చేసుకోగలిగాడు. లేకపోతే వాళ్లలో కొంతమంది రాష్ట్రంలో తెరాసను, కేంద్రంలో బిజెపిని గెలిపిద్దాం అనుకున్నారు. క్రాస్ ఓటింగులో అటూయిటూ అయితే ఫలితం దెబ్బ తింటుందని కెసియార్ ఊహించి, సమస్యపై ఫోకస్ చేసి దాన్ని ఎడ్రస్ చేశారు. ఇలాటి జాగ్రత్తలు తీసుకుని వుండకపోతే కెసియార్ ఏ 55 వద్దనో ఆగిపోయి వుండేవారు. పోలింగ్ చివరి దశకు వచ్చేసరికి తెలంగాణవాదుల ఓట్లు చెదిరిపోకుండా అన్నీ తెరాసకే పడ్డాయి. ఈ 34% ఓట్లే తెరాస మాగ్జిమమ్ స్ట్రెంగ్త్ అని నా ఉద్దేశం. దీన్ని పెట్టుబడిగా పెట్టుకుని తెరాస ప్రస్థానం మొదలవుతోంది. వచ్చే ఐదేళ్లలో బాగా పాలిస్తే తెరాస బలం పెరుగుతుంది, లేకపోతే తరుగుతుంది.

ఇక టిడిపి – ఎవరూ వూహించనట్లుగా 15 సీట్లు గెలుచుకుంది. హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలలో ఆంధ్రమూలాలున్నవారు టిడిపిపైనే ఆశలు పెట్టుకుని ఓట్లు వేశారు. అందుకే అక్కడ 10 వచ్చాయి. ఖమ్మంలో 1 వచ్చింది. వరంగల్‌లో 2, మెహబూబ్‌నగర్‌లో 2 వచ్చాయి. ఒకప్పుడు మెహబూబ్ నగర్‌లో టిడిపి చాలా బలంగా వుండేది. 72 సీట్లలో పోటీ చేసినా గ్రామీణ ప్రాంతాల్లో తెరాసకో, తెలంగాణ యిచ్చిన కాంగ్రెసుకో ఓట్లు పడతాయని టిడిపి నాయకులు ముందే డిసైడై పోయి పెద్దగా కష్టపడలేదు. కాంగ్రెసుపై దేశమంతా వ్యతిరేకత వుందని, తెరాస పోకడలు నచ్చని కాంగ్రెసు వ్యతిరేకులు తమకు ఓట్లు వేసే ఛాన్సు వుందని టిడిపి గ్రహించలేకపోయింది. సిటింగ్ ఎమ్మెల్యేలు తెరాసలోకి వెళ్లిపోతే ప్రత్యామ్నాయ నాయకుణ్ని వీళ్లు డెవలప్ చేసుకోలేదు. దాంతో క్యాడర్ అటూయిటూ చెదిరిపోయారు. 30 నియోజకవర్గాలలో చాలాకాలంగా లీడరు అంటూ లేకుండా పోయాడట. 2014 ఎన్నికలపై ఆశ విడిచి కూర్చోవడం వలననే యిలా జరిగింది. కొందరు కావాలని నిస్తేజంగా వుండి, పార్టీని బలహీన పరచి, చివరిలో తెరాసకు వెళ్లిపోయారు కూడా. తాము ఉద్యమంలో చురుగ్గా లేము కాబట్టి ప్రజలకు తమపై ఆగ్రహం వుంటుందని అనుకున్న టిడిపి సిట్టింగ్ ఎమ్మెల్యేలు హైదరాబాదులోనే మకాం పెట్టి, తమ నియోజకవర్గాలకు తరచుగా వెళ్లకపోవడం చేత ఓడిపోయారని కూడా అంటున్నారు.

టిడిపి–బిజెపి కూటమి ఓ పట్టాన ఫైనలైజ్ కాకపోవడం చేత, టిక్కెట్ల పంపిణీ ఆలస్యమై ప్రచారానికి కేవలం 19 రోజులు మాత్రమే మిగిలాయి. ఒంటరి పోరాటానికి సిద్ధపడిన తెరాస తన అభ్యర్థులను ఎప్పుడో ఖరారు చేసి, ఎక్కువ కాలం ప్రచారం చేసుకోగలిగింది. బిజెపికి వదిలేసిన సీట్లలో టిడిపి నాయకులు నిరాశపడ్డారు, నల్గొండ లాటి చోట్ల రెబెల్స్‌గా నిలిచారు. పవన్ కళ్యాణ్ ప్రచారం టిడిపికి ఉపకరించిందని అనుకోవడానికి లేదు. విభజన పట్ల ఆయన వైఖరిలో స్పష్టత లేదు.

కాంగ్రెసు ప్రతిపక్షంగా వెలుగుతుందని అనుకోవడానికి లేదు. ఆ పార్టీ జాతీయ నాయకత్వమే నీరసించి వుంది. రాష్ట్రస్థాయిలో పదవుల కోసం కీచులాటలు సాగుతున్నాయి. కౌన్సిల్ ఫ్లోర్ లీడర్ పదవి విషయంలో డియస్, షబ్బీర్ అలీ పోరాటం చూశాం. ఇలాటి స్థితిలో టిడిపి గట్టి ప్రతిపక్షంగా ఎదగడానికి ఛాన్సుంది. ముఖ్యంగా ఆంధ్రమూలాల వారి పక్షాన వారి ఛాంపియన్‌గా నిలబడవచ్చు. తెరాస పేరు చెప్పుకుని ఎవరైనా వసూళ్లకు పాల్పడితే క్యాడర్ సహాయంతో వారిని ఎదిరించి ప్రజాదరణ పొందవచ్చు. 2019 నాటికి తెలంగాణలో టిడిపి అధికారానికి వచ్చేస్తుంది అని కొందరు ఆశిస్తున్నారు. అది యిక్కడి తెరాస పాలనపై, అక్కడి టిడిపి పాలనపై ఆధారపడి వుంటుంది. తెలంగాణ వెనకబడి, ఆంధ్ర ముందంజ వేస్తే అప్పుడు ఓటర్లు టిడిపివైపు మొగ్గు చూపుతారు. దాని గురించి యిప్పుడే మాట్లాడడం సమంజసం కాదు.

### ఈ ఎన్నికలలో గమనించవలసిన కొన్ని అంశాలు –

పంచాయితీ ఎన్నికల్లో కాంగ్రెస్ నిజామాబాద్, మెదక్, నల్గొండ, మహబూబ్‌నగర్ జిల్లాల్లో పూర్తి స్థాయి ఆధిక్యత ప్రదర్శించింది. ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో తెరాసతో సమానంగా వుంది. మునిసిపల్, ఎంపిటిసి ఎన్నికల్లోనూ దాదాపుగా యివే ఫలితాలు వచ్చాయి. కానీ జెడ్పిటిసి స్థానాల్లో తెరాస దూసుకుపోయింది. నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో కాంగ్రెసును నెట్టివేసింది. ఇలాటి పరిస్థితుల్లో తెరాస అసెంబ్లీ ఎన్నికల్లో యీ స్థాయిలో గెలుపొందడానికి ఏదో ఒక బలమైన కారణం వుండాలి. పోలింగు తేదీ దగ్గర పడుతున్న కొద్దీ తెరాసకు బలం పెరిగిందని అందరూ గమనించారు. దానికి కారణం యిప్పుడు స్పష్టంగా తెలియవచ్చింది. అది తెలంగాణ తెచ్చిన కృతజ్ఞత కాదు, సెంటిమెంటు కాదు. ఋణమాఫీ పథకమే అని యిప్పుడు తెరాస కార్యకర్తలే చెపుతున్నారు. తెరాసే ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది అనే నమ్మకం బలపడిన కొద్దీ ఋణమాఫీ జరుగుతుందన్న ఆశతోనే ఓట్లు వేశామని ఓటర్లు టీవీ ఛానెళ్లకు ఫోన్ చేసి చెపుతున్నారు. బంగారం కుదువ పెట్టి తీసుకున్న ఋణాలు కూడా ప్రభుత్వం కట్టేస్తుంది, దానితో బంగారం వెనక్కి వచ్చేస్తుంది అని మహిళా ఓటర్లు ఆశపడ్డారట. అధికారంలోకి వచ్చాక లక్ష లోపు ఋణాలు మాత్రమే, అదీ పంట ఋణాలే, అది కూడా ఏడాదిలోపువే అనడంతో ప్రజలు తిరగబడ్డారు. అప్పుడు ఇవన్నీ చెప్పుకొచ్చారు. భయపడిన కెసియార్ మరమ్మత్తు చర్యలు ప్రారంభించారు. చివరకు ఎలా తేలుతుందో చూడాలి.

లోకసత్తాకు ఉన్న ఒక్క అసెంబ్లీ సీటూ పోయింది. దాని అధ్యక్షుడు జెపికి 9.83% ఓట్లు మాత్రమే వచ్చాయి. మోదీ హవా బలంగా వీచే యీ రోజుల్లో మోదీని బలపరుస్తానని చెప్పినా యిదీ పరిస్థితి. ఆయన ప్రాతినిథ్యం వహిస్తూన్న కూకట్‌పల్లి అసెంబ్లీ ఓటర్లే ఆయనను నిరాకరించారు. లోకసత్తా ఎన్‌జిఓగా వున్నపుడు అందరూ వాళ్లు చెప్పినది వినేవారు, ఆలోచించేవారు. పార్టీగా మారాక దాని ప్రభావం దిగజారుతూ వచ్చింది. 2009 ఎన్నికల ప్రచారంలో 'ఇవి సెమి ఫైనల్స్, 2014లో అధికారం మాదే' అని హోరెత్తించేశారు. ఇప్పుడు చూడండి – ఏం జరిగిందో! జెపి పూర్తిగా టిడిపి మనిషిగా తేలడంతో ప్రత్యేక అస్తిత్వం పోయింది. 2019 నాటికి కోలుకుంటుందని లోకసత్తా వీరాభిమానులు తప్ప వేరెవరూ ఆశించలేరు.

కాంగ్రెసు సిట్టింగ్ అభ్యర్థులకు టిక్కెట్లిచ్చి ఘోరంగా నష్టపోయింది. దేశం మొత్తం మీద గెలిచిన అభ్యర్థులలో కొత్తవారే ఎక్కువ. ఇక్కడ పాతవారి పైరవీలకు లొంగారు.

తెలంగాణ జాక్ ఉద్యమం నడిచినంతకాలం చాలా ప్రభావవంతంగా వుండింది. అయితే ఎన్నికల సమయంలో చతికిలపడింది. తెలంగాణ యిచ్చేముందు కాంగ్రెసు కోదండరాంతో ఒప్పందం చేసుకుందట – ఎన్నికలలో ఎవరి పక్షాన ప్రచారం చేయకూడదని! ఎన్నికల సమయంలో తెరాసకు అనుకూలంగా ప్రకటన చేయమని కెసియార్ కోరితే కోదండరాం నిరాకరించి ఆయన ఆగ్రహానికి గురయ్యారు. కెసియార్ జాక్‌లో కొందర్ని తమవైపు లాగారు. కాంగ్రెసు మరి కొందర్ని లాగింది. టిడిపి యింకా కొందర్ని లాగింది. ఈ పరిణామాల్లో జాక్ నిర్వీర్యం అయిపోయింది. 'తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడా సంఘటితంగా నిలబడి పునర్నిర్మాణానికి కృషి చేస్తాం, ప్రభుత్వం పొరబాట్లు చేస్తే నిలదీస్తాం, ప్రజల పక్షాన నిలబడతాం, సమాజంలో అన్ని వర్గాలకు న్యాయం జరిగేట్లా చూస్తాం' వంటి ప్రకటనలు సాకారమయ్యే అవకాశం కనబడటం లేదు. ప్రజల పక్షాన మళ్లీ జాక్ ఏర్పడాలంటే కొందరు తెరాస అభిమానులు సాగనీయరు.

నిలబడిన జాక్ నాయకుల్లో కొందరు గెలిచారు, చాలామంది ఓడారు. విద్యార్థి నాయకుడు బాల్క సుమన్ తెరాస తరఫున కాంగ్రెస్ నేత వివేక్‌ను ఓడించారు. కానీ ఇంకో ఓటు జాక్ నేత పిడమర్తి రవి ఓడిపోయారు. ఓయు జాక్ నేత గాదారి కిశోర్ తెరాస తరఫున నిలబడి కాంగ్రెస్ టిక్కెట్‌పై నిలబడిన మరో జాక్ నేత అద్దంకి దయాకర్‌పై గెలిచారు. జాక్‌లో డాక్టర్ల సంఘ నేత నర్సయ్య గౌడ్ తెరాస తరఫున భువనగిరి ఎంపీగా గెలిచారు. రసమయి బాలకిషన్ తెరాస తరఫున ఆరెపల్లి మోహన్‌పై గెలిచారు. అమరవీరుల

గురించి అందరూ గొప్పగా మాట్లాడారు కానీ తొలి అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లిని ఓటర్లు ఓడించారు. కాంగ్రెస్ తరఫున నిలబడిన ప్రజా సంఘాల నేత గజ్జెల కాంతం కూడా ఓడిపోయారు. టిడిపి తరఫున నిలబడిన ఓయు జాక్ నేత మేడిపల్లి సత్యం, రాజారాం యాదవ్‌లు ఓడిపోయారు. టి జాక్ నేత కత్తి వెంకటస్వామి కాంగ్రెస్ తరఫున నిలబడి ఓడిపోయారు. దీని అర్థం ఏమిటంటే – ఓటర్లు పార్టీని చూసి వేశారు తప్ప, జాక్‌లో వీరి కృషిని చూసి వేయలేదు. జాక్‌పై మీడియాకున్నంత వలపు ప్రజలకు లేదు.

బిసి నామజపం ఓట్లు రాల్చదని తేలిపోయింది. బిసికి పిసిసి అధ్యక్షపదవి కట్టబెట్టినా కాంగ్రెసు ఘోరంగా ఓడిపోయింది. నెగ్గిన 21 మందిలో 12 మంది రెడ్లే. వారైనా వ్యక్తిగతబలంతో నెగ్గారు కానీ బిసిలే ఓట్లు వేశారని చెప్పడానికి లేదు. బిసి సిఎం నినాదం యిచ్చిన టిడిపికీ అదే జరిగింది. ఆంధ్రమూలాలున్న వారు టిడిపిని బలపరచడం వలననే ఎల్‌బి నగర్‌లో కృష్ణయ్య నెగ్గారు, కులం కార్డుతో కాదు. హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలు పక్కకు పెడితే టిడిపి 5 స్థానాలు నెగ్గింది. వారిలో అగ్రకులస్తులే ఎక్కువ. (ఎర్రబెల్లి, రేవంత్ రెడ్డి, మంచిరెడ్డి కిషన్ రెడ్డి). వ్యక్తిగతంగా పేరు తెచ్చుకున్న అభ్యర్థులు కాబట్టి గెలిచారు తప్ప కులం కారణంగా కాదు. ఖమ్మంలో టిక్కెట్ల పంపిణీలో కలహించుకున్న నామా, తుమ్మల ఓడిపోవడమే కాక, వారు టిక్కెట్టు యిప్పించినవారు కూడా ఓడిపోయారు. రేవూరి ప్రకాశరెడ్డి, దయాకరరెడ్డి దంపతులు, రావుల చంద్రశేఖరరెడ్డి, ఉమా మాధవరెడ్డి, టిటిడిపి అధ్యక్షుడు ఎల్ రమణ, మోత్కుపల్లి నర్సింహులు వంటి టిడిపి ప్రముఖులెందరో ఓడిపోయారు.

తెరాస గాలి బలంగా వీచిన జిల్లాల్లో కూడా ఆ పార్టీ ప్రముఖులు కొందరు ఓడిపోయారు. హరీశ్వర్‌రెడ్డి, వేణుగోపాలాచారి, మందా జగన్నాథం..యిలా. బిజెపి తరఫున అయితే మరీ ఘోరం. హైదరాబాదు, రంగారెడ్డి జిల్లాలలో పోటీ చేయని బిజెపి ప్రముఖులందరూ – విద్యాసాగర్‌రావు, బద్దం బాల్‌రెడ్డి, ఇంద్రసేనా రెడ్డి, నాగం.. అందరూ ఓడిపోయారు. ఏమిటి దీనర్థం? బిజెపి చేసిన ఉద్యమాన్ని ప్రజలు గుర్తించలేదా? నా ఉద్దేశం – ఇన్ని తక్కువ సీట్లలో పోటీ చేసిన బిజెపి అధికారంలోకి రాదని గ్రహించిన ఓటర్లు ప్రభుత్వం ఏర్పరచే పార్టీకే ఓటు వేద్దామని అనుకుంటారు. అధికారంలోకి కాంగ్రెసు వస్తుందా, తెరాస వస్తుందా అని వేచి చూశారు. పోలింగు రోజు దగ్గర పడుతున్నకొద్దీ కాంగ్రెసు నీరసించడం, నాయకులెవరూ తమ నియోజకవర్గాలు దాటి రాకపోవడం గమనించారు. తెరాసకే ఎక్కువ సీట్లు వస్తాయి. అదేదో ప్రభుత్వం ఏర్పరచేటన్ని సీట్లు యిస్తే ఋణమాఫీ వంటి పథకాలు అమలు చేస్తుంది, చంద్రబాబుతో కొట్లాడి తెలంగాణ ప్రయోజనాలు కాపాడుతుంది అని నమ్మారు. ఆ క్రమంలో బిజెపిని, కాంగ్రెసును పక్కన పడేశారు.

ఇక పార్లమెంటు ఫలితాలపై దృష్టి సారిద్దాం. మోదీ గెలవవచ్చు అనుకున్నా యీ స్థాయిలో గెలుస్తాడని చాలామంది పరిశీలకులు అనుకోలేదు. వారంత సమాచారం లేకపోయినా నేనూ అనుకోలేదు. మోదీ గెలవడం నాకు హర్షదాయకం కాదని ఎప్పుడో చెప్పాను. అయినా అతను గెలుస్తాడని నాకు తోచడానికి కారణం ఏమిటంటే – నేను మోదీని విమర్శిస్తూ వ్యాసాలు రాసినపుడల్లా, 'ఓకే మీరు నిజమే చెప్తూ వుండవచ్చు, కానీ మోదీకి కాకుండా ఎవరికి ఓటేయమంటారు చెప్పండి' అని ప్రశ్న సంధిస్తూ జాబులు రాసేవారు. దానికి నా వద్ద సమాధానం లేదు. 'ప్రత్యామ్నాయం చూపడం నా పని కాదు. మోదీ ఏదో చేసేస్తాడని ఊహించుకుని ఆశాభంగం చెందకండి. కళ్లు తెరుచుకుని ఓటేయండి.' అని జవాబిచ్చేవాణ్ని. అప్పుడే నా కర్థమైంది – మోదీ తప్ప నాయకుడెవరూ లేని పరిస్థితి దాపురించిందని. అతని వలన బిజెపికి సీట్లు పెరుగుతాయని, అయితే ఎన్‌డిఏ కూటమికి నాయకత్వం వహించడానికి అతని యిమేజి అడ్డుపడుతుందని అనుకుంటూ వుండేవాణ్ని. సొంతంగా ప్రభుత్వం ఏర్పాటు చేసే స్థాయిలో బిజెపి సీట్లు తెచ్చుకుంటుందని కొందరు నాతో వాదించినా, వాళ్లు అతిగా కలలు ంటున్నారని అనుకున్నాను. పత్రికలన్నీ కూడా బిజెపి గెలుస్తుందంటూనే మ్యాజిక్ ఫిగర్ చేరలేదని అంచనా వేశారు. ఎన్‌డిఏకు 249 సీట్లు వస్తాయని టైమ్స్ నౌ, 270-282 అని సిఎన్ఎన్, 261-283 అని ఇండియా టుడే, 272-283 అని ఆజ్ తక్, 281 అని ఎబిపి అన్నాయి. కానీ యిన్ని సీట్లు బిజెపికే వచ్చాయి (282). ఎన్‌డిఏకు వచ్చినవి 340.

'తూర్పు తిరిగి దణ్ణం పెట్టమన్న మోదీ' అనే వ్యాసంలో నేను రాసినది యిది – 'కామన్‌సెన్స్ ఉపయోగించి చూస్తే మార్చి మూడోవారంలో వీక్-సిఎన్ఎన్-ఐబిఎన్ కొంతవరకు వాస్తవంగా తోచింది. దాని ప్రకారం యుపిఏకు 111-123 (కాంగ్రెసుకు 94-106), ఎన్‌డిఏకు 234-246 (బిజెపికి 206-218) వచ్చేట్లు వున్నాయి. (దీనిలో టిడిపికి విడిగా 13-19 చూపారు. దాన్ని ఎన్‌డిఏకు కలపాలి).” అంటే 265! ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ మోదీ బలం పుంజుకోవడంతో సిఎన్ఎన్ 282 దాకా పెంచింది. టైమ్స్ గ్రూపు, ఇండియా టుడే గ్రూపు పూర్తిగా మోదీ ఏజంట్లుగా పనిచేశాయి. విపరీతంగా హైప్ చేశాయి. వాటి అంచనాలను నమ్మలేం అనిపించింది. అయితే వాస్తవఫలితాలు వాటి అంచనాలను కూడా దాటిపోయాయి. ఎందుకిలా జరిగింది? అన్నదే లోతుగా పరిశీలించాలి.

ఎన్నికలలో ప్రభుత్వ వ్యతిరేకత ఓటు కారణంగా ప్రతిపక్షాలు అధికారంలోకి వస్తూ వుంటాయి. ఈ సారి ఆ ఓటుకి తోడుగా మోదీ పట్ల పాజిటివ్ ఓటు కూడా పడింది. నిజం చెప్పాలంటే కాంగ్రెసు యీ విజయాన్ని మోదీకి బంగరు పళ్లెరంలో అందించింది. అలా అని మోదీ కాళ్లు చాచుకుని కూర్చోలేదు. విపరీతంగా కష్టపడ్డాడు. అతని వెనుక అనేక రకాల శక్తులు మోహరించాయి. గత ఏడాదిగా అతన్ని పాజిటివ్‌గా ప్రొజెక్ట్ చేస్తూ వచ్చి మానవాతీతుడు, దైవాంశ సంభూతుడి లెవెలుకి తీసుకెళ్లారు. మోదీ విజయం తమ

సొంత విజయంగా కోట్లాది ప్రజలు ఫీలయ్యేట్లా చేశారు. మోదీకి వ్యతిరేకంగా ఎవరైనా చిన్న మాట అన్నా విరుచుకు పడేట్లు చేశారు. ఎప్పుడో 1984లో రాజీవ్ గాంధీకి యిలాటి విజయం సిద్ధించింది. మళ్లీ యిన్నాళ్లకు మోదీకి! రాజీవ్ తన గుడ్‌విల్‌ను ఐదేళ్లలో ఖర్చు పెట్టేసుకున్నాడు. మోదీ ఏం చేస్తాడో వేచి చూడాలి. గత 30 ఏళ్లగా భారతీయ ఓటరు ఒకే పార్టీకి సొంతంగా విజయం కట్టబెట్టడం లేదు. సంకీర్ణ ప్రభుత్వాలు తప్పని పరిస్థితి తెచ్చాడు. ఈ సారి అలాటి అవసరం లేకుండా బిజెపికి సొంతంగా బలం చేకూర్చాడు. ఇది బిజెపి, మోదీలకు గొప్ప విజయం. 'ఈ విజయం తర్వాతైనా నీకు మోదీపై అభిప్రాయం మారాలే' అని కొందరు అడిగారు. మారలేదు. ఇప్పటివరకు మోదీ ఎలా ప్రవర్తించాడో చూసినవాణ్ని కాబట్టి, యీ ఎన్నికలలో కార్పోరేట్ శక్తులు ఎలా పనిచేశాయో గమనించాను కాబట్టి, లిబరలైజేషన్ పేర కార్పోరేట్‌లకు దేశసంపద, ప్రభుత్వ సంస్థలు అప్పగించబడతాయనే భయం నాకుంది. మోదీ విజయం వెనుక ఆర్ఎస్ఎస్ పాత్ర గణనీయంగా వుంది కాబట్టి, జనతా పార్టీ ప్రభుత్వం నడిచినపుడు వాళ్లు ఎలా ప్రవర్తించారో చూశాను కాబట్టి హిందూత్వ భావాలు మళ్లీ తలెత్తుతాయన్న భయమూ వుంది. దానికి తగ్గట్టే ఊరికి ముందు ఆర్టికల్ 370 గురించి రగడ మొదలైంది.

ఊరంతటిది ఒక దారి, ఉలిపికట్టెది ఒక దారి అనే సామెతలా నేను మెజారిటీ ఆఫ్ ఇండియన్స్ ఆలోచనాధోరణికి వ్యతిరేకంగా మాట్లాడుతున్నానని, దాని వలన తిట్లు పడాల్సివస్తుందని నాకు తెలుసు. లోకసత్తా జయప్రకాశ్ నారాయణ గారి గురించి తెలుగు జనం వూగిపోయినప్పుడు, అన్నా హజారే  అవినీతి వ్యతిరేక ఉద్యమం గురించి యావద్భారతం వూగిపోయినపుడు, అరవింద్ కేజ్రీవాల్ గురించి యువత అంతా క్రేజీ అయినపుడు నేను ప్రజాబాహుళ్యంతో గొంతు కలపలేదు. నా అభిమానులు కూడా నన్ను తిట్టిపోశారు. అనుభవం జాగ్రత్తలు నేర్పుతుంది. ఉద్రేకపడనీయదు. మోదీ అద్భుతాలు సాధిస్తాడని నేనేమీ అనుకోవడం లేదు. దేశాన్ని నాశనం చేస్తాడనీ అనటం లేదు. ప్రస్తుతానికి ఫింగర్స్ క్రాస్‌డ్ అంటూనే ప్రజలు పెట్టుకున్న ఆశల లెవెల్లో అతని పాలన వుండదని మాత్రం వూహించి చెప్తున్నాను. అవినీతిరహిత పాలన ఏ లెవెల్లో వుంటుందో ఎడ్యూరప్పను పార్టీలోకి ఆహ్వానించినపుడే తెలిసింది కదా. ఆంధ్ర ఎన్నికలలో ప్రవహించిన డబ్బు ఎవరిది? సగం వైకాపాది అనుకున్నా మిగతా సగమైనా బిజెపి-టిడిపి కూటమిని సమర్థించిన కార్పోరేట్ శక్తులది కావాలిగా! ఆ కూటమి అధికారంలోకి వచ్చాక వాళ్లు ఆ డబ్బు రాబట్టుకోరా? లాభాల్లో నడుస్తున్న పబ్లిక్ సెక్టార్ యూనిట్ వైజాగ్ పోర్టును తమకు అప్పగించమని అదాని గ్రూపు అడిగితే.., కెజి బేసిన్‌ను యిష్టం వచ్చినట్లు వాడుకునే అధికారం మాకివ్వమని రిలయన్సు అడిగితే.. మోదీ కాదనగలరా? గుజరాత్‌ను ఏలుతున్నది పెట్టుబడిదారీ వ్యవస్థ కాదా? అక్కడ కార్మిక చట్టాలు అమలవుతున్నాయా? పర్యావరణ చట్టాలు పాటించబడుతున్నాయా? ఫైనాన్షియల్ బయాన్సీ పేర దేశంలోని పెట్టుబడిదారులు విచ్చలవిడిగా ప్రవర్తించడానికి అనుమతిస్తారనే నా ఊహ. మోదీ ఎన్నికల ఖర్చు సాదాసీదాగా జరగలేదు. అతనిపై అంత పెట్టుబడి పెట్టినవారు రిటర్న్ ఆశించరా? అవినీతి అంటే సొంతానికి డబ్బు తీసుకోవడం ఒకటే కాదు. జాతి సంపదను దోచిపెట్టడం కూడా. మోదీ పాలన మొదలుపెట్టగానే ఆహాఓహోలు తెగ వినబడుతున్నాయి. 1977లో జనతా పార్టీ అధికారంలోకి వచ్చినపుడు యిలాటివి యింకా విన్నాం. అతి త్వరలోనే లొసుగులు బయటపడ్డాయి. సింప్లిసిటీ అంతా గాలికి ఎగిరిపోయింది. మోదీ కథ ఎలా సాగుతుందో తెలిసేవరకూ మరీ ఎక్కువ ఆశలు పెట్టుకోవద్దని హితవు చెప్తున్నాను. నిజంగా బాగా పాలిస్తే అంతకంటె ఏం కావాలి?

మోదీ ఓడించినది కాంగ్రెసును, దాని మిత్రపక్షాలను మాత్రమే. కేరళ వంటి రాష్ట్రాలలో అదీ చేయలేకపోయాడు. తమిళనాడులో, ఒడిశాలో, బెంగాల్‌లో తెలంగాణలో, పంజాబ్‌లో - అంటే ప్రాంతీయపార్టీలు బలంగా వున్న కొన్ని చోట్ల మోదీ మంత్రం పని చేయలేదు. యుపి, బిహార్‌లలో పని చేసింది. అక్కడ ప్రాంతీయపార్టీలు కూడా మట్టి కరిచాయి. ఇది ఎవరూ ఊహించని పరిణామం. పరిశీలకుల అంచనాలు తప్పు కావడానికి కారణం యుపి, బిహార్‌లలో అనూహ్య ఫలితాలే. కాంగ్రెసు పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలిస్తే బిజెపి విజయానికి ప్రధాన కారణం ఏమిటో అర్థమవుతుంది. **(సశేషం) - ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 03-04 వీక్లీకై** **ఎమ్బీయస్ : అవశేష ఆంధ్రప్రదేశ్ అవతరించిందా?**

జూన్ 2 న తెలుగుజాతి రెండుగా విడింది. రెండు రాష్ట్రాలు ఏర్పడ్డాయి. రిజర్వ్ బ్యాంక్‌లో రెండు ఖాతాలు తెరిచారు. ఇరు రాష్ట్రాలకు చెరో చీఫ్ సెక్రటరీ, చెరో డిజిపి నియమించబడ్డారు. ఉద్యోగులను కూడా విడగొట్టారు. అన్ని డిపార్టుమెంట్లు రెండురెండుగా విడిపోయాయి. అయితే జూన్ 2 న తెలంగాణలో మాత్రమే హడావుడి కనబడింది. కొత్త చిహ్నం ఆవిష్కరించబడింది. 'సంబురాలు' జరిగాయి. ధూంధాంలు జరిగాయి. గీతాలు ఆలపించారు, నృత్యాలు నర్తించారు. పాలకులు హామీలు కురిపించారు. ప్రజల్ని ఆశల డోలికలలో ఓలలాడించారు. పోలవరం విషయంలో పొరుగు రాష్ట్రంతో పోరాడి తీరతామని నినదించి ఉత్తేజపరిచారు.

అదే రోజు అవశేష ఆంధ్రప్రదేశ్ అవతరించినా అక్కడ యిలాటిది ఏదీ, ఛాయామాత్రంగా కూడా జరగలేదు. రాష్ట్రవిభజన వలన ఆంధ్ర ప్రాంతం యిప్పటికైనా బాగుపడుతుందని, కెసియార్ తన ఉద్యమం ద్వారా అనుకోకుండా ఆ ప్రాంతానికి మేలు చేశాడని అనేవాళ్లు చాలామంది వాదిస్తున్నారు. వాళ్లయినా ఆ రోజుని సెలబ్రేట్ చేసి వుండాల్సింది. ఏమీ చేయకుండా నిరాసక్తంగా దాటబెట్టేయడం ఆశ్చర్యకరంగా వుంది. పవన్ కళ్యాణ్ జనసేన పెట్టినపుడు మీ పార్టీ విధానాలేమిటి? మానిఫెస్టో ఏమిటి? అని పాత్రికేయులు

అడిగితే ఓ రోజంతా దీర్ఘంగా ఆలోచించి మర్నాడు పత్రికా ప్రకటన వెలువరించారు. తెలంగాణ, అవశేష ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవ దినోత్సవాలను మాత్రం సెలవుదినాలుగా ప్రకటిస్తే చాలని, నాయకుల జయంతి, వర్ధంతి రోజుల్లో సెలవులు అక్కరలేదని, అదే తమ విధానమని చెప్పారు. అంతకంటె పెద్దదేమీ తట్టకపోయితే తట్టకపోయింది కానీ కనీసం దాన్ని ఆ పార్టీ అయినా అమలు చేసిందాని నాకు అనుమానం. జూన్ 2న జనసేన కార్యాలయంలో అవతరణ దినోత్సవాలు ఏమైనా జరిపారా? జరిపినట్లు పేపర్లో చదవలేదు. తెలంగాణలో తను చెడతిట్టిన కెసియార్ అధికారంలోకి వచ్చినందుకు తెలంగాణ అవతరణోత్సవాన్ని జరపకపోయినా, తన మాట విని టిడిపి-బిజెపిని గెలిపించిన అవశేష ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవమైనా జరపాలి కదా! ఆయనా పట్టించుకోలేదా?

ఈ ముక్క ఎవరితోనో అంటే - అబ్బే, యింకా ఎక్కడ అవతరించింది? జూన్ 8 న కదా! అన్నాడాయన. జూన్ 8 ఒక ప్రభుత్వం ఏర్పడే రోజు. ఆవిర్భావం కాదు. రాష్ట్రచరిత్రలో అలాటి అనేక ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. జూన్ 8 అనేది ఒక పార్టీ - టిడిపి - వ్యవహారం. ఆ పార్టీ ఆ రోజు అధికారం చేపడదామనుకుంటోంది. అప్పటికే రాష్ట్రం పుట్టి ఆరు రోజులు అవుతుంది. జూన్ 2 అనేది తెలుగువారి చరిత్రలో ఒక ముఖ్యమైన రోజు. ఒక ప్రధాన ఘట్టం. ఇప్పటికే కొత్త రాష్ట్రం పని చేయడం మొదలై పోయింది. బ్యాంకు అధికారులు మే 31న పాస్ చేయాల్సిన ఎంట్రీని జాప్యం చేయడం వలన ఉమ్మడి రాష్ట్రానికి చెందిన ఖర్చు ఒకటి ఆంధ్రప్రదేశ్ ఖాతాకు ఖర్చు రాసేశారని పేపర్లో వచ్చింది కూడా. ఆంధ్రకు ఎలాట్ చేయబడిన ఉద్యోగులందరూ కొత్త రాష్ట్ర ఉద్యోగులు అయిపోయారు. కొన్ని కంపెనీలు ఆంధ్రలో రిజిస్ట్రేషన్ కూడా చేయించేసుకుంటున్నాయి. కొత్త రాష్ట్రం అన్ని విధాలా అమల్లోకి వచ్చేసింది. అయినా పత్రికలు కూడా స్పెషల్ యిస్యూలు అవీ వేయలేదు. ఎవరూ యాడ్స్ యివ్వలేదు. అందరూ జూన్ 8 గురించి ఆగారేమో! అవేళ చంద్రబాబు ప్రమాణస్వీకారం తర్వాతనే ఆంధ్రచరిత్ర ఆరంభమైందంటారేమో! శాలివాహన శకంలా బాబుశకం ఆవిష్కృతమైంది అంటారేమో!

ఇప్పుడు ఆంధ్రరాష్ట్రంలో బాబు మాటే ఫైనల్. ఆయన 'వీరీవీరీ గుమ్మడిపండు, యిదిగో రాజధాని' అని రచ్చబండ చూపించినా అదే రాజధాని అయిపోతుంది. విద్యారణ్యస్వామి హరిహర బుక్కరాయలకు విజయనగర సామ్రాజ్యం ఎక్కడ స్థాపించాలో చూపించారట. అక్కడ కుందేలు కుక్కను తరుముతోంది కాబట్టి పౌరుషవంతుల భూమి యిదే అని తీర్మానించారట ఆయన. కుందేలు సరే, కుక్క కూడా అక్కడిదే కదా, కుందేలుని చూసి పారిపోతోందంటే దానికేం పౌరుషం వున్నట్లు!? బాబు ఆంధ్రలో కూడా అలాటి టెస్టు ఏదో చేసి విజయవాడ-గుంటూరులను సెలక్టు చేసినట్లు అనిపిస్తోంది. కేంద్రం తను వేసిన శివరామకృష్ణన్ కమిటీ సిఫార్సు కాగితాలు మడిచి అటకమీద పెట్టుకోవాలి. కమిటీని రద్దు చేయించేస్తే ఆ నిధులు మిగిలి, బోర్డుల పెయింట్‌కైనా పనికివస్తాయి. సిపిఐ లీడర్లు తనను కలిసినప్పుడు బాబు రాజధాని గుంటూరే అన్నారని పేపర్లో వచ్చింది. బాబు అనుకూల మీడియా విజయవాడ-గుంటూరు బెల్టే బెస్టు అని వూదరగొట్టేస్తోంది. మరి పాపం రాయలసీమ అంటే, కావాలంటే హైకోర్టు అక్కడ యివ్వవచ్చు అంటున్నారు. మళ్లీ అక్కడ పూర్తి హైకోర్టు అక్కరలేదట. బెంచి అంటూ ఏర్పాటు చేసి, దాన్ని రాజధాని ప్రాంతంలో పెట్టాలట. బెంచి ఐడియా మంచిదే కానీ మళ్లీ దాన్ని కూడా రాజధాని ప్రాంతంలో దేనికి? ఏ ఉత్తరాంధ్రలోనో పెట్టవచ్చుకదా!

రాజధాని గురించి బాబు ఆలోచన అయోమయంగా వుంది. 'ప్రపంచస్థాయి రాజధాని కడతాం' అనే దంపుళ్ల పాట బాబు వదలలేదు. ఆ పాట పాడుతూనే వికేంద్రీకరణ చేస్తాం, అన్ని జిల్లాలలో తలో ఆఫీసూ, పరిశ్రమల హబ్ పెడతాం అంటున్నారు. రెండూ ఎలా పొసుగుతాయి? అన్నిటినీ కాస్త కాస్త పంచితే ఒకే చోట ప్రపంచస్థాయి రాజధాని ఎలా ఏర్పడుతుంది? బాబుగారిని హైదరాబాదు సిండ్రోమ్ వదలిపెట్టడం లేదు. విజిఎంటిలో రాజధాని పెట్టించి, దాన్ని నేనే డెవలప్ చేశాను అని చెప్పుకుంటారేమో - హైదరాబాదును నేనే కనిపెట్టానని చెప్పుకుంటున్నట్లే! ఎవరైనా కొత్తవాళ్లు వింటే అంతకుముందు హైదరాబాదులో ఏమీ లేకుండా ఒట్టి శ్మశానం వుందేమో, యీయనే వెళ్లి చిన్నమయ్య మాయాబజార్ కట్టినట్లు కట్టాడేమో అనుకోగలరు. విజయవాడ, గుంటూరు, తెనాలి, మంగళగిరి ఎప్పణ్నుంచో వున్నవే. ఈయన అక్కడ రాజధాని పెట్టేసి దానిపై తన స్టాంప్ కొట్టేద్దామనుకుంటున్నట్లు వుంది.

వాస్తవాలు మాట్లాడుకోవాలంటే గుంటూరు కాస్త విశాలంగానే వుంటుంది కానీ తక్కినవన్నీ యిరుకు ప్రాంతాలే. మంగళగిరి, తెనాలి పట్టణం అయితే సందులే. విజయవాడలో కూడా పాత బస్తీలో పార్కింగ్ కూడా కష్టం. శివారు ప్రాంతాల్లోనే కాస్త తిరగగలం. ఈ వూళ్లలో రాజధాని పెడితే కొత్తరకంగా ప్లాన్ చేయడం కష్టం. క్లీన్ స్లేట్‌లా వుంటేనే ఆధునిక తరహాలో రాజధాని కట్టవచ్చు. బ్రిటిషువాళ్లు పాత ఢిల్లీని అలాగే వదిలేసి, కొత్త ఢిల్లీ కట్టారు. చండీగఢ్ కొత్త తరహాలో సెక్టార్లగా కట్టారు. ఇప్పటికే జనసాంద్రత వున్న ప్రాంతాలైతే సివిక్ ఎమినిటీస్ సరిపోవు. మురుగునీరు సమస్య, అనేక చోట్ల ఓపెన్ డ్రయినేజీ. ఇరుకువీధులను విశాలం చేయాలంటే స్థానికులు అడ్డుకుంటారు. ప్రతీవాడూ మా ప్రాంతం డెవలప్ కావాలి, మా స్థలాలకు రేట్లు రావాలి, మా యిల్లు మాత్రం ముట్టుకోవద్దు, కావాలంటే పక్కవాడిల్లు లేక ఎదుటివాడిల్లు కొట్టేసి రోడ్డు వెడల్పు చేయండి అంటాడు. కోర్టు కెళతానని బెదిరిస్తాడు. వాళ్లందరికీ నష్టపరిహారాలివ్వడం మొదలుపెడితే, తడిసి మోపెడు అవుతుంది. అంత డబ్బు కొత్త రాష్ట్రం దగ్గర వుందా?

విభజన అంతా గందరగోళం చేసేశారు. ఏ ఉద్యోగి ఎక్కడివాడో నికరంగా తేలడానికి ఐదారు నెలలు పడుతుందట. ఫైళ్ల మార్పిడి ఎప్పటికవుతుందో తెలియదు. రికార్డు టైములో విభజన చేసేశాం అని గవర్నరు సలహాదారు జబ్బలు చరుచుకుంటున్నారు. ఏదీ తేల్చలేదు. అన్నీ పెండింగే. కమలనాథన్ కమిటీ ఉద్యోగుల పంపకాల మార్గదర్శక సూత్రాలు కూడా యివ్వలేదు. అప్పుడేం ఏం జరిగింది? గవర్నరుగారు కొన్ని వివాదాస్పద విషయాలపై నిర్ణయాలు వాయిదా వేసి యిద్దరు ముఖ్యమంత్రులు కూర్చుని మాట్లాడుకోవాలి

అనేశారు. ఇద్దరూ కలిసి కూర్చునే ఘట్టం కంటికేమైనా ఆనుతోందా? కెసియార్ కత్తులు నూరుతున్నారు. తన ప్రమాణస్వీకారానికి బాబును పిలవలేదేం అంటే కమ్యూనికేషన్ గ్యాప్ అన్నారు. బాబు ప్రమాణస్వీకారానికి రానంటున్నారు. ఇప్పణ్నుంచే యీ రగడ ఏమిటంటే పోలవరం మండలాల బదిలీ విషయం ఎత్తుతున్నారు. అది ఒప్పందంలో భాగమే కదా అంటే వినటం లేదు. 'అన్నదమ్ముల్లా విడిపోయి కలిసి వుందాం' అనే స్లోగన్ ఎంత బోగస్సో తెలుస్తోందా?

ఆంధ్ర, తెలంగాణ కలిసి పనిచేస్తే రెండూ బాగుపడతాయి. లేకపోతే యిక్కట్లే. తెలంగాణలో అయితే వున్నది కాపాడుకుంటే చాలు. సన్నాసాడి పెళ్లికి జుట్టు దగ్గర్నుంచి అరువే అన్నట్టు ఆంధ్రకు అడుక్కోవడానికి చిప్ప కూడా యింకోళ్లు యివ్వాలి. ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు భారీగా నిధులు కావాలి. రెవెన్యూలో పదివేల కోట్ల లోటు అని బాబు స్వయంగా చెప్పారు. విద్యుత్ మిగులు వుంటుందేమో, పరిశ్రమలు తీసుకుని రావచ్చు అనుకుంటే తక్కినవన్నీ జనాభా ప్రాతిపదికన విభజించి, విద్యుదుత్పత్తిని మాత్రం వినియోగం ప్రాతిపదికన పంచి, ఆంధ్రకు అన్యాయం చేశారు. ఒక్కోదానికి ఒక్కో కొలబద్ద. ఉద్యోగుల విభజనలో ఉద్యమనాయకుడు విఠల్‌గారిని తెలంగాణకు ఎలాట్ చేయడానికి రూల్సును వంచారు. విధానం యిదీ అని స్పష్టంగా విభజన బిల్లులో కాంగ్రెసు ఏమీ పొందుపర్చలేదు. వాటి గురించి యిప్పుడు సోనియాకు హఠాత్తుగా గుర్తుకు వచ్చి కేంద్రానికి ఓ లేఖ సంధించింది. 'జులై 30 న నిర్ణయం తీసుకుని ఆర్నెల్లపాటు ఏం చేశావ్? బిల్లు సమగ్రంగా చెయ్యవద్దని ఎవడు చెప్పాడు? సిగ్గులేదా యిప్పుడు అడగడానికి?' అని మోదీ జవాబు రాయలేదు. "మీరూ మేమూ కుమ్మక్కయ్యే కదా యీ బిల్లు పాస్ చేసినది" అని సోనియా చురక వేస్తుందని భయం.

ఈ భారం చాలనట్లు బాబు అలవికాని హామీల భారం నెత్తి కెక్కించుకున్నారు. కెసియార్ లక్షలోపు ఋణాలకు కాలపరిమితి పెడితేనే యివాళ తెలంగాణ అంతా నిరసనలు జరుగుతున్నాయి. ఆ హామీ నమ్మి ఓట్లేశాం, తెరాస దగా చేసింది అని రైతులు ఆక్రోశిస్తున్నారు. బాబు ఏం చేస్తాడో 8 వ తారీకున తెలుస్తుంది. ఏ మాత్రం తేడా వచ్చినా 'ఇది అమలు కానీ హామీ అని ముందే చెప్పాం' అంటూ వైకాపా ప్రదర్శనలు మొదలుపెట్టి రైతులను కూడవేస్తుంది. ఇక్కడ ప్రతిపక్షాలు రెండుగా చీలివున్నాయి. అక్కడ బలమైన ప్రతిపక్షం ఒక్కటే! బాబు ఏ మాత్రం మాట తప్పినా రైతులను ఆకట్టుకోవడానికి బిజెపి 'మేం నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరిస్తాం' అంటూ వాళ్లూ విడిగా ప్రదర్శనలు నిర్వహించినా ఆశ్చర్యపోను. 8వ తారీకు బాబు ప్రమాణస్వీకార ఉపన్యాసం తర్వాత ఏం జరుగుతుందో వేచి చూడాలి. ఆ రోజుకి సంతకం పెట్టేసి, జాతీయ నాయకులందర్నీ పంపించేశాక మర్నాడు వివరాలు, షరతులు వెల్లడిస్తారేమో!

ఆవతరణోత్సవం నాడు చేయాల్సిన హంగామా అంతే 8 వ తారీకునే చేస్తారనుకుంటా. ప్రభుత్వ సంస్థల ప్రకటనలు, పార్టీ అభిమానుల శుభాకాంక్షలు, పత్రికల సప్లిమెంట్లు.. అన్నీ అవాళే. ఈ ఏడాది అలా గడిచిపోతుందనుకోండి. మరి వచ్చే ఏడాది నుంచి రాష్ట్ర అవతరణోత్సవం అని దేన్ని జరుపుకుంటారు? మద్రాసు నుండి యిప్పుడున్న ప్రాంతం విడిపోయి ఆంధ్రరాష్ట్రంగా ఏర్పడిన అక్టోబరు 1, 1953 తేదీని అందరూ మర్చిపోయారు. అయినా అప్పటి ఆంధ్రరాష్ట్రంలోనుంచి భద్రాచలం రాములోరు వెళ్లిపోయారు. అందువలన ఆ తేదీ యిప్పటి రాష్ట్రానికి వర్తించదు. ఇక ఆంధ్రప్రదేశ్ ఏర్పడిన నవంబరు 1, 1956 అయితే ఆ రాష్ట్రమే మరణించింది. అవశేషం మిగిలింది. గుండెకాయ లాటి రాజధాని పోయి, అస్తికలు మిగిలాయి – చెవుల్లో సాగరఘోషతో సహా! బాబుగారి పట్టాభిషేకం చేసుకుంటున్న జూన్ 8 యీ రాష్ట్ర ఆవిష్కరణ దినోత్సవం కాబట్టి సెలవు యివ్వాలి అని ఆనాటి వేదికపై పవన్ కళ్యాణ్ డిమాండ్ చేస్తే అది ఒప్పదు. ఎందుకంటే జూన్ 8 అనేది బాబు జాతకం ప్రకారం ఫిక్స్ చేసిన ముహూర్తం. దానికీ రాష్ట్రావతరణకూ సంబంధం లేదు.

ఈ సందర్భంగా ఆంధ్రరాష్ట్రం ఏర్పడిన నాటి ఉదంతం గుర్తుకు వస్తోంది. 1953 అక్టోబరు 1 న ఆంధ్రరాష్ట్ర అవతరణ ముహూర్తం పెట్టారు. ఆ రోజుకి ఒక వారం ముందు నుంచి, అక్టోబరు 1న గాక, ఒక రోజు ముందుకాని, ఒక రోజు తర్వాత కానీ ఉత్సవం జరపమని జ్యోతిష్కులూ, జ్యోతిషం తెలిసిన పెద్దలూ ముఖ్యమంత్రి ప్రకాశం గారికి ఉత్తరాల పైన ఉత్తరాలు రాయడం మొదలెట్టారు. లెక్కల సౌకర్యం కోసం 1 వ తేదీ పెట్టాం, అది మార్చితే లెక్కల యిబ్బందులు వస్తాయని ఉద్యోగులు అన్నారు. ప్రకాశం గారు రెండూ విని "జ్యోతిష్కులు చెప్పిన అభ్యంతరాల ననుసరించి, రాజ్యాలు నడిపే కాలం కాదిది. అయినా జ్యోతిష్కులు చెప్పినదానిలో నాకు వ్యక్తిగతంగా నష్టం వస్తుందన్నారు తప్ప ఆంధ్రదేశ జాతకానికి నష్టం వస్తుందని లేదు కదా. ముహూర్తం మార్చకండి." అని చెప్పారు. ఇది చెప్పాక ఆ ముహూర్త ప్రభావం ఎలా వుందో కూడా చెప్పి తీరాలి. 13 నెలల్లోపునే 1954 నవంబరు 6 న, ప్రకాశం గారి ప్రభుత్వం అవిశ్వాసతీర్మానానికి గురై పడిపోయింది. ఆంధ్రరాష్ట్రం 1956 కల్లా దాని ఉనికిని పోగొట్టుకుంది. పోనీలే తెలంగాణను కలుపుకుని ఆంధ్రప్రదేశ్‌గా విస్తరించింది కదా అని వూరడిల్లితే దానికి షష్టిపూర్తి కూడా కాకుండానే సగం పోగొట్టుకుని గోచీపాతరాయుడిలా మిగిలింది. తెలంగాణలో కలవకుండా వున్నా ఈ పాటికి ఎంతో కొంత డెవలప్ అయ్యేది. బాబు ప్రకాశంగారి టైపు కాదు. తన జాతకాన్ని అనుసరించి జూన్ 8 ముహూర్తం పెట్టించారు. దీని ఫలాఫలాలు భవిష్యత్తు మాత్రమే చెప్పగలదు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 06-08 వీక్లీకై ఎమ్బీయస్ : జాతీయ భద్రతా సలహాదారుగా ఒక ఉద్దండుడు**

మోదీ ప్రభుత్వం జాతీయ భద్రతా సలహాదారుగా ఎంపిక చేసుకున్న అజిత్ దోవల్ గతంలో ఇంటెలిజెన్సు బ్యూరో (ఐబి)కు

చీఫ్‌గా పనిచేసినవాడు. పాకిస్తాన్, లండన్‌లలో కూడా పనిచేశాడు. సలహాదారు పదవిలో గతంలో ఇండియన్ ఫారిన్ సర్వీసుకు చెందిన రాయబారులూ పనిచేశారు, ఐపియస్‌కు చెందిన పోలీసు అధికారులూ చేశారు. దేశభద్రత విషయంలో పోలీసు పద్ధతులు పనికిరావని, యితర దేశాలతో వ్యవహరించేటప్పుడు లౌక్యం వుపయోగించి, మెళకువతో పనులు చక్కబెట్టాలని మొదటి సలహాదారు బ్రజేష్ మిశ్రా అభిప్రాయపడేవారు. ఆయన తన పదవీకాలంలో ఐబితో పేచీ పడ్డాడు. అయితే అప్పటి హెూం మినిస్టర్ ఆడ్వాణీ ఐబిని వెనకేసుకుని వచ్చాడు. బ్రజేష్ తర్వాత ముగ్గురిలో యిద్దరు డిప్లొమాట్లే, ఎం కె నారాయణన్ ఒక్కరే ఐబికి చెందినవాడు. అతనే దోవల్‌ను 2004లో ఐబికి చీఫ్ చేశాడు. గుజరాత్ ముఖ్యమంత్రిగా వున్నప్పటినుంచీ మోదీతో దోవల్ సన్నిహితంగా మెలిగాడు. పాకిస్తాన్‌పై, టెర్రరిజంపై యిద్దరివీ ఒకే అభిప్రాయాలు. ఇష్రాత్ జహాన్ ఎన్‌కౌంటర్ వివాదంలో అతను టెర్రరిస్టే అని మోదీతో పాటు దోవల్ అభిప్రాయం కూడా. దాన్ని బహిరంగంగా చెప్పడానికీ అతను వెఱవలేదు. పోలీసు వాడైన అతనికి మిలటరీ అవార్డు ఐన కీర్తి చక్ర కూడా యిచ్చారు. అది అరుదైన సన్మానం. అయితే తన కీర్తి పెంచుకోవడానికి అతనే కొన్ని కథలను సృష్టిస్తాడన్న అపప్రథా వుంది.

దోవల్ వయసు 69. కేరళ క్యాడర్‌కు చెందిన ఐపియస్. భారతీయ గూఢచారుల్లో అగ్రగణ్యుడు. సాహసి. అతన్ని మిజోరాంలో వేసినపుడు అక్కడ తీవ్రవాదులు చాలా బలంగా వున్నారు. ఐజ్వాల్ నుండి కచిన్ ద్వారా చైనా సరిహద్దుల్లోకి ఒంటరిగా నడుచుకుంటూ వెళ్లి వాళ్లకు స్నేహహస్తం చాచాడు. తరచుగా తన యింటికి భోజనానికి పిలిచి భార్య చేత పందిమాంసం వండించి పెట్టించేవాడు. మిజో లిబరేషన్ ఆర్మీ అధినేత లాల్‌డెంగాకు సన్నిహితంగా వుండే 7గురిలో 6 గుర్ని తనవైపు తిప్పుకోవడంతో, యిక గత్యంతరం లేక లాల్‌డెంగా ఆయుధాలు విడిచి భారత్‌తో శాంతి ఒప్పందానికి అంగీకరించవలసి వచ్చింది.

ఖలిస్తాన్ తీవ్రవాదుల ఉద్యమం బలంగా సాగుతున్నపుడు 1988లో ఐబివారు ఆపరేషన్ బ్లాక్ థండర్ అని ప్లాన్ చేశారు. స్వర్ణదేవాలయంపై హఠాత్తుగా దాడి చేసి, అక్కడ దాగున్న తీవ్రవాదులను నిర్వీర్యం చేయాలని పథకం వేశారు. అయితే వారు తమ వద్దనున్న బాంబులతో దేవాలయాన్ని పేల్చేస్తామని బెదిరిస్తే..? అని భయం వేసింది. అప్పుడు దోవల్ రంగంలోకి దిగాడు. తనను తాను పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐయస్ఐ ఏజంటుగా పరిచయం చేసుకుని స్వర్ణదేవాలయంలోని ఖలిస్తానీయులకు చేరువయ్యాడు. కొన్ని వారాలపాటు వాళ్లతోనే కలిసి నివసించాడు. తర్వాత 'నా దగ్గరున్న బాంబులను మనం దేవాలయం గోడల చుట్టూ గోతులు తీసి పాతిపెడదాం, భారతసైన్యం దాడి చేస్తే మనమే గుడిని పేల్చేసి, వాళ్లే అలా చేశారని ప్రచారం చేద్దాం' అని ప్రతిపాదించాడు. భేష్ అనుకున్నారు వాళ్లు. ఇతను తనతో తెచ్చిన ఉత్తుత్తి బాంబులను వాళ్లచేత పాతి పెట్టించి వచ్చేశాడు. ఆ తర్వాత భారతసైన్యం దాడి చేయబోయినప్పుడు ఖలిస్తాన్‌లు మా దగ్గరకు వస్తే మేం పాతిపెట్టిన బాంబులతో గుడి పేల్చేస్తాం జాగ్రత్త అని బెదిరించినప్పుడు సైన్యం పగలబడి నవ్వుకుంది! మోసపోయామని గ్రహించిన ఖలిస్తానీలు లొంగిపోయారు.

పంజాబ్‌లో ఖలిస్తాన్‌లను అణచివేసిన పోలీసు అధికారి జూలియో రిబెరో రుమేనియాలోని బుఖారెస్టులో రాయబారిగా వున్నపుడు ఖలిస్తానీలు ఆయనపై దాడి చేశారు. రుమేనియన్ పోలీసులు దాడి చేసినవారని ఖైదు చేశారు. వాళ్లను విడుదల చేయించుకోవడానికి ఖలిస్తానీలు ఇండియాలోని రుమేనియన్ రాయబారి లివియూ రాడూను కిడ్నాప్ చేశారు. దోవల్ అతని టీము రాడూని విడిపించడానికి బయలుదేరారు. వీరిని తప్పించుకోవడానికి  కిడ్నాపర్లు ప్రతి పది గంటలకు స్థావరం మార్చసాగారు. దోవల్ టీము ఒక్కొక్కరినీ అరెస్టు చేస్తూ వచ్చింది. చివరకు వాళ్లు అతన్ని వదిలేశారు. కొందరు యీ కథను కొట్టి పారేస్తారు. 'తాము కిడ్నాప్ చేసిన సంగతి అంతర్జాతీయ మీడియాలో వార్తగా రాలేదని గ్రహించిన ఖలిస్తానీలు యింకెందుకీ ప్రయాస అనుకుని రాడూను తామే వదిలేశారు' అంటారు. తాలిబన్లు ఇండియన్ ఎయిర్‌లైన్సు విమానాన్ని హైజాక్ చేసి కందహార్‌కు తీసుకెళ్లినపుడు వారితో బేరసారాలు ఆడడానికి పంపిన యిద్దరు అధికారులలో దోవల్ ఒకడు. భారత జైళ్లల్లో వున్న 36 మంది ఉగ్రవాదులను విడుదల చేయాలని, లేకపోతే 160 మంది ప్రయాణీకులను చంపేస్తామని హైజాకర్ల డిమాండ్. 110 గంటల పాటు చర్చలు సాగాయి. చివరకు 3గ్గురు ఉగ్రవాదులను విడుదల చేస్తే చాలని హైజాకర్లను ఒప్పించారు. మధ్యవర్తులు ఆ మేరకు విజయం సాధించినట్లే.

2005లో దావూద్ ఇబ్రహీంను మట్టుపెట్టడానికి భారత యింటెలిజెన్సు ఒక పథకం రచించింది. దావూద్ కూతురికి, పాకిస్తాన్ క్రికెటర్ జావేద్ మియాందాద్ కొడుక్కి పాకిస్తాన్‌లో పెళ్లయింది. పెళ్లి తాలూకు విందు దుబాయ్ ఎయిర్‌పోర్టు వద్దనున్న గ్రాండ్ హయాత్ హెూటల్‌లో జరిగింది. ఆ విందుకు దావూద్ వచ్చి తీరతాడు కాబట్టి అక్కడే అతన్ని షూటర్లచేత కాల్పించి చంపాలని ఐబి ప్లాన్. ఇది అఫీషియల్‌గా చేయలేరు కాబట్టి ఐబి చీఫ్‌గా పనిచేసిన రిటైరైన ఆయన్ని యీ ఆపరేషన్‌ను పర్యవేక్షించమన్నారు. అతను దావూద్ శత్రువైన ఛోటా రాజన్ అనుచరుడు విక్కీ మల్‌హెూత్రాను దువ్వాడు. అతను ఫరీద్ తనాషా అనే మరో షూటర్‌ను పరిచయం చేశాడు. ఇద్దర్నీ ఢిల్లీకి రప్పించి, వాళ్ల శక్తియుక్తులు పరీక్షించి, తర్ఫీదు యిప్పించి, యిక వాళ్లను దుబాయి విమానం ఎక్కించబోతూ వుండగా యింతలో ముంబయి క్రైమ్ బ్రాంచ్ నుండి డిసిపి ధనంజయ్ కమలాకర్ వచ్చి మీ అందర్నీ అరెస్టు చేస్తున్నానన్నాడు. వాళ్లు తనాషా ఫోన్ ట్యాప్ చేసినపుడు అతని ఆనుపానులు తెలిశాయి. ఇక్కడేదో నేరం జరుగుతోందని గ్రహించి వాళ్లు వీళ్లున్న చోటుకి వచ్చిపడ్డారు. ఐబి మాజీ అధినేత కమలాకర్‌పై మండిపడ్డాడు, చిందులు వేశాడు. ఇదంతా సీక్రెట్ ఆపరేషన్ కాబట్టి కమలాకర్‌కు ఓ పట్టాన బోధపడలేదు. బోధపడి, సరే అనేసరికి అక్కడ దుబాయి విమానం వెళ్లిపోయింది. మొత్తం ప్లాను నాశనమైంది. ఇది పొరబాటున జరిగింది కాదనీ, దావూద్‌కు తనపై దాడి విషయం తెలిసి, ముంబయి పోలీసు వ్యవస్థలో తన

మిత్రుల ద్వారా కమలాకర్‌కు ఉప్పందేట్లా చేశాడనీ అంటారు. ఆ విందుకు దావూద్ హాజరు కాకపోవడం చేత, యీ అనుమానం బలపడింది. ఆనాటి యీ సంఘటనలో అక్కడున్న ఐబి చీఫ్ దోవల్ అని "టైమ్స్ ఆఫ్ ఇండియా" రాసింది. అతన్ని అడిగితే 'అబ్బే నేను కాదు, ఆ వేళకి నేను యింట్లో వుండి ఫుట్‌బాల్ మ్యాచ్ చూస్తున్నా" అన్నాడు. గూఢచారులు చెప్పినవన్నీ నిజాలు కానక్కరలేదు.

ఈ కథను తక్కినవారు నమ్మినా నమ్మకపోయినా మోదీ నమ్మినట్టు కనబడుతోంది. దావూద్‌ను పట్టి భారత్‌కు తీసుకురావడమే నా లక్ష్యం అని మోదీ ప్రకటించాడు కాబట్టి ఆ పని చేయగల ఉద్దండుడు దోవల్ మాత్రమే అనుకుని అతనికి భద్రతా సలహాదారు పదవి యిచ్చినట్లు తోస్తోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : ఐటీ ఉద్యోగులు – కార్మిక చట్టాలు

ఐటీ పరిశ్రమలో ఉద్యోగులకు కార్మికచట్టాల నుండి రక్షణ లేదు. కర్ణాటకలో ఐటీ పరిశ్రమను ప్రోత్సహించడానికి 2000 సంఎరం నుండి కార్మిక చట్టం (ఇండస్ట్రియల్ ఎంప్లాయ్‌మెంట్ చట్టం, 1946 నుండి వారికి మినహాయింపు యిచ్చారు. దాన్ని ఐటీ కంపెనీ విచ్చలవిడిగా దుర్వినియోగం చేస్తున్నాయి. ఉద్యోగుల పనితీరును బేరీజు వేయడంలో వ్యక్తిగతమైన యిష్టాయిష్టాలు ప్రదర్శిస్తున్నారు. ఒకే క్యాడర్‌లో వున్నవారికి ఒకే జీతం యివ్వడం లేదు. ప్రమోషన్లు, ఇంక్రిమెంట్లూ వాళ్ల యిష్టమే. ఇవన్నీ కేవలం ప్రతిభ ఆధారంగానే నిర్ణయిస్తున్నారని చెప్పడానికి లేదు. తాము చెప్పిన మాట వినలేదనో, ఆడవాళ్లు తమకు లొంగలేదనో, యిలాటి వ్యక్తిగత కారణాలపై కూడా వివక్షత చూపుతున్నారు. గ్రేడింగ్‌లు తగ్గిస్తున్నారు. అంతేకాదు, చిన్న చిన్న సాకులు చెప్పి ఏ నోటీసు లేకుండా నిమిషాల్లో ఉద్యోగులను తొలగిస్తున్నారు. ఆఫీసుకి వచ్చాక తెలుస్తోంది – ఉద్యోగం వూడిందని. ఇదెక్కడి ఘోరమని అడగబోతే సర్వీసు సర్టిఫికెట్టు యివ్వం అనీ, యిచ్చినా వ్యతిరేక రిమార్కులు రాస్తామనీ బెదిరిస్తున్నారు. సాంకేతిక శాఖల్లో అవసరానికి మించి రిక్రూట్ చేసుకుని, మార్కెటింగ్ శాఖ వైఫల్యం వలన తగినంత బిజినెస్ రాకపోతే ఆ దండన సాంకేతిక శాఖలకు పడుతోంది. అంతా యాజమాన్యం యిష్టం. పనిచేసేవారికి హక్కులు వుండనే వుండవు.

ఐటీ పరిశ్రమ అంటేనే యింత, యిచ్చినంత కాలం విపరీతంగా జీతం యిస్తారు, తలచుకుంటే తీసిపారేస్తారు. నోరెత్తడానికి లేదు అనుకునే అందరూ భరిస్తున్నారు. పోనుపోను ప్రాజెక్టు మేనేజర్ల ఆగడాలు మితిమీరడంతో బెంగుళూరులోని ఐటీ వుద్యోగులు లేబర్ డిపార్టుమెంటుకి ఫిర్యాదులు చేయసాగారు. రోజుకి సగటున 15 ఫిర్యాదులు వస్తున్నాయి. సెక్సువల్ హెరాస్‌మెంట్ కేసులైతే ఏడాదికి 700 వస్తున్నాయి. ఈ ఫిర్యాదులు నిజమో కాదో తెలుసుకుందామని లేబరు డిపార్టుమెంటు ఆ యా కంపెనీలను సంప్రదించి సంబంధిత డాక్యుమెంట్లు పంపమంటే వాళ్లు పంపడం లేదు. మాకు మినహాయింపు వుంది అంటున్నారు. ఇలా ఒత్తిడి చేస్తే ఇక్కణ్నుంచి తరలి వెళ్లిపోతాం అని బెదిరించారు. ఒక లాబీగా ఏర్పడి ఐటీ మంత్రి ఎస్ కె పాటిల్‌ని కలిసి ఆ మినహాయింపు మరో ఐదేళ్లు పొడిగించాలని కోరారు. ఆ మంత్రిగారు "ఐటీ లేకుండా బెంగుళూరును ఊహించలేం. అది 9 లక్షల మంది ప్రత్యక్షంగా, 27 లక్షల మందికి పరోక్షంగా ఉద్యోగాలు కల్పించింది. ఈ ఏడాది రూ.1.69 లక్షల కోట్ల విలువైన ఐటీ ఎగుమతులు చేశాం. ఏటా రూ. 4 లక్షల కోట్లు పెరుగుతోంది. ఇలాటి పరిస్థితుల్లో వారిని యిబ్బంది పెట్టకూడదు." అని వాదించారు.

"కావాలంటే మీరు ఆ పరిశ్రమకు పన్ను రాయితీలు యిచ్చుకోండి, స్థలాలు యిచ్చుకోండి. కానీ ఉద్యోగులను హింసిస్తూంటే వూరుకోమంటే ఎలా?" అని కార్మిక మంత్రి వాదించారు. ఈ వ్యవహారం శ్రుతి మించడంతో కర్ణాటక కాబినెట్ జనవరి 25 న సమావేశమై రాజీ కుదిర్చింది. మినహాయింపును ఐదేళ్ల వరకు పొడిగిస్తూనే ఐటీ కంపెనీలకు నాలుగు షరతులు పెట్టింది. సెక్సువల్ హెరాస్‌మెంట్ ఫిర్యాదుల పరిశీలనకు ఒక కమిటీ, యితర విధాలైన కష్టాల గురించి చేసే ఫిర్యాదుల పరిశీలనకు మరో కమిటీ కంపెనీ ఉద్యోగులతోనే వేయాలి, ఏ ఉద్యోగిమీదైనా డిసిప్లినరీ యాక్షన్ (క్రమశిక్షణ చర్య) తీసుకుంటే లేబరు కమిషనర్‌కు తెలియపరచాలి, ఫిర్యాదులందిన కేసుల్లో లేబరు కమిషనర్ ఆయా ఐటీ కంపెనీల నుండి సమాచారం అడిగితే యివ్వాల్సిందే. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : ఈ కామర్స్‌లో అగ్రస్థానం బన్సాల్ అగ్రవాల్స్‌దే

భారతదేశంలో ఈ కామెర్స్ నడిపేవారిలో 85% మంది బన్సాల్ కమ్యూనిటీకి చెందినవారే. ఫ్లిప్‌కార్ట్, మైంత్రా, స్నాప్‌డీల్, లెన్స్‌కార్ట్ – వీటన్నిటిని ప్రారంభించి నిర్వహిస్తున్నది బన్సాల్ వర్గానికి చెందినవారే. ఉత్తరభారతానికి చెందిన వైశ్యులు – అగ్రర్వాల్‌లు. వారి మూలపురుషుడు మహారాజా అగ్రసేన్‌కు 17 మంది కొడుకులు, ఒక కుమార్తె. గోయల్, గర్గ్, మిత్తల్, సింఘాల్, కన్సాల్, బన్సాల్.. అనే యీ కొడుకుల పేర్లమీదుగా గోత్రాలు ఏర్పడ్డాయి. సాధారణంగా సగోత్రవివాహాలు చేసుకోరు. వీరు ఉత్తరభారతమంతా వ్యాపించి రకరకాల వ్యాపారాలు చేస్తూ వుంటారు. నివసిస్తున్న ప్రదేశం బట్టి అలవాట్లు కొద్దిగా మారుతూ వచ్చాయి. రాజస్థాన్ బన్సాల్‌లు శాకాహారులుగానే వుంటారు కానీ పంజాబ్ బన్సాల్‌లు మాంసాహారులు. బన్సాల్‌లలో చాలామంది కుటుంబవ్యాపారాలు చూస్తూండగా కొందరు వ్యాపారాలకు కాలం చెల్లిందని భావించి బాగా చదువుకుని ఉద్యోగాలలో చేరారు.

అగర్వాల్‌లు చేసే వ్యాపారాలలో కిరాణా, స్వీట్స్, నగలు, ట్రాన్స్‌పోర్టు యివన్నీ వుంటాయి. ఇక ఉద్యోగుల్లో అయితే పాతతరం వాళ్లు బ్యాంకుల్లో చేరారు. కొత్తతరం వాళ్లు ఐఐటీవైపు మొగ్గారు. ఐఐటీ ఎంట్రన్సు పరీక్షలకు కోచ్ చేసే మొట్టమొదటి ట్రెయినింగ్ సెంటర్‌ను జి డి అగర్వాల్ అనే ఆయన 1962లో పెట్టాడు. బన్సాల్ అనే ఆయన ఎంతమందికి తర్ఫీదు యిచ్చి ఐఐటి, ఐఐఎమ్‌లకు పంపాడో లెక్కే లేదు. ప్రస్తుతం ఈ కామెర్స్ ఏలుతున్న బన్సాల్‌లలో 80% మంది ఐఐటి గ్రాడ్యుయేట్లే. వాళ్లు పాతతరం నుండి సంక్రమించిన వ్యాపారలక్షణాలకు, తాము నేర్చుకున్న ఆధునిక సాంకేతికతను జోడించి అభివృద్ధిపథంలో దూసుకుపోతున్నారు.– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)

## ఎమ్బీయస్ : రాహుల్ జోకరా?

ఈ ముక్క బహిరంగంగా అన్నందుకు కేరళ కాంగ్రెసు నాయకుణ్ని తీసేశారు. ఇంకో రాజస్థాన్ కాంగ్రెసు నాయకుడు '..జోకరే కాదు, చుట్టూ వున్న జోకర్ల బృందానికి లీడరు' అని వివరణ యిచ్చి సేమ్ సత్కారానికి గురయ్యాడు. చిన్నపుడు ఓ కథ విన్నాను. ఓ విదూషకుడు రాజుగారికి బాగా చనువుట. రాజుగారి మీదే జోకులేసేవాడట. 'రాజుగారు నరమాంస భక్షసుడు. ప్రభుత్వంలో పనిచేయని ఉద్యోగులను కాల్చుకు తింటాడు.' అన్నాట్ట. రాజుగారు పగలబడి నవ్వాడు. 'రాజుగారు గుడ్లగూబ కంటె ఘోరమైన ప్రాణి. అది పగలైనా పడుక్కుంటుంది. ఈయన అహోరాత్రాలు మేలుకొని వుండి రాజ్యంపై ఎవరూ దాడి చేయకుండా చూస్తూ వుంటాడు.' అన్నాడు. రాజుగారు మెచ్చుకుని ఓ హారం బహుమతిగా యిచ్చాడు. 'రాజుగారు ఎప్పుడు బూడిద అవుతాడో అని నా భయం. మన్మథుడంత అందంగా వుంటే ఏమౌతుంది మరి' అన్నాడు విదూషకుడు. ఈ సారి హారానికి తోడుగా అగ్రహారం దక్కింది. ఇలా జోకులు వేసి, వేసి చివరకు 'రాజుగారికి బట్టతల' అన్నాడు విదూషకుడు. వెంటనే రాజుగారు ఉగ్రుడై పోయి, 'వీడి తల తీసేయండి' అన్నాడు. అందరూ బిత్తరపోయారు. అసలు సంగతేమిటంటే – అప్పటిదాకా విదూషకుడు పలికినవి అసత్యాలు, అతిశయోక్తులు. రాజుగారు ఎంజాయ్ చేశాడు. చివర్లో అన్నది కటికసత్యం. రాజుగారికి బట్టతల. దాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఆయన నిరంతరం కిరీటం ధరిస్తూ, భరిస్తూ వుంటాడు. ఈ విదూషకుడి కారణంగా తన రహస్యం అందరికీ తెలిసిపోయిందేనని రాజుకి కోపం వచ్చి మరణదండన విధించాడు. ఇప్పటి రాజులకు తలతీసే అధికారం లేదు కాబట్టి బహిష్కరణతో సరిపెట్టారు.

ఈ కథ చెప్పడం ద్వారా రాహుల్ జోకరే అని నేను సర్టిఫై చేస్తున్నానని అనుకోవద్దు. రాహుల్‌కు కూడా తన గురించి అలాటి అనుమానం వచ్చి అలా రియాక్టు అయి వుండవచ్చనే అనుమానంతో కథ చెప్పాను కానీ నా దృష్టిలో అతను జోకర్ కానే కాదు. జోకరెప్పుడూ నవ్వించే ప్రయత్నం చేస్తాడు. ఈయన చేయలేదు. మనల్ని, ముఖ్యంగా తెలుగువారిని ఏడిపించాడు. ఎవరెవరినో సలహాదారులుగా పెట్టుకుని, వాళ్లు చెప్పినట్లు ఆడి, మనల్ని ఏడిపించి, ఎన్నికల తర్వాత తనే ఏడ్చాడు. కొప్పున్నామె సిగ ఎలా చుట్టినా అందమే అంటారు కానీ కొప్పు యింటిపేరులో వున్న రాజుగారు తన చెడు సలహాలతో తెలుగు సిగను పాయలు పాయలు చేయించి రాహుల్ పాలిట రాహువయ్యారు. దాని సిగదరగ, కాంగ్రెసు రాష్ట్రాన్ని రెండుగా తరిగి ఒక చోట అమావాస్య చంద్రుడిగా, మరో చోట తదియ చంద్రుడిగా మారింది. రాహుల్ తను చాలా సీరియస్‌గా వ్యవస్థను మార్చేస్తున్నానని నమ్మాడు. పదేళ్లగా అధికారంలో వున్న పార్టీకి ఉపాధ్యక్షుడిగా వుండి వ్యవస్థకు వ్యతిరేకంగా నినాదాలు యిస్తే ఎవరు నమ్ముతారు? అని అతనికి తట్టలేదు. వ్యవస్థ అంటే మన్‌మోహన్ అనీ, యువతరం ప్రతినిథిగా తను ఆ ముసలిరాజును ధిక్కరిస్తున్నానని ప్రజలు అనుకుంటారనుకున్నాడు. మన్‌మోహన్ రాజుగారని దేశం ఎన్నడూ అనుకోలేదని రాహుల్‌కు తెలియదు పాపం. క్రిమినల్స్ బిల్లు ముసాయిదా చింపేసి, హంగు చేయబోయాడు. అది ఆ స్టేజికి వచ్చేదాకా ఏ గుడ్డి గుఱ్ఱానికి పళ్లు తోముతున్నావ్ బాబూ అని అందరూ నవ్వారు. కానీ మనల్ని నవ్వించడం అతని ఉద్దేశం కానే కాదు. అది అనుకోకుండా పుట్టిన హాస్యం.

రాహుల్ జోకర్ కాకపోతే విలనా? ఆ మాట అనడానికి నాకు నోరు రాదు. తల్లిని అడ్డుపెట్టుకుని సంజయ్ గాంధీని చేసిన అకృత్యాలు చూశా, రాజీవ్ గాంధీ తల్లిచాటు నుండి ఫరూక్ అబ్దుల్లా ప్రభుత్వాన్ని, ఎన్టీయార్ ప్రభుత్వాన్ని కూలదోసిన వైనం చూశా. వారితో పోలిస్తే రాహుల్‌కి అలాటి లక్షణాలు ఏమీ లేవు. పాపం ఎప్పుడూ పొగరుగా మాట్లాడలేదు. తన కాళ్లమీద పడేవాళ్లను సైతం ఎవర్నీ గట్టిగా బహిరంగంగా తిట్టలేదు. ఇతర పార్టీల ప్రభుత్వాలను కూల్చాలని కుట్రలు పన్నలేదు. తన పార్టీ వున్నచోట అసమ్మతిని ప్రోత్సహించడానికి గ్రూపులను చేరదీయలేదు. పగ బట్టలేదు. ఆశపోతు కాదు. మన్‌మోహన్‌ని దింపేయాలని చూడలేదు. అధికారం వున్నా మరీ ఆర్భాటం చేయలేదు. జోకర్ కాదు, విలన్ కాదు, హీరో ముందే కాదు.. మరేమిటి అని మీరడగవచ్చు. అతను లిస్ట్‌లెస్ పెర్‌ఫార్మర్. అంటే మొహమాటానికి అతిథి పాత్ర ఒప్పుకున్న నటుణ్ని చూడండి, నిరాసక్తంగా వచ్చి, నాలుగు డైలాగులు అప్పచెప్పి, వెళ్లి వింగ్స్‌లో కూర్చుంటాడు, అలాటివాడన్నమాట. అతనికి యీ దేశాన్ని పాలించాలన్న యావ ఏ కోశానా వున్నట్టు కనబడదు. ఆ కుటుంబంలో పుట్టిన పాపానికి, అనుచరుల గోల భరించలేక, అమ్మ ఏడ్చిపోతుందని, అలా అలా మనకు అప్పుడప్పుడు కనబడి, మళ్లీ హైబర్నేషన్‌కు వెళ్లిపోయేవాడు. ఫలానా చోట ప్యారడైజ్ బిర్యానీ తిన్నాడు, ఫలానా చోట టీ తాగాడు అని పేపర్లో వార్తలు వస్తే అవి అమ్మకు చూపించి ఆవిణ్ని తృప్తి పరచేవాడు. పెళ్లి ఎలాగూ చేసుకోలేదు, ఏదో ఒకటి చేస్తున్నాడు కదాని ఆవిడ నిట్టూర్చేది.

రాహుల్ పెళ్లి అతని సొంత విషయమే కానీ, చాలామంది దానిపై జోకులు వేశారు పాపం. అతను ఎవరైనా భారతీయురాలిని

చేసుకుంటానంటే సోనియా ఒప్పుకునేదేమో. కానీ అతని ఫ్రెండ్సందరూ విదేశీ వనితలే. రాజకీయంగా దెబ్బ తింటామన్న భయంతో కాస్త ఆగరా బాబూ అని తల్లి చెప్పి వుంటుంది. ''ఇప్పుడు ఎలాగూ ఓడిపోయాం కాబట్టి, పెళ్లి చేసేసుకుంటానే'' అని రాహుల్ పేచీ పెట్టవచ్చు. ఆవిడ సరేనంటే, 'కత్తి పోయె డాలు వచ్చె ఢాంఢాంఢాం, పవరు పోయె పెళ్లం వచ్చె ఢాంఢాంఢాం' అని ఝూమ్మని పాటలు పాడుకుంటూ దేశవిదేశాలు షికార్లు కొడతాడేమో! అతన్ని చూసి జాలిపడనక్కరలేదు, నవ్వనక్కరలేదు. అతనేదో గొప్పవాడై పోతాడనుకుని చుట్టూ తిరిగిన భజనబృందం వుంది చూడండి, అప్పుడు వాళ్ల గతి ఏమైవుతుందో చూసి తలచుకుని నవ్వుకోవాలి. నవ్వుతున్నాం కదాని వాళ్లను జోకర్లు అనకూడదు – వాళ్లు కూడా కావాలని మనల్ని నవ్వించటం లేదు కాబట్టి! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 11-12 వీక్లీకై ఎమ్బీయస్ : పంచపాండవులంటే మంచంకోళ్లలా..**

'పంచపాండవులంటే నాకు తెలియదా? మంచంకోళ్లలా ముగ్గురు అంటూ రెండు వేళ్లు చూపించిదొకావిడ' అనేగి పాత సామెతే! ఎక్కడో మొదలుపెట్టి క్రమంగా స్థాయి దింపుతూ వచ్చినపుడు యీ సామెత వాడతారు. టిడిపి వారి ఋణమాఫీకి యిది బాగా వర్తిస్తుంది. ఎన్నికల టైములో ఏ వివరాలూ లేకుండా 'రైతుల ఋణమాఫీ' అంటూ హోరెత్తించేశారు. రైతులు తమకున్న సమస్త ఋణాలభారం చంద్రబాబు తన నెత్తిన వేసుకుంటున్నాడనుకున్నారు. చంద్రబాబు యిచ్చిన అనేక హామీల జోరులో దీని గురించి పెద్దగా పట్టించుకుని వుండేవారు కాదేమో కానీ, జగన్ తన ప్రచారంలో వూరూరూ తిరిగి 'బాబు ఫలానా హామీ యిచ్చాడు, కానీ అమలు చేయలేదు' అంటూ దీనికి విస్తృత ప్రచారం కల్పించాడు. ప్రజలు 'రెండో భాగం సంగతి అవతల చూద్దాంలే, యీ హామీ ఏదో బాగుంది' అనుకుని టిడిపిని ఆదరించారు. నెగ్గిన తర్వాత ఆ హామీ పాములా టిడిపి మెడకు చుట్టుకుంది. చంద్రబాబు ఆ పామును తన మెడలోంచి తీసి ఓ కమిటీ మెళ్లో పడ్డేసి, 'ఇప్పుణ్నుంచి అటు చూడండి' అని ప్రజలకు చెప్పారు. ఆ విధంగా మాఫీకోసం ఎదురు చూసిన రైతులకు కమిటీ దక్కింది. ఇక కమిటీ ఏం చేయబోతుందో, ఏం చెప్పబోతుందో ఎదురుచూస్తూ కూర్చోవచ్చు. ఈలోగా బాబుగారిని ప్రశ్నలతో వేధించకూడదు. అది మర్యాద కాదు.

**ఈ లెక్కలు ముందు చూసుకోలేదా?**

అయితే కొందరికి అన్నీ సందేహాలే. హామీ యిచ్చేటప్పుడు యీ అంశాలన్నీ పరిశీలించలేదా? అని. బాబుగారు టిడిపి మానిఫెస్టో ఆషామాషీగా తయారు చేయించలేదని మీడియా మనకు హామీ యిచ్చింది. ఆర్థికనిపుణులు కూలంకషంగా చర్చించి, ఆచరణసాధ్యమైన హామీలు మాత్రమే మానిఫెస్టోలో పొందుపరచారని టిడిపి నాయకులు చెపుతూ వచ్చారు. టిడిపి మానిఫెస్టో రాసిన ఆర్థికనిపుణుడు కుటుంబరావుగారు ఓ సారి టీవీ చర్చలో ఫోన్-యిన్‌లోకి వచ్చి ఆ మేరకు ధీమా వ్యక్తపరచారు కూడా. 'ఎలా చేయగలరు? అంత స్తోమత ఎక్కడిది?' అని ప్రొఫెసర్ నాగేశ్వర్ వంటివారు కవ్వించడానికి చూశారు. కంఠంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడుతూండగా కుటుంబరావుగారు 'బాబుగారి ప్రమాణస్వీకారం రోజున తొలి సంతకం చేస్తూన్న క్షణాన మీ సందేహాలన్నీ పటాపంచలవుతాయి' అని ఊరించారు. ఋణమాఫీ జరిగేనా? అని నేను వ్యాసం రాస్తే చాలామంది పాఠకులు – ఆ కుటుంబరావుగారి మాటలు వినే కాబోలు – 'ఎంతోమంది నిపుణులు మాఫీ సాధ్యమే అని చెపుతున్నారు, నీకొచ్చిన బాధేమిటి? ఈ కుశంకలు దేనికి' అంటూ చివాట్లేశారు. ఇప్పుడు నాకూ శంకలు తీరిపోయాయి. మనకూ ఓ కమిటీ దక్కింది. 15 రోజుల్లో మధ్యంతర నివేదిక, 45 రోజుల్లో పూర్తి నివేదిక, ఇంకేం కావాలి?

విభజన పుణ్యమాని రెండు రాష్ట్రాల ఆర్థికస్థితిగతుల గురించి చిన్నపిల్లాడికి కూడా తెలిసేవిధంగా పేపర్లు రాస్తూ వచ్చాయి. కిరణ్‌కుమార్ రెడ్డిగారు స్కూలు టీచర్లా విపులంగా చెప్తూ వచ్చారు. ఇవేళ కొత్తగా మారిపోయిన అంకెలు లేవు. అయినా బాబు 'అంతా అయోమయంగా వుంది' అంటున్నారు. విభజన గందరగోళంగా జరిగింది అంటున్నారు. ఈ గందరగోళపు, అన్యాయ, అక్రమ విభజన బిల్లునే ఆయన తెలంగాణ యూనిట్ సభ్యులు సమర్థించారు. లోకసభలో వున్న యిద్దరు టిటిడిపి ఎంపీలు యిలాగే కావాలన్నారు. అడ్డుపడబోయిన ఆంధ్ర టిడిపి ఎంపీని చావగొట్టి చెవులు మూసి, ఆస్పత్రికి వెళ్లేట్లా చేశారు. వాళ్లకే బాబు మళ్లీ టిక్కెట్లు యిచ్చి ప్రోత్సహించారు. ఎన్నికల ప్రచారానికి వెళ్లినపుడు తెలుసుకదా– ఆంధ్ర చేతిలో చిప్ప తప్ప మరేమీ లేదని. మానిఫెస్టో రాసిన ఆర్థిక నిపుణులకు యీయన సరిగ్గా యిన్‌పుట్స్ యివ్వలేదా? అదే జరిగి వుంటే, ఎన్నికల ఫలితాలు వచ్చి ప్రమాణస్వీకారం చేసేందుకు మధ్యలో 22 రోజులున్నాయి. నెగ్గగానే తనదే అధికారం, బాధ్యత అని తెలుసు కాబట్టి యీ కమిటీ అప్పుడే వేయించినా యీ పాటికి మధ్యంతర నివేదిక వచ్చేసేది. రెండు, మూడు రోజుల్లో వానలు వచ్చేస్తున్నాయి. ఖరీఫ్ పంటకు ఋణాలు కావాలి. ఈ నివేదిక చేతికి వచ్చి, దానిపై కాబినెట్ నిర్ణయం తీసుకుని, నిధులకోసం తిరిగి, బ్యాంకులకు యిచ్చి, వారి నుండి ఆదేశాలు వెలువడేట్లా చేయడానికి కనీసం నెలపట్టదా? అప్పటినుంచి రైతులు కొత్త ఋణాలు తీసుకోవడం మొదలుపెడితే ఎప్పటికి పంటలు వేస్తారు? ఏం పండిస్తారు?

## 'బ్యాంకులకు ఆదేశాలిచ్చేస్తాం..'

'అబ్బే, అప్పటిదాకా ఆగనక్కరలేదు, బాబుగారు బ్యాంకులకు ఆదేశాలు యిచ్చేస్తారు, నాబార్డ్‌కు చెప్తారు' అని కొందరు నాయకులు టీవీల్లో చెప్పేస్తున్నారు. ఆయన ఆదేశాలు యివ్వవచ్చేమో కానీ పుచ్చుకునేందుకు బ్యాంకులు సిద్ధంగా వుండవు. బ్యాంకు ఆఫీసరుగా నా అనుభవం చెప్తున్నాను – ప్రభుత్వం ఏదైనా పథకం, స్కీము ప్రకటించగానే పేపర్లో వస్తుంది. అవేళ బ్యాంకుకి వెళ్లేసరికి ఆ పేపరు కటింగ్ పట్టుకుని కొందరు కస్టమర్లు సిద్ధం. దీని కింద లోను యివ్వాలి కదా, దీని కింద హెచ్చు వడ్డీ రేటు యివ్వాలి కదా.. అంటూ. మాకు ఒళ్లు మండిపోతుంది. 'పేపరు చూసి బ్యాంకులు నడపమండి. మాకు మా హెడాఫీసు నుండి సర్క్యులర్ రావాలి, అప్పుడే ఏదైనా చేయగలం' అంటాం చికాకు అణుచుకుంటూ. 'అదెప్పుడు వస్తుంది?' అని అడుగుతారు వాళ్లు ఆతృతగా.

''సాక్షాత్తూ ఆర్థికమంత్రి పేపరు స్టేటుమెంటు యిచ్చినా అది పట్టించుకోం. ఆయన ఆర్‌బిఐ గవర్నరును ఒప్పించాలి. పథకం విధివిధానాలను రూపొందించి, ఆర్‌బిఐ సర్క్యులర్ యిష్యూ చేశాక అది వివిధ బ్యాంకుల హెడాఫీసులకు వెళుతుంది. అది ముందు పెట్టుకుని వాళ్లు తమ బ్యాంకుకి అనువుగా మళ్లీ సర్క్యులర్ తయారుచేస్తారు. ఇంగ్లీషులో తయారయ్యాక దానికి హిందీ, స్థానికభాషల్లో అనువాదం కోసం వేరే శాఖలకు వెళుతుంది. సంబంధిత అధికారుల సంతకం కోసం కొన్ని రోజులపాటు టేబుల్‌మీదే పడి వుండవచ్చు కూడా. ఫైనల్ సర్క్యులర్ ఏ జనరల్ మేనేజరో సంతకం పెట్టాల్సి వుంటుంది. ఆయన ఊళ్లో లేకపోతే ఆగుతుంది. ఆ సర్క్యులర్ బ్రాంచ్‌కి వచ్చాక, బ్రాంచ్ మేనేజర్ పోస్టు తెరిచి, దాన్ని చూసి సంబంధిత డిపార్టుమెంటు పంపడానికి ఒక రోజు పడుతుంది. అప్పుడే దాన్ని అమలు చేస్తాం...' అని చెప్తాం. వాళ్లు విసుక్కుని వెళ్లిపోతారు. బ్యాంకులు రాష్ట్రప్రభుత్వం ఆధీనంలో వుండవు. వాళ్లు వాళ్ల హెడాఫీసుకే బాధ్యులు. రాష్ట్ర అధికారులతో సమన్వయం కోసం స్టేట్ లెవెల్ బ్యాంకర్ల సమావేశాలు జరుగుతూ వుంటాయి. ఆ సమావేశాలపై ఏ బ్యాంకుకి పెద్ద యింట్రస్టు వుండదు. వెళితే టైమ్ వేస్టు అని బ్రాంచ్ మేనేజరు ఎగ్గొడదామని చూస్తాడు. ఆర్గనైజర్‌నుంచి ఒత్తిడి వస్తే ఎవరినైనా పంపాలని చూస్తాడు. ఏ అధికారీ వెళ్లడానికి యిష్టపడడు. బతిమాలో, ఆదేశించో పంపుతూంటారు.

## కొత్త అప్పులివ్వడం ఆషామాషీ కాదు

రాష్ట్రప్రభుత్వాన్ని నడిపే పార్టీ తన రాజకీయప్రయోజనాల కోసం బ్యాంకు రూల్సు పట్టించుకోకుండా వ్యవహరించమని అడగవచ్చు, ఆదేశించవచ్చు. కానీ బ్యాంకులో వున్న డబ్బు కస్టమర్లది. రూల్సు పాటించకపోతే హెడాఫీసు వారు తాట తీస్తారు. డిసిప్లినరీ యాక్షన్ తీసుకుంటారు. అందుకని ఎవరూ రిస్కు తీసుకోరు. పాత బకాయి వున్నవాడికి కొత్త లోను యిస్తే యిచ్చినవాడికి తలకాయనొప్పి. వంద సంజాయిషీలు యిచ్చుకోవాలి. అందువలన ఋణమాఫీ జరిగి, పాత ఖాతాలన్నీ మూసేస్తే తప్ప కొత్త లోను యివ్వరు. మంత్రుల హామీలు పేపర్లో చదివి ఎవరైనా రైతులు బ్యాంకులకు వెళితే అధికారులు వాళ్లకు ఏదో ఒకటి నచ్చచెప్పి పంపించేస్తూ వుంటారు. పాత ఖాతా మూసేయడం కూడా అంత యీజీ కాదు. ఎందుకంటే చంద్రబాబు తన పాదయాత్రలో ఋణమాఫీ గురించి మాఫీ యిచ్చాక, దాన్ని నమ్మి చాలామంది అవసరం లేకపోయినా అప్పులు తీసుకున్నారట, అప్పటికే తీసుకున్నవాళ్లు తిరిగి కట్టడం మానేశారట. సకాలంలో వాయిదాలు కట్టకపోతే పెనాల్టీగా వడ్డీ రేటు పెరుగుతుంది. ఉదాహరణకు లక్ష వరకు ఋణాలు మాఫీ చేయమని ప్రభుత్వం అందనుకోండి. అది అసలుకా, వడ్డీతో కలిపి ఆ రోజువరకు వున్న ఔట్‌స్టాండింగ్ ఎమౌంట్‌కా అన్న విషయంలో క్లారిటీ యివ్వాలి. పెనాల్టీ వడ్డీతో కలిపి బకాయి లక్ష దాటింది కాబట్టి మాఫ్ చేయం అంటే రైతుకి బాధేస్తుంది. నేను తీసుకున్నది 90 వేలు ఋణమే కదా అని పేచీ పెట్టుకుంటాడు.

పైగా ఏ ఋణం అన్నదానిపై స్పష్టత రాలేదు. వ్యవసాయఋణం మాఫీ చేస్తాం అని మ్యానిఫెస్టోలో ఒక చోట రాసి, తరువాతి లైనులోనే రైతు ఋణాల మాఫీ అని రాశారట. రైతు ఋణం అంటే రైతుకు గల అన్ని రకాల ఋణం అనే అభిప్రాయం వ్యాపించింది. వ్యవసాయ ఋణం (క్రాప్ లోన్) మాత్రమే అంటే దానికి సాధారణంగా యిన్సూరెన్సు వుంటుంది. పంట విఫలమయినపుడు ఇన్సూరెన్సు కంపెనీయే డబ్బు యిస్తుంది. పంట బాగా పండినా ఋణం వెనక్కి కట్టని రైతుకి సహాయం చేయడం అంటే అసంమజసంగా తోస్తుంది. బంగారం కుదువ బెట్టిన కేసుల్లో ఆ పాటి బంగారం వున్నవాడికి కూడా మాఫీయా అనిపిస్తుంది. ఇంట్లో పెళ్లి ఖర్చుకోసం బంగారం కుదువ పెట్టినా వ్యవసాయం కోసం అని రాయించారనుకోండి, వాళ్లకు మాఫీ వర్తిస్తుందా? ఈ లోను సొమ్ము ఎలా వినియోగం అయిందో ఎవరైనా నిరూపించగలరా? అందుకే తెలంగాణ ప్రభుత్వం కూడా బంగారం ఋణాలపై ఏమీ మాట్లాడటం లేదు. ఈ చర్చలన్నీ పార్టీలు ఎన్నికలకు ముందు చేయవు. ఏదీ స్పష్టంగా చెప్పవు. అన్నదాత కన్నీరు తుడుస్తాం, ఇంటి పెద్దకొడుకులా ఆదుకుంటాం – యిలాటి కవిత్వం ఒలకబోస్తారు. నెగ్గాక 'అలా ఎలా కుదురుతుంది?' అంటూ నచ్చచెప్పబోతారు. 'వందలాది ఎకరాలున్న రైతులకు కూడా ఋణమాఫీ చేయాలా?' అని సిఎం రమేష్‌గారు యివాళ టీవీలో మండిపడ్డారు. చేయమని ఎవరన్నారు? 'ఇన్ని ఎకరాలుంటే చేస్తాం, అంతకంటె ఎక్కువుంటే చేయం' అని ఎన్నికలకు ముందు వారే చెప్పి వుంటే ఏ గందరగోళమూ వుండేది కాదు. విధివిధానాలపై యిప్పుడు కమిటీ వేశారు. ఇవి తేలేటప్పటికి ఖరీఫ్ టైము దాటిపోతుంది.

## 58 నుండి 60 విషయంలో కమిటీ అక్కరలేక పోయింది

ఉద్యోగస్తుల రిటైర్‌మెంట్ వయసు పెంపు విషయంలో కమిటీ వేయాలని బాబుగారికి తోచలేదు. నిజానికి అదీ ఒక చిక్కు సమస్యే. ఉద్యోగులు 65 ఏళ్ల దాకా పని చేయడానికి రెడీ అంటారు. ఎప్పుడో యిక్ష్వాకుల కాలంలో ఉద్యోగాల్లో దూరినవాళ్లు 35, 40 ఏళ్లు పని చేసేస్తూ వుంటే మా గతి ఏమిటని నిరుద్యోగులు ప్రశ్నిస్తారు. సీనియారిటీ పెరిగినకొద్దీ జీతం పెరుగుతూ వుంటుంది. భత్యాలు పెరుగుతూ వుంటాయి. మెడికల్ బిల్లుల ఖర్చు పెరుగుతూ వుంటుంది. కుటుంబసభ్యులకు కూడా ఎల్‌టిసి సౌకర్యం, మెడికల్ సౌకర్యం.. అంటూ ఒక్కో ఉద్యోగిపై తడిసిమోపెడు అవుతూంటుంది. ఆ ఖర్చుతో కొత్త ఉద్యోగులు ముగ్గుర్ని పెట్టుకోవచ్చు. అందుకే మల్టీ నేషనల్ కంపెనీలు 45 ఏళ్లు దాటినవాళ్లను ఎంతో కొంత యిచ్చి వదుల్చుకుందామని చూస్తూ వుంటాయి. వయసు పై బడితే సామర్థ్యం తగ్గుతుందని వారి భయం. ఏవో కొన్ని ఉద్యోగాలలో మాత్రమే అనుభవజ్ఞులు కావలసి వస్తారు. రొటీన్ ఉద్యోగాలలో ఎవరైనా నడిచి పోతుంది. యువత అయితే కుటుంబపు బాదరబందీ వుండదు. లేటుగా కూర్చోమన్నా కూర్చుంటారు... వంటి లెక్కలు వేస్తారు. అంకితభావంతో పని చేయడం అనేది వ్యక్తి బట్టి వుంటుంది. వయసుతో సంబంధం లేదు. ప్రభుత్వం కూడా యిదే ఫిలాసఫీ అవలంబించసాగింది. రాష్ట్రప్రభుత్వంలో వేలాది పోస్టులు ఖాళీగా వుంచడానికి కారణం అదే. కాంట్రాక్టు ఉద్యోగులను పెట్టుకుని పని నడిపించేస్తున్నారు.

ఒకసారి వుద్యోగం సంపాదించినవాళ్లు ఎల్లకాలం కొనసాగుదామని చూస్తారు. మనిషి ఆయుర్దాయం పెరుగుతోంది. రిటైరయి బయటకి వెళితే 25, 30 ఏళ్లపాటు ఖాళీగా కూర్చోవలసి వస్తోంది. ఖర్చులకు పెన్షన్‌తో సరిపెట్టుకున్నా సమయం గడపడం ఎలాగో తెలియదు. అందువలన ఉద్యోగి సంఘాలన్నీ రిటైర్‌మెంట్ వయసు పెంపు గురించి అడుగుతూనే వుంటాయి. మరి మా సంగతి ఏమిటని నిరుద్యోగ యువత అడుగుతూంటుంది. మీరు ఉద్యోగాలకు అప్లయి చేసుకునే వయసు 35 నుండి 40 కి పెంచాం పొండి అంటూంటుంది ప్రభుత్వం. అది పరిష్కారమా? మృణాళ్ సేన్ సినిమా ''ఇంటర్వ్యూ'' అని వుంది. ఓ కంపెనీలో పది ఖాళీలున్నాయి. ఒక్కో ఉద్యోగానికి పదిమంది చొప్పున వందమందిని యింటర్వ్యూకి పిలుస్తాం అని ప్రకటిస్తారు. కానీ వేలాది మంది నిరుద్యోగులు వచ్చిపడతారు. ఆఫీసు ఎదుట ఆందోళనకు దిగుతారు. చాలాసేపు ఆందోళన జరిగాక కంపెనీ యజమాని యీ నిరుద్యోగులను చూసి జాలిపడి ఒక ప్రకటన చేస్తాడు – ఉద్యోగాల సంఖ్య పెంచుతామని కాదు, 'ఒక ఉద్యోగానికి పదిమందికి బదులుగా ముప్ఫయిమందిని యింటర్వ్యూ చేస్తాం' అని. నిరుద్యోగులందరూ ఏదో సాధించినట్లు కేరింతలు కొడతారు. దీనిలోని వ్యంగ్యం మనసుకు తాకుతుంది. నిరుద్యోగ యువతకు కావలసినది – ఉద్యోగం, అప్లయి చేసుకునేందుకు వయసు పరిమితి పెంపు కాదని నాయకులు ఎప్పుడు గుర్తిస్తారో!

## నిరుద్యోగుల విషయంలో కమిటీ జాన్తా నై

రిటైర్‌మెంట్ వయసు పెంపు అనేది ఉద్యోగులకు వరం, నిరుద్యోగులకు శాపం. ఇద్దరిమధ్య సమతూకం సాధించడానికి పాలకులు ప్రయత్నించాలి. తెలంగాణలో కెసియార్ ఆ సాహసం చేయలేదు. టి-ఉద్యోగులకు సెంట్రల్ స్కేలు యిస్తానన్నారు, తెలంగాణ యింక్రిమెంటు యిస్తానన్నారు, ఆంధ్రవాళ్లను తరిమేసి ప్రమోషన్లు యిప్పిస్తానన్నారు కానీ 58 నుండి 60 చేస్తాననలేదు. అలా అంటే ఉస్మానియాలో తన దిష్టిబొమ్మలు తగలబడతాయని భయం. ఎందుకంటే నేటి విద్యార్థులే రేపటి నిరుద్యోగులు. తెలంగాణ ఉద్యమంలో విద్యార్థులది ప్రధాన భూమిక. 2009లో ఖమ్మంలో కెసియార్ నిరాహారదీక్ష విరమించి కూడా విద్యార్థుల భయం చేత మళ్లీ మొదలెట్టారు. ఆంధ్రలో విద్యార్థులలో అలాటి చైతన్యం లేదు. తిరగబడరన్న ధైర్యం. అందుకే కమిటీ, గిమిటీ ఏమీ లేకుండా బాబు 60 కి పెంచిపారేశారు. ఉద్యోగుల తాత్కాలిక విభజన మాత్రమే జరిగిన యీ సమయంలో యీ పెంపు ఎన్నో సమస్యలకు దారితీస్తోంది. ఎవరికి వర్తిస్తుందో, ఎవరికి వర్తించదో అంతా అయోమయం. దీని విషయంలో కమిటీ వేసి అవన్నీ సార్ట్ ఔట్ చేసిన తర్వాతనే ప్రకటించి వుంటే సబబుగా వుండేది. కానీ దానికి కమిటీ లేదు, ఋణమాఫీ విషయంలో మాత్రం కమిటీ కావాలి. ఎందుకు?

ఆంధ్రలో విద్యార్థులు తిరగబడరన్న ధీమా వుంది కానీ రైతుల విషయంలో ఆ గ్యారంటీ లేదు. పొరుగిల్లు తెలంగాణలో కాస్త రుచి చూపించారు. అందువలన ఒక్కసారిగా విధివిధానాలు ప్రకటిస్తే కొంప మునుగుతుందని, ఐసియులో వున్న పేషంటు గురించి డాక్టర్లు చెప్పే తరహాలో క్రమక్రమంగా వాళ్ల మెదళ్లలో సందేహాలు ప్రవేశపెడుతున్నారు. చివరకు ఏ లక్షకో తేలిస్తే, 'అసలు ఏమీ యివ్వడేమోనని బెంగ పెట్టుకున్నాం, ఎక్కడికక్కడే ఎంకటలక్ష్మీ' అని సరిపెట్టుకుంటారని ఆశ. ఎందుకంటే కమిటీ రిపోర్టులో ఫలానా పరిమితి వరకు మాఫ్ చేయవచ్చు అని సిఫార్సు చేసినా నిధుల సంగతి ఏం చెప్తారు? కేంద్రం ఆదుకోవాలి అని ముక్తాయింపు యిస్తారు. అది పట్టుకుని కేంద్రం వద్దకు వెళ్లాలి. ఇది మా స్కీము కాదు కదా అని కేంద్రం అనవచ్చు. చివరకు రాజకీయ కారణాల వలన.. ఏదో కాస్త.., అదీ విడతలుగా.. యిస్తాం అనవచ్చు. ఇది యిప్పట్లో అయ్యే వ్యవహారం కాదు. అందువలన రైతుల ఆశలపై

కాస్త కాస్త నీళ్లు చల్లుతూ, రాజధాని గురించో మరో దాని గురించో మాట్లాడుతూ దృష్టి మళ్లించే ప్రయత్నం చేస్తారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 13** **ఎమ్బీయస్ : మోదీకి మద్దతుగా నిలిచిన స్వచ్ఛంద సంస్థలు**

మోదీని ప్రధానిని చేయడానికి ఎన్నో స్వచ్ఛంద సంస్థలు కృషి చేశాయి. ఇవన్నీ రైటిస్టు మేధావులు నిర్వహిస్తున్న సంస్థలే. ప్రపంచం మొత్తం మీద రెండు వాదాలే ప్రధానంగా వున్నాయి. వామపక్షం, దక్షిణపక్షం (ఈ పదం ఎక్కువగా వాడరు, రైటిస్టులు అనేస్తారు). ప్రగతి ఫలాలు ప్రజలందరికీ అందేట్లా చూడవలసిన బాధ్యత ప్రభుత్వానిదనీ, అందువలన పరిశ్రమల్లో, వ్యాపారాల్లో ప్రభుత్వజోక్యం వుండాలని, వాణిజ్యంపై ప్రభుత్వ అజమాయిషీ లేకపోతే పెట్టుబడిదారులు గుత్తాధిపత్యం సంపాదించి, ధరలు పెంచి, పేదప్రజలను పీడిస్తారని వామపక్షవాదులు అంటారు. మౌలిక పరిశ్రమలు ప్రభుత్వ అజమాయిషీలో వుండాలని, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని లాభనష్టాల ప్రమేయం లేకుండా వాటిని నడపాలని వారి వాదన. ప్రభుత్వం వీటిలో కలగచేసుకోనక్కరలేదని, మార్కెట్ దారిన మార్కెట్‌ను వదిలేస్తే ధరలు వాటంతట అవే అదుపులోకి వస్తాయని, ప్రభుత్వం అన్నీ తన నెత్తిన వేసుకుంటే అవినీతి, అసమర్థతలకు నిలయాలై ఆ సంస్థలు కుప్పకూలతాయని రైటిస్టులు వాదిస్తారు. వీరినే కాపిటలిస్టులు అని కూడా అంటారు. ప్రయివేటు ఆస్తి అనేది లేకుండా మొత్తమంతా ప్రభుత్వం చేతిలో వుండే వ్యవస్థ కమ్యూనిస్టు వ్యవస్థ. అది యిప్పటిదాకా ప్రపంచంలో ఏర్పడలేదు. దాని దారిలో కొంతవరకు నడిచినది – సోషలిస్టు వ్యవస్థ. రష్యాలో ఏర్పడినది కూడా సోషలిస్టు వ్యవస్థే. ఆంగ్లప్రభుత్వం హయాంలో మనదేశంలో నడిచినవి సామ్రాజ్యవాదం, కాపిటలిజం.

స్వాతంత్ర పోరాటంలో పాల్గొన్నవారిలో కొందరు స్వతంత్రభారతానికి కాపిటలిస్టు వ్యవస్థ మంచిదని భావిస్తే, మరి కొందరు సోషలిస్టు వ్యవస్థ మంచిదని భావించారు. కాంగ్రెసు పార్టీ రెండిటి మధ్య వూగిసలాడింది. చివరకు సోషలిజాన్ని సమర్థించింది. కానీ ఆచరణలో కాంగ్రెసు కాపిటలిజాన్నే సమర్థిస్తోందని భావించిన కొందరు కాంగ్రెసు నాయకులు విడిగా వెళ్లిపోయి కాంగ్రెసు సోషలిస్టు పార్టీ పెట్టారు. ఇంకా కొందరు సోషలిస్టు పార్టీ పెట్టారు. కానీ ఆ పార్టీలు చీలిపోయాయి. చివరకు స్వాతంత్ర్యం వచ్చాక కాంగ్రెసు పార్టీయే అధికారంలోకి వచ్చింది. పటేల్‌కి కాపిటలిజం అంటే యిష్టం. ఆయన మద్దతుదారులందరూ పెట్టుబడిదారులే. నెహ్రూకు సోషలిజం అంటే గౌరవం. ప్రజలు సోషలిస్టు భావాలకు ఆకర్షితులయ్యారు. అంతకంటె తీవ్రమైన భావాలున్న కమ్యూనిస్టులను ఒక స్థాయికి మించి ఆదరించలేదు. అందువలన నెహ్రూ పూర్తి పెట్టుబడిదారీ విధానం, పూర్తి సోషలిజం కాకుండా మధ్యేమార్గంగా మిక్సెడ్ ఎకానమీని రూపొందించాడు. ఎక్కువ పెట్టుబడి అవసరమైన భారీ పరిశ్రమల్లో ప్రభుత్వం పెట్టుబడి పెట్టేటట్టు పబ్లిక్ సెక్టార్‌ను, తక్కువ పెట్టుబడితో స్వేచ్ఛగా వ్యాపారం చేసుకునేందుకు ప్రయివేటు సెక్టార్‌ను అనుమతించి, రెండూ పోటీ పడాలన్నాడు. పబ్లిక్ సెక్టార్ ఉత్పాదనల ధరలను ప్రభుత్వం నియంత్రించేది. ప్రయివేటు సెక్టార్‌పై కూడా కొంతమేరకు అదుపు వుండేది. విదేశాలనుండి దిగుమతులపై ఆంక్షలు విధించి భారతీయ పరిశ్రమలను రక్షిస్తూ వచ్చారు. ఇది కొద్దికాలం పాటు సత్ఫలితాల నిచ్చింది. పబ్లిక్ సెక్టార్ ఎన్నో అద్భుతాలను సాధించింది. ప్రయివేటు సెక్టార్ సొంత కాళ్లపై నిలబడింది.

పోనుపోను ప్రయివేటు సెక్టార్ ప్రభుత్వాలను నడిపే రాజకీయనాయకులను లొంగదీసుకుంది. పాలకులు పబ్లిక్ సెక్టార్‌ను దిగజార్చి నష్టాలపాలు చేశారు. దానికి తోడు ఉద్యోగులు, యూనియన్లు పబ్లిక్ సెక్టార్‌లో బాధ్యతారహితంగా పనిచేసేవారు. ప్రతిభతో సంబంధం లేకుండా రిజర్వేషన్లు వంటివి వాటిల్లోనే అమలు చేసి ప్రయివేటు సెక్టార్‌తో పోటీ పడమన్నారు. అదే ప్రయివేటు సెక్టార్‌లో అయితే ఉద్యోగం పోతుందనే భయంతో పనిచేసేవారు. కాలక్రమంలో అనేక పబ్లిక్ సెక్టార్ యూనిట్లు మూతపడేట్లు చేశారు. ప్రజలకు సోషలిజంపై నమ్మకం సడలసాగింది. ప్రయివేటు సెక్టార్ విజృంభించింది. వాళ్లు తమ యూనిట్లలో కార్మికసంక్షేమ చట్టాలు అమలు చేసేవారు కారు. అంతా యాజమాన్యం తలచుకున్నట్లే జరిగేది. తాము ఎన్ని రూల్సు అధిగమించినా ప్రభుత్వం చూసీ చూడనట్లు వూరుకోవాలని వీరి వాదన. కాంగ్రెసు సోషలిజం పేరునే జపిస్తోందని, దానికి ప్రతిగా వీళ్లు కొన్ని రాజకీయపక్షాలకు మద్దతు యిచ్చేవారు. అవి రాజాజీ నాయకత్వంలోని స్వతంత్ర పార్టీ, భారతీయ జనసంఘ్. కానీ ప్రజలు వాటిని ఆదరించలేదు. సోషలిస్టు విధానాలైన బ్యాంకుల జాతీయకరణ, రాజభరణాల రద్దు వంటివి చేపట్టిన ఇందిరా గాంధీనే ఆదరించారు. ఇందిర మరణం తర్వాత రాజీవ్ శకం వచ్చింది. అతను తల్లి విధానాలకు పూర్తిగా విరుద్ధంగా లిబరలైజేషన్ (సరళీకరణ) చేపట్టి విచ్చలవిడిగా విదేశీ దిగుమతులు అనుమతించాడు. దానితో పబ్లిక్ సెక్టార్‌తో బాటు, ప్రయివేటు సెక్టార్ కూడా కుదేలైంది. తర్వాత వచ్చిన పివి గ్లోబలైజేషన్ అంటూ మరింతగా తలుపులు తెరిచారు. గ్లోబలైజేషన్ అంటే ప్రపంచంలో అన్ని దేశాల మధ్య స్వేచ్ఛగా వస్తువులు రవాణా అవుతుందని, మన భారతీయ వస్తువులు విదేశీ మార్కెట్లో అమ్ముడుపోయి మనం ఎదిగిపోతామని అనుకున్నారు. అంతేకాదు, విదేశీ సంస్థలు మనదేశంలో భారీ పెట్టుబడులు పెట్టి మన యిన్‌ఫ్రాస్ట్రక్టర్ పెంచుతాయని, భారీ పరిశ్రమలు పెడతాయని ఆశించారు.

అయితే గ్లోబలైజేషన్ అంతా హంబగ్ అని తేలింది. ఆంక్షలు లేవని చెప్పిన అగ్రదేశాలు వాటిని పాక్షికంగా అమలు చేశారు. అమెరికా, యూరోప్ వాళ్ల వస్తువులు మనకు అమ్ముతున్నాయి కానీ మన వస్తువులన్నీ వాళ్ల దగ్గర అమ్మనీయటం లేదు. ఇండియన్ మార్కెట్ అంతా విదేశీ వస్తువులతో నిండిపోయింది. స్వదేశీ పరిశ్రమలు దెబ్బతిన్నాయి. ఎగుమతులు తక్కువ, దిగుమతులు ఎక్కువ.

బ్యాలన్స్ ఆఫ్ ట్రేడ్‌లో మనం విపరీతంగా నష్టపోతున్నాం. విదేశీ కంపెనీలు మనకు టెక్నాలజీ ట్రాన్స్‌ఫర్ చేయలేదు. మౌలిక పరిశ్రమల్లో పెట్టుబడులు చాలా తక్కువ పెట్టారు. కన్స్యూమర్ గూడ్స్ మార్కెట్లోనే పెట్టుబడులు పెట్టి, మనను ఒక పెద్ద మార్కెట్‌గా మాత్రమే చూస్తున్నారు. షేర్‌మార్కెట్‌లో ఒక్కసారిగా పెట్టుబడులు పెట్టి, రేటు పెంచేసి, మళ్లీ ఒక్కసారిగా విత్‌డ్రా చేసేసి, రేటు పడగొట్టి, మధ్యతరగతి ప్రజల సేవింగ్స్‌తో ఆటలాడుకుంటున్నారు. గ్లోబలైజేషన్ వలన జరిగిన ఏకైక మేలు – సేవారంగంలో భారతీయులకు అవకాశాలు రావడం! అవి ఎంతకాలం వుంటాయో ఎవరికీ తెలియదు. మనకంటె తక్కువ జీతానికి కొరియన్లు, చైనీయులు రంగంలోకి దిగినపుడు మనకి కూడా ఉద్వాసనలు తప్పవు. యుపిఏ ప్రభుత్వం పూర్తిగా రైటిస్టు విధానాలనే అవలంబించి ఔషధరంగంతో సహా అనేక కీలకరంగాలలో 100% ఎఫ్‌డిఐ (ఫారిన్ డైరక్ట్ యిన్వెస్ట్‌మెంట్) అనుమతించింది. దాంతో విదేశీ కంపెనీలు భారతీయ కంపెనీలను కొనేసి, మందుల రేట్లు పెంచేశాయి. మన కంపెనీలు వారి దేశాలలో వారితో పోటీకి దిగకుండా చూసుకున్నాయి.

మన్‌మోహన్ విధానాలు చేసిన మేలు కంటె కీడు ఎక్కువని ఒప్పుకోక తప్పదు. లాభాల్లో వున్న పబ్లిక్ సెక్టార్ యూనిట్లను కూడా అమ్మేశారు. ప్రయివేటు సెక్టార్‌కు లాభాపేక్ష తప్ప సమాజం పట్ల బాధ్యత వుండదు. పర్యావరణం పట్ల స్పృహ వుండదు. ఉద్యోగులకు ఉద్యోగభద్రత వుండదు. పన్నులు సరిగ్గా కట్టరు. ఫ్యాక్టరీల్లో రక్షణ ఏర్పాట్లు వుండవు. వాటి నుండి వెలువడే కాలుష్యాలను దగ్గరున్న నదుల్లో, చెఱువుల్లో కలిపేస్తారు. తనిఖీ చేయడానికి వచ్చిన ప్రభుత్వాధికారులను బెదిరించో, లంచాలిచ్చో లోబరుచుకుంటారు. అంతా దేనికంటె యింకాయింకా లాభాలు ఆర్జించడానికి! ప్రభుత్వ యూనిట్లలో లాభం ప్రధానం కాదు కాబట్టి, చాలాభాగం రూల్సు పాటిస్తారు. ప్రభుత్వ విధానాలను తమకు అనుకూలంగా రూపొందించుకోవడానికి ప్రయివేటు సెక్టార్ నిరంతరం ప్రయత్నిస్తూనే వుంటుంది. ఆంగ్లప్రభుత్వంలో వ్యాపారాలు చేసుకుంటూ వచ్చిన బిర్లాలు ఎటుపోయి ఎటు వచ్చినా మంచిదని కాంగ్రెసుకు కూడా విరాళాలిచ్చి మద్దతు పలికేవారు. కాంగ్రెసు ప్రభుత్వం ఏర్పడ్డాక నెహ్రూ కాపిటలిస్టులకు వ్యతిరేకి అని తెలిసి పటేల్‌ను, మొరార్జీ దేశాయ్‌ను, యితర నాయకులను దువ్వేవారు. తాము పెట్టుబడి పెట్టి కొందరు ఎంపీలను గెలిపించి తమకు అనుకూలంగా పార్లమెంటులో మాట్లాడించేవారు. అదే అదనుగా కాంగ్రెసు కాపిటలిస్టుల పార్టీ అని, రైటిస్టు పార్టీ అని కమ్యూనిస్టులు, సోషలిస్టులు యాగీ చేసేవారు. పోనుపోను మాజీ రాజులు, పారిశ్రామికవేత్తలు రాజకీయనాయకులుగా అవతారమెత్తి ప్రభుత్వ విధానాలను తమకు అనుగుణంగా మార్చుకోసాగారు. ఈ ధోరణి యిటీవలి కాలంలో విపరీతమై పోయింది. వ్యాపారస్తులే రాజకీయనాయకులుగా డబుల్ రోల్ వేస్తున్నారు. ప్రభుత్వంలో ఏ పార్టీ వున్నా వీరి హవా నడుస్తోంది. తమ ప్రభుత్వం చేత తమకే కాంట్రాక్టులు యిప్పించుకుంటారు. అలా సంపాదించిన డబ్బుతో ఎన్నికల్లో నెగ్గి మళ్లీ డబ్బు సంపాదిస్తున్నారు. ప్రజాసేవ రూటు ద్వారా టిక్కెట్టు సంపాదించే రోజులు పోయాయి.

యుపిఏ ప్రభుత్వం వున్నా, ఎన్‌డిఏ ప్రభుత్వం వున్నా రిలయన్సు వారే వెననుండి అధికారం చలాయిస్తూ వచ్చారు. ఇప్పుడు మోదీ ప్రభుత్వంలో ప్రత్యక్షజోక్యం చేసుకోబోతున్నట్లే తోస్తోంది. పెట్టుబడిదారులందరూ మోదీకి రక్షణగా నిలబడ్డారు. నిజానికి గ్లోబలైజేషన్ కారణంగా దెబ్బ తిన్న మన దేశం ఈ సోకాల్డ్ సంస్కరణలకు కళ్లెం వేసి, మిక్సెడ్ ఎకానమీని మళ్లీ తెరపైకి తెచ్చే అవసరం ఏర్పడింది. అయితే యీ కార్పోరేట్ దిగ్గజాలు దేశాన్ని దక్షిణమార్గంలోనే నడిపించదలచుకున్నారు. వీరిది ఒక చిత్రమైన పాలసీ. ఇందిర హయాంలో స్మాల్ స్కేల్ సెక్టార్‌కు కొన్ని పరిశ్రమలు కేటాయించి, వాటిలో పెద్ద కార్పోరేట్లు దిగకూడదని ఆంక్షలు విధిస్తే 'ఇది ప్రొటెక్షనిజం, యిలాటి ఆంక్షలు ఆర్థికప్రగతికి అవరోధాలు' అని వాదించేవారు. రాజీవ్ వచ్చి విదేశీ పెట్టుబడులు ఆహ్వానిస్తున్నాం అన్నాడు. వాళ్లు వచ్చి యిక్కడ పరిశ్రమలు పెడతారేమో అనుకుంటే ఎన్నారై అయిన స్వరాజ్ పాల్ వచ్చి ఎస్కార్ట్ వంటి కంపెనీల షేర్లు కొనేసి, యాజమాన్యం తన చేతిలోకి తీసుకోబోయాడు. దాంతో యీ కార్పోరేట్ దిగ్గజాలు గజగజ వణికి, 'ప్రొటెక్షనిజం వుండాలి' అంటూ హాహాకారాలు చేశారు. విదేశీ పెట్టుబడులు వుండాలి అని మీడియా తెగ ప్రచారం చేస్తుంది. 'ఓకే ప్రింటు మీడియాలో విదేశీ పెట్టుబడులు అనుమతిస్తున్నాం' అని ప్రభుత్వం అనగానే వీళ్లు 'అన్యాయం, ఆ రంగంలో మాత్రం అనుమతించకూడదు' అని ఆందోళన చేస్తారు. ఎందుకంటే వాళ్ల పోటీ ముందు వీళ్లు తాళలేరు. ప్రపంచ బ్యాంకు, విదేశీ శక్తులు అన్నీ ప్రభుత్వం ఏ నియమాలు పెట్టకూడదనీ, మార్కెట్ శక్తులకే అన్ని అధికారాలు వుండాలని వాదిస్తాయి. ఫారిన్ పెట్టుబడులను ఎక్కడపడితే అక్కడ అనుమతించాలని వాదిస్తాయి. యుపిఏ 1 ప్రభుత్వానికి కమ్యూనిస్టుల అండ అవసరమైంది. ఈ రైటిస్టు విధానాలు మరీ హద్దు మీరకుండా కమ్యూనిస్టులు చూశారు. ఇన్సూరెన్సు రంగంలో ఎఫ్‌డిఐలను వ్యతిరేకించి దేశాన్ని మెల్ట్‌డౌన్ నుండి కాపాడారు. యుపిఏ 2కి సొంతంగా మెజారిటీ రావడంతో కమ్యూనిస్టులు ఏమీ చేయలేకపోయారు. ఇప్పుడు ఎన్‌డిఏకు అంతకంటె పెద్ద మెజారిటీ వచ్చింది. వాళ్లు ఏ మార్గం పట్టినా ఎవరూ వాళ్లను నిరోధించలేరు.

ప్రయివేటు రంగం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందో ఉదాహరణ చెప్పాలంటే – మన రాష్ట్రాలలో విద్యారంగం తీసుకోండి చాలు. ప్రయివేటు ఇంజనీరింగు కాలేజీలు, మెడికల్ కాలేజీలు తామరతంపరగా పుట్టుకుని వచ్చాయి. ఇవి విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నాయి. కానీ వాటికి ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఏమీ వుండటం లేదు. సరైన ఫాకల్టీ లేదు. ఉన్నవాళ్లకి సరిగ్గా జీతాలు యివ్వరు. ప్లే గ్రౌండ్ వుండదు, లాబ్ వుండదు, కేంద్రం నుంచి టీము వచ్చి యీ లోపాలు కనిపెట్టి గుర్తింపు రద్దు చేస్తామంటే వీళ్లు రాజకీయంగా మేనేజ్ చేసి కాలేజీని నిలుపుకుంటారు. నేను చదివినది గవర్నమెంటు హైస్కూలులోనే, గవర్నమెంటు కాలేజీలోనే. మాకు తొమ్మిదో క్లాసు నుండి ప్రాక్టికల్స్ వుండేవి. ఈ రోజు యింటర్ విద్యార్థులకు టెస్ట్ ట్యూబ్ కూడా చూపించటం లేదు. ప్రాక్టికల్స్

పేర వేసే మార్కులన్నీ బోగస్సే. ఏ ఎక్విప్‌మెంట్ కళ్లతో కూడా చూడకుండా బియస్సీ, ఎమ్మెస్సీ చేసేస్తున్నారు. ఫ్యాక్టరీలో మెషినరీతో సంబంధం వున్న ఉద్యోగానికి వెళితే వాళ్లు చేర్చుకోవటం లేదు. వీళ్లు తీసుకునే ఫీజుకి, చెప్పే చదువుకి తూకం లేదు. గవర్నమెంటు స్కూళ్లు, కాలేజీలో బలోపేతం చేస్తే వీళ్ల మొహం ఎవరూ చూడరు. కానీ ప్రభుత్వం ఆ పని చేయకుండా వీళ్లు అడ్డుపడతారు. వాళ్లే డబ్బిచ్చి ఎమ్మెల్యేలను నిలబెడతారు. కొన్ని సందర్భాల్లో వాళ్లే ఎమ్మెల్యేలు, ఎంపీలు అవుతారు. వైద్యరంగంలో కూడా అదే కథ. ఆరోగ్యశ్రీ అంటూ కార్పోరేట్ హాస్పటల్స్‌లో వైద్యం చేయించనేల? వారికి ప్రభుత్వం డబ్బు కట్టనేల? ఆ నిధులను ప్రాథమిక వైద్యశాలలపై (ప్రైమరీ హెల్త్ సెంటర్) వెచ్చిస్తే కార్పోరేట్ హాస్పటల్‌కు మధ్యతరగతివాడు వెళ్ల నవసరమే లేదు. కానీ యీ కార్పోరేట్ హాస్పటల్స్ వాళ్లు ఆ పని జరగనివ్వరు. ప్రభుత్వం వాటికి నిధులు కేటాయించకుండా చేసి, ప్రభుత్వాసుపత్రికి వెళితే ఆత్మహత్య చేసుకున్నట్లే అనే ఫీలింగ్ ప్రజల్లో కలిగేలా చేస్తారు. ప్రభుత్వాన్ని ప్రభావితం చేయడానికి రూలింగ్ పార్టీకి నిధులు యిస్తారు, అదీ చాలదనుకుంటే రాజ్యసభలోకో, లోకసభలోకో ఎంపీలుగా దూరి విధానాలు మార్చేస్తారు కూడా.

ఇలాటి పరిస్థితుల్లో పటిష్టమైన ప్రభుత్వం పరిస్థితులను తన చేతిలోకి తీసుకుని, పబ్లిక్ సెక్టార్‌ను కాపాడాలి. ప్రపంచ బ్యాంకు ఆదేశాలకు లొంగకుండా తనకు కావలసిన రీతిలో దేశాన్ని మలచుకోవాలి. కానీ కార్పోరేట్లకు కావలసినది వేరు. అందుకే 'దేశం అభివృద్ధి పథంలో నడవాలంటే రైటిస్టు మార్గమే మేలు, అలా నడిపించగల సమర్థుడు మోదీయే' అనే నినాదంతో మోదీని నిలబెట్టాయి. అయితే ఆ మాట వారు చెపితే మనకు అనుమానం వస్తుంది. అందుకని కొందరు మేధావులను ముందుకు తోశారు. వారు స్వచ్ఛంద సంస్థల ద్వారా ఆ పనిని చేస్తున్నారు. 'ప్రభుత్వం చాలా తక్కువగా అధికారం వినియోగించాలి. దేనినీ నియంత్రించనక్కరలేదు, యిదే మంచి మార్గం.' అనే ఆలోచనను విద్యావంతుల మెదళ్లలో ప్రవేశపెట్టారు. 'మన్‌మోహన్ చేసినది యిదే కదా, ప్రపంచబ్యాంకు చెప్పినట్లు ఆడడమే కదా, అది మన ఆర్థికవ్యవస్థను నాశనం చేసింది కాబట్టి దానికి వ్యతిరేక దిశలో వెళ్లాలి కదా' అనేవాళ్లను అభివృద్ధి నిరోధకులుగా ముద్ర కొట్టడమే వీళ్ల పని. ఈ ఆర్థిక ప్రతిపాదనలకు జాతీయవాద రంగు, హిందూత్వ రంగు పులిమి అందించడంతో మనకు అసలు స్వరూపం తోచకుండా పోతుంది. వీరి పద్ధతులను కాదన్నవారందరూ జాతిద్రోహులే, హిందూవ్యతిరేకులే. 'మన దేశం కోసం..', 'మన హిందూమతం కోసం..' 'మన జాతి గౌరవాన్ని ప్రపంచంలో యినుమడింపచేయడానికి..' అంటూ వాళ్లు చేసే ప్రచారం విన్నప్పుడు మొదటిసారి 'తప్పేముంది?' అని పిస్తుంది. ఎంతో లోతుగా ఆలోచిస్తే తప్పు పొరలు విడవు.

'మన దేశం యిలా ఆర్థికంగా వెనకబడి వుండడానికి ముస్లిములు కుటుంబనియంత్రణ పాటించకపోవడమే..' అనే స్లోగన్ వుందనుకోండి, కుటుంబ నియంత్రణ పాటించని హిందువులు ఎంతమంది, వారిలో ఎందరు దారిద్ర్యరేఖకు దిగువన వున్నారు? పాటించే ముస్లిములెందరున్నారు? ప్రభుత్వసాయం పొందేవారిలో ముస్లిముల శాతం ఎంత? యిలాటి ప్రశ్నలకు సమాధానాలివ్వరు. గ్రాస్ జనరలైజేషన్‌తో సరిపెడతారు. 'మతాంతీకరణ వలన క్రైస్తవుల జనాభా పెరిగి, భారతదేశంలో హిందువులు మైనారిటీగా మారిపోతారు. అందుచేత మతమార్పిడులు నిషేధించాలి..' అనే నినాదం తీసుకోండి. 'ఏడాదికి ఎంతమంది మారుతున్నారు? అదే రేటు ఎన్నేళ్లు కొనసాగితే ఎంతకాలంలో హిందువులు మైనారిటీ అవుతారు? భారతదేశంలో మతమార్పిడులు యిప్పుడే వచ్చాయా? శకులు, హూణులు, కుషానులు, యవనులు.. యిలా అనేక జాతులు మనదేశంపై దండెత్తి వచ్చి, మన సంస్కృతి చూసి ముచ్చటపడి, మన జీవనస్రవంతిలో కలిసిపోయారని చదువుకున్నాం. వాళ్లకు అసలంటూ ఏదో ఒక మతం వుంటుంది కదా, అది వదిలేసి హిందూమతంలోకి మారినపుడు మతమార్పిడి జరగలేదా? అలాగే బౌద్ధులు, జైనులు ఒక కాలంలో మనదేశంలో విరివిగా వుండేవారు. వారంతా కొన్నాళ్లకి హిందూమతంలోకి మారిపోవడం వలన వాళ్ల సంఖ్య పూర్తిగా తగ్గిపోయింది. బౌద్ధులను వెతుక్కోవలసి వస్తోంది. హిందూమతంలోకి మతమార్పిడి జరిగినపుడు ఓకేనా? ఇప్పుడు మాత్రమే నిషేధించాలా? మతం మార్చుకోవడం అనేది వ్యక్తిగతం. దానిపై రాజ్యానికి హక్కు వుంటుందా? హిందూమతం విడిచి వెళ్లేవారు ఎందుకు విడిచి వెళుతున్నారో హిందూమత పెద్దలు, అభిమానులు ఆత్మపరిశీలన చేసుకుని, దిద్దుబాటు చర్యలు చేపడుతున్నారా? ఇలాటివి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు యివ్వరు. అడిగినవాళ్లను సూడో సెక్యులరిస్టులు (సూడో అనే పదం కలపందే సెక్యులరిస్టు పదాన్ని వాళ్లు వాడరు) అని నిందిస్తారు. ఆ నోటితోనే నువ్వు సోనియా భక్తుడివి, కమ్యూనిస్టువి అని కూడా తిడతారు. హిందువైతే, అచ్చమైన భారతీయుడివి అయితే మోదీని, ఆర్ఎస్ఎస్‌ను, బిజెపిని సమర్థించి తీరాలి అనే సందేశంతో వాదన ముగిస్తారు.

ఆర్ఎస్ఎస్, బిజెపి సిద్ధాంతాలపై ఏర్పడిన థింక్-ట్యాంకులు, సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించే సొసైటీలు, ఎన్‌జిఓ (స్వచ్ఛంద సంస్థలు) ఎన్నో గత దశాబ్దకాలంలో పుట్టుకుని వచ్చాయి. వీటి బాహ్యరూపం ఎకడమిక్ అధ్యయన కేంద్రాలు! వేర్వేరు సంస్థలుగా కనబడినా, వేర్వేరు ప్రాంతాలలో, వేర్వేరు కార్యకలాపాలు నిర్వహించినా వీటిని బంధించే మూలసూత్రం రైటిస్టు విధానమే. ఇటువంటి కొన్ని సంస్థలు గురించి చెప్పాలంటే – ఆర్ఎస్ఎస్-జనసంఘ్ నాయకుడు నానాజీ దేశముఖ్ 1968లో స్థాపించిన దీన్‌దయాళ్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్ గ్రామాలను స్వయంసమృద్ధిగా చేయడానికి కృషి చేస్తూ వుంటుంది. దీని జనరల్ సెక్రటరీ భారత్ పాఠక్, ఆర్గనైజింగ్ సెక్రటరీ అభయ్ మహాజన్. అనేక గ్రామాల్లో మంచి కార్యక్రమాలు చేస్తూ వుంటుంది. 1978లో ఆర్ఎస్ఎస్ నెలకొల్పిన మరో సంస్థ రాష్ట్రీయ సేవా భారతి, దీనికి అనుబంధంగా 442 సామాజిక సంస్థలున్నాయి. సోషల్ రిసెర్చి చేస్తున్నామంటారు. దీనికి అధ్యక్షుడు సూర్యప్రకాశ్ టోంక్. డా॥ జెకె బజాజ్ చెన్నయ్, ఢిల్లీలలో నడుపుతున్న సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ కేంద్రం. 1990లో స్థాపించిన ఈ సెంటర్ సోషల్ సైన్స్ రిసెర్చి ఇన్‌స్టిట్యూట్‌గా వ్యవహరిస్తూ అధికోత్పత్తి ద్వారా ఆహారభద్రత వంటి అంశాలపై

వ్యాఖ్యానిస్తుంది. ఆర్‌ఎస్‌ఎస్ భావజాలంతో ఢిల్లీలో 2008లో నెలకొల్పిన సంస్థ – ఇండియా పాలసీ ఫౌండేషన్. నిర్వాహకుడు ప్రొ. రాకేశ్ సిన్హా, అందరికీ ఆరోగ్యం చట్టం ఎలా తయారుచేయాలో నమూనా తయారుచేస్తున్నారు. డా॥ వినయ్ సహస్రబుద్ధే 1982లో ముంబయిలో స్థాపించిన రామ్‌భావూ మాళ్గీ ప్రబోధిని అనే సంస్థ పరిపాలనా వ్యవహారాలపై ఉద్యోగస్తులకు శిక్షణ యిస్తూ వుంటుంది. ఈయనే 2011లో ముంబయి, ఢిల్లీలలో పబ్లిక్ పాలసీ రిసెర్చి సెంటర్ అనే పేర 2011లో పెట్టారు. ప్రభుత్వపాలన ఎలా వుండాలో దీని ద్వారా డాక్యుమెంట్లు తయారుచేస్తున్నారు.

పుణెలో అర్థక్రాంతి ప్రతిష్ఠాన్ పెట్టిన అనిల్ బోకిల్ పన్నుల విధానానికి సంస్కరించడానికి సూచనలు చేస్తున్నారు. కంచన్ గుప్తా ఢిల్లీలో నిర్వహించే నీతి సెంట్రల్ అనే సంస్థ రైటిస్టు భావజాల వ్యాప్తికై పనిచేస్తుంది. 2013 నుండి మోదీకి మీడియాలో బాగా కవరేజి వచ్చేందుకు, బిజెపి అతన్ని ప్రధాని అభ్యర్థిగా ప్రకటించేందుకు కృషి చేసింది. ఎలక్షన్ రోజుల్లో దానికి రోజుకి 10 లక్షల హిట్లు వచ్చేవి. ఢిల్లీలోని బిజెపి హెడ్‌క్వార్టర్స్ నుండి డా॥ శ్యామా ప్రసాద్ ముఖర్జీ రిసెర్చి ఫౌండేషన్ నిర్వహిస్తున్న డా॥ అనిర్బాన్ గంగూలీ జాతీయ భద్రత, విదేశీవిధానం, ఆర్టికల్ 370లపై విధాన నిర్ణయాలు రూపొందిస్తున్నారు. కన్యాకుమారిలో వున్న వివేకానంద రాక్ మెమోరియల్‌కు అనుబంధంగా ఢిల్లీలో వివేకానంద ఇంటర్నేషనల్ ఫౌండేషన్ నడుపుతున్న అజిత్ దోవల్ టెర్రరిజంపై ప్రభుత్వ విధానం ఎలా వుండాలో కార్యక్రమాలు రూపొందిస్తున్నారు. (వివేకానందుడికి, టెర్రరిజానికి సంబంధం ఏమిటని అడగవద్దు). ఎన్నికల సమయంలో సిటిజన్స్ ఫర్ ఎక్కవుంటబుల్ గవర్నెన్స్ పేర ప్రశాంత్ కిశోర్ ఆన్‌లైన్ ద్వారా టెక్నోక్రాట్స్‌ను చేరదీసి మంచి ప్రభుత్వం కావాలంటే ప్రస్తుత ప్రభుత్వం పోవాలని ప్రచారం చేశారు. రాజేశ్ జైన్, పీయూష్ గోయల్ ఫ్రెండ్స్ ఆఫ్ బిజెపి అనే పేర ఆన్‌లైన్ సంస్థను 2009లో పెట్టి అప్పణ్నుంచి విద్యావంతులైన యువతరాన్ని బిజెపివైపు ఆకర్షిస్తూ వచ్చారు.

ఈ సంస్థల్లో మేధావులు ఎక్కువగా కనబడటం వలన తటస్థులు కూడా ఆకర్షింపబడతారు. మరి కొన్ని సంస్థలు గ్రామీణ ప్రాంతాల్లో, విపత్తు సమయాల్లో  సేవాభావంతో పనిచేసి అందరి మెప్పూ, ఆమోదం పొందుతాయి. ఆ సంస్థల అసలు లక్ష్యం ఏమిటన్నది దాని కార్యకర్తలకు గాని, అభిమానులకు గాని అర్థమే కాకపోవచ్చు. ఇలా అనేక సామాజిక సంస్థలు మోదీ యిమేజి పెరగడానికి కృషి చేశాయి, దేశప్రజలు అతనిపై,అతను ప్రవచించే విధానాలపై మితిమీరిన ఆశలు పెట్టుకునేట్లు చేశాయి. వాటిని మోదీ ఏ మేరకు నెరవేరుస్తారో, రైటిస్టు విధానం దేశాన్ని ఏ మేరకు ముందుకు తీసుకెళుతుందో కాలమే చెపుతుంది. **– (సమాప్తం)**
**– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 16-18** **వీక్లీకై  ఎమ్బీయస్ : న్యూస్, వ్యూస్, రివ్యూస్ – 51**

**ఎమ్బీయస్ : 'మనిషిలా చూస్తే చాలు..'**

'హ్యూమన్ రిసోర్సెస్ మేనేజ్‌మెంట్ అంటూ పెద్ద కబుర్లు అక్కరలేదు. నువ్వు సాధారణమైన మనిషిలా ఫీలయి, ఎదుటివాణ్ని సాటి మనిషిలా చూస్తే చాలు' అనే రూసీ మోదీ యిక లేరు. ఆయన పేరు చెప్పగానే టాటా స్టీల్ గుర్తుకు వస్తుంది. 1939లో ఆఫీసు అసిస్టెంటుగా టిస్కోలో చేరి, 1984లో ఆ సంస్థకే సిఎండి (ఛైర్మన్ కమ్ మేనేజింగ్ డైరక్టర్) అయి, 1993 వరకు ఆ కంపెనీకి సేవలందించిన రూసీ టాటా స్టీల్‌కు హెడాఫీస్ అయిన జంషెడ్‌పూర్‌కు రారాజుగా వెలిగారు. ఓసారి పుట్టినరోజుకి ఆ వూళ్లో ఏనుగుమీద వూరేగారు కూడా. ఓ రోజు ఆ వూళ్లో కారును రాంగ్‌సైడ్ పార్క్ చేసి, ఎవరికోసమో ఎదురు చూస్తూ వుంటే పోలీసువాడు వచ్చి "ఈ రోడ్డు నీ బాబుదనుకున్నావా?" అని తిట్టబోయాట్ట. "అవును, నా బాబుదే, కావాలంటే రోడ్డు పేరు చూడు." అన్నాట్ట రూసీ. నిజమే, ఆ రోడ్డుకి ఆయన తండ్రి పేరే పెట్టారు.

1918లో బొంబాయిలో వ్యాపారస్తుల కుటుంబంలో పుట్టిన రూసీ (ఆయన తండ్రికి 'సర్' బిరుదం వుండేది) విద్యాభ్యాసమంతా ఇంగ్లండ్‌లో జరిగింది. ఆక్స్‌ఫర్డ్‌లో కాలేజీలో చదువు ముగిసిన తర్వాత ఇండియాకు తిరిగి వచ్చి టిస్కోలో చేరారు. 1953లో పర్సనల్ డిపార్ట్‌మెంట్‌గా డైరక్టరుగా, 1965లో రా మెటీరియల్స్ విభాగానికి డైరక్టరుగా, 1970లో ఆపరేషన్స్‌కు డైరక్టరుగా ఎదిగాడు. ఆయన సాంకేతిక నిపుణుడు కాదు. అయినా పర్సనల్ డిపార్టుమెంటుకి డైరక్టరుగా వుండే రోజుల్లో ప్రతి ఉదయం బ్రేక్‌ఫాస్ట్ సమయంలో చుట్టూ 15 మందిని కూర్చోబెట్టుకుని కబుర్లు చెపుతూ వుండేవాడు. వాళ్ల వాళ్ల విభాగాల్లో ఏమౌతోందో కనుక్కునేవాడు. అలా టెక్నికల్ విషయాలపై పట్టు వచ్చింది. పై స్థాయికి వెళ్లినప్పుడు కూడా ఆయన యీ అలవాటు వదలలేదు. ఎండి అయిన తర్వాత కూడా వివిధ వర్క్‌షాపులకు వెళ్లి పనివారిని కలిసి పేరుపేరునా పలకరించేవాడు. వారి గోడు వినేవాడు. "90 శాతం కేసుల్లో వారి బాధలు నేను తీర్చలేనివి. అయినా తమ కష్టం చెప్పుకున్నామన్న తృప్తి వారికి వుండేది." అనేవాడు రూసీ.

ఒకసారి ఒక ఖరీదైన యంత్రాన్ని పొరబాటున పాడుచేసినందుకు శిక్షగా ఒక పనివాణ్ని ఉద్యోగంలోంచి తీసేశారు. అతను వెళ్లబోయేముందు వీడ్కోలు చెప్పడానికి రూసీని కలిశాడు. విషయం తెలుసుకున్న తర్వాత ఆయన అతని రికార్డు తెప్పించి చూసి నైపుణ్యం గల పనివాడని గ్రహించాడు. జరిగినది కేవలం పొరబాటు వలననే అని తెలుసుకున్నాడు. "యంత్రాన్ని పోగొట్టుకోవడం కంటె మంచి పనివాణ్ని పోగొట్టుకోవడం మరింత ఖరీదైన వ్యవహారం." అంటూ అతన్ని మళ్లీ ఉద్యోగంలో నియమించాడు. కార్పోరేట్ రంగంలో రూసీని చాలా గౌరవంగా తలచుకుంటారు.  టాటా స్టీల్ ద్వారా భారతీయ పరిశ్రమకు ఆయన చేసిన సేవలకై భారత

ప్రభుత్వం ఆయనకు 1989లో పద్మభూషణ్ యిచ్చింది.

ఆయనకు హాబీలు కూడా వున్నాయి. పియానో వాయించేవాడు. ఆక్స్‌ఫర్డ్‌లో యితను పియానో వాయిస్తూ వుంటే పక్కవాయిద్యంగా ఐన్‌స్టీన్ వయోలిన్ వాయించాడు. విపరీతంగా పుస్తకాలు చదవడం, కళాత్మక వస్తువులు సేకరించడం, వంట చేయడం చాలా యిష్టం. విక్టోరియా మెమోరియల్‌ను ప్రజలు రాత్రివేళ కూడా చూడడానికి వీలుగా రూ.28 లక్షలు విరాళం యిచ్చి లైట్లు ఏర్పాటు చేయించిన ఉదారుడు. టాటా యాజమాన్యంతో విభేదాలు తలెత్తి ఆయన 1993లో టాటా స్టీల్ నుండి తప్పుకున్నాడు. ఎయిర్ ఇండియా, ఇండియన్ ఎయిర్‌లైన్సుకి చైర్మన్‌గా కొద్దికాలం చేశాడు కానీ అక్కడ రాణించలేదు. జీవిత చరమాంకం కలకత్తాలోనే గడిపాడు. అక్కడే యీ మే 17 న స్వర్గస్తుడయ్యాడు.**- ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : సారీ, గుజరాతీ..

శివసేన పార్టీ వారి అధికార పత్రిక "సామ్నా" మే 1 నాటి సంపాదకీయంలో మహారాష్ట్రలోని గుజరాతీలపై విరుచుకు పడడం జరిగింది. "ఇక్కడ నివసిస్తూ, దినదినం అభివృద్ధి చెందుతూన్న గుజరాతీలు స్థానిక నాయకులను పట్టించుకోకుండా గుజరాతీ కదాని మోదీకి జేజేలు పలుకుతున్నారు." అని. మూడు దశాబ్దాల క్రితం శివసేన గుజరాతీలకు వ్యతిరేకంగా ఉద్యమం నడిపి, వారి దుకాణాలను తగలబెట్టింది. మళ్లీ ఆ రోజులు తిరిగి వస్తాయేమోనని గుజరాతీలు భయపడ్డారు. మే 1 నాటికి శివసేన-బిజెపిల మధ్య పొత్తు సరిగ్గా కుదరలేదు. ఎవరికి వారే ఎక్కువ సీట్లు అడుగుతున్నారు. పైగా శివసేనకు ప్రతిపక్షమైన ఎంఎన్‌ఎస్‌తో బిజెపి ఓ పక్కనుంచి బేరసారాలు ఆడుతోంది. ఈ సంపాదకీయం వెలువడగానే గుజరాతీలు, బిజెపి గొడవ పెట్టాయి. 'అది సామ్నా సంపాదకుడి అభిప్రాయం తప్ప, పార్టీ సిద్ధాంతం కాదు' అని ఉద్ధవ్ ఠాకరే వివరణ యిచ్చారు. చివరకు పొత్తు కుదిరింది. ఎన్నికలలో యిద్దరూ లాభపడ్డారు. ముంబాయిలో శివసేన ఆశ్చర్యకరంగా మూడు సీట్లు గెలుచుకుంది. లెక్కలేసి చూస్తే ఓటర్లలో 18% మంది గుజరాతీలే అని తేలింది. ఇక శివసేన రిపేరు పని మొదలుపెట్టింది. గుజరాతీలు ప్రధానంగా వున్న ప్రాంతాలలో శివసైనికులు యిల్లిల్లూ తిరిగి తమ పార్టీని గెలిపించినందుకు ధన్యవాదాలు తెలుపుతారట, 'సామ్నా' సంపాదకీయానికి క్షమాపణ చెప్తారట. ఇంత పశ్చాత్తాపం దేనికంటె అసెంబ్లీ ఎన్నికలు రాబోతున్నాయి. ఇప్పుడైతే మోదీని ప్రధాని చేయడానికి ఓట్లేసి వుండవచ్చు, అప్పుడు ఆ అంశం వుండదు కదా, అదీ భయం! **- ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : ఆ మాట - జైరాం నోట!!?!!

ఎన్నికల ఫలితాలపై యిచ్చిన "ఫ్రంట్‌లైన్"కు యిచ్చిన యింటర్వ్యూలో కాంగ్రెసు ఓటమి గురించి జైరాం రమేశ్ వాపోయారు - "గత పదేళ్లలో డిజిపి అభివృద్ధి రేటు 8% వుంది. 14 కోట్ల మంది దారిద్ర్యరేఖ నుండి బయటపడ్డారు. 2005లో సమాచారహక్కు చట్టం తెచ్చాం. 2013లో భూమి స్వాధీన చట్టం తెచ్చాం. ఎన్‌రేగా (పనికి ఆహారపథకం) స్కీము ప్రవేశపెట్టాం. యుపిఏ అధికారంలోకి వచ్చినపుడు 3 కోట్ల మొబైల్ ఫోన్లు వుంటే యీ రోజు 90 కోట్ల ఫోన్లు వున్నాయి. ఫోన్లు, ఆధునిక కమ్యూనికేషన్ సౌకర్యాలు బిజెపి ప్రచారానికి ఉపయోగపడ్డాయి. ఎన్నో గొప్పపనులు చేసినా మేం చెప్పుకోలేకపోవడం వలన వెనకపడ్డాం. కమ్యూనికేషన్‌లో, నిధుల విషయంలో మేం బిజెపితో పోటీ పడలేకపోయాం. అటు మోదీ 2013 సెప్టెంబరు నుండి ఉధృతంగా ప్రచారం చేస్తూ పోయారు. యుపి, బిహార్‌లలో ఆయన ఓట్లను కేంద్రీకృతం చేశారు. దేశంలో వీస్తున్న కాంగ్రెసు వ్యతిరేక పవనాలను ఆయన తనకు అనుకూలంగా మలచుకున్నాడు. కాంగ్రెసు పక్షాన ప్రధానమంత్రి, అధ్యక్షురాలు, ఉపాధ్యక్షుడు ఆయనంత ప్రభావవంతంగా కమ్యూనికేట్ చేయలేకపోయారు. సోనియా, రాహుల్ మర్యాదస్తుల్లా మాట్లాడారు, మోదీ, సుష్మ దూకుడుగా మాట్లాడి ఓటర్లను ఆకర్షించారు. మన్‌మోహన్ మృదుభాషి కావడంతో, మోదీ అంత మొనగాడు కాదన్న అభిప్రాయం జనంలో కలిగింది. పదేళ్లలో మొదటి ఏడెనిమిదేళ్లు అంతా బాగా వుందన్న ఫీలింగు దేశప్రజల్లో వుండేది. చివరి రెండు, మూడు సంవత్సరాలలో అవినీతి ఆరోపణలు, అన్నా హజారే ఉద్యమం వంటివి కాంగ్రెసు యిమేజిని ధ్వంసం చేశాయి."

ఇన్ని చెప్పి ఆయన చివర్లో అన్నదేమిటంటే - "ఇప్పుడు మళ్లీ మేము కోలుకోవాలంటే రాష్ట్రస్థాయిలో లీడర్లను బలోపేతం చేయాలి. 1950ల నాటి కాంగ్రెసు సంస్కృతిని మళ్లీ తీసుకురావాలి. నిర్ణయాలు రాష్ట్రస్థాయిలోనే తీసుకోవాలి. అసలు ఆంధ్రప్రదేశ్‌ను ఎందుకు విభజించారో నాకు యిప్పటికీ అర్థం కావటం లేదు!" ఇదీ జోక్! విభజన ఛాంపియన్‌గా, అన్నీ నేనే చూసుకుంటున్నాను మీకేం తెలుసు అంటూ రాష్ట్రనాయకులను పూచికపుల్లలా తీసిపారేస్తూ వచ్చిన జైరాం యీనాడు విభజన కారణంగా కాంగ్రెసు అధోగతికి చేరగానే ఆ నిర్ణయంతో తనకేం సంబంధం లేనట్లు మాట్లాడుతున్నాడు. ఢిల్లీనుండే సకల ఆదేశాలు యిస్తూ వచ్చినవాడు, యీనాడు హఠాత్తుగా ప్లేటు ఫిరాయించి రాష్ట్ర నాయకత్వం బలపడాలంటున్నాడు. హౌ ఫన్నీ !**- ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : డి-కంపెనీకి డి-డే?

దావూద్ ఇబ్రహీం పని పడతానని మోదీ అనడం భారతీయులను ఎంతో సంతోషపెట్టింది. ఐయస్ఐ ఛత్రచ్ఛాయల్లో పాకిస్తాన్‌లో తిష్ఠ వేసి అక్కణ్నుంచి భారతదేశ విధ్వంసానికి కుట్రలు పన్నుతూన్న దావూద్‌పై భారతీయులకు పీకలదాకా కోపం వుంది. అమెరికా వాళ్లు హఠాత్తుగా దాడి చేసి, బిన్ లాడెన్‌ను చంపివేసిన రీతిలో మోదీ కూడా దావూద్ స్థావరంపై దాడి చేసి సజీవంగానో, నిర్జీవంగానో పట్టుకుంటే అతని ఖ్యాతి మిన్ను ముట్టుతుందనడంలో సందేహం లేదు. 'ఈ పని యిన్నాళ్లూ కాంగ్రెసు చేయకపోవడానికి కారణం, పాకిస్తాన్‌తో కుమ్మక్కవడం, ముస్లిము ఓట్లు పోతాయన్న భయం, విదేశీవనితకు భారతీయ ప్రతిష్ఠపై ఖాతరీ లేకపోవడం' అని బిజెపి ప్రచారం చేసిందంటే కాంగ్రెసు పరువు యింకా అధఃపాతాళంలో పడిపోతుంది. ఇదంతా వూహించుకోవడానికి బాగానే వుంది కానీ దావూద్ నిజంగా చిక్కుతాడా? అసలు యిప్పుడెక్కడ, ఎలా వున్నాడు?

బాబ్రీ మసీదు విధ్వంసానికి వ్యతిరేకంగా 1993లో ముంబయిలో దావూద్ వరుస పేలుళ్లు ఏర్పాటు చేసిన దగ్గర్నుంచి అతని సైన్యంలో మతపరంగా చీలికలు వచ్చాయి. హిందువులైన సంతోశ్ శెట్టి, విక్కీ మల్‌హోత్రా, రోహిత్ వర్మ, రవి పూజారి, ఆబూ సావంత్ దావూద్‌ను వీడి అతని ఒకప్పటి అనుచరుడు, ప్రతికక్షి అయిన ఛోటా రాజన్ చెంత చేరారు. వారి సహాయంతో దావూద్ ఆచూకీ సంపాదించిన ముంబయి పోలీసులు అరడజను మంది సభ్యులతో ఒక టీము ఏర్పరచి రహస్యంగా కరాచీకి వెళ్లి దావూద్‌పై దాడి చేసి సజీవంగా పట్టి తెద్దామని ప్రణాళిక రచించారు. అది అనుమతి కోసం అప్పటి పివి కాబినెట్‌లోని హోం మంత్రి శంకర్‌రావు చవాన్ వద్దకు వెళ్లింది. ముంబయికి చెందిన చవాన్‌కు, దావూద్‌కు ఏం లింకులున్నాయో తెలియదు కానీ ఆయన ఆ ప్లాను క్లియర్ చేయలేదు. దావూద్ పోనుపోను బలం పుంజుకుని మరిన్ని ఘాతుక చర్యలకు ఒడిగట్టాడు. అతనిపై అలుపెరుగకుండా పోరాటం చేస్తూ వచ్చినది – ఛోటా రాజన్. అతను దావూద్ గ్రూపుకి చెందిన సునీల్ సావంత్, పీలూ ఖాన్‌లను దుబాయిలో చంపిన తర్వాత ఈస్ట్‌వెస్ట్ ఎయిర్‌లైన్సు ఎండీ తకియుద్దీన్ వాహిద్‌ను 1995లో ముంబయిలో చంపేశాడు. వాహిద్ దావూద్ ఫైనాన్షియర్.

అప్పుడు దావూద్ రాజన్‌ను చంపడానికి మున్నా జింగాడాను బ్యాంగ్‌కాక్ పంపాడు. రాజన్ గ్రూపు పార్టీ చేసుకుంటూండగా దాడి జరిగి, అతని అనుచరులు కొందరు చచ్చిపోయారు. అతనికి తీవ్రమైన గాయాలయ్యాయి. ఇండియన్ సెక్యూరిటీ ఏజన్సీలే రాజన్‌ను ఆసుపత్రిలో చేర్పించి నయం చేయించారని, థాయ్‌లాండ్ నుండి క్షేమంగా పారిపోవడానికి సహకరించారని అంటారు. ఈ దాడి తర్వాత రాజన్‌కు భయం పట్టుకుంది. అతనికి కిడ్నీ పాడైందని అంటారు కూడా. తను బయటకు రాకుండా తన కింద చిన్న ఉద్యోగియైన ఆబూ సావంత్‌ను తన ప్రతినిథిగా నియమించాడు. సావంత్ యిప్పుడు ఇప్పుడు రాజన్ ఆస్తిపాస్తులు చక్కబెడుతూ హోటళ్లలో పెట్టుబడి పెడుతూ సామ్రాజ్యాన్ని వృద్ధి చేస్తున్నాడు. రాజన్ పరిస్థితి యిలా వుంటే అటు దావూద్‌కు 2011లో రెండు సార్లు గుండెపోటు వచ్చింది. అతని మూడో తమ్ముడు అనీస్ అతనితోనే వుంటాడు కానీ అతనికి కోపం ఎక్కువ. దాంతో అతను తన పనుల్ని ఛోటా షకీల్‌కు అప్పగించాడు. ఇండియా ఆపరేషన్సన్నీ షకీల్ కరాచీ నుంచే చక్కబెడుతున్నాడు.

దావూద్ యింకో తమ్ముడు ఇక్బాల్ కస్కర్ ముంబయిలో వున్నాడు. అతనిపై కేసులేవీ లేవు కాబట్టి పోలీసులు అతని జోలికి వెళ్లటం లేదు. తనకు గుండెపోటు వచ్చిన మరుసటి ఏడు దావూద్ తన సొంత తమ్ముళ్లయిన హుమయూన్, ముస్తకీన్‌లను కరాచీ నుండి ఇండియాకు పంపి తన తరఫున వ్యవహారాలు చక్కబెట్టమన్నాడు. వాళ్లపై పెద్దగా కేసులు లేవు కదాని అతని ఆలోచన. అయితే షకీల్ '26/11 దాడుల తర్వాత ప్రజలు, పోలీసులు నీపై కోపంగా వున్నారు. వీళ్లని పంపితే కోర్టుల మాట ఎలాగున్నా ప్రజలు చీల్చి చెండాడతారేమో..' అని భయపెట్టాడు. దావూద్ యిక ఆ ఆలోచన విరమించుకుని సమస్తం షకీల్ చేతిలోనే పెట్టి కూర్చున్నాడు. దావూద్ ఆర్థిక వ్యవహారాలు చక్కబెట్టే ఇక్బాల్ మిర్చి 2013లో లండన్‌లో గుండెపోటుతో మరణించాడు. ఆ తర్వాత షకీల్ మరింత బలపడ్డాడు. షకీల్ చాలా తెలివైనవాడు. ముంబయిలో దంధాలన్నీ తన అనుచరుల ద్వారా నడిపిస్తాడు. రియల్ ఎస్టేటు తగాదాలు వంటివి పరిష్కరిస్తూ వుంటాడు. బేరాలు తెగక వ్యవహారం చెడిపోయే సమయంలోనే తను ప్రవేశిస్తాడు. విషయం తేల్చేస్తాడు. అతని వెనక దావూద్, ఐయస్ఐ వున్నాయన్న విషయం తెలిసిన క్లయింట్ భయంతో సరేనంటాడు. ఇవన్నీ ముంబయి పోలీసులకు తెలుసు. అయినా కంట్రోలు చేయడం లేదు. రేపు మోదీ ప్రభుత్వం ఏదైనా ఆపరేషన్ ప్లాన్ చేసినా దావూద్‌కు సన్నిహితులైన ముంబయి పోలీసు పెద్దలు అతనికి ముందుగానే సమాచారం అందిస్తారని అందరికీ సందేహం. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : శారదా చిట్‌ఫండ్ బాధితుల గోడు

తృణమూల్ నాయకులు శారదా చిట్ ఫండ్ కంపెనీకి సన్నిహితంగా మెలగుతూ, వారి వేదికలపై కనబడి, 'శారదావారు నిరుద్యోగసమస్య పరిష్కరించడానికి గొప్ప సేవలు చేస్తున్నారు, మీ అందరూ వారి ఏజంట్లుగా మారండి' అని ఉపన్యాసాలిచ్చినపుడు అనేకమంది గ్రామీణ మహిళలు ఆ కంపెనీకి ఏజంట్లుగా మారేరు. వాళ్లందరికీ ఏది ప్రభుత్వ కంపెనీయో, ఏది ప్రయివేటు కంపెనీయో తెలియలేదు. కంపెనీలో పెట్టిన డబ్బుకి మమతా బెనర్జీ ప్రభుత్వం హామీ వుంటుంది అనుకున్నారు. 'మీరు పెట్టిన పెట్టుబడి మూడేళ్లలో రెట్టింపు అవుతుంది, ఏడేళ్లలో నాలుగు రెట్లవుతుంది, పన్నెండేళ్లలో పది రెట్లు అవుతుంది' అని కంపెనీ చెప్తూంటే నమ్మి,

తాము స్వయంగా పెట్టుబడి పెట్టి, యితరుల చేత కూడా పెట్టించారు. శారదా స్కామ్ బయటపడిన తర్వాత 10 లక్షల మంది ఏజంట్ల బతుకు బండలైంది. అనేక రకాల ఒత్తిళ్లు ఎదుర్కుంటున్నారు. మహిళలైతే అదనపు ఒత్తిళ్లు కూడా! శారదా స్కాము రూ.2500 కోట్ల స్కామ్. తృణమూల్ సహాయంతో శారదా యాజమాన్యం యీ డబ్బు ఎక్కడో దాచేసిందని ప్రజలకు సందేహం. కంపెనీ చాలా పెద్దపెద్ద లాయర్లను తన తరఫున నియమించుకుని కోర్టులో పోరాడుతోంది. మాజీ కేంద్రమంత్రి చిదంబరం భార్య నళిని ఆ లాయర్లలో ఒకరు. ఇక కేసు ఎలా నడుస్తుందోనని సాధారణ ప్రజలకు బెంగ.

తనపై వస్తున్న ఆరోపణలు తప్పించుకోవడానికి మమతా బెనర్జీ 'దీనిలో పెట్టుబడి పెట్టిన వారి అసలు ధనం రాష్ట్రప్రభుత్వం యిచ్చేస్తుంద'ని ప్రకటించింది. 'ఆశపోతుతనంతో ఎవరో ఎక్కడో పెట్టుబడి పెట్టి నష్టపోతే వారికి ప్రజాధనం చెల్లించడమేమిటి? రేపు యింకో కంపెనీ కూడా యిలా చేస్తే..?' అని కొందరు విమర్శించారు. నిజానికి యిప్పటికే యిలాటి 12 చిట్ ఫండ్స్ మూతపడ్డాయి. మరి వాళ్లకీ యిస్తారా? అని అడిగారు. రాష్ట్ర పోలీసులు కుమ్మక్కవుతారని సందేహించిన సుప్రీం కోర్టు శారదా స్కాము విచారణను సిబిఐకు అప్పగించింది. అది అవమానంగా భావించిన మమత "అయితే డబ్బు తిరిగి యిచ్చే బాధ్యత కూడా కేంద్రప్రభుత్వానిదే' అనేసింది. ఇలా డబ్బు ఎప్పుడు తిరిగివస్తుందో రాదో తెలియదు కానీ యీలోగా మహిళా ఏజంట్లను పట్టుబడి పెట్టిన మగ క్లయింట్లు వేధిస్తున్నారు. 'డబ్బు తిరిగి యివ్వకపోతే మా కోరిక తీర్చు' అంటున్నారు. మథురాపూర్‌లో యిమిటేషన్ జ్యూయలరీ తయారుచేసే ఆమె వందమందిని చేర్పించింది. ఆమె యీ బెదిరింపుల వలన పొద్దున్నే లేచి యింట్లోంచి బయటకు వెళ్లి, నిద్రపోయే వేళకే యింటికి తిరిగి వస్తోంది. మొగుడు లారీ డ్రైవర్, యింటిపట్టున దొరకడు. పిల్లలిద్దర్నీ పెళ్లయిన పెద్ద పిల్ల దగ్గరకి పంపేసింది. 100 మంది క్లయింట్లున్న ఆమెకే యీ కష్టం వుంటే 300 మందిని చేర్పించిన హాబ్రా నివాసి గతి వూహించుకోవచ్చు. 'కిడ్నాప్ చేసి రేప్ చేస్తాం జాగ్రత్త' అని బెదిరిస్తున్నారు. ఇంకొకామె విషయంలో ఆమె ఏజంటుగా చేరి డబ్బు సంపాదించినంతకాలం మౌనంగా వున్న భర్త, యిప్పుడు యీ చిక్కులు రాగానే 'ఎందుకొచ్చిన వేషాలివి, నోరు మూసుకుని కూర్చోక..' అంటూ రోజు చావగొడుతున్నాడు. దీపిక విషయంలో ఆమె తన అత్తమామలకు చెప్పి కంపెనీలో డబ్బు పెట్టించింది. ఇప్పుడు డబ్బు పోయిందని తెలియగానే ఆమెను యింట్లోంచి పొమ్మనమని వాళ్లు గోల చేస్తున్నారు. కూతురు పెళ్లికై రూ.లక్ష దాచుకున్న ఒకామె పరిస్థితి మరీ ఘోరం. ఆమె కూతురి పెళ్లి ఆగిపోయింది. సొమ్మూ పోయి దుమ్మూ పట్టె అంటే యిదే కాబోలు.– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)

## ఎమ్బీయస్ : అక్కడ రాహుల్ – ఇక్కడ స్టాలిన్

తమిళనాడులో డిఎంకె పార్టీ ఘోరపరాజయం పొందింది. ఎడిఎంకె ఒంటరిగా పోటీ చేస్తోంది కాబట్టి, మనమూ చేయాలి అంటూ స్టాలిన్ ఎగదోయడంతో కరుణానిధి, తన పాతమిత్రులందరినీ బిజెపి పాలు చేసి ఒంటరిగా పోటీ చేశాడు. డిఎంకెకు ఎప్పటిలా 23% ఓట్లు వచ్చాయి. ఎడిఎంకె ఓట్లు 32% నుండి పెరిగి 45%కు చేరాయి. 37 సీట్లు గెలిచింది. బిజెపి, దాని మిత్రపక్షాలు కలిసి 18.6% ఓట్లు గెలుచుకోవడమే కాదు, 5 నియోజకవర్గాలలో ద్వితీయస్థానాన్ని పొంది, డిఎంకెను మూడో స్థానానికి నెట్టేశాయి. అభ్యర్థుల ఎంపిక, ప్రచారం సమస్తం తనపై వేసుకుని పోరాడిన స్టాలిన్ పరువు పోయింది. ఫలితాలు వచ్చిన మూడో రోజున అతను రాజీనామా చేశాడన్న వార్తలు వచ్చాయి. కరుణానిధి నడిగితే అంతా పుకార్లు అన్నాడు. కాన పార్టీ జనరల్ సెక్రటరీ దురై మురుగన్ 'స్టాలిన్ రాజీనామా సమర్పించాడు కానీ పార్టీ ఆమోదించలేదు' అని చెప్పాడు. ఢిల్లీలో రాహుల్, సోనియా రాజీనామాలు తిరస్కరించి డ్రామాయే చెన్నయ్‌లో నిర్వహించారు.

స్టాలిన్ అవస్థ అళగిరికి అమితానందం చేకూర్చింది. అతన్ని వెనక్కి తీసుకుని పార్టీని పటిష్టపరుస్తారా అని అడిగితే కరుణానిధి, 'అళగిరి పార్టీలో వున్నపుడు కూడా డిఎంకె గతంలో మూడుసార్లు ఓడిపోయింది. అళగిరిని నేను పూర్తిగా మర్చిపోయాను. మీరూ మర్చిపోండి.' అన్నాడు. కరుణానిధి తదనంతరం పార్టీ పగ్గాలు స్టాలిన్‌కి వస్తాయని అందరూ అనుకుంటున్నారు కానీ అతనికి, తండ్రికీ చాలా తేడా వుందని ఎన్నికల ఫలితాలు చెప్పాయి. స్టాలిన్ కరుణానిధిలా చదువరి కాదు, రచయిత కాదు, అందర్నీ కలుపుకుని పోయే స్వభావం కలవాడు కాదు, ఎత్తుపైయెత్తుల్లో చాణక్యుడు కాడు. ఎంజియార్ బతికి వుండగా డిఎంకె 13 ఏళ్లపాటు అధికారానికి దూరంగా వున్నా కరుణానిధి ఏదో ఒక ఉద్యమం, కార్యక్రమం చేపడుతూ తన పార్టీని బతికించుకున్నాడు. స్టాలిన్‌కు ఆ సత్తా లేదు. మొన్నటి ఎన్నికలలో 1.30 కోట్ల కొత్త ఓటర్లు వచ్చారు. వారు డిఎంకెకు ఓటేయలేదు. 2 జి స్కాము వంటి అవినీతి ఆరోపణలతో డిఎంకె ప్రతిష్ట మంటగలిసింది. ఇలాటి పరిస్థితుల్లో 2016 ఎసెంబ్లీ ఎన్నికల సమయానికి స్టాలిన్ పుంజుకోగలడా అన్నది సందేహమే. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 19**

## ఎమ్బీయస్ : మోదీ టీము

మోదీ పిఎంఓ (ప్రధానమంత్రి కార్యాలయం)లో సహజంగానే తన సన్నిహితులను నియమించుకున్నారు. 2001 నుండి తనకు పర్సనల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న ఓం ప్రకాశ్ సింగ్ చందేల్, దినేశ్ ఠాకూర్‌లను ఢిల్లీకి తెచ్చారు. గుజరాత్‌లో వుండగా తనకు

పిఆర్ఓ (పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్)గా పని చేసిన జగదీశ్ ఠక్కర్‌ను యిప్పుడు చీఫ్ పిఆర్ఓగా వేశారు. ప్రిన్సిపల్ సెక్రటరీ పదవి చాలా ముఖ్యమైనది. పిఎంఓకు, కాబినెట్ సెక్రటేరియట్‌కు, వివిధ మంత్రిత్వశాఖల సెక్రటరీలకు మధ్య సమన్వయం చేయడం అతని బాధ్యత. దానికి ముగ్గురి పేర్లు సూచించబడ్డాయి. హెూం సెక్రటరీగా పని చేసిన అనిల్ బైజాల్‌కు తెలివితేటలు, నిజాయితీ, పలుశాఖల్లో అనుభవం – అన్నీ వున్నాయి. అయినా ఆయన ఒకప్పుడు ఎల్ కె అడ్వాణీకి సన్నిహితుడన్న కారణంగా పక్కకు పెట్టారు. దీపక్ భట్టాచార్యకు కూడా యీ గుణాలన్నీ వున్నాయి కానీ ఆయన ఆరోగ్యం మరీ అంత దృఢమైనది కాకపోవడంతో పేరు కొట్టేశారు. మోదీ ఉదయం పదిన్నర నుండి రాత్రి 8 గంటల వరకు పనిచేస్తాడు, చేయిస్తాడు. అంతటి శ్రమ తట్టుకునే శక్తి భట్టాచార్యకు లేదని అమిత్ షా అభిప్రాయం. ఇక మూడో పేరు నృపేంద్ర మిశ్రా. ఉత్తర్ ప్రదేశ్‌కు చెందిన యీయన 1967 ఐయేయస్ బ్యాచ్. అలహాబాద్ యూనివర్శిటీలో డిగ్రీ చదివి, హార్వర్డ్‌లో మాస్టర్స్ చేశారు. ఉత్తర ప్రదేశ్‌లో కేంద్రంలో ముఖ్యపదవులు నిర్వహించడంతో బాటు ఐఎంఎఫ్ (ఇంటర్నేషనల్ మానిటరీ ఫండ్), వరల్డ్ బ్యాంక్, ఏసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకులలో కూడా పనిచేశారు. బిజెపికి చెందిన కళ్యాణ్ సింగ్ యుపి ముఖ్యమంత్రిగా వుండగా ఆయనకు ప్రిన్సిపల్ సెక్రటరీగా పనిచేశారు.

2004లో ఎన్‌డిఏ అధికారంలోకి వస్తే కాబినెట్ సెక్రటరీ అవుతారని అనుకున్నారు కానీ యుపిఏ అధికారంలోకి వచ్చింది. వాళ్లు కూడా యీయన సేవలను కామర్స్, కెమికల్స్–ఫెర్టిలైజర్స్, టెలికామ్ రంగాల్లో వినియోగించుకున్నారు. టెలికామ్ సెక్రటరీగా చేసిన తర్వాత ట్రాయ్ (టెలికామ్ రెగ్యులేటరీ అథారిటీ ఆఫ్ ఇండియా)కి 2006లో చైర్మన్ అయ్యారు. అప్పట్లో టెలికామ్ మంత్రిగా వున్న 2 జి స్కామ్ నిందితుడు ఎ.రాజా వేలం పద్ధతి కాకుండా ఫస్ట్ కమ్, ఫస్ట్ సెర్వ్‌డ్ (ముందు ఎవరొస్తే వాళ్లకి యివ్వాలి) పద్ధతి పాటించడం చేత చాలా నష్టం జరిగింది. ఆ కేసులో విషయంలో కోర్టులో రాజా ప్రకటన చేస్తూ అలా చేయమని ట్రాయ్ అధినేత చెప్పారని కోర్టులో వాదించాడు. ప్రాసిక్యూషన్ సాక్షిగా వచ్చిన మిశ్రా "అది అబద్ధం, వేలం వేయమనే ట్రాయ్ చెప్పింది. కానీ మంత్రి పట్టించుకోలేదు' అని సాక్ష్యం చెప్పడమే కాకుండా 'అప్పటి టెలికామ్ సెక్రటరీ సిద్ధార్థ బెహురా "మేం అనుసరించిన ఫస్ట్ కమ్, ఫస్ట్ సెర్వ్‌డ్ విధానం యింతకుముందు నుండి అమల్లో వున్నదే' అని ట్రాయ్‌కు లేఖ రాసినట్లు వెల్లడించారు. మిశ్రా కనబరిచిన యీ ధైర్యం బిజెపి నాయకులను ఆకట్టుకుంది. ఈనాడు యీ పదవి దక్కేట్లు చేసింది. అయితే ట్రాయ్ చైర్మన్‌గా పనిచేసిన వ్యక్తి పదవీ విరమణ తర్వాత ఏ పదవీ చేపట్టకూడదని నియమం వుంది. ఒక ఆర్డినెన్స్ ద్వారా యీ అడ్డంకి తొలగించారు. గుజరాత్ క్యాడర్‌కు చెందిన రిటైర్డ్ ఐయేయస్ అధికారి ప్రమోద్ కుమార్ మిశ్రాను అడిషనల్ ప్రిన్సిపల్ సెక్రటరీగా వేశారు. మోదీ ముఖ్యమంత్రిగా వుండగా కూడా ఆయన గుజరాత్‌లో అదే పదవిలో పనిచేశాడు. 1972 బ్యాచ్‌కు చెందిన ఆయన 2008లో కేంద్రం నుండి అగ్రికల్చర్ సెక్రటరీగా రిటైరయ్యాక గుజరాత్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్ చైర్మన్‌గా మోదీ నియమించారు. ఇప్పుడు గుజరాత్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌కు డైరక్టరు జనరల్‌గా పనిచేస్తున్నారు.

ఇక కాబినెట్ విషయానికి వస్తే మోదీ తనకు అత్యంత సన్నిహితులు, ప్రచారంలో తనకు తోడ్పడిన ఆరుగురిని మంత్రిపదవులతో సత్కరించారు. వారిలో 38 ఏళ్ల స్మృతి ఇరానీకి హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ శాఖలో కాబినెట్ ర్యాంకు దక్కింది. ఆమె చదివినది తక్కువే. "క్యోంకి సాస్ భీ కభీ బహూ థీ" టీవీ సీరియల్ ద్వారా అందరికీ తెలిసిన స్మృతి 2003లో బిజెపిలో చేరింది. 2004లో చాందినీ చౌక్ నియోజకవర్గంలో కపిల్ సిబ్బల్‌తో పోటీ చేసి ఓడిపోయింది. ఈ సారి అమేఠీలో రాహుల్‌తో ఓడిపోయింది కానీ గట్టిపోటీ యిచ్చింది. కానీ 2011లోనే గుజరాత్ నుండి రాజ్యసభ మెంబరుగా ఎన్నికైంది కాబట్టి చింత లేదు. మహిళా మోర్చా నాయకురాలిగా టీవీల్లో, బహిరంగ చర్చల్లో మోదీని వెనకేసుకుని రావడంలో ఆమె దిట్ట. 20 ఏళ్లపాటు బిజెపి కోశాధికారిగా పనిచేసిన వేద్ ప్రకాశ్ గోయల్ కుమారుడు పీయూష్ గోయల్ చార్టర్డ్ ఎక్కవుంటంట్. 49 ఏళ్లు. నదుల అనుసంధానం టాస్క్ ఫోర్స్‌లో గతంలో వున్నాడు. గుజరాత్ మోడల్ ఘనతను టీవీ చర్చల్లో, పారిశ్రామికవేత్తల సమావేశాల్లో గట్టిగా వినిపించాడు. రోజూ మీడియాతో సంభాషిస్తూ ఐటీ, మార్కెటింగ్ టీములను సమన్వయపరచాడు. అతనికి పవర్, కోల్, రిన్యూవబుల్ ఎనర్జీ శాఖలో యిండిపెండెంట్ చార్జితో సహాయమంత్రి పదవి దక్కింది.

54 ఏళ్ల నిర్మలా సీతారామన్ తమిళనాడుకి చెందినవారు. ఢిల్లీలో జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్శిటీలో చదివారు. పెళ్లయ్యాక హైదరాబాదు వచ్చి ప్రణవ స్కూల్ పెట్టారు. 2006లో బిజెపిలో చేరారు. నేషనల్ కమిషన్ ఫర్ విమెన్‌లో సభ్యురాలిగా పనిచేశారు. 'మోదీ ప్రధాని కావాలి' అనే నినాదాన్ని గట్టిగా వినిపిస్తూ వచ్చారు. ఇప్పుడు కామర్స్, ఇండస్ట్రీ శాఖల్లో యిండిపెండెంట్ చార్జితో సహాయమంత్రి పదవితో బాటు ఫైనాన్స్, కార్పోరేట్ ఎఫయిర్స్‌లో సహాయమంత్రి పదవి కూడా పొందారు. హెూం మినిస్ట్రీలో సహాయమంత్రి పదవి పొందిన కిరణ్ రిజ్జు (వయసు 43) అరుణాచల్ ప్రదేశ్‌కు చెందినవారు. రించిన్ ఖారు అనే కాంగ్రెస్ ఎమ్మెల్యే కొడుకు. ఢిల్లీ యూనివర్శిటీలో లా చదువుతూండగా అడ్వాణీ కంటపడ్డారు. 2004లో బిజెపి టిక్కెట్టు పొందారు. 2009లో ఓడిపోయాక పార్టీ వీడి కాంగ్రెసులో చేరారు. నితిన్ గడ్కరీ బిజెపి అధ్యక్షుడయ్యాక మళ్లీ 2012లో బిజెపిలో చేర్పించారు. అరుణాచల్ ప్రదేశ్ తమదంటూ చైనా చేస్తున్న వాదనను ప్రశ్నించే కిరెన్‌ను బిజెపి ప్రోత్సహించి ఈశాన్యరాష్ట్రాలలో బలపడదామని చూస్తోంది.

గతంలో సహాయమంత్రిగా చేసిన దేవేంద్ర ప్రధాన్ కుమారుడు 44 ఏళ్ల ధర్మేంద్ర ప్రధాన్ 2004లో ఒడిశా నుండి ఎంపీగా గెలిచి, 2006 వరకు బిజెపి యువమోర్చాకు అధ్యక్షుడిగా పనిచేశాడు. 2010లో పార్టీ జనరల్ సెక్రటరీ అయ్యాడు. ఆ పై రాజ్యసభ సభ్యుడిగా కూడా...! అమిత్ షా యుపిలో చేసిన పనిని యితను బిహార్‌లో చేశాడు. రామ్ విలాస్ పాశ్వాన్‌ను ఎన్‌డిఏకు చేరువ

చేసినది యితనే. ఎన్నికలు పూర్తవుతూండగా యితను మోదీకి ఫోన్ చేసి బిహార్‌లో బిజెపికి 40% ఓట్లు వస్తాయని చెప్పాడు. ఫైనల్‌గా 39% ఓట్లు, 40 సీట్లలో 31 సీట్లు వచ్చాయి. ఇతన్ని పెట్రోలియం, నేచురల్ గ్యాస్ శాఖలో ఇండిపెండెంట్ చార్జితో సహాయమంత్రి పదవి యిచ్చారు. ఆరవ వ్యక్తి బిజెపి-టిడిపి పొత్తు కుదిర్చి మనందరికీ సుపరిచితుడైన నిరంతర మందస్మితుడు 63 ఏళ్ల ప్రకాశ్ జావడేకర్. ఇతని తండ్రి హిందూ మహాసభ లీడరు, వీర సావర్కార్‌కు సహచరుడు. ఇతను పుణెలో స్టూడెంటు లీడరుగా వుంటూ ఎమర్జన్సీలో జైలుపాలయ్యాడు. నితిన్ గడ్కరీకి సన్నిహితుడై 2008లో రాజ్యసభ సీటు తెచ్చుకున్నాడు. మోదీకి అత్యంత సన్నిహితుడు. రాబోయే మహారాష్ట్ర ఎన్నికలలో ప్రధాన భూమిక వహించడానికి వీలుగా ఇన్‌ఫర్మేషన్, బ్రాడ్‌కాస్టింగ్, ఎన్వైర్‌మెంట్, ఫారెస్ట్, క్లయిమేట్ ఛేంజ్‌లకు యిండిపెండెంట్ చార్జితో సహాయమంత్రి పదవితో బాటు పార్లమెంటరీ వ్యవహారాల శాఖలో సహాయమంత్రి పదవి కూడా యిచ్చారు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 20-21 వీక్లీకై** **ఎమ్బీయస్ : భార్యాభర్తలా? అన్నదమ్ములా?**

తెలంగాణ ఉద్యమసమయంలో ఉద్యమనాయకులందరూ ఆంధ్ర-తెలంగాణ బంధాన్ని కలహాల కాపురం, బలవంతపు కాపురం, మేం అమాయక పెళ్లాలు, గడుసు మొగుడితో వేగలేం, అందుకే విడాకులు అడుగుతున్నాం అంటూ వచ్చారు. అలా అంటూనే విడిపోయి అన్నదమ్ముల్లా కలిసుందాం అన్నారు. రెండు ప్రాంతాల మధ్య బంధాన్ని ఎలా నిర్వచించారో నాకైతే అర్థం కాలేదు. ఉమ్మడి కుటుంబంలో అన్నదమ్ములు విడిపోయాక, కాస్త మొహాలు మాడ్చుకున్నా, వ్యవహారాలు, వ్యాపారాలు, శుభాశుభకార్యాలు కలిసి చేస్తూంటారు. ఉమ్మడి బంధువుల వద్ద తమకు అన్యాయం జరిగిందని పితూరీలు చేస్తూ వుంటారు కానీ బయటకు మాత్రం నవ్వుతూ కనబడతారు. మా అన్న, మా తమ్ముడు అంటూ వుంటారు. అదే భార్యాభర్తలైతే విడాకులకు కోర్టు ఎక్కినపుడు దారుణంగా నిందించుకుంటారు. వాదనల సమయంలో తమ తరఫు న్యాయవాదుల సలహా మేరకు అన్యాయపు ఆరోపణలు, వైల్డ్ ఎలిగేషన్స్ చేస్తారు. 'మా ఆయనకు కోపం వచ్చినపుడు తిట్టేవాడు, అతని తరహా నచ్చక విడాకులు పుచ్చుకుంటున్నాను' అని భార్య తన లాయరుకి చెపితే 'అలా చెపితే కొంప మునిగిపోతుంది, ఆయన తిట్టేవాడు, కొట్టేవాడు, సిగరెట్టు పెట్టి కాల్చేవాడు' అని చెప్పు, లేకపోతే జడ్జిగారు విడాకులు మంజూరు చేయడు' అని అబద్ధాలాడిస్తాడు. ప్రత్యేకరాష్ట్ర ఉద్యమం జరిగినపుడు యిలాటి అబద్ధాలు ఎన్నో చెప్పి విభజన సాధించారు. విడాకులు తీసుకున్న భార్యాభర్తలు మొహామొహాలు చూసుకోవడానికి యిష్టపడరు. ఒకనాటి యిష్టమంతా వెగటుగా మారిపోతుంది. మధ్యలో పిల్లలు వున్నారంటే వాళ్లకు చచ్చే అవస్తగా వుంటుంది. కస్టడీ ఒకరికి యిచ్చి, విజిటింగ్ రైట్స్ ఇంకోరికి యిస్తారు కదా. బయటకు తీసుకెళ్లినపుడల్లా 'నీకు తెలియదు కానీ మీ అమ్మ యిలాటిది, మీ నాన్న యిలాటివాడు' అలా చెప్పిచెప్పి పిల్లల మనసులు కలుషితం చేస్తారు. విభజన తర్వాత ఆంధ్ర, తెలంగాణ విడిపోయిన అన్నదమ్ముల్లా వున్నారా? విడిపోయిన భార్యాభర్తల్లా వున్నారా?

**పోలవరం పేచీ ఏ మేరకు లాభిస్తుంది?**

పోలవరం నిర్వాసితుల గురించి అంశం తీసుకుందాం. ఆ ఏడు మండలాల గురించి అంత రగడ అవసరమా? అధికారంలోకి రాబోతూ బంద్ చేయించడం, కొత్త ఎసెంబ్లీలో తీర్మానం పాస్ చేయడం, ఢిల్లీకి వెళ్లి ఆందోళన చేస్తాననడం – ఏమిటిది? టి-బిల్లు పాస్ చేయించుకోవడానికి, పోలవరం ప్రాజెక్టు కట్టితీరతామని ఆంధ్రులకు ధైర్యం చేకూర్చడానికి అధికారపక్షం కొన్ని హామీలు చేర్చవలసి వచ్చింది. దానికి అనుగుణంగానే ఆర్డినెన్సు వచ్చింది. 7 మండలాలు అంటే 7కే ఆర్డినెన్సు వచ్చింది. 70కి రాలేదు. భద్రాచలం గుడి చేర్చలేదు. 1956 నాటికి తెలంగాణలో ఏముందో అంతే యిస్తాం, తక్కినదంతా ఆంధ్రకే అనలేదు. 'అదంతా మాకు అనవసరం, మా రాష్ట్రం మాకు వచ్చేసింది కాబట్టి అగ్రిమెంటు సగమే అమలు చేస్తాం' అంటే ఎలా? నిర్వాసితులు ఆదివాసులు, వారి జీవితం భగ్నమై పోతోంది వంటి పెద్దమాటలు ఎందుకు? విభజన సమయంలో 'హైదరాబాదు ఆదాయం మొత్తాన్ని తెలంగాణకు యిచ్చేస్తే ఆంధ్రరాష్ట్రానికి ఏమీ లేకుండా పోతుంది కదా' అని అడుగుతూంటే ఉద్యమనాయకులందరూ ఒకే జవాబు యిచ్చేవారు – 'వాళ్లది వేరే రాష్ట్రం, వాళ్లు ఎలా పోతే మాకెందుకు?' ఇప్పుడు ఆ గిరిజనులు కూడా ఆంధ్రరాష్ట్రానికి చెందినవాళ్లు. వాళ్లు మునిగినా, తేలినా, నష్టపరిహారం అందక విలవిలలాడినా వీళ్ల కెందుకు? అబ్బే మొన్నటిదాకా మా ఖమ్మంలో వున్నవారు కాబట్టి అంటారా! మరి ఎప్పణ్నుంచో వున్న ఆంధ్ర ఉద్యోగులను హైదరాబాదు విడిచి వెళ్లాలని హుకుం జారీ చేస్తున్నారే! 'మీ రాష్ట్రం ఏర్పడ్డాక యింకా యిక్కడెందుకు? పొండి' అంటున్నారే! తెలంగాణలో భద్రాచలంలోనే కాదు, అనేక చోట్ల గిరిజనులు వున్నారు, వారిని ఉద్ధరిస్తే చాలు. 'అబ్బే వారి గోడు వినాలి. అక్కడ ప్రజాభిప్రాయం సేకరించి, అప్పుడు పోలవరం కట్టాలి' అని కొందరు మేధావులు వాదిస్తున్నారు. రాష్ట్రం విడదీసేముందు, ప్రజాభిప్రాయం సేకరించారా? మీరెటు వుంటారు? అని ఖమ్మం వాసులను, యూటీ చేయమంటారా? అని హైదరాబాదు వాసులను అడిగారా?

పోలవరంకు అభ్యంతరం లేదు, కేవలం డిజైన్ మార్చమంటున్నాం అనే వాదన అర్థరహితం. 20 ఏళ్లగా ఎప్రూవ్ అయి వున్న

డిజైన్ వీళ్లు చెప్పారని మార్చేస్తారా? వీళ్ల దగ్గిరి ప్రాజెక్టు డిజైన్ మార్చమని వాళ్లు అడిగితే మారుస్తారా? అయినా అది ఆంధ్ర ప్రాజెక్టు, కేంద్రం బాధ్యత తీసుకుంది. మధ్యలో తెలంగాణకు ఏం పని? 'రాష్ట్రం ఏర్పడ్డాక సరిహద్దులు మార్చడానికి కేంద్రానికి అధికారం లేదు. ఆర్డినెన్సు ద్వారా చేయలేదు, ఆర్టికల్ 3 ఉపయోగించాలి' అని కొందరు లీగల్ పాయింట్లు లాగుతున్నారు. కోర్టు కెళితే వాళ్లూ కూడా అదే చెప్పారనుకున్నా ప్రస్తుత పార్లమెంటు ఆ పని చేసేస్తుంది. కాంగ్రెసు, బిజెపి కలిసి కూడబలుక్కుని కదా విభజన విధానాన్ని ఫైనలైజ్ చేసినది! ఆర్డినెన్సు రూపొందించినది కాంగ్రెసు, పాస్ చేయించినది బిజెపి! ఇద్దరూ కలిసి ఆర్టికల్ 3 ద్వారా చేసి ఆ ముచ్చట కూడా తీర్చేస్తారు. మహా అయితే తెరాస, బిజెడి అడ్డుపడదామని చూస్తాయి. వాటి బలం ఎంత వుంది కనక! గెలవలేవమని తోస్తే యుద్ధం ఆరంభించనే కూడదు. కేవలం అక్కసుతో పోలవరం పేచీ పెట్టుకుంటున్నారనే అభిప్రాయం కలిగిస్తే తెలంగాణకే నష్టం. 'పోలవరం బోర్డులో తెలంగాణ సభ్యుణ్ని అనుమతిస్తే యిలాటి చిక్కులే పెడతారు, పనిలో పనిగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా సభ్యులను కూడా చేర్చేస్తే యిక ప్రాజెక్టు కట్టే పనే లేదు, కేంద్రానికి బోల్డు ఆదా' అని ఆంధ్ర వాదించడం మొదలుపెడితే...!?

## విద్యుత్ సంక్షోభం

విడిపోతే విద్యుత్ సంక్షోభం తప్పదని కిరణ్ కుమార్ రెడ్డి చెబితే కెసియార్ ఎద్దేవా చేశారు. ఛత్తీస్‌గఢ్ నుండి కొనుక్కుంటాం అంటున్నారు. ఇప్పుడు తీవ్రమైన విద్యుత్ కొరత ఎదుర్కుంటున్నాం. గృహావసరాలకే సప్లయి చేయలేకపోతున్నారు. కరంటు ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియకుండా వుంది. సరఫరా యిలా వుంటే పరిశ్రమలు ఏం నడుస్తాయి? ఛత్తీస్‌గఢ్ నుండి విద్యుత్ రావాలంటే లైన్లు వేయాలట. యుద్ధప్రాతిపదికపై వేసినా 18 నెలలు పడుతుందట. మొదలు పెట్టడం ఎప్పుడో తెలియదు. డబ్బులు కావాలి. ఋణమాఫీకి పరిమితులు విధించబోతే కుదరలేదు, మొత్తమంతా చుట్టుకుంది. బ్యాంకర్లు బాండ్లు కుదరవంటున్నారట, డబ్బిచ్చి మాట్లాడండి అంటున్నారు. ఇలాటప్పుడు రెండు రాష్ట్రాలు కలిసి కూర్చుని ఉమ్మడి ప్రణాళిక రచించుకోవాలి. కానీ చీటికీ మాటికీ ఆంధ్రులను రెచ్చగొడుతూ వుంటే వాళ్లెందుకు వూరుకుంటారు? పోలవరం విషయంలో ఒప్పందాన్ని తిరగతోడుతున్నారు కాబట్టి విద్యుత్ విషయంలో మేమూ అదే పని చేస్తాం అంటున్నారు. ఎపిఇఆర్‌సి (విద్యుత్ నియంత్రణ మండలి) వద్ద పెండింగులో వున్న పిపిఏ (పవర్ పర్చేజింగ్ అగ్రిమెంటు) అప్లికేషన్లను విత్‌డ్రా చేసుకుంటామని విద్యుత్ ఉత్పత్తిదారు- ఎపి జెన్‌కో ద్వారా అడిగించింది ఆంధ్ర ప్రభుత్వం. ఇఆర్‌సి గతంలోనే ఆమోదించివుంటే ఏకపక్షంగా విరమించుకుంటే ఉల్లంఘన జరిగినట్లు అవుతుంది. పెండింగులో వున్న అప్లికేషన్‌ను విత్‌డ్రా చేసుకుంటానంటే ఇఆర్‌సి ఏమనగలదు? కానీ ఒప్పందాలపై మీతో బాటు సంతకం పెట్టిన డిస్కం (విద్యుత్ పంపిణీ సంస్థ)లు కాబట్టి వారు కూడా యిలా అడిగితే చూద్దాం అంది. ఈ డిస్కంలలో రెండు ఆంధ్రలో, రెండు తెలంగాణలో వున్నాయి. తెలంగాణ ప్రభుత్వం తన డిస్కంలను అడగనీయదు. ఆంధ్రవాళ్లు ఔనంటే సగం అమలు అవుతుందేమో.

ఆంధ్రప్రభుత్వం యింతటితో వూరుకోవడం లేదు. 'విభజనకు ముందు థర్మల్ విద్యుత్ 5092 మెగావాట్లయితే, అప్పట్లాగే యిదీ జనాభా ప్రాతిపదికన పంచుతారనుకున్నాం. దీనిలో మాత్రం పద్ధతి మార్చి వినియోగం ప్రాతిపదికన తెలంగాణకు 53% మాకు 46% యిచ్చారు. మాకు అన్యాయం జరిగింది కాబట్టి యిప్పుడీ ఒప్పందాలను రద్దు చేసి మరో 465 మె.గా.లను తెచ్చుకోవాలని అనుకుంటున్నాం. మా రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే విద్యుత్ మమ్మల్ని వాడుకోనివ్వండి' అంటూ ఎపి స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎపిఎస్ఎల్‌డిసి) ద్వారా దక్షిణ ప్రాంతీయ లోడ్ డిస్పాచ్ సెంటర్‌కు విజ్ఞప్తి చేసింది. అదేమీ పట్టించుకోండి అంటూ తెలంగాణ ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. వివాదం కేంద్రానికి చేరుతోంది. కోర్టుకి కూడా వెళ్లవచ్చు. వాళ్లు ఏం చెపుతారో చూడాలి. కొంత కాకపోతే కొంతైనా ఆంధ్ర వాదాన్ని అంగీకరిస్తే తెలంగాణకు విద్యుత్ కొరత ఏర్పడి, బోరు పంపులపై ఆధారపడిన తెలంగాణ రైతు నష్టపోతాడు. అది గుర్తించి తెలంగాణ నాయకులు సామరస్యంగా, ఆంధ్రతో యిచ్చిపుచ్చుకునే ధోరణిలో వ్యవహరించాలి. దానికి బదులు హరీశ్ రావు ఆంధ్ర అసెంబ్లీకి, మంత్రుల యిళ్లకు కరంటు కట్ చేస్తే ఏమవుతుందంటూ విరుచుకుపడ్డారు. ఈయన కెసియార్ కంటె మరీ దూకుడు. ఇలాటి వ్యాఖ్యలు చేస్తే జాతీయస్థాయిలో ఎలాటి యిమేజి వస్తుందో వూహించలేరా?

## కేంద్రంతో సంబంధబాంధవ్యాలు

ఇలా చూడబోతే ఆంధ్ర, తెలంగాణ ప్రభుత్వాలు చీటికీమాటికీ కేంద్రం వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి వస్తోంది. కేంద్రం వద్ద ఎవరి మాట చెల్లుబాటవుతే వారికే లాభం జరుగుతుంది. ప్రస్తుతానికి చూస్తే ఆంధ్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోదీని ఆకాశానికి ఎత్తేస్తున్నారు. ఇటు కెసియార్ చూస్తే మోదీని సన్నాసి అన్నారు. స్వభావరీత్యా మోదీ ఉదారవాది కాదు. ప్రతిక్షకులను, తనను విమర్శించేవాళ్లను వదిలేసే రకం కాదు. టిడిపి-బిజెపికి పొత్తు వుంది. వారి ప్రభుత్వంలో వీరు, వీరి ప్రభుత్వంలో వారు భాగస్వాములు. ఇక బిజెపి-తెరాస సంబంధాలు చూడబోతే ఏ మాత్రం బాగా లేవు. రాష్ట్రంలో తెరాసను తిడితేనే తమకు మనుగడ అని బిజెపి గుర్తించింది. ముస్లిములకు రిజర్వేషన్లు పెంచి తెరాస, బిజెపికి మరింత కడుపు మండించింది. ఇది మోదీకి హితవైన చర్య కాదు. తెరాసకు బిజెపికి చెడితే నష్టపోయేది తెలంగాణ ప్రభుత్వం, ప్రాంతం. ఉద్యమనాయకుడి స్థాయి నుంచి పాలకుడి స్థాయికి కెసియార్ ఎదగాలి.

బంగారు తెలంగాణ కావాలంటే కంసాలికి ఎంతో నేర్పు, ఓర్పు కావాలి మరి. సంయమనం పాటించి, విద్వేషాలు, వైషమ్యాలు వదులుకుంటేనే ఆంధ్ర–తెలంగాణ అన్నదమ్ముల్లా కలిసి సాగవచ్చు. లేకపోతే కీచులాటలకే సమయమంతా పోతుంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 22–23 వీక్లీకై** **ఎమ్బీయస్ : ప్రతిదానికీ ఆంధ్ర రంగు పూయాలా?**

బియాస్ నదిలో జరిగినది దుర్ఘటన. దానిలో ఆంధ్ర–తెలంగాణ గొడవేమిటి? అక్కణ్నుంచి తిరిగి వచ్చిన నాయిని నర్సింహారెడ్డి 'అక్కడకు ఆంధ్రా మినిస్టర్లు వచ్చి హంగు చేశారు. వాళ్లకేం పని? కాలేజీ తెలంగాణలో వుంది, చనిపోయిన విద్యార్థులు తెలంగాణ విద్యార్థులు. ఆంధ్రోళ్లు ఎందుకు రావాలి?' అంటూ వ్యాఖ్యలు చేశారు. రేపు భూకంపం వచ్చి పక్క రాష్ట్రాలవాళ్లు సహాయకార్యక్రమాలకు వచ్చినా 'ఇది తెలంగాణ భూమి, భూకంపం వచ్చినా, మానినా మాదే, మీరెందుకు వచ్చారు?' అని అంటారా? సాటి తెలుగు వాళ్లు కదాన్న ఫీలింగుతో ఆంధ్ర మంత్రులు వచ్చి వుండవచ్చు. అది కూడా పెద్ద అంశంగా చూపాలా? మాటిమాటికీ 'ఆంధ్ర' పేరు చెప్పి రగడ చేయాలా? ఉద్యమంలో చేశారు సరే, అధికారంలోకి వచ్చిన తర్వాత కూడానా?

'ఈ విద్యార్థులందరూ తెలంగాణ వారే' అన్నారు నాయిని, ఆయన్ని ఆ మాట మీద వుండమనండి. ఫీజు రీఎంబర్స్‌మెంటు దగ్గరకు వచ్చేసరికి వారిలో కొందరు తెలంగాణవాళ్లు కాదంటున్నారు. వారికి వీళ్లు రీ ఎంబర్స్ చేయరట. వాళ్లకి ఎవరివ్వాలి? వాళ్ల రాష్ట్రం వాళ్లా? వాళ్లు ఫీజంతా యిస్తారో, మా రూల్సు ప్రకారం లిమిట్ యింతే అంటూ సగమే చేతిలో పెడతారో! ఆ పరిస్థితుల్లో యాజమాన్యం యీ విద్యార్థుల హాల్‌టిక్కెట్లు ఆపుతుందా? అంతా గందరగోళంగా వుంది. ఇంతకీ తెలంగాణ విద్యార్థుల నిర్వచనం ఏమిటి? లోకల్ కోటాలో సెలక్టయినవారా? అంటే నాలుగేళ్లు వరుసగా యిక్కడ చదివినవారనా లేక వేరే కొలబద్ద ఏమైనా వుందా? అదేదో తేలితే అన్నిచోట్లా అదే నిర్వచనం వాడాల్సి వస్తుంది. ఉద్యోగుల విషయంలో వేరేలా వాదిస్తే కుదరదు. ఫలానావాడు విద్యార్థిగా తెలంగాణ, ఉద్యోగిగా ఆంధ్ర.. అంటే నప్పదు.

**వంతులు పోతున్నారు…**

తెలంగాణ పునర్నిర్మాణానికి మాకు ఫలానా ఫలానా సౌకర్యాలు కావాలి అనడం ఒక పద్ధతి. అది కాకుండా ఆంధ్రకు ఏమిచ్చినా మాకు అది యిచ్చి తీరాలి అని వంతులకు పోవడం హాస్యాస్పదం. మాకు విశ్వనగరం హైదరాబాదు వుంది, ఐటిఐఆర్ వుంది, మెట్రో వుంది, అంతర్జాతీయ విమానాశ్రయం వుంది, పరిశ్రమలు పెట్టడానికి కావలసిన ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వుంది అని కెసియార్ ఓ పక్కనుండి చెపుతూ మళ్లీ వీటన్నిటితో పాటు ఆంధ్రకిచ్చేవన్నీ కావాలి అంటే సమంజసంగా వుంటుందా? విడగొట్టినపుడు ఆంధ్రకు అన్యాయం జరిగిందని అందరికీ తెలుసు. రాజధాని లేదు, హైదరాబాదు ఆదాయంలో వాటా లేదు, పరిశ్రమలు పెట్టడానికి తాడూ బొంగరమూ ఏమీ లేదు, లోటు బజెట్‌తో ప్రభుత్వం ఏర్పడుతోంది. పంపకాలు చేసేటప్పుడు ఆస్తులు తెలంగాణలో! వాటిపై అప్పుల్లో 58% ఆంధ్రకు! అర్థముందా? మామూలుగా ప్రజలకు యివన్నీ తెలిసేవి కాదు కానీ, విభజన బిల్లు గురించి విస్తృతంగా చర్చ జరగడంతో అన్నీ అందరికీ తెలిశాయి. విభజన తీరు బాగా లేదని తటస్థులు కూడా అనుకునే సందర్భం యిది. నష్టపోయినవారికి నష్టపరిహారం యిస్తామని హామీ యిచ్చినట్లు, ఆంధ్రకు ఏవేవో హామీలు యిస్తున్నారు. వాటిలో ఎన్ని కార్యరూపం ధరిస్తాయో ఎవరికీ తెలియదు. ప్రత్యేక హెూదా కూడా యిప్పటివరకు పక్కా కాలేదు. ఆంధ్రులు ఆశల వూపిరితోనే జీవిస్తున్నారు. ఇలాటి పరిస్థితుల్లో వాళ్లను రెచ్చగొట్టినట్లు 'మీరు వాళ్లకు ఏం యిచ్చినా మాకూ యివ్వాలి, ఇద్దరికీ యివ్వగలిగితేనే ఆ దిశగా ఆలోచించండి' అంటే ఎలా? ఇద్దరు పిల్లలున్న తలిదండ్రులకు యీ తిప్పలు తప్పవు. విసుగేసి, ఎవరికీ ఏమీ కొనకుండా కూర్చుంటారు వాళ్లు. తెలంగాణ మంచి పొజిషన్‌లో వున్నపుడు కూడా యీ విధంగా జట్టీలకు దిగడం శోభ నివ్వదు.

**మర్యాదలు పాటించకపోతే ఎలా?**

ఉద్యమసమయంలో కెసియార్ మాట్లాడిన అవాచ్యాలకు హద్దే లేదు. అధికారంలోకి వచ్చాకైనా హుందాతనం ప్రదర్శించాలి. స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్న జాతీయనాయకులు ఆంగ్లేయుల విధానాలను విమర్శించారు తప్ప వ్యక్తిగతంగా ఏమీ అనేవారు కారు. వారిలోవారికి స్నేహం కూడా వుండేది. విదేశీ వస్త్రబహిష్కరణ పిలుపు నిస్తూ గాంధీ దాని వలన ఇంగ్లండ్‌లో నేత పనివారికి కలిగే నష్టం గురించి విచారించారు. స్వాతంత్ర్యం వచ్చాక కూడా మనదేశం కామన్‌వెల్త్‌లో సభ్యత్వం తీసుకుంది. వారితో పోల్చి చూస్తే కెసియార్ ప్రవర్తన ఎంత విడ్డూరంగా వుందో అర్థమవుతుంది. ముఖ్యమంత్రి అయ్యాక కూడా హుందాతనం చూపటం లేదు. టిడిపిలో వుండగా తన సీనియర్ కొలీగ్, పొరుగు రాష్ట్రాధినేత అయిన చంద్రబాబును ప్రమాణస్వీకారానికి పిలవలేదు. ఏం అంటే 'అటెండరు దొరకలేదు' అని సమాధానం. అంటే చంద్రబాబు స్థాయి అదే అని చెప్పాలనా? ఇలా అన్నా బాబు హుందా కనబరచి

యీయని ఆహ్వానిస్తే యీయన వెళ్లలేదు. దేశంలోని యితర రాష్ట్రాల నాయకులకు యీ విషయాలు తెలిసినపుడు ఏమనుకుంటారు? బాబుకున్నంత విజ్ఞత, స్టేట్స్‌మన్‌షిప్ కెసియార్‌కు లేదనుకోరా?

## మెట్రోపై పేచీలో తెలంగాణ సంస్కృతి పరిరక్షణ కోణం

మెట్రో విషయంలో కెసియార్ ఎల్ అండ్ టితో తగవు వేసుకుంటున్నారు. అసెంబ్లీ, సుల్తాన్ బజార్ వంటి చారిత్రక కట్టడాలకు విఘాతం కలుగుతుంది కాబట్టి మెట్రోను అడ్డుకుంటామని విపక్షంలో వుండగా గొడవ చేశారు. ఇప్పుడు అధికారంలోకి వచ్చాక, మెట్రో నిర్మాణం చురుగ్గా సాగిపోతూన్న దశలో తగ్గాలి. అబ్బే, ఆ ప్రాంతాల్లో చోట్ల అండర్ గ్రౌండ్‌లో కట్టాల్సిందే, యిప్పటిదాకా కట్టిన స్తంభాలు కూల్చాల్సిందే అని పేచీ పెడుతున్నారు. చారిత్రక కట్టడం అనేదానికి కొలబద్ద వుండద్దా? అయినా వాటిని మెట్రోవాళ్లు కూల్చడం లేదు కదా! పక్కనుంచి వెళుతున్నారు. ఇప్పటిదాకా కట్టినది కూల్చేయడం, అండర్ గ్రౌండ్‌లో మళ్లీ కట్టడం అంటే ఎంత ధనం, సమయం వృథా? ఎవరు కాంపెన్సేట్ చేస్తారు? కంపెనీ భరించాలా? లేక కెసియార్ ప్రజాధనం యిస్తారా? అయినా ప్రభుత్వం మారినప్పుడల్లా డిజైన్లు మారుస్తామంటే ఎవరైనా కాంట్రాక్టు తీసుకుంటారా? చివరకు కెసియార్‌కు ఎవరైనా నచ్చచెప్పి వూరుకోబెట్టినా ప్రజలే మనుకుంటారు? ఎల్ అండ్ టి వారు మేనేజ్ చేశారు అనుకుంటారు. కెసియార్ ఇమేజి దెబ్బతింటుంది. తెలంగాణకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తాం అంటున్నారు. మెట్రో వ్యవహారం చూశాక వాళ్లు వస్తారా? కొత్త పార్టీ అధికారంలోకి వస్తే మళ్లీ బేరాలాడుకోవాలేమో అని భయపడరా? ఇదంతా ఒక ఎత్తయితే యీ వివాదంలోకి ఆంధ్రను యీడ్చి 'ఆంధ్ర నాయకులు తెలంగాణ సంస్కృతిని నాశనం చేశారు, మేం కాపాడతాం' అంటూ దానికి కల్చరల్ కలర్ ఒకటి యివ్వడం మరీ వింతగా వుంది.

ఆంధ్రలో జరుగుతున్నది ఏమీ లేకపోయినా, మీడియా పుణ్యమాని హంగామా మాత్రం బాగా జరుగుతోంది. మెట్రో వచ్చేస్తోంది, సూపర్ కాపిటల్ వచ్చేస్తోంది అంటూ... తెలంగాణలో డబ్బున్నవాళ్లు అక్కడ రియల్ ఎస్టేటులో పెట్టుబడి పెడుతున్నారు. హైదరాబాదులో రియల్ ఎస్టేటు స్తంభించింది. దాంతో కొందరు బెంగుళూరులో, మరి కొందరు మైసూరులో పెట్టుబడులు పెడుతున్నారు. ఇక్కణ్నుంచి కాపిటల్ వెళ్లిపోతే నిర్మాణరంగం దెబ్బ తింటుంది. ఆ మేరకు నిరుద్యోగులు పెరుగుతారు. అభివృద్ధి కావాలంటే పెట్టుబడులు రావాలి. పెట్టుబడి పెట్టే శాంతియుత వాతావరణం కల్పించారు. ఘర్షణ వుంటే ఎవరు ముందుకు వస్తారు?

## మీడియా వివాదంలోనూ ఆంధ్రను వదలలేదు

ఇవి చాలనట్లు మీడియాతో కూడా కెసియార్ పేచీ పెట్టుకున్నారు. నిజానికి టీవీల్లో వచ్చే కొన్ని కార్యక్రమాలు రోత పుట్టిస్తాయి. ఒక కార్టూన్ ఫిగర్ వచ్చి చిత్తం వచ్చినట్లు వ్యాఖ్యానిస్తూ వుంటుంది. ఎంతోమంది అనుచరులున్న నాయకుణ్ని పట్టుకుని 'రేయ్' అంటుంది. చాల్లే కూర్చో అంటుంది. మాటమాటకీ వెక్కిరిస్తుంది. మరో కార్యక్రమంలో నాయకుల మాస్కులు పెట్టుకుని కొందరు డాన్సులు చేస్తారు, తమలో తాము సర్కస్ బఫూన్లలా కొట్టుకుంటారు. నిజానికి అన్ని పార్టీల నాయకులు కలిసి యీ కార్యక్రమాలను నియంత్రించాలి. సంస్కారయుతంగా కార్యక్రమాలు నడపాలని సూచించాలి. అయితే 'మీరు సంస్కారయుతంగా మాట్లాడితే మేమూ అలా వుంటాం' అని మీడియా అంటే వీళ్లకు చిక్కు. అనేకమంది నాయకులు యిష్టం వచ్చినట్లు మాట్లాడారు. హరీశ్‌రావు సబ్ యిన్‌స్పెక్టరుపై బూతులు కురిపించినది కూడా టీవీల్లో వచ్చేసింది. బహిరంగ ప్రదేశాల్లో సభ్యంగా ప్రవర్తించడం నాయకులు నేర్చుకోవాలి. గతంలో కెసియార్ అసభ్యకరమైన భాష వుపయోగించి 'ఇది తెలంగాణ భాష' అని దబాయించేవారు. ఇప్పుడు అది కుదరదు. చుట్టూ అందరూ తెలంగాణవారే. అందరూ ఆయనపై అదే భాష ప్రయోగించగలరు.

టీవీ9, ఎబిఎన్ ఆంధ్రజ్యోతి ప్రసారాలను కేబుల్ ఆపరేటర్స్ సంఘం చేత నిషేధింపచేసినా, దాని వెనుక ఎవరున్నారో అందరికీ తెలుసు. మీడియాతో గొడవ పెట్టుకోవడం సరే, దానికి ఆంధ్ర ముద్ర వేయడం లేనిపోని వివాదానికి దారి తీసినట్లే కదా. ఆ ఛానెల్స్ తెలంగాణ యాసను, సంస్కృతిని కించపరిచాయని సంఘం వాళ్లు కనిపెట్టారు. ఆ కార్యక్రమాలేవిటో చెప్పి, వాటిని తొలగించమని అడగడం కాకుండా, మొత్తం ప్రసారాలను నిషేధించేశారు. సినిమాలపై కూడా గతంలో యిలాటి ఆరోపణలే చేశారు. వాటినీ నిషేధిస్తారా? తెలంగాణ ఉద్యమాన్ని భుజాన వేసుకుని మోసిన ఆంధ్రజ్యోతికి యిలాటి పరిస్థితి ఎదుర్కోవలసి రావడం విడ్డూరంగా వుంది. తను తెలంగాణవాణ్నని రాధాకృష్ణగారు అనుకోగానే సరిపోలేదు, యిప్పుడు 'ఆంధ్ర' మచ్చ పడింది. ఎవరు తెలంగాణ? ఎవరు ఆంధ్ర? అనేది తేల్చకుండానే పుష్కరం పాటు ఉద్యమం నడిపారు. తెలంగాణ వచ్చేశాక అధికారపార్టీకి నచ్చనివారందరూ ఆంధ్రులే అని తేలుస్తున్నారు. వైయస్ ఎంతసేపూ 'ఆ రెండు పత్రికలూ' అంటూ సరిపెట్టారు కానీ కెసియార్ రెండు టీవీ ఛానెల్స్‌ను ఏకంగా నిషేధింపచేశారు. ఇది తెలంగాణలోని యావత్ మీడియాకు హెచ్చరిక లాటిది. ఇది జాతీయ మీడియా హర్షించదు. మీడియా అంతా ఒకటే జాతి. తాము ఎవరినైనా ఏమైనా అనవచ్చు. తమని మాత్రం ఎవరూ ఏమీ అనకూడదు. ఇక వాళ్లు తెలంగాణ ప్రభుత్వంపై పగబట్టి వ్యతిరేక కథనాలు ప్రచురించడం ఖాయం. తనకు నచ్చని, తమ ఛానెల్స్‌కు, పత్రికకు పోటీగా వున్న

మీడియాపై 'ఆంధ్ర' ముద్ర కొట్టి యాగీ చేయడం కూడా జాతీయ స్థాయి పాత్రికేయులు తప్పుపడతారు.

**అంతశ్శత్రువులను తయారుచేసుకున్నట్లే**

'ఆంధ్రుల్ని ఎంత తిట్టినా మననేం చేయగలరు' అనుకోకూడదు కెసియార్. వాళ్లు ఎక్కడో పరదేశంలో లేరు, ఆయన ప్రజల్లో నాల్గవవంతు మంది ఆంధ్రులో, ఆంధ్రమూలాలు వున్నవాళ్లో. ఆంధ్రులతో చుట్టరికాలు కలుపుకున్నవారో, వ్యాపారవాణిజ్యబంధాలు వున్నవాళ్లో, ఆంధ్రయో, తెలంగాణయో నిర్వచనానికి దొరకని వాళ్లో వున్నారు. ఆయన ప్రభుత్వంలో, తెలంగాణలోని యితర ప్రయివేటు సంస్థల్లో కీలకస్థానాల్లో కూడా యిలాటివాళ్లు వున్నారు. పాకిస్తాన్ ప్రభుత్వం హిందువులను ఎలా హింసించినా చెల్లిపోతుంది, అక్కడ వాళ్లు సంఖ్యాపరంగా చాలా తక్కువ కాబట్టి! భారతప్రభుత్వం ముస్లిములతో జాగ్రత్తగా వ్యవహరించవలసి వస్తుంది. వాళ్లు అనేక నియోజకవర్గాల ఫలితాలను తారుమారు చేయగలరు కాబట్టి! ఇదే సూత్రం ఆంధ్ర, తెలంగాణలకు వర్తిస్తుంది. ఆంధ్రలో తెలంగాణవారి సంఖ్య బహు తక్కువ. తెలంగాణలో ఆంధ్రులను రెచ్చగొడితే యింట్లోనే శత్రువులుగా మారి ఎసరు పెట్టగలరు. సమయం చూసి కీలెరిగి వాత పెట్టగలరు. ఇకనైనా యీ నినాదాలు మాని అభివృద్ధిపై దృష్టి సారిస్తే మంచిది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 24-26 వీక్లీకై ఎమ్బీయస్ : తల్లి సెంటిమెంటు**

మోదీ ప్రమాణస్వీకారానికి వచ్చిన నవాజ్ షరీఫ్ తల్లికి మోదీ శాలువా బహుమతిగా యిచ్చారు. పాకిస్తాన్ తిరిగి వెళ్లాక షరీఫ్ మోదీ తల్లికి తెల్లచీరను కానుకగా పంపించారు. దాయాదులైన భారత, పాకిస్తాన్‌లను తల్లి సెంటిమెంటు కలిపిందని, "దీవార్" సీను నిజజీవితంలో జరుగుతోందని, జర్నలిస్టులు, రచయితలు హర్షాతిరేకంతో పులకించిపోయారు. మనబోటి వాళ్లింటికి ఎవరైనా వస్తే మగాడికి షేక్ హ్యాండ్‌తో సరిపెట్టి ముత్తయిదువు కదాని అతని భార్యకు చీరా, జాకట్టు పెడతాం. అదే పద్ధతి ప్రభుత్వస్థాయిలో కూడా జరుగుతుంది. విదేశాధిపతులు ఏదైనా సమావేశానికి వచ్చినపుడు భర్తలు, భర్తలు చర్చల్లో మునిగితే వారి భార్యలు షాపింగుల్లో మునుగుతారు. స్థానికంగా దొరికే దుస్తులు, వస్తువులు చూసి ముచ్చటపడితే ఆతిథ్యం యిచ్చిన దేశాధిపతి తన సతీమణి ద్వారా వాటిని బహుమతులుగా యిస్తూ వుంటారు. నెహ్రూగారు ప్రధాని అయినపుడు అప్పటికే ఆయన భార్య పోయింది కాబట్టి, ఇందిరా గాంధీ యీ హెూస్టెస్ పని చూసుకునేవారు. మన్‌మోహన్ భార్య కూడా యిలాటి బాధ్యతలు నిర్వర్తించారు. మోదీ విషయానికి వస్తే ఆయన కుటుంబసభ్యులెవరూ ఆయనతో వుండరు. పాకిస్తాన్‌తో బాంధవ్యం పెంచుకుందామనుకుంటున్నారు కాబట్టి మర్యాదపూర్వకంగా షరీఫ్ కుటుంబసభ్యులకు ఏదో ఒకటి యిస్తే బాగుంటుందన్న ఆలోచన వచ్చి వుంటుంది. మామూలు పద్ధతుల్లో అయితే అతని భార్యకు చీరో, శాలువాయో పంపాలి. ప్రతిస్పందనగా ఆయనా మోదీ భార్యకు చీరో, శాలువాయో పంపే అవకాశం వుంది. అదే జరిగితే మోదీకి పెద్ద చిక్కు. జశోదా బెన్ స్థానాన్ని అఫీషియల్‌గా ఆమోదించినట్లవుతుంది. అందుచేతనే మోదీ తన తల్లిని రంగంపై తెచ్చాడు.

ఇన్నేళ్లగా మోదీ తన కుటుంబసభ్యుల్ని ఎవర్నీ వెలుగులోకి తీసుకురాలేదు. కుటుంబం లేకపోవడమే ఆయనకు పెద్ద అర్హత, బంధుప్రీతి చూపించే అవకాశమే లేదు అన్నట్లుగానే ప్రొజెక్టు అవుతూ వచ్చింది. అయితే యీసారి ఎన్నికలలో కొత్తగా వచ్చిన నియమాల ప్రకారం ఆయన తన భార్య పేరు బయటపెట్టవలసి వచ్చింది. ఇక అప్పణ్నుంచి భార్య పట్ల ఆయన నిరాదరణ ఫోకస్‌లోకి వచ్చింది. ఆమె పాపం యితని క్షేమం గురించి, ప్రగతి గురించి ప్రార్థనలు, ఉపవాసాలు చేస్తూ, 'ఆయన యిప్పటికైనా పిలిస్తే తప్పకుండా వెళ్తాను, పాత విషయాలు ప్రస్తావించను' అని యింటర్వ్యూలలో చెప్తూ వుంటే ఆవిడపై జాలి పెరుగుతోంది. 'ఇతను మనిషా? శిలా? ఆర్ఎస్ఎస్‌పై అంత ప్రేమ వుంటే తక్కిన ప్రచారకుల్లా బ్రహ్మచారిలా వుండలేకపోయాడా? తాళి కట్టుకుని వదిలేసేదేమిటి? గుజరాత్ ముఖ్యమంత్రి అయ్యేవరకు ఏ పదవీ లేదు కదా, బంధుప్రీతితో అవినీతికి పాల్పడే ప్రమాదమే లేదు కదా, అప్పుడైనా దగ్గరకు రానీయలేదేం?' అనే సందేహం మామూలు వాళ్లకు కలుగుతుంది. మోదీ వ్యతిరేకులు 'భార్య బాగోగులే పట్టించుకోని వాడికి లోకంలో మహిళల సంక్షేమం గురించి మాట్లాడే అర్హతే లేదు' అని విరుచుకుపడ్డారు. అందువలన తను కూడా ఒక సాధారణ ఫ్యామిలీ మ్యానే అని చూపించుకోవలసిన అవసరం మోదీకి పడింది. ఎన్నికలు కాగానే తల్లిని రంగంపైకి తెచ్చాడు. (మూడోసారి ముఖ్యమంత్రిగా అయినప్పుడు కూడా యిలాటివి వార్తల్లో రాలేదు. ఒకప్పటి గురువు, దరిమిలా ప్రత్యర్థి అయిన కేశూభాయ్ పటేల్ వద్దకు వెళ్లి తనకు మిఠాయి తినిపించిన ఫోటో వచ్చింది, ప్రత్యర్థుల పట్ల కూడా మోదీ ఉదారంగా వ్యవహరించారన్న మెసేజ్ పంపడం ధ్యేయం కాబోలు) ఈయన వెళ్లడం, ఆవిడ మిఠాయి తినిపించడం, తింటూంటే మీసాలకు, గడ్డాలకు అంటిన మిఠాయిని ఆవిడ కొంగుతో తుడవడం – యివన్నీ పెద్ద విశేషాలుగా పేపర్లలో పడేట్లు చేశారు. మోదీ మరీ అంత కఠినాత్ముడు కాడు, తల్లీ తండ్రీ అంటే భయభక్తులున్నవాడు అనే భావం నాటుకోవాలంటే ఆవిణ్ని యింకా ఫోకస్‌లోకి తేవాలనుకున్నారు కాబట్టే ఎప్పుడూ లేని విధంగా షరీఫ్ తల్లికి మోదీ బహుమతి పంపడం!

ఈ ధోరణి ప్రబలిందంటే మన దేశానికి ఏ విదేశాధినేత భార్యా తోడుగా రాదు. 'ఆ మోదీగారు తల్లులకే బహుమతులు యిస్తాడు,

కావాలంటే మీరూ మీ అమ్మా వెళ్లి బట్టలు పెట్టించుకుని, వాయినం పుచ్చుకురండి' అని మూతీ, ముక్కూ విరవవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : మోదీ ప్రమోల మనిషి – మనీష్

మనీష్ బరాడియాకు 46 ఏళ్లు. రాజస్థాన్ వాడు. ఫైన్ ఆర్ట్స్ చదవడానికి 1990లో అహ్మదాబాద్‌కు వచ్చాడు. చదువు పూర్తయ్యాక యాడ్ ఏజన్సీలలో చేరి షార్ట్ ఫిల్మ్స్ తీద్దామని బొంబాయి వెళ్లాడు. ప్రోత్సాహం పెద్దగా లేదు. ఏడాది తర్వాత మళ్లీ అహ్మదాబాదుకి తిరిగి వచ్చేసి తన 23 వ యేట మూవింగ్ పిక్సెల్స్ కంపెనీ (ఎంపీసి) అనే కంపెనీని అద్దె గదిలో ప్రారంభించాడు. స్థానిక కేబుల్ టీవీ నెట్‌వర్క్‌లకు చిన్న చిన్న యాడ్ ఫిలింస్ తీస్తూండేవాడు. ఏడాది తిరిగేసరికి ఐదుగుర్ని తన టీములో చేర్చుకున్నాడు. శైలభద్ర షా అనే అతన్ని భాగస్వామిగా చేర్చుకున్నాడు. కొన్నాళ్లు పని చేశాక ఇస్రో సంస్థ యితని ప్రతిభను గుర్తించింది. పిఎస్ఎల్‌వి లాంచ్ ప్రాజెక్టులో యానిమేషన్ పని అప్పగించారు. అప్పటినుండి మంచి గుర్తింపు వచ్చింది. అతని ఆఫీసు అహ్మదాబాద్‌లోని పాతబస్తీలో వుండేది. గోధ్రా అల్లర్ల తర్వాత వ్యాపారం మందగించింది. ఆ దశలో ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ నుండి పిలుపు రావడంతో అతని దశ తిరిగింది.

2001లో వచ్చిన భూకంపం తర్వాత గుజరాత్ అతలాకుతలమైంది. ప్రభుత్వ అసమర్థతను అందరూ ఎత్తి చూపారు. మోదీ ముఖ్యమంత్రిగా వచ్చాక భూకంప బాధితులకై యిళ్లు కట్టించి పునరావాస చర్యలు బాగా పూర్తి చేశాడు. గోధ్రా అల్లర్ల లో పోయిన ప్రతిష్టను తిరిగి తెచ్చుకోవాలంటే భూకంప బాధితుల పునరావాసాన్ని హైలైట్ చేయాలని మోదీ నిశ్చయించుకున్నాడు. ఇతన్ని పిలిచి ''చనౌతీ'' (సవాలు) అనే 15 నిఎఎల సినిమా తీయమన్నాడు. రాత్రి 8 గంటలకు పిలిచి తనకేం కావాలో స్పష్టంగా చెప్పడానికి మూడున్నర గంటలు తీసుకున్నాడు. చుట్టూ ఎనిమిది మంది అధికారులున్నారు. మోదీకి ఏం కావాలో మనీష్‌కు పూర్తిగా అర్థమై పోయింది. ఇద్దరి మధ్య వేవ్‌లెంగ్త్ కుదిరింది. ఆ యాడ్ ఫిల్మ్ హిట్ కావడంతో యీ 13 ఏళ్లలో అతను మోదీకై 250 ఆడియో విజువల్స్, ప్రెజంటేషన్స్ చేశాడు. వైబ్రంట్ గుజరాత్, జ్యోతిగ్రామ్.. యిలా ఎన్నిటికో అతనే రూపకల్పన చేశాడు. 2007లో మోదీ మాస్క్ రూపకల్పన చేసినది 30 మంది సభ్యులున్న అతని టీమే. అది ఎంత హిట్టయిందో అందరికీ తెలుసు. ఇప్పుడతని ఆఫీసు అహ్మదాబాద్‌లోని ఖరీదైన ప్రాంతం వస్త్రపూర్‌లో వుంది.

మోదీ మనసు తెలుసుకోవడంలోనే కాదు, ఏదైనా అధ్యయనం చేయడంలో కూడా అతను దిట్ట. మోదీ ఏ దేశం వెళ్లినా ఒక 10 నిఎఎల షార్ట్ ఫిల్మ్ తయారుచేసి యిస్తాడు. గుజరాత్‌లో వున్న సౌకర్యాల గురించి చెప్పడంతో బాటు ఆ దేశానికి, గుజరాత్‌కు గల సామ్యం కూడా ఎత్తిచూపించడం జరుగుతుంది. 2007లో ఇజ్రాయేలుకి మోదీ వెళ్లినపుడు 'మీ దేశంలాగానే మా రాష్ట్రంలో కూడా నీటికి కరువుంది. ప్రతి చుక్కనూ రక్షించుకుంటాం.' అనే థీమ్‌తో ఫిల్మ్ చేసిపెట్టాడు. అలాగే జపాన్, చైనాలకు వెళ్లినపుడు కూడా కస్టమైజ్‌డ్‌గా తయారుచేసి యిచ్చాడు. 2012 అసెంబ్లీ ఎన్నికల సమయంలో 'గుజరాత్ పట్ల కేంద్రం వివక్షత' అనే థీమ్‌పై సినిమా చేయమని మోదీ ఆదేశించాడు. ఇతను 9 కాన్సెప్టులు చెపితే మోదీ తిరస్కరించాడు. చివరకు పదవది ఆమోదించాడు. దాని పేరు ''థప్పడ్'' (చెంపదెబ్బ) సీరీస్. ఒక్కోసారి ఒక్కో అంశంలో కేంద్రం గుజరాత్ పట్ల సవతితల్లి ప్రేమ కనబరించిందని ఎస్టాబ్లిష్ చేస్తారు. చివరి షాటులో ఒక గుజరాతీ వ్యక్తిని ఎవరో చెంపపై కొట్టినట్లు చూపిస్తారు. ''ఇది కేంద్రం గుజరాత్‌కు కొట్టిన చెందబెబ్బ'' అని చివరిలో వ్యాఖ్య వస్తుంది. ఇదీ బాగా హిట్ అయింది.

ఈ సారి మోదీ ప్రచారానికి ఉపయోగించిన యాడ్ ఫిల్మ్స్ గురించి వేరే చెప్పనక్కరలేదు. అవన్నీ యితను, యితని టీము రూపొందించినవే. మోదీ యితన్ని ప్రోత్సహించడమే కాక, తనకు ఆత్మీయులైన కార్పోరేట్లకు పరిచయం చేశాడు. ఆ విధంగా యిప్పుడు అతని క్లయింట్లలో – రిలయన్సు (విమల్), అడానీ, రస్నా, టొరెంట్, రత్నమణి స్టీల్, ఇంటాస్ బయోటెక్నాలజీ, హిపోలిన్ వంటి పెద్ద సంస్థలతో బాటు అనేక రాష్ట్ర సంస్థలు కూడా వున్నాయి. బిజెపి అధికారంలో వున్నపుడు రాజస్థాన్ ప్రభుత్వానికి కూడా పని చేశాడు. ఇప్పుడు కేంద్ర సంస్థలు కూడా బిజినెస్ యిస్తాయని సులభంగా వూహించవచ్చు. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : మావోయిస్టు మేధావి

ఢిల్లీలోని రామ్‌లాల్ ఆనంద్ కాలేజీలో ఇంగ్లీషు లెక్చరర్‌గా వున్న జి.ఎన్. సాయిబాబా అనే తెలుగు మావోయిస్టు సానుభూతిపరుణ్ని అరెస్టు చేయగానే మేధావివర్గం యథావిధిగా గగ్గోలు పెట్టింది. సాయిబాబాగారు ఉన్నత విద్యావంతుడు కావడం మాత్రమే కాదు, చక్రాల కుర్చీలో కూర్చోబెట్టి కోర్టుకి తీసుకెళుతున్న ఫోటో పేపర్లో రావడంతో డబుల్ సింపతీ లభించింది. మేధావి కావడం, స్వతంత్ర భావాలు కలిగి వుండడం యీ దేశంలో నేరమా? అని కొందరు ప్రశ్నించారు. ప్రజాహక్కుల ఉద్యమాల పేరుతో, లెఫ్టిస్టు మేధావిని అని చెప్పుకుంటూ మావోయిస్టులపై పోలీసుల చర్యలను ఖండిస్తూ, మావోయిస్టులు ప్రజలపై చేసే దుశ్చర్యల పట్ల మౌనం వహిస్తూ తిరిగే మహానుభావులు మన తెలుగునాట ఎందరో వున్నారు. మావోయిస్టులకు తుపాకులు, బాంబులు హార్డ్‌వేర్ అయితే, సభ్యసమాజంలో

మర్యాదస్తులుగా మెలగుతూ, తమకు అనుకూల ప్రచారం చేస్తూ, తమ సభ్యుల మధ్య, సంస్థల మధ్య సమన్వయం చేస్తూ, ప్రభుత్వానికి తమకు మధ్య మధ్యవర్తులుగా వ్యవహరించే తిరిగే యిలాటివారు సాఫ్ట్‌వేర్. ఒకే నాణానికి రెండు పార్శ్వాలుగా వారూ, వీరూ వుంటారు. అయితే యీ సాయిబాబా అటువంటి వారా, లేక అమాయకుడా అన్న సందేహం అరెస్టు వార్త చదవగానే మనలో కలిగింది. ఖోబడ్ గాంధీ, వినాయక్ సేన్.. యిలా అనేకమంది విషయంలో యిలాటి అనుమానాలు రేకెత్తించింది మీడియా. ఇంతకీ సాయిబాబా సంగతేమిటి?

మావోయిస్టు సానుభూతిపరులైన హేమ్ మిశ్రా, ప్రశాంత్ రాహీలను పోలీసులు విచారిస్తూ వుంటే వాళ్లు సాయిబాబా పేరు చెప్పారు. 'మావోయిస్టులకు ఏమైనా చెప్పాలంటే మేం ఢిల్లీలోని సాయిబాబాకు చెప్తాం, వారి నుండి ఆదేశాలు ఏమైనా వచ్చినా యీయనే మాకు చెప్తారు.' అని. ఇక డిసెంబరు నుండి యీయనపై నిఘా మొదలైంది. ఇలాటివారందరికీ బయటకు కనబడేందుకు సంస్థలుంటాయి కదా. రివల్యూషనరీ డెమోక్రాటిక్ ఫ్రంట్ (వీళ్లెవరికీ ప్రజాస్వామ్యం అంటే నమ్మకం వుండదు, అయినా తమ సంస్థల పేర్లలో డెమోక్రాటిక్ అని చేర్చకుండా మానరు) అని 2005లో ఒక సంస్థ స్థాపించి ప్రజలకోసం పనిచేసే (మావోయిస్టు భావాలతో...అని చేర్చుకోవాలి) అనేక సామాజిక, సాంస్కృతిక సంస్థల ఫెడరేషన్‌గా దాన్ని రూపొందించారీయన. 'లేవండి, ప్రతిఘటించండి, విముక్తి చేయండి' అని వారి నినాదం. దానికి యీయన జాయింట్ సెక్రటరీగా వున్నాడు. ఈయన వ్యవహారాలు నిఘా వేసి చూశాక మే 9 న ఇంట్లో సోదా చేయగా మావోయిస్టు డాక్యుమెంట్లు వున్న మూడు హార్డ్ డిస్కులు దొరికాయి. నక్సలైటు సానుభూతిపరుడు కాదు, ఏకంగా నక్సలైటే అని పోలీసులకు తోచింది. అరెస్టు చేశారు. ఆయన అమాయకుడు అని మేధావివర్గం విరుచుకుపడ్డారు. ఇది జరిగిన రెండు రోజులు తిరక్కుండా నక్సలైట్లు ప్రతీకార చర్యగా మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో లాండ్‌మైన్ పెట్టి 7గురు పోలీసులను చంపివేశారు. వారు యాంటీ-నక్సల్ విభాగానికి చెందినవారు. ప్రత్యేకంగా శిక్షణ పొందినవారు. దీన్ని బట్టే తెలుస్తోంది – మావోయిస్టులకు, సాయిబాబాకు గల బంధం ఎంత గట్టిదో! **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : ప్రాణాలు తిరిగి వస్తాయా?

హిమాచల్‌లో పర్యటనకు వెళ్లిన 24 విద్యార్థులు దుర్మరణం పాలయ్యారు. నీటిని విడిచే ముందు సైరన్ వేయనందుకు అక్కడి ఉద్యోగులదే తప్పు అని వాళ్లని సస్పెండ్ చేశారు, నెల్లాళ్లు పోయాక మళ్లీ ఉద్యోగంలో చేర్చుకుంటారు. కానీ వీళ్ల ప్రాణాలు తిరిగి వస్తాయా? తెలియని చోటకి వెళ్లినపుడు ఎక్కడపడితే అక్కడ నదిలో దిగడమేమిటి? మొసళ్లు వుంటే? ఊబి వుంటే? నీటి కింద పదునైన రాళ్లు వుంటే? దిగినవాళ్లు నదీమధ్యంలోకి వెళ్లి బండలెక్కడం దేనికి? ఈ ఫోటోల పిచ్చి కాదు కానీ, వీళ్లు ముందూ వెనకా చూసుకోవడం లేదు. నీళ్లు ఉధృతంగా రావడం మొదలుపెట్టగానే అరుస్తూ కొందరు వెనక్కి పరిగెట్టారు. కొందరు కాస్త ఆగి బండ దిగబోయారు. కదులుతున్న బస్సు, రైలు ఎక్కడం ఆ వయసులో సరదా. సీట్లు ఖాళీ వున్నా లోపలకి వచ్చి కూర్చోకుండా గుమ్మం దగ్గర వేళ్లాడడం ఒక హీరోయిజం. ఇలాటివి ప్రాణాంతకాలవుతాయి. వారానికి కనీసం రెండు వార్తలైనా వుంటాయి – ఈతకు వెళ్లిన ఇంజనీరింగ్ విద్యార్థులు గల్లంతు/మృతి అని. ఈత రాకుండా ఎందుకు వెళుతున్నట్లు? మునిగిపోకుండా లైఫ్ జాకెట్లు ఎందుకు వేసుకోరు? ఇక్కడే కాదు, విదేశాల్లో సైతం ఎంతోమంది తెలుగు కుర్రాళ్లు ఎవరూ మసలని చోట్లకు వెళ్లి మునిగిపోతున్నారు, లేదా దోపిడీకి గురవుతున్నారు. తమ దుస్సాహసాలతో తలిదండ్రులకు ఎటువంటి గర్భశోకాన్ని మిగులుస్తున్నారో వాళ్లకు అర్థం కాదు. చచ్చిపోయిన వాళ్లను ఏమీ అనలేం కాబట్టి బతికున్న ఉద్యోగులను, కాలేజీ యాజమాన్యాన్ని తప్పుపడతాం. వాళ్లు సరిగ్గా చెప్పలేదు, ఫలానాది చెయ్యలేదు అని. చెపితే వినే రకంగా విద్యార్థులు వున్నారా అని ఒక్కసారి ఆలోచించి చూడండి. ఆ యాక్సిడెంటు జరగడానికి ఆరు గంటల ముందు మా మిత్రుడు అదే దారిలో వెళ్లాడు. అక్కడ ఆపమని అతని బస్సులో వాళ్లు టూరు ఆపరేటర్ను అడిగితే 'నేను ఆపను' అని కచ్చితంగా చెప్పాడట. విద్యార్థులకు అలా ఎవరైనా చెపితే వాళ్లు వూరుకుంటారా?

సంఘటన జరిగాక రోజుకి 500 మంది అక్కడ పని చేస్తున్నారు. కోట్లాది రూపాయలు వెచ్చిస్తున్నారు. ఎంత వెతికినా శవాలే దొరకడమే తప్ప వేరే ఏమీ చేయలేమని అందరికీ తెలుసు. దీనిపై పెట్టే ఖర్చులో 1% వెచ్చించి, అక్కడ ఫెన్సింగ్ కట్టించినా సరిపోయేది. బలాత్కార ఘటనల్లో కాని, యిలాటి ప్రమాదాల్లో కానీ బాధితులు అవసరానికి మించిన రిస్కు తీసుకుంటున్నట్లు అర్థమవుతూనే వుంటుంది. కానీ ఎవరూ పైకి అనరు. వేళకాని వేళలో, తెలియని చోట ఎందుకు మసలుతున్నావ్? రిస్కు ఎందుకు తీసుకున్నావ్? అని అడిగేందుకు వారుండరు. వాళ్లదీ పొరబాటు వుంది అంటే చచ్చిపోయినవారిపై సానుభూతి చూపలేదన్న చెడ్డపేరు వస్తుంది. అందుకని ప్రభుత్వాధికారులనో, పురుషాహంకారాన్నో... ఎవరో ఒకరిని నిందించి సరిపెడతారు. కానీ ఏం లాభం? తన పరిమితుల్లో వుండడం యువత నేర్చుకోవాలి. ఆచితూచి వ్యవహరించాలి. ఏం ఫర్వాలేదు అనే పద్ధతి మార్చుకోవాలి. 'సమాజంలో దౌర్జన్యం పోలేదు, అదను దొరికితే మగాడు కాటేస్తాడు, ప్రభుత్వంలో అలసత్వం పోలేదు, వ్యవస్థలో ఏదీ సరిగ్గా వుండదు, ఘాతుకానికి గురైనా మనకు న్యాయం జరగదు – యిదీ గ్రౌండ్ రియాలిటీ' అన్నది మనసుకు పట్టించుకుని వ్యవహరించాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : సల్మాన్ కేసులో ప్రత్యక్షసాక్షులు

హిట్ అండ్ రన్ కేసులో నిందితుడైన సల్మాన్ ఖాన్ కేసును విచారిస్తున్న ముంబయి కోర్టులో మే 6న ఒక సాక్షి తన ఆరోపణతో సంచలనాన్ని సృష్టించాడు. 2002 సెప్టెంబరు 27 అర్ధరాత్రి దాటాక సల్మాన్ ఖాన్‌కు సంబంధించిన స్పోర్ట్స్ యుటిలిటీ వెహికల్ వేగంగా వెళుతూ బాంద్రాలోని అమెరికన్ ఎక్స్‌ప్రెస్ బేకరీ వద్ద నిద్రపోతున్నవారిపై ఎక్కేసింది. ఒకతను చనిపోయాడు. ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. 304 సెక్షన్‌లోని రెండు క్లాజుల కింద సల్మాన్‌పై అభియోగం మోపి కేసు నడుస్తోంది. అతను పెద్ద స్టార్ కాబట్టి కేసు విచారణ మందకొడిగా నడుస్తోంది. నేరం రుజువైతే 10 ఏళ్ల వరకు జైలు శిక్ష పడవచ్చు. గాయపడిన బాధితులు – ముస్లిమ్ షేక్, మన్నూ ఖాన్, మొహమ్మద్ కలీమ్‌లను ప్రత్యక్షసాక్షులుగా ప్రాసిక్యూషన్ చూపిస్తోంది. ప్రమాదం జరగగానే సల్మాన్ ఖాన్ వాహనంలోంచి దిగాడని, తప్పతాగి వున్నాడని, సరిగ్గా నిలబడలేకుండా వున్నాడని, తమను చూసి అక్కణ్నుంచి పారిపోయాడని వాళ్లు చెపుతున్నారు. సల్మాన్ వాహనంలోంచి దిగినంత మాత్రాన అప్పటిదాకా అతనే నడుపుతున్నాడని చెప్పలేమని సల్మాన్ తరఫు న్యాయవాది శ్రీకాంత్ షివడే వాదిస్తున్నారు.

ఈ బాధితుల తరఫున యిప్పటివరకు ముఖేశ్ పాండే అనే న్యాయవాది వాదిస్తూ వుండేవాడు. అతనే గట్టిగా మాట్లాడి వాళ్లకు నష్టపరిహారం యిప్పించాడని అంటారు. అయితే మే 6 నాటి విచారణలో బాధితుల్లో ఒకడైన ముస్లిమ్ షేక్ "నేను ఆ రోజు సల్మాన్‌ను చూడలేదని కోర్టులో చెప్పాలని, అలా చెపితే రూ.5 లక్షలు లంచం యిస్తామని సల్మాన్ తరఫు నుండి ఆఫర్ వచ్చింది. ఆ ఆఫర్ తెచ్చినది వేరెవరో కాదు, ముఖేశ్ పాండేయే! నాకు ఫోన్ చేసి చెప్పాడు." అని చెప్పాడు. ఈ ఫోన్‌కాల్ విషయం విచారించి, తమకు నివేదించమని కోర్టు పోలీసులను ఆదేశించింది. అది రుజువైతే సల్మాన్‌కి వ్యతిరేకంగా కేసు బలపడుతుంది.**– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : గోపీనాథ్ ముండే

మోదీ కాబినెట్‌లో మంత్రి పదవి సంపాదించి, కుర్చీలో కూర్చోకుండానే రోడ్డు ప్రమాదంలో మరణించిన గోపీనాథ్ ముండే మహారాష్ట్రలో బిజెపి కూటమి విజయానికి ఎంతో కృషి చేసి వున్నారు. మహారాష్ట్రలోని వెనకబడిన జిల్లా బీడ్‌లో పేద రైతుకుటుంబంలో వంజారా అనే ఓబిసి కులంలో 1949లో పుట్టిన గోపీనాథ్‌ను తలిదండ్రులు చదువుకోమని ప్రోత్సహించారు. 1970లో బీడ్ కాలేజీలో చదువుతూండగా యితను స్టూడెంట్స్ కౌన్సిల్‌కై పోటీ చేసి ఓడిపోయాడు. కానీ అదే కాలేజీలో చదువుతున్న ఎబివిపి (ఆరెస్సెస్‌కు సంబంధించిన విద్యార్థి సంఘం – అఖిల భారత విద్యార్థి పరిషత్) నాయకుడు ప్రమోద్ మహాజన్ కళ్లల్లో పడ్డాడు. గోపీనాథ్ పెద్ద వక్త కాదు. రాబోయేది ముందుగానే వూహించి ప్రణాళికలు రచించే తెలివితేటలు లేవు. అయినా యిచ్చినపనిని శ్రద్ధగా చేస్తాడు. అందరితో సౌమ్యంగా, స్నేహంగా మెలగుతాడు. ఉన్నదున్నట్లు మాట్లాడి, ఒక్కోప్పుడు చిక్కుల్లో పడతాడు. ఇటీవల '2009 ఎన్నికలలో నాకు రూ. 8 కోట్లు ఖర్చయింది' అనేసి నాలిక కరుచుకున్నాడు కూడా. ఈ వ్యక్తిగత లక్షణాలు ప్రమోద్‌ను ఆకట్టుకున్నాయి. ఇతనితో స్నేహం చేయడమే కాదు, తన సంస్థలో చేరమని ఆహ్వానించాడు. బిజెపికి పూర్వరూపమైన జనసంఘ్ మహారాష్ట్ర యూనిట్‌కు జనరల్ సెక్రటరీగా వున్న వసంత్‌రావ్ భాగవత్‌ను యీ స్నేహం ఆకట్టుకుంది. మహారాష్ట్రలో అప్పట్లో కాంగ్రెసుకు మరాఠా, ముస్లిము, దళిత వర్గాలు అండగా వుండేవి. బ్రాహ్మణ, బనియా వర్గాలు మాత్రమే జనసంఘ్‌కు ఓటేసేవి. వెనుకబడిన కులాలైన మాలి, ధంగర్, వంజారా కులాలను చేరువ చేసుకుంటే పార్టీ బలపడుతుందని భాగవత్ అనుకున్నారు. ప్రమోద్ సారథ్యంలో గోపీనాథ్‌ను నాయకుడిగా తీర్చిదిద్ది వంజారా, యితర బిసి కులాలలోకి చొచ్చుకుపోవాలని ప్లాను వేశారు. కొంతకాలానికి ప్రమోద్‌న్ ఢిల్లీలో పార్టీకి పని చేయమని, గోపీనాథ్‌ను మహారాష్ట్రలోనే వుండి పని చేయమని ఆదేశించాడు.

ఎమర్జన్సీ విధించడాన్ని జనసంఘ్ ప్రతిఘటించింది. 1975లో ప్రమోద్, గోపీనాథ్ యిద్దరూ అరెస్టయ్యి నాసిక్ జైల్లో వున్నారు. అక్కడ ప్రమోద్ చెల్లెలు ప్రాధాన్య గోపీనాథ్‌కు చేరువైంది. ఇద్దరూ పెళ్లి చేసుకోవాలని అనుకున్నారు. ప్రమోద్ అంగీకరించాడు. గోపీనాథ్‌ది ప్రేమ వివాహమే అయినా ముగ్గురు కూతుళ్లున్నా అతను బరా? పాటిల్ అనే పుణెకు చెందిన లావణి డాన్సర్‌తో సంబంధం ఏర్పరచుకున్నాడు. 1996లో అతను ఉపముఖ్యమంత్రిగా వుండగా ఆ విషయం రచ్చకెక్కింది. ఆమెతో సంబంధం లేదని గోపీనాథ్ బుకాయించబోయాడు. అప్పుడు బాల్ థాకరే 'ప్యార్ కియాతో డర్నా క్యా? చెప్పేయ్' అంటూ గోపీనాథ్‌ను కవ్వించాడు కూడా. ఇది కాకుండా గోపీనాథ్ యిరకాటంలో పడిన మరో సందర్భం ఏమిటంటే – అతను తన బికామ్ డిగ్రీకి తోడు బియల్ కూడా వుందని చెప్పుకుని ఏడాది క్రితం ఓ సర్టిఫికెట్టు చూపించాడు. అయితే ఆ సర్టిఫికెట్టు యిచ్చిన కాలేజీ పెట్టిన తేదీకి ముందే ఆ డిగ్రీ యిచ్చినట్టు వుంది. అందరూ వేళాకోళం చేశారు.

ఎమర్జన్సీ ఎత్తేశాక జనసంఘ్ జనతాపార్టీలో విలీనమైంది. 1980లో విడిగా వచ్చేసి భారతీయ జనతా పార్టీగా అవతారమెత్తింది. అప్పుడు వచ్చిన మహారాష్ట్ర ఎసెంబ్లీ ఎన్నికలలో గోపీనాథ్ అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసి నెగ్గాడు. రాష్ట్ర బిజెపి యూత్ వింగ్‌కు అధ్యక్షుడయ్యాడు. 1985లో ఓడిపోయాడు. కానీ తరువాతి ఏడాదే రాష్ట్ర బిజెపికి అధ్యక్షుడయ్యాడు. మళ్లీ 1990లో నెగ్గాడు.

1992లో ఛగన్ భుజ్‌బల్ శివసేన విడిచి కాంగ్రెసులో చేరడంతో యితను అప్పోజిషన్ లీడరయ్యాడు. 1993లో శరద్ పవార్ ముఖ్యమంత్రిగా రావడంతో గోపీనాథ్ అతనిపై దండెత్తాడు. నిజానికి శరద్, గోపీనాథ్ యిద్దరిదీ మరాట్వాడాయే. ఇద్దరూ వేర్వేరు వర్గాలకు ప్రతినిథులు. చెఱకు పరిశ్రమలో పెట్టుబడిదారులకు శరద్ కొమ్ము కాస్తే, శ్రామికుల పక్షాన గోపీనాథ్ నిలబడ్డాడు. వారిలో చాలామంది అతని కులం వారే. గోపీనాథ్ ఎదుగుదల గమనించిన శరద్ బిజెపిలో అతని ప్రత్యర్థి అయిన నితిన్ గడ్కరీతో సంబంధం పెంచుకున్నాడు. శరద్‌కున్నంత చాణక్యం గోపీనాథ్‌కు లేదు. శరద్ తన జిల్లాను బాగు చేసినంతగా, గోపీనాథ్ తన జిల్లాను బాగు చేయలేదు. గోపీనాథ్ తన వారసుడిగా తన అన్నగారి కొడుకుని కాకుండా కూతుర్ని ఎంచుకుని ఆమెకు ఎసెంబ్లీ టిక్కెట్టు యిప్పించుకోవడం గమనించిన శరద్ అతన్ని 2013లో కాంగ్రెసులో చేర్పించాడు. గోపీనాథ్ పెద్దన్న కూడా అప్పుడే కాంగ్రెసులో చేరాడు.

1993లో శరద్ పవార్ ఎన్రాన్‌తో విద్యుచ్ఛక్తి ఒప్పందం కుదుర్చుకున్నపుడు గోపీనాథ్ చాలా యాగీ చేశాడు. ఎన్రాన్‌ను బంగాళాఖాతంలో పడేస్తాం అంటూ రాష్ట్రమంతా పాదయాత్ర చేసి ప్రచారం చేశాడు. 1995 ఎన్నికలలో బిజెపి-శివసేన కూటమి గెలిచి శివసేన తరఫున మనోహర్ జోషి సిఎంగా, బిజెపి తరఫున గోపీనాథ్ ఉపముఖ్యమంత్రిగా అయ్యారు. ఎన్రాన్ వాళ్లు బాల్ థాకరేని కలిసి మంచీచెడ్డా మాట్లాడుకున్నారు. ఎన్రాన్‌తో మళ్లీ ఒప్పందం కుదిరింది. ఎనర్జీ పోర్టుఫోలియో చూస్తున్న గోపీనాథ్‌ను యిదేమిటని అడిగితే ఈ ఒప్పందంలో పారదర్శకత వుందన్నాడు. హోం శాఖ కూడా అతని వద్దనే వుండేది. అండర్ వరల్డ్‌ను కట్టడి చేసేందుకు ఎమ్‌సిఓసిఎ (మహారాష్ట్ర కంట్రోల్ ఆఫ్ ఆర్గనైజ్‌డ్ క్రైమ్) చట్టం రూపొందించాడు. 1999 ఎసెంబ్లీ ఎన్నికల్లో బిజెపి-శివసేన కూటమి ఓడిపోయి గోపీనాథ్ బలం క్షీణించింది కానీ అదే సమయంలో కేంద్రంలో బిజెపి నెగ్గి ప్రమోద్ బలం చేకూర్చుకుని యితన్ని ఆదుకున్నాడు. 2006లో ప్రమోద్ తన సోదరుడు ప్రవీణ్ చేతిలో హతుడయ్యాడు. హద్దులు మీరిన ప్రమోద్ అక్రమార్జనే దీనికి కారణమంటారు. ఆ మరణం తర్వాత గోపీనాథ్ అనాథగా ఫీలయ్యాడు. 2009లో లోకసభ ఎన్నికలలో నెగ్గి పార్లమెంటు డిప్యూటీ లీడరుగా వున్నా పార్టీలో తననెవరూ పట్టించుకోవడం లేదని బాధపడసాగాడు. ప్రత్యర్థి ఐన నితిన్ గడ్కరీ బిజెపి అధ్యక్షుడు కావడం అతనికి యిబ్బందిగా మారింది. స్నేహితుడైన కాంగ్రెసు నాయకుడు విలాస్‌రావ్ దేశ్‌ముఖ్ కాంగ్రెసులోకి లాగబోయాడు కానీ ఆడ్వాణీ, సుష్మ వద్దని వారించారు. 2014 ఎన్నికల పాటికి గోపీనాథ్ దశ తిరిగింది. బిజెపి అతనికి కీలకబాధ్యతలు అప్పగించింది. మహాయుతి పేరు శివసేన, యితర చిన్న పార్టీలను తన కూటమిలోకి తెచ్చి కాంగ్రెసు-ఎన్‌సిపితో తలపడ్డాడు. అతని కృషి ఫలించి 48కి 42 సీట్లు గెలిచింది యీ కూటమి. అందుకే అతనికి కేంద్రమంత్రి పదవి యిచ్చారు. కానీ దాన్ని అనుభవించడానికి అతను లేడు పాపం.

## ఎమ్బీయస్ : ఎన్నికల ఫలితాలు - 11
## ఎమ్బీయస్ : కొత్తవాళ్లంటేనే మోజు

ఈ సారి పార్లమెంటులో మొదటిసారి ఎంపీగా ఎన్నికైన వారు 315 మంది. 1971లో వీరి సంఖ్య 376. తర్వాత నుండి తగ్గుతూ వచ్చి 1998కి 196కు పడిపోయింది. 2004లో 260 మంది, 2009లో 302 మంది ఎన్నిక కాగా యీసారి 315! వీరిలో 165 మంది బిజెపి వారే. ఆంధ్ర, తెలంగాణ రెండు రాష్ట్రాల నుండి ఎన్నికైన 42 ఎంపీలలో 29 మంది కొత్తవారు. యుపి నుండి 53 మంది ఎన్నికయ్యారు. అంటే ఆ రాష్ట్రం ఎంపీలలో మూడింట రెండు వంతుల మంది అన్నమాట. తమిళనాడు అయితే 39 మందిలో 35 మంది కొత్తవారే. వారిలో 34 మంది ఎడిఎంకెకి చెందినవారు. అంటే 37 ఎడిఎంకె ఎంపీలలో 92% మంది కొత్తవారు. తృణమూల్ 34 మందిలో 56% మంది, బిజెపి 282 మందిలో 59% అంటే 165 మంది కొత్త ముఖాలే. వీరంతా కొత్త వారిని ప్రయోగించి లాభం పొందితే కాంగ్రెసు పాతవారినే పట్టుకుని వేళ్లాడి నష్టపోయింది. వారి 44 ఎంపీలలో కేవలం 9 మంది మాత్రమే కొత్తవారు.

ఈ కొత్త ఎంపీలలో బాల్క సుమన్ వంటి 31 ఏళ్ల విద్యార్థి నేత, బిటెక్ మానేసి సినిమాల్లో ప్రయత్నించి విఫలమైన 32 ఏళ్ల చిరాగ్ పాశ్వాన్ (రామ్ విలాస్ కొడుకు), 44 ఏళ్ల ఒలింపిక్ గోల్డ్ మెడలిస్టు షూటర్ రాజ్యవర్ధన్ రాథోడ్ వున్నారు. కొత్తవారిలో 40 సంఎల వయసు కంటె తక్కువవున్నవారు 60 మంది. వారిలో సగానికి సగం మంది రాజకీయకుటుంబాల నుండి వచ్చినవారే. అంటే పాతవారికి కొనసాగింపుగా వచ్చిన కొత్తవారన్నమాట. గత పార్లమెంటులో చర్చలు తక్కువ, రచ్చ ఎక్కువ. చాలామంది పార్లమెంటుకి హాజరే కాలేదు. హాజరైనవాళ్లలో చాలామంది నోరు విప్పలేదు. వీళ్లయినా పార్లమెంటును సీరియస్‌గా తీసుకుంటారని ఆశిద్దాం. **- ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 27-28 వీక్లీకై** **ఎమ్బీయస్ : ప్రీతి జింటాకు మాజీ ప్రియుడితో తంటా**

"ప్రేమంటే ఇదేరా", "రాజకుమారుడు" తెలుగు సినిమాలలో నటించిన హిందీ నటీమణి ప్రీతి జింటా అందరికీ తెలిసిన వ్యక్తే. బాంబే డైయింగ్ సొంతదారులైన వాడియా కుటుంబానికి చెందిన నెస్ వాడియాతో ఆమె ప్రేమవ్యవహారం కూడా అందరికీ తెలిసినదే. వారి మధ్య కొన్నాళ్లు స్నేహం- కొన్నాళ్లు దూరంగా నడుస్తున్న వ్యవహారం ఒక్కసారిగా వార్తల్లోకి ఎక్కింది. మే 30న అతను తన పట్ల

బహిరంగంగా క్రికెట్ స్టేడియంలో అసభ్యంగా ప్రవర్తించాడని, తన శీలహరణానికి ప్రయత్నించాడని ప్రీతి కేసు పెట్టి అమెరికాకు వెళ్లిపోయింది. సంఘటన జరిగిన రెండు వారాలకు జూన్ 13 అర్ధరాత్రి పూట పోలీసు స్టేషన్‌కు వెళ్లి కేసు పెట్టేసి, మర్నాడే లాస్ ఏంజిలిస్‌లోని తన తమ్ముడి యింటికి వెళ్లి కూర్చుని ట్వీట్లు దంచేస్తూంటే ముంబయి పోలీసులు 'అలా కుదరదు, యిక్కడకు వచ్చి విచారణకు సహకరించు' అని చెప్పారు. ఇక తప్పక, తిరిగి వచ్చి జూన్ 24 న పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫలానా విధంగా నన్ను హింసించాడు, దానికి ఫలానావారు సాక్షులు అని స్టేటుమెంటు యిచ్చింది. సెలబ్రిటీల మధ్య ప్రేమ వ్యవహారాలు నడిచినంతకాలం నడిచి, సడన్‌గా చెడిపోవడం కూడా ఎప్పణ్నుంచో చూస్తూన్నాం. కానీ యిలా బొత్తిగా 354, 509, 504, 506 సెక్షన్ల కింద కేసు పెట్టడం మాత్రం ఎన్నడూ చూడలేదు. వీళ్లిద్దరి మధ్య నడిచిన కథ ఎలాటిది? ఎందుకీ మలుపు తిరిగింది?

## ధైర్యానికి మారుపేరు ప్రీతి

వాళ్లిద్దరూ 2005 ఫిబ్రవరిలో ఒక పార్టీలో కలిశారు. అప్పటికి ఆమెకు 29 ఏళ్లు. పెద్ద స్టార్. గత రెండేళ్లగా ఆమె హీరోయిన్‌గా నటించిన ''కోయీ మిల్ గయా'' రూ. 80 కోట్ల బిజినెస్ చేసింది. ''కల్ హెూ న హెూ'' రూ. 93 కోట్లు, ''వీర్ ఝూరా'' 88 కోట్లు. అన్నిటికంటె ముఖ్యంగా దైవం ఆమె పట్ల వున్నాడని డిసెంబరు 2004 సునామీ నిరూపించింది. సునామీ వచ్చినపుడు తన బాల్యస్నేహితులతో కలిసి ఆమె థాయ్‌లాండ్ బీచ్‌పై నడుస్తోంది. సునామీ శబ్దం విని ఆమె దూరంగా పరిగెట్టి ప్రాణాలు దక్కించుకుంది. ఆమె స్నేహితులందరూ కొట్టుకుపోయారు. మరొకరైతే పిచ్చెక్కిపోయేవారు. కానీ ప్రీతి తట్టుకుంది. నిజానికి ఆమె చాలా ధైర్యవంతురాలు. హిందీ సినిమారంగానికి, ముంబయిలోని అండర్ వరల్డ్‌కు లింకును బయటపెట్టిన భరత్ షా కేసులో ఛోటా షకీల్ అనే డాన్‌కు వ్యతిరేకంగా ఆమె సాక్ష్యం చెప్పింది. సల్మాన్, షారుఖ్ వంటి తక్కిన సాక్షులందరూ భయపడి మాట మార్చారు కానీ ఆమె మాత్రం తనకు ఒక గూండా ఫోన్ చేసి 'నేను రజాక్ అని భాయ్ మనిషిని. నాకు 50 లక్షలు కావాలి' అని అడిగాడు అని తెగేసి చెప్పేసింది. ఆమె తన స్టేటుమెంటు రికార్డు చేసిన తర్వాత ఆమెపై దాడి జరుగుతుందని భయపడిన అప్పటి ముంబయి పోలీసు కమిషనర్ రాకేష్ మారియా కోర్టులో సాక్ష్యం చెప్పేవరకు రెండు నెలల పాటు రక్షణ కల్పించాడు. ఒక సినిమాతారకు యిలాటి విషయాల్లో ఎంతో భయం కలుగుతుంది. కోర్టులో సాక్ష్యం చెప్పే సమయంలో ఎవరైనా మొహంపై కాస్త యాసిడ్ పోసినా చాలు ఆమె కెరియర్ నాశనమై పోతుంది. అయినా ఆమె బెదరకుండా వాస్తవాలు చెప్పింది.

## ఇద్దరూ అనుభవజ్ఞులే...

ఇక నెస్ వాడియా – వాడియా గ్రూపు చాలా తరాలుగా పెద్ద వ్యాపారస్తులు. బాంబే డైయింగ్‌తో బాటు వాళ్లకు అనేక వ్యాపారాలున్నాయి. నెస్, అతని తమ్ముడు జహంగీర్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. వాళ్ల తల్లి మౌరీన్ కూడా సోషల్ లేడీయే. వ్యాపారంలో ఆరితేరిన వ్యక్తే. 35 ఏళ్ల నెస్ అందగాడే. ప్రీతి, అతను ఒకరి నొకరు యిష్టపడ్డారు. కలిసి తిరగసాగారు. రెండు నెలల తర్వాత వైష్ణోదేవికి ప్రీతి తల్లి నీలప్రభతో కలిసి వెళ్లారు. నెస్ తల్లికి వీరిద్దరూ కలిసి తిరగడం అభ్యంతరకరంగా తోచలేదు. ''ఇద్దరూ మంచి జోడీయే'' అందామె. నెస్ అంతకముందు అమిషా పటేల్, మనీషా కోయిరాలా, లారా దత్తా వంటి హిందీ సినిమా హీరోయిన్లతో కలిసి తిరిగాడు. ఇక ప్రీతి విషయానికి వస్తే డచ్ దేశస్తుడైన ఇంజనియర్ లార్స్ జెడ్సన్‌తో తిరిగింది. (తర్వాత అతను సుచిత్రా పిళ్లయ్‌ను పెళ్లాడాడు). మార్క్ రాబిన్‌సన్ అనే డాన్సర్‌తో కూడా తిరిగింది. గతం మాట ఎలా వున్నా ప్రీతి, నెస్ తలమునకలా ప్రేమలో పడ్డారు. ''సలాం నమస్తే'' సినిమా షూటింగుకై ఆమె ఆస్ట్రేలియాకు వెళితే అక్కడ బిజినెస్ పని కల్పించుకుని నెస్ కూడా తయారయ్యాడు. ఆ సినిమాలో ఓ అతిథి పాత్ర వేశాడు కూడా. ''కభీ అల్‌విదా న కెహనా'' షూటింగ్‌కై న్యూయార్క్ వెళ్లి తిరిగి వచ్చేటప్పుడు యూరోప్‌లో ఒక వారం వుండిపోయారు.

## సల్మాన్ దాబులతో ప్రీతికి చిక్కులు..

ఈ ప్రేమ వ్యవహారంలో పడి నెస్ బొంబాయి బయటే తిరుగుతూండడంతో అతని తమ్ముడు జహంగీర్ తన తిరుగుళ్లు కట్టిపెట్టి వ్యాపారంపై దృష్టి పెట్టాడు. గోఎయిర్ ఎయిర్‌లైన్సు ప్రారంభించాడు. టీనా అంబానీలాగే ప్రీతి కూడా యిక బిజినెస్ ఫ్యామిలీలోకి వెళ్లిపోతుందేమో అనుకునే సమయంలో ''హిందూస్తాన్ టైమ్స్'' వేసిన కథనం ప్రీతిని యిబ్బంది పెట్టింది. నటుడు సల్మాన్ ఖాన్ ఐశ్వర్యా రైతో జరిపిన సంభాషణలున్న టేపులు అంటూ ఆ పత్రిక జులై 2005లో ప్రచురించింది. దానిలో సల్మాన్ ఐశ్వర్యను అండర్ వరల్డ్ పేరు చెప్పి బెదిరించాడు, మాటల్లో ''చోరీ చోరీ చుప్‌కె చుప్‌కె'' నిర్మాణసమయంలో తను ప్రీతిని అనుభవించానని చెప్పుకున్నాడు. ఈ వార్త బయటకు వచ్చినపుడు ప్రీతి ఇటలీలో వుంది. కంగారుపడి ఐశ్వర్యకు ఫోన్ చేసి 'ఈ టేపులు నకిలీవేమో కనుక్కో' అంది. 'కాదనుకుంటా' అంది ఐశ్వర్య. అయినా ప్రీతి ఆ పత్రికపై పరువునష్టం దావా వేసింది. కోర్టువాళ్లు ఫోరెన్సిక్ లాబ్ వాళ్లను

నిర్ధారించమన్నారు. వాళ్లు ఆ టేపులు నకిలీవే అని చెప్పారు. ఈ గొడవ కారణమో ఏమో తెలియదు కానీ 2006లో నెస్, ప్రీతి కలిసి తిరగడం తగ్గింది. జహంగీర్ బాంబే డైయింగు ఎండీ అయ్యాడు. నెస్ మిల్లు భూములు, సెంచరీ మిల్సు కాంప్లెక్స్‌పై బికె బిర్లా కుటుంబంతో వ్యాజ్యం వీటితో సతమతమవుతున్నాడు. ప్రీతి, నెస్ తల్లి మారీన్ యిద్దరూ కలిసి మిసెస్ గ్లాడ్‌రాగ్స్ పోటీలు పెడుతూ ఆత్మీయత పెంచుకున్నారు.

## శేఖర్ కపూర్‌తో ఉన్నట్టా? లేనట్టా?

2007లో ఐశ్వర్య-అభిషేక్ పెళ్లికి నెస్, ప్రీతి కలిసి వెళ్లారు. తర్వాతి పెళ్లి వీళ్లదే అని అంతా అనుకుంటూన్న సమయంలో గాయని, నటీమణి అయిన సుచిత్రా కృష్ణమూర్తి వివాదం బయటకు వచ్చింది. తనూ, తన భర్త డైరక్టర్ శేఖర్ కపూర్ విడిపోవడానికి కారణం ప్రీతియే అని సుచిత్ర ఆరోపించింది. తన భర్తకూ, ప్రీతికీ అక్రమ సంబంధం వుందని ఆమె అభియోగం. ఆ వార్త పేపర్లో రాగానే ప్రీతి సుచిత్రకు ఫోన్ చేసి 'నేను యిప్పుడు నెస్‌ను పెళ్లి చేసుకోబోతున్నాను. నా తరఫున ఫ్రెండ్‌గా రమ్మనమని శేఖర్‌ను కోరాను.' అని చెప్పిందట. ఈ విషయం సుచిత్రయే పేపర్లకు చెప్పింది. ఇది జరిగిన మూణ్నెళ్లకు అంటే 2007 జూన్‌లో ప్రీతి, నెస్ స్పెయిన్‌లో విజయ్ మాల్యా యిచ్చిన యాచ్ పార్టీలో హంగామా చేశారు. ఇవన్నీ నెస్ తల్లికి రుచించలేదు. "మీ అబ్బాయి పెళ్లి సంగతేమిటి?" అని ఎవరో అడిగితే "మా వాడు జింటాను చేసుకున్నా జీబ్రాను చేసుకున్నా నేను పట్టించుకోను." అందావిడ.

## పాత్రతో తాదాత్మ్యం

ప్రీతి గ్లామర్ హీరోయిన్‌గా నటించిన "ఝూమ్ బరాబర్ ఝూమ్" ఫ్లాపు కావడంతో సినిమా పార్టీలు కట్టిపెట్టి బిజినెస్ సెలబ్రిటీల్లా గుఱ్ఱాల పోటీకి వెళ్లనారంభించింది. నెస్‌తో కలిసి క్రికెట్‌లో ఐపియల్‌కై టీము తయారుచేయ నారంభించింది. ఇదే సమయంలో నటిగా తనను తాను తృప్తి పరచుకోవడానికి ఆమె తన యిమేజిని మార్చుకుని అర్థవంతమైన ఆర్ట్ ఫిలింస్ వైపు మొగ్గింది. గృహహింసకు గురైన మహిళల గురించి దీపా మెహతా "హెవెన్ ఆన్ ఎర్త్" అనే ఇండో-కెనడియన్ సినిమా తీస్తూంటే (హిందీలో "విదేశ్" పేరుతో డబ్ అయింది) ఆమె ప్రధాన పాత్ర ధరించింది. ఆ సినిమాలో నటించిన కెనడా దేశపు మహిళలతో ముచ్చటిస్తూ వుంటే హఠాత్తుగా ఆమెకు ఆత్మసాక్షాత్కారం వంటిది కలిగింది - తనూ కూడా ప్రేమ పేరుతో హింసకు గురవుతున్నానని, నెస్ తనపై అధికారం చెలాయిస్తూ అప్పుడప్పుడు క్రూరంగా ప్రవర్తిస్తున్నాడని! ఆ సినిమా గురించి, పాత్ర గురించి విన్న నెస్ యీ సినిమా ద్వారా ప్రీతి తనకు ఒక హెచ్చరిక పంపుతున్నట్లుగా ఫీలై, 2008 ఏప్రిల్‌లో "విదేశ్" సినిమా స్క్రీన్ చేసినపుడు కోపంతో ప్రీతి చెంప ఛెళ్లుమనిపించాడని పుకార్లు వచ్చాయి. వాళ్ల మధ్య కలహాలు, రాజీలు రొటీన్ అయిపోయాయి.

వీటి మధ్యనే కింగ్స్ లెవెన్ పంజాబ్ టీములో వాళ్లిద్దరూ చెరో 23% వాటా తీసుకోవడం జరిగింది. డాబర్ గ్రూపు భాగస్వామి, లలిత్ మోదీకి అల్లుడి వరస అయ్యే గౌరవ్ బర్మన్ 23%, అతని సోదరుడు మోహిత్ బర్మన్ 11.5% తీసుకోగా మిగతావాళ్లందరూ చిన్న వాటాదార్లే. ఆ టీము ఏర్పడిన దగ్గర్నుంచి ఎవరూ దాని గురించి పట్టించుకోలేదు. ఎప్పుడూ నష్టాలే. 2009 వచ్చేసరికి ప్రీతి తన ప్రేమ వ్యవహారంపై మొహం మొత్తింది. ప్రేమకోసం తన కెరియర్‌ను నాశనం చేసుకున్నాననుకుంది. ఆమె స్థానంలో ప్రియాంకా చోప్డా, కరీనా కపూర్, కత్రినా కైఫ్ వచ్చేశారు. శారీరకంగా, మానసికంగా అలసిపోయిన ప్రీతి విదేశీ యాత్రలు చేయసాగింది. మలైకా అరోడా, గౌరీ ఖాన్‌లతో లండన్‌లో కొన్నాళ్లు పచార్లు చేసింది. లాస్ ఏంజిలిస్‌లో తమ్ముడి వద్ద కొన్నాళ్లు వుంది. సురీలీ గోయల్‌తో పారిస్‌లో వుంది. 2009 ఎన్నికలలో కాన్పూరులో కాంగ్రెసు అభ్యర్థికై ప్రచారం చేసింది.

## నెస్ తెచ్చిపెట్టుకున్న గండం

ఈ లోపున నెస్ ప్రీతిని మర్చిపోయి థాపర్ గ్రూపుకి వారసురాలైన ఆయేషా థాపర్‌తో తిరగసాగాడు. అతని అహంభావాన్ని బయటపెట్టే సంఘటన ఒకటి 2009లోనే జరిగింది. అతనూ, మోహిత్ బర్మన్, జోహాన్సన్స్‌బర్గ్ స్టేడియంలో విఐపి లాంజ్‌లో కూర్చుని ఆట చూస్తూండగా వాళ్ల ముందు వరుసలో ఒకమ్మాయి నిలబడి ఆట చూస్తోంది. నాకు అడ్డు వస్తున్నావు తప్పుకో అంటూ తాగి వున్న మోహిత్ ఆ అమ్మాయిని అదలించాడు. ఆ అమ్మాయి పట్టించుకోలేదు. అప్పుడు అతను వాళ్ల టీము జండా కర్రతో ఆమె పిరుదులపై పొడవసాగాడు. కాస్సేపు వూరుకున్నా యింకా అసభ్యంగా ప్రవర్తించడంతో ఆమె తన సెక్యూరిటీ గార్డులను పిలిచింది. ఆ అమ్మాయి సహారా గ్రూపుకి చెందిన దక్షిణాఫ్రికాలోనే బిజినెస్‌మన్ అజయ్ గుప్తా కూతురు. మోహిత్ చేసినదానిలో తప్పు లేదని నెస్ వాళ్లతో వాదించాడు. దాంతో ఒళ్లు మండిన సెక్యూరిటీ గార్డులు, పోలీసులు వీళ్లిద్దరినీ చావగొట్టారు. అజయ్ గుప్తా తన స్నేహితుడైన సౌత్ ఆఫ్రికా అధ్యక్షుడితో చెప్పి వీళ్లను దేశం నుంచి వెళ్లగొట్టించబోయాడు. లలిత్ మోదీ వీళ్ల తరఫున రాయబారం నడిపి, వీళ్లను అజయ్ గుప్తా యింటికి పంపాడు. వీళ్లు చేసినదానికి లెంపలేసుకుని రాతపూర్వకంగా కూడా క్షమాపణ చెప్పి

సర్దుబాటు చేసుకున్నారు. ఇదంతా పేపర్లలో వచ్చింది.

### వ్యాపారాన్ని సీరియస్‌గా తీసుకున్న ప్రీతి

ప్రీతికి తన అనుమానాలు నిజమేననిపించాయి. ఇలా తెగిన గాలిపటంలా తిరిగేబదులు క్రికెట్ టీము బిజినెస్ గురించి గట్టిగా పట్టించుకుంటే మంచిది కదా అనుకుంది. హార్వార్డు యూనివర్శిటీకి వెళ్లి డీల్ నెగోషియేషన్స్‌లో ఒక కోర్సు చేసింది. ఇండియాకు తిరిగి వచ్చి తన టీమును ప్రమోట్ చేయడానికి నానా కష్టాలు పడింది. ప్రెస్ కాన్ఫరెన్సులు నిర్వహించడాలు, ఆటగాళ్ల భార్యలతో ఫోటోలు దిగడాలు, మైదానంలోకి వెళ్లి ఆటగాళ్లను ఉత్సాహపరచడాలు అవన్నీ చేసేది. ''మాలో ఉత్సాహం నింపినది ప్రీతి మాత్రమే'' అంటారు ఆ టీము ఆటగాళ్లు. తక్కిన భాగస్వాములెవరూ విఐపి గ్యాలరీ దిగి రాలేదు సరికదా స్వయంగా వ్యాపారవేత్తలై వుండి కూడా ఆర్థికపరమైన విషయాలను పట్టించుకోలేదు. ఏళ్ల తరబడి బాలన్స్ షీట్లు, ఇన్‌కమ్‌టాక్స్ రిటర్న్స్ సబ్మిట్ చేయకపోవడంతో చండీగఢ్ కోర్టు 2010లో ప్రీతి, నెస్, మొహిత్‌లపై నాన్ బెయిలబుల్ అరెస్టు వారంట్లు జారీ చేసింది. దీనికి తోడు ఎన్‌విడి సోలార్ అనే కంపెనీతో జరిపిన లావాదేవీలపై కూడా నీలినీడలు ప్రసరించాయి. ఇక అప్పణ్నుంచి ఆ వ్యాపారం మూసేసి షేర్లు యితరులకు అమ్మేద్దామని నెస్, అతని స్నేహితులు ప్రకటించసాగారు. కానీ అప్పటికే లలిత్ మోదీ వ్యవహారాలపై విచారణ జరుపుతున్న బిసిసిఐ, అతనికి, యీ టీముకి లింకులున్న అనుమానంతో అనుమతి యివ్వలేదు. కంపెనీ నష్టాల్లోనే నడుస్తోంది.

నెస్‌కైతే యితర వ్యాపారాలున్నాయి. ప్రీతికి సినిమాలు కూడా లేవు. ఏదో ఒక యాక్టివిటీ వుండాలి. గతంలో కెమాల్ అమ్రోహీ కుటుంబానికి రూ. 2 కోట్లు అప్పు యిస్తే వాళ్లు తిరిగి యివ్వలేదు. వాళ్లపై కేసు పెట్టింది. ఖార్‌లో తన ఎపార్ట్‌మెంట్ అద్దెకివ్వబోయింది. సెంట్రల్ బ్యాంక్ నుండి రూ. 10 కోట్లు అప్పు చేసి ''ఇష్క్ యిన్ పారిస్'' సినిమా తీస్తే రూ. 3 కోట్లు మాత్రమే తిరిగి వచ్చింది. స్రిప్టు రచయిత అబ్బాస్ టైర్‌వాలా తనకు ప్రీతి రూ.18 లక్షలు యివ్వాలంటూ కేసు పడేశాడు. ఇలా డబ్బు వ్యవహారాలతో సతమతమవుతూనే కింగ్స్ లెవెన్ పంజాబ్‌ను ప్రమోట్ చేస్తూనే వుంది. ఎట్టకేలకు స్థాపించిన ఏడేళ్లకు రూ.78 లక్షల లాభం చవి చూసింది ఆ కంపెనీ. ప్రీతి కారణంగానే యిది సాధ్యపడుతుందని అందరూ అంటున్న సమయంలో ఆమె నెస్‌పై కక్ష సాధించబూనినట్లు అనిపిస్తోంది.

### గర్‌వారే స్టేడియంలో జరిగిన ఘటన

మే 30 న గర్‌వారే స్టేడియంలో ఐపియల్ క్వాలిఫైయర్ 2 జరుగుతాండగా ప్రీతి, ఆమె సన్నిహితులు విఐపి గ్యాలరీలో సీట్లన్నీ ఆక్రమించుకుని కూర్చున్నారు. ఆ రోజు నెస్ బర్త్‌డే కావడంతో బర్త్ డే పార్టీ ముగించుకుని, తల్లి, మేనల్లుడితో నెస్ ఆలస్యంగా సాయంత్రం 8.15కి వచ్చాడు. మొదటి వరసలో తన కోసం రిజర్వ్ చేసుకున్న సీట్లలో ప్రీతి, టీము సభ్యుడైన సౌత్ ఆఫ్రికా డేవిడ్ మిల్లర్ కుటుంబం కూర్చోవడం, తమను చూసి కూడా ఎవరూ సీట్లు ఖాళీ చేసి యివ్వకపోవడంతో మండిపడ్డాడు. టీము సిఒఓ చేత చెప్పించినా ప్రీతి ఖాతరు చేయలేదు. సీటు కోసం తన తల్లి 20 నిఎఎల పాటు నిలబడడంతో కోపం కట్టలు తెంచుకుంది. అందరి ముందూ ప్రీతితో ఘర్షణకు దిగాడు. ఆమె చేయి పట్టుకుని లాగాడు. బూతులు కురిపించాడు. దానికి ప్రతీకారంగా ప్రీతి యీ కేసు పెట్టింది. జూన్ 24 న ఆమె యిచ్చిన వివరణ ప్రకారం – నెస్ తనను తిట్టి, మానభంగం (!?!) చేసినదానికి 14 మంది సాక్ష్యం వున్నారు. వారిలో సచిన్ టెండూల్కర్ కొడుకు అర్జున్ ఒకడు. అక్కణ్నుంచి ఆమె నాన్ ఎసి సెక్షన్‌లోకి వచ్చి కూర్చుంటే అక్కడకీ వచ్చి తిట్టాడు. దానికి సాక్ష్యం ధనీశ్ మర్చంట్. ఆ తర్వాత గ్రౌండ్‌లోకి దిగి టీము సభ్యులతో మాట్లాడుతూంటే వారి ఎదురుగా మళ్లీ తిట్టాడు. అక్కడున్నవాళ్లు చెప్పేదాని ప్రకారం ప్రీతి కూడా తక్కువ తినలేదు. తనూ నెస్‌ను యిష్టం వచ్చినట్లు అశ్లీలపదాలతో తిట్టిపోసింది.

ఈ సంఘటనలు ఆధారంగా తను అత్యాచారానికి గురయ్యానని ఆమె కేసు పెట్టడమే వింత. పైగా రవి పూజారి అనే అండర్ వరల్డ్ గాంగ్‌స్టర్ ప్రీతి తరఫున ఇరాన్ నుంచి ఫోన్ చేసి నెస్‌ను బెదిరించడం మరీ వింత. అలా ఫోన్ చేయమని ప్రీతి కోరిందో, లేక అతను తనంతట తనే చేశాడో యింకా తెలియదు. ఇక్కడ ఒక విషయం గుర్తుకు తెచ్చుకోవాలి. సల్మాన్ ఖాన్ – ఐశ్వర్యా టేపుల్లో అండర్ వరల్డ్‌కు, తనకు సన్నిహిత సంబంధాలున్నాయని సల్మాన్ పదేపదే చెప్పుకున్నాడు. ''హిందూస్తాన్ టైమ్స్''పై కేసు పెట్టినపుడు తనతో శారీరక సంబంధం విషయంలో సల్మాన్ అబద్ధం చెప్తున్నాడని ఆరోపించినా, ప్రీతి సల్మాన్‌తో స్నేహం వదులుకోలేదు. అతనితో ''జానేమన్'' సినిమాలో వేసింది కూడా. ఈ ఫోన్ కాల్ వెనుక సల్మాన్ ఓవరాక్షన్ వుందేమో తెలియదు. ఏది ఏమైనా ప్రీతి నిజజీవితమే సినిమాను మించిన రసవత్తరమైన కథ. ఇంకెన్ని మలుపులు తిరుగుతుందో గమనిస్తూ వుండాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 29–30 వీక్లీకై** **ఎమ్బీయస్ : ఆప్ విలాప్**

ఇటీవలి కాలంలో విపరీతంగా ఆశలు రేకెత్తించి దబ్బున కిందపడిన పార్టీ ఆప్! ఎవరూ వూహించని విధంగా ఢిల్లీ ఎసెంబ్లీ ఎన్నికలలో 28 సీట్లు తెచ్చుకుని ప్రభుత్వం ఏర్పరచిన ఆప్ దేశంలో కొత్త విప్లవాన్ని తెచ్చిందని అందరూ ఆశలు పెట్టుకున్నారు. అర్జంటుగా అనేక రాష్ట్రాలలో ఆప్ శాఖలు వెలిశాయి. ఆప్ టిక్కెట్ పై పోటీ చేయడానికి మేధావులు ముందుకొచ్చారు. ఇక మనకు ఎదురులేదనుకున్నారు ఆప్ నాయకులు. దేశమంతా పోటీ చేయాలని నిశ్చయించుకున్నారు. 434 స్థానాల్లో ఆప్ అభ్యర్థులు నిలబడ్డారు. షీలా దీక్షిత్ ఎక్కడ నిలబడితే అక్కడ నిలబడతానని ప్రకటించి తన క్యాడర్‌లో స్థయిర్యాన్ని పెంచి, షీలాను ఓడించిన అరవింద్ అత్మవిశ్వాసంతో అదే రకమైన ఛాలెంజ్ మోదీకి విసిరాడు. వారణాశిలో నిలబడ్డాడు. నెలల తరబడి ప్రచారం చేశాడు. అదే విధంగా రాహుల్ గాంధీ నియోజకవర్గంలో కుమార్ విశ్వాస్ నిలబడ్డాడు. అరవింద్ కేజ్రీవాల్ సలహాదారు యోగేంద్ర యాదవ్ హరియాణాకు యిన్‌చార్జిగా వ్యవహరిస్తూ, హరియాణాలో నిలబడ్డాడు కూడా. యుపిఏ పాలనలోని అవినీతితో విసిగిన ప్రజానీకం దానికి వ్యతిరేకంగా పోరాటం సలిపిన ఆప్‌ని ఆదరిస్తారని దాని అభిమానులు అంచనాలు వేశారు. అవినీతి వ్యతిరేకత తప్ప ఆప్‌కు వేరే సిద్ధాంతం ఏదీ లేదని విమర్శకులు అంటున్నా, అదొక్కటే చాలని వారనుకున్నారు.

చివరకు జరిగిందేమిటి? 434 స్థానాల్లో నిలబడితే 414 (అంటే 96%) స్థానాల్లో డిపాజిట్లు పోగొట్టుకున్నారు. కేవలం నలుగురు నెగ్గారు. అదీ పంజాబ్ రాష్ట్రంలో మాత్రమే! 24.4% ఓట్లతో 4 సీట్లు గెలిచింది. అక్కడ పార్టీ నిర్మాణమే లేదు. అయినా యీ గెలుపు సంభవించింది. వేరే చోట్ల పార్టీలోని ప్రముఖ నాయకులందరూ ఓడిపోయారు. పార్టీకి ప్రజాదరణ తగ్గసాగింది. 2013 అక్టోబరులో దేశవ్యాప్తంగా 3,50,000 మంది వాలంటీర్లు వుంటే యీరోజు 50,000 మంది వున్నారు. ఢిల్లీలో వున్న 15,000 మంది వాలంటీర్లలో సగం మంది పార్టీ విడిచి వెళ్లిపోయారు. పార్టీకి నిధులు కావాలని అడిగితే ఏప్రిల్ నెలలో ఒక రోజు రూ. 30 లక్షలు వచ్చిన సందర్భం వుంది. ఈ రోజు అది వేలల్లోకి పడిపోయింది. అవినీతి జరిగితే మాకు ఒక్క ఫోన్‌కాల్ కొట్టండి చాలు అంటూ ఆప్ ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్‌కు రోజూ వేలాది ఈమెయిల్స్, ఫోన్లు వచ్చేవి. ఇప్పుడు ఆ ఫోన్ మోగడం మానేసింది. ఘజియాబాద్‌లో వున్న రెండంతస్తుల భవనంలోని ఆప్ ఆఫీసు ఒకప్పుడు జనంతో కిక్కిరిసిపోయేది. యిప్పుడు వాలంటీర్లు లేక బావురుమంటోంది. కన్నాట్ ప్లేస్‌లోని ఆఫీసులోనే గుప్పెడుమంది కనబడుతున్నారు. అరవింద్ చుట్టూ ఒక ముఠా చేరి అతన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని ఆరోపిస్తూ కొందరు నాయకులు వైదొలగుతున్నారు. పార్టీపై అభిమానంతో చేరిన గోపీనాథ్ వంటివారు విడిచి వెళ్లిపోయారు. దేశమంతా పోటీ చేయాలన్న పాడు సలహా యిచ్చినందుకు యోగేంద్ర యాదవ్‌పై మనీశ్ శిశోడియా బహిరంగంగా విమర్శించాడు. ఆప్ అంటే అరవింద్ కేజ్రీవాల్. అరవింద్ అంటే ఆప్. తన వైఫల్యాలపై ఆత్మవిమర్శ చేసుకోవడానికి అరవింద్ విపాసనా ధ్యానంలో కొన్ని రోజులు గడిపి, జూన్ 8 న పార్టీ మూడు రోజుల ఎగ్జిక్యూటివ్ సమావేశం ఏర్పాటు చేశాడు. అదంతా బూటకం అన్నారు పార్టీ వర్కర్లు కొందరు.

ఎందుకిలా జరిగింది? అని లోతుగా ఆలోచిస్తే – ఢిల్లీలో జరిగినదే దేశమంతా జరుగుతుందని భావించడమే ఆప్ చేసిన పెద్ద పొరబాటు అని తేలుతుంది. ఢిల్లీ మహానగరం. కేంద్రంలో జరిగిన అవినీతి గురించి అక్కడి ప్రజలకు ప్రత్యక్షానుభవం వుంది. ఆప్ చేసిన కృషి గురించి కూడా వారికి అవగాహన వుంది. విద్యాధికులు అధిక సంఖ్యలో వున్న దేశంలోని యితర నగరాలలో కూడా ఆప్ సానుభూతిపరులున్నారు. తక్కిన నగరాలలో, పట్టణాలలో, గ్రామాలలో ఆప్ గురించి ఎంతమందికి తెలుసు? వాళ్లు పార్టీ నిర్మాణమే చేపట్టలేదు. తమ గురించి ప్రచారం చేసుకోలేదు. ఇంటర్నెట్‌లో జరుగుతున్న ప్రచారం చూసి, యావన్మంది ప్రజలు మన వెంట వున్నారనుకోవడం చాలా తప్పు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలలో వాళ్లు సాధించిన విజయం తాత్కాలికమైనది. కాంగ్రెసు అవినీతికి వ్యతిరేకంగా బిజెపికి కూడా ఓటేసి వుండవచ్చు. కానీ ఆప్ కూడా రంగంలో వుంది కాబట్టి, దానికీ ఓట్లేశారు. చివరగా చూస్తే బిజెపి ఎక్కువ సీట్లు గెలుచుకుంది. పార్లమెంటు ఎన్నికలు వచ్చేసరికి మోదీ ప్రధాని కాబోతున్నాడన్న అంశం బలంగా వుంది. ఆప్ తరఫున అటువంటి అభ్యర్థి ఎవరూ లేరు. ఢిల్లీలోని ఏడు పార్లమెంటు స్థానాల్లో ఆప్ ఒక్కటీ గెలవలేకపోయినా దాని ఓటింగు శాతం 29 నుండి 33 కు పెరిగింది. అరవింద్ బృందం ఢిల్లీ ముఖ్యమంత్రిగా కొనసాగి వుంటే పరిస్థితి యింతకంటె మెరుగ్గా వుండేది. ఢిల్లీని పాలించకపోయినా కనీసం పార్లమెంటు ఎన్నికల సమయంలో అరవింద్, యితర ఆప్ నాయకులు ఢిల్లీలో వుండి ప్రచారం చేసినా రెండో, మూడో గెలిచేవారు. ఏనుగు కుంభస్థలం కొట్టాలంటూ వాళ్లు వారణాశికి, అమేఠీకి చెదిరిపోవడంతో ద్వితీయశ్రేణి నాయకులు మాత్రమే ఢిల్లీలో పోరాడవలసి వచ్చింది. అందుకే యీ ఓటమి.

ఢిల్లీలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేటన్ని సీట్లు ఆప్‌కు రాలేదు. కాంగ్రెసు మద్దతుతో ఏర్పరిస్తే పరువు పోతుందన్న భయం. చివరకు ప్రజాభిప్రాయ సేకరణ అంటూ హంగామా చేసి కాంగ్రెసు మద్దతుతో ఏర్పరచారు. జలమండలి, విద్యుత్ చార్జీల తగ్గింపు వంటి మంచి పనులు చేసినా, తొలిరోజు నుండి పబ్లిసిటీ కోసం పాకులాడారు. అర్ధరాత్రి మంత్రిగారి దాడులు, పోలీసులతో వివాదం, అధికారులతో పేచీ, ప్రజా దర్బార్, మంత్రులే ధర్నాలు చేయడం – వీళ్లు రాజులా? అరాచకవాదులా? అన్న సందేహం కలిగేట్లా చేశారు. చివరకు అవినీతి విషయంలో కాంగ్రెసు, బిజెపి ఒక తానులో గుడ్డలే అని నిరూపించి వారిపై పార్లమెంటు ఎన్నికల్లో పైచేయి సాధించే లక్ష్యంతో మద్దతు లేకపోయినా జనలోక్‌పాల్ బిల్లు అసెంబ్లీలో ప్రవేశపెట్టి తమ 49 రోజుల ప్రభుత్వాన్ని తామే కూల్చేసుకున్నారు. అడ్డమైనదానికీ ప్రజాభిప్రాయం కోరే ఆప్, యింతటి ముఖ్యమైన విషయంలో ఎందుకు అడగలేదు? రాజకీయక్రీడ ఆడుదామనుకుంది కాబట్టి! ఈ అతితెలివితేటలను జనం హర్షించలేదు. ఆప్ ప్రభుత్వం పడిపోగానే ఢిల్లీ అధికారగణం

వాళ్ల నిర్ణయాలన్నీ తిరగతోడారు. పూర్వవిధానాలే అమలు చేస్తున్నారు. మధ్యలో ప్రజలు నష్టపోయారు. అందుకే పార్లమెంటు ఎన్నికలలో మధ్యతరగతి ప్రజలు ఆప్‌కు ఓటేయలేదు.

గత ఏడాది అవినీతి వ్యతిరేక కార్యక్రమంలో పాలుపంచుకోవడానికి 3 లక్షలమంది వాలంటీర్లు ఢిల్లీలో యిల్లిల్లూ తిరిగారు. ఎంతోమంది తమ ఉద్యోగాలు వదులుకుని ఆప్‌లో చేరారు. ఏవి తల్లీ నిరుడు ముసిరిన హిమసమూహములు? అన్నట్లు ఈ సారి ఎవరూ లేరు. అభ్యర్థులే గడప దిగలేదట. "మోదీ మొహం చూసి బిజెపికి ఎలాగూ ఓట్లేస్తారు. మనం కష్టపడినా ప్రయోజనం లేదు." అనుకుని వూరుకున్నారు. అధికారం దక్కడంతో ఆప్‌లో చీలికలు వచ్చేశాయి. అరవింద్‌కు, సాధారణ కార్యకర్తలకు మధ్య గోడలు లేచాయి. ఆప్ తనను తాను ఎక్కువగా వూహించుకోసాగింది. లోకసభ ఎన్నికల్లో పోటీ చేయాలి, రూ. 200 కోట్లు కావాలి అని అభిమానులను అడిగితే రూ. 35 కోట్లు వచ్చాయి. అతి చేస్తే గతి చెడుతుందని పెద్దలు వూరికే అనలేదు. దేశమంతా పోటీ చేయాలనుకోవడంతో అప్పటికప్పుడు పార్టీలో చేరిన వారికి కూడా టిక్కెట్లు యిచ్చారు. 2009 ఎన్నికల్లో లోకసత్తా యిలాటి పొరబాట్లే చేసింది. ఎన్నికలలో ఓడిపోయాక కూడా అరవింద్ పాతవిధానాలను మార్చుకోలేదు. నితిన్ గడ్కరీ పరువునష్టం దావా కేసులో రూ.10 వేల బాండ్ యివ్వవయ్యా బాబూ బెయిల్ యిస్తానని జడ్జి బతిమాలినా అరవింద్ మొండికేసి, తీహార్ జైలుకి వెళ్లి కూర్చున్నాడు. తనపై సింపతీ కలుగుతుందనుకున్నాడు కానీ తీహార్ జైలు గేటు ఎదుట మే 27 న హాజరైన పార్టీ వర్కర్ల సంఖ్య చూశాక గుండెలు జారి, నోరు మూసుకుని బాండ్ యిచ్చి, బెయిల్ తీసుకుని యింటికి వెళ్లి కూర్చున్నాడు. సరిగ్గా చెప్పాలంటే నమలగలిగిన దాని కంటె ఎక్కువ కొరికి ఆప్ నష్టపోయింది. తాహతుకు మించిన ఎగరబోయి చతికిలపడింది. నెట్‌లో హంగామా చూసి తమ బలాన్ని అతిగా వూహించుకునే ఆర్భాటపు, అర్భకపు పార్టీలందరికీ ఆప్ విలాపం గుణపాఠం కావాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

**జూన్ 31-33 వీక్షికై ఎమ్బీయస్ : విస్తరణపథంలో బిజెపి**

పార్లమెంటు ఎన్నికలలో బిజెపి తనంతట తానే మెజారిటీ తెచ్చుకుని 30 ఏళ్ల చరిత్రను తిరగరాసింది. ఇప్పుడు రాష్ట్రాలలో కూడా విస్తరించవచ్చని ఆశ పడుతోంది. ఈ ఆశాభావానికి ఆధారం ఏమిటంటే బిజెపి 282 పార్లమెంటు సీట్లలో ప్రథమస్థానం తెచ్చుకోవడంతో బాటు 54 సీట్లలో ద్వితీయస్థానం పొందింది. ఇవి కర్ణాటకలో, ఒడిశాలో, కొన్ని ఈశాన్యరాష్ట్రాలలో కేరళ, తమిళనాడులో వున్నాయి. ఈ ఏడాది అయిదు రాష్ట్రాలలో పాగా వేయడానికి బిజెపి పావులు కదుపుతోంది. వీటిలో మొదటిది ఢిల్లీ. ముఖ్యమంత్రిగా అరవింద్ రాజీనామా చేశాక ప్రభుత్వం లేకుండా పోయింది. కాంగ్రెస్ మద్దతుతో మళ్లీ ప్రభుత్వం ఏర్పరుద్దామని అరవింద్ ప్రయత్నిస్తున్నా కాంగ్రెస్ కలిసి వచ్చేట్లు లేదు. గత ఏడాది 70 సీట్లలో బిజెపి 32 గెలుచుకుంది. వారిలో ముగ్గురు పార్లమెంటు సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ 29ని చేతిలో పెట్టుకుని ఫిరాయింపుదార్లతో ప్రభుత్వం ఏర్పరచే ఛాన్సు కూడా చూస్తున్నారు. అరవింద్ రాజకీయాలకు పనికి రాడని ఆప్‌లో చాలామంది అనుకుంటున్నారు. అలాగే కాంగ్రెసుకు భవిష్యత్తు లేదని కూడా కాంగ్రెసులో చాలామంది అనుకుంటున్నారు. తెలుగు రాష్ట్రాలలో కాంగ్రెసు నుండి గోడదూకే వాళ్ల సంఖ్య రోజురోజుకి పెరుగుతోంది. అలాగే ఢిల్లీలో కూడా జరిగితే మళ్లీ ఎన్నికలకు వెళ్లనక్కరలేకుండానే ఢిల్లీలో బిజెపి ప్రభుత్వం ఏర్పడుతుంది.

హరియాణాలో బిజెపికి యిప్పటిదాకా దక్కనంత ఘనవిజయం దక్కింది. మొన్న ఎన్నికల్లో 72 అసెంబ్లీ సెగ్మెంట్లలో 52 వాటిల్లో ప్రథమస్థానంలో వుంది. 10 పార్లమెంటు సీట్లలో 7 గెలుచుకుంది. ఈ ఏడాది చివర్లో అసెంబ్లీ ఎన్నికలున్నాయి. కులదీప్ బిష్ణోయ్ సారథ్యంలోని హరియాణా జనహిత్ కాంగ్రెస్‌తో ప్రస్తుతం వున్న పొత్తు తెంపుకుని (వాళ్లకు 18 ఎసెంబ్లీ సిగ్మెంట్లలో ఆధిక్యత వచ్చింది) ఎవరైనా జాట్‌ను ముఖ్యమంత్రిగా ప్రకటిస్తే చాలు, జాట్ ఓట్లతో నెట్టుకు వచ్చే ఓం ప్రకాశ్ చౌటాలా పార్టీ సోదిలోకి లేకుండా పోతుంది అని బిజెపి స్థానిక నాయకులంటున్నారు. ఇక మహారాష్ట్ర. ... లో అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. బిజెపి కూటమి 48 లోకసభ స్థానాల్లో 41 గెలుచుకుంది. ముండే మరణంతో బిజెపికి స్థానిక నాయకుడు లేకుండా పోయాడు. అతని స్థానంలో నితిన్ గడ్కరీని వెళ్లమంటే వెళ్లనంటున్నాడు. ఇది చూసి శివసేన అధిపతి ఉద్ధవ్ ఠాక్రే నేనే మహారాష్ట్రకు తదుపరి ముఖ్యమంత్రిని అని బిజెపితో బేరాలు పెడుతున్నాడు. ముఖ్యమంత్రి అభ్యర్థి ఎవరో ప్రకటించకుండా ఎన్నికలకు వెళ్లాలని బిజెపి నాయకుల ఒత్తిడి. ఎవరికి ఎక్కువ ఓట్లు వస్తే వాళ్లకే ముఖ్యమంత్రి అని ఒప్పందం చేసుకోవాలట. 2009 ఎన్నికలలో బిజెపికి 54 సీట్లు రాగా, శివసేనకు 45 వచ్చాయి. ఈ సారి అదే నిష్పత్తిలో వస్తాయని బిజెపి ఆశ.

జమ్మూ కశ్మీర్‌లో 6 లోకసభ సీట్లలో 3 బిజెపికి వచ్చాయి. 32% ఓట్లు వచ్చాయి. కాంగ్రెసు, పిడిఎఫ్, నేషనల్ కాన్ఫరెన్సులకు సైతం యీ శాతం రాలేదు. ఈ లెక్క వేసుకుని కశ్మీర్‌లో యీ ఏడాది చివర్లో జరిగే ఎసెంబ్లీ ఎన్నికలలో 87 సీట్లలో 44 కంటె ఎక్కువ తెచ్చుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయగలమని బిజెపి అనుకుంటోంది. అది పొరబాటు అంటున్నారు విశ్లేషకులు. మోదీని ప్రధానిగా ప్రకటించకుండా వుంటే బిజెపికి 142 సీట్లు వచ్చేవి అని వారి అంచనా. అసెంబ్లీలో మోదీ ఫ్యాక్టర్ వుండదు కదా! ఝార్‌ఖండ్‌లో 80 ఎసెంబ్లీ సీట్లలో కాంగ్రెస్‌తో ముఖాముఖీ తలపడడానికి ఆలోచిస్తోంది. జెఎంఎం, ఆర్‌జెడిలతో పొత్తు పెట్టుకుని వారికి కొన్ని సీట్లు యివ్వడం కంటె డైరక్టు ఫైట్‌లోనే ఎక్కువ సీట్లు వస్తాయని వారి అంచనా.

ఏ రాష్ట్రంలో గెలిచినా మానినా బిజెపి దృష్టి యావత్తూ యుపిమీదే వుంది. ఈ పార్లమెంటు ఎన్నికలలో 403 అసెంబ్లీ

సెగ్మెంట్లలో 372 వాటిల్లో గెలిచింది. ఈ ఊపు యిలా వుండగానే ఫిరాయింపు దార్లను తీసుకుని అఖిలేష్ ప్రభుత్వాన్ని కూల్చేయాలని స్థానిక నాయకులు తొందరపడుతున్నారు. ఎస్‌పి నుండి బయటకు వచ్చేసేందుకు 80 మంది సిద్ధంగా వున్నారట. వీరు 2017 ఎన్నికలలో తమకు టిక్కెట్లు యివ్వరని కచ్చితంగా తోచిన యాదవేతరులు, ముస్లిమేతరులు. కానీ ఎస్‌పి ప్రభుత్వాన్ని కూల్చేస్తే బియస్‌పి లాభపడుతుందన్న భయం వుంది వీరికి. ఎందుకంటే ప్రస్తుత అసెంబ్లీలో బిజెపి బలం 47 మాత్రమే. యుపికి ఇన్‌చార్జిగా వున్న అమిత్ షా చాలా తెలివిగా మోదీ ఓబిసి కులాన్ని ముందుకు తెచ్చి వారి ఓట్లు సంపాదించాడు. యుపిలో బిజెపికి దన్నుగా నిలిచిన బ్రాహ్మణ-బనియా నాయకత్వాన్ని అలాగే వుంచి వారి చేతుల మీదుగానే యాదవేతరులైన ఓబిసిలకు టిక్కెట్లు యిప్పించాడు. అగ్రవర్ణాలకు నిలయమైన బిజెపిలో తమకు టిక్కెట్లు ఎన్నటికీ దొరకవని మానసికంగా సిద్ధపడిన యీ కులాలకు అమిత్ షా దేవుడిలా కనబడ్డాడు. అందరూ మూకుమ్మడిగా ఓట్లేసి బిజెపిని గెలిపించారు. అందుకే 2009లో 14% ఓట్లు, 10 సీట్లు గెలిచిన బిజెపి యీసారి 43% ఓట్లు, 73 సీట్లు గెలిచింది.

ఇదే ఫార్ములాతో ఓబిసిలను ఏకీకృతం చేసి బిజెపివైపుకి తీసుకురావాలని అమిత్ షా ప్లాన్లు వేస్తున్నాడు. తమిళనాడు, ఒడిశా, వెస్ట్ బెంగాల్‌లలో పార్టీని బలోపేతం చేసే పని అతనికి అప్పగించారు. ఈ రాష్ట్రాలలో గత కొన్నేళ్లగా యీ వర్గాల సామాజిక, రాజకీయ స్థితిగతుల గురించి, వారిలో సమర్థుల గురించి సమాచార సేకరణలో పడ్డాడు. ఈ పనిలో అతనికి సహకరిస్తున్నది – ఐటీ నిపుణుడైన అతని కుమారుడు జయ్, అతని పర్సనల్ అసిస్టెంట్లు కృపాల్ పాండ్యా, పలక్ షా. ఈ పథకాలు ఏ మేరకు విజయవంతం అవుతాయో, వీటికి ప్రతిగా యితర పార్టీలు ఏయే ప్రణాళికలు రచిస్తాయో చూడాలి. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : కాటేసే పరిస్థితి లేని కోబ్రా

దినదినం బలపడుతున్న మావోయిస్టులను అణచడానికి ప్రస్తుతం వున్న సెంట్రల్ రిజర్వ్ పోలీసు ఫోర్సు (సిఆర్‌పిఎఫ్) సరిపోదని, వారిలో మెరికల్లాటి 10 వేల మందిని ఏరి, మావోయిస్టులు నివసించే అడవుల్లోకి పంపి వాళ్ల స్థావరాల్లోనే వారిని మట్టుపెట్టేట్లా ఒక దళాన్ని ఏర్పరచాలని వచ్చిన సూచనను 2008 సెప్టెంబరు 12 న కేంద్ర హోం శాఖ ఆమోదించింది. ఆ దళానికి కోబ్రా (కమాండో బెటాలియన్స్ ఫర్ రిజల్యూట్ యాక్షన్) అని పేరు పెట్టారు. మావోయిస్టులు సాధారణంగా అడవుల్లో వుంటారు. మామూలు పోలీసులకు అడవులు, వాటిలో దారులు, అక్కడి జీవనవిధానం కొత్త. అందుకే గుంపులుగుంపులుగా వెళుతూ వుంటారు. వారి రాక ముందుగానే తెలిసిపోవడం చేత మావోయిస్టులు వారిని ల్యాండ్ మైన్‌లాటిది పెట్టి చంపేస్తూ వుంటారు. ఈ సమస్యను అధిగమించాలంటే అడవులను క్షుణ్ణంగా అర్థం చేసుకున్నవారిని, మావోయిస్టుల దృష్టి ఆకర్షించకుండా చిన్న చిన్న కమాండో దళాలుగా పంపి వారితో పోరాడాలని ఐడియా. అడవులలో పాముల భయం వుంటుంది కాబట్టి ఆ భయం వీరిలో పోగొట్టడానికి పాముల్ని పట్టడం, తినడం కూడా నేర్పాలని ఆలోచించారు. ఆంధ్రప్రదేశ్‌లో గ్రే హౌండ్స్ అధిపతిగా మావోయిస్టులను అదుపు చేసిన కె. దుర్గాప్రసాద్‌గారి ఆధ్వర్యంలోనే కోబ్రా ఏర్పడాలని హోం మంత్రి చిదంబరం నిర్ణయించారు.

ఇంతవరకు బాగానే వుంది కానీ అయిదున్నర ఏళ్ల తర్వాత తిరిగి చూసుకుంటే ఫలితాలు నిరాశాజనకంగా వున్నాయి. మావోయిస్టులు దేశంలోని అనేక రాష్ట్రాల గుండా రెడ్ కారిడార్ ఏర్పాటు చేసుకున్నారు. దేశవిస్తీర్ణంలో నాలుగో భాగం వున్న ఆ ప్రాంతంపై పట్టు సాధించడమే వారి లక్ష్యం. ఆ కారిడార్‌ను తమ నియంత్రణలో వుంచుకుంటే ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వారు సులభంగా మనుష్యులను, ఆయుధాలను తరలించవచ్చు. 2008 నుండి మావోయిస్టులు యిప్పటిదాకా 1204 మంది సెక్యూరిటీ ఆఫీసర్లను హతమార్చారు. 1169 మంది పోలీసు ఇన్‌ఫార్మర్లను కూడా. కోబ్రాకు సంబంధించిన 27 మంది కమెండోలు వారి చేతిలో చనిపోయారు. కోబ్రాలకు మావోయిస్టుల సమాచారం అందటం లేదు. వారు స్వాధీనం చేసుకున్న ఆయుధాల సంఖ్య, అరెస్టు చేస్తున్న మావోయిస్టుల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు బలంగా వున్నారు. ఝార్‌ఖండ్‌లో యిప్పటిదాకా జరగనంత హింస జరుగుతోంది. గత రెండేళ్లలో 863 నక్సల్ దాడులు జరిగాయి. 254 మంది సాధారణ ప్రజలు, 59 మంది సెక్యూరిటీ పర్సనల్ మరణించగా ఎదురుకాల్పుల్లో కేవలం 19 మంది నక్సల్స్ మరణించారు. ఎందుకీ వైఫల్యం అని తరచి చూస్తే కొన్ని వాస్తవాలు కళ్లకు కడతాయి.

కోబ్రాకు అధిపతిగా నియమించిన దుర్గాప్రసాద్ కోబ్రా హెడ్ ఆఫీసును ఆంధ్రప్రదేశ్‌లో పెడదామన్నారు. ఎందుకంటే ఇలాటి ప్రయోగాలు సఫలం కావాలంటే స్థానిక పోలీసుల సహకారం ఎంతో అవసరం. వారు రహస్యసమాచారం సేకరించి యిస్తేనే యీ దళాలు ముందుకు సాగగలవు. ఆంధ్రప్రదేశ్ చుట్టూ వున్న ప్రాంతాలలోనే మావోయిస్టులు చురుగ్గా వున్నారు. మావోయిస్టు నాయకుల్లో చాలామంది తెలుగువాళ్లే. రహస్య సమాచారం తెప్పించుకోవడం, దానిపై ఒక నిర్ణయం త్వరగా తీసుకుని దాన్ని వేగంగా అడవిలోని దళాలకు చేరవేయడం అత్యంత ముఖ్యమైన పనులు. నిర్ణయాలు తీసుకోవలసినవారు ఎక్కడో ఢిల్లీలో కూర్చుంటే పనులు ఆలస్యమవుతాయి. అవసరమైతే మనిషిని పంపించి సమాచారం దళాలకు అందించాలంటే రెండు, మూడు రోజులు పడుతుంది. అదే కార్యక్షేత్రం మధ్యలో వుంటే ఐదారు గంటలు సరిపోతుంది. ఇవన్నీ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతంగా చేసి చూపించింది. ఇలా ఎన్ని కారణాలు చెప్పినా వినకుండా హెడ్ ఆఫీసును ఢిల్లీలో పెట్టారు. కోబ్రా ఆపరేషన్స్ చూడవలసిన అధికారికి ఇన్‌స్పెక్టర్ జనరల్

హోదా యిచ్చారు. రాష్ట్రాలలో మావోయిస్టు వ్యతిరేక కార్యకలాపాలు పర్యవేక్షిస్తున్నది – సిఆర్‌పిఎఫ్ ఐజీలు. వీళ్లు కోబ్రా అజమాయిషీలోకి రారు కాబట్టి, దాని ఐజీని పట్టించుకోరు. పైగా శాంతిభద్రతలు రాష్ట్రప్రభుత్వపు పరిధిలోకి వస్తాయి. రాష్ట్ర పోలీసులు కేంద్ర పోలీసులతో సమాచారం పంచుకోవాలని లేదు, కలిసి పనిచేయాలని లేదు, నిర్ణయాలు పాటించాలని లేదు, ఎదుటివాళ్లకు ఘనత వస్తుందన్న అనుమానంతో వ్యవహరిస్తూ వుంటారు. ఈ కారణాల వలన కోబ్రా ఐజీ సూచనలు యివ్వగలడు తప్ప వాటిని అమలు చేయాలని శాసించలేడు. అంటే అతను ఒట్టి ఎడ్మినిస్ట్రేటర్‌గానే మిగులుతున్నాడు.

అడవుల్లో వున్నవాళ్లకు ముఖ్యంగా కావలసినది కమ్యూనికేషన్ సౌకర్యం. ఎవరు ఎక్కడున్నారో తెలుసుకుంటూ వుండాలి. అందువలన హోం శాఖ టెలి కమ్యూనికేషన్స్ శాఖను ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్, ఒడిశాలలో జూన్ 2014 కల్లా 2199 సెల్ టవర్లను కట్టమని కోరింది. ఇప్పటిదాకా వాళ్లు కట్టినది 363 టవర్లు మాత్రమే. ఇంటెలిజెన్సు సమాచారం లేనిదే ఎవరూ ఏమీ చేయలేరు. కోబ్రాలో వెయ్యేసి మందితో బెటాలియన్లను తయారుచేసి వారిలో 35 మందిని ఇంటెలిజెన్సు విభాగంలో వుపయోగించుకోమన్నారు. నక్సల్స్ తమలో తాము మాట్లాడుకునేది చాటుగా వినడానికి యింటర్‌సెప్టర్స్ కావాలని కోబ్రా అడిగింది. కానీ హోం శాఖ ఆ అభ్యర్థనను తిరస్కరించింది. మీకేమైనా సమాచారం కావాలంటే సెంట్రల్ యింటెలిజెన్సు వాళ్లు యిస్తారులే అంది. రాత్రిపూట అడవుల్లో తిరగాలంటే ఇన్‌ఫ్రా రెడ్ మోనోక్యులార్స్ కావాలి. వాటికోసం కోబ్రా వాళ్లు అడిగినా యిప్పటిదాకా యివ్వలేదు. ఇలాటి సౌకర్యాలు లేకపోవడం చేత కోబ్రా తన లక్ష్యాలను చేరలేకపోయింది. వీళ్లు ఎక్కడా తమ ప్రభావాన్ని చూపలేకపోయారు. అది సాకుగా చూపించి కోబ్రాపై ఖర్చు తగ్గించేసింది హోం శాఖ. కోబ్రాలకు ఆక్సిలరీ ట్రైనింగ్ యివ్వడానికి స్కూళ్లు పెట్టాలని సిఆర్‌పిఆఫ్ డైరక్టర్ జనరల్ కె విజయకుమార్ సూచించారు. సరేనని 16 తెరిచారు. కాలం గడిచే కొద్దీ వాటి సంఖ్యను పెంచకపోగా మూసేయడం మొదలుపెట్టారు. ప్రస్తుతం 8 మంది మాత్రమే పనిచేస్తున్నాయి. ఇక కోబ్రా దళాలను యితరత్రా కూడా వాడుకోవడం మొదలుపెట్టారు. 2008లో వెయ్యేసి మందితో రెండు కోబ్రా బెటాలియన్లను ఏర్పరచారు. 2009లో 4, 2010 మరో 4 చేర్చారు. వీళ్లను ఒకే చోట కేంద్రీకరించి ఆ రాష్ట్రాన్ని మావోయిస్టు-విముక్తం చేయకుండా 7 రాష్ట్రాలకు వీళ్లని పంచారు. ఝారఖండ్‌లో, ఛత్తీస్‌గఢ్‌లో యిప్పటివరకు సిఆర్‌పిఎఫ్ వెళ్లని ప్రాంతాల్లోకి వీళ్లు చొచ్చుకుపోయి మావోయిస్టులను ప్రతిఘటించి, భారతప్రభుత్వ అధికారాన్ని చాటారు. వాళ్లని అక్కడే వుంచకుండా ఢిల్లీ అధినేతలు వాళ్లని వేరేచోటకి తరలించారు. అంతే, మావోయిస్టులు వచ్చి మళ్లీ తమ జండా పాకారు. కోబ్రా విలువ తెలియని వారి అధినేతలు యీ మధ్య ఆసామ్‌లో గొడవలైతే అక్కడికీ పంపారు. రోడ్లను పెట్రోలింగ్ చేయమన్నారు.

ఇక కోబ్రా తాచుపాములా ఎలా వుండగలుగుతుంది? అందుకే వానపాముగా మారుతోంది. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

## ఎమ్బీయస్ : ఇన్ఫోసిస్‌లో మార్పులు ఫలితాలనిస్తాయా?

ఐటీ సేవల్లో అగ్రగామి సంస్థగా వెలిగిన ఇన్ఫోసిస్ 2011 నుండి పతనం దిశగా పరుగులు తీస్తోంది. ఇన్నాళ్లూ ఆ కంపెనీ సంస్థాపకులే ఒకరి తర్వాత మరొకరు సిఈఓలుగా వ్యవహరిస్తూ వచ్చారు. ఎవరు వచ్చినా కంపెనీ ఫలితాలు మెరుగుపడలేదు. నానాటికీ స్థాయి తగ్గిపోతూండడంతో టాప్‌లెవెల్‌లో, మిడిల్ లెవెల్లో ఎగ్జిక్యూటివ్‌లు కంపెనీని విడిచిపెట్టి వెళ్లిపోసాగారు. దాంతో కంగారు పడిన ఇన్ఫోసిస్ రిటైర్‌మెంట్ తీసుకున్న నారాయణమూర్తిగారిని మూడేళ్ల తర్వాత వెనక్కి పిలిపించింది. ఆయన వస్తూ వస్తూ తన కుమారుణ్ని కూడా వెంట తెచ్చుకున్నారు. వీరిద్దరూ వెనక్కి రావడంతో మరింతమంది ముఖ్యులు బయటకు వెళ్లిపోయారు. అలా వెళ్లిపోయిన వారిలో గ్లోబల్ సేల్స్ హెడ్, మాన్యుఫేక్చరింగ్ అండ్ ఇండస్ట్రియల్ సర్వీసెస్ హెడ్, బిపిఓ హెడ్, సీనియర్ వైస్ ప్రెసిడెంట్, స్ట్రాటజిక్ సేల్స్, మార్కెటింగ్, ఎలయన్సెస్‌కు గ్లోబల్ హెడ్, నార్త్ అమెరికాలోని యుటిలిటీస్, రిసోర్సెస్ హెడ్, లాబ్స్ హెడ్, అమెరికా ఫైనాన్షియల్ సర్వీసెస్ హెడ్, ఆస్ట్రేలియా బిపిఓ సేల్స్ హెడ్, లాటిన్ అమెరికా బిపిఓ హెడ్, చీఫ్ మార్కెటింగ్ ఆఫీసరు.. యిలా చాలామంది వున్నారు.

ఈ పరిణామం నారాయణమూర్తి కూడా వూహించి వుండరు. తమకూ, అగ్రగామిగా వున్న టిసియస్‌కు మధ్య లాభం విషయంలో అగాధం ఏడాదేడాదికి పెరుగుతోందని ఆయన గ్రహించారు. 2010లో టిసిఎస్ లాభం రూ. 6889 కోట్లు కాగా, ఇన్ఫోసిస్‌ది 6218. 2014కి వచ్చేసరికి టిసియస్‌కి 19116 వస్తే, వీళ్లకు 10656 మాత్రమే వచ్చింది. 2010-11లో 26% వున్న వృద్ధి రేటు 2012-13 నాటికి 5.8% అయింది. 2013-14లో యిది 11.5% అయింది కానీ, ఈ పరిశ్రమలో సరాసరి వృద్ధి రేటు 12-14 కంటె ఇన్ఫోసిస్ రేటు తక్కువగా వుంది. ఎట్రిషన్ రేటు (ఉద్యోగస్తుల నిష్క్రమణ) 18.7% వుంది. తనకు యింకా నాలుగేళ్ల వ్యవధి వున్నా నారాయణమూర్తి పక్కకు తప్పుకున్నారు, తోడుగా కొడుకు కూడా! ఇన్ఫోసిస్‌లో యిప్పటిదాకా పనిచేయని విశాల్ సిక్కాను సిఇఓగా తీసుకుని వచ్చారు. విశాల్‌కు, ఇన్ఫోసిస్ యిప్పటిదాకా చేస్తున్న వ్యాపారానికి సంబంధం లేదు. ఆయన ప్రధాన బలం – టెక్నాలజీ! జర్మన్ కంపెనీ ఎస్‌ఏపికి చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ గా ఎచ్ఏఎన్ఏ ప్లాట్‌ఫారంను సృష్టించిన ఘనత ఆయనకుంది. అయితే ఇన్ఫోసిస్ అంతటి పెద్ద సంస్థను ఆయన యిప్పటిదాకా నిర్వహించలేదు. జర్మన్ కంపెనీలో పని చేసిన కారణంగా విదేశీ క్లయింట్లతో, నిపుణులతో ఆయనకు మంచి సంబంధబాంధవ్యాలున్నాయి. ఆయన బయటి వ్యాపారం చూసుకుంటే ఆపరేషన్స్ విభాగం చూసుకోవడానికి సిఓఓగా ప్రవీణ్ రావు వున్నారు. ఆయన ఇన్ఫోసిస్‌లో 13 ఏళ్లగా పనిచేస్తున్నారు.

ఇన్ఫోసిస్‌కు యీ గతి పట్టడానికి కారణం వాళ్లు రిసెర్చిపై ద ృష్టి సారించకుండా కేవలం సేవారంగానికే పరిమితం కావడం అంటారు. బాడీ షాపింగులో పంపిన వీళ్ల ఉద్యోగులే యితర దేశాల కంపెనీలలో అనేక కొత్త ఉత్పాదనలు కొత్తగా డెవలప్ చేయగలిగారు. ఆ పని కంపెనీయే చేపట్టి వుంటే, ఆ పరిశోధనలు యీ కష్టకాలంలో ఆదుకుని వుండేవి. మనం చేస్తున్న ఎగుమతులన్నీ సేవారంగానికే పరిమితమవుతున్నాయి. మన కంటె తక్కువ రేటులో సేవలు అందించేవాడు దొరకనంత వరకే మనకు ఆదరణ. ఆ తర్వాత ఇన్ఫోసిస్‌లాగానే అన్నీ కుప్పకూలుతాయి. ఇప్పటికైనా దేశంలోని అన్ని పరిశ్రమలు పరిశోధనలపై, వస్తూత్పత్తిపై ద ృష్టి కేంద్రీకరించాలి. ఇన్నోవేషన్, మాన్యుఫేక్చరింగ్ లేనిదే మనకు భవిష్యత్తు లేదు.– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)

**ఎమ్బీయస్ : పదవులు వూడాక...**

'అధికారాంతమున చూడవలె అయ్యగారి పస..' అన్నారు పెద్దలు. పదేళ్లగా ఎంపీలుగా, మంత్రులుగా దేశాన్ని చెడామడా ఏలేసిన కాంగ్రెసు నాయకులు యిప్పుడు ఏం చేస్తున్నారో, ఏం చేద్దామనుకుంటున్నారో ఒక పత్రిక వివరాలు సేకరించింది. పళ్లంరాజుగారు బిజినెస్‌వైపు ద ృష్టి మరలిస్తానంటున్నారు. దానితో బాటు వ ృద్ధులైన వాళ్ల తండ్రిగారి ఆరోగ్యాన్ని, ఇంటర్ చదువుతున్న కొడుకు చదువుసంధ్యలు కూడా చూసుకుంటారట. కామర్స్ మినిస్టర్‌గా చేసిన ఆనంద్ శర్మ బకాయి పడిన పుస్తకాలు చదవడంతో బాటు విద్యాసంస్థలకు వెళ్లి ఆలోచన రేకెత్తించే ఉపన్యాసాలు యిస్తాడట. మిళింద్ దేవ్‌రా అమెరికా వెళ్లి మ్యూజిక్ ఫెస్టివల్‌లో పాల్గొంటాడట. ఆయన గిటారిస్టు కూడా. సల్మాన్ ఖుర్షీద్ 1991 వరకు లాయరుగా వుండేవాడు. ఆయన వాదించిన ఆఖరి కేసులో అతని ప్రత్యర్థి లాయరు, చిదంబరం. 1991 ఎన్నికల్లో యిద్దరూ నెగ్గారు. చిదంబరం మంత్రివర్గంలో ఆయన సహాయమంత్రిగా సల్మాన్ పనిచేశాడు. ఇన్నాళ్లకు పార్లమెంటు నుండి ముక్తి లభించింది. తను రాసిన ''ఎట్ హోమ్ యిన్ ఇండియా' అనే పుస్తకానికి మెరుగులు దిద్దుతాడట. ఆదాయం కోసం మళ్లీ నల్లకోటు తొడుగుతాడట. ఇలా తొడిగేవాళ్లు చాలామంది వున్నారు.

కపిల్ సిబ్బల్, మనీష్ తివారీ యిద్దరూ తమ బార్ లైసెన్సులు రిన్యూ చేయించుకున్నారు. సిబ్బల్ అప్పుడే ప్రాక్టీసు తిరిగి ప్రారంభించేశాడు కూడా. బిర్లాలకు, లోధాలకు నడుస్తున్న కేసులో బిర్లాల తరఫు వాదించడానికి కలకత్తా వెళ్లాడు. వీరప్ప మొయిలీకి మొయిలీ అసోసియేట్స్ అనే లీగల్ కంపెనీ బెంగుళూరులో వుంది. జూన్ 30 న ఢిల్లీలో యింకో బ్రాంచ్ తెరుస్తున్నాడు. తను ఢిల్లీలో వుండి ప్రాక్టీసు చేద్దామనుకుంటున్నాడు. ఇది కాకుండా పుస్తకాలు రాసే అలవాటు కూడా వుంది ఆయనకు. రెండు పుస్తకాలు విడుదలకు సిద్ధంగా వున్నాయి. న్యాయవ్యవస్థపై ఒకటి, పాలనాసంస్కరణలపై మరొకటి. ''ద్రౌపది'' అనే పుస్తకాన్ని కన్నడంలో ఐదేళ్ల పాటు రాసి మూణ్నెళ్ల క్రితం విడుదల చేశాడు. ఇప్పుడు దాని హిందీ, ఆంగ్ల అనువాదాలను తయారు చేయిస్తున్నాడు. చిదంబరంగారు ఎన్నికలలో నిలబడలేదు. పుస్తకాలు రాయడమో, పాఠాలు చెప్పడమో, ఏదైనా పత్రికకు ఎడిటర్‌గా వెళ్లడమో చేద్దామని ప్లానుట. ఇవేమీ గిట్టుబాటు కాకపోతే లాయరుగా ఆయన ప్రాక్టీసు ఎలాగూ వుంది. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాలు ఒకరిపై మరొకరు కేసులు పెట్టుకుంటే యిరుపక్షాలా వాదించగలిగినంత జ్ఞానం సంపాదించాడాయన. **– ఎమ్బీయస్ ప్రసాద్ (జూన్ 2014)**

• • •